చరిత్ర

# సారస్వత వ్యాసములు - 4



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సారస్వత వ్యాసములు

నాలుగవ సంపుటము

పరిష్కర్త :
పురిపండా అప్పలస్వామి

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్
సైఫాబాదు - హైదరాబాదు-4

# తొలిపలుకు

19వ శతాబ్ది చరమభాగమున ఆంగ్లభాషా సాహిత్య ప్రభావ మొక వైపు నుండియు, ముద్రణయంత్ర సౌకర్య మొకవైపునుండియు నాంధ్రదేశ సాహిత్య జీవితమున కొక నూతన చైతన్యమును కలిగించినవి. నూత్న సాహిత్యశాఖలు క్రొత్త చిగుళ్ళు తొడుగుచున్న తరుణముననే స్వాతంత్ర్యేచ్ఛ, దేశాభిమానము, భాషాభిమానము మొదలగు ఉజ్జ్వల సాంఘిక భావములు సారస్వతరంగమున కాలుపెట్టినవి. వానిని సత్వరముగా సాహిత్యపరులలోను, సామాజికులలోను వ్యాప్తిచెందించుటకై పత్రికలు పుట్టి నడుముకట్టినవి. సాహిత్యము జీవితాంతర్భాగ మను చైతన్యమును ముక్కోటి తెలుగువారిలో నుత్పాదించినవి సాహిత్య పత్రికలు. పత్రికల చలువ పందిళ్ళలో ఆంధ్రభారతి నిత్యనూతన శోభావిలాసములు వెలార్చి తెలుగుబిడ్డల మన్నన లందుకొనినది.

పత్రికలలో దినపత్రికలు, వారపత్రికలు, పక్షపత్రికలు, మాస పత్రికలు, త్రైమాసిక పత్రికలు, ఉగాది సంచికలు— ఇట్లు ఎన్నియో భేదములు కలవు. వీనిలో సాహిత్యపత్త్రికల కొక ప్రత్యేకత కలదు. అందులో కొన్ని వెలుగుచూడని సాహిత్య గ్రంథములను వెలికిఁదెచ్చినవి; కొన్ని పూడిపోయిన శిలాశాసనములకు పునర్జన్మ కల్పించినవి; కొన్ని క్రొత్తగా గొంతెత్తి కావ్యగీతము లాలపించెడి కవికోకిలలకు నూత్న వసంతము కల్పించినవి; కొన్ని ప్రాచీన భాషాసాహిత్య మర్యాదలకు ప్రాణము పోసినవి; కొన్ని అభ్యుదయ మార్గమున శంఖములు పూరించినవి; ఇవి యన్నియు వాదములకు రంగస్థలము లైనను సత్యాన్వేషణమునకు కూడ నాందీ వాక్యము పల్కినవి. ఆ యా పత్రికల వెనుక పరిషత్తులవంటి వ్యక్తులు, పారావారములవంటి మేధావులు, దిగ్దంతులవంటి పండితులు నిలువఁబడి నవ్యాంధ్ర సారస్వత సౌధ నిర్మాణమునకు పునాదులుకట్టినారు. రూపురేఖలు దిద్దినారు. అట్టి మహోజ్జ్వల అధ్యాయములకు ప్రతిబింబము లైన పత్రికల ప్రాతసంపుటము లిప్పుడు మన కందుబాటులో లేవు. వానిలోని విజ్ఞాననిధులు విద్యార్థులకేకాక విద్వాంసులకుకూడ ఉపకారకములు కాగలవు.

ఇట్టి యభిప్రాయముతో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి గత సంవత్సరము ఆంధ్ర సాహిత్య పత్రికల సంపుటులలో ప్రచురితములైన

ప్రఖ్యాత సాహిత్యవేత్తల వ్యాసములను విషయ ప్రధానదృష్టితో నెన్నిక చేయించి 'సారస్వత వ్యాసము' లను పేర నాలుగు సంపుటములుగా ప్రచురింపవలెనని నిర్ణయము కావించినది. ఈ సంపుటమువలన 19వ శతాబ్ద్యుత్తరార్థమువందును, ఇరువదియవ శతాబ్ది పూర్వార్ధము నందును జరిగిన తెలుఁగు సారస్వత విమర్శ స్వరూపస్వభావములు, భావపరిణామము మొ॥ నంశములు స్థాలీపులాకన్యాయముగనైనను తెలిసికొనుటకు వీలుండునని అకాడమి వారి భావము.

ఈ కార్యక్రమము క్రింద 'సారస్వత వ్యాసములు' ప్రథమ తృతీయ సంపుటములలో— 'ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక (కాకినాడ), శారద, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలు, భారతి'– అను సాహిత్య పత్రికల నుండి వ్యాసముల నెన్నికచేసి సంపాదకత్వము నిర్వహింప వలసినదిగా డా. జి. వి. సుబ్రహ్మణ్యముగారిని, దానిపై పర్యవేక్షణము సల్పుటకు డా. దివాకర్ల వేంకటావధానిగారిని కోరుటయైనది. అట్లే ద్వితీయ చతుర్థ సంపుటములలో 'అముద్రిత గ్రంథ చింతామణి', 'గ్రంథాలయ సర్వస్వము', 'తెలుఁగు', 'సారస్వత సర్వస్వము', 'ప్రతిభ', 'సుజాత', 'కిన్నెర'– పత్రికలనుండి వ్యాసముల నెన్నికచేసి సంపాదకత్వము నిర్వహింపవలసినదిగా శ్రీ పురిపండా అప్పలస్వామిగారిని, వారి కీ కార్యమున తోడ్పడుటకై డా. తూమాటి దోణప్పగారిని కోరుటయైనది.

పైని పేర్కొనబడిన సాహిత్య పత్రికల సంపాదకులకు, ప్రచురణకర్తలకు, పై సంపుటములలో ప్రచురింపబడు వ్యాసముల రచయితలకు కృతజ్ఞతలు చెప్పుట అకాడమి ప్రథమకర్తవ్యము. సకాలమున కీ సంపుటమును సిద్ధముచేసి యిచ్చిన శ్రీ పురిపండా అప్పలస్వామిగారికిని, పర్యవేక్షణము చేసిన డాక్టరు తూమాటి దోణప్పగారికిని, మా ధన్యవాదములు. ఆంధ్ర పాఠకజనులు మా ప్రయత్నమును సహృదయముతో గ్రహింపగలరని విశ్వసించుచున్నాను.

హైదరాబాదు
26–1–1971

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి

# పీఠిక

సారస్వత రసికుల సమాదరణ పురస్కరించుకుని వెలువడిన సారస్వత వ్యాససంకలనాల్లో ఇది నాలుగో సంపుటం. ఈ సంపుటంలో ముఖ్యంగా విమర్శ నాత్మక మైన వ్యాసాలకు ప్రాధాన్యం చూపడం జరిగింది. అసలు సారస్వతవ్యాసా లంటేనే ముప్పాతిక మూడుపాళ్ళు విమర్శనకు చెందినవే వుంటాయి.

విమర్శ, సమీక్ష, మీమాంస, సమాలోచన, అనుశీలన, పరిశీలన, క్రిటిసిజమ్– ఇవన్నీ ఇంచుమించు సమానార్థకాలు.

విమర్శ అంటే—Examination, Scrutiny, Trial, విచారణ అని బ్రౌణ్యం.

విమర్శించు అంటే– ఆలోచించు, చర్చించు, పరామర్శించు, పరిశీలించు, పరిశోధించు, పర్యాలోచించు, విచారించు, వివేకించు, వివేచించు, శీలించు, శోధించు అని ఆంధ్రవాచస్పత్యం.

Criticism అంటే– To decide, To give an authoritative opinion- The art of judging the qualities and rules of an aesthetic object, whether in literature or the fine arts. అని Encyclopaedia Britanica.

"In the strict sence the word criticism means judgment" అని W. H. Hudson.

ఒక గ్రంథంలోని, లేదా ఒక సాహిత్య ప్రక్రియలోని బాగోగులు కూలంకషంగా విచారించి, విశ్లేషించి వివరించడమే విమర్శ. అది ఎంత ప్రజ్ఞావంతంగా పక్షపాతరహితంగా, పవిత్రవంతంగా, సహృదయపూర్వకంగా, సానుభూతిసహితంగా వుంటే సాహిత్యానికీ, సంఘానికీ అంత ఉపకారకారణ మవుతుంది.

"మంచి విమర్శ మంచిభావాలు నెలకొల్పుతుంది; ఒక మహాకావ్యం అవతరించడానికి అవకాశం కల్పిస్తుంది" అన్నాడు సుప్రసిద్ధ విమర్శకుడు ఆర్నాల్డు.

విమర్శ అనడంతోనే సాధారణంగా కేవలం దుయ్యబట్టడమే అని కొందరి అభిప్రాయం. ఆ దుయ్యబట్టే ఆవేశంలో అసహ్యంగా అవహేళనచెయ్యడానికిన్నీ, సంకోచించరు వారు. అదిగో అలా బయటపడినవే సంస్కృతంలో 'దుర్జనముఖ చపేటిక', 'దుర్జనముఖ పద్మపాదుక' వంటి గ్రంథాలూ, తెలుగులో 'విమర్శాదర్శ విమర్శాదర్శము', 'కొత్త తెలుగుతమాషా', 'నేటికాలపు కవిత్వము', 'చెళ్ళపిళ్ళవారి చరాటము' మొదలైనవి.

ఒకప్పుడు ఈరకం విమర్శకుల ఆవేశాలు కోర్టులకు లాగాయి; సడివీథిలో లడాయికి నడుము కట్టించాయి.

భాషకి ముందు సారస్వత ముండదు. అలాగే సారస్వతానికి పూర్వం విమర్శ లేదు. సారస్వతం, మొదట పుడుతుంది. సారస్వతాన్ని వెన్నంటి విమర్శ వస్తుంది. ఇంకా చెప్పాలంటే సారస్వతంలో కావ్యమూ, విమర్శా జమిలి సంతానమేమో ! కృత్యాద్యవస్థలో కవి కొంతవరకు విమర్శకుడే అవుతాడు. తన కృతికి తాను వేసుకున్న పథకం పర్యాలోకిస్తూ.

ప్రాచీనకాలంలో విమర్శ లక్షణ గ్రంథాలుగా దర్శన మిచ్చింది. ఆ లక్షణ గ్రంథాలే అనంతరం నిబంధన గ్రంథాలుగా, అనుశాసనాలుగా అధికారం చేజిక్కించుకున్నాయి. అప్పు డవి 'కవికంఠపాశాలూ', 'కవిగజాంకుశాలూ', 'కవి సర్ప గారుడాలూ' అయాయి. సాహిత్యానికి సంకెళ్ళు తగిలించాయి. కవిత్వానికి గట్లు వేశాయి. వాటిని ఉల్లంఘించిన కృతులను- అవి ఎంత గొప్ప వయినా సరే- ఆంక్షవేశాయి. పోతనగారి భాగవతమంత మహాకావ్యానికే తప్పలేదు ఈ ఆంక్ష ! దాని అపరాధమంతా బండిరాతో రకారానికి నేస్తం కల్పించడం !

> "బమ్మెర పోతరాజ కృత
> భాగవతమ్ము జగద్ధితమ్ము గా
> కిమ్మహి నేమిటం గొదువ,
> ఎంతయు నారసి చూడగాను రే
> ఫమ్ములు డాలునుం గలసి
> ప్రాసములైన కతంబునం గదా
> ఇమ్ముగ నాదిలాక్షణికు
> లెల్లరు మాని రుదాహరింపగన్."

అన్నాడు కాకనూరి అప్పకవి, జంకూ గొంకూ లేకుండా !

ఈ సారస్వత ఆంక్షలు తమ పరిధులు అతిక్రమించి కులాలమీదికి కూడా తమ కబంధహస్తాలు చూపాయి. ఈ అప్పకవే ఏమంటున్నాడో వినండి :

> "ఉపమ గలిగిన శయ్యల నొప్పియున్న
> అంధ్రభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు."

విమర్శ చేసేవాడు విమర్శకుడు. A Critic is one who exercises the art of criticism. - Encyclopeadia Britanica.

అన్ని పక్షాలూ విచారించి, సరైన న్యాయం వ్యక్తీకరించే న్యాయాధిపతి వంటి వాడు కావాలి విమర్శకుడు; తనకేసు ఎలా అయినా గెలవాలని వాదించే న్యాయవాది

వంటివాడు కాకూడదు. రసజ్ఞుడు కావాలి; కేవలం దోషజ్ఞుడు కాకూడదు. ప్రజ్ఞావంతుడు కావాలి; పక్షపాతం కలవాడు కాకూడదు. గుణగ్రాహి కావాలి; మచ్చరగొట్టు కాకూడదు.

ఎన్ని మంచిగుణా లుండినా పక్షపాతం వొదలని విమర్శకుడి విమర్శ కువిమర్శ అవుతుంది.

సుప్రసిద్ధ ఆంగ్ల సాహిత్యవేత్త జాన్సను బహుముఖ ప్రజ్ఞావంతుడయిన గొప్ప విమర్శకుడు. అయితే పక్షపాతదోషానికి లోనయినప్పుడు అతడి విమర్శ మంచి విమర్శ కాలేకపోయింది. పోపు, అడిసను మొదలైనవారి గ్రంథాలు విమర్శించినప్పుడు అతడి విమర్శలో కనపడిన ప్రతిభ మిల్టను, గ్రేల రచనలు విమర్శించినప్పుడు కనపడలేదు. మిల్టనుతో రాజకీయంగానూ, గ్రేతో వ్యక్తిగతంగానూ వుండిన విభేదాలు అతడిలోని నిష్పక్షపాతబుద్ధిని కుంటుపరిచాయి.

ఉన్నవీ లేనివీ దోషాలు ఎత్తిచూపడమే విమర్శ అని కొందరి ఊహ. దోషాలు మాత్రం పట్టేవాడు దోషజ్ఞుడయిన పండితుడు కావచ్చునేమో కాని, విమర్శకుడు కాడు.

> ''సుకవుల సూక్తులందు నర
> సుల్ నెరసుల్ వెదుకంగబోరు మ
> క్షిక వితతుల్ వ్రణంబుఁ బరి
> కించు గతిన్ గొదవల్ గణించుటల్
> కుకవుల నైజబుద్ధి''

అంటాడు కనుపర్తి అబ్బయామాత్యుడు. ఇక్కడ కుకవులంటే కువిమర్శకులు అని అనుకోవాలి.

కువిమర్శ వొక్కొక్కప్పుడు దారుణపరిణామాలకు దారితీస్తుంది.

"రచయిత గుణాలు మనస్సుకి పట్టించుకుని, వాటి వివరాలు పాఠకుడిముందు పెట్టేవాడే విమర్శకుడు'' అన్నాడు వాల్టర్ పేటరు.

యయావరీయుడు విమర్శకులను అరోచకి, సతృణాభ్యవహారి, మత్సరి, తత్త్వాభినివేశి అని నాలుగురకాలుగా విభజించాడు.

ఎంత మంచి కృతి అయినా అరోచకుడికి రుచించదు. మంచివీ, చెడ్డవీ అన్నీ బాగున్నా యంటాడు సతృణాభ్యవహారి. ఈసుపట్టి ఎంతమంచి కావ్యంలో అయినా తప్పులు వెదుకుతాడు మత్సరి. పక్షపాతం లేకుండా, పాలూనీళ్ళూ వేరుచేసే రాజహంసలాగ, కావ్య విమర్శ చేస్తాడు తత్త్వాభినివేశి.

ఈ నలుగురిలో చివరివాడే ఉత్తమ విమర్శకుడు. అతడే కావ్యశ్రమ గుర్తించగలుగుతాడు. సహజంగా అలాటి విమర్శకుడు లభించడం దుర్లభమన్నారు విజ్ఞులు.

శ్లో. శబ్దానాం వివినక్తి గుంఫనవిధీ నామోదతే సూక్తిభి,
స్సాంద్రం వేఢి రసామృతం విచియతే తాత్పర్యముద్రాంచయః,
పుణ్యై స్సంఘటితే వివేక్తృవిరహా దంతిర్ముఖం తామ్యతాం,
కేషామేవ కదాచిదేవ సుధియాం కావ్యశ్రమజ్ఞో జనః.

తమ కావ్యాలు చక్కగా విమర్శచేయగల సరసుడు లేడే అని విచారించే కవులలో ఎవరికో కొందరికే, ఎప్పుడో ఒకప్పుడే కావ్యపరిశ్రమ తెలిసిన విమర్శకుడు లభిస్తాడు. అలాటి విమర్శకుడే శబ్దార్థాలు చక్కగా వివేచించగలుగుతాడు. శబ్దాల కూర్పును ప్రశంసిస్తాడు. రసామృతం జుర్రగలుగుతాడు, తాత్పర్యం వివరిస్తాడు. (కావ్య మీమాంస. పం. ఆ.)

మంచి విమర్శకుడికి ముఖ్యమైన గుణాలు మూడు వుండా లంటాడు రిచర్డ్స్.

The qualifications of a good critic are three, he must be an adept at experiencing, without eccentricities, the states of mind revelant to the work of art he is judging. Secondly, he must be able to distinguish experiences from one another as regards their less superficial features. Thirdly, he must be a sound judge of values.

—Principles of Literary Criticism.

''విమర్శకుడు కృతి విలువను ఖరీదు కట్టే షరాబు'' అంటా డతడు.

''సాహిత్యస్రష్ట అడివి శుభ్రపరిచి బాటవేస్తాడు; దానిని పరిరక్షించే నిరీక్షకుడు విమర్శకుడు'' అంటాడు స్కాటుజేమ్సు.

సాహిత్యం సముద్ర మయితే, ములిగి ముత్యాలు తీసే జాలరి విమర్శకుడు.

"విమర్శవల్ల సాహిత్యంలో అభిరుచులు సువ్యక్తమవుతాయి'' అన్నాడు T. S. Eliot.

సాహిత్యం వజ్రమైతే సానపట్టి పలకలు తీర్చేది విమర్శ.

విమర్శ సాధారణంగా Speculative, Inductive, Judicial, Subjective అని నాలుగురకాలుగా విభజన చేశారు కొందరు.

ఆధునిక విమర్శమాత్రం అనంతమైన సిద్ధాంతాలను ఆకళించుకుంటున్నది.

అప్పుడప్పుడు ఒక కవి కృతులు ఒక విమర్శకుడు ఉత్కృష్టమయినవని విమర్శిస్తే, వాటినే మరో విమర్శకుడు నికృష్టమైనవని నిరూపించడమూ కద్దు. వెనక ఇంగ్లాండు విమర్శకులు షేక్స్పియరు నాటకాలు ఉత్కృష్టమైనవంటే, ఫ్రాంసులోని విమర్శకులు అవే నాటకాలు అధమమైనవనీ- అసభ్యమైనవనీ, నికృష్టమైనవనీ విమర్శించారు. మిల్టను రాసిన 'పారడైజ్ లాస్టు' సర్వోత్కృష్టకావ్యమని ఒకరంటే అంత నికృష్టకావ్యం మరొకటి లేదని మరొక రన్నారు. దిఙ్నాగాచార్యుడు కాళిదాసు కావ్యాలు కాదంటే మల్లినాథుడు 'సంజీవని' స్పర్శతో బ్రతికించాడు. ఎంకిపాటలు ఎంతో గొప్ప కవిత్వమని పంచాగ్నుల ప్రభృతు లంటే, ''అబ్బే, అది కవిత్వమే కాదు పొమ్మన్నాడు బసవరాజు; బూతులతో వెక్కిరించాడు దుగ్గిరాల.

పాశ్చాత్య సాహిత్యంతో సంసర్గం కలుగకముందు, బహుపురాతనకాలం నుంచీ మనదేశంలో కావ్యశాస్త్రాలకు కొదువలేదు. కావ్యవిమర్శకు అవే కొలకర్రలప్పుడు.

వేదకాలంలోనే కావ్యశాస్త్ర ప్రాదుర్భావం జరిగిందంటారు పండితులు. అలంకారం, ఛందస్సూ వేదాల్లో స్పష్టంగానే అవుపిస్తాయి.

సంస్కృత వ్యాకరణశాస్త్రం పురాతనమైంది. నిరుక్తం, ప్రాతిశాఖ్యం, నిఘంటువులూ కూడా ఈ సందర్భంలో విస్మరింపరానివి. యాస్కుడు అయిదురరకాల ఉపమాలంకారాలు వివరించాడు. పాణిని వాటినే పర్యాలోచించాడు. కాత్యాయనుడు పాణిని ననుసరించాడు. పతంజలి తన మహాభాష్యంలో పాణిని సూత్రాలు కొన్ని పరామర్శించాడు. తరువాతివారు వాటినే ఆధారం చేసుకున్నారు.

భరతుడి నాట్యశాస్త్రానికి ముందు కావ్యశాస్త్ర మెంతయినా వుండేదని పండితు లంగీకరించిన సత్యం. భరతుడి రససిద్ధాంతం పురస్కరించుకుని లోల్లటుడు, శంకుకుడు, భట్టనాయకుడు, అభినవగుప్తుడు తమతమ వాదాలు వ్యాఖ్యానించారు. క్రమంగా రససంప్రదాయం, అలంకారసంప్రదాయం, వక్రోక్తి సంప్రదాయం, రీతి సంప్రదాయం, ధ్వని సంప్రదాయం మొదలైనవి శాస్త్రరూపంలోనే ఆవిర్భవించాయి.

భారతీయ సాహిత్యశాస్త్ర సిద్ధాంతం ప్రకారం శబ్దం, అర్థం, రసం—ఈ మూడిటితోనే కావ్యం పరిశీలించాలి.

భామహుడి కావ్యాలంకారం, దండి కావ్యాదర్శం, మమ్మటుడి కావ్యప్రకాశం, ఆనందవర్ధనుడి ధ్వన్యాలోకం, విశ్వనాథుడి సాహిత్యదర్పణం, రాజశేఖరుడి కావ్యమీమాంస, క్షేమేంద్రుడి ఔచిత్య విచారం, ఉద్భటుడి అలంకారసంగ్రహం, రుద్రటుడి కావ్యాలంకారం సుప్రసిద్ధమైనవి.

తెలుగులో వీటినే అనుకరించడమో, అనువదించడమో అనుసరించడమో జరిగింది, పాశ్చాత్య సిద్ధాంతాలతో పరిచయం లభించే వరకు.

పాశ్చాత్య సాహిత్యంలో క్రీస్తుకు పూర్వమే సాహిత్య విమర్శ అవుపిస్తుంది.

అరిస్టోఫెన్సు, సోక్రటీస్. ప్లేటో—ఈ ముగ్గురి అవతరణతో గ్రీకు సాహిత్యంలో విమర్శకు అంకురార్పణ జరిగింది.

ప్లేటో కొంత సాహిత్య విమర్శ చేశాడు. సాహిత్యం బుద్ధికి సంబంధించింది కాదన్నాడతడు. అది భావావేశానికి సంబంధించిందన్నాడు. బుద్ధి ప్రేరణవల్ల కాక, భావావేశంవల్ల కవులు కావ్యరచన చేస్తారనీ, కనక కావ్యానందం బౌద్ధికం కాదనీ ప్లేటో సిద్ధాంతం. కాగా, సాహిత్యం సత్యదూరమైందనీ, నైతికదూరమైందనీ—అంచేత ఆదర్శ రాజ్యానికి అది పనికిరాదనీ అతడి వాదన.

అంతకి ముందే—హోమరు నించి ప్లేటో వరకు - ఆ మధ్యకాలంలో హెషియడ్, సోలోన్, సిమోనయిడ్, పిండార్ మొదలైనవారు రకరకాల కావ్యసిద్ధాంతాలు ప్రతిపాదించారు. అయినా విమర్శకుడిగా మొదటివాడు ప్లేటో మాత్రమే గణింపదగినవాడు.

ప్లేటో నాటికి గ్రీకు సాహిత్యంలో స్వర్ణయుగం గడిచిపోయింది.

ప్లేటో తరవాత అతడి శిష్యుడు ఆరిస్టాటిల్ అప్పటి కుండిన సాహిత్యం అవలోకనం చేసి, సుప్రసిద్ధ కవుల కావ్యాలు పురస్కరించుకుని 'పొయెటిక్సు' (Poetics) రాశాడు. ప్లేటో సిద్ధాంతాలు చర్చించాడు. తనకి తోచిన వాటిని సరసంగా సవరించాడు. ఆరిస్టాటిలును విమర్శకపిత అన్నారు. తరువాతివారికి అతడి 'పొయెటిక్సు' ఆదర్శమయింది. తుదకి నిబంధనగ్రంథంగా తయారయింది. దానిప్రభావం వల్ల రానురాను సాహిత్యంలో అంతస్సౌందర్యానికి కాక, బాహ్యస్వరూపానికే ప్రాధాన్యం హెచ్చింది.

అలంకారాదిశాస్త్రాలకు మనమధ్య కాలపు కవుల మల్లేనే వెనక పాశ్చాత్య కవులు బానిసలయారు. విమర్శకులున్నూ అదేదారిని నడిచారు. నిబంధనలతోనే సాహిత్యాన్ని కొలిచారు. కట్టుబాట్ల పట్టాలు తప్పినవాటిని త్రోసిరాజన్నారు.

క్రీస్తు తొలిశతాబ్ది ప్రాంతాన పడమటి సాహిత్యం విమర్శల ఇరుకుల్లో పడి నడిచింది. అదేసమయంలో గ్రీకుదేశం రోమనుల క్రింద పరాధీనమయింది, ప్రాచీన గ్రీకు సాహిత్యం అనాదృతమున్నూ అయింది.

అప్పుడే డయోనిఅస్, హెలికార్నస్, ప్లూటార్క్, లుసియన్, లాంగినస్ వంటి విమర్శకులు బయలుదేరారు. లాంగినస్ వీరిలో సుప్రసిద్ధుడు. 'సదా సాహిత్యాభ్యాసం చేసే సహృదయుడే సరైన విమర్శకుడు' అన్నాడు లాంగినస్. అతడి సిద్ధాంతాలు ప్లేటో, ఆరిస్టాటిలుల సిద్ధాంతాలకు కేవలం విరుద్ధమైనవి కావు. స్వతంత్రపద్ధతిలో అవి పూర్వసంప్రదాయాలకు నిర్వచనప్రాయాలని చెప్పవచ్చు.

అనంతరం క్రీ. శ. 13 శతాబ్దిదాకా పాశ్చాత్య సాహిత్య విమర్శలో చెప్పుకోదగ్గ గొప్ప విషయం ఏదీ లేదు. డాంటే వరకూ కావ్యాలకు నియమాలు గుదిబండ లయి దిగలాగాయి. విమర్శకులకూ అదే అవస్థ అనివార్యమయింది.

కట్టుబాట్లలో కవిత్వం నిర్వీర్యమవుతుంది; నిర్జీవ మవుతుంది.

16-18 శతాబ్దాల మధ్య ఈ నిబంధనబంధాల్లోంచి బయటపడడానికే పాశ్చాత్య సాహిత్యం పెనగులాడింది.

పదహారో శతాబ్ది తుదివరకు ఆంగ్లసాహిత్యంలో విమర్శ తలెత్తలేదు. ఆ కాలంలో పుట్టినవి ఇంచుమించు అనుకరణాలు.

1553 లో థామస్ విల్సన్ 'ఆర్ట్ ఆఫ్ రెట్రారిక్' రాశాడు. అందులో కవుల గురించీ, పాఠకుల గురించీ కొంత చర్చించాడు.

1570 లో రోజర్ ఏశ్చమ్ తన 'స్కూలుమాష్టర్'లో కొంత విమర్శ రాశాడు.

1579 లో స్టీవ్‌గాసన్ 'ది స్కూల్ ఆఫ్ అబ్యూజ్' అని వొక విమర్శ గ్రంథం రాశాడు. 'కవిత్వం అబద్ధాల పుట్ట' అన్నా డతడు. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి కూడా వొక సందర్భంలో 'కవిత యన మృష....' అన్నారు.

16 శతాబ్ది తుదిని ఇంగ్లాండులో ఫిలిప్సు సిడ్నీ జన్మించాడు. సంఘంలో కవిత్వానికి గౌరవస్థానం లేని దినా లవి అక్కడ.

''ఏన్ అపాలజీ ఫర్ పోయెట్రీ'' అని విమర్శగ్రంథం ప్రకటించాడు సిడ్నీ. ఇటలీ విమర్శకుల ప్రభావం ఇతడి మీద బాగా పడింది.

''కవిని రోమనులు 'ద్రష్ట' అంటా రనీ, గ్రీకులు 'స్రష్ట' అంటారనీ రాశాడు సిడ్నీ. 'కవిత్వం నిరసింపరాని' దని అతడు నిరూపించాడు. 'కావ్యం జ్ఞానానికి జనని' అన్నాడు. 'సభ్య జగత్తుకి ప్రథమ జ్ఞానకిరణం కవితవల్లనే లభ్యమయిం'దని అతడు వాదించాడు. వివిధకోణాల్లోంచి విమర్శించి తన సిద్ధాంతం ప్రతిపాదించాడు. అరిస్టాటిలు సిద్ధాంతాలకు సిడ్నీ సిద్ధాంతాలు నూతనోజ్జీవనం కలిగించాయి: అలంకార శాస్త్రాలూ, ఛందశ్శాస్త్రాలూ మాత్రమే కవిత్వం కల్పించలే వన్నాడతడు. 'పొడుగు వాటి గౌను వేసుకున్నంతమాత్రాన ప్రతివాడూ న్యాయవాది కాడు; అలాగే కేవలం ఛందస్సు తెలిసినంతమాత్రాన ఎవడూ కవి అయిపోడు' అన్నాడు.

సిడ్నీ విమర్శ తన 'ఆర్కేడియా' గ్రంథానికే వ్యతిరేకంగా వుండడం గమనించదగిన విషయం. రేఫ ద్విరేఫల నిబంధన చేసిన అప్పకవి తన నియమం తానే ఉల్లంఘించాడు మరి!

మన యక్షగానాలూ, వీథినాటకాలూ, తోలుబొమ్మలాటలూ మొదలైనవాటిల్లో లాగ, ఆనాడు పాశ్చాత్య నాటకాల్లో అసభ్యహాస్యం ప్రదర్శించేవారు. దానిని సిడ్నీ తీవ్రంగా విమర్శించాడు.

సిడ్నీతో చెప్పదగినవాడు బెన్‌జాన్‌సన్. గ్రీకు, లాటిను భాషలలో గొప్ప పండితు డితడు. "ఆంగ్ల విమర్శకులలో బెన్‌జాన్‌సను ప్రథమాచార్యుడు" అన్నాడు జార్జిసెంట్సుబరీ.

అప్పటికే సాహిత్యంలో పాతసిద్ధాంతాలంటే అసహ్యం వ్యాపించింది రసిక లోకంలో. సాహిత్యానికి ప్రతిభ ప్రధానమనీ, ప్రతిభ లేకపోవడం కంటే ప్రతిభను ప్రతిఘటించడం ప్రమాదకర మనీ వాదించాడు బెన్‌జాన్‌సన్. ప్రయత్నంతో ప్రతిభ ప్రతిష్ఠించవచ్చని అతడి సిద్ధాంతం.

బెన్‌జాన్‌సన్ క్లాసిక్ వాదాన్ని అతిక్రమించి ముందడుగు వేసిన విమర్శకుడు డ్రయిడెన్. ఇతడు 'ఎస్సే ఆన్ డ్రమెటిక్ పొయెసీ' లో నలుగురు వక్తలచేత సంభాషణ సాగించాడు. పానుగంటి 'విమర్శాదర్శ విమర్శాదర్శము', విశ్వనాథ 'హేతువాద యుగము' ఇలా సంభాషణ రూపక విమర్శ రచనలే.

డ్రయిడను "కల్పించిన నలుగురు వక్తలలో 'క్రిస్టో' ప్రాచీన కవుల్ని సమర్థిస్తాడు. 'యూజీన్' ఎలిజబెత్తురాణి కాలం కావ్యాల్ని- ముఖ్యంగా నాటకాల్ని సమర్థిస్తాడు. 'లెసిడియస్' ఫ్రెంచి నాటకాలు మంచివంటాడు. 'నియండరు' ఇంగ్లీషు నాటకాలు గొప్పవని వాదిస్తాడు. స్వయంగా డ్రయిడను నియండరు పాత్ర ధరిస్తాడు. సాహిత్యంలోని వివిధ మతాలు విపులంగా విమర్శించాడు డ్రయిడన్. నియమాలూ, నిబంధనలూ నిరసించాడు. సంఘం మారినట్టే సాహిత్యమూ మారుతుందన్న సత్యం ప్రతిపాదించాడు.

డ్రయిడన్ సిద్ధాంతాలు మరింతముందుకి తీసుకుపోయాడు ఫ్రెంచి విమర్శకుడు టేన్.

కాల్పనిక యుగంలో తొలకరిగా చెప్పదగినవాడు విలియం బ్లేకు. బుద్ధితో పుట్టేది కావ్యం కాదనీ, కావ్యానికి అలౌకికమైన ప్రేరణం కావాలనీ, కట్టుబాట్లలో కవిత్వం కననడదనీ బ్లేకు వాదం. సనాతనంగా వస్తూన్న సిద్ధాంతాలకు బ్లేకు సిద్ధాంతం గొడ్డలిపెట్టయింది. దాంతో అభ్యాసంవల్ల కాక కళాసృష్టి రహస్యాను భూతి మూలంగా కలుగుతుందన్న భావం బలపడింది.

"కావ్యానికి ఆధారం దివ్యశక్తి" అని బ్లేకు అంటే దానినే భావావేశం అన్నాడు వర్డ్సువర్తు. సుబోధకమయిన భాషా, సరళమయిన శైలీ కావ్యానికి కావాలన్నా డతడు. నిరలంకారమయిన శైలి మంచిదన్నాడు. వాడుక భాషే సహజమయిందనీ వాదించాడు.

కావ్యానికి కల్పనాశక్తి కావాలన్నాడు షెల్లీ, కష్టపడి కట్టింది కవిత కాదన్నాడు. సహజం మనస్సులోంచి దూసుకువచ్చిన కవితవల్లనే హృదయం స్పందిస్తుందని అతడి సిద్ధాంతం.

తన విమర్శలతో కాల్పనిక సాహిత్యానికి పటిష్ఠం కల్పించినవాడు కోల్రిడ్జి. అనుభూతీ, సరళత్వమూ, నిజాయితీ లేనివాడు కవే కాదన్నా డతడు. హృదయమూ, మస్తిష్కమూ రెండు సాహిత్యానికి అవసరమన్నాడు. కేవలం భావావేశం కవిత్వానికి చాలదనీ, అలాగే వొట్టి పాండిత్యము మాత్రమే పనికిరాదనీ అతడి సిద్ధాంతం. అంచేత ఆ రెంటి సమ్మేళనం కృతికర్తకి అవసర మన్నాడు.

విక్టోరియారాణి యుగం ఆరంభంలో ఆంగ్ల సారస్వత విమర్శ మందకొడిగా వుండేది. అయితే మాత్యూ ఆర్నాల్డు, జాన్ రస్కిన్ వంటి విమర్శకులు ఆవిర్భవించడంతో విమర్శ ఉత్తమస్థాయి నందుకుంది. ఆర్నాల్డు స్వయంగా గ్రంథ విమర్శ చేయడమే కాదు, ఎలా విమర్శ చేయాలో ఇతరులకున్నూ నేర్పేవాడు.* పాత సిద్ధాంతాల పునాదుల మీదే కొత్తసిద్ధాంతాలు ప్రతిష్ఠించాడు ఆర్నాల్డు.

ఇరవయ్యో శతాబ్ది నడిమిని జార్జి సెంట్సుబరీ, అలివర్ ఎల్టన్, వాల్టర్ రేలే, టి. ఇ. హుల్మ్ మొదలైన విమర్శకులు గోచరిస్తారు. హుల్మ్ మంచి వ్యుత్పన్నుడు. వెనకటి కావ్యసిద్ధాంతాలను గట్టిగా ఎదిరించా డితడు. కావ్యానికి కట్టుబాట్లు కూడదన్నాడు. ఫ్రీవెర్సు ప్రోత్సహించాడు.

హుల్మ్ సిద్ధాంతాలు టి. ఎస్. ఇలియట్, ఎజ్రాపౌండు మొదలైన నవ్యులను ఆకర్షించాయి.

ఈ కాలంలో Sombolism, Imagism, మొదలైన వాటితోపాటు సిగ్మండ్ ఫ్రాయడ్ మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు సాహిత్యరంగంలోనూ కల్లోలం కలిగించాయి. కావ్యకళ కలవంటి దని నిరూపించాడు ఫ్రాయడ్. అతడి ప్రభావం వల్ల కామవాసన గురించీ, అజ్ఞాత మనస్తత్వం గురించీ పెర్వర్షను గురించీ బోలెడంత సారస్వతం బయలుదేరింది. దానివల్ల మంచికంటె చెడ్డ అధికమయిందన్నారు విమర్శకులు కొందరు.

మహాయుద్ధం కారణంగా ప్రబలిన అశాంతి ఫలితంగా ఫ్రాన్సులో పుట్టిన డాడాయిజమ్ విధ్వంసకవాదంలోంచి అధివాస్తవిక వాదం (Sur-realism) సాహిత్యంలో ప్రవేశించింది. ఇతర కళలలోనూ చోటు చేసుకుంది. 1930 లో

* Mr. Arnold did not merly cirticise books himself he taught others how to criticise them. —Scott James, Making of Literature.

వెలువడిన రెండు ప్రకటన పత్రాలలోనూ, 1936 లో లండనులో జరిగిన ప్రదర్శనలోనూ దీని పరిపూర్ణ స్వరూపం దర్శనమిచ్చింది. ఆంద్రేబ్రెతాఁ, పాల్‌ఎల్వార్డులు దీని ప్రవక్తలు. ఆంద్రేబ్రెతాఁ విమర్శకులు ఈ ఉద్యమానికి వెన్నెముకగా పనిచేశాయి.

మార్క్సు యథార్థవాదం సాహిత్యంలో విస్తృతం చేసిన విమర్శకుడు కాడ్‌వెల్, ఆయా యుగాలలో ఆయా అవకాశాల ననుసరించి కావ్యసృష్టి జరుగుతుందని నిరూపించా డతడు. పూర్వప్రస్తరయుగం, ఉత్తరప్రస్తరయుగం, సామ్రాట్టుల యుగం, సామంతులయుగం, ధనికులయుగం, సామ్యవాదయుగం అనిసాహిత్య యుగాలు విభజించి విమర్శించాడు.

ఇలియట్, రిచర్డ్సుల విమర్శలతో విమర్శనా సాహిత్య చరిత్రలో కొత్తపుట తెరవబడింది. ఇలియట్ ఎంత ఆధునికకవో అంత ఆధునిక విమర్శకుడు. అతడి Sacred wood, రిచర్డ్సు రాసిన 'ఫౌండేషన్ ఆఫ్ క్రిటిసిజమ్', 'మీనింగ్ ఆఫ్ మీనింగ్', 'ప్రిన్సిపల్సు ఆఫ్ లిటరరీక్రిటిసిజమ్', 'పొయిటికల్ క్రిటిసిజమ్' విమర్శలో విప్లవం సృష్టించాయి. ఇలియట్‌తోపాటు డి. హెచ్. లారెన్సు కూడా చెప్పదగినవాడు. ఈ ఇద్దరి రచనలు ప్రభావం ప్రపంచ మంతటా ఆధునిక రచయితల మీద కనిపిస్తుంది.

ఈ సందర్భంలోనే ముర్రే, స్పిన్‌గార్న్, గ్రేవ్, రైడింగ్, ఏంప్సన్, రష్యాలో ఏంటోకోలస్కీ, చుకోవస్కీ, పాస్టర్‌నాక్ మొదలైనవారినీ విస్మరింపరాదు.

ఈనాడు మన భారతీయ సాహిత్యాలన్నిటిలోనూ విమర్శకు పాశ్చాత్య పద్ధతులే ప్రమాణంగా వున్నాయి. అందుకనే స్థాలీపులాక న్యాయంగా, బహుక్లుప్తంగా దానిని ఈమాత్రం తడవడం జరిగిం దిక్కడ.

తెలుగులో సాహిత్యవిమర్శ లేదన్నవారికి లేదు; ఉందన్నవారి కుంది. ఉన్నదయినా వుండవలసినంత లేదు; వుండవలసినట్టున్నూ లేదేమో అంతగా.

"విమర్శించదగిన సాహిత్యం కూడా అంతగా లేదేమో ?" అన్నారొకరు ఈ మధ్య. ఇది సాహసం.

నన్నయనాటికే దేశంలో 'విద్యా విలాస గోష్ఠులు' జరుగుతూ వుండేవికదా ! అయినప్పుడు ఆ గోష్ఠులలో జరిగేది సాహిత్యవిమర్శకాక మరేమిటి ? అయితే అవి సంస్కృత లాక్షణిక గ్రంథాల ననుసరించి జరిగివుంటాయి అనడంలో సందేహం లేదు. అంతకుముం దుండిన దేశిసాహిత్యం వెన్నెలపాటలు, గొబ్బిపాటలు, తుమ్మెద పదాలు మొదలైనవి అంతరించడానికీ అదే కారణం కావచ్చు. తెలుగుకే ప్రత్యేకమైన లక్షణగ్రంథాలు అప్పటికి లేవు; ఇప్పటికీ లేవేమో ! అందుకని సంస్కృతనిబంధన

గ్రంథాలే ఆధారమయాయి. మార్గసాహిత్యం వెల్లువలా వచ్చి దేశిసాహిత్యాన్ని ముంచుకుపోయింది. కనక సంస్కృత లక్షణగ్రంథాలే అనుకరించడమూ, క్రమంగా అనువదించడమూ, అనుసరించడమూ జరిగింది.

తెలుగుకి లక్షణం మొదట సంస్కృతంలో చెప్పడం జరిగింది. చిత్రమే; అయినా, అది తెలుగువారికోసమో, తెలుగు రాని సంస్కృత పండితులకోసమో అన్నది వివేచింపదగిన విషయం.

నన్నయనించీ మనవారి అవతారికలలోనూ, 'కందం చెప్పినవాడే కవి', 'వింటే భారతమే వినాలి' 'అల్లసాని పెద్దన్న అల్లిక జిగిబిగి' 'ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకు', 'కవికీ కంసాలికీ సీసం తేలిక' వంటి పలుకుబళ్ళలోనూ, పెద్దన ఉత్పలమాలిక వంటి పద్యాలలోనూ, వ్యాఖ్యానాలలోనూ, తుదకి నిబంధన గ్రంథాల లోనూ, కుకవి నిందల్లోనూ విమర్శ సూత్రప్రాయంగా తొంగిచూసినా—పడమటి గాలి సోకిన తరవాతగాని, ఈనాడు మన మనుకుంటూన్న పద్ధతిలో విమర్శ తెలుగులో లేదనే అంగీకరించాలి.

ఒక శతాబ్దంనుంచీ పత్రికలు మన సాహిత్యంలో విమర్శకు దోహదం కల్పించాయి; కల్పిస్తున్నాయి. ఉద్దండులయిన సాహిత్యవేత్తలు విమర్శకు నడుముకట్టారు. కడుతున్నారు. విమర్శాత్మకమయిన వ్యాసాలేకాదు గ్రంథాలుకూడా లేవనకుండా కొన్ని ప్రకటించారు; ప్రకటిస్తున్నారు.

వఝల చినసీతారామశాస్త్రిగారి 'వసుచరిత్ర విమర్శ', కట్టమంచి రామలింగారెడ్డిగారి 'కవిత్వతత్త్వ విచారము', పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'మహాభారత చరిత్రము', కోరాడ రామకృష్ణయ్యగారి 'ఆంధ్రభారత కవితా విమర్శనము', గొబ్బూరి వేంకటానంద రాఘవరావుగారి 'నన్నయభట్టారక విజ్ఞాన నిరతి', దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి 'సాహిత్యసమీక్ష', గిడుగు వెంకటరామమూర్తిగారి 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషాభేషజము', పింగళి లక్ష్మీకాంతముగారి 'సాహిత్యశిల్ప సమీక్ష' మొదలైనవి వెలువడ్డాయి; వెలువడుతున్నాయి.

ఉత్తమ విమర్శగ్రంథాలకు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి బహుమానాలు ప్రదానం చేస్తున్నది.

అయినా పాశ్చాత్యసాహిత్యాలతోగాని, తుదకు హిందీవంటి ఇరుగుపొరుగు సాహిత్యాలతోగాని సరిపోల్చి చూసినప్పుడు విమర్శ విషయంలో మనము తల వంచుకోవలిసే వస్తున్నది.

సాహిత్యం గురించి ఎంతో కొంత విమర్శ వుండినా విమర్శగురించిన విమర్శ బొత్తిగా మనకు లేదు. వందేళ్ళ పురాతన పత్రికల గాలించినప్పుడు ఈ లోపం నిజంగా దిగ్భ్రాంత పరిచింది.

ప్లేటో, ‘రిపబ్లిక్’, అరిస్టాటిల్ ‘పోయెటిక్సు’ తెలుగులోకి వచ్చాయి. ప్రాంతీయ భాషలనించి ‘కాళిదాస భవభూతులు’ వంటివి ఏ వొకటో రెండో అనువాదమయ్యాయి. ఇలా అయినా ఉత్తమ విమర్శగ్రంథాలు పాశ్చాత్యభాషలనించీ, ప్రాంతీయభాషలనించీ తెలుగులో అనువాదం జరగడం అవసరం. ఈపని సాహిత్య అకాడమి వంటి ప్రామాణిక సంస్థ నిర్వహించడమున్నూ అవసరం.

ఈ సంపుట సంకలన కార్యం నాకు ప్రసాదించిన మా సాహిత్య అకాడమి వారికి కృతజ్ఞుణ్ణి. వ్యాసాలు సేకరించడంలో ఆంధ్రవిశ్వవిద్యాలయ గ్రంథాలయంలోని గిడుగువారి గ్రంథసంచయములోను, పరవస్తువారి గ్రంథసంచయంలోను వుండిన పురాతన పత్రికలు నాకు ఉపకరించాయి. వీటిని ఉపయోగించుకుందికి పూర్తి అవకాశం కలిగించిన ఆంధ్రవిశ్వకలా పరిషత్తు గ్రంథాలయం లైబ్రేరియను గారికీ, పురాతన పత్రికలు అన్వేషించడంలో తోడ్పడిన మిత్రులు శ్రీ చలసాని ప్రసాద్‌గారికీ, శ్రీమతి జయంతి వెంకటలక్ష్మిగారికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

విశ్వవిద్యాలయ గ్రంథాలయంలోని గిడుగువారీ, పరవస్తువారీ గ్రంథసంచయంలో కాకపోతే ఆంధ్రభారతి, త్రిలింగవంటి మాసపత్రికలు చూడడమూ; రామలింగారెడ్డి తిరుపతి వేంకటకవులు, కాశీకృష్ణమాచార్యులు. ఉమాకాంతంగార్ల వంటి మనీషుల వ్యాసాలు సేకరించడమూ సాధ్యం కాకపోయేది.

ఈ సంపుటంలో ఆంధ్రభారతి, త్రిలిఙ్గ, సారస్వత గ్రంథాలయ సర్వస్వము, ఉగాది సంచిక, భారతి, ప్రబుద్ధాంధ్ర, ఉదయిని, వైశాఖి, నవోదయ, ప్రతిభ, జయంతి, పరిశోధన పత్రికలనించి అక్కిరాజు ఉమాకాంతం, ఉన్నవ లక్ష్మినారాయణ, కట్టమంచి రామలింగారెడ్డి, కవికొండల వెంకటరావు, కాశీ కృష్ణాచార్యులు, కొంపెల్ల జనార్దనరావు, కోపల్లె హనుమంతరావు, గిడుగు వెంకట రామమూర్తి, గిడుగు వెంకటసీతాపతి, గొబ్బూరు వెంకటానంద రాఘవరావు, చిలుకూరు నారాయణరావు, తల్లావఝుల శివశంకరశాస్త్రి, తాపీ ధర్మారావు, తిరుపతి వెంకటకవులు, నడకుదుటి వీరరాజు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, పానుగంటి లక్ష్మినరసింహారావు, మంత్రిప్రెగడ భుజంగరావు, మాడపాటి హనుమంతరావు, మానవల్లి రామకృష్ణకవి, మున్నంగిశర్మ, రాయప్రోలు సుబ్బారావు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, రెంటాల వేంకటసుబ్బారావు, వఝుల చినసీతారామస్వామి, వావిలాల సోమయాజులు, విశ్వనాథ సత్యనారాయణ, వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, బుర్రా శేషగిరిరావు, శ్రీరంగం శ్రీనివాసరావుగార్ల వ్యాసాలు సేకరించడం జరిగింది.

ఈ పత్రికలకూ, రచయితలకూ కృతజ్ఞుణ్ణి.

విశాఖపట్టణం
20–1–1970

పురిపండా అప్పలస్వామి

# విషయసూచిక


దేశిసాహితి సొంపు

—వేటూరి ప్రభాకరశాస్త్రి 1

త్రిలింగము - తెలుగు

—కాశీభట్ల బ్రహ్మయ్య 7

పాండిత్యము - అలంకారము - సాదృశ్యము

—కట్టమంచి రామలింగారెడ్డి 14

భాష - భావము - సంగీతము

—కోపల్లె హనుమంతరావు 17

ఆంధ్రభారత సమీక్షణము

—మాడపాటి హనుమంతరావు 21

నన్నయభట్టీయము

—పారనంది రామశాస్త్రి 28

మహాభారతము

—మున్నంగి శర్మ 44

నన్నెచోడుడు - వచనరచన

—గొబ్బూరు వెంకటానందరాఘవరావు 80

సంజయు రాయబారము

— ఉన్నవ లక్ష్మీనారాయణ 110

పోతన కవిత్వ పటుత్వము

—తాపీ ధర్మారావు 122

సంస్కృతవాఙ్మయము

—మంత్రిప్రెగడ భుజంగరావు 129

ఉత్తరరామ చరితము

—చిలుకూరి నారాయణరావు 140

అర్ధానుస్వారము

వఝుల చినసీతారామశాస్త్రి 156

రాయలనాటి తెలుగుసాహిత్యము

—రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 170

రాయలనాటి చాటుపద్యములు - రమ్యతరములగు వాని గాథలు

—నడకుదుటి వీరరాజు 179

పెద్దన తరువాతి ప్రబంధ కవులు

—పానుగంటి లక్ష్మీనరసింహారావు 188

తెనాలి కవులు
—మానవల్లి రామకృష్ణకవి 193
యక్ష గానములు
—పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి 203
దేశభాషాస్థానము
—అక్కిరాజు ఉమాకాంతం 218
శృంఖలా తృణీకరణము
—తిరుపతి వేంకట కవులు 240
ఆంధ్రభాషా సంస్కరణము
—కాశీ కృష్ణాచార్యులు 245
గ్రామ్యభాష కాదు, వ్యావహారిక భాష
—గిడుగు వెంకటరామమూర్తి 254
పద్య రచన
—గిడుగు వెంకట సీతాపతి 263
కవిత్వాభిరుచులు : ప్రాతవీ క్రొత్తవీ
—రాయప్రోలు సుబ్బారావు 278
మార్గదర్శి గురజాడ అప్పారావుగారు
—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 285
హెచ్చరిక
—రెంటాల వేంకట సుబ్బారావు 293
ముత్యాల సరం
—శ్రీరంగం శ్రీనివాసరావు 301
కృష్ణశాస్త్రిగారి ప్రవాసము; ఊర్వశి
—కొంపెల్ల జనార్దనరావు 328
కథానిక : దాని పరిణామము
—తల్లావఝుల శివశంకరశాస్త్రి 348
భావ కవిత్వము
—కవికొండల వెంకటరావు 355
గ్రామ్యమా ? వాడుక భాషా ?
—విశ్వనాథ సత్యనారాయణ 358
గేయ రచనలు : ప్రాచీనులు
—వావిలాల సోమయాజులు 366
గ్రంథ విమర్శనము
—బుర్రా శేషగిరిరావు 397

# దేశిసాహితి సొంపు

ఆంధ్రజాతి యాచారవ్యవహార ప్రవాహములో అంతర్లీనము లయిపోయినవి ప్రాచీనకాలపు దేశిరచనాప్రభేదములు. అవి యెంతగా అంతర్లీనము లయినవీ అంటే వాని అనుపానులు సరిగా ససిగా నేటివారు అనుమానించడానికైనా సాధ్య పడనంత వింతగా అంతర్లీనము లయినవి. నేటికాలపు తెలుగుపాండితి వాటివాసన నైనా యెరుగ నక్కఱలేనంత యవనతితో ఉన్నది. మన ప్రాచీనకవీశ్వరులు ఈ దేశిరచనా ప్రభేదములను బాగా యెఱిగినవారై ఉండేవారని, రచించగలవారై కూడా ఉండేవారని చెప్పడాని కాధారము లున్నవి. నాచన సోమన వసంతవిలాస మని గ్రంథము రచించినాడట. అది దొరకలేదు గాని దానిలోని రచన యొకటి లక్షణ గ్రంథాలలో ఉదాహృతమై ఉన్నది.

"వీణాగానము వెన్నెలతేటా
రాణ మీఱగా రమణులపాటా
ప్రాణమైన పిన బ్రాహ్మణివీటా
జాణలు మెత్తురు జాజరపాటా."

ఈ జాజరపాట దేశిరచనా ప్రభేదమే. వసంతవిలాసము యక్షగాన మేమో!

అల్లసాని పెద్దన చతుర్విధకవితావిశారదుడు. ఆశు, మధుర, చిత్ర, విస్తరము లని చతుర్విధ కవితల పేళ్ళు. అందు దేశిగేయరచనలకే మధురకవిత లని పేరు.

దేశిరచనలు ఆచారవ్యవహారములలో అంతర్లీనమై ఉండడం కొంత వివరిస్తాను.

"వాడు నన్ను 'ఎగతాళి' చేస్తున్నాడు" అన్ననానుడి ఆంధ్రదేశం అంతటా ఉన్నది. ఇందులోని 'ఎగతాళి' పదం పుట్టుపూర్వోత్తరాలు ఎట్టాంటివో ఎరిగున్న వారెందరో ఉండరు. ఎగతాళి అన్నది ఒక దేశిరచనా ప్రభేదము. 'ఎకతాళి' 'ఎగతాళి' రూపభేదములే. సాతవాహనులనాటి దగు బృహద్దేశి, చాళుక్య సోమేశ్వరుని మానసోల్లాసము, చాళుక్య జగదేకమల్లుని సంగీతచూడామణి, కాకతీయులనాటి జాయ సేనాపతి నృత్తరత్నావళి, యీ 'యెకతాళి'ని పేర్కొన్నవి.

"తాళాఖ్య తాళేన గేయా స్యా దేకతాళికా"

అని సంగీతచూడామణి.

యక్షగానములలో కొన్నింట ఎకతాళి రచన లున్నవి.

"వాడు చిందులు తొక్కుతున్నాడు. ఆ వీధిలో వంకాయలు వాలలాడు తున్నవి. ఇత్యాది వ్యవహారములలోని 'చిందులు' దేశిరచనా ప్రభేదములే.

"వేడుకతో చిందు పాడంగ నుబ్బి
కోణంగియాటల గునిసెడివారు."

అని చిందుపాటను పాల్కురికి సోమనాథుడు పేర్కొన్నాడు.

"గీతార్థాభినయోపేతై ర్ద్విపదై శ్చిందు సంజ్ఞకైః" అని చిందులు రెండేసి పదములు గలవిగా జాయసేనాపతి చెప్పినాడు. యక్షగానములలో కొన్నింట చిందు రచనలు కానవచ్చును. అవి ఆంధ్రదేశము నుండి అరవదేశమునకు కూడా ఎగప్రాకి అక్కడ లక్ష్యలక్షణప్రయోగప్రసిద్ధి పడసియున్నవి. 'కావడిచిందు' 'నొండి (= కుంటి) చిందు' ఇత్యాదులు అక్కడి ప్రభేదములు.

"వాడు 'తందనా' లాడుతున్నాడు" అన్న వ్యవహారములోవి 'తందనాలు' తందానపదము లన్నపేర ప్రసిద్ధి గాంచిన పదములే. వాటిలో తందానే అన్నది ఆ పదమునకు పల్లవిగా - అంటే ఊతపలుకుగా ఉంటుంది.

"ఇదేమిటో పెద్ద 'రగడ'గా నున్నదే" అన్న పలుకుబడిలోని 'రగడ' గేయరచనా ప్రభేదమే. రగడలు కొంత మార్పు పొంది, పొందకుండా కూడా తెలుగులో ఎన్నోరకాల గేయరచన లయినవి.

"ధవళాలు పాడుతున్నారు" అనే నానుడిలోని 'ధవళాలు' వివాహాది శుభకార్యములలోను, యక్షగానములలోను ప్రసిద్ధిగాంచి యున్నవి.

"కథాసు షట్పదీయోజ్యా వివాహే ధవళ స్తథా" అని చాళుక్య సోమేశ్వరుడు చెప్పినాడు. 'నీకే వచ్చు సువాలయున్ ధవళ మింతీ,' 'అల్లోనేరళ్ళు గౌరీకల్యాణము' ఇత్యాదిగా పాంచాలీ పరిణయమునను,

"ఆలలనామణి కాగ
య్యాళి యొకానొక్కవేళ నక్కరతో సు

వ్వాలలు సోబానలు ధవ
ళాలుඟ మొదలైన పాట లాదట నేర్పున్"

అని 'శుకసప్తతి' లోనూ ధవళాలు పేర్కొనబడినవి. యక్షగానములలో ధవళములు అధికముగా గానవచ్చును.

ఇంకా ఏలపాటలు అనేవికూడా దేశిరచనా ప్రభేదములే. చాళుక్య జగదేక మల్లుడు సంగీతచూడామణిలో కర్ణాట లాట గౌళాంధ్ర ద్రావిడ భాషలలో ఏలలు కలవనీ అందులో ఆంధ్రుల 'ఏలలు' మిక్కిలి మనోజ్ఞములనీ చెప్పియున్నాడు. యక్షగానములలోను, సామాన్యజనవ్యవహారములలోను ఎన్నో రకాలైన ఏలలు సర్వాంధ్రదేశమునను వ్యాపించియున్నవి.

సువాలలు, ఉయ్యాలలు, ఓలలు కూడా అట్టివే.

"అల్లోనేరేళ్ళు" అనేపేరు గేయరచనలకు వింతతీరుగా వచ్చినది. అల్లో నేరేళ్ళల్లో 'వెలది రుక్మిణి సమర్తవేడుక లాయె' అని ఉపక్రమము గల పాత కాలపు పాట ఫణితిని రచితములైన గేయము లన్నిటికీ 'అల్లోనేరేళ్ళు' అన్న పేరైంది. 'అల్లోనేరేళ్ళల్లో' పాటలు వెన్నెలరాత్రులందు ఆరబైట కన్యకలు రెండు వరుసలుగా వేరుపడి ఆడుతూ పాడే పాటలు. ఇది మిక్కిలి ప్రాచీన మైనది.

"వెన్నెల దినముల, నల్లోనేరేళ్ళు గాక యావల గలవే" అని రామాయణ సుందరకాండములో గలదు. యక్షగానములలో గేయభాగములుగాను, ఇంకా అనేక కథాప్రధానగేయములుగాను ఈ అల్లోనేరే ళ్ళున్నవి.

"వాడు కూనరాగాలు తీస్తున్నాడు" అన్న నానుడి సర్వాంధ్రవిదితము. ఈ కూనరాగాలు 'కూనలమ్మపదాలు' అనే వింతతీరు పదరచనలు.

ఇంకా 'శోభనాలు,' 'కొట్నాలపాటలు,' 'గౌరీకల్యాణము,' 'అర్ధచంద్రికలు,' 'జంపెలు,' 'కురుచజంపెలు' 'త్రిభంగులు,' 'వెన్నెలపదాలు,' 'తుమ్మెదపదాలు,' 'చిలుకపదాలు' 'త్రిపదలు,' 'షట్పదులు,' 'సప్తపదులు' మొదలైన పదాలెన్నో లక్ష్య లక్షణస్వరూపాలలో వున్నవి. మారశిరమాసము వస్తున్నది. ఆ నెలలో ఆంధ్రదేశ మంతటా కన్యకలు 'గొబ్బిళ్ళు' అని పేడబొమ్మలు పెట్టి గొబ్బిపాటలు పాడే సంప్రదాయ మున్నది. 'గొబ్బియలు,' 'గొబ్బిళ్ళు' అనేపదము 'గోపికలు' అన్న పదమునుండి పుట్టినది. గొబ్బిళ్ళయాట రాసక్రీడానృత్యమే. గొబ్బిళ్ళపాటలు పెక్కు తీరులవి కలవు. పైవాటిలో కొన్నిటికి మాదిరులు వినండి.

గొబ్బిపాట :

కొలనిదోపరికి గొబ్బిళ్ళో, యదు
కులస్వామికిని గొబ్బిళ్ళో, కొండ
గొడుగుగా గోవులఁ గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్ళో.
దుండగంపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్ళో
పాపవిధుల శిశుపాలుని గొట్టిన
కోపగానికిని గొబ్బిళ్ళో
ఏపునఁ గంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో
దండివైరులను తఱిమిన దనుజుల
గుండెదిగులునకు గొబ్బిళ్ళో
వెండి పైఁడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో.

ఉయ్యాల పాట :

అలరఁ జంచల మైన ఆత్మలం దుండని
అలవాటు సేసే నీ వుయ్యాలా....
పలుమారు నిశ్వాసపవనమం దుండ నీ
భావంబు దెలిపె నీ వుయ్యాలా....
ఉదయాస్తశైలంబు లొనర గంభము లైన
ఉడుమండలము మోచె నుయ్యాలా
అదన నాకాశపద మడ్డదూలం బైన
అఖిలంబు నిండె నీ వుయ్యాలా
పదిలముగ వేదములు బంగారుచేరు లై
పట్ట వెరుపై తోచె నుయ్యాలా
వదల కిటు ధర్మదేవత పీఠ మై మిగుల
వర్ణింప నరు దాయె నుయ్యాలా....

ప్క :

(అల్లోనేరేళ్ళలో వెలది రుక్మిణి సమర్తవేడుక లాయె....అనే మట్టులో)

అల్లోనేరేళ్ళల్లో చెలువ కృష్ణుం
డనుచు చెప్పరే మీరు అల్లో....

అల్లోనేరేళ్ళల్లో కరివేల్పు
మనదారకు కలిగెనే నేడూ
అల్లోనేరేళ్ళల్లో గిరివరుని వలె నితడు
చెలగుచున్నాడూ
అల్లోనేరేళ్ళల్లో తరుణీ యశోదకూ
తనయు డైనాడూ
గురికానివలె నితడు గునియుచున్నాడూ
మింటపూవులవాన మెలత కురిసేనే
వింటిరే భేరీలు వేడ్క మొరసేనే. అల్లో.

వెన్నెల పదము :

ఎన్నాడు వానికి నే లలన నైతినో
వెన్నెలారో, వాడు
నన్నెద దలచడు,
నే నేమి చేతును, వెన్నెలారో
చాలగా నమ్మి తా చక్కని చెలిమికి
వెన్నెలారో, నా
మేలును నింతైన మనసు
నుంచ డాయె వెన్నెలారో
వలపు నిల్ప నాదు వశము కాదు
ఇంక వెన్నెలారో.

చిలుక పదము :

మనవి నొక్కటి చెప్పేనే రామచిలుకా, నా
మనవి గైకోవే వో రామచిలుకా....
వజ్జరం గొట్టెనే వో రామచిలుకా, వాని
బుజ్జగించి తోడితేవే రామచిలుకా ..

ధవళము :

జయ జయా జ్ఞానసంపన్నా
జయ జయా నిన్ను బుధు లెన్నా
జయము నీ పదములూ గన్నా
జయ మౌను ఒదయ నంచెన్నా.

ఏల (తత్త్వము) :

నీవూ నేనూ గూడీ భావనాకొలదీ
కేవలబ్రహ్మను గెలుకొల్పుదమూ- నీవూ,
సారె సారెకు వారీ సరససంగములా
తీరుగా జగముల ద్రిప్పుచుందామె,
మానవీగణముల మమత నొందించీ
పూని భ్రాంతులలోన పొరలజేయు
దమూ—నీవూ (జ్ఞానకురవంజి)

సువాల :

మానసంహరుండు తొల్లి
దారువనములో మునుల
చారుముఖులతో రమించు జారవిద్యలన్
తేటగనేనే సువాలపాటగా రచించువాడ
పాటలాగంధు లెల్లఁ బ్రౌఢి బాడఁగా
హరుడు నొక్కనాడు తారకాచలంబునందు తనకు
నర్హ మైనరత్నసింహాసనంబునందునా. (దారువనక్రీడనము)

తుమ్మెద పదము :

ఆదినాథుడ రావె తుమ్మెదా, అ
ల్లతడూ వూరికి పోయె తుమ్మెదా, నా
వద్ద నెవ్వరు లేరు తుమ్మెదా, వచ్చి
వాలలాడి పోవె తుమ్మెదా.

వెన్నెల పదము :

అక్కలమ్మకు సారెపోయ వెన్నెలారో, ఇపుడు
లెక్కలేని కదుపు లాయె వెన్నెలారో
కుందులమ్మ పుణ్యాన వెన్నెలారో
నందునికి కొడుకు కల్గె వెన్నెలారో
పొంగళ్ళు పెట్టుదము వెన్నెలారో మంచి
బోనాము ముద్దె లంది వెన్నెలారో.

—వేటూరి ప్రభాకరశాస్త్రి*

*పరిశోధన— ఆగస్టు-సెప్టెంబరు 1954.

# త్రిలింగము - తెలుఁగు

"త్రిలింగము" నుండి తెలుగు పుట్టెనా? "తెలుగు" నుండి "త్రిలింగము" పుట్టెనా? ఇదివఱకు గ్రంథకారు లందరు 'త్రిలింగ' శబ్దమునుండి 'తెలుగు' శబ్దము పుట్టిన దని వ్రాసియున్నారు. ఇప్పుడు శ్రీయుత కె. వి. లక్ష్మణరావు, ఎం., ఏ. గారు ఆంధ్రపత్రికా సంవత్సరాది సంచికలో 'త్రిలింగము' నుండి 'తెలుగు' పుట్టలే దనియు, 'తెలుగు' నుండియే త్రిలింగము పుట్టిన దనియు వ్రాయించి యున్నారు. నన్నయ తిక్కనాదుల కాలములో 'త్రిలింగ' పదము వాడుకలో లే దనియు, ప్రతాప రుద్రుని యాస్థానకవిశిఖామణి యగు విద్యానాథుఁడు దీనిని మొదట నిర్మించె ననియు, నప్పటినుండియు నీపదము వాడఁబడుచున్న దనియు లక్ష్మణరావుగారు వ్రాయించియున్నారు. మఱియును విద్యానాథుఁ డీదేశమునకు 'త్రిలింగ' సంజ్ఞను గల్పించుటయే గాక ప్రతాపరుద్రీయములో నీ క్రిందిరీతిని త్రిలింగశబ్దోత్పత్తిని గూడఁ గల్పించియున్నాఁ డనియు వారు సెలవిచ్చిరి.

శ్లో. యైర్దేశ స్త్రిభి రేషయాతి మహతీంఖ్యాతిం త్రిలింగాఖ్యయా
యేషాం కాకతిరాజకీర్తివిభవైః కైలాస శైలాకృతా
తే దేవాః ప్రసరిత్ప్రసాదమధురా శ్రీశైల కాళేశ్వర
ద్రాక్షారామ నివాసినః త్రిపదినం త్వచ్ఛ్రేయసే జాగ్రతు.

ఇంకను "మొదటినుంచి 'తెలుగు' దేశ మనియే నామము కల దనియు, 'త్రిలింగ' మనునామ మెన్నడును లే దనియు, సంస్కృతపండితులు తెలుఁగను పదమునకే తమ పాండిత్యప్రకర్షణార్థమై 'త్రిలింగ' మను సాంస్కృతికరూప మొసంగి రనియు, ఆ పదము శ్రీశైల ద్రాక్షారామ, కాళేశ్వరములలోని లింగముల వలన గలిగెనని యొక కాల్పనికవ్యుత్పత్తిని మొదట గల్పించినవాడు విద్యానాథు డనియు, అట్లతడు కల్పించుటకు ఓరుగంటిరాజ్యములో మూడుదిక్కుల మూడు లింగము లుండుటయే కారణ మనియు నాయొక్క యభిప్రాయము. పండితులు దీనిని జక్కగ బరిశోధింతురుగాక."

అని లక్ష్మణరావుగారు వ్రాసి, తుదిని "క్రొత్త విషయమును చెప్పినవానిని మన పండితులు కొందఱు నిందించుట సహజము కావున నన్ను కొందరు ప్రస్తుత

విషయమును గుఱించి దూషింతు రని నే నెఱుంగుదును. కాని, వారి దూషణ భూషణములతో నాకు ప్రయోజనము లేదు. సత్యాన్వేషణమే నాపని. కావున నెవ రైన ఈ విషయమును ఖండింప దలచిరేని, సప్రమాణముగ వ్రాయ ప్రార్థితులు. నన్నయభట్టు తిక్కనసోమయాజులచే రచియింపబడిన గ్రంథములలో గాని పదు నాల్గవ శతాబ్దమునకు బూర్వము రచింపబడిన మఱి యే గ్రంథమునందు గాని త్రిలింగ శబ్దప్రయోగము నెవరైన చూపిన యెడల నా యభిప్రాయములను మార్చు కొనన సిద్ధముగ నున్నాను. ప్రక్షిప్తభూయిష్టములైన పురాణముల నుదాహరించిన లాభములే దని నే నిదివరకే వ్రాసితిని. సత్యాభిమానమే వలయును గాని, పక్షాభి మానము వలదుగదా !"

అని లిఖించిరి. ఇదివఱకు లేని క్రొత్త యంశము నొకదానిని శ్రీలక్ష్మణ రావుగారు వ్రాసి, దానిని 'జక్కగా బరిశోధింప' తామే కోరియున్నారు గాన సత్యాభి మానముతోనే వారు వ్రాసినదాని నే నీక్రిందిరీతిని విమర్శించుచున్నాడను.

త్రిలింగపదమును, దాని వ్యుత్పత్తిని విద్యానాథుఁడు కల్పించెనా ?

శ్రీలక్ష్మణరావుగారు 'త్రిలింగ పదమును దాని వ్యుత్పత్తియు 14వ శతాబ్ది యందుండె "నగ దేటపడియె వెనుక దెనుఁగుదేశమును నంధ్రుకొంద ఱబ్భాష పంచ గతుల బరగుచుండు"

అని సరిగ విద్యానాథుడు చెప్పినట్లే యీ దేశమునకు త్రిలింగనామ మున్న ట్లును ధరశ్రీపర్వత కాళేశ్వర ద్రాక్షారామముల మూలముగా వచ్చినట్లును వ్రాయు టయే కాక, యీ త్రిలింగపదమునుండియే తెలుగుపదము పుట్టినట్లును వ్రాసి యున్నాడు. ఇతడును పదునాల్గవ శతాబ్దాదియం దున్నవాడే. ఈతడును నలంకార శాస్త్రము వ్రాసినవాడే. కాని, యీతని గ్రంథము నరసభూపాలీయము వలె ప్రతాప రుద్రీయమును జూచి యిది వ్రాసినా దనుటకు వల నింతయును లేదు. ఒక్కకాలము నందు భిన్నప్రదేశములందు గల కవు లిద్దరు వేంగిదేశమునకు త్రిలింగాఖ్య కల దనిన నయ్యది యప్పటికే సుప్రసిద్ధముగా నున్న దని గ్రహించవలసి యుండును గదా !

పదునాల్గవశతాబ్దియం దున్న విన్నకోట పెద్దన్న తన కావ్యాలంకార చూడా మణియందును, ఆకాలమునందే యున్న విద్యానాథుడు తన ప్రతాపరుద్రీయమునం దునుగూడ మనదేశమునకు త్రిలింగసంజ్ఞ కలదనియు, నయ్యది మూడు లింగముల మూలముగా గలిగిన దనియు దెలుపుచున్నారు గావున, నప్పటికే యిది త్రిలింగాఖ్యచే

సుప్రసిద్ధ మంటివిగదా, యీప్రసిద్ధి యెచ్చటు నున్న దందురేని, యీప్రసిద్ధి పురాణాదులందే కలదు. బ్రహ్మాండ పురాణమునం దీయంశ మిట్లు దెల్పబడెను.

"శ్రీశైల భీమకాళేశ మహేంద్రగిరి సంయుతం
తత్కాల ప్రభృతి క్షేత్రం త్రిలింగ మితి విశ్రుతమ్."

అని వ్రాయబడియున్నది. దీనినిబట్టి విన్నకోట పెద్దన్నయును విద్యానాథుడును తమ గ్రంథములలో నట్లు వ్రాసికొని యున్నారు. శ్రీలక్ష్మణరావుగారు.—

"పురాణ రచనకాలము నిశ్చయముగ దెలియనికారణముననను, కొన్ని పురాణములు పురాతనము లని తెలిసినను వానిలో నూతనముగా ప్రక్షిప్తభాగము లనేకములు కలుపబడిన కారణముననను త్రిలింగసంబంధ మైన చర్య పురాణములబట్టి నిశ్చయించుటకు వీలులేదు—తదితర గ్రంథములబట్టి నిశ్చయింపవలయును. విద్యానాథునిచేఁ గల్పింపఁబడిన వని వ్రాయుచున్నారు. ఇది యుక్తసహజముగాఁ గాన్పించుటలేదు. ఏమన – విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయమున వ్రాసిన పైపద్యమునుబట్టి చూచిన నదివఱకే యీదేశము త్రిలింగాఖ్యచే మిక్కిలి పేరు వడసె ననియు నీ త్రిలింగసంజ్ఞ శ్రీశైల, ద్రాక్షారామ, కాళేశ్వరములందలి లింగముల మూలముగా వచ్చినట్లు వాడుకయు నంతకుఁ బూర్వమే యున్నట్లు దెలియుచున్నది. కాని, విద్యానాథుఁడే కల్పించినట్లు కాన్పించుటలేదు. కావుననే యాతఁడును

"యై ర్దేశ స్త్రిభి రేషయాతి మహతీం ఖ్యాతిం త్రిలింగాఖ్యయా"

యని వ్రాసియున్నాడు. ఈ దేశము త్రిలింగాఖ్యచే చాల సుప్రసిద్ధమై యున్నదని విద్యానాథుఁడు వ్రాసినదానినిబట్టి, మనము విద్యానాథుని నాటికే యీ దేశమునకు త్రిలింగాఖ్య చాల సుప్రసిద్ధముగా నుండిన దని గ్రహించుకొనవలసి యుండును. అతడే యీపేరును గల్పించె నని తెలిసికొనవలసి యుండునా ? విద్యానాథుఁడు తెలుఁగుదేశమునకు త్రిలింగాఖ్య మహాఖ్యాతిగా నున్న దనగా, మన మాఖ్యాతిని అతడే కల్పించెనని చెప్పబోవుట మహాసాహస మని నా తాత్పర్యము. తాను నూతనముగా నొకనామమును గల్పించిన ఆ పేరును సుప్రసిద్ధ మని చెప్పునా ? చెప్పడు. కావున విద్యానాథుని నాటికే మనదేశమునకు త్రిలింగాఖ్యయు దాని వ్యుత్పత్తియు సుప్రసిద్ధములై యున్నవని గ్రహించవలెను.

పదునాలుగవ శతాబ్ద ప్రారంభమున నోరుగల్లునం దున్న విద్యానాథుడు మాత్రమే కాక యా కాలమునందే రాజమహేంద్రవరమునం దున్న విన్నకోట పెద్దన్న కూడ తన కావ్యాలంకార చూడామణియందు

క. ధరశ్రీ పర్వతకాళే,
శ్వరద్రాక్షారామసంజ్ఞ వరల త్రిలింగా
కార మగుట నంధ్రదేశం
బరుదార త్రిలింగదేశమన జను గృతులన్.

గీ. తత్త్రిలింగపదము తద్భవం బగుటచే, దెలుగుదేశము

అని వ్రాసియున్నారు గాని, యాలోచించి చూడ నీవిషయమున వీరు వ్రాసినది యంగీకరింపదగినది కాదు. ఏమన, మనము కేవలమును బురాణములనే నమ్ముట లేదు. పదునాల్గవ శతాబ్దాదియం దున్న విన్నకోట పెద్దన్న యాంధ్రదేశమునకు గృతులందు త్రిలింగసంజ్ఞయును త్రిలింగ శబ్దోత్పత్తియు గాన్పించుచున్న వని వ్రాసినాడు. ఈతడు వ్రాసినట్లుగనే పురాణములందు నీదేశమునకు త్రిలింగసంజ్ఞ యును దదుత్పత్తియు గాన్పించుచున్నవి. కావున బురాణములం దీయంశములు పెద్దనవిద్యానాథులకు బూర్వమే చేర్పబడిన వని మనము గ్రహించుకొనవలెను. పురాణములం దిటీవల జేర్పబడిన ప్రక్షిప్తములు లే వని నా తాత్పర్యము కాదు. అప్పుడప్పుడు నూతనముగా జేర్పబడుచు వచ్చిన భాగము లనేకములు కల వనియే నా నమ్మకము. అంతియకాక త్రిలింగదేశప్రశంస యిటీవల జేర్పబడిన దనియే నా నిశ్చయము. అయినను త్రిలింగసంబంధ మైన ప్రాతపురాణములయందు విన్న కోట పెద్దన విద్యానాథాదులకు బూర్వమే చేర్పబడిన దని నాతలంపు. ఎందుచేతనన, నీదేశమునకు త్రిలింగసంజ్ఞ సుప్రసిద్ధ మని విద్యానాథుడును, "త్రిలింగదేశ మన జను గృతులన్" అని పెద్దనయును, వ్రాసియే యున్నారు. వారికి పూర్వపుకృతులం దీ సంజ్ఞ సుప్రసిద్ధమై యున్న దనుట నిర్వివాదాంశము. భిన్నప్రదేశములందు భిన్న ప్రభువుల కడ నేకకాలమం దుండి భిన్నభాషలందు గ్రంథములను వ్రాసిన పెద్దన విద్యానాథు లొక్కటియే యభిప్రాయమును వ్రాసినప్పుడు, వారిరువురకును నాధార మొక్కటి పూర్వగ్రంథములయం దుండియుండు నని తలంచుట యుచితము. ఆ యాధారము పురాణములయందు గానిపించుచున్నది. కాన, పురాణములం దీవిషయమయినప్రాత పెద్దనవిద్యానాథులకు బూర్వమే చేర్పబడిన దనుట నిశ్చ యము. మఱియును బురాణములయందు నాంధ్రదేశ ప్రశంస ప్రతాపరుద్రాదుల కాలమునకుముందే చేర్పబడియున్నదనుటకు నిదర్శనముకూడ కలదు. మార్కండేయ పురాణమునందు భారతవర్ష ప్రశంసలో :

శ్లో. తైలకాః కున్తలా అన్ధ్రాః ఉన్నికా స్తాల రావికాః
దక్షిణాత్యా స్త్వమీ దేశా అపరాన్తా న్నిబోధమే.

అని యున్నది. తిక్కనసోమయాజిశిష్యు డైన మారన తన యాంధ్రీకృత మార్కండేయ పురాణములో :

"దాక్షిణాత్యంబు లై పాండ్య కేరళ చోళకుల్య మహారాష్ట్ర మహిష కళింగ విదర్భకుంతలాంధ్రాదులును''

అని వ్రాయుచున్నాడు. కావున, మారనకు బూర్వమే అనగా, ప్రతాపరుద్రునకు బూర్వమే యాంధ్రదేశప్రశంస పురాణములందు జేర్పబడినట్లు దీనిచే స్పష్ట మగు చున్నది. పురాణములలో నీయాంధ్రదేశప్రశంసలో గొన్నితావుల ఆంధ్రాది పదములును మఱికొన్నితావుల త్రిలింగాది పదములును గాన్పించుచున్నవి. కావున త్రిలింగసంజ్ఞ పురాణప్రసిద్ధ మని మనము నమ్మవలెను. ఈ సంజ్ఞ పదునాల్గవ శతాబ్దమునకు బూర్వము కలదా ?

పురాణములందుగాక మఱి యేగ్రంథములం దైన 14 వ శతాబ్దమునకుముం దీసంజ్ఞ కలదా యనియు, భాషకు త్రిలింగ యను పేరు కలదా యనియు, శ్రీలక్ష్మణ రావుగారు ప్రశ్నించెదరు. కాన, వారియభిప్రాయము ననుసరించి పురాణేతర గ్రంథములనుండియే నిదర్శనముల నిత్తము.

త్రిలింగమందుండి 'తెలుగు' పుట్టినమాటయే వాస్తవ మైనయెడల ఒకానొక కాలమందు ఈ దేశమునకు త్రిలింగ మను వాడుకపే రుండియుండవలెను. భాషకు త్రిలింగ యను నామ ముండవలెను అని లక్ష్మణరావుగారు వ్రాసియున్నారు. వారు కోరినరీతిగా నీదేశమునకు త్రిలింగదేశ మను వాడుకపేరును, భాషకు త్రిలింగ యను నామమును, చిరకాలమునుండి కలవు. అంతియెకాక యచ్చటి ప్రజలకు త్రైలిం గు లను సంజ్ఞ కూడ గలదు.

భాషకు త్రిలింగి యను సంజ్ఞ కలదా ? ఆంధ్రభాషకు త్రిలింగి యను సంజ్ఞ కలదు. కావుననే ద్వితీయాచార్యు డను ప్రసిద్ధిని బొందిన యధర్వణుడు తన వ్యాకర ణము (అధర్వణకారికల)లో

శ్లో. ''త్రిలింగ్యా మపి రైనాలో స్సమాసే ప్రత్యయాం తతా"

అని వ్రాసెను. కావున శ్రీలక్ష్మణరావుగారు కోరినట్లు 14 వ శతాబ్దమునకు బూర్వమే యీపేరు గాన్పించుచున్నది. అధర్వణుడు పదునొకండవ శతాబ్దాంతము ననో పండ్రెండవ శతాబ్దారంభముననో నున్నవాడు అని శ్రీలక్ష్మణరావుగారిచే

ప్రచురింపబడిన గ్రంథములందే కలదు. రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులవారు తమ కవుల చరిత్రలో నీతఁడు పంద్రెండవశతాబ్దాంతముననో పద మూడవ శతాబ్దినో ఉండె నని వ్రాసియున్నారు. బర్నెలు మున్నుగా గల ఖండాంతర పండితులును నిట్లే వ్రాసియున్నారు. అందఱిమతము చేతను గూడ నీతడు విద్యా నాథునికి బూర్వుడే యగుచున్నాడు. మఱియు నీ యథర్వణాచార్యుడు త్రిలింగ శబ్దానుశాసన మను నొక వ్యాకరణము జేసి యున్నాడు. అందులో

శ్లో. జయతి ప్రసిద్ధం లోకే సర్వలక్షణలక్షితం
శబ్దం త్రిలింగ శబ్దానా మధర్వణకవేః కృతిః
కరోమి శబ్దం శబ్దానాం త్రిలింగానాం సలక్షణం.

అని వ్రాసియున్నాడు కాబట్టి పదునాల్గవ శతాబ్దమునకు బూర్వమునందే యీ దేశము నకు త్రిలింగ సంజ్ఞ కలదు. ఈ భాషకు త్రిలింగ యను సంజ్ఞయు కలదు. ఇచటి ప్రజలకు త్రైలింగులను నామమును కలదు.

ఇచట ప్రజలకు త్రైలింగు లను నామము కల దని స్కాందపురాణము నందలి

శ్లో. కర్ణాటా శ్చైవ త్రైలింగ గూర్జరా రాష్ట్ర వాసినః
ద్రవిడాద్రావిడాః పంచ వింధ్యదక్షిణవాసినః.

అను శ్లోకము కూడ జాటించుచున్నది. దేశమునకు త్రిలింగ మను పేరు, భాషకు త్రిలింగ యను నామము, ప్రజలకు త్రైలింగులను నాఖ్య పదునాల్గవశతాబ్దమునకు బూర్వమే గలవు. అంతియగాక యిచ్చటి బ్రాహ్మణశాఖలలో నొక్కశాఖకు త్రైలింగు లను సంజ్ఞ కలదు.

దేశమునకు త్రిలింగాఖ్య, ప్రజలకు త్రిలింగసంజ్ఞ, భాషకు త్రిలింగీనామము బ్రాహ్మణులకు త్రిలింగ చిహ్నమును విద్యానాథుని కలముపోటుచే వచ్చిన వనుట యుచితమా ? కాదు.

క్రీస్తుశకము 950 ప్రాంతములందున యుద్ధమల్లుని శాసనములలో వేగి దేశమునకు త్రికళింగ సంజ్ఞ యున్నట్లుగా దెలుపబడియున్నది. త్రికళింగమే త్రిలింగ మైన దని విజ్ఞులు తలంచెదరుగదా ! (చూ. నన్నయభట్టారక చరిత్రము, పుటలు 46-48) కాన క్రీస్తుశకము 10 శతాబ్దమునం దీదేశమునకు త్రిలింగ సంజ్ఞ కల దని తెలియవచ్చెడిని.

క్రీస్తుశకము రెండవశతాబ్దమునం దుండిన టాలెమీ యను ఖండాంతరుడీదేశముం గూర్చి ముచ్చటించుచు త్రిలింగ మనియే వాడియున్నాడు. కాన నీదేశమునకీపేరు కృతులందును; శాసనాదులందును క్రీస్తుశకము రెండవశతాబ్దమునుండియును గలదు గాని, శ్రీ లక్ష్మణరావుగారు తలంచినట్లు పదునాల్గవశతాబ్దము మొదలుకొని వచ్చినది కాదు. క్రీస్తుశకాదిని దీనికి త్రింలిగసంజ్ఞయే కలదు గాని తెలు గను సంజ్ఞయే లేదు. కాబట్టి త్రిలింగపదమే మొదటిది గాని శ్రీలక్ష్మణరావుగారు తలంచినట్లుగా దెలుగుపదము మొదటిది కాదు. త్రిలింగము నుండి తెలుగు పుట్టినది. ఇట్లు మనమే చెప్పుట లేదు. ఏ విద్యానాథు డీసంజ్ఞను బుట్టించె నని మన లక్ష్మణరావుగారు తలంచుచున్నారో యా విద్యానాథుని కాలమునందో యంతకుముందో ఉన్న విన్నకోట పెద్దన్నయే యిట్లు చెప్పియున్నాడు. మరియును ప్లీని యను ఖండాంతరు డీదేశమును మూడోకళింగ మని వాడెను.

ఈసంజ్ఞ త్రిలింగ (తికళింగ) పదములను బట్టి రాగలదు. కాబట్టి "మూడో గళింగ" మని వ్రాసిన ప్లీని యీదేశమునకు వచ్చి దీనికి గల త్రిలింగనామమును గూర్చి యిచ్చటి పండితుల నడిగి వారు చెప్పినట్లుగా (త్రి) ముదోగ (లింగ) లింగ మని వ్రాసియుండు ననుట నిర్వివాదాంశము. ఎవ్విధమున జూచినను శ్రీయుత లక్ష్మణరావుగారి వాదము నిలువనేరదు. త్రిలింగమునుండియే తెలుఁగు పుట్టినది గాని తెలుగునుండి త్రిలింగము పుట్టలేదు. నన్నయభట్టారకునకు బూర్వము అనేక శతాబ్దముల క్రిందటనే యీ త్రిలింగనామము మన దేశమునకు గలిగినది.

ఒకానొకరు తెలుఁగు శబ్దము 'తిలగు' శబ్దమునుండి పుట్టిన దని వ్రాసియుండిరి గాని యది యనాదరణీయము. తిలగు శబ్దమునుండి తెలుఁగు పుట్టిన యెడ నిందు బిందు వుండనేరదు. విన్నకోట పెద్దన్న చెప్పినట్లుగా త్రిలింగశబ్దమునుండియే పుట్టినది. ఈ త్రిలింగశబ్దమునకు మూడులింగము లర్థము కాకపోవచ్చును. ఇది త్రిలింగమునుండి పుట్టి మూడవకళింగ మను నర్థము కలదై యుండవచ్చును. ఈ విషయము నన్నయభట్టారక చరిత్రమునందు విస్తరించి వ్రాయబడియున్నది. కాన నిచట వ్రాయుట యనవసరము.

—కాశీభట్ల బ్రహ్మయ్య*

-O-

*ఆంధ్ర భారతి. సం. 1, సం. 7. శ్రావణమాసము. శా. శ. 1832.

# పాండిత్యము - అలంకారములు - సాదృశ్యము

రేయింబవలును వ్యాకరణములను, నిఘంటువులను, ప్రాచీనకావ్యములను వల్లించుచుండుటచేత కవితకుఁ బుష్టి లేదు. తనమనస్సున నెన్నియోభావములు ప్రభవిల్లకున్న నితరుల మనస్సులలో భావము లుప్పతిల్ల జేయుట యెట్లు ? కట్టెవారిన కోవిదులకన్న లోకవాసముల ననుభవించి యానందించువారే మేలు.

మన కావ్యములలో నుపమాద్యర్థాలంకారములును ననుప్రాసాది శబ్దాలంకారములును దఱచుగ నుపయోగింపబడి యుండుట యెల్లరకు దెలిసినసంగతియె. అందు శబ్దాలంకారము లంతగా ముఖ్యములు గావనుట అందఱొప్పుకొందురు గాన వానిమాట ప్రస్తుత మటుండనిత్తము. అలంకారములలో ప్రధానమైనవి యుపమోత్ప్రేక్షాదులు. వీనికి మూలభూతమైన ధర్మ మేదనగా ప్రకృత వస్తువునకు మఱేదో యొక వస్తువునకు నామరూపస్వభావాదులను బట్టి సామ్యము గల్పించెడు శక్తి, పోలికలను స్థాపించుట సొగసైన కార్యమే యైనను గవితకు ఖండితముగా నుండవలసిన లక్షణము గాదు. మనవారు అలంకారముల యెడ నమితాదరము గొన్నవారు కాబట్టి యొకటి రెండు కారణములు జూపుట యావశ్యకము. శిల్పములకు వర్ణన ప్రధానము. కాదనువా రెవరును లేరు. ప్రతిమలను జిత్రించువారును, విగ్రహముల దీర్చువారును, బరిస్ఫుటముగ నాకృతుల నెదుట నిల్పనేర్తురుగదా. అయిన నట్టిచో వీరు పోలికలం దెచ్చి చూపి పరిష్కరించుట కవకాశ మెక్కడిది ? గద్యపద్యములును శిల్పములకుం జేరినవే, కాన నిందును సాదృశ్యప్రతిపాదనము విడువరానిది గాదనుట సరియె. మఱియు భావములు తీవ్రముగ జెలరేగునపుడు వాని యుద్భవోద్రేకములకు హేతువులగు వస్తువులం దప్ప నితరముల యెడ దృష్టిపాఱుట యసంభవము. మనసు రేగినప్పుడు ఆలోచనకుం బూనుట యౌచిత్యభంగమునకు ముఖ్యకారణము. కావుననే మనవారు కోపము వచ్చినప్పుడు 1, 2, 3 ఎంచు మని చెప్పుదురు. చూడుడు, భీమసేనుడు దుర్యోధనుని జూచువాడుపో ! అపుడు సింహము మదేభముపైఁ జెలగినట్లు, డేగ పావురము మీద వ్రాలినమాడ్కి, ఇంద్రుడు వృత్రాసురుని మార్కొను విధమున, బల్లి చీకటీగపై గవిసిన కరణి- ఇత్యాద్యుపమలు భీమసేనునికి దట్టునా ? దీర్ఘాలోచనములు చేసి శ్లేషాది కుయుక్తి పాశముచే నీడ్చి తెచ్చి తొందఱమెయి జొన్పించిన ట్లుండును. ఇట్టివి సంపూర్ణముగ విసర్జించిన నెంతయో బాగు.

అలంకారములంగూర్చిన ముఖ్యపద్ధతు లెవ్వియన అయ్యవి ప్రయత్నము లేకయ వచ్చినంత సహజముగ నుండుట. కథలోని స్త్రీపురుషులు మాటాడునపుడు పాత్రోచితము లైన కొన్నింటిని మాత్ర ముపయోగించుట. కవియే వర్ణించునపు డొకింత ఎక్కువగ నలంకారములు వాడినను దోషము లేదు. కాని భావములు సహజోజ్జ్వలముగ రేగునపుడు ప్రకృతమునందే యవధాన ముంచుట మంచిది. అట్టి తరుణముల నలంకారములు సాధారణముగ నసంబద్ధప్రలాపములు.

సామ్యము వర్ణనకు నుపకరణము. ప్రధానంబు కాదు. సామ్యము లుండిన నేమి యుండకున్న నేమి ? సొగసైనవస్తువును జూచినవెంటనే తనంతట సంతోష ముదయించును.

ఈరీతినే సమస్తవస్తువుల యనుభవములయందును స్వతస్సిద్ధములైన క్లేశాదిభావము లున్నవి. వస్తువులు, వృత్తములు చర్యలు, ఇత్యాది "క్రోధం బప్రతికారమై హృదయముం గుదించు" నవసరమున నిట్టి దూరపుటాలోచనము లకుఁ దావెక్కడిది ? ఒకవేళ అరమైలు దూరమున జెట్టుచాటున బొంచి చూచెడు కవులకైన దోచునా ? తోప దని నా నమ్మిక. ఏలన భీమసేనుని జూచి వణకు చుందురు గాన, కథాంశము సాక్షాత్తుగ సమీపమున నడచినట్లు భావనాశక్తి బలంబుచే స్ఫురించె నేని దూరపుసంబంధము గల బలాత్కృతాలంకారములకు దావుండదు. సాదృశ్యములలో గొన్ని సహజములును అనివార్యములును. అవి తమంతట నవియే యేప్రయాసమును లేక వచ్చినయెడ గదా సందర్భముతో గలసిమెలసి యుండును. ఈ విషయములందు ప్రథమోదాహరణము కాళిదాసుని సాదృశ్యకల్పనము చూడుడు.

అట్టి సంతతిలేని నన్నెట్లు గనుచు
వంత జెందవు మది మౌనివర్య ? చెపుమ
ప్రీతిమైఁ దాన నీ ర్వోసి పెంపఁ దుదకు
గొడ్డువారిన యాశ్రమ కుజమువోలె.

(ఈ పద్యము శ్రీ అనంతకృష్ణశర్మ లిఖితము, ఆంధ్ర రఘువంశము.)-

మఱికొన్ని సర్వవిధముల సరిపోలకున్నను ప్రకృతులకును మానవమనః ప్రకృతికిని స్వచ్ఛందముగ నుండు భావవిషయమై రీతులను వర్ణించుట కవిత యొక్క ప్రథమగణ్యోద్దేశము. ఈ కార్యమునకు సాదృశ్య నిరూపణాద్యలంకార

ములు సులభముగఁ దోడ్పడిన వలదనరాదు గాని యిట్టి వర్ణనము లేకున్న తుద ముట్టనేర దని భ్రమించి వానిని కుయుక్తి యను త్రాటిచే బంధించి ప్రబంధ మను చెఱలో నుంచుట యెంతయు బశ్చాత్తాపకర మైన నేరము. కమలముతో బోల్పకున్న సీతాదేవి ముఖము సుఖ మియ్యదా ? చిన్నతనమును బూనునా ? అట్లనుట నాదేవి ముఖమునే నేరుగ వర్ణించినం జాలదా ? మఱియు గమలముతో బోల్చుటంజేసి సీతాదేవి ముఖ మానందదాయి యాయె నని భ్రమించు వెఱ్ఱి లెవ రైన నున్న వారి కొక ప్రశ్న. ఏమన ఇక దేనితోఁ బోల్చ బడినందున కమలము హర్షమును నొసంగునది యాయెను ? ప్రతిపదార్థమునకు నొక యుపమాన ముండి తీర వలయునన్న కట్టకడపటి యుపమానమున కాధార మేమి ? కావున నెట్లును ఏదో యొకవస్తువు తనంత తనకనుగుణ మైన భావమును బట్టి జేయును గదా ! అట్లగుట మొదటివస్తువునకే యా గౌరవము నేల ప్రతిష్ఠింపరాదు ?

—కట్టమంచి రామలింగారెడ్డి*

———o———

*త్రిలిఙ్గ (మాసపత్రిక) సం. 6. సం. 6; జూన్ 1914.

# భాష, భావము, సంగీతము

ప్రతిభాషయందలి వాఙ్మయమును సాహిత్యము, శాస్త్రము అను రెండు శీర్షికలక్రింద నిమిడియుండును. భావప్రధానమై, రసభరితమై, వివిధాలంకార శోభితమై, హృదయరంజక మగునది సాహిత్యము. అభిప్రాయప్రధానమై, తత్త్వ నిరూపణోద్దేశమై మనస్సునకు ధర్మనిశ్చయముం జేయునది శాస్త్రము.

సాహిత్యము, శాస్త్రము – ఈ రెంటికిని తగినభాష ఆవశ్యకము. కాని శాస్త్ర సందర్భమునందు భాష అభిప్రాయమునకు వాహన మని చెప్పనగును. ఇందు అభిప్రాయము వెల్లడి యగుటయే ముఖ్య విషయము. స్పష్టత, కలుకుతనము, నిర్మలత్వము శాస్త్రశైలి యందు మిగుల ప్రశంసనీయములు. ధర్మశాస్త్రములు, ప్రకృతిశాస్త్రములు, తర్కమీమాంసశాస్త్రములు మొదలగు సర్వశాస్త్రములును మనుష్యుల మేధాశక్తిని సమాధానపఱిచి నిశ్చయము కుదుర్చునంత వఱకును ఈ శీర్షికయందుఁ జేర్పవచ్చును.

సాహిత్యమునందు భాషాప్రయోజన మింతకన్న చాల నెక్కుడు. భాష సాహిత్యమున కొక అలంకారము నిచ్చు విలువ యనినఁ జాలదు. కళాసౌందర్యమునకు శరీరసౌష్ఠవ మెటులో అటులే సాహిత్యమునకు భాషయు సుందర స్వరూపము వంటిది. భావము ప్రాణము. భాష విగ్రహము. ఈరెంటి సమ్మేళనము వలన సర్వజన మనోమోహనమగు లావణ్య మావిర్భవించుచున్నది. ఇట్టి కవిసృష్ట లావణ్యమునందు అంగసౌష్ఠవము నెంచి, కళావిభ్రమములను వేర్వేఱ దీసి, గుణ సంపదను గుర్తించి, భావనిరూపణమును జేయునది సాహిత్య విమర్శనము.

క. తను వగు శబ్దార్థంబులు,
ధ్వని జీవ, మలంక్రియావితానము సొమ్ముల్
తనరు గుణంబులు గుణములు,
ఘనవృత్తులు వృత్తు లౌర! కావ్యేందిరకున్.

అను సాహిత్యలక్ష్య వర్ణనమందు లోపము వెదకరాదు గాని, భావమునకును, భాషకును భేదగుణనిరూపణమును జేసినట్టు కనబడదు. కొంతవఱకును కావ్యప్రకృతి యందు వెనక మన మెన్నినటు భావ భాషల కత్యంతమైత్రి నిజమని మన మొప్పు

కొనవలయును గాని, భావసౌభాగ్యమును, భాషాసంపదయును వేర్వే అని యెంచని యెడల, సత్కవిత్వము వర్ధిల్లనేరదు. ఇట్లెంచుచు రెంటికిని తగు పొందికతో సమాశ్రయము చేయుటయే మహాకవుల నేర్పరితనము. ధ్వనిమాధుర్యము నుండి సహాయముఁ గోరక, చిత్రాలంకారనైపుణ్యముఁ జూపకుండియు భావసారస్యము వలననే రస ముప్పతిల్లఁ జేయుశక్తి మహాకవుల కుండవచ్చును గాని, జనహృదయము నంటినతోడనే కరఁగించు సామర్థ్య మీ కవిత్వములో నంతగ నుండదు; కనుక ఇది యొక లోపముగ నెంచక తప్పదు. ఇటులే పదలాలిత్యమును, చిత్రరచనాకౌశలమును ఎంత యుండినను అర్థగౌరవము లేని కవిత్వ మెన్నటికిని రాణింపనేరదు. ఈ న్యాయము ఆధునికకవులయం దుదాహరణీయము. ప్రబంధము లను పేర బయలువెడలిన లెక్కలేని నూతనగ్రంథములు శబ్దప్రపంచము నందలి మాధుర్యమునంతను కొల్లవెట్టిన వనుటకు సందియము లేదు. ఏదేశసాహిత్యమునందును కేవల సంగీతమునందు గాక శబ్దజాలమునం దీశ్రావ్యగుణమును, కర్ణేంద్రియము నిట్లు కరగించు శక్తియు అనూహ్యములు. భాషాప్రభుత్వ మింత చేత నుండియు, హృదయరంజకము గాని కవిత్వముఁ జూచిన భావగౌరవము యొక్క విలువ యెంతయో తేటపడవచ్చును. ఈవిషయ మిం కించుక సవిస్తరముగా విచారించెదము.

పదముల పొందిక యన నేమి? ఇందు విశేషమేమి? కవిత్వమందలి శబ్దలాలిత్యమునకును సంగీతమునందలి శ్రావ్యగుణమునకును సంబంధ మేమి? భేద మేమి? ఈ ప్రశ్నలకు తగిన యుత్తరముల ప్రయత్నించెదము. శబ్దమన రెండు విషయము లిం దిమిడియున్నవి. ఒకటి ధ్వని. ఇట్టి ధ్వనికి జనసంకేతముగా వచ్చిన యర్థము రెండవది, శబ్దములు ఒండొంటితో చేరుటవలన ధ్వని తరంగ మగును ఇట్టి చేరిక వలననే వేర్వేఱు భావకళిక లన్నియుఁ గలసి పూర్ణభావస్వరూప మేర్పడును. సరసధ్వని మైత్రివలన వచ్చు శ్రావ్యరవమునకును, అర్థము పొందికవలన వచ్చు రసోత్పత్తికిని, సత్కవిత్వమం దొక విశేషసంబంధ మున్నది.

శబ్దమునకు జనసంకేతార్థము గాక ధ్వనివలన స్ఫురించు సారస్యము కొంత యున్నది. ఇట్టిది కవిత్వమునందు పలె శబ్దజాలములు చేరిన ప్రతిసందర్భమునను ధ్వని ప్రవాహమునందు తేటపడును. సంకేతార్థమునకును, ధ్వని సారస్యమునకును కుదురు మైత్రియే సత్కవనమునందలి యొక ముఖ్యలక్షణముగ పరిగణింపఁబడుచున్నది. రౌద్రరసవర్ణనమందు ధైర్యవిక్రమములను, కోపోద్రేకమును తెల్లమగునట్లు పరుషాక్షరములును, సంయుక్తధ్వనులును గల పదజాలము లుపయోగపడు

టయు, భక్తి కరుణ మోహము మొదలగు సౌమ్యభావముల వర్ణనముల యందు సరళధ్వను లెక్కుడుగ నుపయోగపడుటయు ఎల్లరకును దెలిసిన విషయమే. చక్కని కవిత్వ శైలిని పరీక్షించిన కొలఁదిని అప్రయత్నముగనో యనునట్లు సందర్భించు ధ్వనిభావమైత్రి రసవంతమగు పట్టుల నెల్ల అనేకముగ వెల్లడియగు చుండును. ఇట్టి ధ్వనిభావమైత్రివలన నుద్భవిల్లు హాయియు ఆహ్లాదమును చవిఁ జూచువార లెఱుంగవలయునే గాని చెప్పి తెలుపుట దుర్లభము. అందులో ఆంధ్ర కవిత్వము నందలి ధ్వనిమాధుర్యమును భాషాసంతతివారు దక్కఁ బరు లెన్నడైన తెలిసికొన గలుగుదురా యనునది గొప్ప సంశయము. అచ్చతెనుఁగునందలి సౌమ్యము కొంత, గీర్వాణము నందలి గాంభీర్యము కొంత, అన్యభాషాపదములను వశీకరణము జేసికొను ధారాళత్వ మొకకొంత– అంతయుఁ జేరి సకలకళావిభ్ర మమును, సర్వరసస్ఫూర్తియు ధ్వనివితానమున ప్రసరింపఁజేయఁ జాలు ఆంధ్ర శబ్దజాలములను బోలినవి, ప్రకృతిప్రపంచము నందలి చిత్రస్వర మాధుర్యము దక్క, మానుషకల్పిత మేదియుఁ గానరాదు. ఇంతశ్రావ్యము గావుననే యిటీవలి యాంధ్రకవు లందఱును ధ్వని మాధుర్యమోహమున మునిఁగి తీయని పదముల నోలలాడుచు, అర్థగౌరవ మన నేమియో మఱచి తమ నేర్పరితనముతో సంప్రీతులై యున్నట్లూరకున్నారు. ఇదియు నొక గొప్ప విపత్తే, సాహిత్యమందలి ధ్వని మాధుర్యము పదార్థము నాశ్రయించి యుండునది. అర్థమును విడనాడిన మాధుర్య మెంతకును కొఱగాదు. వ్యర్థపదముల యల్లికలో నిజమైన సారస్యమే లేదు. అది యొకవిధమైన చాతుర్యము. గణనిర్ణయము కొలగాని పని; వేఱుకాదు. భావ ములు వ్యక్తీకరించుపదములు సజీవరేణువులు. ఇవి కవిత్వ సరళిని జేరినపుడు ప్రాణసహితలావణ్యము బయల్పడును. అట్టి లావణ్యమునకు ధ్వనిమాధుర్య మొక క్రొత్త కళ.

ఇది చాల ముఖ్య విషయము. సంగీతము నందలి ధ్వనిమాధుర్యముతోడ పోల్చిచూచిన, కొన్ని క్రొత్తవిషయములు తెలియగలవు. సంగీతమునందు ధ్వనియే ప్రధానము. మధురమైన స్వరమునుండియే రస ముప్పతిలును. ఇది ప్రకృతిప్రపంచ లక్షణము. ప్రకృతియందు రూపలావణ్య మున్నటులే ధ్వనిమాధుర్యమును నున్నది. రసోత్పత్తికి రెండును సమమే. ఈ ధర్మమును బట్టియే పిపీలికాది సర్వజంతువు లును గానమాధుర్యమునకు లోనగుట లోకప్రసిద్ధము. మానవులలో సంగీతమున కును, వాగ్జాలమునకును ప్రథమమున నెట్టి సందర్భమును నుండి యుండెడిదికాదు.

అనఁగా, ప్రస్తుతము సంగీత మెక్కువగ నేరువని అనాగరికులలో సంగీతమునం దొక ధ్వనివిలాసమే గాని భావసారస్య మేమియు లేదు. కాని గానవిద్య యెక్కుడైన కొలఁదిని పదముల కూర్పు వలన భావోదయము గావించి, భావమును సంగీతమున తగురాగములఁ జేర్చి రసవిస్ఫురితముగఁ గననేర్చిరి. ఇట్టి యభివృద్ధి గాంచిన పట్టుల సంగీతమున పదగుంభనము వలనఁ జేరరాని రసావిర్భావమును సూచించు చున్నది. మానవహృదయమునందు భాషాతీత మగు భావమును, భావాతీత మగు రసమును లోలోన నెక్కడనో యణఁగి యున్నది. జనహృదయమును భేదించి రసప్రవాహము వెలివడునట్లు చేయు అద్భుతశక్తి మహాకవులకును, మహాగాయకులకును మాత్రమే గలదు. గోటిమీటునకు మ్రోఁగు తంబురతీఁగె వలెనే జనహృదయము వారి చిత్రకల్పనలకు నిరంతరమును చలించుచుండును. ఒకమాట, ఏ సందర్భమున ఏకవివాక్కునుండి వెడలినదో, మనోమర్మభేది యై మానవలోకము నంతయు అనంతవార్ధిలో తల్లడిల్లఁ జేయఁ గల్గును. ఒకకీర్తన, ఏ గాయకుఁడో ఏ భక్తుఁడో తన శరీరమునఁ జేర్చి, సృష్టివిధానమున కనువగులయం గూర్చి నటరాజేశ్వరుని తాండవపారవశ్యమును వెల్లడిచేయుచు పాడిన శైలితో, కాలాంతమువఱకును ప్రతిధ్వనుల నింపఁగల్గును.

ఇట్లు స్వరసృష్టియం దంతర్గర్భితమగు భావమును, భావప్రకటనమునకు వలయు భాషాప్రాగల్భ్యమును, భావమును భాషయును లయముఁ జెందు రసమాధుర్యమును, జేరి ఏకరసస్ఫూర్తి గాంచినపుడే నిఖిలరసామృతమూర్తి యగు సర్వేశ్వరుని యారాధనము మానవచిత్తమునందు సఫలత నొందఁ గలదు.

—కోపల్లి హనుమంతరావు*

—x—

*ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, 1914.

# మహాభారత సమీక్షణము

మన కిప్పు డగపడుచున్న సంస్కృత మహాభారతము మొట్టమొదట చాల చిన్నదిగ నుండిన గ్రంథముయొక్క రెండవ విపులీకరణ మనుట నిర్వివాదాంశము. మూలగ్రంథమునకు గర్త యగు వ్యాసుఁడు దానిని తన అయిదుగురు శిష్యులకు నేర్పెననియు, వారిలో వైశంపాయనుఁ డొకఁడనియు మహాభారతమే సాక్ష్య మిచ్చు చున్నది. వైశంపాయనుఁ డీకావ్యమును సర్పయాగము చేయుచుండిన జనమేజయునకు వినుపించెను. వినుచుండువేళ ఆతఁడు వైశంపాయను ననేక ప్రశ్న లడిగినట్లును, వైశంపాయనుఁడు వానికి ప్రత్యుత్తరము లిచ్చినట్లును మనకు కాన వచ్చుచున్నది. అట్లైనచో వ్యాసరచితమగు మూలగ్రంథము నందు జనమేజయ వైశంపాయనులకు జరిగిన ప్రశ్నోత్తరము లుండుట ఎట్లు సంభవించును? సంభవింపదు. కనుక వైశంపాయనుఁడో లేక అతఁడు చెప్పుచుండఁగా నా కావ్యమును, కథకానుకథకునకును జరిగిన సంభాషణమును వినిన వేఱొకఁడో మూలగ్రంథ మును విపులీకరించియుండవచ్చును. తరువాత నా విపులీకృత భారతమును ద్వాదశ యాగ సందర్భమున సౌతి శౌనకునకు వినుపించెను. అప్పుడు శౌనకుఁడు చేసిన అనేక ప్రశ్నలకు సౌతి ప్రత్యుత్తరము లిచ్చుచుండెను. ఈ ప్రశ్నోత్తరములు వ్యాసనిర్మితమగు మొదటి గ్రంథమునఁగాని వైశంపాయనకృత మగు భారతమందు గాని యుండుట సంభవమగునా? కాదు, కనుక సౌతియో, ఆతఁడు శౌనకునకుఁ జెప్పుచుండఁగా వినిన మఱియొకఁడో వ్యాసుని గ్రంథమును రెండవమాఱు విపులీక రించె నని మనము ఒప్పుకొనవలసి వచ్చుచున్నది.

పైనఁ జెప్పినప్రకారము ఈ గ్రంథము మూఁడు రూపములను బొందిన సంగతి పొరపాటువలననో లేక తొలగించు నుద్దేశము లేకపోవుట చేతనో మహా భారతము నందు ఇప్పటికిని కానవచ్చుచున్నది. మహాభారతము ఎచ్చటనుండి యారంభింపఁ బడుచున్నదను విషయమును జెప్పుసందర్భమున, అది 'ఉపరిచర' నుండి మొదలగుచున్న దని కొందఱును, ఆస్తీకాఖ్యానమునుండి యని మఱికొంద ఱును, మనుశబ్దమున్న చోటినుండి యని మఱికొందరును నమ్ముచున్నారని చెప్పఁ బడి యున్నది.

మన్వాదిభారతం కేచి దాస్తీకాది తథాపరే,
తథోపరిచరా ద్యన్యే విప్రాః సమ్య గధీయతే.

—ఆదిపర్వము 11-52.

వెనుకఁ జెప్పబడియున్న మూఁడుదశ లందును గ్రంథ విస్తారమును, అంతర్భాగ విభజనమును మాత్రమే కాక గ్రంథనామము కూడ వేఱువేఱుగా నుండినట్టు మనము సులభముగాఁ దెలిసికొనఁ గలము. ఇఁక నీమూడు దశలందును గ్రంథస్థితి ఎట్లుం డెనో విచారింతము.

మూలగ్రంథము బహుశః చరిత్రగా నుండి యుండును కాని కావ్యమై యుండదు. అది 'ఇతిహాసము' అనియే పిలువఁబడియున్నది. వ్యాసుఁడు దానికి 'జయము' అని నామకరణము చేసి యుండెను. గ్రంథమునందలి మొదటిదగు ప్రార్థనాశ్లోకములో కూడ 'తతో జయ ముదీరయేత్' అని ఈపేరు ప్రస్తావింపఁ బడియున్నది. ఇంతేకాక, తుదిపర్వమున గూడ మఱల నీనామమే గ్రంథమున కివ్వబడినది.

జయో నా మేతిహా సోయం—స్వర్గారోహణపర్వం. వ్యాసరచితగ్రంథము యొక్క విస్తారమెంతయుండెనో నిశ్చయముగాఁ జెప్పుటకు వీలులేకపోయినను కర్తయొక్క యుద్దేశవైశాల్యమును, గ్రంథములోని యంశముల గొప్పతనమును, అనుష్టుప్శ్లోకములను రచించుటలోఁ గల సౌకర్యమును బట్టి విచారించిన పక్షమున నీగ్రంథము మూలస్థితి యందుఁగూడ పొడుగుగానే యుండెనని యూహింప వచ్చును. వ్యాసునిగ్రంథములో 8,800 శ్లోకములు కలవని మాక్డొనాల్డు సంస్కృతవాఙ్మయము అను గ్రంథమున జెప్పియున్నాడు. కాని అది సరికాదు. 'వీబరు' అనునతడు 'హిందూవాఙ్మయము' అను గ్రంథమున వ్రాసిన దానిని బట్టి అతఁ డట్లు వ్రాసియుండవచ్చును * పైన చెప్పిన సంఖ్య

అష్టౌ శ్లోక సహస్రాణి అష్టౌ శ్లోక శతాని చ
అహం వేద్మి శుకో వేత్తి సంజయో వేత్తి వానవా. —ఆది. 81-3.

అని మహాభారతములోఁ జెప్పఁబడియున్నది. కాని అది మహాభారతమందు గల కూటశ్లోకముల మొత్తము. మూలగ్రంథములోని శ్లోకముల సంఖ్య కాదు. కృష్ణ

*206 వ పుట్ నోటు. వీబరుకృత గ్రంథము 187 వ పుట. దత్తు కూడ అట్లే వ్రాసియున్నాడు.

ద్వైపాయనుఁడు (వ్యాసుఁడు) కడు ప్రయాసతో రాత్రిందివములు పనిచేసి ఈ గ్రంథమును మూఁడు సంవత్సరములలో ముగించినట్లు మహాభారతములో నున్నది. గ్రంథారంభమున వ్యాసుఁడు తనసంగతి కొంత చెప్పుకొనుట సహజము. 'ఉపరిచర' నుండి యారంభమగు గ్రంథభాగమున వ్యాసుని గురించిన సంగతు లున్నవి. కనుక మూలగ్రంథము 'ఉపరిచర' నుండి మొదలగుచున్నదను నభిప్రాయము ఒప్పుకొనఁదగి యున్నది. 'రాజోపరిచరో నామ' యను శబ్దములతో నారంభమగు 63 వ అధ్యాయమునకు వెనుకనున్న అధ్యాయమునందు మహాభారత రచనను ప్రశంసించుచు వైశంపాయనుఁడు కొన్నిసంగతులను నుడివియున్నాఁడు. దీనినిఁ బట్టి చూడఁగా ఆదిపర్వములోని మొదటి 62 అధ్యాయములును వైశంపాయనుని వలననో, సౌతివలననో తరువాత చేర్చబడిన వని స్పష్టముగాఁ దెలియుచున్నది. ఇట్లనుటవలన 62 వ అధ్యాయము తరువాత నున్న రచనయంతయు వ్యాసునిదే యని చెప్ప వీలుపడదు. ఏలనన, మిగిలినభాగములో నెచ్చటను 'ఇది గ్రంథకర్త మొదట వ్రాసినది; ఇది తరువాత చేర్పఁ బడినది' అని వివక్షించుటకు వీలులేకుండు నట్లు గ్రంథము ఆమూలాగ్రము మార్పఁబడినది.

ఇఁక వైశంపాయనుని మొదటి విపులీకరణమునకు వత్తము. వైశంపాయనుఁడు వ్యాసునిశిష్యుఁ డనియు, తక్కిన సుమంత, జైమిని, పైల, శుకు లను నలుగురు శిష్యులతోఁబాటు భారతమును నేర్చుకొనె ననియు వెనుక సూచింపఁబడి యున్నది ఈ అయిదుగురు శిష్యులలో నొక్కొక్కఁ డొక్కొక భారతమును వేఱువేఱుగాఁ బ్రకటించె నని భారతములోనే చెప్పియున్నది. వైశంపాయనుఁడు వ్యాసునిగ్రంథమును పునర్నిర్మాణము చేసె నని తెల్పుట కిదియే చాలును. వ్యాసుని శిష్యులు రచించిన అయిదింటిలో మన కిప్పుడు లభించునది యొక వైశంపాయనుని గ్రంథము మాత్రమే.

(జైమిని పేరున అశ్వమేధపర్వ మొకటి సందేహాస్పదముగాఁ గానవచ్చుచున్నది.)

అయినను అశ్వలాయనుఁ డీఅయిదుగురు ఋషులను భారతాచార్యు లని పేర్కొనియుండినందున నతని కాలమున నీయైదు భిన్నప్రతులును నుండినట్లు తెలియుచున్నది. దీనివలనఁ గూడ వైశంపాయనుని యొక్కయు, అతని సహాధ్యాయుల యొక్కయు గ్రంథములకు భారత మను పేరు మొట్టమొదట వచ్చినట్లు స్పష్టమగుచున్నది. వ్యాసుఁడు 24,000 శ్లోకములు గల భారతసంహిత రచించి

నట్లును దానిలోని ఉపాఖ్యానములను వదలినచో తక్కుంగల భాగమునకు భారత మను పే రుండినట్లును దెల్పు శ్లోకమొకటి మహాభారతములో నుండుటచేత వైశంపాయన కృత భారతము, మీఁదఁ జెప్పియున్న శ్లోకసంఖ్య గలదై యుండినట్లు తోఁచుచున్నది. దీనిలో మొదట కథాసంగ్రహమును, పర్వములయొక్కయు, యధ్యాయములయొక్కయు సంఖ్యను దెలుపు 150 శ్లోకముల యధ్యాయ మొకటి యుండెను. వైశంపాయనుఁడు గ్రంథాదిని జనమేజయుని గుఱించిన వృత్తాంతమును, ఏసందర్భమున నతని కాకథ వినుపింపఁబడినదో అట్టి సర్పయాగమును గుఱించియుఁ గొంత ముచ్చటించుట సహజము. ఆస్తీకాఖ్యానమున నీవిషయములు కలవు. కనుకనే మహాభారతమునకు రెండవయారంభము యాస్తీకాఖ్యాన మని చెప్పబడుచున్నది.

మన మిఁక సౌతి చేసిన రెండవ విపులీకరణము గుఱించి విచారింతము. వైశంపాయనుని గ్రంథము సౌతివలన పునర్నిర్మాణమును బొందె ననుసంగతి సౌతి మాటలచేతనే ధృవపడుచున్నది. "ఋషులారా ! మానవలోకమున (భారతమును) మొదట చెప్పినవాఁడు వైశంపాయనుఁడు. నేను దానిని లక్షశ్లోకములలోఁ జెప్పితి నని యెఱుఁగుఁడు."

> అస్మింస్తు మానుషే లోకే వైశంపాయన ఉక్తవాన్
> ఏకం శతసహస్రన్తు మయోక్తం వై నిబోధత. —ఆది. 1-107.

అని యతఁడు చెప్పియున్నాఁడు.

ఆస్తీకాఖ్యానమునకు వెనుకటి యధ్యాయములు వైశంపాయనుని గ్రంథము నందుండుట యసంభవము. కనుక మహాభారతము యొక్క మూడవ యారంభము మను* శబ్ద మున్న చోఁటున నని నిర్ణయింపఁబడి యున్నది. ఈ యారంభము సౌతి చేసిన గ్రంథముదై యుండవలెను. ఇదియే మన మిప్పుడు చూచుచున్న గ్రంథము. ఇది దాదాపుగ సౌతివలన నిర్మింపఁబడిన యాకారణముననే మనకుఁ గానవచ్చుచున్నది. దీనియందు గల యుపోద్ఘాతమును, ప్రస్తావనయును, విషయసూచికయును గ్రంథముయొక్క క్రొత్తదనమును స్ఫురింపఁజేయుచున్నవి. ఇప్పటి మహాభారతములో సౌతి వివరించిన శ్లోకసంఖ్యకంటె సుమారు వేయిశ్లోకములు తక్కువగా నున్నవి. అయినను అచ్చటచ్చట అధిక శ్లోకములును, అధ్యాయములును చేరినవి. వ్యాఖ్యాత, అధికశ్లోకము లున్న పర్వముల చివర నా శ్లోకములఁ జూపి

* ఆదిపర్వమున మనుశబ్దముతో నారంభమగు శ్లోకమే లేదు—మా. హ.

యవి లేఖకప్రమాదమున గ్రంథమునఁ బ్రవేశించిన వని వ్రాసినాఁడు. ఇది కడు చిత్రము. ఇట్టి శ్లోకములు ముఖ్యముగా ఆదిపర్వమునందును, ద్రోణపర్వము నందును గానవచ్చుచున్నవి. ఉదాహరణార్థము, వ్యాసుఁడు చెప్పినప్రకారము 227 అధ్యాయము లుండుటకు మాఱుగా, ఆదిపర్వమున 237 అధ్యాయము లున్న వని వ్యాఖ్యాత ఆదిపర్వాంతమునఁ జెప్పి యున్నాఁడు.

ఈ విధముగాఁ బునర్నిర్మిత మగు మహాభారతము చెప్పఁబడిన కాలమును, స్థలమును దెల్పు నుపోద్ఘాతముతోఁ దృప్తినొందక 'సౌతి అతిదీర్ఘ మగు మహాభారతకథయొక్క సంగ్రహమును ధృతరాష్ట్రుని నోటఁ జెప్పించి తద్రూపమున నొక ప్రస్తావన గ్రంథమునఁ జేర్చియున్నాఁడు. మొదటి యధ్యాయములో 'యదా శ్రౌష' మను శబ్దములతో నారంభమగు 69 శ్లోకములు అంతకు పూర్వము రచింపబడిన ప్రస్తావనలోనివి కాఁజాలవు. అంతేకాక అవియన్నియు దీర్ఘవృత్తము లగుటచేత సౌతి చేర్చినవే యనుట స్పష్టము. వైశంపాయనుఁడు గూడ భారత కథాసంగ్రహమును దన గ్రంథమున నిచ్చియున్నాఁ డని వెనుకఁ జెప్పి యున్నాము. ఆ యధ్యాయమున 150 శ్లోకములు మాత్రమే యుండినవి. కాని ఇప్పటి అధ్యాయములలో అంతకంటె ననేక శ్లోకము లెక్కువగాఁ గలవు. ఈ కారణములను బట్టి, పైనఁ జెప్పిన యధ్యాయ మంతయు సౌతివలనఁ బునర్నిర్మాణము బొందె నని తేలుచున్నది.

ఈ గ్రంథమునకు మహాభారత మని మొట్టమొదట పేరుపెట్టినవాఁడు సౌతియే యై యుండును. అశ్వలాయనుడు 'భారతము', 'మహాభారతము' అను రెండు నామములను చేర్పించి యున్నాఁడు. కనుక భారతము అను పేరు వైశంపాయనుని గ్రంథము దనియు, మహాభారత మను నామము సౌతి రచితమగు నతివిస్తార గ్రంథము దనియు నూహించుట యందు అసంగత మేమియు నుండదు. ఎందుచేత ననఁగా గ్రంథము యొక్క 'మహత్త్వము'ను 'భారము'ను బట్టియే దానికి మహాభారత మని పేరు పెట్టఁబడిన దని సౌతి తానే చెప్పియున్నాఁడు. 'మహాభారతమను పేరు పాణినికృత గ్రంథములోఁ గూడ నున్న దని వీరు వ్రాసెను. కాని దానిలో నాశబ్దము వేఱొక యర్థమున (అనఁగా గొప్పభారతవీరుఁడను నర్థమున) వాడఁబడియున్నది. యుధిష్ఠిరుని పేరును, మఱికొన్ని యితర నామములను పాణిని భారతకథకు సంబంధించినవిగాఁ జెప్పియుండుటచేత, పాణిని కాలమున

మహాభారత మనుపేరు ఈ గ్రంథమున కుండ లేదను నభిప్రాయము బలపడు చున్నది.

తాను నూతనముగ నిర్మించిన గ్రంథమును విభాగించుటయందు సౌతి క్రొత్త మార్గమును ద్రొక్కి దానిలో పన్నెండు పర్వములను ఏర్పఱచెను. మహా భారతములోనే యొకచోట నీగ్రంథము పర్వములుగ విభజంపఁబడియున్నట్లు చెప్పఁ బడియున్నది. కాని యా పర్వముల సంఖ్యపైనఁ జెప్పిన సంఖ్యకంటె మించి యున్నది. ఈ రెండువిధములగు విభజనమును ఒక కర్తయే చేసియుండుటయు ఒక కాలముననే చేసియుండుటయు అసంభవము. ఒక కర్తయే యిట్టి విభాగములఁ జేసియుండిన పక్షమున పెద్దభాగములను, అంతర్భాగములను, భిన్ననామములను గలిగి యుండును. ఉదాహరణార్థము- ఒక గ్రంథము కొన్ని 'భాగములు'గా విభ జింపఁబడి యున్నయెడల దాని యంతర్భాగములకుఁ గూడ 'భాగము'లను పేరుం డదు. వానిని అధ్యాయము లనియో, ప్రకరణము లనియో పిలువవలసి యుండును. అంత కాకపోయినను పెద్దవానిని 'భాగము' లనియు, అంతర్భాగములను 'చిన్న భాగము' లని యైన పేర్కొనవలయునుగదా! ఈసంగతుల నాలోచించి చూడఁగా వైశంపాయనుని గ్రంథము ఇప్పుడు మనకగపడు 18 పర్వములుగా గాక అంత కంటె నెక్కువసంఖ్యగల చిన్నచిన్న భాగములుగా విభాగింపఁబడి యుండెననియు, అతఁడు వానికి పర్వములని పేరు బెట్టె ననియు స్పష్టముగఁ దెలియుచున్నది. సౌతి తన గ్రంథమును అంతకంటె పెద్దభాగములుగా విభజించి యాభాగముల పేళ్ళు మాత్రము పర్వములనియే యుంచెను. కనుకనే యనేకమాఱులు ఒక పెద్ద పర్వములో అదే పేరుగల చిన్నపర్వము మనకు నీ గ్రంథమున విపరీతముగాఁ గాన్పించుచున్నది. సౌప్తికపర్వములోని చిన్న సౌప్తికపర్వమును, సభాపర్వములో చిన్నసభాపర్వమును మనము చూచుచున్నాము. ఈ పర్వములలో నొక్కొక్క దానియందు అనేకాధ్యాయము లున్నవి. వ్యాసరచితమగు మూలగ్రంథమున పర్వము లును, అధ్యాయములును ఉండవచ్చును. కాని పర్వముల సంఖ్య వైశంపాయనుని గ్రంథములో నుండెనని చెప్పఁబడు 100 కంటె బహుశః తక్కువగా నుండి యుండును. తక్కిన యూహలవలెను ఈ యూహకుఁ గూడ మహాభారతముననే యాధారము కలదు. ఆదిపర్వములోని రెండవ యధ్యాయమున నూరుపర్వము లివియని వివరింపఁబడియున్నది. అచ్చటనే హరివంశము ఖిలపర్వమని చెప్పఁ బడినది.

హరివంశా_స్తతః పర్వ పురాణం ఖిలసజ్ఞితమ్
ఏతత్పర్వశతం పూర్ణం వ్యాసే నో_క్తం మహాత్మనః.

కనుక హరివంశము వ్యాసుని గ్రంథములోనిది కాదనియు, వై_శంపాయనునివలనఁ జేర్పఁబడిన దనియు దెలియుచున్నది. రావణుని జీవితవృత్తాంతమును, అతని సాహస కృత్యముల వివరమును లేనిచో రామాయణకథ ఎట్లు అసంపూర్ణముగ నుండెడిదో, యట్లే శ్రీకృష్ణుని జీవితమును, అతని శూరకార్యములను వర్ణించు పర్వ మొకటి లేనిచో, మహాభారత యుద్ధకథయు అసంపూర్ణముగ నుండు ననుట నిస్సందేహము. కనుక ఉ_త్తరకాండకు రామాయణముతో నె ట్టి సంబంధ మున్నదో హరివంశమునకు మహాభారతముతో నట్టి సంబంధమే కలదు. అయినను, ఉ_త్తర కాండవలెఁ గాక హరివంశము మహాభారతమునుండి సాధారణముగా వదలివేయఁ బడుచు తరువాతఁ జెప్పవలసిన దేదియు లేనట్లు మహాభారతము ముగింపఁబడు చున్నది. ఆదిపర్వములోని రెండవ యధ్యాయమునఁ జెప్పియున్న పర్వములో నూటికి మించి యున్నవి. కనుక వై_శంపాయనుని భారతమును సౌతి విపులీకరించె ననుట కిదియే చాలును. వై_శంపాయనుని 100 పర్వములను సౌతి 18 పర్వము లలో నిమిడ్చెను. "ఈ 100 పర్వములను వ్యాసుఁడు రచించెను కాని తరువాత వీనిని సూతసుతుఁ డగు లోమహర్షణి పదునెనిమిది పర్వములలోఁ జెప్పెను" అని యాతఁడే యొప్పుకొని యున్నాఁడు. కాన వ్యాసుఁడు 'జయము' అనుపేర వ్రాసిన చారిత్రక కావ్యము, వై_శంపాయనుని చేత 'భారతము' అనుపేర పునర్ని ర్మాణము నొంది, సౌతి వలన విపులీకరింపఁబడి ఇప్పటి 'మహాభారత' రూపమున మన యెదుట నున్నది.

—మాడపాటి హనుమంతరావు*

---

* ఆంధ్రభారతి. సం. 4. సం. 5. మే 1914.

# నన్నయభట్టీయము

శ్రీ పర్లాకిమిడి సంస్థానపు రాజావారి కాలేజీలో సంస్కృత ప్రధానోపాధ్యాయుఁడుగా నిరువదితొమ్మిది సంవత్సరము లుండి రాజరక్షణశాఖ వారిచే నాతో సాటివారితోడ పారితోషికవేతనము నొంది విశ్రాన్తిఁ జెందియున్నవాఁడను. విశ్రాన్తి కాలములో నాకుఁ గొంత కాలక్షేపమును, లోకమునం దుపయోగము నేకక్రియ సంభవించు నను తలంపున నాంధ్రమహాభారత విమర్శనమును రచియించి యుంటిని. దానిలో యథామతిగ, ప్రశ్నోత్తరరూపమున విషయవిచారము మాత్రము చేయఁబడినది. పిమ్మట భారతాంతర్గతమగు భగవద్గీతాశాస్త్రమును జూచునప్పుడు సంస్కృతమునం దధ్యాయాంతగద్యముల "భగవద్గీతాసు" అని బహువచనము గాన్పించుచుండ, నీశాస్త్రమునకు బహుత్వ మెట్లు గలిగె నని యాశంక యుదయింప, దానిం గూర్చి భాష్యములలోఁ గాని వ్యాఖ్యానములలో గాని యేమియు వ్యక్తము గాక శ్రీ శంకరభాష్యమందు మాత్రము సూచన గాన్పింపగా దాని ననుసరించి "శ్రీశంకరాశయాదర్శ" మనుపేరిట నొకగీతా టిప్పణమును బహుత్వోపపత్తి విచార పూర్వకముగా, సంస్కృతభాషలో రచించితిని. ముందు నేను రచియించిన యాంధ్రభారత విమర్శను బ్రహ్మశ్రీ శతఘంటము వేంకటరంగశాస్త్రిగారు పీఠికలోఁ జేసిన విచారము గల పుస్తకమును జూచి రచియించి యుంటిని. ఆ సంపుటమునందుఁ గాన్పించుచున్న పాఠములు గొన్ని పూర్వము ముద్రితము లయిన కోశములలోను, తాళపత్రపు కోశములలోను గాన్పించు పాఠములకు విలక్షణములుగా నున్నవి. దాని వలన కృతికర్తల పాఠము లెవ్వియో యితరుల పాఠము లెవ్వియో తెలిసికొనుట కష్టతరముగా నుండక తప్పదు. పాఠములను బట్టియేకదా యానాటి భాషాస్థితియు వారి సమయమును మనము తెలిసికొన గలము.

చరిత్ర గ్రంథములు వానిలో ప్రతిపాదితుల చరిత్రమును దెలిసికొనుట కాధారము లెట్లో, యానాటి భాషాస్థితిని గూడఁ దెలిసికొనుట కట్లే యాధారములు. పాఠ వ్యత్యాసముల వలన నప్పటి భాషాస్థితి మఱుగుపడక తప్పదు. మన కాంధ్ర భాషలో భారతము కంటె ముం దెద్దియును చరిత్రగ్రంథ మున్నట్లు గానరాదు. అందుచేత భాషాస్వరూపమును దెలిసికొనుటకును వేరొకటి యాధారము లేదు. ఇప్పుడు భారతము నందు గాన్పించు భిన్నపాఠములలో నన్నయభట్టుని పాఠము

లను, నాతని భాషాసమయమును, నాతని నిబంధనము వలనఁ దెలిసికొనుట యత్యావశ్యకము. ఆతని నిబంధన మగు నాంధ్రశబ్దచింతామణికిని, భారతము నందలి నవీన పాఠములకును పరస్పరవిరోధము గాన్పించుచున్నది. ప్రామాణికైక కర్తవ్యము లగు రెండు గ్రంథములలో పరస్పరవిరోధము దోచునప్పుడు వాని కభిప్రాయభేదము, లేక యొకటి ప్రామాదిక మనుట, యీ రెంటికంటెను వేఱొకమార్గము లేదు. వీనిలో మొదటిది ప్రామాణికసమయ సమ్మితము. నవీన పాఠములు ప్రమాణసమ్మతములయి యుండెనేని వాని కప్పు డభిప్రాయభేదము చెప్పవలసి యుండును. కానినాడు రెండవపక్షము (ప్రామాదికమే) కావున పాఠముల గూర్చి ముందుఁ గొంత విమర్శించుట భాషాస్వరూప జిజ్ఞాసువుల కందఱ కును నావశ్యకమే. మఱియు బ్ర. రంగనాథశాస్త్రిగారు వ్రాసిన భారత పీఠికలో భారతపాఠాన్ధ్రచిన్తామణులు పరస్పరసంగతములుగా నుండలేదు. కావున నాంధ్రశబ్ద చిన్తామణి నన్నయభట్ట విరచితము గా దనియును జెప్పఁబడినది. భారతములోని భిన్నపాఠములలో నెవ్వి యాంధ్రశబ్దచిన్తామణి కసంగతములు? వేని కాన్ధ్రశబ్ద చిన్తామణి సంగతము? అని విచారణముఁ జేసి యేపాఠములకును, నాంధ్రశబ్దచిన్తామణికిని పరస్పరసంగతి యుండునో, యారెండును నేక కర్తృకములని చెప్ప వచ్చును. అట్లు చేయకయే, భారతభాగాంధ్రశబ్దచిన్తామణు లేకకర్తృకములు గావని చెప్పునపుడు, వినిగమనము లేనందున భారతభాగమే నన్నయభట్టు కర్తృకము గాదని కొందఱు చెప్పినను జెప్పఁ గలిగి యుందురు. "నన్నయభట్టు విరచితాంధ్ర మహాభారతమందు" అను నాశ్వాసాంత గద్యము నన్నయభట్టునకు భారతకర్తృత్వమందు వినిగమన మైనప్పుడు "నన్నభట్ట విరచితాంధ్రచిన్తామణౌ" అను పరిచ్ఛేదాంతములందలి గద్యము నట్లే వినిగమన మగును. కావున నది యే పక్షమునందును సమానమే.

ఇక రాజరాజ నరేంద్రుడు నన్నయభట్టును భారతమును రచింపుమని కోరి నట్లు చెప్పినమాట నన్నయభట్టుఁడు చెప్పినదే కావున నమ్మనివారి కదియును విని గమనము కాఁ జాలదు. ఆ కారణమున నింక పాఠములనే విచారింపవలయును.

పాఠములు ప్రామాణికములు, ప్రామాదికము లని రెండు విధములై యుండును. నిబంధన సమ్మితములు, నర్థవంతము లగునవి ప్రామాణికములు; కానివి ప్రామాదికములు, ఇవి కవిప్రమాదసిద్ధములును లేఖకప్రమాదసిద్ధములును గావచ్చును. కవిప్రమాదికములు మెండుగా నున్నచో నట్టిగ్రంథములు మనకు ప్రమాణ

ములు గానేరవు. కాని యా పాఠములను దిద్దుటకు మనము స్వతంత్రులము గాము. లేఖకప్రమాదికములను మనము దిద్దవచ్చును. భారతభాగాంధ్ర శబ్దచింతామణి గ్రంథము లతి చిరకాల విరచితము లగుటచేతను, భారతమందలి పాఠముల క్రమమున విపర్యాసములును, నాంధ్ర శబ్దచింతామణియందలి యభిప్రాయమునకు వేఱుపడుటయును సంభవించి యుండవచ్చును. ఆంధ్రశబ్దచింతామణికి నెలకూచి బాలసరస్వతి వచనరూపముగను, నప్పకవి పద్యరూపముగను, నహోబలపండితుడు సంస్కృతమునను వ్యాఖ్యానములు చేసియున్నారు. ఇంకను వాసుదేవుడు మొదలగు వా రనేకులు వ్యాఖ్యానములు చేసినట్లు తెలియవచ్చు చున్నది. కాని వానిలో నప్పకవిది యసంపూర్ణముగాను, నన్నయభట్టాథర్వణాచార్యోభయమత మిశ్రము గాను నర్వాచీనుల యుదాహరణములతో నున్నది. ఆంధ్రకృతులలోను, నాంధ్ర వ్యాకరణములలోను ప్రథమకర్త యగు నన్నయభట్టుని సమయమునకు నర్వాచీనులప్రయోగములు కొన్ని సమ్మతములు గాక యుండవచ్చును.

మఱియు నన్నయభట్టుని భారతభాగాంధ్రచింతామణులకు నవీన లాక్షణికులు గనఁబఱచిన యాభాస విరోధములకు పరిహారము వానిలోఁ జేయఁబడి యుండలేదు. ఆనాటి కీవాద ముదయింపక పోయి యుండును. ఆనాటి కేల? ఆంధ్ర కవిచరిత్ర ముదయింపక ముం దీవాదమే కాదు, ఈ సంశయమైన నెవ్వరికి నుద యింపకుండుట నిశ్చితము. బ్ర. రంగశాస్త్రిగారి కవిచరిత్రమునే యాధారము చేసికొని నట్లు వారే తెలియఁబరచియున్నారు. కావున నీచరిత్రమును గూర్చియే కొంత విచారింపవలసి వచ్చినది. ఈ చరిత్ర మనునది యాంధ్రకవుల యావచ్చరితము లను జెప్పునా? చెప్పదు. చెప్పనిచో చరిత్ర మెట్లగును? యావద్విషయములను జెప్ప కున్నను, యత్కించిద్విషయమును జెప్పినను చరిత్ర మగు నన్నపక్షమున నింక చరిత్ర కాని గ్రంథ మెద్ది? అన్నిటియందు నేదో యొక విషయము లేక యుండదుగదా? అట్లు కాక కవుల చరిత్ర మన లక్షణములచేత కవితల చరిత్ర యర్థ మయినచో, నప్పుడైన నిది యాంధ్రకవితల యావద్విషయమును జెప్పు చున్నదా? యావత్పదము సంభవత్పర మన్న పక్షమున నట్లైనను దీనికి వక్తవ్యాం శము కవితావిషయము గదా? వారివారి కవితలను జూపుచు, నందలి గుణాలంకా రాదులు, రసభావములు, గాంభీర్యకల్పనా చాతురులు, ఛందోవ్యాకరణ విశేషములు మున్నుగా నిరూపించుచు వారికాల భేదము సరిగా నున్నను, లేకున్నను జెప్పఁగా నప్పుడు గదా యది సఫలమగును. ఇప్పటి కవిలోకము వారికి పూర్వపు వారి

కవితలలోని విశేషములు దెలియుట ముఖ్యము గాని. యట్లు లేక వారివారి కాలములను గూర్చి మాత్రము చేసిన యా స్థానసంరంభము, కాకదంతపరీక్షాదికము వంటిది కాదా ? అది యేమైనను నీకవులచరిత్రములో ప్రసక్తములు కవితలు. కవిత లనఁగా కావ్యరచనలు గదా ? అయినప్పుడు దీనిలో నాంధ్రశబ్దచింతామణి ప్రసంగ మెట్లు గలిగెను ? అది యొక కవిత గానే భావింపఁ బడెనా ? భావించినను నది యాంధ్రము గాదుగదా ? ఆంధ్రకవితగా నెట్లు భావింప నగును ? అది యాంధ్రము గాకున్నను, నాంధ్రకవితకు లక్షణము గావున, లక్షణచే నాంధ్రకవితగా భావింప వచ్చునందురా ? కానిండు. కవి పదమునకు కవితయందు కవితకు లక్షణ. దానికి దాని లక్షణగ్రంథమందు లక్షణ. దానికి తత్కర్తృత్వమందు లక్షణ. ఇట్లు లక్షణల ననేక మంగీకరించి యాంధ్రకవి పదమున కాంధ్రశబ్దచింతామణికర్తృత్వార్థ మెట్లో సంగతము చేసినను, నిప్పు డాంధ్రశబ్దచింతామణికర్త యెవ్వడో, యాత డెప్పటివాడో, యాతని యితర కవిత లెవ్వియో, వాని విశేషము లెవ్వియో-అవి కదా ప్రసక్తములు ! వానిని విడిచి దీనియందు నన్నయభట్టుని యకర్తృత్వకథనమును గూర్చి చేసిన ప్రయాసమునకు ఫల మేమో తెలియరాదు. ఈ ప్రయాసము కర్తృత్వమును గూర్చియే చేసినచో నెంతయో శ్లాఘ్యమై యుండును. అకర్తృత్వ కథనము నావశ్యకమే యన్నచో నాంధ్రశబ్దచింతామణికర్త యెవ్వడో యొక్కడే కదా ! తిక్కనవారందఱు నకర్తలే కదా ?

ఒక్క నన్నయభట్టుని గూర్చి మాత్రమే చాల శ్రమచేసి యున్నారు. తిక్కనవారి నేల పేర్కొనలేదు ? తిక్కనవారిలో నెవ్వరిని నాంధ్రశబ్దచింతామణికి కర్తగా నెవ్వరును చెప్పి యుండలేదు. కావున నీ కవిచరిత్రములో వారినిఁ బేర్కొననవసరము లేకపోయె నందురా ? అది సత్యమే యయి యుండును. అట్లయినచో నంద అంగీకరించిన దానిని నిరాకరించుటయే యీ చరిత్రమునకు ఫలమయి నట్లు గానవచ్చుచున్నది. ఈ చరిత్ర మనేక కవులను వారివారి గ్రంథములను బేర్కొనుట లోకమున కది కొంత లాభము గావచ్చును. కాని వారివారి కాలములు వారి గ్రంథకర్తృత్వములు మున్నగు కొన్నిటి విషయములలో లోకప్రథలను బట్టియు స్వీయమగు నూహలను బట్టియుఁ జేయఁబడిన గ్రంథవిస్తరమునకుఁ దగినంత లాభము లోకమున కేమియును గానరాదు.

తిక్కనసోమయాజి భారతకృతి విషయమునందుఁ గల లోకప్రథలు, వానినిఁ బట్టి యూహించు నూహలును, వానిని ఖండించుట కయిన యూహలు

మున్నగు గ్రంథవిస్తృతి లోకమువారి కంతగా లాభకరము గాకున్నను ముద్రణము వారికి మాత్రము లాభకర మగును. మీదఁ జెప్పిన దంతయు "అలంకృత్య శిరచ్ఛేదః" అను దానిని బోలియుండును. అవిశ్వాస్యములగు లోకప్రథలు పామరులకు గాని, పండితులకు తుష్టికరములు గావని తెలిసి యుండియు వానితో నింపి పెంపఁబడిన యీ చరిత్రగ్రంథము నా యీ భాగములతో నట్టిదే యై స్ఫుటాటోపప్రాయముగా నుండును. ఇంక ననవసర మగు కల్పనలు గూడ దీనిలో గాన్పించుచున్నవి. నన్నయభట్టుని గురించి ఎవ్వరో "ఒకానొక" దీతఁడు వైదికబ్రాహ్మణుడు కాడనియు తెలుగు కవిత్వమునకు మొదటినుండి నియోగులే ప్రసిద్ధులయి యుండుట చేత నీతడును నియోగియే యై యుండు ననియు భట్టశబ్ద ధారణ మాత్రము చేత నీతడు వైదికి యని భ్రమింపఁగూడ దనియు నియోగి యైన శ్రీనాథకవి గూడఁ దన కాశీఖండములోని "చిన్నారి పొన్నారి చిరుతకూకటినాడు" అను పద్యములోఁ దన్ను గూర్చి "శ్రీనాథభట్ట సుకవి" యని చెప్పుకొనియె నని వ్రాసియున్నారు. నన్నయభట్టారకుని కాలమునాటికే యాంధ్రస్మార్త బ్రాహ్మణులలో వైదిక నియోగిభేద మేర్పడి యుండినను, నియోగివైదికుల కిరువురకును సమానముగానే "భట్ట" శబ్దము చెల్లుచుండినను, నన్నయభట్టు, తాను రాజుయొక్క కుల బ్రాహ్మణుఁ డయినట్టు "తన కుల బ్రాహ్మణు ననురక్తు నవిరళ జపహోమ తత్పరు....నన్నపార్యుఁ జూచి పరమధర్మవిదుఁడు వరచాళుక్యాన్వయాభరణుఁ డిట్టు లనియెఁ గరుణతోడ" నని యాదిపర్వములోఁ జెప్పికొని యుండుట చేత నన్నయ వైదికశిఖామణి యనియే నిశ్చయింపవలసి యున్నది. కుల బ్రాహ్మణులయి వంశ పరంపరగా రాజ పురోహితత్వము నిర్వర్తించుచుండుట వైదికులలోనే కాని, నియోగులలో లేదు అను నీగ్రంథసందర్భ మెంతవఱ కావశ్యమో విచారింపవలసి యున్నది. ఇదికవితా చరిత్రమున కుపకారము గా కున్నను ఇందు "ఒకానొక" రను వా రెవ్వరో కాని భట్టశబ్దమున కాశించి నన్నయభట్టు నియోగిగా భ్రమపడి చెప్పినట్లును, నన్నయభట్టు నాటికి "భట్ట" శబ్దము వైదికులకు మాత్రమే యుండినట్లును, దానినిఁ జూచి శ్రీనాథుడు తన యందును పురోహితత్వ భ్రమ మెవ్వరికైన గలుగు నేమో యని తెలిసికొనక తన్ను "భట్టు" గాఁ జెప్పికొనినట్లును, నానాటనుండి నియోగులకే కాక యెవ్వరికిఁ బెట్టుకొనినను భట్టశబ్దము పెట్టికొనఁ దగినదిగానే యుండినట్లును దెలుపుటకుఁ జాలినట్లున్నది. నన్నయభట్టుఁడు రాజపురోహితునిగాఁ జెప్పికొనినట్లు తెలియుటకు దివ్యజ్ఞానము దక్క వేరొక ప్రమాణము గానరాదు. బ్రాహ్మణపదము పురోహితత్వమునే చెప్పదు, "కుల

బ్రాహ్మణు" ననునది కులక్రమాగత పండిత బ్రాహ్మణుడఁ నని యతని యభిప్రాయమును సందర్భోచితముగ నాప్రకరణము విస్పష్టముగాఁ దెలియఁ జేయును. ప్రకరణసందర్భము లెట్లన, రాజరాజ నరేంద్రుఁడు తన వంశకర్తలగు పాండవులచరిత్రమగు పంచమవేద మని ప్రసిద్ధి నొందిన సంస్కృతమహాభారతమును దెనిగింపు మని కోరగా నట్టి మహాభారతరచనాప్రవృత్తి కథనము ప్రకరణము. భారతరచనకుఁ గావలసిన గుణసంపత్తినిఁ దనకు నన్నయభట్టుఁడు చెప్పుకొను సందర్భములో, నా పద్యములోనే

సీ. తనకులబ్రాహ్మణు ననురక్తు నవిరళ
జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది
నానాపురాణవిజ్ఞాననిరతుఁ
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర
జాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి
శోభితు సత్ప్రతిభాభియోగ్యు

నిత్యసత్యవచను మత్యమరాధిపా
చార్యు సుజను నన్నపార్యుఁ జూచి
పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయా
భరణుఁ డిట్టు లనియెఁ గరుణతోడ.

దీనిలో నన్నయభట్టుఁడు తన సూత్రగోత్రములను జెప్పుకొను విశేషణములు రెండు దక్క తక్కిన వన్నియును పంచమవేద మగు భారతము నాంధ్రీకరింప నర్హతను, శక్తిని, దెలియఁజేయు నట్టివే కాని వేరు కావు. ఈ సందర్భములోఁ దనకు పురోహితత్వము నాతఁడు చెప్పుకొను నవసరము గానరాదు. ఆ పద్యాదినే 'తనకుల బ్రాహ్మణు' అని చెప్పుకొనుటకు కారణము మీఁది సందర్భము వలన స్పష్టమగు చున్నది. ఎట్లన అది ప. 1. ఆ. 8వ....'హర్మ్య తలంబున మంత్రి పురోహిత సేనాపతి, దండనాయక, దౌవారిక మహాప్రధానానంత సామంత విలాసినీ పరివృతుండయిఁ యపారశబ్దగతపారగులైన వైయాకరణులును, భారత రామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులును, మృదుమధుర రసభావ భాసుర నవార్థ వచనరచనా విశారదులైన మహాకవులును, వివిధ తర్కవిగాహిత సమస్త శాస్త్ర

సాగర గరీయః ప్రతిభులైన తార్కికులును, వైణిక గాయకులును నాదిగాఁ గలుగు విద్వజ్జనంబులు పరివేష్టించి కొలువ విద్యా విలాసగోష్ఠి సుఖోపవిష్టుం డయి యిష్ట కథా వినోదంబుల నుండి యొక్కనాడు సీ. తనకుల బ్రాహ్మణు....తోడ'' అని యున్నది.

మీాది వచనములో రాజరాజనరేంద్రుని సభలో ననేకులు విద్వాంసు లుండఁగాఁ దన్నుఁ జూచి భారతము నాంధ్రీకరింపు మని రాజు కోరి చెప్పుట, తా నాతని కులక్రమాగతపండితుఁ డగుట నని కారణము దెలుపుటకుఁ గాని తనకు పురోహితత్వమును దెలిపికొనుటకు నన్నయభట్టుఁడు చెప్పికొనినది గాదు. మీాది వచన మందు "మంత్రి పురోహిత సేనాపతి........" అనుచో ట వేరుగా పురోహితునిఁ బేర్కొనియే యున్నాడు.

ఇట్టి పూర్వోత్తర సందర్భమును విడిచి యేదో యొకటి తన మనస్సునఁ బెట్టికొని యున్నదాని నపలపించుట, లేనిదాని నారోపించుట చరిత్ర లక్షణము కాదు.

ఒకప్పుడు "నన్నయభట్టుడు తనకు పురోహితత్వ ముత్కర్షావహ మనియే చెప్పికొనినా" డందురా ? ఈ చరిత్రమునకును నన్నయభట్టుని యెడల నట్టి యభి ప్రాయమేనా ? అయినచో శ్రీనాథుడు గూడ దనకు పురోహిత్వము కొఱకే భట్ట శబ్దము పెట్టుకొనె నేమో ? అప్పుడు పురోహితత్వము వైదిక బ్రాహ్మణులలోనే కాని నియోగులలో లేదని చెప్పుట చరిత్రమునకు పక్షపాతము గాదా ? పూర్వము భట్ట శబ్దము వలెనే పురోహితత్వమును వైదిక బ్రాహ్మణులలోనే యుండి యుండ వచ్చును. దాని కాశించియే శ్రీనాథుఁడును భట్ట శబ్దము దనకుఁ బెట్టికొని యుండ వచ్చును.

ఇట్లుండ శ్రీనాథునకు లేనట్లును, నన్నయభట్టునకే పురోహితత్వ మున్నట్లును చెప్పుట కీ చరిత్రగ్రంథమునకు వారిలో నొకరియం దసూయయొ, గౌరవమో తెలియ రాదు. వారిద్దరును బ్రాహ్మణులే. ఇద్దరును భట్టులే కదా ? కారణము సమానమే.

ఇట్టి లోపము లనేకములు గాన్పించుచున్నవి. తిక్కన సోమయాజి విరా టాదిగా భారతాంధ్రీకరణ ప్రవృత్తి సందర్భమున దన యిష్టదైవతము హరిహర నాథస్వామి నెల్లూరిలో దన యింటి సమీాపముననే దేవాలయమున నున్నవాఁ డయ్యును, సోమయాజికి స్వయముగా సాక్షాత్కరింపక స్వర్గమునకుఁ బోయి

యాతని తండ్రి కొమ్మనామాత్యునితో "నీకొడుకు రచింపఁబోవు భారతమందు కృతిపతిని వెదకుచున్నవాడు; నేనును కృతిపతిత్వమును గోరుచున్న వాడనే కావున నీ వాతనితో నాకై సిఫార్సు చేసి యా కృతిపత్వము నాకిచ్చునట్లు చేయు మని కోరినది. అప్పు డాకొమ్మనామాత్యు డాస్వామినిఁ దన వెంటఁ బెట్టుకొని స్వర్గమునుండి నెల్లూరునకు సోమయాజి యొద్దకు వచ్చి స్వప్నమందు సోమయాజికిఁ దనతోడఁ దీసికొని వచ్చిన హరిహరనాథస్వామినిఁ జూపి "నీవు కృతిపతికై విచారింప నేల ? నీ యిష్టదైవ మగు నీస్వామి తాను స్వయముగా కృతిపతిత్వమును గోరి వచ్చియున్నాఁడు గావున నీతనినిఁ గృతిపతినిఁ జేయు" మని జెప్పెనట. అప్పుడు సోమయాజి నిద్రలోనే యాతనికి సాష్టాంగ దండప్రణామ మాచరించి యుండగా స్వామి తన కోర్కెని జెప్పెనట. సోమయాజియు మిగుల నాశ్చర్యపడి, "స్వామీ, నీ కరుణచే నిట్టి పదస్థుడ నైతి నిక నాకు జన్మాంతర దుఃఖములు లేకుండు నట్లు చేసి నన్ను సుఖాత్ముఁజేయు" మని బాలకుఁడు తన కొలది యెఱుఁగక యొక గొప్ప పదార్థమును గోరినట్లు దనకు బ్రహ్మానంద స్థితినిఁ గోరెనట. అప్పుడు స్వామి యాతనికి సంసారదుఃఖము లగపడకుండఁ జేయునట్టి జ్ఞానము నిచ్చెనట. అంతట నాతఁడు మేల్కొని యుత్సాహాశ్చర్యములతోఁ దన కలలోని వృత్తమును దలపోయుచు నిట్టి పదము నొంది భారతమును రచింపఁ గన్నాడనని తలంచుచు, భారతము నాంధ్రీకరింప యత్నించె నట ! ఆహాహా ! యిది యేమి పుణ్యము ! హరిహరనాథస్వామి స్వయముగా వచ్చి కృతిపతిత్వమును గోరుట యా మహాపురుషుని భాగ్య మేమని చెప్పవచ్చును. అదంతయు సత్యమే కాని యిందొకటి సోమయాజిగారికిఁ గలిగిన యాశ్చర్యము కంటెను పెద్దది కాన్పించుచున్నది. హరిహరనాథస్వామి తనకు సంస్కృత గ్రంథములలో నెచ్చటను గృతిపతిత్వము సంభవింపకుండుటచే నది తన కొక లోపముగా నెంచుకొని యీ తెనుఁగు భారతమం దైనను గోరెనా ? లేక సంస్కృతము కంటెఁ దెనుఁగే గొప్పదని తలంచి కోరెనా ? తెలియదు. భారతారంభమందే నన్నయభట్టునే యేల కోరలేదో? తా నాతని కిష్టదైవతము గానందునఁ దనకోర్కె నాతఁడు నెరవేర్చునో లేదో యను సందేహముచే మానెను గాఁబోలు ! పోనిండు, నెల్లూరిలోఁ దన యింటి సమీపమున దేవాలయములో నుండు హరిహరనాథస్వామి యాతని కిష్టదైవత మయ్యు నాతనికే సాక్షాత్కరింపక, స్వర్గమునకుఁ బోయి కొమ్మనామాత్యునిఁ దనకు సిఫార్సు చేయు మని కోరుట యంతకంటె నాశ్చర్యము. సోమయాజియుఁ దన్ను మన్నింపఁడని సందేహము కలిగెనో ? లేక యసాక్షిక మైనచోఁ దాను స్వప్నమందుఁ జెప్పిన

దాని నెవ్వరైన నమ్ముదురో లేదో యని కొమ్మనామాత్యునిఁ దనతోడఁ దెచ్చుకొని యాతని ముఖమునఁ దన కోర్కినిఁ జెప్పించెనో? ఇదియొక యాశ్చర్యము. ఇది యిట్లుండగా స్వామి సాక్షాత్కరించి సోమయాజికి బ్రహ్మానందస్థితినిఁ గలుగఁ జేయు జ్ఞానము నీయగా దానితో సంతుష్టి లేక యట్టి బ్రహ్మానంద మనుభవించు చుండక యీ తెనుగు కృతి దానికంటె గొప్పదని కాఁబోలు సోమయాజి చేయుటయు, స్వామి దానిలోఁ దనకు కృతిపతిత్వమును గోరుటయు, నివి యన్నిటికంటెను నాశ్చర్యములుగా నున్నవి. ఇట్టి యాశ్చర్యావహమును చమత్కారకారియు నగు సోమ యాజిగారి స్వప్నమును గూర్చి యీ కవి చరిత్ర మేమియును స్పృశింపక యూర కుండుట న్యాయమగునా?

అప్పకవి యీ సోమయాజిగారి స్వప్నకథను జూచియే తనకును, దన యిష్టదైవతము గోపాలస్వామి స్వప్నమందు సాక్షాత్కరించి యాంధ్రశబ్దచిన్తా మణినిఁ దెనిగింపు మని చెప్పఁగా నీస్వామికినిఁ దన తెనుఁగు కృతియందు పతిత్వపు కోర్కి యున్నట్లు భావించి, యట్లు చేసి యుండును. కాని యీ యప్పకవి లౌకి కుఁడు గాకుండుట చేతఁ గాఁబోలు గోపాలస్వామి తన తండ్రినైన తాతనైనఁ దోడఁ దీసికొని రాక యొక్కడే సాక్షాత్కరించినట్లు చెప్పికొని యున్నాఁడు. అందు చేతనే యాతని స్వప్న మసాక్షిక మగుటచే నవిశ్వాస్యము. సోమయాజిగారి స్వప్నమునకు బ్రబల సాక్ష్య ముండుటచేత నది విశ్వాస్య మైన దని యీ చరిత్రము యొక్క యభిప్రాయమై యుండునేమో! ఒకానొకరు "తెలుఁగు కవిత్వమునకు మొదటినుండియు నియోగులే" కాని వైదికులు ప్రసిద్ధులు కారన్నట్లే యీ స్వప్నములలో గూడా నప్పకవిది వైదికమయ్యెను. ఇట్టి యాతని స్వప్నములను గురించియే యెంతయో విపులముగఁ జెప్పుచున్న యీ కవి చరిత్ర మట్టి చమ త్కారావహము, నిపుణము నగు సోమయాజిగారి స్వప్నము నేమియుఁ జెప్ప కూరకుండుట యీ చరిత్రమునకు ముఖ్యమగు లోప మొకటి.

సోమయాజిగారి స్వప్నములో నన్నయభట్టీయ ప్రసంగ మేమియు లేదు. కావున దానినిఁ జెప్ప నవసరములే దందురేమో! అట్లయినచో నీ నన్నయభట్టీయము నన్నయభట్ట రచితము గాదని సమర్థించు కొఱకే యప్పకవి స్వప్నవృత్తాంతము చెప్పె ననునది స్పష్టము. ఇదొక్కటియే కాదు, సూక్ష్మదృష్టిని జూచు విచక్షణు లకీ కవిచరిత్ర మంతయును నన్నయభట్టీయము నన్నయభట్ట విరచితము గాదని ఎట్లైన సమర్థింపఁ దలంపుతో నుద్భవించినట్లు గానఁబడును. ఇంక ననత్కల్పనా

డంబరము గలదు. "ఆంధ్రశబ్దచింతామణి నన్నయభట్టారక విరచితము కాదను టకుఁ గల హేతువులను గూర్చి యిచ్చటఁ గొంత విమర్శింతము" అని అప్పకవీయము పంచమాశ్వాసము నందు శబ్దానుశాసనముల సూత్ర మని

"నమ్యోతోహ ల్యధర్వణాచార్యమతాత్"

అని యొక సూత్ర ముదాహరింపఁబడి యున్నది. ఇది నిజముగా నన్నయభట్టీయ సూత్రమే యయినయెడల. అథర్వణాచార్యుఁడు నన్నయభట్టునకుఁ బూర్వకాలికుఁ డనియే చెప్పవలెను. అదియే నిజమయిన పక్షమున

"అప్రయుక్తత్వ దోషస్తు నవిరుద్ధో హరేర్మతే"

అని యధర్వణ కారికలలోఁ జెప్పఁబడి యుండుట చేత హరికారికలును నన్నయ భట్టీయమునకు సరియయి యుండవలెను. ఇప్పుడు శిష్టు కృష్ణమూర్తిగారిచేత వ్యాఖ్యానము చేయఁబడి చిన్నయసూరిగారి బాలవ్యాకరణములోని సర్వాంశములను గలిగి యున్న హరికారికలే నిజమైన హరికారికలయి, యీ హరికారికలును అధర్వణకారికలును గూడ నన్నయభట్టీయ వ్యాకరణమునకు బూర్వపువైన పక్షమున నన్నయభట్టీయమున కంతటి ప్రసిద్ధి వచ్చుటకుఁ గాని, విశేషాంశములతో నిండి యున్న యటువంటి యుత్తమ కారికావళు లుండఁగా స్వల్పాంశములను మాత్రమే కలగి వాని ముందర నిష్ప్రయోజన మని చెప్పఁదగిన యాంధ్రశబ్దచిన్తామణి నన్నయభట్టు రచించుటకుఁ గాని హేతు వుండదు.

శబ్దానుశాసన మూలసూత్రమని యప్పకవీయములోఁ బేర్కొనఁబడిన పయి సూత్రమును మరికొన్ని సూత్రములును ప్రత్యేకముగా నున్న యిప్పటి యాంధ్ర శబ్దచిన్తామణి యందుఁ గానఁబడకపోవుట చేత నప్పకవి యుదాహరించిన యా సూత్రములు ప్రక్షిప్తములని కొందఱు చెప్పుచున్నారు. ఈ సూత్రమే కాక గ్రంథ మంతయు ప్రక్షిప్త మనుట మరింత యుక్తముగా నుండును అని కవిచరిత్రము. దీనిలో నన్నయభట్టీయము నన్నయభట్ట విరచితము గాదనుట కెంతయో ప్రయాస పడినట్లు గానిపించుచున్నది. కాని యీ ప్రయాసము సఫలము గాదు. అప్పకవీయ మున నుదాహరింపఁబడిన "నుమ్యోతః" అను సూత్ర మప్పకవిదే కాని నన్నయ భట్టునిది కాదు. అది యప్పకవీయములోనే కాని యిప్పటిదే కా దెప్పటి యాంధ్ర శబ్దచిన్తామణిలోను లేదు.

నాయొద్ద బాలసరస్వతిటీకతోఁ గూడి గడచిన మూడవ షష్టిలోని యువసం వత్సరాశ్వయుజ బహుళ దశమి భృగువాసరము నాటికిఁ దన విద్యాభ్యాస కాల

మున పారనంది విశ్వేశ్వరశాస్త్రిగారిచే వ్రాసికొనఁ బడియున్న తాళపత్ర పుస్తకములో నీ సూత్రము లేదు. ఆ పుస్తక మిప్పటికి నూటయిరువది యేడు సంవత్సరముల క్రిందట వ్రాయఁబడినది. ఆ వ్రాసికొనినవారు బ్రహ్మశ్రీ ఇవటూరి వీరన్నశాస్త్రులవారి యొద్ద సంస్కృతమును, బ్రహ్మశ్రీ కాకరపర్తి బుచ్చిపాత్రుఁడు, పెద్ద పాత్రుఁడు గార్ల యొద్ద తెలుఁగు లక్షణ గ్రంథములును, కావ్యత్రయమును సంప్రదాయ శుద్ధముగాఁ జదువుకొని పుస్తకములను వ్రాసికొనినవారు. ఇతను వారు చూచి వ్రాసికొనిన మాతృక లట్టివే. మఱికొన్ని ముద్రిత పుస్తకములలోఁ గూడ నా సూత్రము నన్నయభట్టీయములో లేదు.

అప్పకవీయములో నది యొక్కటియే కాదు,

"ప్రాయస్తుస్యా త్క్వామాదికస్యైతః"

అను నన్నయభట్టీయ సూత్రమునకుఁ బిమ్మట

"అపిశబ్దసంధి శబ్దానుశాసనమూల సూత్రము" అని చెప్పి ఆ పిమ్మట

క. ఏని యనుమాట కడపట........

తే. పలుకు చెలియను నా ప్రాణభర్త........

అని "క్త్వాప్రత్యయాంతార్థ సంధి" అని చెప్పి,

ఆ. వారిజాతనేత్ర క్త్వాప్రత్యయాంతార్థ
ములు వచింతుఁ దెలుఁగు పలుకులకును

అని చెప్పియున్నాడు. ఇంకను "సామాన్యాధికరణ్యేషూదన్తానాం" అను నన్నయభట్టీయ సూత్రమునకు దన వ్యాఖ్యానము పిమ్మట "విశేషణాంత ద్రుతాగమము శబ్దాను శాసన మూలసూత్రము" అని చెప్పి పిమ్మట "ధాతుపదసంభవానాం విశేషణానా ముత స్తదానగచి" అనియు, "అహమాదీనాం ద్విత్వం" అను నన్నయభట్టీయ సూత్రమునకుఁ దన వ్యాఖ్యానము పిమ్మట "అద్భుతశబ్దసంధి శబ్దానుశాసనమూల సూత్రము" అని చెప్పి "చోరదద్భుత శబ్దార్ధే" అని యాపిమ్మట "పోశ్చతదాద్యర్థవాచకేషూతః" అను నన్నయభట్టీయ సూత్రమునకుఁ దన వ్యాఖ్యానము పైని "లుకార సంధులు శబ్దాను శాసన మూలసూత్రము" అని "వికృతి పదే కాటోరపి" అనియు దానికిఁ బిమ్మట "రేఫసంధి శబ్దానుశాసన మూలసూత్రము", "అపథారేశ్చావితశ్చలుగ్వాస్యాత్" అని దాని పిమ్మట "నరలడ శృంగసంధులు శబ్దానుశాసన మూలసూత్రము", "పదమధ్య నరలడానాము

తశ్చ" అని చెప్పి దాని వ్యాఖ్యానము పిమ్మట "త్రివి క్రమ మతసంధులు శబ్దానుశాసన మూల సూత్రము", "తేషామితశ్చ తద్వ త్త్రివిక్రమ మతేన" అని చెప్పి దాని వ్యాఖ్యానము పిమ్మట "కవిభల్లట మత సంధులు శబ్దాను శాసన మూల సూత్రము", "కవిభల్లటైః క్రియాణాం...." అని నన్నయ భట్టీయ సూత్రము చెప్పి దాని వ్యాఖ్యానము పిమ్మట "ఔపవిభ క్తి సంజ్ఞానః.... ప్రథమా వైభ క్తికయోః....అను నన్నయభట్టీయ సూత్రమునకుఁ బిమ్మట "వువర్ణా దేశము శబ్దానుశాసన మూలసూత్రము". "తస్యసమాసే పుంపూ" అని తాను చెప్పి దాని వ్యాఖ్యానము పిమ్మట "అథర్వణ మతసంధులు శబ్దానుశాసన మూల సూత్రము" "నుమ్పోతోహ ల్యథర్వణాచార్య మతాత్" అని చెప్పియున్నాఁడు.

ఇట్లప్పకవి తన సూత్రములను గూడ "శబ్దానుశాసన మూలసూత్రము" లనియే చెప్పియున్నాఁడు. దాని కాతని యభిప్రాయ మేమో మన మాలోచింప వలసి యున్నది. మూలముగాఁ జెప్పిన వాని నన్నిటిని "శబ్దానుశాసన మూలసూత్రము" లనియే చెప్పిన ట్లాతని యభిప్రాయము స్పష్టమగుచున్నది. కాని యవన్నియు నన్నయభట్టుని సూత్రములుగా నాతడు చెప్పినట్లు కానరాదు.

అప్పకవీయములోఁ బేర్కొనఁబడిన సూత్రములు ప్రక్షిప్తము లని కొందఱి పేరను "ఈ సూత్రమే కాక గ్రంథమంతయు ప్రక్షిప్త మనుట మరింత యుక్త ముగా నుండును" అని చరిత్రము తన ముఖమునను జెప్పుచున్నది. కొందఱను వారి యభిప్రాయ మా సూత్రము లాంధ్రశబ్దచిన్తామణిలో లేనివి కావున ప్రక్షిప్తము లని కావచ్చును. ఆకొందఱు అప్పకవి చెప్పిన వానిని చింతామణిలో నున్నట్లు భ్రమ పడి యిట్లు చెప్పియుందురు. ఆ రెండును నసత్యములే. అది యట్లుండగా "గ్రంథ మంతయు ప్రక్షిప్త మనుట మరింత యుక్తముగా నుండు" నని కవిచరిత్రము చెప్పుచున్నది గదా! ఆంధ్రశబ్దచిన్తామణి గ్రంథమంతయు దేనిలో ప్రక్షిప్త మనియో చెప్పలేదు. ప్రక్షిప్త మనగా నీ చరిత్ర యొక్క యభిప్రాయ మేమో తెలియ రాదు. మనకుఁ దెలియకున్న బోనిండు. తన యభిప్రాయము తనకైనఁ దెలియ వలయునా? అక్కఱ లేదా? ఆంధ్రశబ్దచింతామణికి మూలగ్రంథ మెద్ది? దేనిలో నిది ప్రక్షిప్తము? అప్పకవీయములో నీ చింతామణి ప్రక్షిప్త మనియా? అది సంగతము గాదు కదా! లేక యప్పకవీయము ప్రక్షిప్త మనియా? అదియును గాదు. ఒకప్పుడు "ప్రక్షిప్త మనగా దీనిలోని యుదాహరణము లన్నియు నన్యదీయములు

గావున నీ యప్పకవీయము ప్రక్షిప్త మనియా ? అట్లే యీ చరిత్ర కభిప్రాయమైన పక్షమునఁ దనవంటిదే యప్పకవీయ మని తెలిసికొనవలసి యుండును.

ఇంక నప్పకవీయములోఁ గొన్ని స్వీయములు గలవు. ఈ కవిచరిత్ర మందో యొకరి యధిక్షేపగ్రంథ విస్తరము దక్క తక్కినదంతయు పరులదే కాని స్వీయము లేదు. మఱియు నీ చరిత్రములోఁ జేసియున్న వితర్కములను గురించి విచారింతము.

"నమ్యోతః" అను సూత్రము నిజముగా నన్నయభట్టీయ సూత్రమే యయిన యెడల అథర్వణాచార్యుఁడు నన్నయభట్టునకుఁ బూర్వకాలికుఁ డనియే చెప్పవలెను. అదియే నిజమయిన పక్షమున హరికారికలు నన్నయభట్టీయమునకుఁ బూర్వపువే యయియుండ వలెను. ఇప్పుడు శిష్టు కృష్ణమూర్తిగారి హరికారికలే నిజమయిన హరికారికలయి యీ హరికారికలును అథర్వణ కారికలును గూడ నన్నయభట్టీయ వ్యాకరణమునకుఁ బూర్వపువయిన పక్షమున నన్నయభట్టీయమున కంత ప్రసిద్ధి వచ్చుటకు హేతు వుండదు అని యీ సాధ్యసాధన నివేశప్రణాళికలో నుత్తరోత్తరము పూర్వాపూర్వము నాశ్రయించియే యున్నది. కావున మొదటి దొకటి తెగినచో నన్నియుఁ దెగును. ఈ ప్రణాళికా రచనఁ గావించిన ఈ చరిత్ర గ్రంథము దానా షరతుల నంగీకరించుటకా ? లేక వాని యసంభావితత్వమును దెలిపి యా పక్షములను ఖండించుటకా ? కాక రెండు పక్షములు గాన్పించునప్పుడు తన కాసంశయము గలిగి నిశ్చాయకులు దానిని నిశ్చయించుటకా ? అని మొదట విచారింపవలయును. మొదటి దానిలో "నమ్యోతః" అనునది నిజముగా నన్నయభట్టీయ సూత్రమే యయిన యెడల అనుటచేత నా షరతుల నంగీకరించుట కయినట్లు గానరాదు. అంగీకరించిన యెడల శిష్టు కృష్ణమూర్తిగారి పిమ్మట వాఁడు నన్నయభట్టుఁడును, హరికారికల పిమ్మటిది నన్నయభట్టీయ మనియు నంగీకరింపవలసి యుండును. అంగీకరించినచో నెలకూచి బాలసరస్వతియే రచించి నన్నయభట్టుని పేర బెట్టినాడని ముందుఁ జెప్పియుండుటచే స్వవిరోధమే సిద్ధించును గాని స్వాభీష్టము సిద్ధింపదు. కావున మిగిలిన రెండు పక్షములలో, నొకటి యసంభావితత్వమును దెలుపుటకే యయినచో, నదియే యుక్తమగును.

"నమ్యోతః" అనునది నన్నయభట్టీయ సూత్రము గాదు. అందుచేతనే నన్నయభట్టుఁ డథర్వణాచార్యునకుఁ బిమ్మటివాఁడును గాడు. ఇక మూడవ పక్షము సంశయమైనచో నీకవులచరిత్రము దాను నిశ్చయింపఁ జాలదు. "నమ్యోతః"

అను సూత్రము నన్నయభట్టునిది కాదను నిశ్చయము గలవారెల్లరును నాంధ్రశబ్ద చిన్తామణి నన్నయభట్టు విరచితమే యను నిశ్చయము గలవారే. నిశ్చయము సిద్ధాంత మగును గాని సంశయము సిద్ధాంతము గాదు. నిశ్చయము సంశయమునకు బాధకము గాని, సంశయము నిశ్చయమునకు బాధకము గాదు. నిశ్చయోత్తర సంశయము ప్రసిద్ధము. సంశయోత్తర నిశ్చయ మప్రసిద్ధము. సంశయములో నున్నవారు శాస్త్ర సమయ మెఱుఁగక నిశ్చయింపఁ బ్రయత్నించుట కంటె నూర కుండుట మిగుల శ్రేయము. ఈ కవి చరిత్రము వలన స్వవిరోధమయినను సంశయమయినను దెలియఁబడుచున్నది. కాని శాస్త్రీయమగు సిద్ధాంతము దెలియఁ బడదు. ఇట్టివి "బిభీషిక" లనిపించుకొనును గాని, చరిత్ర లనిపించుకొనఁ జాలవు.

"ఇక బాలసరస్వతులో ఎవ్వరో దీనిని రచియించి, తమ గ్రంథ ప్రసిద్ధికై కర్తృత్వమును నన్నయభట్టునం దారోపించి, సారంగధరుఁడు తమ కిచ్చె నన్న కథ కల్పించి రనియు. అభిప్రాయ పడుచున్నది. ఇది సత్యమనియే తోచుచున్నది. కాని యెడల "నుమ్యోతః" ఇత్యాదిసూత్ర మాంధ్రశబ్దచింతామణి యందుఁ జొచ్చుటకు హేతువు లేదు. ఈ యసందర్భము నాలోచించియే యుటీవలివా రీ సూత్రమును, పుస్తకమునుండి తొలగించి యుండవచ్చును" అని కవుల చరిత్రము ప్రథమభాగము 43వ పుట. "దీనిని నన్నయభట్టీయ మని సాధారణముగా జనులు వాడుదురు. ఈ వ్యాకరణమునకు ఎలకూచి బాలసరస్వతి యను పండితుడు మొట్టమొదట తెలుఁగు టీకొకటి వ్రాసెను. దానికి బాలసరస్వతీయ మని పేరు. అటు తరువాత వాసుదేవుఁడు వార్తిక మొకటి వ్రాసెను. తదనంతరము కాకునూర్యప్పకవి యీ వ్యాకరణమును దెనిగింపఁ బూని...తెనుఁగున నయిదాశ్వాసములు గల పద్యకావ్యమే రచించెను. ఇంక నహోబలపండితుఁడు, నృసింహపండితుఁడును వ్యాఖ్యానము చేసిరి" అని కవుల చరిత్రము 40-41 పుటలు.

ఈ చరిత్ర మొకచోట నాంధ్రశబ్దచింతామణిని బాలసరస్వతి రచించినట్లు చెప్పుచున్నది గదా! బాలసరస్వతినాటి కాసూత్రము చిన్తామణిలో నున్నదా? బాలసరస్వతి దానికి టీక చేసినాడా? ఇది కవుల చరిత్రమునకు దెలియునా? లేదా? తెలిసియున్నచో బాలసరస్వతిని గూర్చి చెప్పునపు డీ విషయ మేల చర్చింపఁబడ లేదు? తెలియనిచో దెలియకయే నిర్ధారణ మెట్లు చేయఁగలదు? అప్పకవి "శబ్దాను శాసన మూలసూత్ర మని చెప్పిన "నుమ్యోతః" అను సూత్ర మాంధ్రశబ్దచిన్తా మణిలోని దైన పక్షమున నాంధ్రశబ్దచిన్తామణికర్త కవిచరిత్రమతము ప్రకా

రము శిష్టు కృష్ణమూర్తిగారి హరికారికా రచనానంతరమువాఁడు గదా? అతఁ డొక శబ్దాను శాసనుఁడే కదా! భారత రచనచే గదా నన్నయభట్టునకు శబ్దానుశాసనుఁడను బిరుదము వచ్చిన దని యీ చరిత్రాభిప్రాయము? అట్లయినచో నీశబ్దానుశాసనుఁడు భారత కర్తయే యనియా? లేక పౌండ్రవాసుదేవుని వంటివాఁడా? శిష్టు కృష్ణ మూర్తి గారికిఁ బిమ్మటి వాఁడు, శబ్దాను శాసనుఁడు. నాంధ్రశబ్దచింతామణి కర్తయు నగు నీతని నింత దగ్గరగా నున్న వానినిఁగను గొనలేక, యెవ్వరో యని చెప్పు చున్న యీ చరిత్రము, తన యసందర్భమునే, తాము దొలగించు కొనక మఱి యెవ్వరో యెవ్వరిదానిలోనో యుండు నసందర్భమును దొలగించుట కా సూత్ర మును, చింతామణిలోనుండి తొలగించి యుందు రనునది "అసుందరాక్షోఽయమితి బ్రువాణః కాణో హి హాస్యాస్పదతా ముపైతి" అను రీతిని స్మరింపఁ జేయుచున్నది, "ఈ హరికారికలును అధర్వణ కారికలును గూడ నన్నయభట్టీయ వ్యాకరణము నకుఁ బూర్వపు వయిన పక్షమున నన్నయభట్టీయమున కంత ప్రసిద్ధి వచ్చుటకు... హేతువుండదు" అని చరిత్రము.

ఈ మాటయే సత్యము. దీనికి ప్రసిద్ధి సిద్ధమే కదా! ఆ హేతువు చేతనే యీ నన్నయభట్టీయ మన్ని యాంధ్ర వ్యాకరణముల కంటెను ప్రాచీనమే యని కవిచరిత్ర మంగీకరింపక తప్పదు.

"విశేషాంశములతో నిండియున్న యటువంటి యుత్తమ కారికావళు లుండగాఁ నల్పాంశములను మాత్రమే కలిగి వాని ముందర నిష్ప్రయోజన మని చెప్పఁదగిన యాంధ్రశబ్దచిన్తామణి నన్నయభట్టు రచించుటకుఁ గాని హేతువుండదు" అని చరిత్రము. ఆ విశేషాల్పత్వములు గ్రంథవిస్తారాంశమందుఁ గాని విషయ మందుఁ గాదు. చిన్తామణి, యల్పాక్షరములు, ప్రభూతార్థము గలది యగుట సత్యము. నిస్సారము, నిరర్థకము నగు గ్రంథవిస్తృతిఁ గలిగి యుండుట సూత్ర స్వభావము గాదు.

ఇక నర్వాచీను లాంధ్రశబ్దచిన్తామణిని బేర్కొనక పోవుటచే నది యానాటికి లేదను వాదమును గొంత విచారింతము.

కవి చరిత్రము 50 వ పుటలో

శ్లో. అధర్వణాని కావ్యాని బార్హస్పత్యాని సంవిదన్
కౌముదీ మాంధ్రశబ్దానాం సూత్రాణి చ కరోమ్యహమ్."

అని యాంధ్ర కౌముది కర్త.

శ్లో. బార్హస్పత్యాని సర్వాణి కావ్యం వ్యాకరణం విదన్
కరో మ్యాథర్వణం శబ్దం సర్వ లక్షణలక్షితమ్."

అని త్రిలింగ శాసనకర్త" అని యున్నది. ఈ గ్రంథకర్త ఎవ్వరు? ఎప్పటివా రెప్పటివారు? వీరిని గురించి చరిత్రమున కెంత వఱకు దెలియును? "బార్హ

స్మృత్యాని సర్వాణి" అని యున్నది గదా? బార్హస్పత్య వ్యాకరణము లెన్ని? ఎవ్వి? "అధర్వణాని" అను శ్లోకమునకు సమన్వయ మెట్లు? త్రిలింగ శబ్దాను శాసనము వ్యాకరణమేనా? కాదా? మీది గ్రంథకర్తలు కేతనకు పూర్వులా? పిమ్మటివారా? పూర్వు లయినచో వారిని కేతన పేర్కొనినాఁడా? పిమ్మటి వారైనచో వారు కేతనను బేర్కొనినారా? మఱియు కవిచరిత్రము 40 వ పుట. "నన్నయభట్ట విరచితమైన లక్షణ మెప్పు డున్న దనియు, దానిలో నితర లాక్షణికు లుదాహరించిన పద్యములన్నియు నున్నవనియు, తిక్కన కృతమైన వాగ్బంధ నము నందు వలెనే దీనియందును, విశేషము లెవ్వియు లేవనియు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు వ్రాయుచున్నారు" అని తిక్కన కృతమయిన వాగ్బంధన మను లక్షణగ్రంథ మున్నది గదా! దానిని కేతన పేర్కొనినాఁడా? కేతన కాంధ్ర శబ్దచిన్తామణి తెలియఁబడక పోయినను వాగ్బంధనము తెలియవచ్చును గదా! దీనిని గురించి కవిచరిత్ర మేమి విమర్శించినది?

క. "మున్ను తెనుగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్ప రే జెప్పెద"

అని కేతన చెప్పియున్నాఁడు గదా! ఈతనియం దసూయ నారోపింప వలయునా? అజ్ఞత నారోపింపవలయునా? రెండును లేక యా పద్యము తుదనే

"నన్నయభట్టాది కవిజనంబుల కరుణన్"

అని చెప్పుటచేత వారి లక్షణగ్రంథముల నెఱిగినట్లు చెప్పి యాతని యందు మీద జెప్పిన దోషములు లేకుండునట్లు చెప్పుట యుచితమగునా? చరిత్రము యొక్క యభిప్రాయ మేమి?

నిరాధారములగు పామరులమాటలను. ఛలోక్తులను, సందర్భోచితములు గాని లోకప్రథలను, నిష్ప్రమాణములగు నూహలను, నారోపాపలాపములను, నసూయను, సంశయములను హేతువులుగాఁ జేసికొని గ్రంథవిస్తృతిఁ జేసి లోక వంచన మగునట్లు చెప్పుట చరిత్ర గ్రంథములకు ధర్మము గాదు. కావున ముందు రచించియున్నదాని నెట్లో కవిచరిత్ర మనిపించినట్లు గాక, దీనిని మీదఁ జెప్పిన దోషములు లేకుండ నిష్పక్షపాతబుద్ధివి విమర్శించి, దీనిలోఁ జేయవలసిన మార్పు లను గురించి రచింపఁబోవు నుత్తరభాగము నందు ప్రకటించి, యిట్లు నేను చెప్పి నందుల కాగ్రహింపక యున్నదాని నున్నట్లు చెప్పి లోకోపకార సుకృతము నొందుట మంచిదని నా యభిప్రాయము.

—పారనంది రామశాస్త్రి*

---

* సారస్వత సర్వస్వము- సం. 1. సం. 1, 2. రుధిరోద్గారి.

# మ హా భా ర త ము

వ్యాసుని భారతము నన్నయతిక్కనల తెలిగింపున బొందిన మార్పుల నించుక విన్నవింతును పెక్కురు పెక్కు మాఱులు ఇదివఱకు తడవిన ప్రాత భావములే నా యీ వ్రాతయందును దోపవచ్చును. విషయము నందలి తీపియు, దల్లినుడిమీది వెట్టి వలపును నా తలంపులను వెలువరింప ఉరి గొల్పినవి. కావున ఈ తెంపరితనము.

వ్యాసుని కూర్పు :

వ్యాసాచార్యుడు పదునెనిమిది పురాణములం గూర్చె నందురు. ఈ పురాణ ముల నన్నిటిని వ్యాసుడే రచించెనా ? భారత కథా సందర్భమున నొక పాత్రయై నటించిన వ్యాసుడే ఈ పురాణ కర్తయా ? అను సంశయములకు జోటీయక ప్రకృతము మనకు విషయమైన భారత రచనమునకు మాత్రము కట్టువడి కత సాగింతము.

వ్యాసుని పదునెనిమిది పురాణములలో "భారతము" తలమానికము. తక్కినవాని యందు లేని క్రొత్త తెన్నులు భారతమున బెక్కులు. సన్నివేశ రచనా చాతుర్యమునను, సంవిధాన కౌశలమునను, పాత్ర సృష్టియందును, భావానుగుణ సంభాషణాక్రమ నిర్వహణమునను, అన్నిటను వ్యాసుని నిపుణత భారతమట్లు, మరి యే పురాణమును వెల్లడింపదు. వాల్మీకి రామాయణము కత వేఱు; దాని మార్గమే వేరు. అది భారతమున కెందునను బోలదు. వ్యాస భారతమును తెలుగు భారతముతో, అందు తిక్కన తెలిగింపుతో బోల్చినపుడు, వ్యాసకవి కూర్పు నందలి నేర్పరితనమున నేమరుపాటు లున్నవి; చాతుర్యమున ఛాందస మున్నది; విషయ సమృద్ధి యందు వివేచనము కొఱవడినది; శబ్ద సంపత్తికి ఔచితి జతపడదు; సమయమునకు పొందువడని సంభాషణములు, వృత్తితో బొత్తు గోరని వక్తృత్వము, ఆత్మప్రజ్ఞదెస మొగము మలచిన వాదములు కలవుదీర గాంచవచ్చును. కాని సంస్కృత వాఙ్మయమున రచితము లైన శ్రవ్య, దృశ్య ప్రబంధములలో నేదియు నీ వ్యాస భారత రచన కెందును ఎనగా దని పెద్ద లన్నమాట సమీచీనము.

## నన్నయ తెలుగు కూర్పు :

నన్నయభట్టారకుడు విద్వాంసుడు; శబ్దాను శాసనుడు; శాస్త్ర విదుడు; ప్రవక్త; ప్రామాణికుడు; ఉభయభాషాభిజ్ఞుడు; కవితా విలాసుడు; వ్యాస భారత ప్రశస్తి నెరిగినవాడు; ప్రకృతిసిద్ధ మగు రసజ్ఞత గన్నవాడు; రాజనరేంద్రుని యాస్థాన పండితుడు: తత్పురోహితుడును, రసపిపాసు వగు రాజనరేంద్రుడు తన పురోహితుని నన్నయభట్టారకుని పాండిత్య కవితా విశేషముల జక్కగ కనిపట్టిన వాడు. మహాభారత స్వారస్యము జుర్రినాడు. భారతమును తెలుగున బలికింప ముచ్చట పడి నాడు; వినయపూర్వకముగ నన్నయను నియోగించినాడు. భట్టారకుడును, భారతము నెడ దనకు గల పేర్మికి దన యేలిక కోరిక తోడ్పడుట తొంటి పున్నెముగా నమ్మి తెలుగు సేతకు దలపడెను. ఆదిపర్వము మొదలు అరణ్యపర్వమున కొంత వరకు ఆయన తెలుగించెనని, అతని తెలుగు మార్పున సంస్కృత శబ్ద జాలము ఎక్కుడుగా పుంజుకొన్న దని, తెలుగు భారత వర్తమానముం గూర్చి తెలిసినవా రెల్ల రెఱుగుదురు. మాతృకం గల భావమును తెలుగున దిగుమతి సేయుటయు నన్నయ తెలుగింపునకు ఉద్దేశ్యము, ప్రయోజనము ననుటయు జదివినవా రెఱుగుదురు. భట్టు అటనట ఇంచుక స్వతంత్రత వహింప గడక జూపినను, మాతృకకు జాలవరకు విధేయతయ చూపినాడు. పటిమ తగ్గిన పట్టులు లేవనరాదు గాని ప్రసన్నతకు దలగిన పంక్తి కలదనరాదు. ప్రయోజనము పాటింపని సంబుద్ధులు తరచగుట, శైలి సడలినది గాని సారళ్యము సంపన్నమయినది. సంస్కృత పద భరితము, సమాస భూయిష్టము నయ్యు గటువచస్సు కలికమునకు గానరాదు. నాటికి నేటికి నన్నయ శైలి తెలుగుకవితకు ఒక మేలిపచ్చయినది. ఆరణ్య పర్వము నడుమనే అతనికి ఆయుఃపరిమితి ముగిసినది. కడమ సేత కట్టు వడినది.

## తిక్కన తీర్పు :

నన్నయకు దరువాత ఇంచుమించుగ 14 శతాబ్దికి భారతముతెలుగుసేత తిక్కన పాల బడినది. ఏ కారణమయిన మనకేమి గాని ఆరణ్యపర్వ శేష మటుంచి తిక్కన విరాటపర్వము తొలిగా స్వర్గారోహణము దాక పదునేను పర్వము లను తెలుగించినాడు. తెలుగుసేతకు దొరకొనిన తిక్కనకు నన్నయ భారతము తెలుగింపు దక్క, మరి తెలుగు పద్య ప్రబంధము లేవేని దొరికియుండు నేమో చెప్పరాదు. నన్నయకు మునుపు పద్య రచన యున్న దనువాద మొకటున్నది. మచ్చునకు ఆ కాలము నాటి శాసనములందలి పద్దెములు కొన్ని కనబడుచున్నవి

కాని గ్రంథరూపముగ నేవియు గనబడవు. నన్నయయే పద్య రచనకు దొంటి వాడని గోసయు మరియొక దిక్కునుండి వినబడును. సంస్కృత కవిత్వమునకు వాల్మీకి యెట్లు: తెలుగు కవనమునకు నన్నయ అట్లు అందురు. సంతసమే! నన్నయకు దక్కిన పరువున దిక్కనకును పాలు లేక పోవదు. నన్నయ శైలి, తన నాటికే, తెలుగు బాసయు, కైతయు గమియమాగినదని మూదలించుచున్నది. సంస్కృతశబ్దాధిక్యముగా, సమాససమృద్ధముగా నుండియు, నన్నయ తెలుగు కైత కొక నడకయు, పోతయు దీర్చి నమూనా చూపినాడు. అట్లు తిక్కనయు తెలుగు పదములకు మిక్కిలి చొరవ యిచ్చి పలు నడకలతో నొకపోత, నిజ వైలక్షణ్యము' స్వనామాంకితము నగుదానిని, తెలుగు బానకు గానుకగా నిచ్చినాడు. భట్టారకుని భారతము మార్పుతప్ప మరి తెలుగు కబ్బ మేదియు నగపడమి, దిక్కన రచనకు నన్నయ రచన తొలిప్రాపయిన దని యొప్పికొనవచ్చును. కాని నన్నయ తిక్కనలి రచనలందలి పరిపాకము గాంచుచో నన్నయ నాటికే తెలుగుబానయు, గైతయు నిగ్గుదేరిన వని, అదృష్టము లయినవి కాని, సంఖ్య యందు కొలది యయినను సారతరము లయిన గ్రంథములు కొన్నియేని యుండి యుండునని, తెలుగుకైతకు శ్రీకారము జుట్టిన తెలుగు వాల్మీకి నన్నయకు బూర్వమే తెలుగుగడ్డకు బుట్టియుండు నని ఊహించుట కెంతేని యవకాశము కలదు. సరి ఆ గొడవ యటుండె.

తిక్కన, తన రచనకు మొదలిడుటకు మున్ను, నన్నయ రచనను గాంచి, తెలుగు పలుకుబడికి పరువు చాల తగ్గిన దని, తెలుగు రూపే మారిన దని, దానితో తెలుగు నడత, నవకము, ఎక్కటితనము మారిపోయె నని, తెలుగును మూడుపాళ్లు సంస్కృతము మ్రింగివేసిన దని, ఇట్లే పరాకుగా నున్నయెడ యింకను తెలుగు సంస్కృతమున గరగిపోవునని వగచి కాబోలు తనచేతిలో దెలుగునకు బెద్దగా నెల విచ్చినాడు; రూపునకు దెచ్చినాడు; దిద్ది తీర్చినాడు; అమృతము వోసినాడు; బ్రతుకుదెర వేర్పరచినాడు; ఈతని తెలుగుసేత కిదియ తొలియక్కర. ఇంతియ కాదు—ఈ యక్కరనూది, నన్నయ తన కూర్పున కెక్కించిన నుడుగమిగాక, తననాడు, తెలుగు సీమయందు పలునాడుల వాడల గూడెముల బరిపాటిగ నాడు చుండిన నుడులను బెక్కింటిని కూర్చి పేర్చి, రూపు సెడినవాని తొంటి పుట్టుకయు వాలకము గురుతించి నొక్కుదీర్చి తన వ్రాతను గుదిగ్రుచ్చినాడు. అంతే, అంతటితో దెలుగుబాస మొగసాలకు గడియ పడినది.

పిమ్మట బయలుదేరిన కవులలోబెక్కురు వ్రాతయందును పోతయందును మునుపటి గాడిలో వైచి తమకైతను ఈడ్చుట అటుంచి తమ మునుపటి వారు తమ పొత్త ముల వాడిన పలుకులతో దనిసిరే కాని మున్నటి కబ్బముల కెక్కని నుడులను తమనాడు వాడుకలో నున్నను, తమ కూర్పున జేర్ప దెగింపరైరి. కావుననే మన తెలుగు నాటికి నేటికి కుంపటిలోని మొక్కవలె, ఎదుగు బొదుగు లేక, గిడసవారినది. ఉసురుగల బాసకు బెంపొక పెద్ద గురుతు.

తిక్కన తర్వాతి కవులు—శ్రీనాథుడు తొలుతగా నలువు రయిదుగురు మాత్రము, తిక్కన వాడని నుడులను గొన్నింటిని తమ కబ్బములం జొప్పించిరి. అందు "ఆముక్తమాల్యదా" కారుడు పెక్కింటిని బనివడి కూర్చి తన కతకు జేర్చి కొన్నాడు. తిక్కన, ఏ పట్టున నేని తలఫున కొప్పిన తెలుగు పలుకు దొరికినంతన ఒప్పరికింపక, నడక తిన్నదనముం గూడ బాటింపక పొదిగినాడు. అతని మక్కువ కగ్గమగుట కతమునను తెలుగు నేటిదాక ఒక వెరవున ఎక్కటితనముతో బ్రతుక గలిగినది.

## తెలుగునుడి—నేటి కాన్పు :

ఒక్కొక్కరును, ఆ వరకు కబ్బముల కెక్కక, తమ నాటివాడుకలో నుండు మాటలను జతపరుచుచుంట, పలుకుబడికి బలుపు పరువు గూరుచుండును. వెనుకటి వారిపొత్తముల లేని మాటలు తాము వాడగూడదను వెట్టికి లోనుగాక, సూటిగా గ్రుచ్చి యెత్తుచుండ వలయును, పొత్తముల కెక్కి పలుకులతో వలగొను చుండవలయు గాని, క్రొత్తనుడులకు, వాడుక నున్న వానికి ఎడమీయ గూడదను కట్టడి లేదు. తమ వ్రాతలలో గ్రొత్త పోకడలను, క్రొంగ్రొత్త వన్నె - చిన్నెలను గిరిగింప వెలయునట్లు వాడుక నున్న నుడుల, అను-పానులు అర్థమును దెలిసి అనువగు చోట్ల జొప్పింప దమకపడవలయును. ఇట్టి నడక యందు ముందంజ వైచుట తల్లిబాసకు నిజమగు నూడిగమగును. దాన దమ ఎక్కటితనము, వలతి తనము వెలయగలవు. బాసయు బెడగ గలదు. "కృతకభాష" అను సడి తప్పును "జీవద్భాష" యన్న మేలిమాట నొప్పును.

వాడుక మాత్రమున నుండి, ఈవరకు కబ్బముల కెక్కని మాట లెన్నేని కడమవడి యున్నవి. కబ్బముల కెక్కని నుడులు నిఘంటువుల కందవు. ఇంత వరకు "శబ్దరత్నాకర" మొక్కడే తెలుగున ననుకొనదగిన నిఘంటువు. ఇది

సంస్కృతాంధ్ర శబ్దములం గూడినది. పట్టి అచ్చ తెనుగు మాటలం గూడిన "లక్ష్మీనారాయణీయము" గూడ నొక పాటిగ సెన్న దగినది. తెలుగు వ్రాయసకాండ్రకు, శబ్దార్థమునకై వెంపరలాడు వారికి, పై రెండు నిఘంటువులే ఏడుగడలయినవి. శబ్దరత్నాకరమున మొదట గ్రంథస్థములు కాక, వాడుకలో నుండు మాటలు కొన్ని కూర్పబడియుండెను. ఈ తరువాతి కూర్పులలో శబ్దరత్నాకరమున మరికొన్ని మాటలు చేర్పబడినవి, అవి ఆంగ్లాది విదేశీయులు ఉదా :- స్టేషన్, స్టీమరు, స్టోరు, గుమాస్తా, మనిషి—ఇట్టివి. ఇట్టి మాటలు కూర్పు కొరమాలినది. దీని ప్రయోజన మంతయు దోపము. కబ్బముల వాడక, నిఘంటువుల కెక్కక, వాడుక మాత్రమున నున్న తెలుగు నుడులు పెక్కు లున్నవి. నాడు నాడులు తిరిగి జనుల వలన దెలియదగినవి. ఇట్లు తెలిసి కబ్బములకు, నిఘంటువులకును ఎక్కించినచో నెక్కుడుగ నక్కరపడ గలవు. ఈ చెప్పిన వెరవున మాటల ప్రోవుసేయు జతనమే కానరాదు.

వ్యాసుని కూర్పునకు తిక్కన చేసిన తీర్పుం గూర్చి ముచ్చటించుటకు మున్న, తెలుగుసీమనాడులలో రూపుచెడి వాడబడుచున్న నుడులను తిక్కన రూపు చేసి తన రచనయందు జొప్పించె ననుటకు ముందుగా గొన్నిటి నిట జూపుదును.

వాడుక తిక్కన అర్థము వాడుసీమ

క్రాయ—క్రాయు = ఉమియు - కల్యాణలు, బళ్ళారి, అనంతపురము

శీమర్లు—చిరమరలు = చిక్కులు — మొలకసీమ నైజాం

పిట్ట-పిట్ట = మట్టిపెల్ల 1
ముట్టు—ముట్టు = వస్తువు 2 తెలుగుసీమలో పెక్కుచోట్ల

ఎదుగు-ఎద్దు = క్రమ్మ, వెన్నంటు నే. పడమటిసీమ నంతట నెల్లూరు, నైజాం.

భారతము మొత్తమున ప్రయుక్తములై, రూపుమారి వాడుక నున్న మాటలు మచ్చునకు :—

వాడుక భారతము అర్థము వాడుసీమ.

ఆమోయిన - అమ్మోయిన 4 = ఉన్నపాటున - తెలుగుసీను నంతటను.

ఉగెత్తులు-ఉవ్వెత్తున 5 = అడుగాన- పడమటి సీమలో పెక్కెడల, నెల్లూరు

ఎడారు - ఏడారు - ఎడరు 6. జడుపు- కర్నూలు, బళ్ళారి, అనంతపురము నైజాం.

పళి - ప్రయి 7 = నింద, సడి- నెల్లూరు. కడపలో కొంతభాగము.

నంజర - నంజుడు = మాంసము- కర్నూలు, నైజాం.

ప్రాయసకాండ్ర యాదరమునకు దూరమై వాడుకలో నున్న మాటలకు మచ్చుకు కొన్ని :

| మాట | అర్థము | వాడుసీమ |
|---|---|---|

నామర - సొంగెము = సంఘమర్యాద — పడమటిసీమ యంతయు.

దూదర - దూ, దూగర, పైరులకు బట్టు తెగులు-కడపజిల్లా (సామ్యము)

సంగెన = ఎక్కుడు- కర్నూలు, బళ్ళారి, అనంతపురము. నైజాము.

తిక్క - రాచు, రుద్దు, శగట = చకట్లు. అనంతపురము, కదిరి తాలూకా.

పల్లాపొద్దు - పల్లాపగలు = ప్రొద్దాక; పనార్లు = పనిచేటులు. పశ్చిమసీమ.

పంగెన=దెప్పుడు- ఒంకు=అరుగు. కర్నూలులో కొంతభాగము, నైజాము.

ఇంత చాలును, తెలుగు బలుపు తగ్గుటకు, దెలుగునుడులయెడ కవులు చూపుచున్న ఒప్పరికింపునకు నిదర్శనముగా పై పలుకులను దెలుపుచు కొంత కొమ్మదాట్లు వేయవలసి వచ్చినది. ఇక అసలు కత నందుకొందము.

## వ్యాసుని కూర్పు - ఏమరపాటు :

పట్టు: అర్ధమరేయి - వంటయిల్లు - వడముడి మైమరచి నిదురించుచున్నాడు. కీచకునిచే దన పడిన యగడు సైరంధ్రి భీమునితో దలపోసికొన వచ్చినది.

అడవులలో బెరిగిన మూడేండ్ల యీడుగల ఆవు తొలిమారు ఎదగొని పొగరుతో నున్న కోడెను దరిసినట్లు, నీరి చాయనున్న కొంగపెంటి కలయిక గోరి తన జోడు (పోతుకొంగ)ను జేరినట్లు, ద్రౌపది భీముం దరిసినది; గోమతీతీర మందలి మహాసాలమును తీగవలె పాండురాజు రెండవ కొడుకును పాంచాలరాజపుత్రి పొదివికొనెను; అట్లు అతని నిజబాహుయుగళిచే బొదివికొని, సులక్షణవతి యగు నా కృష్ణ, దారి తెన్ను లేని యడవిని బడి నిదురించు సింహమును సింహివలె మేల్కొల్పెను. కరిణి తన జోడు నట్లు శీలవతి యగు పాంచాలి భీమసేనుని గౌగి

లించి, వీణనుండి వెడలు గాంధార స్వరమువంటి మధురస్వరమున భీము నిట్లు సంబోధించెను.

"ఉత్తిష్ఠోత్తిష్ఠ, కిం శేషే, భీమసేన, యథామృతః
నామృతస్య హి పాపీయాన్ భార్యా మాలభ్య జీవతి."

(చచ్చినట్లు పరుండితివి, భీమసేనా, లెమ్ము లెమ్ము ! బ్రతికిన వానికి భార్య నగుదు నేని ఆ పాపి చావకుండునా !)

అని సైరంధ్రిచే వ్యాసుడు పలికించినాడు ! అదనున కనువుగా నడవనేర్చి నది. కొండవంటి తాల్మిగలది ! ఐదుగుర మగల వలపు సరిగా గడించినది ! కల కులలమియు యెలకువ గోల్పడనిది ! మగల వెంట వలచి సిలుగుల బడ నోపిన యిల్లాలు ! ధర్మరాజును మొదలుగా మగలను రాచరికపు నడకలం గూర్చి ఎచ్చ రింప గల వలతి. అత్తమది కెక్కిన కోడలు. ఇన్ని మేలిగొనముల నలరారు ద్రౌపది, కీచకుడు తన్ను బరచిన యారడి ఎరిగించి భీము నెసగొల్పి చలము దీర్చికొన బనివడి నగమురేయిని వంటయింటి కడకు వచ్చిన ద్రౌపది "భీమసేనా ! చచ్చినట్లు పరున్నావు లే లెమ్ము" అనుట అదనున కనువగునా ? ఆమె నడతకు ఉరవగునా ? ఆవు కొంగ సింహి ఏనిక తీవ ఉపమానములు పెంపునకే కాని సమయయోగ్యమా ! సరసమా ! వట్టి ఛాందస మనవలదా ! మరియు జూడుడు.

"ఇంత తొందరగా నిట కేమిపని బూని వచ్చితివి ?" అని భీముడు ప్రశ్నించినాడు. సరే అడుగదగిన మాటయ. పాంచాలి కైన పరాభవము నెరిగియు నిట్లనాలోచితముగ నడిగె నేల అన నక్కర లేదు. నిదురమబ్బున నడిగె నని, లేదా భుజబలమే కాని బుద్ధిబలము భీమునియందు తక్కువ యని సమాధాన పడ వచ్చును. పదంపడి, భీముడు 'నీ వన్నె మాసినది ! వెల్లనై యగపడుచున్నావు ! తేటతెల్లముగా నాకెల్ల నెరిగింపుము. అది సంతోషప్రద మయినదో, సంతాపకారణ మయినదో, ప్రియమో అప్రియమో నిజము నాకు దెలిసికొనవలయును. అంతయు విని తగిన వెరవు చేయుదును" అని భీముని నోర బలికించినాడు వ్యాసుడు ! ఒరు లెరుగకుండ మెలగవలసినవారు గదా ఈ దంపతులు ! భీముని పరున్న చోట దీప ముండెనే యనుకొందము ఆ దీపమును దూరమున నుంచియో ఆర్పియో చీకటింట నుండి గుజగుజలు వోయి యుందురు గాని తమ మరుగు పాటు బయల్పడు నన్న భీతిగలవారు దీపము వెలుగున. సుద్దులు సాగింతురా ? ఇందేమి ఔచితి కలదు ? సభలో కీచకునితాపు దిన్నపుడు పాంచాలిని భీముడు చూచెగదా ? అప్ప

టికి లేని వన్నెమాపు తెల్లబాటు క్రొత్తగ ఆమెయందు భీము దేది చూడ గలిగెను ? ఆ తాపునకు ఈ తలపోతకు దడ వెంత పట్టినది ?

తిక్కన తీర్పు :

తిక్కన ఈ పట్టును ఎంత కొలదిలో ముగించి ఔచిత్యము గాపాడెనో తిలకింతము. చెప్పవలయునది మానడు; మానదగినది చెప్పడు. అక్కరయయిన దానిని వదలడు; అనవసరమగు సోదెకు దిగడు. ఆవు ఎదగొని కోడెను గదిసె నని, ఆడు కొంగ మగకొంగకై వలపులాడె నని అక్కరమాలిన ప్రసంగమును గ్రుక్కక, సూటిగా పాత్రమర్యాదకును, పట్టునందలి భావమునకును ఒప్పిదమగునట్లు నాట్య కళా కౌశలముం గుప్పినాడు—చిత్తగింపుడు.

రాత్రిసమయం బగుటయు సమస్తజనంబులు గ్రమంబున నిద్రింపం దొడంగినం దాను శయ్యాతలంబు విడిచి మేనిధూళి గడిగి, ధౌతపరిధాన పరీతయై, మహానసగృహంబున సుప్తుండైన వృకోదరు కడకుం జని—

"నన్ను బరాభవించి సదనంబునకుం జని కీచకుండు ము
న్నున్నతెరంగు దపక సుఖోచిత శయ్యను నిద్ర సేయ, నీ
కన్ను మొగుడ్చు నూరటకుగారణ మెయ్యది, భీమసేన, మీ
యన్నపరాక్రమంబు వలదన్న నోకో దయమాలి తక్కటా !"

అనుచు మందమంద సంభాషణంబుల సంబోధించు పాంచాలిపాణిస్పర్శంబున మేలుకొని, "ఇది ఎవ్వరు" అనవుడు, "నేను" అను నమ్మానిని యెలుం గెరింగి, భీమసేనుండు "యాజ్ఞసేని కీచకు దురాచరణంబు నాకు బ్రకటించి, వాని నిర్జింప నియోగించునదియై యరుగుదెంచెం గావలయు ! అత్తెరంగు ఇత్తెఅవ తాన చెప్ప విందు" నని తలంచి,

"ఇంతప్రొద్దేల యిచ్చోటి కేగుదేర
గారణం బేమి ? యెవ్వరు గానకుండు
నట్లుగా జనుదెంచితె యంబుజాక్షి
అనిన నయ్యింతి యిట్లను నతనితోడ :

"ఎఱిఁగి ఎఱింగి నన్నడుగనేమిటి ! కిప్పు డెరింగి యింతకున్
మరచుట కల్గెనే నది వినంబనిలే; దటుగాక యున్న రూ

పెరిగియు, నేన చెప్ప విననిష్టము గల్గుట చాల లెస్స ! య
త్తెర గెరిగించెదన్ వినుము తెల్లముగా మొదలింటి నుండియున్.

అని యాతరువాతికత పలికించినాడు. ద్రౌపది ఇట్లు తనకథ చెప్పికొని వరుసను-

వ్యాసుని కూర్పు :

గుంతిపెద్దకొడుకు తొంటివైభోగము, ఇప్పటి పేదరికముం దలంచి పోల్చి పొక్కుచు పాంచాలి భీమసేనునితో వాపోవుచున్నది :

పదివేలఏనుగులను పదివేలగుఱ్ఱములను బంగారు చౌడోళ్ళతో దనవెంట నడవగా నూరేగు ధర్మతనయుడు నేడు జూదముతో బ్రతుకుచున్నాడే ! నూరువేల రథములు, అమితఓజస్సంపన్నుని మహారాజును యుధిష్ఠిరుని ఇంద్రప్రస్థమున గొలుచుచుండెడివే ! నూరువేలమంది దాసీలు ఎల్లపుడును రేయింబవళ్ళు తన (ధర్మసుతుని) వంటయింట వడ్డనపాత్రలు చేపట్టి అతిథులకు భోజనములు పెట్టుచుండెడి వారే !

ఈ తలపోతయందు కవితాకళ మూతిముడిచినది. వట్టిజాబితా తయారయినది. కేవలము మూలమునకు విధేయ మగుటచే

"పదివేల హస్తులు పదివేల హయములు
నెవ్వని వాకిట నెనసియుండు"

అని "శ్రీకృష్ణ భారతము" నను తెలుగింపబడినది.

తిక్కన తీర్పు :

"ఎవ్వాని వాకిట నిభమదపంకంబు
రాజభూషణరజోరాజి నణగు,
ఎవ్వానిచారిత్ర మెల్లలోకములకు
నొజ్జయై వినయంబు నొరపు గఱపు
ఎవ్వని కడకంట నివ్వటిల్లెడుచూడ్కి
మానితసంపద లీనుచుండు,
ఎవ్వని గుణలత లేడువారాసుల
కడపటి కొండపై గలయ బ్రాకు,

అతడు భూరిప్రతాపమహాప్రదీప
దూర విఘటితగర్వాంధకారవైరి
వీరకోటీరమణిఘృణివేష్టితాంఘ్రి
తలుఁడు కేవల మర్త్యుఁడే ధర్మసుతుఁడు !"

అని చక్కని చిత్తారిపనితనము జూపినాడు. వాచ్యముగ నుండిన దానికి వ్యంగ్య రూప మిచ్చి కవిత్వ మనిపించినాడు. స్థాయి నెరిగి, భావము నెరిగి, ఆలపించి జీవము పోసినాడు. వట్టిమాలజాబితాకు, ఒకపోతకు దెచ్చి, మేలిపూత యిచ్చినాడు.

ఈ పర్వమున మరొక పట్టు :

నాలుగవ ఆశ్వాసము : సాలంకృతుడు. సాయుధుడు, అర్జునుడు ఉత్తరుం దట్టి జడుపుబాపి నొగమీద కూర్చుండబెట్టి తాను రథియై కురుబలముం దరుము చున్నాడు.

తమ కురుసేనవంకకు వడిగా వచ్చుచున్న అర్జునుని రథధ్వానము వాతా వరణమునం దంతట గ్రమ్మినది. కౌరవులు అతని పతాకాగ్రముం గాంచిరి. అతని రథధ్వానమును, తరుచు మొరయు నతని గాండీవగుణ రవమును వినిరి. ఆ మహా రథికుని ఆ గాండీవధ్వనియు వచ్చుట గమనించి కాంచి ద్రోణు డిట్లనియె :

దూరమున బ్రకాశించునది యా పార్థుని కేతనాగ్రము. ఇది యాతని యర దము చప్పుడు. ఈ భయంకరముగ గర్జించునది అతని పతాకమందలి వానరము. ఆ వానరధ్వని సేనల నెల్ల సంక్షుభిత మొనర్చినది. ఆ రథశ్రేష్ఠమున నధిష్ఠించి యున్న యా మహారథికాగ్రణి మేఘగర్జాసన్నిభ మయిన గాండీవధనుష్టంకారము చేయుచున్నాడు. ఇది వ్యాసుని కూర్పు.

పూర్వార్ధమున దొలుత రథధ్వానము వినబడెనని, పిదప ధ్వజాగ్రము కన బడెనని, తరువాత గాండీవజ్యారవము వినబడెనని వైశంపాయను డన్నాడు. ఉత్తరార్ధమున తొలుత సిడము కనబడెనని, అంతట రథము చప్పుడు వినబడె నని, తరువాత గాండీవము నల్లెత్రాటిని మీటుచున్న అర్జునుడు రథమున గూర్చుండి యుంట యగపడె నని ద్రోణు డన్నాడు. ఈ వినబడుటలో కనబడుటలో గల వ్యాఘాతము లటులుండె. దూరమునుండి దొదవ్వుల జేరవచ్చు రథగమనమం దలి పరిణతిక్రమమా ఇది అని ప్రశ్న. వీరపురుషోచిత మగు శంఖారావ మిందు

లేదు. పోనిండు. అది పార్థుని కేతనాగ్రమని ఇది యతని తేరిచప్పు డని, అది యతని జెండాయందలి వానరగర్జ యని నిస్సంశయముగ చెప్పుచున్నాడే ద్రోణుడు! మరియు గాండీవధనుష్టంకారము సేయుచు నతడు రథమున గూర్చుండి యున్నా డనియు జూచి పలికినాడే! ఈ కూర్పున నేర్పరితన మేదేని గలదా? క్రమగతి పాటింపబడెనా?

చిత్తగింపుడు తిక్కన చిత్తారి పనితనము;

"శ్రవణపుటంబులు వ్రయ్యంగ దాకి సం
క్షోభంబు గావించె గుణము మ్రోత:
బ్రహ్మాండభాండంబు బగిలించి భూతని
కైచైతన్య మొనరించె శంఖరవము:
గగనభాగం బెల్ల గప్పి క్రాలుచు బెగ
డదరించె నుగ్రంపు బడగబలుపు:
మిరుమిట్లు గొని చూడ్కి పరివోవ వెలిగి ప
రిభ్రాంతి సేసె గిరీటకాంతి;
తెల్లమిది గాండివంబును, దేవదత్త
మును, గపిధ్వజమును, వాసవుని వరమున
గన్న మకుటంబు—నగు వేర కొన్ని యైన
నుజ్జ్వలాద్భుత భంగులై యున్నె యిట్లు!"

తొలుత అల్లెత్రాటి మ్రోత, దానివెంట శంఖధ్వని వినబడెను. అంతట పతాకాగ్రము మాత్రము; దానితో కిరీట కాంతులు మాత్రము కనబడెను. ఆ యల్లెత్రాటి మీట గాండీవముదే యని, ఆ చిందము మ్రోత దేవదత్తముదే యని ఆ పడగపబపు వాన రాంకమే యని, ఆ కిరీటకాంతులు ఇంద్రదత్తమగు మకుట ప్రసారితమే యని— వాని పావిత్ర్యములను, వైలక్షణ్యములను బట్టి యూహించి నిశ్చయించెను. చాలును-హృద్యమగు నీసందర్శనమును, కళాప్రవణతయును. ఇంతకన్న వాచ్యము చేయరాదు. ఆ కూర్పునకు ఈ తీర్పునకు గల తరుగు మెరుగులు రసలుబ్ధుల కూహ్యములు.

వ్యాసుని కూర్పు:

సంజయుని రాయబారము పట్టు: ధర్మరాజు మాట:

"కర్ణ శ్చ జానాతి సుయోధన శ్చ
ద్రోణశ్చ జానాతి పితామహ శ్చ,

అన్యే చ యే కురవ స్తత్ర సన్తి
యథార్జునా న్నాల స్త్యపరో ధనుర్ధరః.

జాన న్త్యేత త్కురవః సర్వ ఏవ
మే చాప్యన్యే భూమిపాలాః సమేతా,
దుర్యోధనే రాజ్య మిహో భవద్యథా
హ్యారిన్ద మే ఫాల్గునే విద్యమానే.
తేనానుబన్ధం మన్యతే ధార్తరాష్ట్రః
శక్యం హర్తుం పాణ్డవానాం మనుత్వమ్
కిరీటినా తాళమాత్రాయుధేన
తద్వేదినా సంయుగం తత్ర గత్వా.

గాణ్డీవవిస్ఫారిత శబ్ద మాజౌ
పశృణ్వానా ధార్తరాష్ట్రా ధ్రియన్తే;
క్రుద్ధం న చే ద్వీక్షతే భీమసేనం
సుయోధనో మన్యతే సిద్ధ మర్థమ్.

ఇన్ద్రో ప్యేత న్నోత్సహే త్తాత హర్తుం
మైశ్వర్యం నో జీవతి భీమసేనే,
ధనఞ్జయే నకులే చైవ సూత,
తథా వీరే సహదేవే సహిష్ణౌ.

ఈ క్రింది తెలుగు పద్యములలో పైవాని యర్థము సుస్పష్ట మగుట ముందటివానికిం బలె గద్యరూపమున వ్రాయమానితిని. పైవానియందలి భావమును జెక్కుచెదర నీయక తన మార్పున గూర్చి, అందలి నడలుబాటు ఇందు బొరయనీక, సుప్రసన్నముగా భావమును సాక్షాత్కరింప జేసినాడు తిక్కన. ఉపలక్షింపుడు!

తిక్కన తీర్పు :

ధర్మరాజు :

"చాపాచార్యుడు, భీష్ముడుం, గృపుడు, నశ్వత్థామయుం, గర్ణుడున్,
భూపశ్రేష్ఠుడు దారు మున్నెఱుగరేపో! రెట్లు గయ్యంబు; లా
శాపాశంబులు జుట్టలా వెరిగియుం జావేడి మార్కొందు! రిం
తే పో! తమ్ము గపిధ్వజప్రభల యందీభూ తలం జేయవే!"

"గాండీవజ్యారవం బుత్కటమయి పెలుచం గ్రమ్మినన్ భీము బాహా
దండం బేపారి శంఖధ్వన జెలియుచు రౌద్రంబుగా దోచినన్ వే
దండద్వందంబుమాడ్కిం దరిమి కవలు మాద్యద్గతిం దాకినన్, జా
కుంఠం బోకుండ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్లకుండన్."

పై నుదాహృతమగు వ్యాసకృత మూలమునకును, తిక్కన తెలుగునకును గల భేదము సవిమర్శముగ బరికింతము.

"కర్ణశ్చ జానాతి" అని వ్యాసుడు వాచ్యము చేసినాడు. తిక్కన దానికి, సంక్షిప్తపరచి, భావమునకు బుష్టి నిచ్చి, వ్యంగ్యపూర్వకముగా కవితాకళను సాధించినాడు. వ్యాసుడు, కర్ణుని, సుయోధనుని, ద్రోణుని, భీష్ముని వరుసగా జెప్పినాడు. కృపాశ్వత్థామల పేరెత్తడు! తొలుత కర్ణుని, పిమ్మట సుయోధనుని, తరువాత భీష్మద్రోణులను– నలువురను క్రమపరిచినాడు. దేనిని బట్టి ఈ క్రమము నిర్ణయించినటు? అధికారార్హతనుబట్టియా? ఔచితినిబటియా? ఎరుక గలవారిని బేర్కొనవలయునెడ ద్రోణ–భీష్ముల నుగ్గడించి తరువాత ఎవరినేని చెప్పదగును. సర్వ మెరిగియు దనవంతమే నెగ్గవలయు నను సుయోధనుడు హఠయోగి; కర్ణుడో రారాజు అడుగుజాడల బట్టి తన తోచినట్లు సూటిగా నడచు కర్మయోగి. ఇట్టి వీరిని ఎఱుకగలవారిలో దొలుతగా జెప్పుటయు నిజముగా ఎరుకగల ధర్మయోగులను– ద్రోణభీష్ములను– తరువాత చెప్పుటయు ఔచితి యనబడునా? ధర్మరాజు సంజయునితో వరుసగా నీ నలువుర నిట్లు నుడివె నని పురాణములపుట్టు వెఱింగిన బుద్ధిశాలురు వాదింప బూనరు గదా! అర్హతను, అధికారతారతమ్యములను, ఔచితిని బాటించియ కాబోలు– తిక్కన, ద్రోణ భీష్ముల తరువాత కృపాశ్వత్థామలను, పిమ్మట కర్మయోగిని కర్ణుని, పదంపడి హఠయోగిని సుయోధనుని బేర్కొన్నాడు! ఎరుకగల పెద్దలను వరుస బడి తెలిపి, ఎఱుగజాలని ఎరుగనొల్లని వారి నిద్దరను వాకొన్నాడు. ఎప్పుడు ఎక్కడ ఎవ్వడు ఎట్లు పేర్కొన్నను, చాపాచార్యునో శాంతనవునో– ఇరువురలో నొకని మొదల నిడి కృపాశ్వత్థామల నిద్దరనో అథవా ఒకరినేని, చెప్పి కడమవారిని వాకొనుచు గ్రమభంగము పొరనీయక మరియాద గాపాడు వాడు తిక్కన. వ్యాసు డిట్లు పాటించుట కానరాదు. చూడుడు ;

"ద్రోణుఁడు భీష్ముఁడున్ కృపుఁడు ద్రోణసుతుండును కర్ణ శల్యులున్
బ్రాణము లాసుయోధనుని పాలివ యండ్రు;"

అని రాయబారి సంజయుని నోరను —

"భీష్మద్రోణకృపాదిధన్వినికరాభీలంబు"

అని తత్తరపడుచుండిన ఉత్తరుని నోరను బలికించినాడు తిక్కన. అంతియకాదు- ఉత్తరగోగ్రహణమున కురుసేనం జూపి జ్ఞప్తియుంచుకొనుటకై పేర్వేర వరుస గిరీటి ఉత్తరకుమారునకు దెలుపుచున్నాడు.

"కాంచనమయవేదికా కనత్కేతనో
జ్జ్వల విభ్రమమువాడు కలశజుండు;
సింహలాంగూలభూషితనభోభాగకే
తు ప్రేంఖణమువాఁడు ద్రోణసుతుఁడు;
కనకగోవృషసాంద్రకాంతిపరిస్ఫుట
ధ్వజసమల్లాసంబువాఁడు కృపుఁడు;
లలితకంబు ప్రభాకలితపతాకావి
హారంబువాఁడు రాధాత్మజుండు;
మణిమయోరగరుచిజాలమహితమైన
పడగవాడు కురుక్షితిపతి; మహోగ్ర
శిఖరఘనతాళతరు వగు సిడమువాఁడు
సురనదీసూనుఁ డేర్పడఁ జూచికొనుము."

ఇందునను మెలకువ గోల్పడదు. కలనికి మొనగాడు కలశజుడు (ద్రోణుడు). అతని వెనుక అశ్వత్థామయు, నాతర్వాత కృపుడును నిలిచినారు. ఆ పిరుంద రాధేయుడు; పిమ్మట కురురాజు. దుముదారు దొర గాంగేయుడు. ఎత్తి పైబడవచ్చు. పగర నుండి ఏలికను గాచికొనుటకై, తమ్ము గడచి కాని సుయోధనుని దరియకుండ, ద్రోణాది కర్ణులు మొగాశమునను, భీష్ముడు వెన్నునను నిలిచినట్లు సంవిధానము. ఇది మూలము ననుసరించినదియు. పై సంఘటనమును మాతృకతో బోల్చి తిక్కన తీర్పరితనమును గమనింప బఠితకు వదలుదును.

మఱియు "గాండీవవిస్ఫారిత శబ్ద మాజౌ" అనిన పట్టున వ్యాస భగవానుడు "గాండీవగుణరావము ధార్తరాష్ట్రులు ఇందనుక వినలేదు గాన బ్రతికిరి. క్రోధావిష్టుని భీమసేనుని జూచినందాక తనపూన్కి సాగినదనియే సుయోధనుడు నమ్మియుండగలడు" అని మరల "భీమార్జునులును, వీరుడగు నకులుడును,

సహనశీలుడగు సహదేవుడును, సజీవులై యుండునంతకు ఇంద్రుడేని మా ప్రభుత్వ మును హరింపగలడటయా ?" అని యుధిష్ఠిరుని నోర బలికించినాడు. ఇందు కవితా కౌశల మెక్కడ ? పూర్వార్థమున గాండీవజ్యారవము జెప్పెను; క్రోధ మూర్తిని భీముని పలికెను. ఉత్తరార్ధమున భీమార్జునులను, నకులసహదేవులను రెట్టించెను. ఈ పునరుక్తికి బ్రయోజన మేమి ?

ఇక తిక్కన తీర్పు జిత్తగింపుడు :

"గాండీవజ్యారవంబు"తో మొదలిడి అర్జునుని పరాక్రమమును వ్యంగ్య ముగా సూచించుచు గదాదండమండితు డగు భీముని బాహాదండశౌర్యమును దెలిపి, నకుల సహదేవుల రణవిద్యాప్రవీణత నెరిగించినాడు. భావానుగుణమైన సన్నివేశసముచితమయిన వృత్తమును నడపినాడు. నలువుర అన్నదమ్ముల బల పరాక్రమ శౌర్యముల రీతులం గ్రమముగా బ్రకటించినాడు. తొలుత గాండీవ జ్యారవమును పలుమారు ఉత్కటముగా గ్రమ్మటయు, పిమ్మట బాహాదండ మేపారి ఝంభద్గద జడిపించుచు భీముని రౌద్రాకృతి తోచుటయు, పదపడి పేన్గుల జోడువలె దరుము నకుల సహదేవుల తాకుటయు జూపినాడు. అర్జునుడు శ్రవణ మాత్ర భయంకరుడని, భీముడు దర్శనమాత్ర భయంకరుడని, నకుల సహదేవులు సంఘర్షణమాత్ర భయంకరులని తారతమ్యములను వ్యక్తీకరించినాడు. 'క్రమ్మి నన్,' 'తోచినన్,' 'తాకినన్'—అని ధ్వని బ్రసాదించి మెరుగువెట్టినాడు. ఇది తిక్కన తీర్పు.

ఇట్టి పట్టుల నెన్నేని జూపనగును. సంగ్రహణమున నున్న పొగను సుగ మును సాగతీతలో నుండదు. ఐనను, కళాచాపల్యమున బడి మరొక్కదానినిం జూప నుంకింతును.

వ్యాసుని కూర్పు - స్వర్గారోహణము :

స్వర్గరంగము – ధర్మరాజు ప్రవేశము — తత్పశ్చిమభాగమున నాతని చిత్తవృత్తి బరిశీలింప గుతూహలు రయిన నారదాది మునుల ఆగమనము.

వైశంపాయనుని మాట :

"యుధిష్ఠిరుడు స్వర్గమున నడుగిడెను; ఐశ్వర్యసమగ్రుడై సింహాసనాసీను డయిన దుర్యోధనుని గాంచెను. ఆ దుర్యోధనుడు సూర్యునట్లు ప్రకాశించుచు వీర

పురుషస్వత్వమగు కీర్తిలాంఛనము ధరించియుండెను. అతడు దివ్యతేజస్సంపన్నులు శుభకర్మకరులు నగు సిద్ధాదిదేవతలం గూడి యుండెను. దుర్యోధనుని, అతని యైశ్వర్యమును జూచి యుధిష్ఠిరుడు కోపోద్రిక్తుడై చూపు మరల్చెను. యుధిష్ఠిరుడు స్వర్గమున నడుగుబెట్టగానే ఐశ్వర్యసమగ్రుడు ఉత్తమపీఠస్థుడగు దుర్యోధనుని గనె నని వైశంపాయనుచే బలికించి, 'సూర్యప్రభాకలిత' అని చెప్పించెను. ఆద్యంతములందు దుర్యోధనుని పేరు రెట్టించి చెప్పించెను: ఇందు నేర్పు పెంపు లేదు. కవితా - గానకళల జీవమంతయు ఎత్తుగడయందును, తీరుగడయందును నిక్షిప్తమయి యుండదగును. పై జెప్పిన ఉక్తి కేవలము వాచ్యము.

ఇక తిక్కన తీర్పు :

> "..........కట్టెదుర దోచె;
> నున్నతాసనాసీనుఁ, డభ్యుదితసరసి
> జాప్తసంకాశుఁ డమృతాశనాంగనాది
> వృతుఁడు, వీరలక్ష్మి విరాజితుఁడు, సతత
> యుక్తసుఖసాధనుండు దుర్యోధనుండు !"

కనబడెనని ప్రారంభించి, ఆ మహావైభవము నంత ఎఱిగించి చివరకు పేరు వెలువరించినాడు తిక్కన కవితిలకుడు ! ఇది తీర్పుగాదా ?

ఈ యదనున శబ్దప్రయోజనముదెస వ్యాసుని చూపునకు తిక్కన చూపునకు ఎంత వ్యత్యాసము గలదో స్థాలీపులాకన్యాయముగ నొకటి మూదలించిన జాలును.

ఈ స్వర్గారోహణమునను, వ్యాసుడు ధర్మరాజును 'యుధిష్ఠిరుడు' అనియే పెక్కెడల వాడినాడు ! తిక్కన ఈ పర్వమున నెక్కడను ఆ శబ్దమునకు జోటిచ్చినాడు గాడు. యుధిష్ఠిరత్వమునకు ఈ స్వర్గభూమి స్థానము గాదని, సమయమును గాదని తిక్కన కవి యెరుగును. ఇక్కడనే కాదు- ఏ పట్టున నేని తిక్కన పద ప్రయోజనము నెడ ప్రజ్ఞ కోల్పడె వని చెప్పనయితిగాదు. స్థానమును సమయమును గమనింపక వ్యాసుడు ఇచ్చవచ్చినట్లు వాడినాడు.

ఈభాగ మింతట గట్టిపెట్టుదును. నాటకశావిరచనమున, పాత్రసృష్టియందు బుష్టియందును వ్యాసునికి తిక్కనకు గల కౌశలభేదము ముందు మనవి చేసి కొందును.

అందచందంబులు బాటింపని యడవిపడుచుంబోలి వ్యాసుని రచనకు, తిక్కనకవి దగ్గరకు దీసి దిద్ది తీర్చి ముద్దుముచ్చటలం గూర్చి, మాటమలుపులు నేర్పినాడు. ఆత్మసంభూతమగు "భారత" సంతానమునందలి వివిధ వైలక్షణ్యాది చిత్తవృత్తులను చిత్రించినాడు వ్యాసభగవానుడు. దానికి, మెదిచి మెరుగు దిద్ది నాడు తిక్కనకవి; ఈ మారు, దిఙ్మాత్ర ప్రదర్శికముగా కతిపయ భారతవ్యక్తుల చిత్తవృత్తుల పరిణతిని పోలికగా మూదలింతును.

ఇట నొక మేలిమాట : నేడు, తెలుగుసీమయందు, ఆంగ్లరచనా సారస్వము నెరిగి, "భారతము"ను సంస్కృత రచనతో బోల్చి, తెనుగున సవిమర్శముగ జదివి సారస్యము, సంప్రదాయము బట్టిన కొలదిమందిలో దొలిమలిగా బేర్కొన దగిన నానెయ్యుని, శ్రీ నండూరి బంగారయ్య (రామచంద్రపురము-వకీలు) ను గూర్చి ఒక్క మేలిమాట.

ఈయన "భారతము నందలి వ్యక్తి చిత్రణములం గూర్చి కొన్ని వ్యాసములు ఈ "భారతి" ముఖమున వెలువర్చినాడు. అవి దుర్యోధన ధృతరాష్ట్ర కర్ణులం గూర్చినవి. భావసం. "ఆంధ్రపత్రిక" ఉగాది సంచికయందు "తిక్కన ద్రౌపదివర్ణనం" గూర్చినదియు వ్రాసినాడు. తన భారతపఠనము చరితార్థ మనిపించు కొన్నాడు. నా వ్రాయనెంచిన పద్ధతిని శ్రీ బంగారయ్యయే తొలిగా దొరకపుచ్చు కొన్నాడు. ఆయనది నాకు ఒరవడి యయిన దన్నమాట. ఆ గాడిని వైచి నావ్రాత నీడ్తును.

"భారతము" - నిష్పాక్షిక రచన :

కౌరవ - పాండవుల జననములు, నామకరణములు మొదలుగా నెల్ల విషయములను, తన భారత కృతియందు, వ్యాసుడు పాండవపక్షమునే వహించి వెలువరించెనని లోకసామాన్యమున వాడుక. కానది యట్టిది. కాని కళాకౌశలము నటుంచి, పాత్రసృష్టిని పరిణతిని సవిమర్శముగ బరికించు వారికి మాత్రమే, నిష్పాక్షికముగ నిర్వహింపబడెనని, అత్యంతము ప్రకృతి కనుగుణముగ మనః ప్రవృత్తులు సాదించు జతన మెంతేని గలదని స్పష్టము కాగలదు. వ్యాసభగవానుని భారతరచన అపూర్వ సృష్టియని, విశ్వకర్మ నిర్మాణము మీద జైత్రప్రస్థాన భేరి యని చెప్పవలయును.

రాలగుట్టలో రత్నము, పాలకడలిని కాలకూటము, చిమ్మచీకటియందు క్రొమ్మించు, విషసరస్సున తేనెకెరటము, మార్తాండునిపై మబ్బుతరగ, నరత్వ

మున మృగత్వము, మృగత్వమున నరత్వము, గుణసంపన్నత యందు దోష లేశము, దోషరాశియందు గుణలేశము—ఇవి వైపరీత్యములుగ దోచినను త్రిగుణాత్మక ప్రకృతికి బరమధర్మములు- నైసర్గికములు. వ్యాసభగవానుడు ఈ ప్రకృతి విలాసమును ఆవిష్కరించుటయే తన భారతకృతికి బరమప్రయోజనముగా భావించినాడు; కృతకృత్యుడైనాడు.

## చిత్తవృత్తులు :

పరమార్థచింతవెంట పక్షపాతమూలక కుటిలవృత్తి నెరసినది. ధృతరాష్ట్రునందు స్వాభిమానాది లుబ్ధత్వముల పొత్తున ఆత్మనిశ్చయముతోడి నిశ్శంక వృత్తి కాపుర మేర్పఱుచు కొన్నది. సుయోధను నందు అహంకారాది వికృతుల మీద కృతజ్ఞతాపురస్సర మగు త్యాగశీలము ప్రభుత్వము సేసినది కర్ణునందు. దయా — ధర్మపరత్వముల యందు మమకారమున నైన పామరత్వము పొదు కొన్నది పాండవాగ్రజునందు. ప్రాకృతిక రూపమున నప్రాకృతిక ప్రజ్ఞ జీవసూత్ర మయినది యాజ్ఞసేనియందు. అలౌకికజ్ఞానసమృద్ధి మీద లౌకిక కిరణములు ప్రసరించినవి భీష్మ - ద్రోణులందు. రుద్రాంశ విజృంభించినది సత్త్వసంభూతు డగు కృష్ణునందు. ఇట్లు సాగినది వ్యాసుని భారత సృష్టి.

ఈ నా వ్యాసమునకు ధర్మనందనుని చరిత్ర విషయము సృష్టికర్త వ్యాసుడు భారతము నందలి పాత్రలను గూర్చిన తెరగును, వానిని దీర్చిన తిక్కన కవి నెరవును ఇంత పరిశీలింతము.

## ధర్మజుడు - దయా - ధర్మ పరత :

ధర్మనందనుడు రెండవమారును జూదపుటురుల దగుల్కొన్నాడు; ఆడినాడు; అఖిలరాజ్యసంపద నోడినాడు. పదిరెండేడులు అలితో, అనుజులతో నడవుల గడగండ్ల కాపురము ముగిసినది. ఏడాది అజ్ఞాతవాసదీక్ష కరమవడినది. ఈ యేడు విరటుని పాల గడప నేర్పరుచుకొనిరి. భీముడు వంటలవాడుగ నుందు నని నంతనే ధర్మజుడు అనిలాత్మజుం గాంచి "తత్కాలజనితం బయిన భేదంబునం దొరగ నమకట్టు బాష్పజలంబులు మగుడ నుంకించుచు నిట్టూర్పు లడంచి ధైర్యం బవలంబించె." అర్జునుని వీక్షించి "ఘూర్ణమాన మానసుం డయ్యె." నకులుని కనుంగొని "నెమ్మనమ్మున నుమ్మలికమ్ము గ్రదుర నెలుగు చందంబు వేఱుగా" మార్చె. సహదేవుని నారసి "వగలు మిగిలి కొందల పఱుప" బడియె. "పాంచాలి

నాలోకించి భిన్నాంతఃకరుణు" డయ్యె. విరటనగరము జేర నరుగుచు నడవ జాలమి నీడిగిలం బడిన ద్రౌపది కడగండ్లకు—

"తనమది గరుణయు ఖేదం
బును బిరిగొనుచుండ" నకులుని జూచి
"ల తాతన్వి యిది : వడ గొనియె; మోచి తెమ్ము
కొంత దవ్వు" అనియె.

సవ్యసాచిం జూచి—

"ఇమ్మదిరాక్షి డస్సె! మనకీ నడుమం విడియంగ నొండు చో
టిమ్మను గాదు; నిక్కమున నేమును డస్సితి; మట్టుగాన, నీ
వెమ్మెయినైన దీని భరియించి పురంబు సమీప భూమికిం
దె" మ్మని నుడివె. ఇది దయాసారము.

కీచకుడు సైరంధ్రిం దన్నిట గాంచి ....పేర్చిన కోపాటోపంబున అవిచారిత వర్తనుం డయి వృకోదరుడు కీచకుం గీటడగింప జూచి, తత్సంబంధబద్ధుండును, ఆజ్ఞ పరిపాలకుండును గావున, మత్స్యపతిని దన యలుకలోనివానిన కాదలంచుచు అచ్చేరువ నున్న యున్నతవృక్షంబు నిరీక్షించి, ఆననంబు పల్లటిల్ల ధర్మతనయుం గనుగొనిన, అతడు తన నయనాకారంబున వారించి—

"వలలుం డెక్కడ జూచె! నొండెడ నసే వృక్షజముల్ పుట్టవే!
ఫలితం బై వరశాఖ లొప్పగ ననల్పప్రీతి నంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపగా
గల యీభజము వంటకట్టియలకై
ఖండింపగా నేటికిన్ ?
"అని నిగూఢభాషణముల నయ్యజాత
శత్రు డనిలజు కోపరసంబు పేర్మి
చెఱిచె.........."

ఇది ధర్మసమంచితమగు నతని కృతజ్ఞత. మఱియు—

"... రౌద్రరసము మనమున నడరంగ
బడగ యెత్తు నురగపాలురేఖ
నెనయు చేతిసారె గొని వ్రేసె బతి; 'పేడి
గడన యుడుగుమన్న నుడుగ' వనుచు.

"ఇవ్విధంబున (సారె) ప్రేటువడి యజాతశత్రుండు అలుకగదురని హృదయంబు తోడం బాంచాలి దెసం జూడ్కి మలగ నూరకుండె."

"ధర్మతనయుండు ఫణిహారితో నల్లన—

"ఇన్నెత్తురు గనుగొనిన బ్ర
హ్మన్నల కోపించు; నన్ను నతిభక్తిమెయిన్
మన్నించు గాన, రాజుం,
దన్ను విచారింప కేమి తప్పు దలచునో!"

"ఇది లెస్సగా దుడుచునంతకు దదీయప్రవేశం బించుకవడి వారింపుము."

ఇదియు కృతజ్ఞతాశీలము.

"ఆపద గడవం బెట్టను
నోపి శుభంబయినదాని నొడగూర్పను మా
కీపుట్టువునం బాండు
క్ష్మాపాలుఁడు నిన్ను జూపి చనియె మహాత్మా!"

అనుట తొలిగా

"ఇచ్చటి బంధులు, నీవును
నచ్చెరువడి వినుచునుండ నై దూళ్ళను మా
కిచ్చినను జాలు నంటిని,
పొచ్చెము గా; దింతవట్టు పూర్ణము సుమ్మీ!

"ఆ దుర్యోధను దంతమాత్రయును జేయం జాలడో కాని, పెం
పేదం గ్రూరత కోర్వరాదు; సిరి నాకేలందునేన్, గ్రాస-వా
సోదైన్యంబులు వచ్చు నా యరయు నాచుట్టాలకుం! గావునన్,
మోదం బందుట గల్గు గౌరవులు, నే
ముం బొంది శ్రీ నొందినన్.

"అక్కట! లాతులైన, బగతైనను జంపన కోరనేల? యొం
డొక్క తెరంగు లేదె! యదియొప్పదె! బంధు - సుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు! గణుతింపక సంపదకై వధించి దూ
తెక్కుట, దోషమందు టనునీ దురవస్థల కోర్వవచ్చునే!"

"కాన, నవశ్యము పెనకువ
గాని యుపాయమున బగలు గడతేర్చు ధృతిం
బూని నడచు నెవ్వఁడు; డెం
దానం జెయి పెట్టుకొని యతఁడు నిందించున్."

"కావున, శాంతి బొందుటయు కర్జము; దానటులుండె; శ్రీ
గావలె పంచు, బోరితము గామియు గోరెద, యెల్లసౌమ్ములుం
బోవుటయుం, గులక్షయము బుట్టుటయున్ వెలిగాక, నొండుమై
నే విధినైన జక్కఁవడు
టెంతయు నొప్పు జుమీ జనార్దనా!"

"మనమున బక్షపాతగతి మాదెస మానుము; ధర్మ - నీతివ
ర్తనములు; రెండు దిక్కుఁల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున, విదురాది సజ్జనుల బుద్ధికి రా, నుచితంబు తోడి మె
ల్పున, బరుసందనంబునను'భూపతులెల్ల నెఱుంగ నాడుమీ!"

"తగవున బోక రాజు బెతిదంబుల పల్కెన యేని సైచి యొ
ప్పుగ నిలుమీ! గురుత్వము బ్రభుత్వమునుం గల పెద్దవారి మా
ట గొనమి యా సుయోధను కడన్ నిలువన్, మనమెల్ల, 'గౌరవం
బుగ గురువృద్ధు పల్కుఁల, దలఫుం జన నిచ్చిన మెచ్చరే జనుల్ ?"

"సుతువాడై వినయంబు సేకొనక, యే చొప్పుం దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం డవినీతి జేసినను, సంధింపగ రా దంచు వే
గ తెగం బాఱకు! తెంపుసేయ నెడలోకం బెల్ల మెచ్చం బ్రకా
శిత ధర్మస్థితి నొంది మామనము నిశ్చింతంబుగాఁ జేయుమీ!

"మమ్మెఱుంగు; డెదరి నెరుగుడు;
నెమ్మి నెఱుగు; దర్థసిద్ధి నెటి యెరుగుదు; వా
క్యమ్ముల పద్ధతి యెరుగుదు;
పొ; మ్మెవ్వడ నేను నీకు బుద్ధులు సెప్పన్."

అనునందాక వెలువడిన మాటలు అతని పేరున కొప్పియున్నవి; తన్మనఃప్రవృత్తి నెరిగించుచున్నవి. పదంపడి—

హ్రదమున డాగిన సుయోధనుడు పగతుర రోసపుమాటల కోపక వెడలి వచ్చినాడు. భీమసేనునిం దలపడినాడు. గదాప్రయోగమున గౌశలము జూపినాడు. 'కేళీవిభ్రమము దోప గ్రేచ్చురికి, ఊర్ధ్వపరిభ్రమణంబు సేసి' భీము గదాఘాతంబున బెన్దొడలు విరిగి, 'నగాగ్ర ముద్భటపవిప్రహతిం బడు చాడ్పునం బడెను.' అతని జేర జని భీమసేనుడు— ధర్మనందన గోవింద పాంచాల ప్రకర పార్థ సాత్యకి నకుల సహదేవుల సమక్షమున——

"ఏకవస్త్రఁ బాంచాలి నట్టిడ్చి తేరఁ
బనిచి సభలోన బరిచిన పాపఫలము
ననుభవింపుము ! దుష్టాత్మ !" అనుచు వామ
చరణమున బెట్టిదముగాగ శిరము దన్నె !"

పదంపడి దెప్పుచు——

"మును మము గొడ్డు వోయిరనిముష్కరతం జెడనాడినట్టి దు
ర్జనుల ననిం గడంగి ధృతరాష్ట్రతనూజులు సైన్య బంధుమి
త్రనికరపుత్రకోటి సహితంబుగఁ, గీటడగింపఁ గంటి; మిం
క నమరలోకమైన, నరకంబయినన్ సరి మాకు నారయన్." 2

"అని గదఁ జేకొని, నృప, నీ
తనయుని మెడవట్టి యదిమి తలగ్రమ్మఱ ద
న్నిన, గని మును దన్నుటకు
న్మన మెరియ దదగ్రజుం డమర్షముతోడన్."

"తల యది యేల తన్నెద !ధర్మము నొందుట కాత్మ రోయగా
వలదె ! రాజరా, జనుజవర్గము, దక్కిన బంధుకోటియుం
గల పరివారముం దెగినగౌరవ మొందగ బోరి సంగర
స్థలమునఁ బడ్డ, నీతులువచందముచేత జనంబు మెచ్చునే !" 4

"మును లోకము ధర్మపరుఁ
డన బరఁగిన వాడ విట్టు లనుచితకృత్యం
బునకుఁ జనఁదగునే ! దీనం
గనియెడు ఫల మేమి ? దూష్యగర్వం బేలా ?

"అని దూటి దుర్యోధనుం జూచి బాష్పాకులలోచనుండై—

"విధి ప్రతికూలమై వేరంబు పుట్టించి
మాకు నీవును, మేము నీకు నలిగి,
ఇతరేతరద్రోహమతి గల్గి యింతలు
సేయుట గావించె! నీ యధర్మ
పరతయు మదము లోభంబును గ్రోధంబు
నిన్ను నింతకు దెచ్చె! నీ కతమున
నాకు బాంధవకుల నాశంబు వాటిల్లె!
ధృతరాష్ట్రు కోడండ్రు తీవ్ర శోక
కారి యయిన వైధవ్యంబు కారణముగ
నన్ను నిందింతురు!...." 5

అనుచు హృదయపూర్వక మగు కరుణముం గురిసినాడు. దయాపరుడు ధర్మసూనుడు. మృతబంధుల కెల్ల ఉదకప్రదానము ఇచ్చుపట్టున, కర్ణుడు తన తొలికొడుకని తల్లివలన విని ధర్మతనయుడు—

"ఘనభుజ విక్రమోన్నతు డుకౌరవ కోటికి బట్టు కొమ్మ, మ
మ్మనిశము దూల బుచ్చిన మహాత్ముఁడు, కర్ణుఁడు, గొత్తితొల్త చూ
లని యుదకప్రదాన సమయంబును నాయమచేత వింటి; నా
తని కుదకంబు లిచ్చుటకుదామము బంచుట గోరిచెప్పినన్."

"అని మొదలిడి వందురి, అమ్మపై గనిసి"—

"అంగనాజన్మములకు రహస్యరక్ష
ణంబు నందలి శక్తి మనంబులందు
గలుగకుండెడు మెల్లలోకముల"

నని శపించినాడు.

తన ప్రాపున వచ్చు కుక్కను వదలజాలక ఇంద్రునితో—

"భీమముఖ్యులును ద్రౌపదియుఁ జచ్చి;
రేను వారల విడువక యేడ్చుచున్న
వత్తురే! తోడ వచ్చి చావని శునకము
విడువకుండుట తప్పుగా నుడువదగునె!"

అని మఱియు,

"అనఘ చరిత్ర, విన్ము, శరణాగతుఁ జేసికొనకున్కి, శుద్ధమి
త్త్రునియెడ జేయు ద్రోహము, వధూటి వధించుట, విప్రునర్థముం
గొనుట, యనంగ గల్గునివిగూడి సమంబగు నాకుజూడ; భ
క్తు ననపరాధునిన్ విడుచు దోషముతో; నిది యోర్వవచ్చునే!"

"కావున నాకలోకపు సుఖం బటు లుండగనిమ్ము! దేవ, నీ
భావము నిల్పు నాదెస గృహాభరితంబు; సారమేయ సం
భావనసేత దోసముగ బట్టమి నాకు వరంబు! నీవు వా
మ్మావనభూమి నుండెద సమిద్ధతపంబున నిన్ను కొల్చుచున్."

ఈ ప్రకరణములు నతని దయా-ధర్మపరత్వములకు ఆదర్శములు.

కౌన్తేయాగ్రజుఁడు - నైతిక శీలము :

రాయబారిని సంజయుని సమర్యాదముగ నాదరించినాడు కౌన్తేయాగ్రజుడు. అతని తొలి పొగడ్తలు కూర్మితో విన్నాడు.

"ఆరాజు మాదెసంగల
కారుణ్యము కతముననె సుఖంబున నిట్లు
న్నారము; నిను బుత్తెంచిన
గారవమున నాదుమది వికాసం బందెన్."

అని నెక్కసపాటుతో పల్లవి యందుకొన్నాడు.

"అమ్మనుజేశ్వరునకు సే
మమ్మే! పుత్రకులు సుఖులే? మనుమలు సమ్మో
దమ్మున బెరిగెదరె? నగ
రమ్ముల భూములను శుభపరంపర గలదే?"

అని ఆనవాయితి చెల్లించినాడు. అంత —

"ద్రోణుండు, కృపుడుఁను, ద్రోణసుతుండును,
సుఖమున్నవారె? సుశ్లోకుఁ డయిన

భీష్ముఁడు కుశలమే ? పెద్దతనం బిచ్చి
యాతని గౌరవు లనుసరించి
మెలగుదురే ? బ్రాహ్మణులకు మన్నన గల్గి
యుండునే ? నే మర్థి నొసగినట్టి
వృత్తులు సెల్లునే ? ఒత్తారు వొందుల
వలన బుట్టదు గదా ? కలకులందు
బుట్టినప్పుడు గాండీవి భుజబలంబు
దలతురా ? భీమసేన గదావిహార
ముగ్గడింతురె ? కవలమహోగ్రరిపుల
భూము లంతంత కొత్తుట పొగడఁబడునె ?"

అని వారి క్షేమోదంతముల నారసిన ట్లున్నది. సుయోధనాదులు భీష్ముని నుదాసీన భావమున జూతురని, తమ (పాండవుల) దానముల నన్నిటిని కౌరవులు రద్దు చేసి యుందురని, బ్రాహ్మణుల నమర్యాదగ నెంచుచుందురని ఊహించి సంజయుని నోర నట్లు విన గుతూహలితు డయ్యెను. 'ఒత్తారు, నొందుల వలన బుట్టదుగదా ? కలకులందు...పొగడబడునే ? అని యడుగుటలో తన తమ్ములు లేనిచో వైరి రాజుల దాడులు తప్పవని, అట్టివాని నాకట్ట సమర్థులు తన తమ్ములే గాని బరులశక్తులని, కౌరవులు వట్టి దద్దమ్మలని ప్రజలు తలంచుచున్నట్లు విన గోరిక. స్వాతిశయమును నేర్పుగా గుశలప్రశ్నముల బొదిపినాడు. ఇది నైతిక చాతుర్యము.

పై బేర్కొనిన తన తమ్ముల బీరమున కీ క్రింది వాక్యము టిప్పణము ;

"ఒకనా డాతమ ముందటన్ బలుమలున్ హోరాటమై నేల యొ
త్తికొనంగ బవరంబులం గెలువగాఁ దెల్లంబుగాఁ జూచి పాం
డుకుమారాళి నుతింపకుందురె ? యాటోపంబునన్ ఘోషయా
త్రకు గంధర్వులు వచ్చినప్పటి చరిత్రం బాత్మలం బాయునే !"

మఱియు,

"వినుము మనము మధ్యస్థుల;
మని నర్జును నెదిరి, సంజయా, యిటము న్నె
వ్వనికిని మానము బ్రాణం
బును దగ దక్కించుకొనగఁ బోలెనె చెపుమా !"

తమ్ములయెడ వాత్సల్యము, వారి పరాక్రమములయందు విశ్వాసము, స్వాతిశయమును పెనగొని అతని నిట్లు పలుమారు అగ్గింపజేయుచున్నవి! తగవు పలికినట్లును ధనంజయుని మగటిమిని బొడగడినట్లును చమత్కారము చేసినాడు. ఇంత మాత్రమున దనివినక.

"జనులకు నెల్లను బత్యము
లనగా ధర్మానుగతము లగు నన బొగడం
జను పనులు సేయు భీమా
ర్జునులే దుష్కర్మములకు రోయని వారల్ ?"

"యోగ్యతతృష్ణదారు లుచితంపు గొలదియై
నడచినట్టివారు బెడిదములకు
నంత సొత్తు రెట్లు!...."

ఇంతనేని తృప్తిపడక—

"చక్రధరు లెక్కగొనఁడు! ప
రాక్రమనిధి యర్జునకు రాధేయ భుజా
విక్రమ మెదురుగ గొని ని
ర్వ్యక్రము చేసికొనువాఁడు రాజ్యం బెల్లన్!"

'పరాక్రమనిధి' అని కొసరు మొగ్గలతో సెలగ చేయియు నర్జునకు వైచి, బెదిరింపు సూచించుచు నిలువున దలయూచినాడు.

"చాపాచార్యుడు భీష్ముండు గృపుడు....ఇం
తేపో తమ్ము గపిధ్వజప్రభల యం
ధీభూతులం జేయవే!" అని,

"గాండీవజ్యారవం బుత్కటమయి పెలుచం గ్రమ్మినన్........చా
కుండం బోకుండ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్లకుండన్!"

అనియు బూర్తిగా బెదిరించినాడు. రోషావేశములు సుడివడి దూకిన భావఝురీ వేగము ప్రకటించినాడు. అందునను తమ్ములప్రతాపము జొప్పించినాడు. అంతలో సహజశాంతిప్రయత్నము నే నున్నా నన్నది. కావున,

"రణమున వారలం గెలువరాదనుపల్కు లటుండనిమ్ము, స
ద్గుణుడవు నీవు వచ్చితి; ప్రకోపవశమంబుగ బల్కి; తింత సై
రణ తగ సేయువారము పరాభవ మొందియు ముందు వారి దు
ర్గుణమును సైచు టీవు నొకకొంత యెరుంగుదు వింతయేటికిన్!"

"ఇంకను నట్లుకా తలపు; మేమొక కీడునకుం దొడంగ; మా
శంకలు దక్కి; మయ్యకు విచారము కల్గెనయేని బాంధవం
బంకుర మొత్త, మావలన
నక్కటికం బొలయంగ, మమ్ము నే
వంకకు బోవనీక గరువంబు జగంబు ప్రశంససేయఁగన్."

"రండని పిలువ బనిచి, పా
లిం డని కొడుకులకు జెప్పి ఇంద్రప్రస్థం
బొండెను, వెఱొకపట్టున
నొండె మా కిచ్చి యనుచు టుచితము కాదా!"

అని. తన యాక్రోశమంతను మూడవకాలముమీద ముక్తాయించి, శాంతితో స్థాయి దించి, పై యావర్తము కొనుగోలు కృష్ణుని కందించినాడు. అతడు పడ్జస్థాయి వరకు సాగదీసి సంచారము చేసినాడు. తనకు గడమ వడినమాటలు కృష్ణుని నోర బలికించుటచే బాండవాగ్రజుని నైతికకౌశలము వ్యక్తమయినది.

మొహటింప శక్యముగామి ఎవ్వ రెఱుగకుండ భీష్మనిం దరిసి——

"మా కెమ్మెయి సామ్రాజ్యము
సేకురు? నెబ్బంగి బహుళసేనోత్సాహ
వ్యాకులత రాక తక్కుం?
జేకొని యత్తెరగు కరుణఁ జెప్పగవలయున్."

అనియు

"చిచ్చరకన్ను మూసికొనిచేతి త్రిశూలము దాచి, లీలమై
వచ్చిన రుద్రు చందమున వ్రాలుదు వీ వనిలోన; నోర్వఁగా
వచ్చునె నిన్ను పెట్టిమగ వారికి! నీకృప నాశ్రయింపఁగా
వచ్చితి! మెవ్విధిం గెలువవచ్చు, మహాత్మ, యెరుంగఁజెప్పవే

ఇదియు నైతికప్రయోగము. యుధిష్ఠిరుని నైతిక చణత్వము చక్కగా వినియుక్తమయినది. మూలమున 'నిను జంపును సాయము దెలుపు' మన్నాడు. యుధిష్ఠిరుని తెనుగువాక్యము లీపట్టున మూలమునకు భిన్నము లయినను, మానవస్వభావమును, నేర్పును, ఔచితిని బ్రకటించినవి. అథఃప్రోక్తముం జూడుడు. ఇదియు నీతి ననుకరించిన సంధానము.

ద్రోణుడు దుర్వారపరాక్రముడు. మరి యర్ధ దినము అతడు రణరంగమున నిలుచునేని మనసేనల నెల్ల నూడ్చివేయునని, స్వరక్షణార్థము బొంకినను పాపము దొడర దని కృష్ణుని యుపదేశము. యుధిష్ఠిరున కురియాట యైనది. సూనృతవాది యని నమ్మి తన కొడుకు చావుబ్రతుకులం గూర్చి తన్నడిగినాడు గురుడు అంత—

"అనృతభయము, నాజిజయము
గొనియెడు తమకంబు పెంపు గుదియింపగ, బాం
డు నరేంద్రు నగ్రతనయుం
డనుమానము వాయ(బెట్టి యస్త్రగురునితోన్." 3

"వలయు కొలది యెలుంగెత్తి వర్ణ సమితి
యచ్చువడగ 'నశ్వత్థామ సచ్చె ననియె,
అని పదంపడి యల్లన అతని చెవికి
వినగరాకుండ 'కుంజర' మనియె నధిప." 4

యుధిష్ఠిరుని హృదయము సత్యనిష్ఠకును, జయకాంక్షకును సంగ్రామరంగమయినది. జయకాంక్ష బలవత్తరమై సత్యవ్రతనియతిని అడగ ద్రొక్కినది. ధర్మము తలమలచినది; నీతి నెక్కొన్నది. ఆడునది అనృతమని అంతశ్శుద్ధిగా నెఱిగియు 'కుంజర' మని గొణగనేల? ఈ గొణుగుటచే అచ్చము బొంకు కాదని తలంపా?

"జనసంపూజ్యపదారవిందు(డగు నాచార్యుండు శోకించి నం
దనుచా ప్పారయ వేడి, పెద్దయు ననుందా నమ్మి యర్థింప, జా
వనివానిం గరిచావు బుద్ధినిడి 'యశ్వత్థామ సచ్చెన్ నిజం'
బనియే బొంకితి! మేదినీభరణ మర్థ్యంబే గురుద్రోహికిన్!"

—శాంతి. ఆ. ౧

అని పశ్చాత్తాపపడినాడు గూడ. ఈ నీతికి కొతరత్వము తోడైనది. అసత్య మాడ గలంత సాహసము అతనిలో గొరవడినది. కక్కురితి! అలవాటులేని దొంగ తనము! నైతిక శీలమున కీమాత్ర వివరణము చాలును.

ఒక్క సమస్య :

ప్రకృతమున కంతసంబంధము కానిదైనను, విమర్శకుల సమాధానముల నర్థించి, మూలానువాదములయందు విరుద్ధముగా దోచిన సమస్య నొకదాని నిట వెలువరింతును.

యుధిష్ఠిరుడు అశ్వత్థామ సచ్చె నన్నాడు. పిమ్మట— తెనుగు "ఇవ్విధం బున బలుకుటయు—

"నేలకు నల్లెడు పొడవున
గ్రాలుచు మును మెరయు గురుని రథచక్రము ల
క్కాలంబున సమరజయ
శ్రీలోపము దెలియ నంటసిల బడియె నృపా."

అల్లెడు పొడవున గ్రాలుచుండిన గురు (ద్రోణాచార్య) ని రథచక్రములు నేలకు గదియబడినవట! కారణము తెలుపబడదు.

మూలము :

"తస్య పూర్వం రథః పృథ్వ్యా శ్చతురజుల ముచ్ఛ్రితః,
బభూవైవంచ తేనోక్తం తస్య వాహాః స్పృశన్ మహీమ్."

"నాలుగు అంగుళములు ఎత్తున నుండిన అతని (యుధిష్ఠిరుని) రథవాహనములు నేలకానెను" అని మూలము. ఈ శ్లోకము గల భారతప్రతి ముఖమునందలి పీఠిక యందు పరిష్కర్తలు వివిధప్రాంతములనుండి సేకరించిన అయిదు ప్రతులను పరికించి పాఠభేదములను గాంచి ప్రశస్తమయిన పాఠములను గ్రహించినట్లు వ్రాసిరి. తెలుగుపాఠమును బోషించు సంస్కృతప్రతికై వెదకితిని. ప్రాచీన ముద్రితప్రతులను మూటిని, ఆర్వాచీనప్రతులను రెంటిని జూచితిని. తెలుగు భారతములను - ప్రాత-క్రొత్తలను ఏడింటిని జూచితిని తెలుగు ప్రతులు- నే చూచినవి- అన్నియు బైతెలుగుపద్దెముతో నున్నవి. సంస్కృత ప్రతు లయిదును పైసంస్కృత పాఠముతోను యున్నవి. పదంపడి ఆంగ్లీకృత భారతము 2 జూచితిని.

ఈ యాంగ్లీకృతము సంస్కృతమునకు బరమవిధేయ మయినది; అందును పై శ్లోకార్థమే కనబడుచున్నది. ఇట్లు :

"Before this, Yudhishthira's Car had stayed at a height of four fingers' breadth from the surface of the Earth. After, however, he had said that untruth, his (Vehicle's) animals touched the Earth—"

ఆంగ్లానువాదము మాతృక ననుసరించిన విధేయతం దెలియుటకు పూర్వ శ్లోకముల అనువాదము సమోనా చూపుదును.

"Fearing to utter an untruth but earnestly desirous of Victory Yudhishthira distinctly said that Ashwatchman was dead adding indistinicly the word Elephant (after the name)—"

ఈ యనువాదకుడును బెంగాల్, బొంబాయి, బరోడా, దక్షిణహిందూస్థానము లోనగు ప్రాంతముల ప్రతులను సేకరించి పాఠభేదముల నారసి ఉచితము లని తోచిన వానినే గ్రహించి యనువదించినట్లు పీఠిక యందు దెలిపినాడు.

తెలుగున "రథచక్రములు" అని యున్నది. సంస్కృతమున (తస్య వాహాః' అని; ఆంగ్లమున 'his (vehicles) animals' అని వహించున వగుట తెనుగున రథచక్రము లన్నారు; సంస్కృతమున రథాశ్వము లన్నారు. ఈ విభేదము స్వల్పము. అంత పాటింపనక్కఱ యుండదు. చక్రములయినను. అశ్వములైనను నాల్గు అంగుళముల పైన నడచుచుండిన రథము నేల నానికొన్నది. సరి—ఎవరిరథము అనునది ప్రశ్న. సమరజయశ్రీలోపము దెలియుటకు గురుని రథచక్రములు (నేలకు) అంటసిలఁబడియె' అనిన తెలుగుపాఠ మంగీకార్యమా ? లేక, అనృతదోషమున పాండవాగ్రజుని రథవాహనములు 'స్ప్రుశన్ మహీమ్' (భూమిని స్పృశించె) అనిన సంస్కృతపాఠము ప్రశస్తమా ? మఱియు దెలుగు పాఠమునకు ఆకరము ఉండదనరాదు. తిక్కన ఏప్రతి నవలంబించెనో వెదకి పట్టవలయు.

ఇక ప్రధాన విషయము నందికొందము.

### పాండవాగ్రజుడు - పామరత్వము :

పాండవాగ్రజుని యందు ఆత్మస్తుతియు, పరనిందయు అటనట తలనూపుచు వచ్చినవి. అవి సంజయ రాయబారము నుండి కొంత స్ఫుటముకాఁ జొచ్చెను.

ఘోరతరరణరంగముల సంఘర్షణముల గాంచినాడు; విహరించినాడు. పరుల చావులకు వినోదించినాడు; స్వీయుల మరణములకు విలపించినాడు. ఏనుగు మీద నడచినాడు. హంస తల్పముమీద శయనించు రాచకొడుకులు ఆహవరంగమున వీరశయనమున నుస్కి చూచినాడు. జీవితము క్షణిక మని విచారించినాడు. హృదయవిదారకము లగు రోదనముల నాలకించినాడు. పరమపదించిన బంధుకోటి కెల్ల పారలౌకిక క్రియలు జరిపినాడు.

"మనకేటి రాజ్య ! మెండొక
జనపదమున కేగి భైక్ష్యచర్యానివిధి జీ
వనము నడిపికొనియుండుద !
మనఘా, యట్లయిన సుఖుల మగుదుము సుమ్మా."

"జ్ఞాతుల నందఱ జంపితి ! మది యాత్మ
వధమ కాదే ! రాజవర్తనంబు
గాల్పు ! మహింస నిక్కము తాల్మి మత్సర
వర్జన - మివి వనవాసజనుల
కాగమవిహితంబులటే ! ఇంత యొప్పునే !
వనమున వసియింపవలయు వింటె !
అసుఖదంబైన రాజ్యమిషంబునకు గు
క్కుల భంగి తమలోన గాటులాడి
కులము నెల్లను బొలియింప గుచ్ఛితంపు
బ్రదుకు వచ్చెనె యనువగ బాలుపడగ
బ్రమద మొసగదు త్రైలోక్య రాజ్యమైన !
గాన నే నొల్ల మహి మీర కైకొనుండు !"

అని చిత్తసంక్షోభమువలని వైరాగ్యమున బడినాడు. సన్న్యాసమే కోరినాడు. రాచరికమనిన క్రూరపిశాచముగ భావించినాడు. చేసేత చేసిన ఘోరకృత్యములకు ఉమ్మలించినాడు. రాజ్యముం గొని ఏలుమని నారదుడు చెప్పినాడు; వినడు. వంశకర్తయు నారాయణాంశభవుడు వ్యాసభగవానుడు బోధించినాడు; రుచింపదు. "విశేషించి మాకు నితని బుద్ధియు సమస్తపురుషార్థములకు మూలం బగుట, మాకు నితని వచనమ్ములు అవశ్యంబు అలంఘనీయంబులు" అని సంజయునకు గృష్ణుని జూపి పలికిన ఆ కృష్ణుదును పలువిధముల ఉపదేశించినాడు; నచ్చదు.

తమ్ములు జాలిగదుర పలికిరి; చలింపడు. చనువుమిగిలిన ద్రుపదాత్మజ సకరుణ ముగ వేడుకొన్నది; తలయేని ఊపడు. శరతల్పగతుని పితామహుని ఆత్మో త్క్రమణసమయము వరకు పొడిచి పొడిచి పృచ్ఛించి సమస్త ధర్మములను విన్నాడు; ఇంకను రాజ్యపరిగ్రహణమునకు మన సొగ్గదు! పోరాటముల వలన దొడరిన పాపముల నిస్తరింప నశ్వమేధముం దలపెట్టినాడు; కడముట్టినది. తుద కెట్లో బలవంతము మీది ప్రభుత్వమునకు బాల్పడినాడు. ఆత్మయందు తేజిత మయిన విరక్తి అప్పు - నాయనలలో నాశ్రమవాసమునకును పయనము గట్టించి నది. యాదవకులమున ముసలము పుట్టినది; కులమంతయు సర్వనాశనమయినది. కృష్ణభానుడు అస్తమించినాడు. నక్షత్రములట్లు తమ్ములు ఒకనివెంట నొకడు రాలి నాడు. ద్రౌపదియు దనువు జాలించినది. ఎల్లరీతుల పాండవాగ్రజుడు, పుటములం బడిన పుత్తడి యైనాడు. సంస్కార పథము బట్టినాడు, అపునరావృత్తికి అర్హత సంపాదించిన జాడ కన్పడెను. పిలుపు వచ్చినది; స్వర్గారోహణము నిరాఘాటముగ సాగినది. శ్వానరూపమున ధర్మదేవత చేసిన పరీక్షకు నిలువజాలినాడు.

స్వర్గలోక గర్భద్వారమును దాటినాడు. అట బంధులం జూడగోరినాడు. ఇంద్రుడు తగువానిని దూతను రావించి, ధర్మరాజున కతని బంధుల జూపుమని పంపినాడు. దూతతో ధర్మజుడు నడచుచున్నాడు. ధర్మతనయుని చిత్తసంస్కా రము నెఱుగు కుతూహలమున నారదాదులు పిఱిదిదెస నడచుచున్నారు. ఇట్లొగు చోట గట్టెదుర దోచె:

"ఉన్నతాసనాసీను, డభ్యుదిత సరసి
జాప్తసంకాశు, డమృతాశనాంగనాది
వృతుఁడు, వీరలక్ష్మీవిరాజితుఁడు, సతత
యుక్తసుఖసాధనుండు దుర్యోధనుండు." 1

ఇట్లొప్పియున్న యతనిం గని ధర్మనందనుండు (తన పిఱుద నడచుచున్న) దేవమునివరుని మొగంబు లాలోకించి—

"ఇత డతిలోభోపహతమానసుఁడు! దీర్ఘ
దర్శిగా! డితనికతమున జేసి,
నిఖిలదేశంబుల యఖిల నృపాలురు
ద్రుంగిరి; దంతతురంగసహిత

ముగ ! ననవద్యాంగి విగతకల్మష ధర్మ
చారిణి సాధ్వి బాంచాలి; నార్య
జనములు గనుగొన సభలోన నవమాన
పెట్టిన తులువ ! యే నట్టివాని
తోడ గఱసి మెలగుదునె ! మహితాత్మకు
లార, యెచట నున్నవారు భీమ
ఫల్గునులును గవలు బాంచాలియును; నన్ను
నచటి కనుపవలయు ననుచు మరలె." 2

మరలిన జూచి నారదుండు నవ్వుచు నతని కిట్లనియె :

"ఓధర్మనందన, ఈ ధరణీవిభుం
డాహవసంపరిత్యక్తతనుఁడు;
దేవతాసంభావ్యుఁడై వెలింగెడు; పుణ్య
కర్మలెల్లను గడు గారవింతు
రితని; నితండు మహీశుల నుజ్జ్వల
క్షత్రధర్మంబున గాదె త్రుంచె !
నది పాప మేలగు ? ననఘ, పాంచాలి యీ
తనిచేత బడుటయు దక్కఁగలుగు
నెగ్గులును నింక నిచ్చట నేల తలప ?
నిచోటు పుణ్యలోకము ! మది నీసు రోష
మను మనోవికృతులు దగునయ్య ! వాని
విడిచి సమత నొంఁదుము లోకవినుత చరిత !"

పై సన్నివేశమున పాండవాగ్రజుని మాటలలో అతని సంస్కారము నెల్ల ఈసు రోషము ఇంకించినవి. తన యున్నది స్వర్గమయ్యు దానుమాత్రము ప్రాకృతుడే ! వచ్చిన సుయోధను నెడ, అతని పక్షమువారి యెడ జలమే సాధించుచున్నాడు ! భావము పరిపక్వదశకు రాదు ! ధర్మోపదేశము లెల్ల శ్రవణమాత్రములే ! ఆత్మ కంటవు ! అనుష్ఠానమునకు రావు ! అసహనము - పామరత్వము స్వాభావికములు. తనవా రని, ఎదిరి యని భేదబుద్ధి తలగదు ! సుయోధనాదులు స్వర్గభోగము లనుభవించుచున్నారని తనవారు నరకబాధ లందుచున్నారని విషాదము !

"...దైవమకట! ఇట్లు
సేసెనే! కీడేమి సేసిరొకో వీర
లిన్నరకమునకు నేగుదేర
వలసినయట్టిది! వాసవాద్యమరులు
నీచులు వో! వీరి నే విచార
మించుకయును లేక యిట్టికష్టపు టిడు
మల బెట్టెడిదె! ధర్మమా తెఱంగు
మానితే నీవు! సజ్జనమాన్యు లలఘు
సత్యపరులు దయాఢ్యులు నిత్యదాన
రతులు బహుదక్షిణాంచితక్రమవితాన
పాలితాత్మ లనర్హంపు బాటువడిరి!"

ఇట్లు తనవారి నగ్గించుచు వాపోయినాడు!

"ఒకటను మేలుసేయని సుయోధనుఁ డెమ్మెఁ బు దేవపూజ్యుఁడై
సకలసుఖానుభూతియు నజస్రము పెంపు వహింప నొప్పి, దృ
ష్టికి గడు బ్రేకనై తనదుచెల్వులు చుట్టలు దాను సంతసం
బు కలిమి నేచి, మిన్నడిచిపుణ్యపరావృతుడై వెలింగెడున్!"

అని చూపోపమి కుళ్ళుపోతుతనము వెడలగ్రాసినాడు. తన వారిదెస తగులము వాయడు. ఎదిరిని గూర్చి జాలి గొనడు. స్వర్గ ప్రవేశము కూడ అతని స్వభావ మును మార్చజాలదైనది. స్వర్గంగా శుద్ధిస్నానముతో ప్రాకృతభావము నశించి ముక్తుడైనాడు!

ఈ విషయ మింతట సమాప్తము చిత్తవృత్తికి సంబంధించిన దగుట ధర్మజుని ద్యూతవ్యసనము నింత సూచింతును.

ధర్మజుఁడు – జూదరి :

ప్రాజ్ఞతవెంట పామరత్వము; విశేషించి జూదపుదగులము తొలిమారు జూదమున రాజ్య మోటువడినాడు. ద్రౌపది గోడాట చూడనోపక, వారు వీరు చెప్పి ధృతరాష్ట్రునితో రాజ్యము ఇప్పించినారు. రెండవమారు పిలిచినది తడవుగా దగుదు నని, మాయ జూదమన్న తెలివియేని లేక, మైమఱచి తరలినాడు. అతనికి జూదము ముందు బ్రహ్మానందము గూడ గవ్వకు జెల్లదు. నెత్తము మొదలయినది. అఖిల

రాజ్య సంపదల నొడ్డి యోడినాడు. అనుజులనోడి నాడు. ఆలి నొడినాడు. తన్ను గూడ గోల్పడినాడు. భూత భవిష్యద్వర్తమానములందు జూదగాండ్రలో దలకట్టు వని గర్వింపదగినాడు. ద్యూతలానత్వమున నిరుపముడు. రజస్వలను ఇల్లాలిని కొప్పుపట్టి యీడ్చి తెచ్చి తమ యన్నదమ్ముల యెదుట నడికొలువున బులుము లొలిపించిరి. అరణ్యమున అజ్ఞాతమున బెరపి పదమూడేండ్లు కడగండ్ల బ్రతుకు! అడవులలో పండ్రెండేండ్లు గడిపి అజ్ఞాతవాస దీక్ష జరుపుటకు విరాటనగరమునకుం బో నిశ్చితమైనది. విరటునిపాల, అన్నదమ్ములు ఏయే పనుల వెంట, మెలగ వలయుటయు నేర్పాటు జరిగినది.

ఆపట్టున—

"అతనితో నొక్కొకమఱి
కౌతూహల వృత్తికిం దగం దొడంగి మృదు
ద్యూతంబున గ్రీడింతుం
జేతోముద మొదవ నక్షశిల్ప ప్రౌఢిన్."

"మణిమయమ్ములు, కలధౌతమయములును, సు
వర్ణమయములు నాదిగా వలయునట్టి
యడ్డసాళులు గలవు నా కభిమతముగ;
వాని గొనిపోయి చూపుదు వసునతోడ."

"అడ్డసాళులు గలవు నా కభిమతముగ" నని మురిసి మురిసి చెప్పికొన్నాడు. తన యగచాట్ల కన్నిటికి గారణ మయినవి. పాచికలే యనిప తెలివిలేక, ద్రుపదరాజు బిడ్డకు తన ధర్మపత్నికి బరిభవకారణ మయినవి ఆలితో నను జాతులతో గూలి కొగ్గవలయు దుర్గతికి దెచ్చినవి పాచిక లేయని సిగ్గులేక, శ్రీమద్గాంభీర్యముతో 'నా కభిమతముగ నడ్డసాళులు గల' వని 'వాని గొనిపోయి చూపుదు వసుసతోడ' నని యనుచున్నాడే! "అతండు నానావిధములగు నక్షంబుల ముడికక్షం బున నిడికొని చని" నాడట! పండ్రెండేడులు భద్రముగా మూటగట్టి దాచుకున్నాడే! ప్రాణముల కన్న పాచికల నెక్కుడుగ దాచికొన్నాడు. పాచికల మీద ప్రాణములు సయితము బలదూ రనుకొన్నాడు.

విరటుడు వేడుకగ బ్రొద్దుపుచ్చుటకై (విరాటము. ఆ. ౫.) "సారెలు తెమ్మని పనిచి పలుక ముందటికి దిగిచికొనుచు, ఇందుర'మ్మని నపుడు, పాండ వాగ్రజుండు జూదంబాడుట ఎంత లెస్స" అని యుపొంగినాడు. ఏమాతని యుల్లా

సము! ఒడలు మఱచినాడు. ఆడగడంగునప్పుడు పూర్వస్మృతి ఇంచుక కలిగినది కాబోలు!

"జూదమాడి ధర్మసూనుండు రాజ్యంబు,
ననుజులను, బ్రియాంగనను బణంబు
గాక నొడ్డి యోడి కాఱియబడడె! య
ట్లగుట, దీనితోడి యర్థి కీడు."

అనుకొన్నాడు. కాని ఆగినాడా?

కొస ముచ్చట:

ఇట్లు చిత్రమైనది ధర్మరాజు చరిత్ర. ఇంతకన్న సూక్ష్మాంశములు తడవ నవకాశమున్నది. కాని కత పెరుగును. అతని చరిత్ర తెలుపుటకు జాలిన ముఖ్యాంశములను గొన్నిటి నేర్చి కూర్చితిని. తన కన్నసంతాన మెట్టిదయినను సమదృష్టితో నాదరించు తల్లింబోలి వ్యాసభగవానుడు పాత్రచరిత్ర నిర్వాహణమున నుదారతమై వర్తించె ననుట కీ ధర్మచరిత్ర చిత్రణ మొక్కటి చాలును.

—మున్నంగి శర్మ*

-------o-------

*భారతి అక్టోబరు 1934.

# నన్నెచోడుడు - వచనరచన

## 1

నన్నెచోడకవిరాజ విరచిత మైన కుమారసంభవ కావ్యరాజము ఆంధ్ర లోకముయొక్క దౌర్భాగ్యవశమున చిరకాలము మరుగుననుండియు, బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారి పరిశ్రమవలన వెలువడి విద్వజ్జనమనోహర మై ప్రకాశించుచున్నది. ఈకావ్యకర్తయగు నన్నెచోడుడు నన్నయభట్టారకునకు పూర్వుడనియు, క్రీ. శ. 940 సం.లో నితడు పాశ్చాత్యచాళుక్యులతో యుద్ధము చేసి, రణరంగమున నిహతు డయ్యె ననియు, తత్పూర్వము రాజపదభ్రష్టుడై యజ్ఞాతవాసము చేసి మరల లబ్ధరాజ్యు డై కొంతకాల మేలె ననియు శ్రీరామకృష్ణకవిగారు గ్రంథపీఠికలో వ్రాసిరి. శ్రీబుఱ్ఱాశేషగిరిరావుగారు రీకాలనిర్ణయమునుగూర్చి యింకను పరిశోధింపవలయు ననిరి. కీ. శే. తంజనగరము తేవప్పెరుమేళ్ళయ్యగారు కుమారసంభవకావ్యమును బలుమార్లు చదివినను నన్నెచోడుడు నన్నయ కీవలివాడే యను భావము దృఢపడినదని ఆంధ్రసాహిత్యపరిషత్తువారి మధురసభలో ప్రకటించిరి. కీ. శే. కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావుపంతులుగా రీనిర్ణయమునకు సమ్మతించిరి. శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగా రిట్టియభిప్రాయమునే తెలియజేసిరి. ఈకావ్యమును నాయోపినకొలది పఠించియు, దీనినిగూర్చి పండితులు, విమర్శకులు, వ్రాసిన వ్యాసములు చదివియు చర్చించి చూడగా నన్నెచోడుడు నన్నయకు తరువాతివాడనియే నాకు తోచినందున 1923వ సం.లో నేను ముద్రింపించిన గద్యవాఙ్మయచరిత్ర ప్రథమసంపుటము 23వపుటలో నిట్టియభిప్రాయమునే తెల్పి, తునిలో జరిగిన సాహిత్యపరిషత్సభలో ప్రకటించితిని.

పిమ్మట బ్రహ్మశ్రీ నడకుదుటి వీరరాజు పంతులుగారు కొవ్వూరులో జరిగిన సారస్వతసభలో నన్నెచోడుడు నన్నయకు పూర్వు డనిరి. ఆవెనుక తణుకు సారస్వతసభలో కూడా వా రట్లే తెలిపిరి.

బ్రహ్మశ్రీ జయంతి రామయ్య పంతులు గారును, బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారును వీరరాజు గారి హేతువులు సరియైనవి కావని ఖండించిరి.

ప్రస్తుతము మా ఎలమంచిలి బోర్డు హైస్కూలుప్రధానోపాధ్యాయులుగా నున్న బ్రహ్మశ్రీ వెంపరాల సుబ్రహ్మణ్యము పంతులుగారు ఆంధ్రేతిహాసపరిశోధక

మండలివారి పత్రికలో (పు. 144-43) నన్నెచోడుడు నన్నయకు పూర్వుడనియే వ్రాసిరి.

ఈవ్యాసము లన్నియు నాయోపినకొలఁది చదివితిని. అందలి విషయములను గూర్చి ఆయావ్యాసకర్తలతో కొందరితో చర్చించితిని. మఱియు గవర్నమెంటు శాసనపరిశోధకులుగా నున్న శ్రీకృష్ణమాచార్యులుగారు ఒకప్పుడు దానుర్లకోట రాగా వారితో కూడ నన్నెచోడునికాలమునుగూర్చి చర్చించితిని. ఈ కాలనిర్ణయమున కుపకరించిన శాసనములప్రతులను, వాటిపై వ్యాఖ్యానములను నాసేర్పుకొలఁది చదివి చూచితిని. కాని నాపూర్వాభిప్రాయమును మార్చుకోవలసినంత బలమైన సాక్ష్యము లభింపలేదనియే నాకు తోచుచున్నది. మరియు నీక్రింద వివరింపబడిన వచనరచనలను పరిశీలింపగా (చూ పుట 24 [illegible]) నన్నెచోడుడు నన్నయ వచనరచనల ననుసరించె నని నాకు దృఢముగా తోచుచున్నది.

శ్రీరామకృష్ణకవిగారు గ్రంథపీఠికలో "ఒకవేళ మనకవి ప్రాచీనుడు కాదయ్యె నేని కొరత యేమి? రత్నము లెందు నెప్పుడు పుట్టిన నేమి? చవులు గలవేని రాజభోగ్యము లగునుగదా? సర్వవిధముల నిరుపమానమగు నీకావ్యరత్నము కవి యెవ్వడైన, నెప్పు డుండినను సర్వజనాదరణీయమే" అని వ్రాసియున్నారు. శ్రీ వీరరాజుపంతులుగారును కొవ్వూరు సారస్వతసభలో చదివినవ్యాసములో "ఇవ్విధమున బలువురచే బొగడబడుచున్న యిమ్మహారాజకవి [illegible] యెప్పటి వాడైన నేమి? ఎప్పుడు నున్నవాడే? ఎప్పటికి నుండువాడే" అని వ్రాసినారు.

నిజము రసగ్రహణదక్షులై కావ్యామృతమును గ్రోలి యానందించువారలకు సాధారణముగా నట్లే తోచును. "కాలనిర్ణయమునుగూర్చి యెందు కీవాదప్రతివాదములు? ఎవరు ముందైన నేమి? ఏమి కొంప మునిగినది? ఉభయులు కవులే. ఉభయులకావ్యములు చదివి యానందింపరాదా?" అని యనేకులు ప్రశ్నించుచుందురు.

కాని చరిత్రకారుని కట్లనిపించదు. ఆంధ్రజాతియొక్క వాఙ్మయపరిణామము పరిశీలించువారికి ఎవరికావ్యము పూర్వమో, ఎవరికావ్యము పరమో, ఎవరిరచన లెవరి కెట్లు మార్గదర్శకము లయ్యెనో, ఏకాలపురాజకీయ, సాంఘిక నైతికాది విషయము లేకావ్యరచనమున కెట్లు హేతువు లైనవో, ఏకాలపువారి యుత్తమ భావము లేకవిరచనలో నెట్లు ప్రకాశించుచున్నవో గమనించుచు, విమర్శించుచు,

వాఙ్మయచరిత్ర వ్రాయబూను భాషాసేవకునకు కవియొక్కయు, కావ్యము యొక్కయు కాలనిర్ణయము మిక్కిలి యావశ్యకము. ఇందు కెంతటిపరిశ్రమ యైన కావలసియుండును. "మన నన్నెచోడు డెక్కాలమున నుండెనో నిర్ణయింపదగిన యాధారములు సంపూర్ణముగా లభింప వయ్యె. లోకములోని మహాకవుల గతు లన్నియు నిట్టే సందిగ్ధమతభేదముల పాలయ్యె. లోక మితనికవితాప్రభావ మిట్టి దని యెఱుంగ గాలోలు గాలము తనపట్టేడక మనల వంచించుచున్నది" అని శ్రీరామకృష్ణకవిగారు రెండవభాగపు పీఠికలో వ్రాసినారు కాని యింతవఱకు జరిగిన పరిశోధనలు, విమర్శనములు, చక్కగ నిష్పక్షపాతబుద్ధితో పరిశీలించి చూడగా ఇప్పటికి తేలిన పర్యవసానమునబట్టి నన్నెచోడుడు నన్నయకు తరువాతివాఁ డని నిశ్చయించుటయే సమంజస మని తోచుచున్నది.

## 2

నన్నెచోడునిగూర్చి ప్రశంసించునప్పుడు నాంగ్లవాఙ్మయపోషకుఁడు ఆల్‌ఫ్రెడ్ మహామహుఁడు స్మరణకు రాగలఁడు. ఉభయులును దేశాభిమానులే. ఉభయులు రాజ్యభ్రష్టులై కొంతకాల మజ్ఞాతవాసము చేయుచు దేశసంచార మొనరించి మరల రాజ్యముల బడసినారు. ఉభయులును గొప్ప భగవద్భక్తులు; గాఢమతావేశము గలవారు; పూర్వగ్రంథములను పఠించి స్వభాషలలోనికి పరివర్తనముచేసి శాశ్వతమైన భాషాసేవ చేసినారు. కాని రాజకీయములో ఆల్ఫ్రెడ్‌మహామహునకు గలప్రాముఖ్యము నన్నెచోడునకు లేదు. నన్నెచోడునకు గల కవితాప్రభావము ఆల్ఫ్రెడ్‌నకు లేదు. ఆంగ్లరాజు కేవల వచనగ్రంథరచయిత, నన్నెచోడుడు మహాకావ్యకర్త యైన కవిరాజు. ఉభయులు దైవభక్తి మతావేశము, గురుభక్తి విశేషముగా గల మహావిద్వాంసులు; నిష్కపటులు. కార్యనిర్వహణతత్పరులు. భక్తివినయసంపన్నులు. వీరివచనరచనలు స్వచ్ఛములు; సులభములు: సజీవములు; రసవంతములు; మనోహరములు. వీరికైతి శబ్దాలంకారభూయిష్ఠమై, అక్షరరమ్యత కలిగి, శ్రుతిసామ్య, వృత్త్యనుప్రాసాదిచమత్కారరచనలచేతను, సజాతీయపద రచనలచేతను లలితమై విన సొంపుగా నుండును.

ఆల్‌ఫ్రెడ్ మహామహుడు క్రీ. శ. 848 మొదలు 901 వరకు రాజ్య మేలెను. ఇతడు పోపు, గ్రిగరీ, బీడ్, బోథియస్ మొదలగు పూర్వక్రైస్తవాచార్యులు రచించిన మతగ్రంథముల నాంగ్లీకరించినాడు.

నన్నెచోడుడు 12-వ శతాబ్దివాడు. మహోన్నతాశయుడు. మనః పూర్వకముగా మతమునకు, భాషకు అపూర్వసేవ చేసినాడు. ప్రజల మతైకజీవనమునకు తనజీవితము సమర్పణచేసినాడు. అపూర్వకల్పనలయం దద్వితీయుడు. భావాంబర వీధిని నిరర్గళముగ విహరించిన మహామతి. నన్నపార్యుని పరిశ్రమచే పెంపొంది 'పార్వతీపతిపదాబ్జధ్యాన పూజామహోత్సవములతో' పూతమై ప్రవహించుచుండిన ఆంధ్రవాఙ్మయప్రవాహము నిరంతరాయముగా విజృంభింప జేసి 'హరిహరచరణారవిందవందనాభిలాషి యగు తిక్కనమనీషి' కందిచ్చిన పరమపూజ్యుడు. కావ్యము మతవిషయప్రాధాన్యము కలదైనను, అపూర్వకథారచనసమ్మేళనముచే సహహా యనిపించుచున్నది. వినువుగొలుపు వెట్టిప్రాతలు వ్రాయక మధురకథారచనము సాధనముగా గ్రహించి, ఈశ్వరభక్తిపూర్వకమైన శైవమతావేశక్రియాసంస్కారములను, హృద్యమై యద్భుత మొదవించు సౌందర్యకల్పనలతో రమ్యముగా కూర్చి, పాఠకులహృదయసీమలందు మరుపురాకుండా ముద్రింపగల్గినకళానిధి. మనకు తెలిసినంతవఱ కీతడే యాంధ్రమున ప్రథమరాజకవి. ఈతని కవితాసామర్థ్యమును బట్టి ఆంధ్రకవిసింహులలో నీత డొకయగ్రస్థానము నలంకరించుచున్నాడు. రాజకవి యనువిశేష మటుండ ఈతనికి ప్రకృత్యంశములయందు గల స్వతస్సిద్ధము నకల్పితము నైన ప్రేమయు, జీవితమునం దానందమును, అపూర్వమైన పరిశీలన శక్తియు సౌందర్యగ్రహణదక్షత్వమును, మతాదిసమస్తవిషయములను హృద్యముగా వర్ణించుచు రచించి చెప్పగల సహజశక్తియు, అద్భుతకల్పనాసామర్థ్యమును, అపూర్వకావ్యకళానైపుణ్యమును కలవా డగుట భాషలో నాచంద్రతారార్కము నుండదగిన దివ్యకావ్యరచనాకౌశలమును ఈతనికడ ముఖ్యముగా గమనింపదగి యున్నవి. విశేషించి నన్నెచోడునికాలమునాటికి, జైనబౌద్ధాది అవైదికమతములకును, శైవవైష్ణవాదిభేదములు గల వైదికహిందూమతములకును తీవ్రమైన యాఖరిపోరాటము జరుగుచున్నందున ప్రజాసామాన్యమునకు స్వమతవ్యాప్తి కావలయుననియు, తన్మూలమున తమమతములకు ప్రాబల్యప్రాధాన్యములు లభింపవలయు ననియు నాకాలపువిద్వాంసులు గాఢప్రయత్నములు సల్పుచుండిరి. పరమ శివభక్తుడగు నన్నెచోడుడు ఈశ్వరునిచే తన కనుగ్రహింపబడిన సమస్తశక్తి సామర్థ్యములను ఈశ్వరప్రీతికరముగ, శైవగురూపదేశక్రమమున శైవమతాచార వ్యాప్తికై వినియోగించి ఇహపరముల సాధించుటకై యీకావ్యరాజము రచించెనని చెప్పదగి యున్నది. ఈమూలముగా ఆంధ్రప్రపంచమునకు శైవోత్తముల యుత్తమభావములను, ఔత్సుక్యమును చక్కగా వ్యావర్ణింపబడినవి.

నన్నెచోడుడు ఈకావ్యమును స్వతంత్రముగ రచింపలేదు. ఉద్భటు డను కవిచంద్రుడు పూర్వమున సాలంకారముగాను, గూఢవస్తుమయకావ్యముగాను కుమారసంభవ మను సంస్కృతకావ్యము రచించి హరు మెప్పించె నని 1-21లో నన్నెచోడుడే చెప్పియున్నాడు. ఉద్భటుని కావ్యము చూచి నన్నెచోడు డీయాంధ్ర కావ్యమును రచించెను కాని యీకావ్యము బానిస-భాషాంతరీకరణము కాదు. కాళిదాసకృత కుమారసంభవము నీతడు చదువక పోలేదు. చదివి దాని కింకను వన్నె తెచ్చు పద్యములు కొన్ని రచించినాడు. స్వతసిద్ధమైన భావము లెన్నో కూర్చి యీరెండుకావ్యములకు తూచినట్లు సరిపడినపొందిక, చక్కనికథానిర్వహణ క్రమము, ప్రత్యక్షములా అనిపించు వర్ణనలు కలిగి కావ్య మెంతోరమ్య మై యొప్పారుచున్నది.

ఈ కవిరాజు మహాకావ్యదురంధరు లని ప్రఖ్యాతి గనిన సగర, భగీరథ, శ్రీరామాదు లుదయించిన సూర్యవంశమునందు, కాశ్యపగోత్రమున చోడబల్లికిని, శ్రీసతికిని కుమారుడై జన్మించి పెక్కుయజ్ఞములు చేసినట్లు చెప్పుకొన్నాడు.

ఈ కుమారసంభవము 12 ఆశ్వాసములు 2020 రచనలు గల పద్య గద్యాత్మకమైన చంపూకావ్యము. ప్రాచీనాలంకారికులు నిర్ణయించిన విధమున "అష్టాదశవర్ణనల పరిపూర్ణంబై, దశప్రాణంబుల సప్రాణంబై, నవరసభావ భరితంబై, షట్త్రింశదలంకారాలంకృతం బైన" దివ్యకథ. సప్తసంతానములలో కృతియే యుత్కృష్టము. గావున, తన గురువరప్రభావముచే తనకు లభించిన కవితాశక్తివలన 'సద్రసబంధురమై'న యీప్రబంధము రచించి యీతడు తనగురు వగు జంగమమల్లికార్జుననికే దీనిని వినయముతో నంకితము చేసి యున్నాడు. ఈపద్య మెంతోరమణీయముగ నుండుటచేత నీక్రింద నెత్తి వ్రాయుచున్నాను.

సీ. శరధినీరులు పయోధరములు కొనివచ్చి
 కురిసి వారధియందు గూర్చు నట్లు
చేనబండిన విత్తు చేనిక ఫలకాంక్ష
 బేర్మి క్రమ్మర వెదవెట్టునట్లు
రోహణాచలపతి కూహించి వరరత్న
 సంచయంబున విభూషించినట్లు
తీర్థాకర్షి ద తీర్థోదకంబుల
 నెసకంబుగా నర్ఘ్య మిచ్చినట్లు

నింగి ముట్టి యున్న జంగమ మల్లయ
వరమునందు గనిన వస్తుకవిత
దగిలి వారియంద నెగడింతు రవికి
దీపమున నర్చ లిచ్చు పగిది వోలె. —I-49

ఈతడు తన గురు వగు జంగమ మల్లికార్జునునకు, శివునకును అభేదము చెప్పి యున్నాడు. ఉన్నతగోత్రసంభూతుడ నని యీతడు చెప్పుకొనుట యటుండ, గురు దైవములకు భేదము పాటింపక, ఇట్టివినయముతో తనకృతిని గురుసమర్పణ చేసి యీకవి 'నతులగుచున్ మహోన్నతి తనర్చుచు' అను భర్తృహరి వాక్యమును సార్థకము చేసి మనకు పూజ్యు డగుచున్నాడు.

ఈతనియున్నతజన్మము, మహనీయశీలము వీరపురుషోచితగౌరవము, అపూర్వకార్యనిర్వహణకుతూహలమును, ప్రాచీనవాఙ్మయపఠనప్రాగల్భ్యము, స్వమతాభిమానావేశములు, నిరుపమానశౌర్యధైర్యములు, స్వార్థత్యాగము, అకాల మరణము దలంచుకొనినపు డాంగ్లవాఙ్మయపాఠకులకు సర్ ఫిలిప్ సిడ్నీ యను వీరవిద్వచ్ఛిఖామణి స్ఫురణకు రాగలడు.

భౌతికదేహము వీడినను, జగత్ప్రిత లగు పార్వతీపరమేశ్వరుల వివాహము, కుమారోత్పత్తి, తారకాసురసంహారము ననుముఖ్యాంశములు గల కుమారసంభవ కావ్యరాజ మాంధ్రభాషలో రచించి శాశ్వతయశోదేహముతో నొప్పారుచున్నాడు.

ఈకవిచంద్రుని వచనరచనావిధానమును పరిశీలించి, అందలివిమర్శములు గ్రహించి, ప్రాశస్త్యము నెరుంగ యత్నించుటే యిటుపై మన ముఖ్యోద్దేశము.

## 3

కుమారసంభవము పండ్రెండాశ్వాసములలో పద్యగద్యములమొత్తము సంఖ్య 2020. అందు వచనములసంఖ్య 595 అందును 'అంత', 'మఱియును' మొదలగు కురుచవచనములసంఖ్య 175. శతాంశరీతిని లెక్కించిచూడగా నూటికి 29 వచనముల రచించె ననియు, కుఱుచవచనములు నూటికి 9 కల వనియు తేలుచున్నది.

ఇక రచనలో వచనగ్రంథపరిమితి గమనించుచో, పండ్రెండాశ్వాసములు మొత్తము గ్రంథములో 8388 పంక్తులు గలవు. ఇందు 1295 వచనపంక్తులు

గలవు. అనగా నూటికి ఇరువదిపంక్తులు వచనము రచింపబడినదని స్పష్టము కాగలదు. నన్నయభట్టారకుడు రచించిన భారతపర్వములలో నించుమించుగ నగబాలు వచనమున్నట్లు కనుగొంటిమి. (చూ. ఆం. గ. వా. చరిత్ర 1-34. పుట) తిక్కనసోమయాజి నూరిటింట నొకపాలు వచనముల రచించెను. నన్నెచోడుడు ఐదింట నొకపాను మాత్రము వచనగ్రంథరచన చేసెను, సంఖ్యయందును, రచించిన వచనపంక్తుల పరిమితియందును గూడ నన్నెచోడుడు గద్యకు చాలతక్కువ ప్రాముఖ్యము నిచ్చినాడు.

నన్నయభట్టారకుడు ప్రతియాశ్వాసమునందలి రెండవరచన 'అక్కథకుండు' శౌనకాదిమహామునుల కిట్లనియె' నని వచనమే రచించెను. తిక్కనసోమయాజి కూడ ఆ పద్ధతినే యవలంబించి 'దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె' నని వ్రాసెను. నన్నెచోడు డానద్ధతిని వ్రాయలేదు. ప్రథమాశ్వాసమునందు 12 పద్యములైన తరువాతగాని యతడు వచనరచన కుపక్రమింపనే లేదు.

రెండవయాశ్వాసమునందు రెండుపద్యములతరువాతను, ఐదవయాశ్వాసనందు మూడుపద్యములతరువాతను వచనములు రచించెను. తక్కిన యాశ్వాసములలో రెండవరచన వచనమే యైనను అది నన్నయ, తిక్కనల రచనలవలె యొక్కటే మచ్చున నారంభ మగుట లేదు.

ఇక నేయేప్రయోజనములకు నన్నెచోడుడు వచనముల రచించుచుండెనో పరిశీలింతము.

ముందు చెప్పబోవున దేమో సూచించు నుపక్రమణశీలము లైన రచనలకు

1. 87- నాచెప్పం బూనిన దివ్యకథాసూత్రం బెట్టి దనిన.
2. పూర్వోత్తరకథాసందర్భములను చక్కగా కలుపుట కనువైన సముచ్చయార్థకరచనలకు : 'మఱియు', 'తదనంతరంబ', 'అంత'లో నగునవి.
3. పూర్వోదాహృతము లైన యంశములనే సంగ్రహముగా పేర్కొని యుత్తరకథావివరణము కుపక్రమించు సందర్భమున వచనములు రచింపబడుచుండెను.

చూ. 1 221 దక్షప్రజాపతి శిరచ్ఛేద మైన పిమ్మట నతనిభార్య "దొదరవడుగు లిడుచు దుఃఖాతిశయమున దల్లడిల్లుచున్న దక్షుధర్మపత్ని వచ్చి పురుషభైక్షంబు వేడుచు జాలదవుల నభవు మ్రోల బడియె."

222. ఇట్లనాథవృత్తి ననన్యశరణ్యమై శరణువేడు దక్షాంగనం గని.

4. ఆశ్వాసాంత గద్యం.

5. పట్టికలు ; ఏదేని యొకజాతి లేక గణమును గూర్చి ప్రశంసించునపు డం దలి యుపజాతులను వివరించి తెల్పుచు పట్టికలు రచింపబడినవి. అవి నన్నయభట్టారకాదులపట్టిక లంత దీర్ఘములు కావు.

I. 94. వేదండఘటలు : "అందమందమృగభద్రజాతి, గిరిచర, నదీచరోభయాచర దేవాసురాంశ, కలభ, కరేణు, ధేను, వమన, భిక్షపోతకాది వన్యగజయూధంబు."

6. వర్ణనలు: నన్నెచోడు డేదేని యొకయంశమును వర్ణించునపు డందలి వివిధాంతర్భాగములయొక్కగాని, ఉపాంతరగతులగాని పట్టికలు రచించుచు వర్ణించుట సాధారణముగా గమనింపనగియున్నది.

పార్వతి తపోవర్ణనము :

I 747. అట్లు గౌరినగంబునందు పరమేశ్వరుం గోరి ఘోరతపంబు సేయం దొడంగి వితతస్నానార్చనాహోమాది నిత్యకర్మంబుల, శాకాహార, ఫలాహార, పర్ణాహార, జలాహార, మారుతాహార, నిరాహారాది మహాతపోవ్రతంబుల, నందావాసాభ్రకవాసైకపాదాంగుష్ఠోర్ధ్వబాహూర్ధ్వముఖాధోముఖాగ్ని ముఖపంచాగ్నిమధ్యాద్యనేకోగ్రతపంబులం బ్రాణాయామప్రత్యాహారధ్యానధారణ, జపసమాధులను షడంగయోగంబుల, మనోవాక్కాయకర్మంబుల నితి నిష్ఠానుష్ఠానంబుల పరమేశ్వరారాధనతాత్పర్యయై నిరంతరానందతపోవృత్తిం బ్రవర్తించుచుండె నంత."

ఒకప్పుడు కవి తాను వర్ణింపబూనిన యంశములందలి యుపతరగతు లన్నింటిని వివరముగా పేర్కొనక, సంఖ్యాదికముమాత్రము సంగ్రహముగా పేర్కొని విడుచుటయు కలదు. II. 709.

"మఱియు భద్రమ్యాది నవవిధదంతవధలను, బృహృత్యాద్యష్టవిధహస్తవధలను భోక్త్రాదిపంచవిధగాత్రవధలను, బృహదాదిచతుర్విధరాతాదివధలను సంయోగవధ్యాద్యేకాశీతివధలను, వైహాయసాద్యనేకవిధగాత్రవధలను జతుర్బలంబుల నిట్లు వ్రచ్చి వధావధ సేయుచుండె."

ఇట్లే II. 703, 707 కూడ చూడనగును.

సృష్టిసౌందర్య విశేషములు.

**సముద్ర వర్ణనము, I. 116**

మహాపవనవిక్షిప్తజవపాత భీతాయాత క్షోణీధర పక్షవిక్షేప క్షుభితానేక నక్రచక్రతిమి తిమింగిల తద్గిలకుంభీర కుంభీనసాద్యనేక జలచరకులాకులితతలు లితాలోలకల్లోలాయమాన ఫేనాయమాన శుక్తిముక్తాఫలాభిరామంబు.

**హిమవంతుడు ; I. 262**

సకలసుగుణమణిగణంబులు నిజఘనమణిగణంబులతో బన్నసరంబులై వెలుంగునజాండకరండవద్భాసమానంబుం బోలె దేజరిల్లు ప్రాలేయ కుత్కీల చక్రవర్తి.

అందుపై శిష్యపరిసమాప్తస్థానము . I. 339;

సహకారకదళీలవంగకేతకీసమేతపనసప్రియమందారపారిజాతజంబూ జంబీరాశోకానోకహంబులు నవాంకురంబులై నానావనంబు నిరంతరోపార్జితానంతపుణ్య ఫలంబునుం బోలె సకలజీవలోకాకర్షకంబై సమాధిస్థానంబుగా స్వీకరించి.

**స్త్రీపురుష వర్ణనలు :**

పార్వతి. 1. 322.

అఖిలలావణ్యసృష్ట్యధిదేవతయు, విశేషసౌభాగ్యలక్ష్మియు నపారగుణమణి గణభూషణావర్ణనీయమతియు నిఖిలభర్తృహారికావిమలముక్తాఫలహారతరలసరసీ రుహ రాగరత్నంబునుం బూర్ణయౌవనాలంకృతయు నై యొప్పుచున్నపార్వతి.

మునికుమారులు : 1-709.

పత్ర. పుష్ప, ఫల, మూల సమిధాకారవల్కవేధ్మకుశాహరణార్థము విహ రించుచున్న మునికుమారులు.

మునిముఖ్యులు : 1. 735.

అనేకప్రకారంబుల వేదశాస్త్రపురాణాగమసారవృత్తాధ్యాత్మశాస్త్రవిధి హేయోపాదేయపదార్థంబుల నిజశిష్యగణంబులకు విస్పష్టంబుగా వ్యాఖ్యానంబు చేయుచున్న మునిముఖ్యులు.

ఇట్లే రమ్యదీర్ఘసమాసఘటితములు, నానావిధశబ్దాలంకారభూషితములు నగు వర్ణన లనేకములు గలవు, చూ. స్కందుస్కంధావారావర్ణన II. 603, 21;

కుమారునిపట్టాభిషేకము II: 472, 75, 77, 79, 81; ఇట్టిచోట్ల కేవల పద్యములు గాని, కేవలవచనములు గాని యున్నచో విసువు పుట్టవచ్చును. చదువరుల కట్టి ప్రయాసము లేకుండ పద్యగద్యము లొకదానివెనుక నొకటిగా రచింపబడుట గలదు. చూ. యుద్ధవర్ణన.

7. కథావివరణ రచనలు : ఈ కవిసింహుని రాజధాని యైన ఒరయూరుసమీపమున ప్రవహించు కావేరీస్రవంతివలెనే యీతని కథా వివరణరచనలు మృదుమధురరసభావభరితములై మసలుట లేక మంచివడి గలిగియుండును.

మునిపత్నులు : II. 412. ఇట్లు ధర్మచారిణులు నిజాధీశ్వరులచేతం బరివర్జితలై మాఱువలుక నోడి పరమేష్ఠిపాలికిం జని యపకామకకృత దోషంబులం బతులచేతం బరిభవింపం బడితి మని విజ్ఞాపించినం జతురాననుండు తద్వృత్తాంతం బెఱింగి పతివ్రతావృత్తియందు బ్రతభ్రష్టలైనను నిష్కామపూర్వంబు ధరియించిన పుణ్యఫలంబున జ్యోతిర్లోకంబునం గృత్తికలై ప్రవర్తింపు డని వరంబుగా విరించి కరుణించి నియమించిన మహాప్రసాదం బని పుణ్యగతికి నరిగిరి.

8. సంభాషణార్థములు: వర్ణనాదులయందు వలె నీరచనలు దీర్ఘసమాసభూయిష్ఠములు కావు. కాని శబ్దాలంకారములయందు కవికి గల నైసర్గికాభిమానము చేత నిండుకూడ వృత్త్యనుప్రాసములు, సజాతీయపదరచనలు విశేషముగా కనబడుచున్నవి.

I. 176. దక్షుం డందర నాక్షేపించి "మీఁదు భిక్షువలని భయంబువదాక్షాయణీపక్షంబునం బలికినం గర్మబాహ్యుం డగు పాషండుడు పూజ్యుం డగునే—ఇందు 'క్ష' వృత్త్యనుప్రాస మటుండ భిక్షు, భయము, పక్షము, బలికి, బాహ్యుడు, పాషండుడు, పూజ్యుడు. అనుశ్రుతిసామ్యము కూడ గమనింప దగినది.

I. 409. ఇంద్రుండు ప్రార్థించిన నప్పని గైకొని "నా కిది యేమి గహనం బ"ని దర్పకుండు దర్పించి.

10. నానావిధములు : ఈరచనలలో పైని వివరింపబడిన రచనలలో రెండు గాని, అంత కెక్కువ సంఖ్యగలవి గాని వివిధ—తరగతులరచనలు పెక్కు చేరి యుండును. చూ. II. 92.

ఈశ్వరుడు హిమవంతునిపురమున ప్రవేశించుట.

"పరమేశ్వరుడు పౌరజనంబుల నయనేందీవరంబుల నిజాననేందుచంద్రికా జాలంబుల నలంకరించుచు తదీయావలోకసామృతనయనకలశంబు లాత్మీయదయావలోకనామృతానందరసాపూర్ణంబు సేయుచు విపణిమార్గంబు గడచి ప్రాలేయాచల చక్రవర్తి రాజమందిరంబు ప్రవేశించి తదంతఃపురాంగనాద త్తపంచమణిశేషాక్షదా కలితోత్తమాంగుం డగుచు జనుదెంచి కనకమయరమ్యహర్మ్యమణిభద్రంబున రుద్రుండు వృషభేంద్రుం జేర్చి డిగ్గి నగపతిద త్త సముత్తుంగమణిసింహాసనాసీనుడయ్యె నంత హిమవంతుండు మృదునడుగులు గడిగి తదీయామలజలపవిత్రీకృతాత్మీయపంచమందిరాభ్యంతరుం డై పరమానందంబున.

ఇందు సందర్భోచితవర్ణనలతో గూడిన కథావివరణము కలదు.

4

శైలియందు గమనింపవలసిన విశేషములు.

నన్నెచోడునిరచనలో ముఖ్యముగా చూపట్టునది జాతీయపదరచన. నన్నయభట్టారకుని రచనలలో నిట్టివి లేకపోలేదు. (చూ. ఆం. గ. వా. ప. 1, 96) కాని నన్నెచోడునిరచన కిది యొక ముఖ్యలక్షణ మని చెప్పవలసినంత లరచుగా నగపడుచున్నది.

I. 51. దివ్యకల్పంబు కల్పించు మహాకవి ముఖ్యుడు.

I. 146; II. 327, అలంకారాలంకృతము.

I. 219. నారకోచితదండంబుల దండించి.

I. 585. దహనదాహము.

I. 316, 262, 866, Etc. వర్ణింపదగిన వర్ణనలు,

II. 4. లక్షలక్షిత; 498 నియోగమునకు నియోగించి 621. సర్తకినర్తనస్థానము. Etc.

మరియు రచించునపుడు మొదట నొకశబ్ద ముపయోగించెనేని యాశబ్దమే ఆవాక్యములో పలుమరు దొరలునట్లు ఏర్పికూర్చుటయం దీకవికి మిక్కిలి యభిలాష కలదు.

1. 123: అశేషవిశేషంబులు విశేషించుచు.

1. 366, వాక్పతికి బృహస్పతి.

I. 381. శృంగారయోని శృంగారరస.

I. 363. మోహనాయుధుడు వజ్రాయుధు నాస్థానము,

I. 386, 410; సురరాజు వలరాజు సుందరాకారము.

సురపతికి రతిపతి

I. 405. సురవల్లభుడు రతివల్లభునకు.

I. 451. నాగాభరణు నాగబంధంబున స్తుతించె.

I. 535, 813. గిరిశుండు రజతగిరి కరిగిన గిరిజ.

I. 224. చతుర్ముఖుండు పంచముఖున కభిముఖుం డై.

శబ్దాలంకారములు :

"అక్షరములు సూక్తు లార్యులకు కర్ణరసాయనలీల గ్రాలగా" రచింతు నని ప్రతినపట్టి (1-35) కావ్య మొనర్చినవా డగుట. ఈకవిరచనలలో నేదేని యొక శబ్దాలంకారము జూపట్టని పంక్తు లించుమించుగా లే వని చెప్పవచ్చును.

ఛేకానుప్రాసములు :

I. 143. కలకలప్యాది; 550. చలచలం బగునడలది.

I. 581; 926. రణరణకవ్యథ; I. 587 కందెర దెరచిన.

I. 905. లీయమానమానస: II, 209. ప్రభుప్రజావప్రసరము; 389, బేటచేటంబు. 998 విక్షతక్షతజాతము; 981 తిగ్మకరకర ప్రహతి. Etc.

శ్రుతిసామ్యము :

I. 146. విధివిహితవిధానము; 206. కానక కాందిశీకులై కనుకనంజని II. 84ర. పరిమితపరివారపరివృతుడు. II. 394. విభూతివిశేషరమణీ యంబులం గని విస్మితు లగుచు.

I. 474 స; 484. ద; II. 4. ము; I. 333 'శ' 866 ప్రళయ నిర్ఘాత; ప్రతిధ్వనులు; ప్రేకిపడ. Etc.

వృత్త్యనుప్రాసములు :

ఈతని వృత్త్యనుప్రాసములలో 'న్త' వృత్తి బహుప్రాయికముగా కాన వచ్చుచున్నది. 1. 780, అంతం బార్వతి వసంతానంతలతాంతసంతతి నంతకాం తకాక్రాంత పూజాత్యంతహోమాదిక్రియలం బ్రవర్తించుచుండు నంత. ఇట్టిరచనలే.

I. 193, 527, 535, 593, 929, 802, 808.

II. 2, 326, 406, 645, 714, 941, 811 సంఖ్యలు గల వచనములలో నగపడుచున్నవి.

'క్త' I. 349, 73, 239 లోను,

'ఛ' I. 239. 11, 998 లోను,

'న్ద' I. 364

'ట' I. 366 లోను వృత్త్యనుప్రాసము లున్నవి.

'ట' 'శ' I. 898 ఇట్టివింక ననేకములు గలవు.

యమకాదు లైన మరికొన్నిశబ్దవృత్తులు.

I. 416. దుర్ణిమిత్తంబులు నిర్ణిమిత్తంబు వుట్టుట.

I. 577. మరణపరిచ్ఛేదంబు విచ్ఛేదంబు జేసి.

II. 945. సిద్ధుల నప్రసిద్ధులం జేసి సాధ్యుల హేలాసాధ్యులం జేసి విద్యాధరులంచ్ఛిధరులంజేసివియచ్చరులలియచ్చరులంజేయుచు. ఇట్లే II. 808.

11. 862. ఇట్లఖిలామరవరమదవారణుం డగు తారకాసురమదవారణుం డై తదీయమదవారణవారణుం డై వెలుంగు కుమారుం గని.

ఈ కవికి శబ్దాలంకారముతో కూడిన రచనలు కూర్చుటయం దెంతయిష్టమో పైయుదాహరణములవలన తేటపడ గలదు. చెప్పవలసినయంశము సులభమును రెండుమాటలతో చెప్పుట సాధ్య మైనను శబ్దాలంకారముతో రచించుట కెన్నిడొంక లైన తిరిగివచ్చును. తలకు చెయ్యిచుట్టి ముక్కు చూపును. (చూ. II. 941) జంభాసురుని కొల్చు యోధులందరు చచ్చి రని వ్రాయక, "నిజానంతసామంత సంతానం బంతయు నొక్కట కృతాంతనికేతనాంతర్గతు లగుట గని" అని వ్రాసినాడు. 'న్త' అను వృత్త్యనుప్రాస రచనమునకై ద్రావిడప్రాణాయామము చేసినాడు.

నన్నయభట్టు - నన్నెచోడుడు :

నన్నయభట్టు రచించిన వచనములంబోలు వచనములు కొన్ని నన్నెచోడుని రచనములయం దగుపడుచున్నవి.

## 5

నన్నయ్య. ఆది. 4, 141 గంగానదీతరంగముల వర్ణనలో "అవిలాలోల కల్లోలతిమాలాస్ఫాలన."

నన్నెచోడుడు 1. 116 "అనేకజలచరకులాకులితలులితాలోకలకల్లోల నుఫేనాయమాన."

ఈరెండురచనలయందును జలతరంగజాలము వలెనే సరళలకారము దీర్ఘమగుచు, హ్రస్వ మగుచు, సున్నిత మగుచు, మేళవించుచు, ముందునకు సాగిపోయి తుదకు నిష్ఠురాక్షరసంపర్కమున విరిగి కూలుచున్నది. ఇందు అర్థానుగుణమైన శబ్దసంఘటన గలదు.

నన్నయ. సభా. 1. 208. భీమజరాసంధుల మల్లయుద్ధము. "ఒండొరులం *బట్టియు గిట్టియు నడచియుం బొడచియుం; దాచియు ద్రోచియు* మహాయుద్ధంబు చేసిరి. ఇందు కొక్క జతక్రియలలో మొదటియక్షరము మాత్రము మార్చి తక్కిన యక్షరము లట్లే యుంచి యమప్రాసము కూర్చబడినది.

నన్నెచోడు డిట్టిరచనలు రెండు గాలించినాడు.

1. 216 దక్షునిభయము: "అతిభయక్రాంతు లై కన్నవారలకు *మ్రొక్కుచు స్రుక్కుచు లోగుచు డాగుచు*; 1. 671. "పార్వతిని తపోనిశ్చయమునుండి మరల్చుటకు ప్రౌఢాంగనలు తమ*బలిమియు గలిమియు* మెరయుచు నగజ *భంగించుచు నగ్గించుచు*.

నన్నయ: ఆరణ్య 1. 364. ఊర్వశి యర్జునునితో ప్రస్తావించిన విహారములు:

"మేరుశైలకందరంబులను మందపవనంబుగల నందనాదివనంబులయందును నితాంతకాంతవికసితకనకారవింద సమధికసౌరభసంవాసిత మహానందకందంబులైన మందాకినీతీరమణిమయవేదికలయందును, చంద్రికాసుందరంబులైన సికతాతలంబులను మరియు నిర్జరవిహారస్థానంబులను."

నన్నెచోడ: పార్వతీపరమేశ్వరవిహారములు. III. 324.

"హిందోళాందోళిత లతాందోళంబులం బరిమళాక్రాంతానందలతాంతమందిరానంతరంబుల జలవిహంగారావఘూర్ణితసరోవరంబుల చంద్రకాంతామణి సోపానదీర్ఘికాతటంబులం గనకవాలుకాభిరామనిర్ఝరపులినతటంబుల గాంచనమణిగణాలంకృత విచిత్రకృత్రిమాంచలగుహాగహ్వరంబుల,"

## 4

నన్నయ ఆది. I-9. రాజరాజుసభ; మంత్రి పురోహిత సేనాపతి దండ నాయక దౌవారిక మహాప్రధానానంతసామంత విలాసినీపరివృతుండు.

నన్నెచోడ II, 60౩. స్కందుస్కంధావారము. అసంతమండలిక మహాసామంత దండనాయ కామాత్యభృత్యాద్యఖిలజనపరివృతుండు.

ఈ రచనలను జాగ్రత్తగా పరిశీలించినపక్షమున నన్నెచోడుడు నన్నయ రచించిన వచనముల పద్ధతులను కొంతవర కనుకరించె నని నాకు తోచుచున్నది.

**అర్థాలంకారములు — ఉపమ :**

నన్నెచోడు నియుపమానము లత్యంతమనోజ్ఞములు.

1. దక్షప్రజాపతి చేసిన ఈశ్వరదూషణ విని సతీదేవి "నవఘనఘనధ్వని వినిన కమలలక్ష్మియుం బోలె సదరిపడెను. —I. 157.

2. కామశక్తి : I. 434 : "బలపరాక్రమాతిధైర్యశౌర్యమంత్రతంత్రధ్యాన ధారణైశ్వర్యాద్యశేషదివ్యశక్తు లెంతవిశేషంబు లయ్యును చంద్రకాంతోపలంబులు చంద్రకిరణస్పర్శంబునం గరంగునట్లు లతికోమలంబైన కామశక్తికి లోనై మృదుభావంబునం బొందు నిది జగంబునం దనుభవసిద్ధంబు.

3. మేనక పార్వతిని చూచుట : II. 343 : "పుష్పస్తబకభరానమ్ర కల్పలతిక లొండొంటిం బెనంగునట్లు స్నవకౌదీగలు సోపులాడ నొండొరుల నందంద కౌగలించుకొని మేనక మనోరాగంబున నిజతనయ నీడుకొని చనియె.

4. దనుజేంద్రుండు తనుజయు తాను జవరు లొక్కట ఘారజలపటలంబునుం బోలె గజవదనుమదజలాసారంబునం మర్గిన గాని.

మరియు రౌద్రములు, భయానకములు సగురంగములను వర్ణించునపుడు ప్రళయకాలమునాటి యుపమానములను కూర్చుటయందు నన్నెచోడునికి చాల ప్రీతి.

చూ. I. 183 : దక్షాధ్వరధ్వంసమున కభిముఖుం డగు గణాధీశ్వరుడు ప్రళయకాలనీలమనాఘనంబునుం బోలె మహాధ్వని గర్జిల్లెను.

తారకయుద్ధమునం దీయుపమానములు విశేషముగా కానవచ్చుచున్నవి. II-795. కుమారతారకులు తమతమబలంబులకు చేయి వీచినం బ్రళయా

నిలింబు వీచినం దదరి చుడివడు కాలానలశిఖాకలాపంబునుం బోలెం గోపానలోద్దీపితాంబరంగు లై. ఇట్లై ఈశానుండు విలయ కాలస్వరూపుం డగు నీశానువలెను (II-733) కేతుమాలి విలయకేతుమాలానలంబుం బోలెను (II. 927) అలాతకుంతక యమ అంతకాలాంతకుండునుం బోలెను (II-998, 310) సమర మొనర్చిరి.

మాలోపమ :

ప్రతిపాదితార్థము పాఠకులమనములయందు బాగుగా నాటుకొనుటకు కవి యొక్కయుపమానముతో తృప్తి నొందక రెండుమూడుపమానములు గల మాలికలం గూర్చుటయు గలదు

చూ. ప్రస్థానభేరిధ్వని విని వేద సేనలు —II. 574

"అమ్మహాధ్వని విని ఘనఘనాఘనధ్వని విని విజృంభించుమయూరసంఘంబునుం బోలె చెలంగి తలగొనం బొడవగ ప్రకటకంబు చంద్రోదయంబునం దనరి ప్రమోయు మహాసముద్రంబునుం బోలె వెరిగి ఘూర్ణిల్లుచుండె—"

I. 292. పార్వతియౌవనప్రాదుర్భావము :

"మఱియుం గొమారానంతరంబున 1. తేటిగకుం గన్నుం దెక్కినట్లు 2. పుష్పునకు దావి పొందునట్లు 3. చిత్రరూపంబునకు మెరుం గెక్కువిధంబున నిఖిలజనమనోభిరామం బగుచు (294) అభినవమధుసంగతిం దనరు ప్రద్యుమ్ను నుద్యానవనంబునుం బోలె యౌవనమభ్యుదయమున.

శ్లేషోపమ:

శ్లేషోపమలయం దీతనికి దృష్టి లేకపోలేదు. II. 393. శరవణసరస్సు "అనిమిషాస్పదం బగుట నమృతాన్వితం బగుచు, ఖరదండసహితం బగుటం గుముదాన్వితం బగుచు ద్విజవాసం బగుట గురాన్వితం బగుచు, హంసాశ్రయం బగుటం గూర్మాసనాన్వితం బగుచు.

రూపకము :

కోపమును, విరహమును అగ్నిగా నిరూపించుసామాన్యరూపకము లటుండ, ఈక్రింది రూపక, సావయవరూపక, పరంపరితరూపకము లీత వరచనయందు గమనింపదగియున్నవి.

I. 68. సకలావయవంబుల పరిపూర్ణం బైన దివ్యకావ్యాంగన.

I. 743. పార్వతి, తపోలక్ష్మిముఖవిశేషంబునుం బోని తపోవిశేషంబు దాల్చి.

II. 902. నిలింపబలజలధి నిజాయుధానేకజలచరాకీర్ణంబు చేయుచున్న.

II. 916. మహాబాహుబలుతరంగబలదావానలంబు గని వరుణుం డపార వరుణాస్త్రాసారంబున నక్రమంబున నుపశాంతిం బొందించె.

II. 991. కాలనేమి దుర్వారాక్షీణప్రాణసమీరణంబు దుర్వారనారాయణాస్త్రాపారఘోరమహోరగంబున కాహారంబైన,

II. 845. తారకుడు నిర్గతైశ్వర్యప్రభావుండై పురాంగనాంతఃసంతాపానలవివర్ధనానిలుం డగుచు,

II. 767. దేవాసురరణరంగమున భూతభేతాళాదులు "రుధిరజలపూర్ణసరోవరంబుల జలక్రీడయు, కనివరకళేబరాగ్రంబుల కృత్రిమాచలక్రీడయు ప్రకాండచండధ్వజపతాకానేకదండంబుల వనక్రీడయు సలుపుచు.

ఉత్ప్రేక్ష :

భావాంబరవీధి నిర్వహించు నీకవిచంద్రుని కవితాప్రభావ మీతని యుత్ప్రేక్షలలో విశేషముగా ప్రకాశించుచున్నది. చూడుడు.

I. 166. సతీదేవి నిజదేహ విదాహకరంబైన కోపానలంబునకుం బరమేశ్వరు వియోగానలంబునకును శిశిరోపచారంబులు సేయం దలంచినదియుం బోలె హిమవంతంబునకు జనియించెను.

II. సరవణసరస్సున కుమారస్వామి (II. 422). "కమలబంధుండు బంధుభావంబున కమలలక్ష్మి యింటికి విందు వచ్చినట్లు తేజోవిరాజితుండై సరోవరంబు నలంకరించుచున్న బాలుడు.

II. 414. ఇట్లీశ్వరు నురులింగాకారంబు పురుషాకారంబు దాల్చినట్లు నిజజనకు దగు పంచవక్త్రు నగ్గలింప షడ్వక్త్రుండై ద్వాదశరవిప్రకరంబున నవయవంబులు సేకొని నిజావయవంబులు దాల్చినట్లు ద్వాదశకరపంకజశోభితుం డై కమలగర్భు నొత్తరించి కమలాసనంబు గైకొనినయట్లు కమలనిలయుండై వెలుగుచుండె నంత.

1. 81. గజయూథములు- తదవసరంబున ఘర్మాంశుకరాహతి కులికి తదీయాప్తబంధు లైన యరవిందంబులు కలిగి దండింపంజొచ్చునట్లు వేదండంబులు కమలషండంబుల కరుగుదెంచి మహోత్సాహంబున.

వివిధాంశకుశలత్వము :

ఇంతవరకు చర్చింపబడిన యంశములను గమనించినపక్షమున నీకవి సమస్తాంశములయందును కుశలుడు గాని సామాన్యుడు కాడని తేటపడియుండును. అయినను అతడు సమస్తకళామర్మముల నెరిగినవా డనుటకు ఒకటిరెం డుదాహరణములు చూతము.

1. చిత్రపటరచన : I. 587. "పార్వతి యతనుసంతాపంబు వాపనోపక పరమేశ్వరురూపు చిత్రించిచూచిన నైన నూరట యగునో యని చిత్రసాధనంబులు గొని పలక ఘట్టించి మెరుం గిడి త్రివటించి తిట్టంబు కొలశికిం దెచ్చి రుజ్వాగతంబున రేఖ నూల్కొలిపి, పత్రకబిందుకనిమ్నోన్నతాపాంగమనోన్మానంబు లలవరచి సలక్షణంబుగా చిత్రించి వన్నెవ గొలిపి కందెర దెరచిన."

చిత్రకళాసాంకేతికముల బాగుగా నెరిగినవాడు గాని పైవచనము రచింపనేరరు గదా ?

2. రసవాదపరిజ్ఞానము. I. 903.

చ. ఇనుము రసంబులో నుడుగ కెప్పుడు మానిన గాని కాదె కాం
చన మమరాద్రివాయసము సంతతమున్ వసియించి కాని యే
కనకము చాయ గాదు చిర కాలనుసేవన గాని కాదె స
న్మనమున నిన్ దలంచు డొక మాత్రము చాలదే ముక్తికీశ్వరా.

పదవైచిత్రి :

ఈ కవిరాజునకు సంస్కృతాంధ్రములయం దద్భుతపాండిత్యము కలదు. గావున నాభాషలపదసంపత్తి యీకావ్యమున పుష్కలముగా గోచరించు చున్నది. మరియు కావేరీతీరమున రాజ్య మేలుటచేత నాపరిసరమున ప్రబలియున్న తమిళ కర్ణాటభాషావాఙ్మయముల ప్రాబల్య మీకావ్యమున విశేషముగా నగపడుచున్నది. ఆంధ్రకవులకావ్యములలో సాధారణముగా కానరాని విచిత్రపదము లనేకము లీతని

రచనలలో కానవచ్చుచున్నవి. ఇట్టిపదప్రయోగవైచిత్ర్యము ఇతనిశైలి కొక ముఖ్య లక్షణము. అట్టిపదములు కొన్ని మచ్చునకు వ్రాయుచున్నాను.

I. 523, కనుబ్రైటం బైన దావ గొనక (I. 832)
I. 226. యెల్లిడించి. I. 593. నెచ్చిలి.
I. 836. నక్కొత్తికొనక. I. 902 ఎయిద నేరమి.
II. 18. రాగోత్కటంబున దావగొనక.
II. 25. ఆయగము.
II 383. జాలిమేలిల్లు.
II. 477. పురోభాగంబున పరభాగిల్లు.

పొరపాటురచనలు :

భావోద్రేకపరవశు డగు నీకవిప్రభుడు కావ్యము నందలి పాత్రలను తనమనో వీధిని సన్నిధానము చేసికొని పరవశుడై వాక్యరచనమునం దొక్కొకచోట ప్రమత్తు డగుచున్నాడు, చూడుడు:

I. 387. మొదలు 401 వరకు మన్మథు డింద్రునితో ప్రత్యక్షముగా మాటలాడుచున్నాడు.

402. "వెరవున భుజశౌర్యంబున సురవల్లభ పనుపు నీవు చూడగ పర మేశ్వరునైన నోర్తు బెరసురనరఫణిదివిజాధిపతులు నాకెదురుదురే."

403. "అని నెనరుముట్టం బూనిన కుసుమాయుధు పూనికి వజ్రాయు ధుండు ఘనంపరచి తారు తారకాసురునిచేతనం బరాజితులై పరమేష్ఠిమరువు జొచ్చినవిధంబును విధి తద్వధ కుపాయం బయ్యు మామహేశ్వరుల వీర్యసంభవుం డైన కుమారుం డగునని హితోపదేశంబు సేయుటయు హరిగిరిజలు నైష్ఠికానుష్ఠానులై హిమవంతబబున నున్నవారు, వారికి సంగమంబు సేసి జగద్ధితంబు సేయు మిది యనన్యవిషయంబు నీవలనకాని యొరునకు సాధ్యంబు గాదు కావున నిన్నుం బ్రార్థించితిమి."

ఇందు 403 ఆరంభము మొదలు 'హరిగిరిజలు' వరకు పరోక్షభాషణము పిమ్మట ప్రత్యక్షభాషణము మధ్య నొకక్రియ రచింపకుండుటచేత ప్రత్యక్షపరోక్ష భాషణములు కలగలుపై యన్వయము పొసగకున్నది.

మఱియొకటి ; II. 491. కుమారుని పట్టాభిషేకము 'పరమేశ్వరుండు శక్త్యాద్యనేకరాజచిహ్నంబులు దయసేసి దివ్యశస్త్రాస్త్రంబులు హస్త్యశ్వరథ పదాదిచతుర్బలంబులు దయసేసి మరియుం బార్వతి వజ్రమయవర్మ' అనేకరాజ చిహ్నములు దయసేని.

...." 'దయసేసి' యనుక్రియ ముమ్మా రననసరముగా వక్కాణించుట చేత రచనయందు కవి యంత లక్ష్య ముంచక వ్రాసిన ట్లగపడుచున్నది.

3. II. 884. ఉమామహేశ్వరులు కుమారు ననేకవేదశాస్త్రాగమ పురాణేతిహాసకథాబృహత్కథాద్యఖిలవిద్యావేదికలయందు పారంగతుం జేసి—

బృహత్కథ యిటీవలి యాంధ్రచరిత్రకు సంబంధించినది. దేవసేనాని యగు కుమారస్వామి తనవిద్యాభ్యాససందర్భమున బృహత్కథ పఠించె నని వ్రాయుట విపరీతముగా తోచుచున్నది. కుమారసంభవకర్తలైన ఉద్భట, కాళిదాస, నన్నెచోడులు బృహత్కథ పఠించి యుందురు. తమవిద్యాభ్యాసమునాడు తాము చదివినయిటీవలికథలు దేవతలవిద్యాభ్యాసమునాడు దేవతలు చదువుకొని రని వ్రాయుట కాలవ్యత్యాసదోషము కాని మరియొకటి కాదు. ఇట్టి పొరపాట్లు నెర సులుగా గొప్పదోషములు గావు.

ప్రేమ :

ఏకవియొక్క ప్రతిభయైనకు అతడు ప్రేమతత్త్వమును గూర్చి చేసిన రచనలవలన విశేషముగా వ్యక్తమగుచుండును. నన్నెచోడుడు రచించిన మిథు నములలో నీక్రిందివి గమనింపదగియున్నవి.

1. దక్షప్రజాపతి – అతనిభార్య 2. సతి – ఈశ్వరుడు 3. హిమవం తుడు – మేనక 4. రతీమన్మధులు 5. పార్వతీపరమేశ్వరులు.

1. దక్షప్రజాపతి - అతనిభార్య :

వీర లాదిమదంపతులు. వీరి కేబదిమంది కూతుండ్రు గలరని నన్నెచోడుడు I. 74 లో నుడివెను. కొన్నిపురాణములలో వీరి కరువదిమంది కూతు లని చెప్ప బడెను. అందు అదితిమొదలగు పదముగ్గురు కశ్యపునిభార్య లైరి. అశ్విని మొదలు

రేవతివరకు నిరువదియేడుగురు చంద్రునిభార్యలు సతీదేవిని ఈశ్వరుని కిచ్చి పెండ్లిచేసి దక్షుడు తనధర్మపత్నితో సుఖముగా జీవించుచు తన్నుఁ గన్న బ్రహ్మదేవుని కంటె నధికు డను కీర్తి పొందెను.

## 2. సతి - ఈశ్వరుడు :

పరమేశ్వరుడు దాక్షాయణి మనోహరాకార నవయౌవన హావభావవిలాస విభ్రమసౌందర్యగుణంబుల కంతకంత కనురక్తుడై యుండెను. వార లన్యోన్య రాగాతిరేకమున కామకేళీలాలసులై, కైలాసనగముమీదను ఆగిరిపార్శ్వములందలి మనోహరస్థలములందును హాయిగా విహరించుచు దాంపత్యధర్మములు నిర్వహించు చుండిరి. ఆప్రాంతములందు మత్తేభము లనేకములు హృదయాహ్లాదముతో ననేక ప్రకారముల మదనాసక్తిం బెనంగుచుండుట గని దాక్షాయణి సాభిప్రాయముగా పతివంక జూచెను. ఈశ్వరు డంగీకరించెను. ఆహా! మన్మథుని మహిమ! ఏమన వచ్చును ?

గీ. ఆదిమూర్తులు శివశక్తు లచలమతులు
హరుడు సతియును సురతార్థమై విహీన
తరము లగు మృగరూపముల్ దాల్చి రనిన
కామమాయల నెవ్వార లేమి గారు ?

ఇట్లు పరమేశ్వరుండును సతీదేవియు సామజకేళీలాలసులై విహరింప సద్యోగర్భ మున గజముఖు డుద్భవించెను. సంస్కృతకుమారసంభవ కథలలో లేని గణపతి జన్మమును నన్నెచోడు డిందు చేర్చినాడు. విఘ్నేశ్వరున కేనుగుముఖ ముండుటకు ఈకథలో శాస్త్రీయమైనహేతువు చెప్పబడినది. గర్భధారణకాలమందు దంపతుల మనస్సునందు, అందును ముఖ్యముగా స్త్రీమనమునందు గాఢముగా నాటుకొనిన రూపములు, అంశములు, సందర్భములు ఊరకపోవు. గర్భస్థ మగు శిశువుయొక్క భవిష్యద్రూపగుణాదులయం దివి యన్నియు తప్పక వ్యక్తము కాగలవు. ఈ శాస్త్రమునే యూజెనిక్సు అనునామముతో పాశ్చాత్యు లిటీవల వ్యవహరించుచు, దాని యభివృద్ధినిమిత్తము మిగుల కృషిచేయుచున్నారు. అది యటుండనిండు.

దక్షుడు కశ్యపయమచంద్రాదులైన యల్లుండ్ర యిండ్ల కరిగి వారిచే సగౌ రవముగా పూజింపబడెను. కాని తనదురభిమానముచేత నీశ్వరుని విముఖుని చేసు కొని స్వగృహమున కరిగి, యీశ్వరు నవమానించుటకై యొకయజ్ఞమును చేయ

సమకట్టి సమస్తబంధుజనులను. దేవతలను ఆహ్వానింప, యీశ్వరునిమాత్ర మాహ్వానింప దయ్యె. సతీదేవి జగజ్జనకుం డగు తనజనకుని మహత్త్వవిభుత్వము లకు మెచ్చుచు, పరమేశ్వరు నాహ్వానింప కుండుటకు హేతు వేమి యని ప్రశ్నిం చెను, జామాతపై ద్వేషముచే దక్షుడు పరమేశ్వరు డనుట విని సహింపక దారు ణముగా శివుని దూషించెను. ఆమాటలు వినుచుండ నామెయొడలు మండ జొచ్చెను. మండదా మఱి? భర్తృదూషణవాక్యములు పతివ్రతలకు దేహము దాహము బొందించునగ్నిహోత్రములే కదా! ఆకోపాగ్నిచే లక్కబొమ్మవలె ఆమె భగ్గున మండిపోయెను. మహాద్భుతము! భర్తయందు పతివ్రతకు గల పవిత్రమైన ప్రేమ కీయంశము అద్వితీయమైన యుదాహరణము. దూషించినవాడు తండ్రి; కాని దూషింపబడినవాడు జీవితేశ్వరుడు. ప్రేమమహిమచేత మనోనాథునియందు లీనమై పోయిన సతికి పరమేశ్వరునిగూర్చి చేయబడిన దూషణప్రసంగము అగ్నిహోత్ర మయి యామెను దగ్ధము చేసివైచినవి. ప్రేమతత్త్వము అభేద్యము కదా?

సతిమరణమునకు ఈశ్వరుడు ఘోరరౌద్రరూపము దాల్చెను. లోకభయం కరమైన యాకృతితో నంధియు, విగుర్వించుచు గణాధిపతులను ఈశ్వరుని చుట్టు చేరి జగత్సంహారమున కుపక్రమించుచుండిరి. ఈశ్వరుని సెలవు గైకొని గణ నాయకులు దక్షాధ్వరశాల కరిగి మఖము మంటగలిపి గోమేధికసదనమున డాగిన దక్షుని పట్టుకొని శిరము ఖండించిరి.

పతిమరణదైన్యమున కోర్వక దక్షకాంత శివుని శరణుచొచ్చి పురుషభిక్ష వేడుకొనెను. కరుణామయు డగు నీశ్వరుడు దక్షుని మరల బ్రతికించి, యజ్ఞము సఫలము చేసి ప్రజాపతినియోగమునం దెప్పటియట్లు నిలిపెను.

తక్కినవారందరు నెప్పటియట్లే యుండిరి. ఈశ్వరునికిమాత్రము భార్యా వియోగము తటస్థమైనది. కైలాసము చిన్నబోయి చీకటిలో నున్నట్లున్నది. ఏమి యున్నను గృహిణి లేని దొకగృహమా? భృంగిరిటాదులహాస్యప్రసంగములు పర మేశ్వరునిమనోవ్యథ మాన్పలేక పోయినవి.

## 3. హిమవంతుడు - మేనక :

వీరలు పుణ్యదంపతులు. పర్వతములకెల్ల చక్రవర్తి హిమవంతుడు. అత నికి నిఖిలస్త్రీరత్నమైన మేనక అగ్రమహిషి. వారికి బ్రహ్మవరముచేత మైనాకు డను పుత్రు డుద్భవించెను; కాని ఇంద్రుడు వజ్రాయుధముచేత రెక్కలు ఖండించి

వైచునను భయముచేత మైనాకుడు సముద్రములో డాగెను. ఎట్టివారికైన నేదేని మనోదుఃఖ ముండకపోదు. కొడు కిట్లు దూర మయ్యె నని దుఃఖించి యాదంపతులు సతీదేవి తమకు కూతురై జన్మింపవలయు నని తపస్సు చేసిరి. సతీదేవి ఆదంపతులకు ప్రత్యక్షమై వారు కోరిన వర మిచ్చి మేనకగర్భమున ప్రవేశించెను.

పిమ్మట నొకశుభముహూర్తమున నాదంపతులకు పుత్రికయై పార్వతి జనించెను. కాలక్రమమున నామెకు యౌవన మంకురించెను. ఆమెకు పరమేశ్వరుడే భర్త యగునని నారదుడు హిమవంతుని కాదేశ మిచ్చి చనెను.

అట పరమేశ్వరుడును, సతివియోగాగ్ని మనములో దగిలికొని కాల దానికి దనుపు సేయ దలచియో, లేక నిక్కముగా తపము చేయ దలచియో హిమగిరికి వచ్చెను. హిమవంతు డీశ్వరాగమనమున కెంతయో ప్రీతుడై, యనేక విధముల నర్చించి పెక్కువరములు బడసియు దేవదుర్లభు డని మహేశ్వరుని బాసి పోనేరక చేతులు మోడ్చి దీనాననుడై యున్న కరుణించి "నీపురంబున కేదారేశ్వరుం డన వసియించెద నోడకుండు" మని వరదుడు వరమిచ్చెను. మహాప్రసాద మని హిమవంతు డానందపరవశుడై, తనకూతుం బార్వతి నాదేవుసమ్ముఖమున నిల్పి,

సీ. ఈబాల దన్నుదా నెరిగినకోలెన
నన్యశరణ్య యై యహరహంబు
నిన్ను కొల్చుచు నుండు నీ విందు మాపుణ్య
మున జేసి వచ్చుట విని ముదమున
జూడంగ వచ్చె నిన్ జూచిన కోలె భ
క్త్యావేశమున జేసి జీవ మెుదల
బాపిన మీపొందు వాయ నోపదు పాసి
తలరు గావున నిచ్చదగినవరువు

బనులు చేయుచుండు పార్వతి యనికికి
వరద యిచ్చగింపవలయు ననిన
నతనివిన్నపమున నంతకు భక్తవ
త్సలుడు నెమ్మనమున నంతసించె.

పార్వతియు నీశ్వరారాధనాసక్తయుక్త యై భక్తియు ననురక్తియు నంతకంత కగ్గలించుచుండ.

సీ. చమరీజబర్హ మార్జనుల బరీక్షించి
నయమున సమ్మార్జనంబు సేయు
కర్పూరతైలార్ద్రకస్తూరికాకర్ద
మంబుల ననులేపనంబు సేయు
కాశ్మీరమాంజిష్ఠగరుడాండహరినీల
ముక్తాఫలంబుల మ్రుగ్గు వెట్టు
కుసుమపల్లవలతాకోరకంబుల జిత్ర
దామంబు లొనరించు దావి మిగుల

పుష్పమందిర మొనరించు పుణ్యవారి
సౌరభము వించి మణికలశముల నించు
నచలపతిసుత మది నిట్టు లహరహంబు
శివుని కనురక్తి పరిచర్య సేయుచుండె.

అట దేవేంద్రుడు తారకాసురుచేతం బరాజితుడై మహేశ్వరతనూభవునిచే గాని యారాక్షసునకు మరణము లేదని విని, మన్మధుని పిలిపించి హరిగిరిజలు నైష్ఠికానుష్ఠానులై హిమవంతంబున నున్నవారు. వారికి సంగమంబు చేసి జగద్ధితంబు సేయు మిది నీవలనన కాని యొరునకు సాధ్యంబు గాదు. నిన్ను బ్రార్థించితిమి. అనిన దర్పకుండు దర్పించి "శూలితపోభంగ మెంతపని దేవహిత మిదె చేసెద నని బయలుదేరె.

## 4. రతీమన్మధులు :

రతి యపశకునముల గాంచి కలగిన మదితో పతిరాక ప్రతీక్షించుచుండెను. మరుడును మరలి రాగానే యతనివలన కార్యగతు లెరిగి రతి యదరిపడి తల్లడిల్లుచు హరుడు నెపమల్గి చూడుడు నాక్షణంబు. యఖిలజగములు సంహార మగు రయమున. కాబట్టి అట్టియుగ్రునిపై పోరాదు పోకు మని విన్నవించెను. మరు మహేశ్వరునకు గల తారతమ్య మెంతో రమ్యముగా వర్ణించెను.

"కొని బాలు రైనను తిని పిప్పి యుమిసెడు
చెఱకు విల్లని నమ్మి చేతబట్టి
మెలతల తలవెంద్రుకల బొంది కందెడు
నలరుపుష్పము లమ్మ లని తలంచి

తలిరాకు లైన గదల్ప నోపని మంద
పవనుండు నొక పెనుప్రాపు గాగ
నబలలు నోపిన నాకాశమున బొలు
నవి శుకములు మూలబలము గాగ
నెంతవేసవి ముట్టిన నెండ గమరు
నవవసంతుడు తగుసహాయంబు గాగ
కాకిపిల్లల కోడు పికములు బోటు
మగలుగా నుగ్రుపై బోవ దగునె మదన ?"

అని పెక్కుభంగుల నివారించెను. కాని ప్రయోజనము లేదయ్యెను.

రతీమన్మధులు హిమవంతము చేరి హరుని తపోవనము ప్రవేశించిరి. పార్వతి యెదుట నుండిన గాని ఈశ్వరుని తపస్సు చలింపజేయుట మదనునికి సాధ్యము కాలేదు. అంతలో నామె లతామందిరాంతరంబున కరిగి చరచరణసరసీరుహంబులకు పుష్పాంజలి యిచ్చి కృతాంజలి యయ్యె. ఆ క్షణముననే ఆమె హృదయము మదనాస్త్రభేదిత మయ్యె. మోహపరవశ యగు పార్వతీముఖాలంకారము కనుగొనినంతనే పరమేశ్వరుని హృదయమును చంచలిత మయ్యెను. నిర్నిమిత్తముగ మనోవికార మగుట కేమి కారణమో యని హరుడు నలుగడలం బరికించి చూచి నీలాభ్రపటలమధ్యమున పుష్పచాపహస్తు డైన మదనుని కనుగొని కోపించి, ప్రళయకాలాగ్ని రౌద్రోద్రేకమునం బెరిగి దహనాంబకంబు విచ్చి చూచిన క్షణములో మన్మధుండు భగ్గున మండిపోయెను.

శివునికి పార్వతిపై రాగము, మదనునిపై ద్వేషము పెచ్చుపెరుగుటచేత తపము చాలించి యతడు కైలాసమునకు మరలెను. విరహతాపపరవశయై పడిన పార్వతిని హిమవంతుడు స్వగృహమునకు గొనిపోయెను. రతి ప్రలాపించుచు చనుదెంచి పుష్పకోదండపల్లవఛత్రమకరకేతనంబుల నచ్చుపడియున్న మరుభస్మాకారంబు గని శోకపరవశయై పతిచే తపించుచుండెను. జీవముపై నాస విడచి వసంతాదు లెంత వారించినను మానక కులపాలికాధమ వృత్తి నైనం బురుషుతోడ పరలోకమున కరుగవలయు నని మరణనిశ్చయము చేసి యగ్నిప్రవేశమునకు సిద్ధపడు చుండ నాకాశవాణి 'వలదు. నీపతి పునర్జీవితుడగు. శాంతింపు' మనెను. మన్మధపునరావతారము నుద్యోగించి రతి నిరతిశయభక్తితో పరమేశ్వరు నారాధించుచుండెను.

## 5. పార్వతీపరమేశ్వరులు :

అట పార్వతియు నీశ్వరవిరహదహనదాహము సంపనోపక లీలోద్యానమున నేకాంతమున నరిగి పరమేశ్వరురూపము చిత్రించి చూచిన నైన నూరట యగునని సలక్షణముగా చిత్రించునంతలో చతురిక చేరవచ్చెను. పార్వతి లజ్జించి, చిత్రము కప్పి, పలకబోయి పరవశమయ్యెను. "ఈశ్వరుని నీవు ప్రేమించుట అనింద్యము-సద్వంద్యము- త్రైలోక్యపూజ్య మని చెలికత్తె సంబోధించి శిశిరోపచారము లెన్ని చేసినను ఆమెవిరహవ్యథ యథాక్రమమున నుండెను. తపోమహిమచే నర్చించి, మెప్పించి, ఈశ్వరుని భర్తగా బడసెద నని యామె తపోవనమునకు వెడల నిశ్చయించెను. మేనకాహిమవంతు లది తగదని వారించిరి. అంతఃపురప్రౌఢాంగనలు తమబలిమియు గలిమియు మెరయుచు నామెను భంగించుచు నగ్గించుచు తపఃప్రయత్నము మాన్పజూచిరి. యథార్థప్రేమమున కావృథాజల్పములతో పని యేమి? "ఈ భవనమున నీశ్వరుండ పతిప్రాణము దేహము చిత్తవృత్తులున్" "పొండ"ని పార్వతి కోపించి తెగబలికెను. ఆదృఢనిశ్చయమునకు మరెవరును మారాడజాల రైరి. తలిదండ్రులను వీడ్కొని చతురికాదివయస్యలను కూడ గొని చని తపోవనము ప్రవేశించి హైమవతి యీశ్వరునిగూర్చి యథావిధిగా తపము చేయజొచ్చెను. వేసవిని పంచాగ్నిమధ్యమమునను, వర్షాకాలమునం దంభోవాసి యైయును, దుస్సహశీతోపేతంబు లగు హేమశిశిరంబులందు నిరంతరోదకవాసనియమమునను నిరాహారాది ఘోరతపోప్రవృత్తి నుండెను.

I. 913.

"ఇనుము రసంబులో నుడుగ కెప్పుడు నూనినగాని కాదె కాం
చన మమరాద్రి నాయసము
సంతతమున్ వసియించి కానియే
కనకము చాయ గాదు చిర
కాల నుసేవనగాని కాదె స
న్మనమున నిన్ దలంచు డొక
మాత్రము చాలదె ముక్తి కీశ్వరా.

అంతకును పరమేశ్వరుడు ప్రత్యక్షము కాలేదు. ఆమె పట్టు వదలలేదు. శరీరము చర్మాస్థిమయ మై కాష్ఠావస్థ నుండినను తపోనిష్ఠ సాగించుచుండెను. ఆమె నిశ్చల

తపోమహిమకు విశ్వమంతయు చలించిపోయెను. కైలాస మీశ్వరునితో కూడ వెండి కొండగరమువలె గిఱ్ఱున తిరుగజొచ్చెను. యదార్థప్రేమ మహిమ యిట్టిది. అది యిట్టి విశ్వభ్రాంతులకు లొంగదు. ఆప్రేమము విశ్వమునే కలవైచి వశపరచు కొనును. ఆతపోమహిమకు లొంగి మూడుకనులవాడు సహితము కైలాసము దిగి రావలసినదే. అయినను కడసారి మరియొక పరీక్ష. ఈశ్వరుడు మునికుమారుని వేషము ధరించి పార్వతిం జేరవచ్చి కుశలప్రశ్నల గావించి, చతురికవలన నామె శంభుని ప్రాణేశుగా గోరి తపము చేయుచున్నట్లు విని హేళన చేసి పలువిధముల పరమేశ్వరుని నిరాకరించి పలుకుచు, తక్కుంగల దేవతలను వేవిధముల పొగడ జొచ్చెను. ఉపన్యాస మంతయు విని, పార్వతి యాకృతకమునికుమారున కొక్క జవాబిచ్చినది.

"జడుడ వై తెట్లు బ్రాహ్మణజాతి బుట్టి"

మునిసుతుడు మరికొంతతడవు శివదూషణ చేయుచుండెను. పార్వతి యాపలుకులు విననోపక, కోపావేశమున పరాఙ్ముఖయై వెడలిపోబోయెను. త్రినేత్రు డైనను ఆమె నిక నేమి పరీక్షింప గలడు ? గౌరినిశ్చలభక్తియుక్తి కనురక్తుడై యీశ్వరు డాక్షణమే నిజస్వరూపముతో ప్రత్యక్ష మయ్యెను. హైమవతి యులికిపడి స్తంభించి నిల్చెను.

ఆమె మనశ్శరీరము లొక్కమారే వికసించెను. తపము సఫలమైనందుకు ఆమె కానందాశ్రువులు పొడమెను. సప్రేమముగా నామె యీశ్వరుని క్రీగంట చూడ సాగెను. ఈశ్వరు డాచంచలనేత్రియవలోకనసుధారసప్రవాహమున మునిగెను. హర గిరిజ లధికప్రణయరసాపూర్ణసాగరంబులను నభిమానశీలంబులను నతిక్రమింప నున్నసమయమున చతురిక "మహాదేవా ! ఈమె కన్యాగణము సుప్రతిష్ఠితము చేసి పరిణయపూర్వకముగా పరిగ్రహింపు టుచిత" మని విన్నవించెను. అగు గాక యని హరుడు రజతాద్రికి మరలెను. పార్వతి తండ్రిగృహమున కరిగెను. హిమ వంతు డుత్సవము చేసి కూతుతపోవేషము మాన్పెను.

పిదప సప్తఋషులను పంపి హరుడు హిమవంతునికూతుం దన కిచ్చి వివా హము చేయు మని కోరెను. మహాప్రసాద మని హిమవంతుడు సమ్మతించెను. భవుడు పెండ్లికొడుకై తరలి రాగా హిమవంతుడు సగౌరవముగా నెదుర్కొని తోడ్తెచ్చి శుభముహూర్తమున కన్యాదానము చేసెను. ముజ్జగములు మహానంద ముతో వెల్లివిరిసెను.

ఇదేసమయమున మన్మథుని పునర్జీవితుని చేయుట కని బ్రహ్మాదు లీశ్వరునితో "దేవా, మన్మథుడు దేవహితార్థ మింద్రాదులచే ప్రార్థితుడై మీకును మహాదేవికిని సంగతి సేయువాడై మీమీదకు వచ్చెను. అంతే కాని మీపై నెత్తి వచ్చుటకు వాని కెన్నిగుండె లున్నవి ? ఈ శుభసమయమున మదనుని పునర్జీవితుం జేయవలయు" నని విన్నవించిరి. "అంగజుడు జగంబుల కనంగుడై రతికిం బ్రాక్తస్వరూపుండై వర్తించునని వరదుండు కరుణించి వర మిచ్చి యతని పూర్వ నియోగమును దయ చేసెను. తక్షణమే తెలవెడలివచ్చునట్లు వచ్చి మన్మథుడు రతిమ్రోల నిలిచెను. అప్పుడు

"తలుకొత్తెం దరహాస మాననమునన్ దట్టూర్చిపో మేన ము
త్పులకల్ గ్రక్కున బర్వె లోలనయనాం భోజాతపత్రంబులన్.
వెలరెన్ భోరన నుమ్మదాశ్రువుల ము ద్వేగంబు రాగంబుగా
నెలమిం జిత్తము తక్షణంబ రతి కా త్మేశావతారంబునన్."

పార్వతి యకలుషితచిత్తముతో పరమేశ్వరుం బ్రేమించి ఎట్టియంతరాయములకు దలంపక, ఎట్టివిఘ్నములను లెక్కచేయక, శల్యావశిష్ట యగు నంతకు తపోనిష్ఠ నుండి పరమేశ్వరు నర్ధాంగలక్ష్మి కా గలిగెను. ఇట్టి కఠినతపపరీక్షలకు లోనైన పిమ్మట గదా పార్వతియైనను పరముదేహార్ధమును బడయగల్గినది ? ఐదువతనమున కాధిపత్యము బడసినది ? కన్యకలును, పుణ్యాంగనలును. ఎప్పటికి నైదువతనమును కోరి పార్వతినే పూజించుచుందురు గదా? అందరి మాటలేల? శ్రీకృష్ణుని భార్యకాగోరిన రుక్మిణిసహితము "నమ్మితి నామనము సనాతనులైన యుమామహేశులన్, మిమ్ము పురాణదంపతుల మేలు భజింతుగదమ్మ చాలపెద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతి సేయవమ్మ యీశ్వరీ"అని ప్రార్థించినది.

ఇంతవరకు బాగున్నది కాని యటుపైకథ కొంతరోత కలుగచేయుచున్నదని వ్రాయక తప్పదు. అష్టమాశ్వాసమున సుమా రొక నూరు పద్యగద్యములైన పిమ్మట హిమవంతుని యోషధప్రస్థపురమున రాత్రి చీకటిపర్విన పిదప జార చోరాది గూఢచారుల చర్య లాయాశ్వాసాంతమువరకు వర్ణింపబడినవి. ఆ రచనలు

కొన్ని మాధుర్యహీనములై యసహ్యము కలిగించుచున్నవి. అందలి బొజొంగులు, లంజకొండ్రు, అత్తగంతులు, చిల్లతర్కములు లోనగునవి యుత్తమకవుల మహాకావ్యములం దుండవలసినవి కావు. ఈకావ్యమునం దిచట నివి యప్రమస్తుతములు. గౌరవహీనములు నని యనకతప్పదు. ఆనాటి శ్రీమంతజీవనముయొక్కయు, విటవిటీజనముయొక్క వృత్తివిశేషములయొక్కయు వివరములు కవి యందు వర్ణించి యుండును. ఈ యంశములో నన్నయభట్టారకునకును, నన్నెచోడునకును చాల వ్యత్యాసము కనబడుచున్నది.

పిమ్మట నవమాశ్వాసమున, పార్వతీపరమేశ్వరులు వివాహానంతరమున కైలాసము చేరినవెనుక నభ్యంతరమున వారిదాంపత్యమర్మములను రతివర్ణన మనుపేర కవి మిక్కిలి యసహ్యముగా వర్ణించినాడు. ప్రాచీనసంస్కృతాలంకారికులు కావ్యమునందు రతివర్ణనముండవలయు నని విధించియున్నందున రతి వర్ణింపకున్నచో కావ్యమునకు అదియొక లోపముగా పరిగణించి పండితులు తమగ్రంథమునకు గొప్పగౌరవ మొసంగ రని భీతిచేతనో, మరి యేహేతువుచేతనో యీ మైధునవివరములు కొందరు గ్రంథకర్తలు వర్ణించి యుందురు. రతి యనగా ప్రేమరసము నగౌరవముగా వర్ణింపవచ్చును. అంతేగాని ఏకాంతము నభిలషించి శయనాగారముం జేరి తలుపులు మూసికొనిన దంపతులపై దండెత్తి, నక్కి పొంచి యక్రమముగా గదిలో దూరి నేరము చేసి రేయెల్ల రెప్పవేయక కొరతను దీసినట్లు గూరుచుండి వారిదాంపత్యమర్మముల నెల్ల వరుసగా రతివర్ణన మనుపేర వర్ణింప నెంచుట పరమాసహ్యము. వివేకలేశ మున్నవార లెవరును ఏదంపతుల శయనాగారమునందు నిట్లు జొరబడరు. తనతలిదండ్రుల దాంపత్యమర్మముల నెవడైనా లజ్జలేక వర్ణింపబూనునా ? అట్టి తలిదండ్రుల కెల్ల తలిదండ్రు లగుటచేత జగత్పిత లని పూజింపబడు పార్వతీపరమేశ్వరులమైధునమును వరుసగా బంధనక్రమములతో వర్ణించుచు కావ్యము వ్రాయుట గొప్పతప్పు. కావ్యమునం దిట్టివర్ణనలు దైవమునెడలను పాఠకునెడలను కూడ మహాపరాధము లని నా విన్నపము. అలంకారశాస్త్రనిబంధనల ననుసరించి రతి, మద్యపానవర్ణనమును గావించిన గాని ప్రబంధము సద్రసబంధురము కాదనియు. కావ్యలక్షణములకు లోపము కలుగు ననియు భ్రమించి నన్నెచోడు డీకావ్యమునం దివి విధిలేక వ్రాసియుండును గాని మరియొకటి గాదని తోచుచున్నది. ప్రాచీననిబంధనగ్రంథములయం దత్యంత భయభక్తులు గల యిట్టికవుల స్వతంత్రబుద్ధు లానిర్బంధవేదికలపై బలిపెట్టబడుచుండును. కావున నవి తలయెత్తి లోకము కనుపొడనూపుట బహుదుర్లభము.

6. ఇతరరసములు :

ఈకావ్యమునందు దాక్షాయణీమరణము, మన్మథునిమరణము. మిక్కిలి జాలిగొలుపునట్లు వర్ణింపబడినవి. గణాధ్యక్షులు దక్షాధ్వరధ్వంసమున కుపక్రమించునపుడును, దేవాసురయుద్ధసందర్భమునను వీరరసము వెల్లివిరిసినది. రణమరణపరిచ్ఛేదులైన పతులతోడన మరణపరిచ్ఛేద లగుచునుండిన పుణ్యసతులు దీనానాథవిద్వజ్జనంబు నపారవసుధారాసారంబులన దేల్చుచు సర్వస్వదానులై దానవీరముం బ్రకాశింపజేసిరి. మన్మథుని భస్మముచేయు రుద్రునందును దక్షాధ్వరధ్వంస దేవాసురయుద్ధములందును రౌద్రరసము పెక్కుతావులందు ప్రస్ఫుటమైనది. రణరంగనిహతుల రక్తమాంసముల హరించు శాకినీఢాకినీప్రభృతిపిశాచకృత్యములందు భీభత్సము విదితము.

గణేశోత్పత్తి, దాక్షాయణీమరణము, దక్షప్రజాపతిపునర్జన్మ, మన్మథదాహము, పునర్జన్మ లోనగు రంగము లద్భుతావహములు. భక్త్యావేశములో మతప్రాధ్యానముగా వ్రాయబడిన యిట్టికావ్యములలో హాస్యమున కెడము కనబడదు గాని కలహభోజను డైన నారదుడు శరవణసరస్సున నున్న కుమారుం గని నాటియాహారమున కమరేంద్రుం దెచ్చి పోరింతు గాక యని నిశ్చయించినపుడు నవ్వు రాకపోదు. కుమారుం జూచి వెరచి పరువులెత్తు నింద్రునందు భయానకము విస్పష్టము తన యెడ నెంతటిమహాపరాధము చేసినను పాటింపక పంచత్వంబు నొందిన దక్షుని పునర్లబ్ధజీవితుం జేసిన శరణాగతవత్సలు డగు పరమశివుని శాంతరూపమే శాశ్వతము.

ఉపసంహారము :

ఋతుమహిమచే మోళ్ళు చిగిర్చి మంటిదిబ్బలు సస్యవంతములై మనోజ్ఞములైనట్లు ఈకవి స్పర్శనమాత్రముచేత ఎట్టినీరసాంశమైనను బహురసవంత మగుచున్నది. అట్టిచో రమ్య మగు కుమారసంభవకథ యీకవిరాజుచేతిలో రమ్యతమమై ప్రకాశించుచున్న దని వేరే చెప్ప నక్కరలేదు. వర్ణనాసామర్థ్యముచేత కథయంతయు బయస్కోపునందువలె మనోనేత్రముల యెదుట గోచరించుచునే యున్నది.

ఈతని వివిధాంశకుశలత్వమునకును, భావకేంద్రీకరణనైపుణ్యమునకును అపూర్వభక్తిమతావేశములు తోడై పదారువన్నెమెరుగుబంగారమునకు పరిమళ మొసంగుచున్నవి. కావున నీకావ్యకర్త కాంధ్రకవులలో నొక యగ్రస్థానము శాశ్వతముగా కల దని నిస్సందేహముగా వాకొనుచు విరమించుచున్నాను.

—గొబ్బూరు వెంకటానంద రాఘవరావు*

భారతి ఏప్రిల్ 1935.

# సంజయు రాయబారము

కవిబ్రహ్మ తనభారతములో సంజయప్రతిమను మిక్కిలి సమర్థతతో సృష్టించియున్నాఁడు. సర్వశాస్త్రపారంగతుఁడును, వేత్తయు, రాజనీతికోవిదుఁడు నగు తిక్కనమహర్షియే సంజయపాత్రను స్వయముగ ధరించి ప్రదర్శించినట్లు గనపడుచున్నది. ఉత్తమవంశజాతుఁడు గాకపోయినా తనదీశక్తిచేత రారాజుయొక్క సభలో గౌరవస్థానమును వహించి ధృతరాష్ట్రచక్రవర్తికి చెలికాఁడై, ఆంతరంగిక సచివుఁడై కౌరవరాజ్యరథమును భీష్మవిదురులకు దీటుగ నడిపి యున్నాఁడు. కౌరవ రాజ్యనౌక తుపానులో చిక్కికొని క్లిష్టపరిస్థితులలో నుండగా సామోపాయమున దానిఁ దరిజేర్చుటకు వలయునుపాయము గల కర్ణధారు డితడే యని విశ్వసింప బడుట యాతని భాగ్యముగదా! పాండవపక్షమున శౌర్యమునకును ఖడ్గమునకును దీటయి, ఆకాలపురాజ్యతంత్రజ్ఞుల కెల్ల మేటియై శ్రీకృష్ణు డున్నాఁడు. ఏకాలము నందును ఎవ్వరికిని తీసిపోనికార్యచతురుఁడు ధర్మరాజు. ఈ యిరువురుదిట్టలను డీకొనుట కర్హుఁ డని ప్రజ్ఞాచక్షు డగు ధృతరాష్ట్రునిచే బంపబడినవాడు సంజయుడు. ఇక వేరుయోగ్యతాపత్రము లెందుకు సంజయునికి?

సంజయునియెడ పాండవుల కెట్టియభిప్రాయము గలదో విచారింతము. ఇతడు శ్రీకృష్ణునకు భక్తుఁడు. ఈతని 'లెస్సదనం' బర్జునునకు నచ్చినది. ఉభయులును ప్రేముడి గల బాలసఖు లట, మఱియును ధర్మజునితోడి రాయబారము ముగించిన వెనుక, సెలవు గైకొనుచు సంజయుడు 'నే నాడినమాటలలో గలుగు లోపముల సైరింపుము' అని వేడుకొనఁగా ధర్మజు డాడినమాటలు గమనింపఁ దగును.

గీ. పోయివత్తు గాక యాయున్నయందఱు
వినగ నాడి తీవు విశదభంగి
నొక్కమాట యయిన నుచితంబు గానిది
గలదె యి ట్లనంగ వలయు నెట్లు?

క. ఎదురున్నరూపు వలుకగ
మది గటకట బడవు నీవు దుర్ణయమును బె

ట్టిదమును బెండును నగు పలు
కొదవదు నీనాలుకకు నయోన్నత యెపుడున్.

క. నీవొండె విదురు డొండెను
గావలయుం గాక యిట్టి కార్యంబులకున్
రా వేఱె కలరె తగువా
రీవినయమునేర్పు గలదె యితరుల కెందున్.

సకలధర్మవిదుం డైన ధర్మజునిమనసున కెక్కునట్లుగా దురుసులు గాక జల్లు పొల్లులు లేక మాటలాడి జయప్రదములుగ రాయబారములు జరిపి, స్వామికార్యమును నిర్వహించుకొన్నాడు.

సంజయుని రాయబారమునకు బంపునపు డున్న పరిస్థితుల ముందుగ దెలిసికొనవలసి యున్నది; జూదమునకు పూర్వము కౌరవపాండవులు పైతృక మయిన రాజ్యమును చెరిసగంబుగా బంచికొని కుడుచుచుండిరి. మొదటిజూదములో పాండవులు తమభాగము నోడిపోగా, కల్లోలముల నడంచుటకై ధృతరాష్ట్రుడు వారి భాగమును తిరిగి యిచ్చివేసెను. పునర్ద్యూతములో నోడిపోయినవారలు అజినవల్కలంబుల గట్టి, కందమూలఫలాశనులై బ్రహ్మచర్యంబునం బండ్రెండేండ్లు వనవాసంబు నొక్కయే డజ్ఞాతవాసంబును సేసి యందెఱుంగబడిరేని వెండియుం బండ్రెండేండ్లు వనవాసంబును నొక్కయే డజ్ఞాతవాసంబు సేయవలయు నని నిశ్చయింపబడెను. ఓడిపోయినవారిరాజ్య మేమి గావలయునో అందు జెప్పం బడలేదు. పాండవులు తమరాజ్యము నెవరికిని ఒప్పగించలేదు, ఒకరిని బెట్టి యేలించుకొనలేదు. తమకు గానిది యేమయినను సరియే యని యూరకుండి యుందురు. లేక పరు లనుభవించుటకంటె బంధువు లనుభవించుటయే మేలని తలంచి యుండవచ్చును. వనవాసము అజ్ఞాతవాసము ఎట్లో గడపంబడినవి. ఉత్తరగోగ్రహణసమయమున అర్జునుడు గుర్తింపబడెను. అప్పుడు దుర్యోధనుడు భీష్మాదులఁ జూచి, 'యీపదమూడవయేటికొలంత' గలుగం బార్థుండు దన్నెఱింగించుకొనియె ఎక్కువతక్కువలు నిరూపించి భీష్ములు దీని నిశ్చయింప నర్హు' లని చెప్ప, భీష్ముడు—

సీ. రెండవయేట నొక్కం డధిమాస మి
 ట్లెక్కిన యన్నెల లెల్ల గూర్చి
కొన బదమూడుహాయనములు దప్పక,
 నిన్నటితోడన నిండె యంత

అని నిర్ధారణ చేసెను. కాని యీతీర్పును దుర్యోధను డంగీకరించినట్లు గనుపడదు. పాండవుల పక్షమునుండి రాయబారిగా వచ్చిన ద్రుపదపురోహితునితో కర్ణుడు—

గీ. దీన నేమి తప్పు కానకు నేగిన
యతఁడు సమయవృత్తి నాక్రమించి
తండ్రిపాలు మాకు దగు నంచు నడియరి
తనము సేసి రాక తప్పుగాక.

యని జూపి చెప్పగా భీష్ముడు మరల—

క. నరు డాలవెనుక వచ్చిన
గురురా జడుగంగ నీవు గురుడున్ గృపుడున్
గురుసుతుడు వినగ వారల
చిరసమయము దెగుట యేను జెప్పనె తెలియన్.

అని ఉత్తర మిచ్చియున్నాడు. ఇది యట్లుండె.

ఉత్తరవివాహ మయినవెనుక విరాటునిమందిరమున బంధుజాలమంతయు సభ జేసి భావికర్తవ్యమును చర్చించిరి. సాత్యకి, సహదేవుడు మున్నగు యువకులు ఖడ్గవాదము గావించిరి. ద్రుపదుడు, బలరాముడు మున్నగువృద్ధులు కార్యవాదము ననుసరించి, సామోపాయమున కార్యము సాధింప వలయు నని నిశ్చయించి, ద్రుపదపురోహితుని రాయబారిగా బంపిరి. అప్పటికే సమరసన్నాహములు చాల వరకు పూర్తి యయ్యెను. భరతవర్షములోని రాజు లెల్లరును ఏడక్షౌహిణులు పాండవపక్షమునను, పదునొకండక్షౌహిణులు కౌరవపక్షమునను గా ఉభయపక్షములను జేరియుండిరి. అయినను ద్రుపద పురోహిత రాయబారముయొక్క యుద్దేశమును విరాటుని నిండుసభలో శ్రీకృష్ణు డిట్లు చెప్పియున్నాడు.

"ఇది ఇక్కడికార్యంబునకుం దోచిన తెఱంగు. అక్కడివారిచిత్తవృత్తి యెట్టి దగుట యెఱుంగము. ఎదిరితలం పెఱుఁగక యది కార్యం బని నిశ్చయింప నగునే. కావున నియ్యవసరంబునం దగినమానిసి నందులకుం బుచ్చవలయు. దుర్యోధనుండు వీరికి రాజ్యంబు పాలిచ్చిన మేలు. అట్లు గాక తక్కిన నప్పటికి బోలినపని సూచించుకొందము."

దీనినిబట్టి పాండవులు గోరినది తమపా లని తెలియనగును. సగ మని నిర్ధారణగ జెప్పకున్నను భాగ మనగా సగభాగ మని యెంచవచ్చును. అప్పటి కింకను

తమపక్షమున ఎన్ని సైన్యములు చేరునో తెలియకపోవుటచే గాబోలు భాగ మియ్యని యెడల యుద్ధము జరుగు నని చెప్పలేదు. శత్రువులు సమరసన్నాహము చేసికొనక అశ్రద్ధతో నుండుటకై యీ విషయమును స్పష్టముగా జెప్పియుండక పోవచ్చును. అయినను సమరసన్నాహములు మాత్రము తీవ్రముగా జేయబడుచుండెను. పురోహితుడు రాయబారమునకు బోవులోపలనే ఏడక్షౌహిణులును సమకూడెను. ఇంతలో ప్రతిపక్షులకును పదునొకండక్షౌహిణులసైన్యము సన్నాహ మయ్యెను; ద్రుపద పురోహితుడు రాయబారమునకు వచ్చెను. ప్రత్యేకము రాజును ముఖ్యసభ్యులను సందర్శించి ఉచితవాక్యములచే వారి హృదయముల మరల్చెను. రాయబారమును గూర్చి చర్చిందుటకై సమావేశమయిన కౌరవరాజసభలో పురోహితుడు తనసందేశము నిట్లు వచించెను.

సీ. ధృతరాష్ట్రపాండుభూపతులు సహోదరు
లగుటయు వారలయాత్మజులకు
దమతమతండ్రులధనముల గైకొన
దగుటయు మీకు నందఱకు జూడ
నుచితంబ కాదె—

గీ. అదను దప్పకుండ నమ్మహాత్ముల నెమ్మిఁ
బిలువఁ బంచి హితము ప్రియము రెండు
పక్షములకు నగుట పాటించి తగవుమై
గొంతభూమి యిచ్చి కూడి మనుడు.

పైరెండుపద్యములను బట్టియు రాయబారి నిక్కచ్చిగ సగముభాగము కోరలేదు. తండ్రిహక్కు ననుభవించుటకు పాలడవు లర్హు లనియు, కొంతవారి కియ్యవలసిన దనియు మాత్రమే యతడు కోరియుండెను. ఖండితముగ సగ మియ్యవలసిన దని కోరకుండుటచే పాండవులు లోబడి తక్కువ గోరుచుండి రనిగాని, బేర మాడు పద్ధతి వారికి తెలియ దనిగాని చెప్పుటకు వలనుపడదు. భాగమే యియ్యనను పట్టుదలతో నున్న దుర్యోధనుని 'అంత యింత యి' మ్మని యడిగి, మొదటనే వారిని బెదరగొట్టి కార్యముఁ జెడగొట్టుకొనుట తెలివి గాదు. షరతులవిషయమును ముభావముగ నుంచి కౌరవులను రాజీకి ఉన్ముఖుల జేయుటయు వారి యభిప్రాయము ప్రయోగించి చూచుటయునే యీ రాయబారముయొక్క ఉద్దేశము. కృష్ణుడు జెప్పిపంపినదానికి బ్రాహ్మణుడు జెప్పినది యనుకూలముగనే యున్నది.

దీనికి కౌరవపక్షమువా రిచ్చిన యభిప్రాయము మనము గమనించవలసి యున్నది. దుర్యోధనాదుల తరఫున కర్ణుడు ప్రత్యుత్తర మిచ్చుచు పాండవులు షరతులను భిన్నము చేసి రనియు, సమరసన్నద్ధులై వచ్చి సంధి గోరినవారితో షరతులు మాట్లాడుట తమపౌరుషమునకు భంగ మనియు, జూదములో రాజ్యము పోగొట్టుకొని యుండుటచే పాండవులు తమతండ్రిభాగమును గోర వీలు లేదనియు వేడికొని రాజ్యము సంపాదింప ధర్మము గాదనియు చెప్పియున్నాడు. భీష్ముడు కన్నున లేచి కర్ణుని తూలనాడి పాండవులు సంధిషరతుల సంపూర్ణముగ నిర్వర్తించి రని ప్రకటించెను. అంతట ధృతరాష్ట్రుడు ఉభయులను సర్ది పుత్రులతో నేకీభవించి యుద్ధమునకు గడంగుటకు గాని భీష్ము ననుసరించి భాగ మిచ్చుటకు గాని యంగీకరింపక పాండవులును తమబిడ్డలే యనియు ఉభయులకును పోరాటము పనికి రాదనియు, అందఱును కలసియుండుట తన యభిప్రాయ మనియు పెద్దలందఱితోఁ యోచించి తనయభిప్రాయము నాచరణలోనికి దెచ్చుటకై మార్గము యోచించి సౌమ్యు నొకనిని పాండవులయొద్దకు బంపుదు ననియు చెప్పి బ్రాహ్మణుని బంపివైచెను.

కవిబ్రహ్మ ధృతరాష్ట్రపాత్రను రచించుటయందు గొప్పసామర్థ్యమును గనఁబరచినాడు. ధృతరాష్ట్రుడు మిక్కిలి స్వార్థపరుడు. అతిదూరాలోచనాపరుడగుటచే నేవిషయమును త్వరగ నిశ్చయించుకొనజాలడు, కార్యముల సాధించుటలో దుస్సాధనముల నుపయోగించుటకు జంకనివాడు. భీష్మద్రోణకర్ణులభుజశక్తియం దమితమైన నమ్మకము. భీష్మద్రోణులకు భిన్నముగ వర్తించినచో వారు చెదరిపోవుదు రని భయము, కాని కొడుకులతో జెప్పి వారిసలహా ననుసరింపజేయజాలడు. యుద్ధములో తాము గెలువవచ్చు నని యాశ. భీమార్జునుల జయించుట దుర్ఘట మని సందేహము. పాండవపక్షమున కృష్ణు డున్నా డని భయము ఇట్టి పరిస్థితులలో ధృతరాష్ట్రుడు చేయవలసిన దేమి? కుమారుని సంధి కొప్పించలేడు. యుద్ధము జరుగుచో జయాపజయము లెట్లగునో యను సందేహము. భాగము నియ్యకుండ యుద్ధము జరుగకుండ చేయు టెట్లు? భాగ మియ్యనన్నచో పాండవులతో సంధి పొసగదు. వనవాసాయాసబాధలచే పీడితులై పాండవు లుద్రేకపూరితులై యున్నారు. వనవాసము జేసినకొత్తలో లోకము వారిపక్షము వహించి యున్నది ఏడక్షౌహిణులు వారికై చావ సిద్ధు లయి యున్నారు, కొడుకును మందలించి సంధిసేయుద మన్నను ఏడక్షౌహిణులతోడ్పాటు గలిగి, సమరోత్సాహముతో

నున్న పాండవులు స్వల్పభాగమున కంగీకరింప రనుట నిశ్చయము. అందఱును కలసియుంద మను నెపముతో సమరము చాలించినచో యుద్ధమునకై తోడ్పడ వచ్చిన వారెల్లరును తమదేశములకు వెళ్ళినతరువాత ప్రస్తుతము మనస్సులలో నున్నవేడి కొంతతగ్గిన వెనుక సంధిషరతులు గుదురుట సులభము. దుర్యోధనుడు రారాజుగ నుండి తక్కిన కురుపాండవులెల్లరును అతని పంపుసేయుచు సామంతులై యుండుటయె యతని యాశయము. ఆదరము నటించి, యుద్ధము మాన్పి, పాండవుల రావించి, తనతో కలిసియుండు మని కోరుటకై యతడు రాయబారము బంప నిశ్చయించుకొనెను. ధర్మరాజు చెప్పినట్లు కౌరవపక్షమువారిలో ఉభయ పక్షములకును విశ్వాసపాత్రులై రాయబారము నడపసమర్థులు విదురసంజయులు. భీష్మద్రోణులు తమకౌశలమును కత్తితోఁ జూపగలరు; గాని రాయబారపుజూదపు టెత్తులకు బనికిరారు. విదురసంజయులలో విదురునకు పాండవులపై గల ప్రేమ మిక్కుటము. ధృతరాష్ట్రునిదుర్వ్యవసాయములకు లొంగడు. సంజయుడు సమర్థుడును సధర్ముడునే గాని తాను ధృతరాష్ట్రునియుద్యోగి నని మరువజాలడు. కనుక ధృతరాష్ట్రుడు పని కతనికే నియమించెను. ధృతరాష్ట్రుడు సంజయునికి చెప్పి పంపిన సంగతు లీ క్రిందిపద్యములవలన దెలియనగు.

గీ. పాండునరపాలసుతు లుపప్లావ్యమునకు
వచ్చియున్నారు, నీ వేగి వాసుదేవ
సహితముగ వారిఁ గని, తద్విషాద మేమి
భంగి మాను నమ్మెయి దగఁ బలుకవలయు.

గీ. మనల నింక నమ్మ రనృతాత్మ లన్యాయ
పరులు గర్వ్వ లనుచు బాండుసుతులు
గూడి మనుట కియ్యకొననేర రైనను
ధర్మజుండు గలఁడు తగవు నడప.

కం. నెయ్యము పాటించి కడున్
డియ్య మెసగ నలుక లెల్లఁ దీరెడు నటుగా
గయ్య మను తలపు లోనుగ
నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగుగాన్.

వ. శాంతిప్రకారంబునం గార్యంబు నడిపి యొక్కటియై మనుట యొడగూర్చి రమ్ము, రథం బెక్కి పొమ్ము.

ఇందులో పాలిచ్చుమాట లేదు. లేదనియు జెప్పడు. యుద్ధము మాన్పి కలిసి యుండున ట్లేర్పాటు జేయవలయు నట. పాండవులను సైతము తనబిడ్డలుగ జూచు కొనును. దుర్యోధనుడు రారాజు గనుక తనతక్కిన కుమాళ్ళ వలెనే పాండవులును తనతో గలిసి సుఖముగ జీవించవచ్చును. అనగా రాజకుమారులవలె అన్నవస్త్రము లకు లోపము లేక రాజోపచారముగ జీవించవచ్చు నని యర్థము. దుర్యోధనాదులు బ్రాహ్మణునితో భాగము లేదని చెప్పివైచిరి; గాని సంజయరాయబారమునకు మాత్ర మడ్డు రాలేదు.

ఇట పాండవులసంగతి యోచింతము. బ్రాహ్మణుడు తిరిగిపోయి దుర్యోధనాదులు భాగ మిచ్చునుద్దేశముతో లే రనియు, భీష్ముడు కోపించి చెప్పినను ప్రయోజనము లేకపోయె ననియు చెప్పియుండును. అందుచే సంధి యగునను ఆశమాత్రము విడిచి ధృతరాష్ట్రుడు బంపురాయబారికై వేచియుందురు. అందు చేతనే పాండవపక్షమున సంజయునితో మొదట యుద్ధప్రసంగమే జరిగినది గాని సంధిప్రసంగము జరుగనే లేదు.

సంజయు డుపప్లావ్యపురమునకు వచ్చి, మొదట శ్రీకృష్ణార్జునుల సందర్శించెను. వా రాతని సమాదరించి కార్యము విన్నవించగా అర్జును దుత్సాహముతో ప్రత్యుత్తర మీయ బూనుకొనుటయు, కృష్ణు డాతని వారించి, కౌరవుల కంత్యకాల మాసన్న మయిన దనియు, వారందఱును అంత్యకోర్కెలను దీర్చుకొని మరణ శాసనముల వ్రాయించి యుంచుకొనవలయు ననియు, తీక్ష్ణమైన ప్రతాపవాక్కులతో ప్రత్యుత్తర మిచ్చెను. మరునాడు ధర్మరాజు సభ గావించి రాయబారము వినిపింప గోరెను.

ధృతరాష్ట్రుడు మీయందఱిక్షేమమును మొదట విచారించె నని చెప్పగా, ధర్మజుడు ద్వంద్వార్థముగా మాపెదతండ్రియొక్క కృపాతిశయముచేతనే యిప్పటి కీవిధముగ నున్నా మని చూపి చెప్పి, తిరిగి యందఱియొక్కయు కుశలప్రశ్న మడిగి వరుసగా నీక్రిందిప్రశ్నము లడిగి, యక్కడిసంగతులు విచారించెను.

1. ద్రోణకృపాశ్వత్థామలు సుఖముగ నున్నారా ?
2. భీష్మునికి క్షేమమా ? కౌరవు లాతనిమాటలను గౌరవింతురా ?
3. బ్రాహ్మణవృత్తుల నిలిపి వారిని మన్నించుచున్నారా ?
4. గడిదేశముల రాజులతో కలహములు లేవు గదా ?

5. ఘోషయాత్ర కురుకుమారులకు జ్ఞాపక మున్నదా ?

6. అనిలో నర్జును నెదుర్కొని కౌరవులు బ్రతికిపోవుట సాధ్యమా ?

7. కౌరవులు కర్ణునిమాటపట్లనే యున్నారు గదా ?

ఈ ప్రశ్నల కన్నిటికిని సంజయుడు సరి యయిన ప్రత్యుత్తరము లిచ్చె నేని కౌరవరాజ్యముయొక్క గుట్టుమట్టంతయు బయల్పడును.

1, 2, 3 ప్రశ్నలవలన కౌరవులలో నేకాభిప్రాయములు లేక, అంతః కలహములు మెండుగ నున్న వనియు, దేవబ్రాహ్మణవృత్తులు నశించుచున్న వనియు, మహావీరు లగు పెద్దలెవ్వరును కౌరవపక్షమున నుత్సాహముతో యుద్ధము చేయరనియు తేలగలదు. నాలుగవప్రశ్నవలన గడిదేశముల నున్న అడవిజాతులు రాజ్యముపై దండయాత్రలు జరిపి జనులను బాధించుచుండుటచే, కౌరవులు ప్రజానురాగము వడయ లేదని స్పష్టమవును. 7వ ప్రశ్నవలన పురోహితుడు రాయబారమునకు వచ్చినప్పుడు దుర్యోధనాదులకు ప్రతినిధిగా కర్ణుడే రాజ్యభాగ మిచ్చుట లేదని చెప్పియుండుటచే వారు భీష్మునిమాటపట్లలో లేక, కర్ణుని నాయకత్వమున నుండుటచేత, సంధి పొసగక యుద్ధమే సంభవించు ననియు, 5, 6 ప్రశ్నలవలన తమకే తప్పక విజయము చేకూరు ననియు తెలిసి కొనదగును. ఈ ప్రశ్నలకు సంజయు డిచ్చిన ప్రత్యుత్తరములవలన నాతనిచాతుర్యము గ్రహింపదగును.

సంజ : కౌరవపక్షమున దుర్మార్గులును సన్మార్గులును గలరు. పెద్దలు చెప్పినను దుర్యోధనాదులు వినునట్లు లేదు. దుర్మార్గులమీద కోపముచే నీవు యుద్ధము ప్రారంభించితివేని, నీవనినప్రకారమే నీవు గెలుచుటయే నిశ్చయము. అందుచేత, దుర్మార్గులమూలమున పెద్దలు సహితము చావవలసివచ్చును. అయినను నీవు కృపాళుడ వయి, సంధి సేయ నిశ్చయించితివి, గనుక వారంద ఱింక క్షేమముగనే యుందు రని ముందఱికాళ్ళకు బంధము వైచి జవా బిచ్చినాడు. ధృతరాష్ట్రునిదుశ్చరితమే మీయిప్పటిదుస్థితికి కారణమందు వేని అదియును క్షంతవ్యమె. అతడు స్థిరచిత్తుడు గాకపోవుటచే గొడుకుల దుశ్చరితమును నాపలేకపోయెను గాని ఇప్పు డతడు పశ్చాత్తప్తుడై శాంతచిత్తుడై యున్నాడు మీరాతనితో సంధి చేసికొని కలిసిమెలిసి యుండినచో, నతడు మునుపటివలె దుర్యోధనాదుల దుర్వ్యవసాయములను సాగనీయడు. నీయజాతశత్రుత్వనామమునకు దగునట్లు

వారు మునుపు చేసిన యపకారముల నన్నిటిని మరచిపో ప్రార్థించెదము. మీరు దేవబ్రాహ్మణుల కిచ్చినవృత్తులు కౌరవులు నిరాటంకముగ జెల్లించుచున్నారు. దాని విషయముమై నీవు విచారము పెట్టుకొన నవసరము లేదు. మీపరాక్రమము లోక విదితము. మీరు మహాపరాక్రమవంతు లయ్యును శాంతాత్ము లగుటచే యుద్ధమునకు గడంగ రని జనులు చెప్పుకొనుచుందురు. అని చెప్పి మీరందఱు వినగా కొలువులో జెప్పు మని మీతండ్రి వచించిన పల్కులు గలవు. సావధానముగా వినుం డని కోరగా ధర్మరాజాశుష్కప్రియములకు గినిసి, అయ్యా, ఇరుగో నా తమ్ములు. ఆయన కృష్ణుడు. వీరు నాబంధువులు. తండ్రి నిన్ను జెప్పుమన్న దంతయు వినుటకు సావధానముగనే యున్నారు. అని ఎఱుగనివానితో జెప్పిన పేర్లవరసగా జెప్పి గంభీరించి యూరకుండెను.

అంత సంజయుడు ధర్మరాజుయొక్క గంభీరవాక్యములచే సంధియెడ గొంత నిస్పృహ జెంది పైకి గన్పట్టనీయక మరల నిట్లని సందేశముం జెప్ప ప్రారంభించెను.

సంజ : అయ్యా, సావధానులరై వినుడు. ధృతరాష్ట్రుడు సంధికార్యమునెడ మిగుల నాసక్తుడై యున్నాడు. నా ప్రయాణమునకై రథము నాయన స్వయముగ బన్నించినాడు. జగడమువంటి తేలికపనులకు మీయట్టియుదాత్తు లుత్సహింపరు. దుర్యోధనునివలన మీవంశమునకు గలిగిన యపకీర్తిని నీవ పాపవలయు. సమరము జనక్షయమునకు గారణము. గెల్చినను ఓడినను దుఃఖమే యగును. వృద్ధులను బాలురను సఖులను బంధువులను గురువులను జంపి పడయగలసుఖములు దయామయుడ వైన నీ కేపాటి రుచించును ?

అదియును గాక- నీవు యుద్ధమున కంగీకరింపవు గాని కృష్ణభీమార్జునాది మహాయోధసంపన్నుడ వైన నిన్ను గెల్చుట దేవతల కయినను సాధ్యమా ? భీష్మద్రోణకర్ణాదులం గూడిన దుర్యోధనుని జయించుట కెవరితరము ? ఇట్టి మీకు అన్యోన్యకలహము మేలుగా దని పక్షపాతములేనివా రెల్లరును జెప్పగలరు. అయ్యా, క్రోధము శాంతింపుము. దానికి భీష్ముడును సర్వలోకంబును సమ్మతించును.

ధర్మజుడు : సంజయా ! ఎందుకు నీకీ ఉలుకు ? నేను యుద్ధము దక్క మతేదియు నక్కరలేదంటినా ? పోరాటము లేక కోర్కెలు ఫలించెనేని వెఱ్ఱివాడైనను పోరున కుత్సహించునా ? ధనతృష్ణాపీడితులు కామపూర్తికై దుష్కర్మము

లొనరింతురు. కాని ఉచితము అయినసౌఖ్యముల గోరునట్టివారు దురంతములకు జొత్తురా? పెనకువలు సంతాపకాలు గాక సుఖావహములా? తండ్రి రాజచిహ్నముల మాకుమాత్ర మేల యొసగఁడు? వెనుక తా నవినీతుడై వర్తించినను ఇప్పుడు మమ్మయినను న్యాయమున వర్తించు మని బుద్ధి చెప్పెడి యుక్తమె కదా? ఎదుటి వారును మనయట్టివారని భావించినసే సంధి పొసగును గాని "మాకు కుడుము, మీకుమాత్రము తుంపు" అనుపద్ధతి ననుసరించినచో మనసు లెట్లు గలియును? అదిగాక ఎందుకు నీవు మమ్ములను 'సంధి—సంధి' యని వేధించెదవు? ధృత రాష్ట్రుడు మనకు క్రొత్తవాడా; హీనస్థితియందున్న మమ్ము రావించి రాజ్యము చదివించుటకు? ఆయన వెఱ్ఱివాడు గాడు. నీవును పక్షపాతము లేనట్లు మాట్లాడి ముందు మాపరాక్రమము బొగడి వెంటనే వారిని జయించుట సాధ్యము కాదని చెప్పితివి. ఉభయుల బలాబలములును అర్జునునిగాండీవమును భీమునిగదయునే నిర్ధారణ చేయగలవు. ఆ సంగతి నటుంచి, బుద్ధిమంతుడవు నీవు వచ్చి కోపోపశమ నంబుగా బల్కితివి. ఇదివఱకు వారి నేరముల నన్నిటిని సైరించితిని. ఇంకను సైరింతును. మాతండ్రి మమ్ముల బిలిపించి మాభాగపురాజ్య మిప్పించి ఇంద్రపస్థమో లేక మఱియొకపట్టణమో మాకు రాజధానిగ నేర్పరుపు మనుము. అంతటితో అన్ని చిక్కులును దీరును.

పైరెండుసంభాషణల సారాంశ మిది. దయామయుడవై యుద్ధము మాన వలసిన దని సంజయుడు ప్రార్థించినాడు; భాగముసంగతి యెత్తుకొనలేదు. సరే, యుద్ధము నాకక్కఱలేదు. రాజ్యభాగము మాత్రము తప్పక యిప్పించుమన్నాడు ధర్మరాజు. ఇఁక మఱి వాదమున కవకాశము లేదు. సంజయునిమంత్రము పూర్తిగ పారలేదు. అంతట—

సంజ: రాజా! నేనింతసేపు జెప్పినను నాకింకను తృప్తి గలుగలేదు. నీవు విసువులేనివాడ వగుటచే మఱల నొక్కింత జెప్పబూనితి. అయ్యా! నీవు రాజ్యభాగమును గోరితివి. అహింసాధర్మమును అనింద్యచరిత్రయునే నీరాజ్యములు మఱి యింకొకరాజ్యము నీకెందుకు? కౌరవులు దుర్మార్గులై పంచి యియ్యనిచో, నీవు యుద్ధము చేసి గెల్చి, నెత్తురుకూడు దినుట కంటెను బిచ్చమెత్తుకొనుటయే మీనుచరితమున కనువై యుండును. క్రూరకర్మ మొనర్చుట కిష్టము లేకయేకదా పన్నెండేండ్లు వనవాసంబును ఒకయే డజ్ఞాతవాసమును సల్పితివి. ఇప్పుడు యుద్ధము నకు దిగి, యిదియంతయు వృథచేయుదువా? రాజసూయాధ్వరముచే దేవ

బ్రాహ్మణుల తృప్తిపరచి శమదమాదుల బడసిన పుణ్యమూర్తివి. నీస్వచ్ఛచారిత్రము నకు హింసాకళంకమును బట్టనీయకు. జూదరు లైన దుర్మార్గులనే రాజ్యమును నెత్తిన గట్టుకొన నిమ్ము. గురువులను వెదకి వెన్నాడి పట్టి గొంతులు గోయకుము. కోపము నడంచుకొమ్ము.

ధర్మ : సంజయా! నీవు చెప్పినది నే కాదనను. కోపము నివారింప దగి నదియు అహింస ఉత్తమధర్మ మనియు నే నంగీకరించెదను. వంశదూషకులను లోకకంటకులను నిర్మూలము గావించుట ధర్మ మని పెద్దలు జెప్పుదురు. క్షత్రియు లకు సంగ్రామము ధర్మ మవునో కాదో నీవే నిర్ణయింపుము. మన కీవితర్కముతో నవసరము లేకయే కర్తవ్యాకర్తవ్యము లను నిర్ణయింపగలవాడు వాసుదేవుడు గలడు.

అనిన విని జనార్దనుఁడు సంజయున కిట్లనియె :

కృష్ణ : నే నెప్పుడు పాండవుల శుభము గోరెదను. పుత్రపౌత్రులతో నొప్పు అంబికేయునకు చేటు రాకుండు గాక యనియు తలంచెదను. నీవు రాయ బారమునకు వచ్చుట నాకు సంతోషము, కాని ధర్మరాజుయొక్క మాటలు సంధి కవకాశ మిచ్చునట్లు తోచవు. ధృతరాష్ట్రుని తియ్యనిమాటలకు ధర్మరాజు సంత సించువాడు కాడు. కౌరవులతో కలిసి యుండుట కాయన యంగీకరించినను మేలే. లేక తమతండ్రిపా లి మ్మని యెత్తివచ్చినను తప్పుగాదు. అవసానపుబ్రతుకుతో అహింసాపరు లని పేరొందుట కంటె ప్రతాపమును జూపుటయే మేలు. క్షత్రియు లకు సంగ్రామము కులధర్మము, పరాక్రమవంతులు ఇచ్చువారే కాని వేడుకొనువారు కారు. తమన్యాయార్జితధనమును ఒరు లపహరించినప్పుడు ఉపయోగించుకొనుటకే కదా శస్త్రాస్త్రములు నిర్మింపబడినవి! అది యట్లుండె. నాఁడు కొలువులో ద్రౌపది కొదవిన మానభంగమునకు నీ వేమి జెప్పుదువు?

సంజ : ఈ సంధిమాటల సమయమున నది తలంపునకు రానిచ్చినచో కార్య మొనగూడుట దుర్లభము.

కృష్ణ : సంజయా! అది చాలక కర్ణుడు కూరిమికల మఱియొకమగనిని వెదకికొ మ్మని పాండవపత్నికి చెప్పెను.

క. నరునకు నది వాఙ్మయ మగు
 శరమై హృదయంబు నాటి చలియింపక దు

ర్భరవేదన జేయంగా
చిరకాలము తచ్చికిత్స చేసెనె చెపుమా !

దుశ్శాసను డన్నట్లె వీరు గొడ్డుపోయిరి కాని వీరిపౌరుషంబువలన వారికి నేమి ఫలించె ? కావున సంధికార్య మత్యంతదుర్ఘటం బని తలంచెద. అయినను పాండవేయుల నెట్లయినను ఒడంబరిచి నేనే అచటికి వచ్చి కౌరవులకు బుద్ధి జెప్పి, సంధి కొడంబరుప జూచెద. వారు న్యాయమైన నాయేర్పాటున కొడంబడి పాలీయనిచో పాండవబాణాగ్నిచే గాక వారి లోభ మను చిచ్చుచేతనే దహించుకొని పోదురు.

క. ఏ నీపనికై వచ్చెద
తా, నొప్పదలంచె నొండె, దప్పదలంచెన్
దానన నెగడెద మే మ
మ్మానవనాథునకు జెప్పుమా చుతమెల్లన్.

వ. అనిన విని సంజయుడు ధర్మతనయునితో అట్లయినఁ గదులెస్స గదా ! నా వచ్చినకార్యంబు సఫలం బయ్యెగదా ! పోయి వచ్చెద ననియెను. ధర్మజుడు సెల విచ్చుచు చివరకు సంధివిషయమై ధృతరాష్ట్రునికి జెప్పు మని యిట్లు చెప్పి యున్నాడు.

మమ్ము శైశవంబున మాతండ్రి రాజ్యపీఠమున నిల్పి ప్రభుత్వ మిచ్చి ప్రోచి పేరు గాంచితివి. ఇప్పు డుపేక్ష జేయుట న్యాయమా ? కౌంతేయాగ్రజుడు యుద్ధముపొంత బోనొల్ల డనియు, పౌత్రులను అధర్మవృత్తికిని చావునకును దప్పింపు మనియు పితామహునకుం జెప్పుము. ఇతరులు సుయోధను నడ్డంబు జెప్ప నొరమిం జేసి పెద్దవాడ నయిన నామాటలుగా వానికి దెలుపుము. తగవులు లేక మనమనధనంబు లనుభవించి సుఖం బుండుట మేలు. ఎక్కువయియ్య నొల్లనిచో కుశస్థలంబును వృకస్థలంబును వాసంతియు వారణావతంబును ఇంద్రప్రస్థంబును చాలును. దానికిని ఇయ్యకొవదేని ఎందేనియు నొక్కటియగునట్లుగా తనతోఁబుట్టువుల మేవురము నిలువ దావు లయి దిచ్చిన సర్వశాంతి యగు.

ధర్మరాజువలన నిట్టి సరసములయిన షరతులను సంపాదింపఁ గలిగిన సంజయుని రాయబారము సఫలంబె గదా ! దుర్యోధనుడు వీని కంగీకరింపని దోషము వానిదియే యగును,

—వున్నవ లక్ష్మీనారాయణ*

* జయంతి. సం. 1 సం. 1. ప్రభవ, గ్రీష్మం 1927.

# పోతన కవిత్వ పటుత్వము

ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకన్నట్లే, పోతన్నది సహజపాండిత్యమనీ అతను రామభక్తిపరాయణుడనీ, సహృదయులు తమఅభిప్రాయాన్ని "గుళికారూపంగా" ప్రకటించారు. వానితో ఇటీవలిపాఠకలోకానికి బమ్మెరపోతరాజూ, యెర్ల రామదాసూ ఒక్కతరగతిరచయితలుగా కనబడ నారంభించారు.

సహజపాండిత్యం కాబట్టి పోతన్న ఆంధ్రశబ్దచింతామణి గాని, కనీసం చిన్నయసూరి నేర్పుకొనే ఉండడు. కాబట్టి అతని కవిత్వంలో వ్యాకరణదోషాలూ, తప్పుడుసంధులూ, కనబడతాయి; రళలపరిజ్ఞానం అసలే లేదు; అందుచేతనే అప్పకవిలాంటి లాక్షణికులు పోతరాజును ప్రామాణికకవిగా అంగీకరించలేదు.

మరేమెరుగు లేకపోయినా రచనలో శబ్దాడంబర మయినా ఉంచాలని పోతన్న అంత్యానుప్రాసకోసం ప్రాకులాడి నిఘంటువులనీ గాలించా డని కొంద రనుకున్నారు.

ఇక పోతన రామభక్తు డన్నారు సహృదయులు. కాబట్టి అతనికవిత్వం భక్తిప్రేరితమూ; భక్తిపూరితమూ; భక్తిఆవేశంవల్ల ఒళ్ళు మరచి ఏదో అన్నాడు, ఏదో వ్రాశాడు; ఆ భక్తిసంబంధమైన గొడవ మినహాయిస్తే, ఇంక పోతనలో కవిత్వమేమి కనబడుతుంది అన్నారు మరికొందరు విద్యాధికులూ విమర్శక ప్రముఖులూనూ.

అయ్యో ! పోతనామాత్యా ! నీవు 'దుర్గ' మాయమ్మ, కృపాబ్ధి' యీవుత కవిత్వపటుత్వమహత్వసంపదల్" అని అర్థించినదంతా వ్యర్థమేనా ? "కాటుకకంటి నీరు చనుకట్టుపయిం బడ' నేడుస్తున్నట్టు కనిపించినసరస్వతీదృశ్యమంతా నిఘంటువుల నిషాయేనా ? ఇమ్మనుజేశ్వరాధముల కివ్వ నని చెప్పుతూ "సత్కవుల్ హాలికు లైన నేమి ? గహనాంతరసీమల కందమూలకౌద్దాలికు లైన నేమి ? అని సత్కవిగా, సగర్వంగా, చెప్పిన దంతా వట్టి బాకాఊదుడేనా ?

అభిప్రాయ గుళికలవల్ల కలిగిన అనర్థ మిది. ఆనాటి సహృదయులు, ఆ కవులలోని గుణాలన్నీ చూచినవారే; అందులో మరీ స్ఫుటంగా ఉన్న ఏగుణాన్నో

ఒకదానిని గుళికారూపంలో ప్రకటిస్తారు; తక్కిన కవితా విశేషాలు లేవని వా రెప్పుడూ అనలేదు; అయినా ఆ గుళికాప్రభావం విపరీతంగా పరిణమించింది; వారు పేర్కొన్న గుణ మొక్కటే ఆకవిలో ఉన్నట్టూ, తక్కినగుణాలు- ఏవిగూడా- లేనట్టూ ఇటీవలిపాఠకలోకం అర్థం చేసుకుంది; రసపోషణగాని, కవితాశిల్పం గాని, భావనిరూపణం గాని, విషయచిత్రణం గాని ఆ కవిలో ఉంటాయని అనుకోరు; చూడా మని శ్రద్ధగూడ తీసుకోరు.

పోతన్న అంత తేలికగా త్రోసివేయదగిన వాడు కాడు; ఎందరో మహాను భావుల కన్న మిన్న.

ఆంధ్రకవితాపితామహుని వరూధిని మర్త్యకాంతకంటె తక్కువజాతినై పుట్టకపోయానే అని విచారిస్తుంది; అలాగే పోతనగోపిక ఒకవెదురుమొక్కగా యమునానదీతీరములో పుట్టకపోయానే అని చింతిస్తుంది.

ఎంతతపంబు చేసి జని
యించిన వారొకో మర్త్యభామినుల్;
కాంతు రవజ్ఞ చేసినను
కాయము వాయుదు; రే నమర్త్య నై
చింతల వంతలం జిదికి
సిగ్గరితిన్; మృతి లేని నాదు చె
ల్వింతయు శూన్యగేహమున
కెత్తిన దీపిక యయ్యె నక్కటా!

అని వరూధిని గణితంలో ఒక్క లెక్క చేసినట్టూ, లాయర్ వాదించినట్టూ, విచారించింది.

పోతనగోపిక అలా కాదు;

నామోసంబున కెద్ది మేర వినవే
నాపూర్వజన్మంబులన్
లేమా, నోములు నోచుచో, నకట కా
ళిందీతటిన్ వేణువై
భూమిన్ పుట్టెద నంచు గోర దగదే
బోధిల్లి; యట్లైన నీ

బామం దిప్పుడు మాధవాధరసుధా
పానంబు గల్గుం గదే !

అని స్త్రీభావసహజంగా రసముట్టిపడేటట్టు, చింతించింది.

వామనావతారఘట్టంలో పోతన చూపిన 'కవిత్వపటుత్వము' అసాధారణము; ఆ ఘట్టాన్ని అంతసమర్థతతో చిత్రించగల కవులు ఒకరిద్దరు మించి ఉండరు. బలిచక్రవర్తిదానాన్ని గ్రహించి, వామనుడు త్రివిక్రముడై బ్రహ్మాండం నిండిపోతాడు. వటు డింతింతై మరింతై పెరిగిపోతూండడం పోతన్న హృదయానికి ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఆ విధంగానే పాఠకునికి గూడా కనబడాలిగదా! ఆ బ్రహ్మాండత్వం పాఠకునికి ప్రస్ఫుటం కావాలిగదా ! అలా జరిగినప్పుడే గదా ఆ రసం పలికినట్టవుతుంది !

ఇంతింతై వటు డింతయై మరియు దా
నింతై, నభోవీథిపై
నంతై, తోయదమండలాగ్రమున క
ల్లంతై, ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై, ధ్రువునిపై
నంతై, మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్ర
హ్మాండాంతసంవర్ధియై.

అని వర్ణించాడు, ఆకాశవీథి, మేఘమండలము, కాంతిరాశి, చంద్రుడు, ధ్రువుడు, మహర్వాటి, సత్యపదమూ అని ఆ రూపాన్ని పెంచాడు. కాని- ఆ బ్రహ్మాండత్వం పాఠకులకు కరతలామలకంగా కనిపించిందా ? ఆ మహాద్భుతాకార మెంత పెద్దదో కంటికి కట్టినట్టయిందా ? తృప్తి లేదు. కాబట్టే,

రవిబింబం బుపమింప బాత్ర మగు; ఛ
త్రం బై, శిరోరత్న మై,
శ్రవణాలంకృతి యై. గళాభరణ మై
సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై, కటిస్థలి నుదం
చద్ఘంటయై, నూపుర
ప్రవరంబై, పదపీఠమై వటుడు దా
బ్రహ్మాండము న్నిండుచోన్.

అని వర్ణించి కృతార్థు డయాడు, ఆమహాద్భుతరూపాన్ని ప్రత్యక్షంగా చూపించి పాఠకులను చరితార్థులను చేశాడు.

నడిమింటి నున్న సూర్యబింబాన్ని చూడమన్నాడు. అది యెత్తున ఉందో, ఎంత పైకిపోతే దాన్ని తాకగలమో, ఊహారూపంగా ప్రతిపాఠకుడికీ తెలుసును. దృష్టిని ఆ బింబంమీదనే ఉంచి, పోతన్న వామనుడిని పెంచాడు; వామనుడి కది గొడుగులా గుందన్నాడు; ఇంకా పెంచాడు, ఇప్పు డాబింబం తలలో పెట్టుకున్న రత్నంలా గుందన్నాడు; ఇంకా పెంచాడు. చెవిపోగులా గుంది. ఇంకా— మెడ నున్న రత్నంలాగ; ఇంకా— భుజకీర్తిలాగ; ఇంకా— ముంజేతికంకణం లాగ; ఇంకా— మొలనూలిమువ్వలాగ; ఇంకా— కాలిఅందెలాగ; ఇంకా పెంచాడు— ఆ బింబం పాదపీఠంలా గుందన్నాడు. ఎంతపెద్దఆకారాన్ని ఎంతస్ఫుటంగా చిత్రించాడో చూడండి. పోతన్నశిల్పనైపుణ్యం ఏమనగలం? మనమహాకవు లెంద రీ మహాకార్య మింతఅందంగా నిర్వర్తించ గలరు?

అనకూడదు గాని, భగవద్గీతలోని విశ్వరూపసందర్శనఘట్టములో నైనా ఇంతటి స్ఫుటత్వం ఉందేమో చూడండి.

ద్యావా పృథివ్యో రిద మంతరం హి
వ్యాప్తం త్వయైకేన దిశ శ్చ సర్వాః
దృష్ట్వాద్భుతంరూప ముగ్రం త వేదం
లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్.

ప్రహ్లాదచరిత్రలో నృసింహావతారవర్ణన, ఎందరు కవు లారీతిని వర్ణించి సాధకులకు సాక్షాత్కారము కలిగించగలరో యోచించేనట్లయితే, పోతనకవిత్వ పటుత్వము నిస్సందేహంగా తేటపడుతుంది.

గజేంద్రమోక్షము ఘట్టములో పోతన చూపిన మహాకవిలక్షణాలు అమోఘములు. గజేంద్రుడి ప్రార్థనలో జ్ఞానభక్తివైరాగ్యప్రపత్తులను ఏవిధంగా సోపానాలుగా ఉపయోగించాడో చూడవలసినదే. విష్ణుమూర్తి భక్తవాత్సల్యం ప్రకటించ డానికి పోతన వేసుకున్న పథకం, కేవలభక్తిప్రేరకమే కాదు, అత్యుత్తమ కవితా భరితము.

నిరాతంకంగా లక్ష్మీదేవితో కాలం గడుపుదా మని నిశ్చయించుకున్న విష్ణుమూర్తితో మనలను ఆ వైకుంఠపురంలో, నగరిలో, ఆమూలసౌధం దాపల,

మందారవనంలో, సెలయేటి ప్రక్క నున్న కలువతిన్నె దగ్గరకు పోతన్న తీసు కెళ్ళాడు. అక్కడ మంచిరసవంత మయిన పట్టులో గజేంద్రుడిమొర్ర వినిపించాడు. క్షణంలో రమావినోదితనం ఎగిరిపోయింది; ఆపన్నప్రసన్నత మూర్తీభవించింది. ఆ పైటచెంగు పట్టుకునే విష్ణువు సంరంభంతో బయలుదేరాడు.

ఆసంరంభం ఒకమహాప్రవాహంలాగా కవిహృదయంలో పరుగెడుతూ వుంది. ఆ ప్రవాహవేగంలోనికి మనల నీడ్చాడు పోతన మూడు పద్యాలలో. సిరికి చెప్పకుండా, శంఖచక్రాలు తీసుకోకుండా విష్ణువెళ్తున్నాడు; చేతిలో పైటచెంగు చేతిలోనే ఉంది. లక్ష్మి పాపం, ఏమో తెలియక శాటిముక్తకుచంబుతో, తాటంకా చలనంబుతో, వెంటపడ్డది.*

కలువతిన్నెనుంచి తిరుగుప్రయాణ మారంభమయింది. ఆమందారవనంలో మరెవ్వరూ లేరు కాబట్టి, తనవెంటన్, సిరి మాత్రమే. తరువాత ఆమూలసౌధంలో కొస్తారు; అక్కడున్న అవరోధవ్రాతం వెంటపడుతుంది; చావడిలో పక్షీంద్రుడు మొదలైనవారు- నగరి వెలుపలికి వచ్చేసరికి వైకుంఠంలోని ఆబాలగోపాలం వెంటబడ్డారు. వారిలోనే మనమూ ఉన్నట్టు పోతనకవి చేశాడు; చూడం డాక్రమం;

తనవెంటన్ సిరి; లచ్చివెంట నవరోధవ్రాతమున్, దాని వె
న్కను పక్షీంద్రుఁడు, వానిపొంతను ధనుఃకౌమోదకీశంఖచ
క్రనికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా, వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాలగోపాలమున్.

పద్యారంభంలో 'వెంట' 'వెన్క' 'పొంత' అన్నమాటల నుపయోగించిన పోతన్న పోనుపోను సంరభాతిశయంవల్ల వాటి నుపయోగించడం మానుకున్నాడు. తా నూహించిన సంరంభభావాన్ని పాఠకులహృదయాల్లో నింత చక్కగ ప్రతిఫలించి నట్టు చేసిన పోతనలో కవితావిశేషం లేదా ?

---

*పరుగునపోతున్న స్త్రీని అల్లసాని పెద్దనగూడా వర్ణించాడు.

మట్టెల్ మ్రోవగ, గబ్బిచన్నుగవ కంపం బంద వేణీభరం
బట్టిట్టై కటిచిమ్మ చీకటులుగా....అని

దీనిని పోతన వ్రాసిన తాటంకాచలనంబుతో, భుజనటధమ్మిల్లబంధంబుతో.... పద్యముతో సరిచూడ మని పాఠకులకు ప్రార్థన.

ఇంతే కాదు; అతిసున్నితమయిన మానసికావస్థలను చిత్రించడంలో గూడా పోతన్న ఏకవికీ తీసిపోడు. పాత్రహృదయం తనదిగా చేసుకొని, దానికి సరిపోయి నట్టు భావాలను ప్రకటించగలగడం పోతన్న కలవడినట్టు ఎందరికో అలవడలేదు.

రుక్మిణి తనబ్రాహ్మణుడిని కృష్ణుడిదగ్గరకు పంపించింది; ఇంకా రాలేదు; ఇక్కడ వివాహప్రయత్నాలు సాగిపోతున్నాయి. కూర్చుని అనుకుంటూంది :

ఘనుఁ డాభూసురుఁ డేగెనో, నడుమ మా
 ర్గశ్రాంతుఁడై చిక్కెనో,
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలచెనో,
 విచ్చేయునో, యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపడో,
 ఆర్యామహాదేవియున్
నను రక్షింప నెరుంగునో యెరుఁగదో,
 నాభాగ్య మెట్లున్నదో!

ఈ పద్యంలో పోతన రుక్మిణీహృదయంలో ప్రవేశించాడు. అనినమాటలు కొన్ని; అనకుండా ఉన్నఊహలు కొన్ని; అతిమనోహరమయిన పద్యం. భూసురు డేగెనో అన్నదే గాని 'లేదో' అనలేదు. ఆ ఘనుడివిషయంలో వెళ్ళకపోవడ మన్న ఊహ గూడా రుక్మిణి సహించలేదు; మార్గాయాసం వల్ల కొంచె మాలస్యమైయుఁటుందని సమర్థించుకొని, 'వెళ్ళే ఉంటాడు. కృష్ణుడితో చెప్పే ఉంటాడు' అనుకొన్నది. విని కృష్ణు డిది తప్పుగా భావించుచుంటాడా? అని ప్రశ్నించుకుంది. అత నలాగ తలచేవాడు కాడే అనుకొని 'విచ్చేయునా' అనే అన్నది గాని, 'విచ్చేయడో' అనదు. ఆ ఊహే తనకు దుర్భరము. 'లేదు' అన్నపదం తననోట పలకదు.

తానూ, భూసురుడూ, కృష్ణుడూ అయిపోయారు. ఇక మిగిలినది దేవతలు. వారిలో తన ఇష్టదైవతము ఆర్యామహాదేవి; నలుగురితోపాటు తనకూ ఈశ్వరుడు దేవుడే; కాని, ఆర్యాదే వంతటి దగ్గరిదైవం కాదు– కొంచెం దూరం. వీళ్ళను గురించి సందేహముంది. 'ఈశ్వరుడు అనుకూలించడానికి తలుస్తాడో తలపడో' అన్నది– అంతపరిచయం లేదు కాబట్టి. ఆర్యామహాదేవివిషయంలో తలుస్తుందో లేదో అన్న సందేహం రుక్మిణికి లేదు; తప్పకుండా తలుస్తుంది.

తనకు నమ్మకమే; కాని, ఆమెకు తన్ను రక్షించే ఉపాయం తెలుసునో తెలియదో; ఉన్నసందేహమంతా అదే; ఉపాయం తెలిస్తే తప్పక రక్షిస్తుం దన్న

మాటే. ఇంత వ్యత్యాస ముంది కాబట్టే, పోతన్న ఈ రెండుసందేహాలను ఈ విధంగా ప్రకటించాడు. విషయవిశ్వాసా న్నింత చక్కగా ప్రదర్శించగల సమర్థులు మనకవుల్లో ఎందరున్నారు ?

ఇన్నివిషయాల నింత రసవంతంగా చిత్రించగలిగినవాడు కాబట్టే. పోతన్న ఆంధ్రజనసామాన్యానికి అభిమానకవి కాగలిగాడు. భారతరామాయణాలలోని ఒక్క పద్యమయినా నోటికిరానివారు చాలమంది భాగవతములోని పద్యాలు పఠించ గలిగినారు. ఇటువంటి పోతనలో కవిత్వవిశిష్టత లేదనీ, ఇతను వ్యాకరణం రాని సహజపండితు డనీ, అంత్యప్రాసకోసం నిఘంటువులకు ప్రాకులాడేవాడనీ భావించడం కూడనిపని. ఇంకా సందేహముంటే, ఏదయినా ఒక్కఘట్టం సంస్కృతభాగవతంతో సరిపోల్చి చూస్తే, పోతనకవిత్వపటుత్వం కరతలామలకం కాక తప్పదు,

రాజాజీగారు కంబరామాయణాన్ని ఇంగ్లీషులో ప్రచురిస్తున్నారు; అలాగే మనలో ఓపికున్నసమర్థు లెవరయినా తెలుగుభాగవతంలోని ఒకటిరెండు ఘట్టాలను ఇంగ్లీషున ప్రచురించడం మంచిది. అట్లయితే, సంస్కృతభాగవతంతో పరిచయమున్న ఇతరరాష్ట్రాలవారు గూడా మనఆంధ్రకవి పోతన్నలోని కవిత్వపటుత్వం గ్రహించి గౌరవిస్తారు.

—తాపీ ధర్మారావు*

---X---

*పరిశోధన. అక్టోబరు - నవంబరు 1954.

# సంస్కృత వాఙ్మయము

హిందూదేశమును నాధ్యాత్మికజ్ఞానవిలసితము చేసినదియు, హిందూదేశము నకు నాగరకతాపరిపూర్ణత నొసంగినదియు, హిందూదేశమును ఖండాంతరవాసులచే నాకర్షింపఁ జేసినదియు సంస్కృతభాషావాఙ్మయము. అట్టి యీ సంస్కృతభాష కారణాంతరములచే జన్మభూమియందుకంటె జర్మనీ, ఇంగ్లండు మున్నగు పశ్చిమ ఖండవాసులచే నుపాసింపఁబడుచున్నది. ఇది భాషాప్రాశస్త్యమును వెల్లడించు చిహ్న మైనను జన్మభూమియందు వ్యాసంగము తగ్గుట శోచనీయము. దేశభాషగా వాడుక లేని యీకాలమున సైతము సంస్కృతభాష మనదేశమున నిల్చియుండు టకుఁ గల ముఖ్యకారణము ఈ యమరభాషకును మతమునకును గల యవినాభావ సంబంధమే.

హిందువు ఉదయమున లేచినది మొదలు నిద్రించువఱకును గలకాలమునఁ జేయుకృత్యములయందు దీని సోకుఁడు తగులుచునే యున్నది. పంచాంగము బ్రాహ్మణుఁడు తిథి చెప్పునప్పుడును, నూతనవస్త్రధారణము చేయునపుడును, దీపా రాధనము చేయునపుడును, బుట్టుకకుఁ జావునకు నిది యది యన నేల సమస్తమున కును సంస్కృతభాష పురోహితునివలనను, జోతిష్కునివలనను, వేదాంతబోధకుని వలనను నుచ్చరింపఁబడుచునే యున్నది. హిమవత్పర్వతప్రాంతములయం దుండు వారికిని గన్యాకుమార్యగ్రమున నుండువారికిని, సింధునర్మదానదులమధ్యకుండు జన సంఘమునకును, ఆధ్యాత్మికవిషయమున నేకాభిప్రాయము గలిగియుండుట కాధార మీ సంస్కృతభాషయే.

వేదములు దైవదత్తములు. వేదము సంస్కృతభాషామయము. కావున నీభాష యమరభాష. స్థూలదృష్టితో మనము కనుగొనలేని యేదో యొక గొప్పమహత్తు దీనియందు లేకుండెనేని కలియుగాదినుండి మనదేశము పొందిన విపత్పరంపరల వలన శిథిలము గాక నిలిచియుండుట దుష్కరము. సామాన్యభాషల నున్నతికిఁ దెచ్చుటకుఁ గాని వినాశనముఁ జేయుటకుఁ గాని రాజ్యాంగపద్ధతి మహాకారణమై యుండును. హిందూదేశము క్షణక్షణాగతములగు రాజ్యాంగవ్యత్యయములవలన నెన్నోమార్పులను బొందినది. కాని సంస్కృతభాష మాత్రము సూర్యప్రభవలె శాశ్వతమై ప్రకాశమానమై వెలుగుచున్నది.

ఒక్కరికి గల యభిప్రాయ మింకొక్కరికి వెలిబుచ్చుట కవసరము తటస్థించి నప్పటినుండియు నెట్లో యీసంస్కృతభాష సృష్టింపఁబడినది. దీనికలయికవలన నితరదేశభాష లనేకవిధములుగా వృద్ధి చెందినవి. కాని, దీనికేమియు వైరూప్యము సంభవింపలేదు. ప్రపంచమునందలి యేభాషకును లేని వ్యాకరణపుమర్యాదయే యీ భాషను గాపాడుచున్నది. ఎప్పుడును హిందూదేశము యవనులచేతను, వారిభాష చేతను పాశ్చాత్యులచేతను వారిభాషచేతను, పారశీకులచేతను వారిభాషచేతను, అరబ్బీలచేతను వారిభాషచేతను స్పృశింపఁబడుచున్నను తననైర్మల్యమును విడువ లేదు. ఏయభిప్రాయమైనను ననువుగాను సులువుగాను స్పష్టముగాను సుబోధము గను వ్యక్తీకరించుటకుఁ దగిన భాషాప్రణాళిక యిందుఁ గలదు. చేపల యఱపు, పిట్టల కూఁతలు, ఘాతుక మృగముల బొబ్బరింతలు మొదలు కిన్నరులను గట్టి వేయఁ జాలు సంగీతస్వరముల వఱకుఁ గలయుచ్చారణను వ్యక్తీకరించుట కిందలి వర్ణసమామ్నాయము మిక్కిలి చాలియుండుటచే భాషాసాంకర్యము గలుగలేదు. ఈ భాషయందు దైవముతో మాట్లాడుట మొదలు సమస్తకళలును దెలుపుజ్ఞాన విజ్ఞానకళాశాస్త్రములు తండోపతండములుగా గలవు. "బైబిలు" మతగ్రంథమును భాషాంతరీకరించిన పాశ్చాత్యు లీభాషావిస్తృతిం గూర్చి కడుశ్లాఘించియున్నారు.

సంస్కృత మొకప్పుడు దేశభాషగా నున్న దనుట నిస్సంశయము. అచ్చ టచ్చట గల సంస్కృతశాసనాదికములవలనను సుబోధకముగా నుండు వాల్మీకి రామాయణాది గ్రంథముల వలనను, ఆంజనేయులు లక్ష్మణుడు ప్రథమసందర్శన మున, సంస్కృతభాషతో మాటలాడిరని చెప్పుకొనుప్రతీతివలనను, రాజ ధర్మము శిక్షావిధానము బోధించుధర్మశాస్త్రములు సంస్కృతభాషయం దుండి యుండుటచేతను, హిందూదేశమునం గల సమస్తచరాచరవస్తుజాలమునకు సంస్కృతమునమాత్రమే పేరు లుండియుండుటకు సంస్కృత మొకప్పు డార్యుల రాజభాషగాను దేశభాషగాను నుండి యుండు నని చెప్పనొప్పును. ఆర్యులదేశ పర్యటనము బట్టి సంస్కృతభాషాప్రచారమును నిర్ణయింపబడుచున్నది. ఆకారణముం బట్టియే యుత్తరహిందూస్థానమున సంస్కృతభాషాసేవ యెక్కువగా జరిగినది. కాశ్మీరదేశమం దీభాషావ్యాసంగ మమితముగా జరిగియున్న దనుటకు అందుండి వెడలిన అమోఘవాక్కులే ప్రబలనిదర్శనము. సింధునదీతోయము లీభాషను దమ ప్రవాహముతో పాటు బంగాళాఖాతమువఱకును గల యుత్తరదేశమంతను వ్యాపింపఁ జేసినవి. ఆభాషాధాటి కాగలేక యదివఱకు దేశమం దున్న దేశభాషలు సంస్కృత

మయము కాఁజొచ్చినవి. ఇంతకంటె నపూర్వవిషయవిలసితములును, జ్ఞానవిజ్ఞాన కళానైపుణీవిశేషయుతములును నగు సంస్కృతభావముల ననుకరించుటకు దేశభాషలకు త్రాణ లేకపోయినది. ఆర్యులతత్త్వజ్ఞానప్రభకును, వారి నాగరికతా మహిమకును, బుద్ధిసూక్ష్మతకును దేశవాసులు నమ్రులైరి.

ఆర్యులు యుద్ధములు చేసి దేశవాసులను జయించి రనుటకంటె తమతేజశ్శక్తిచేతను, అణిమాదిసిద్ధులచేతను, దైవజ్ఞానరహస్యబోధచేతను దేశవాసులను ఆకర్షించి రనుట సమంజసము. ఆర్యుల కీ సంపద నిచ్చినవి వేదములు. ఆర్యసంతతికి ప్రపంచగౌరవముం దెచ్చినవి వేదములు. హిందువులకు ప్రాయికముగా బ్రహ్మజ్ఞానమును గూర్చినవి వేదములు. అట్టివేదములు దైవదత్తము లగునా కాదా యను విమర్శతో మనకుఁ బనిలేదు. దైవతము లైననేమి? దివ్యజ్ఞానావేశపూరితు లగు ఋషిదత్తము లైననేమి? వేదములు జ్ఞానపుంజములు. వేదములు స్వరప్రధానములు. స్వరము గురుశిష్యపరంపరాగతము. వేదచారిత్ర మెట్లున్నను హిందూ దేశమునకు వానిని దెచ్చినవా రార్యులు. లిపియందు గ్రంథరూపముగా భద్రపరుపఁబడక అవిచ్ఛిన్నగురుశిష్యపరంపరగా వేదప్రచారము జరుపఁబడుచున్నది.

కేవలవేదభాష దేశభాష. సంస్కృతభాష తర్వాత సంస్కరింపఁబడి వ్యవహారానుకూలముగాఁ గావింపఁబడిన యార్యభాష. ఈ యార్యభాషయందు దైవదత్తము లగు వేదములు లిఖించుటకు సమ్మతింపరైరి. అందులకుఁ గారణము వేదప్రాణమగు స్వరము చెడు ననియే. వేదార్థము చిరకాలము వేదస్వరమువలెనే గురూపదిష్టముగానే యుండెను. వేదములను విభజించి సంహిత, బ్రాహ్మణము, అరణ్యకములుగా విడఁదీసినవాఁడు వ్యాసుఁడు. ఇది యార్యు లిచ్చటికి వచ్చిన కొన్నిశతాబ్దములకుఁ బిమ్మట జరిగినది. ఈ విభజించినది వ్యాసుఁ డను నొక్కపురుషుఁ డని కొందఱి మతము. వ్యాసపీఠము నధిష్ఠించిన పలువురు చేసి రని కూడ వదంతి కలదు.

వేదార్థప్రకాశము లుపనిషత్తులు. వీనిసంఖ్య 170 వఱకును గలదు. ఇవి పలువురు భిన్నకాలములందు వ్రాసినవై యున్నవి. సంహితలు సూత్రప్రాయములుగా నుండుమంత్రము లగుటచే భిన్నపురుషుల భిన్నకాలములయొక్క మార్పు దీనిని జెందలేదు. బ్రాహ్మణములయందుఁ గర్మవిధులును వేదరహస్యములును దెలుపఁబడి యున్నవి. తరువాతఁ గొంతకాలమునకు వేదమును దెలిసికొనుటకై వేదాంగములు (షడంగములు) రచింపఁబడినవి. ఇప్పటికి భాష పరిపూర్ణస్థితిని బొందెను. తరు

వాత వేదసూత్రమును దెలుపు పింగళసూత్రములు రచింపఁబడినట్లు నిరుక్తమందు వేదపారిభాషికపదములు, వేదోక్తదేవతాగణము మున్నగునవి తెలుపఁబడినవి. జ్యోతిషము లాగతునికాలమునాఁటికి యపనసమ్మేళనమును బొందలేదు. స్వరములు చెడకుండుటకై చక్కని శిక్ష యేర్పడినది.

వేదకాలమునాఁటికి మతము భాషవలెనే మిక్కిలి పవిత్రముగా నుండెను. ప్రత్యక్షముగ నగపడు సూర్యాదిదేవతలమూలమున దైవోపాసన చెయ్యఁబడుచుండెను. అగ్నితేజస్సు మిక్కిలిగా నారాధింపఁబడెను.

ఆకాలముననే వేదమంత్రముల మహిమను దెల్పు ఋగ్విధాన మను గ్రంథ మొక్కటి రచియింపఁబడినది.

సామవేదబ్రాహ్మణములు ఎనిమిదింటిలో నిటీవలకాశ్మీరమునం దొకబ్రాహ్మణము దొరకిన దని తెలియవచ్చుచున్నది. అథర్వణవేదమందలి భాషాలక్షణ్యముబట్టి అది ఋగ్వేదమునకు బిమ్మటిదని భాషాకోవిదులు పరిష్కరించియున్నారు. ఇందు మంత్రములు తంత్రములు మున్నగు బహువిషయములు కలవు. ఇదియంతయును సంస్కృతభాషకు వైదికాచారమువలన బట్టిన మహోన్నతదశయని చెప్పనొప్పును.

పైనఁ బేర్కొనఁబడినభాష యంతయు దైవత్వనిరూపణకు సాధనమై యున్నది. కర్మకాండ కొందఱుపాశ్చాత్యులు తలంచినట్లుగా బ్రాహ్మణాధికారమునకుఁ గల్పింపఁబడినవిద్య కాదు. కోతివలె నాడుచుండుమనస్సును గట్టివేయుటకు యోగమును, కర్మాచరణమును ముఖ్యసాధనము లని నాయభిప్రాయము........

సంగ్రహముగా వేదభాషంగూర్చియు వైదికసంస్కృతభాషంగూర్చియుఁ జెప్పియుంటిని. ఇఁక సంపూర్ణదశం జెందిన సంస్కృతభాషావాఙ్మయముం గూర్చి యొకటి రెండు మాటలు.

కాలక్రమమున సంస్కృతభాష దేశభాషగా నుండుస్థితి తప్పి యచ్చటచ్చట విద్యాధికులచేతనే వాడఁబడుచు వచ్చెను. ఆకారణముననే సంస్కృతములోని దేశీయపదములకు వ్యాఖ్యానములు వ్రాసినంగాని తెలియనిస్థితి సంభవించెను. వైదికగ్రంథభాండారము సమృద్ధిగా నున్నను వాని నాభాషనుండి సులువుగా గ్రహించుస్థితి మాఱిపోయెను. ఇది యాభాషయొక్క రెండవయవస్థ. ఈకాలములోనే ఋతరదేశీయభాషలలోనికి సంస్కృతము మతద్వారమున వ్యాపించినది.

ప్రాకృతాదులు విజృంభింపసాగెను. అందులో నొకటియగు పాలిభాష బౌద్ధుల కభిమానభాష యయ్యెను. క్రమముగా వికృతులును సంస్కృతమయము కాఁజొచ్చెను. ఆసేతుహిమాచలమును గల దేశమందలి సంస్కృతేతరభాషలన్నియు యథాశక్తిగా నిముడ్చుకొనఁ గలిగినంత సంస్కృతము నిమిడ్చుకొనియెను. మాగధ, పైశాచికభాష లిప్పుడే విజృంభింపసాగెను.

ఇది యిట్లు జరుగుచుండఁగా సాహిత్యసంస్కృతము గూడ నొకవైపున నభివృద్ధి కాఁజొచ్చెను. వేదసంస్కృతము కేవలకర్మకాండమాత్ర పర్యవసాయి కాఁజొచ్చెను. ఇప్పటి సంస్కృతమున కాధారము 24 వేలశ్లోకములు గల వాల్మీకి రామాయణమును, లక్షశ్లోకపరిమితి గల మహాభారతమునై యున్నవి. తరువాతఁ గొన్ని శతాబ్దములకు భారతానుబంధముగా హరివంశము రచింపఁబడినది. ఈ మూలగ్రంథములు వర్ణనలయందును, కరుణరసమందును, గవితాప్రాగల్భ్యమునందును, స్త్రీపురుషభక్తియందును దయాశౌచాదికము లాదిగా నితరధర్మములయందును నగణ్యమై ప్రపంచమున మెప్పుఁబొందెను. భారత మనేకులవలన నప్పుడప్పు డనేకములగు మార్పులం బొందినను వాల్మీక మట్లుగాక యొక్కనివలననే మిక్కిలిప్రౌఢముగ రచియింపఁబడినది. మతములోఁ బుట్టి మతములోఁ బెరిగిన హిందూజనులకు యీగ్రంథములు మతబోధము లగుటచేఁ బూజనీయములై యనుదినపారాయణయోగ్యము లయ్యెను.

వేదరహస్యములను సుబోధముచేయుటకై అష్టాదశపురాణములు రచియింపఁబడినవి. ఇవి శివబ్రహ్మవిష్ణుమతోద్దీపితములు. వానితరువాత నుపపురాణములు, స్థలపురాణములు, మాహాత్మ్యములు విరచింపఁబడెను. అమరసింహుని తర్వాత శాక్తేయప్రాబల్యము ననుసరించి రుద్ర, యామల, కులార్ణవ కాళికా, శ్యామ రహస్యము లను తంత్రగ్రంథములు బయలు వెడలినవి. ఇంతవఱకు సంస్కృత భాష పొందిన విస్తృతము మతము ననుసరించియే యుండెను.

పిమ్మట భరతసూత్రములు ప్రమాణముగా గైకొనబడి శూద్రకకాళిదాసాదుల వలన రూపకములు వ్రాయఁబడినవి. తరువాత భాష వర్ణనాధిక్యము, కేవలకవితాప్రాగల్భ్యము, రచనాదక్షత ప్రధానాంశములు కాఁజొచ్చెను. ఇది క్రీస్తుశక మేడవ శతాబ్దమున మహాకవి కాళిదాసుతో ప్రారంభమయ్యెను. ఒకటిరెండుశతాబ్దములు ఇప్పటికృషి నిర్వ్యాఘాతముగా జరిగెను. కాళిదాసు రఘువంశము, కుమారసంభవము రచించెను. భారవి కిరాతార్జునీయ మొనర్చెను. మాఘుఁడు శిశుపాలవధ

చేసెను. భట్టి రావణవధ నొనర్చెను. శ్రీహర్షుఁడు నైషధముం గల్పించెను. అటుపైన చంపూకావ్యములు వెడలినవి. అనంతభట్టు భారతచంపును, విదర్భభోజుఁడు భోజచంపువును రచియించిరి. 11వ శతాబ్దమున బిల్హణకల్హణాదులు విక్రమార్కచరిత్ర, రాజతరంగిణి యను దేశచరిత్రగ్రంథములను రచించిరి. సాహిత్యసంస్కృతమున కిది మహోన్నతదశ. కంసవధ, బలినిబంధనము ఈ రెండును ప్రదర్శింపబడినట్లు తెలుపఁబడి యున్నది. స్త్రీలకు నీచపాత్రములకు ప్రాకృతభాషయు, ఉత్తమపాత్రలకు సంస్కృతభాషయు, రూపరచనకు అనుప్రయుక్తమైనవి. మృచ్ఛకటిక శూద్రకమహారాజుచే రచియింపఁబడెను. ఇది మిక్కిలిప్రాచీననాటకము. విక్రమోర్వశీయ మాళవికాగ్నిమిత్రములకంటె శాకుంతల నాటకరచనవలనఁ గాళిదాసు భరతవర్షమున కఖండఖ్యాతిని సమకూర్చెను. అది నాటకరాజము. బ్రాహ్మబౌద్ధమతముల సామరస్యముతో నాగానందము శ్రీహర్షునిచే రచియింపఁబడెను. ఇందలి నాంది బౌద్ధమత ప్రతిపాదికము. దీనివలన నాకాలమున బౌద్ధమత ప్రచారము విస్తారముగాఁ గల దని యూహింపనగును. తర్వాత భవభూతి యుత్తరరామచరిత్రము, మహావీరచరిత్రము, మాలతీమాధవీయము నను నాటకత్రయమును రచించెను, విశాఖదత్తుఁడు రాజతంత్రము గల ముద్రారాక్షసము రచించెను. ప్రబోధచంద్రోదయము, అనర్ఘరాఘవము, జయదేవుని ప్రసన్నరాఘవముతో నాటకరచన పదునాల్గవశతాబ్దమున నంతరించెను.

నాటకరచన యిట్లు జరుగకముందే సమయాచారికసూత్రములు, గృహ్యసూత్రములు, యాజ్ఞవల్క్య, మను పరాశరాది స్మృతులపైఁ దండోపతండములుగ సుబోధ మగు వ్యాఖ్యలు బయలువెడలినవి. జీమూతవాహనుని దాయభాగనిర్ణయము వంగదేశమునం దిప్పటికి నాచరింపఁబడుచున్నది. ఈ గ్రంథములు లక్షలు కోట్లకొలఁదిగా పెరిగిన యార్యులయాచారవ్యవహారనియమముల నేర్పఱచుటకే రచియింపఁబడినవి. ఇవి దేశముయొక్క సంపూర్ణనాగరికతాప్రభావమునకుఁ బ్రబల నిదర్శనములు. వేదాదులయందుఁ గానరాని జీవికాధారము లగు వ్యవహారకాండము వీనియం దనుసంధింపఁబడెను. నారదస్మృతి కేవలవ్యవహారయోగ్య మైనది.

సంస్కృతభాష యిట్లు సర్వవిధముల వ్యాపించినకాలమున దేశము నానాజన సంకీర్ణమయి యవనపారశీకబౌద్ధమతావలంబితమై యుండును. ఈ కాలమున వేదాంతమత మొకటి విలసిల్లెను. శైవము శాక్తేయత నొందినది. కాపాలిక చార్వాక పాశుపత పాంచరాత్రగాణాపత్యాదిమతములు విజృంభించెను. ఒకమూల

సాహిత్యము వృద్ధిపొందుచుండగా భాషావిదు లొకచెంప నిఘంటువులు వ్రాయు చుండగా నొకదెస భాష్యములపై భాష్యములు రచియింపబడుచుండగా సంస్కరణ దక్షులు లేనికారణమున మత మల్లకల్లోలము నొందుచుండెను.

అప్పుడు మళయాళదేశపు శ్రీశంకరాచార్యులు శారీరకమీమాంసభాష్యమును రచియించి దేశాటనము చేసి షణ్మతములను స్థాపించెను. తరువాత కొన్ని శతాబ్దములకు "శాయను"డను తెనుగు బ్రాహ్మణుడు మాధవాచార్య నామముతో భాష్యములను రచియించి శంకరమత మభివృద్ధి నందించెను. ఆచార్యత్రయము రచించిన మతగ్రంథములు బుద్ధివికాసమునకు ఆధారము లయ్యెను. కర్మకాండ వెనుకబట్టుటకు వేదాంతము దారి జూపెను.

సంస్కృతభాషయొక్క యున్నతస్థితికి ముఖ్యకారణ మైనది వ్యాకరణ శాస్త్రము. వ్యాకరణమున కీభాష యొదిగినట్లు ప్రపంచమునం దేభాషయు నొదుగ లేదు. పాణిని, పతంజలి, కాత్యాయనుడు, కాటకటాయనుడు, కయ్యటుడు, మున్నగు మహానుభావులు సంస్కృతభాషను శాసించి ప్రపంచములో నిది చిరకాల ముండునట్లు చేసిరి. అష్టాధ్యాయివంటి యుత్తమవ్యాకరణ మెందును లేదని పాశ్చాత్యపండితులు పదేపదే పొగడెదరు.

జ్యోతిష, ఖగోళశాస్త్రములయందు ఆర్యులు లోకప్రసిద్ధిని వహించి యున్నారు.ఆర్యభట్టుని బీజగణితము, లోకాతీతప్రతిభను బొందియున్నది. 12వ శతాబ్దములో రచియింపబడిన దండి కావ్యాదర్శము, వామనుని కావ్యాలంకార సూత్రవృత్తి, 11వ శతాబ్దములోని రుద్రటుని కావ్యాలంకారము, బ్రహ్మపుత్రనదీతీరస్థుడగు విశ్వనాథకవిరాజకృత మగు సాహిత్యదర్పణము. మమ్మటుని కావ్యప్రాకాశిక మున్నగు కావ్యాలంకారగ్రంథములు సంస్కృతభాష జెందిన యుత్తమస్థానమును వ్యక్తీకరించుచున్నవి.

ఇట్లే వైద్యమందును. సంగీతమందును, ఆర్యావర్తము ఏదేశముతోను తీసిపోనంతటి మహోన్నతదశ ననుభవించెను. 1875 సం. లో కలకత్తానివాసి యగు సురేంద్రమోహన్ ఠాగూర్ రచించిన సంగీత విషయక గ్రంథ మెల్లరు పఠింప దగినది.

ఇట్లు సంస్కృతభాషయందు మనుజునికి వలయు సమస్తవిషయములం దెలుపు సర్వగ్రంథములను మహామహులచే రచియింపబడియుండుట వలన నితర

ఖండములతో సంబంధము పెట్టుకొనకయే హిందూదేశము నిలువం గలిగెను. గ్రంథ విస్తరభీతిచే చతుష్షష్టికళలయందు గల యుత్తమగ్రంథములను వానియొక్క శతాబ్దములను గురించిన యవస్థాభేదమును వివరింపబనిలేదు. విపరీత నాగరికతతో దులదూగుచున్న పశ్చిమదేశవాసు లిప్పుడిప్పుడు కనుగొనుచున్న నూతనవిష యములలో ననేకము లిదివరకే మనవారివలన గనుగొనబడిన ట్లనేక నిదర్శనములు గలవు. శుక్రనీతి యందు అగ్నిచూర్ణము (Gun-Powder) ఉదాహరింపఁబడి యున్నది. మురారి కావ్యమునందు ఇనుపదారులు వర్ణింపఁబడి యున్నవి. దత్తా త్రేయతంత్రమునందు అనేకములగు (Scientific) మహిమలు వర్ణింపఁబడి యున్నవి. ప్రభావవిలసితుడును రాజకార్యధురంధరుడును నగు చాణక్యునివలన (పొలిటికల్ ఇకానమి) అర్థికశాస్త్రము, ఎన్నడో రచియింపబడెను. అది యిప్పుడు మైసూరునందు ఇంగ్లీషులోనికి భాషాంతరీకరింపబడి ముద్రింపబడుచున్నది.

ఆరోగ్యబలములు క్షీణించి యన్యరాజ్యపరిపాలనమునకు వేలకొలది సంవత్సరములనుండి లోబడిన మనకిప్పు డున్న యాధిక్యము గల సంస్కృతభాష యందు మాత్రమే, నిల్చియున్నది. ఇది యిటీవల బొత్తిగా క్షీణించుచున్న దనుట మిక్కిలి విచారకరమైన విషయము. మొదటిసారి తిలకున్కనకు శిక్షతగ్గించుట కాతని సంస్కృతపాండిత్య మొక కారణమయ్యెను. మహమ్మదీయరాజ్యకాలమున సంస్కృతభాషకు గొప్పవినాశము సంభవించెను. ఎడారిలోని జలాశయమువలె మహమ్మదీయ రాజ్యకాలములో అగ్బరు పండితరాయల పొత్తు కొంచెము సంస్కృతమును జ్ఞప్తికి దెచ్చను. తరువాత పాశ్చాత్యులు మన దేశమును దొంగి చూచుట కారంభించినదాదిగ సంస్కృతభాష యుద్ధరింపబడుచున్నది. సంస్కృత భాష జర్మనీదేశమునకు వలస పోయిన దని చెప్పుటలో నతిశయోక్తి కలదు. ఇంగ్లండుదేశమున మానిరువిలియమ్సు, విల్సను, మాక్సుమూలరు మున్నగు ప్రము ఖుల వలన మన సంస్కృతగ్రంథములు భాషాంతరీకరింపబడి యందలి సారాంశ ములు గ్రహింపబడియెను. సంస్కృతభాషాసతియే దైవబలముగల విదేశముల కేగి మన స్థితిగతులను వారికి దెలిపి హిందువులు మిక్కిలి నాగరికు లని నమ్మ కము పుట్టించి మనయందు జాలి కలిగించుచున్నది. రాజ్యాంగము వారి కడకుగూడ నీభాషాసతిపోయి వారిహృదయములు మన కభిముఖములు చేయుచున్నది. ఇట్టి భాషావధూటిని మన ముపాసించుట మాని కృతఘ్నుల మగుచున్నారము. కృత ఘ్నతాఫల మూరక పోదు.

మన శాకుంతలనాటకము జర్మనీదేశములో జయధ్వజములతో విజృంభించు చుండగా నార్యసంతతివారమగు మనలో లక్షలకొలది జనుల కానాటక మున్నట్లే తెలియదు.

పాశ్చాత్యులు సంస్కృతభాషోత్కృష్టతను గొంతంతలుగా బొగడుచున్న సమయముననే హిందూదేశము రాజ్యాంగవిక్షోభముచే బరితపించుచుండెను. మహమ్మదీయ చక్రవర్తులనుండి యాంగ్లేయులు రాజ్యమును స్వాధీనపఱచు కొను చుండుట యొకవంకను క్రొత్త పాలరాజుల హాహాహాకి యొకప్రక్కను, థగ్గుల, పిండారుల లూటీ లొకదెసను, పాశ్చాత్యులలో నింగ్లీషు ఫ్రెంచివారి కలహము లింకొకవైపునను, చెలరేగుచుండ వేదఘోషకు, సంస్కృత విద్యాప్రచారమునకు విశ్రాంతి కలుగవలసి వచ్చెను.

ఇట్లు కొంతకాలము జరిగిన తరువాత మహాసత్వ సమన్వితుడగు దయానంద సరస్వతి యావిర్భవించి సంస్కృతవిద్యను గఱపుటకు బాఠశాలలు పెట్టి, ఆంగ్లేయ వధూటి వెంటనంటుచున్న భారతీయులకు హూణభాషాసాధనమున సంస్కృత విద్యను నేర్పెను. ఆ మహామహుని వలన బాంచాలదేశమునందు సంస్కృతవిద్య మిక్కిలిగా వ్యాపించెను. మహారాష్ట్రపండిత ప్రకాండుడగు డాక్టర్ భండార్‌కర్ హూణభాషాభ్యాసము చేయు విద్యార్థులకు సంస్కృతము కరతలామలకముగా నుండునట్లు అనేక గ్రంథములు రచించి సంస్కృతవ్యాకరణమును విద్యార్థుల హృదయములయందు నాటునట్లు చేయుటయే కాక చరిత్రకు నలయు ననేక విష యములను జిరకాల పరిశ్రమచే గనిపెట్టి భాషాసతికి నూతనాలంకారములు కల్పించెను. కలకత్తానగరనివాసి యగు తారానాథ తర్కవాచస్పతి యను గొప్ప పండితుడు సంస్కృతమునకు వాచస్పత్య మను పేరుతో గొప్ప విజ్ఞానసర్వస్వమును (Encyclopaedia) రచించి దీనితో సంస్కృత విద్యయం దాధిక్యమును, అభిరుచియు గలిగించెను. శ్రీశంకరాచార్యునిచే బ్రతిష్ఠింపబడిన శృంగేర్యాది మఠములయందును గద్వాల, ఉర్లాము, బరోడా, నేపాళము, కాశి మున్నగు ప్రదేశములయందును వార్షికపారితోషికముల నొసంగి సంస్కృతము కొంతవరకుఁ గాపాడిరి. తర్వాత సంస్కృతవిద్యకు బ్రస్తుతాధారము కాశీయందు మాత్రము కాన్పించుచున్నది.

శ్రీవిజయనగరము మహారాజశ్రీ ఆనందగజపతీంద్రుఁడు సంస్కృత కవిత్వము నభివృద్ధి నందించి తూర్పుసీమవారికి గానమును నేర్పి, వేదవిద్యయు,

సాహిత్యవిద్యయు, మిక్కిలిగా నభివృద్ధిచేసి భాషకు శాశ్వతోపకారము గలుగు నట్లు సంస్కృతకళాశాల యొకటి నిర్మించెను.

ఇది యిట్లుండ నమెరికాదేశస్థులు సత్యాన్వేషణపరులై మతాన్వేషణము నకు మొదలుపెట్టి యెందును దృప్తిగానక సంస్కృతభాషను జదివి చూచి తన్మూల మున బరితృప్తులై పరమాత్మ తత్వమును గనుగొని హిందూదేశీయుల యిప్పటి స్థితికిఁ జాలిపడి సంస్కృతవిద్యాదానముం జేయుటకు దీక్షఁబూనిరి. వీరే దివ్య జ్ఞానసామాజికులు అపరసరస్వతి యనదగు శ్రీ అనీబిసాంటు మహిళామణి యిప్పు డీసంఘమున కధ్యక్షురాలు. ఆమె కాశీనగరమున గొప్ప సంస్కృతకళాశాలను స్థాపించి సంస్కృతవిద్యను నలుమొగముల వెదజల్లుచున్నది. ఈ కళాశాల చేయు చున్నంతపని మరియొక పాఠశాల చేయుటలేదు. మైసూరునందును బరోడాయం దును గల సంస్కృత పాఠశాలలు కొంతవర కా ప్రాంతములయందు సంస్కృత మును వ్యాపింపజేయుచున్నది. హిందూదేశమున నింటింటను ఊరూరను సంస్కృత విద్య చెప్పబడుట లేకపోయినను రెండు జిల్లాల కొకతావున నైన నెక్కడు కట్టు దిట్టములతో జెప్పబడవలయును.

ఉత్తరహిందూదేశము సంస్కృతభాషామయముగా నున్నపుడు మనదండకా రణ్యము శ్రీరామపాదధూళి సోకి పవిత్రమయ్యెను. నాటినుండి యీ యరణ్యము క్రమక్రమముగా వాసయోగ్య మయ్యెను. పూర్వులలో మాధవాచార్యు డొక్కడే మనలో మిక్కిలి ప్రముఖుడు కాన్పించుచున్నాడు. ఎట్లు ప్రాప్తించినదో కాని వేదమునకు మనదేశమున సుస్వరము కలిగినది. ఆంధ్రులవలె వేద ముచ్చరించు వారు ప్రపంచమునం దెక్కడను లేరను ప్రతీతి కలిగెను. దీని నిర్వహణమున కాధారభూతులు నే డిచ్చట జేరిన వైదికపండితమండలి యొక్క మూలపురుషులు. నియోగు లిదివరకే వేదమును వదలిపెట్టిరి. వైదికవిద్య యిప్పుడు క్షీణించు చున్నది. ఇఁక వేదము లేమి కావలయును? సంస్కృతభాష యేమి కావలెను? అను ప్రశ్న యచ్చటచ్చట బుట్టుచున్నది. ఇట్టి దినములలో సంస్కృతభాషాభివృద్ధికై యీ గ్రామవాసులు ప్రయత్నముచేయుట వేనోళ్ళ బొగడదగియున్నది. దొర తనమువారు "యూనివర్శిటీ"లో నీభాషలో జయమందినవారికి శిరోమణి మున్నగు బిరుదముల నిచ్చెద మని ప్రచురించియున్నారు. మనము గవర్నమెంటువారిని "ఇంగ్లీషుతోఁ గూడ శిరోమణి పట్టమును బొందిన విద్యార్థులను మెట్రిక్యులేషన్, ఎమ్. ఏ. తరగతుల విద్యార్థులతో దుల్యులుగ నెంచి వారికిని గవర్నమెంటు

ఉద్యోగముల నీయ వచ్చు నని యనుజ్ఞ యిచ్చునట్లు కోరవలెను. అపుడు సంస్కృత విద్య కేవల వైదికవిద్యయే కాక జీవికకు నుపయోగించుటచే శీఘ్రకాలములో నభివృద్ధి జెందును. కొంతకాలమునుండి వైదికవృత్తి యాచ్నావృత్తిగాను సంస్కృతవిద్య ముష్టి విద్యగాను బరిగణింపబడుట నే నెరుగుదును. దాని మూల కారణము నరసి తగిన సంస్కారమును జేయవలయును. వైదికులు శిష్టాచారసంపదచే దదార్జిత మాన్యములచే నెల్లవిధముల నియోగులకంటె వేదవిద్యను నిల్పుటకు దగియున్నారు. నియోగులు ద్యోగమునే జీవనముగా బెట్టుకొని యుండుటచే నిపు డొక్కసారిగా వేదవిద్య నభ్యసించుటకు ఆయత్తులు కాగల రని నేను దలంపను. లక్ష్మీనారాయణదీక్షితులవారి ప్రశంశయే యెరుంగని యొంటిమామిడి యను గ్రామ మున వేదవిద్య నియోగులచే జిరకాలమునుండి యభ్యసింపబడుచున్నది. కొలది మంది యచ్చటచ్చట వేదవిద్యాధురీణులగు నియోగులు కలరు. వైదికులు తమ పాండిత్యప్రకర్షచేతను ధర్మశాస్త్రద్రష్టృత్వము చేతను రాజ్యాంగముల యందు ధర్మనియతి దప్పకుండ సహాయ మొనర్చినవారు గాని సామాన్యులు కారు. వైది కులు ధర్మోపదేశకులై నిష్ఠాగరిష్ఠులై యుండ నియోగులు కార్యదక్షు లయి రాజాను మతిని వ్యవహారములు సల్పుచుండినవారు. ప్రపంచవర్తన కీరెండును ముఖ్యాంగ ములే. వైదికవృత్తి సర్వోత్కృష్టమును ఆముష్మికసాధనమునై యున్నది, అట్టిది సంస్కృతము వినా నిర్వహింపబడనేరదు. కావున నీ పాఠశాల లత్య వసరములు.

మన తెలుగుదేశములో మల్లినాథసూరి, పెద్దిభట్టు మున్నగువారితరువాత మహా మహోపాధ్యాయ శ్రీ పరవస్తు రంగాచార్యులయ్యవార్లంగారు తెలుగు దేశీయులలో సంస్కృతభాషావ్యాపనము గావించిరి. వారు శతాధిక గ్రంథములను రచించిరి. అందొక "అ" అను నక్షరము మాత్రమే ముద్రింపఁబడినది* తక్కిన యక్షరము లన్నియు వ్రాసి సిద్ధముగా వారియింట నున్నవి. అట్టి గొప్ప పండితుఁడు పుట్టుట యరుదు. పుట్టినను నిట్టి యుద్గ్రంథములను వ్రాయుట యరుదు. వ్రాయ దలపెట్టినను యవి పూర్తిగావించుట మిక్కిలి యరుదు. వారు గతించిరి. ఒక్క యక్షరసంపు టమును అచ్చువేసి అచ్చుపద్ధతినిఁ గూడఁ దెల్పిరి. ఆంధ్రులు దానిని పూర్తిగావించి దేశమునకు మహోపకార మొనర్పవలసిన పని మిగిలియే యున్నది. మల్లినాథుల వలె బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారు సంస్కృత గ్రంథములకు ఆంధ్ర వ్యాఖ్యానములు వ్రాసి మహోపకార మొనర్చుచున్నారు. మరల సంస్కృతభాషకు గొప్పదశ పట్టునట్లు కాన్పించుచున్నది.

-రాజా మంత్రిప్రెగడ భుజంగరావు*

*"అ", "ఆ" రెండు అక్షరాలు అచ్చయినవి—పు. అ.

*ఆంధ్రభారతి. సం. 2. నం. 6. నవంబరు, 1911.

# ఉత్తరరామ చరితము

భవభూతి రచించిన ఉత్తరరామచరిత నాటకమును ఇంతవరకు చాలమంది తెనిగించినారు. ఇప్పుడు తిరిగి మ. రా. రా. జయంతి రామయ్యపంతులుగారున్ను తెనుగు చేసినారు. శ్రీ రామయ్యపంతులుగారిని ఆంధ్రదేశమున తెలియనివా రుండరు, వీరు ప్రెసిడెన్సీమేజీస్ట్రేటు పనిచేసి విశ్రాంతివేతనము పుచ్చుకొంటున్నారు. లెజిస్లేటివ్ ఎసంబ్లీలో కొంతకాలము మెంబరుగా ఉండిరి. ఆంధ్ర, మద్రాసు విశ్వవిద్యాలయాలలో సెనేటు మెంబరుగాను తెనుగు పాఠ్యపుస్తక నిర్ణాయక సభలలోను, తెనుగు పరీక్షవర్గసభలలోను, అధ్యక్షులుగాను ఉండిరి. ఆంధ్రసాహిత్య పరిషత్తును స్థాపించినవారిలో వీరు ముఖ్యులు; పరిషత్తు భారమంతా నిరంతరముగా వీరే వహిస్తున్నారు. ప్రారంభవిద్యనుంచి విశ్వవిద్యాలయ విద్యవరకు విద్యార్థులకు బోధనము గ్రాంధికభాషామూలముగానే జరుగవలె నని సభలలో తీర్మానములు చేయించిన్నీ, మహజర్లు పంపించిన్నీ, రాజులతోను, మంత్రులతోను చెప్పిన్ని, ఎన్నో విధాల నిద్రాహారాలు లేక కష్టపడినారు. ఆంధ్రవిశ్వవిద్యాలయములో అధ్యాపకాంధ్రభాషా పండితవర్గమును ఏర్పాటు చేయడానికి నియమింపబడ్డ సభలో వీరు ఎక్కువపట్టు సభ్యులు. పరిషత్తు పక్షమున గొప్ప నిఘంటువు వ్రాయించవలె నని తామున్నూ, ఆకార్యములో పాల్గొంటూ కృషిచేస్తున్నారు. నేటికి వీరికి 70 సంవత్సరముల వయస్సయినా గ్రాంధికభాషాదేవీసాక్షాత్కారము కోసము ఇంకా గొప్ప తపస్సు చేస్తున్నారు. కాని. ఆదేవి వీరి కిప్పటికిన్ని సాక్షాత్కరించలేదు. "వత్సా, నేను నిత్యకల్యాణిని, నిత్యయౌవనను, అజరామరను. నన్ను కనుకోవలె నని ఉంటే, నీవు వెదుకుతూ ఉన్న దిక్కున నీకు సంపూర్ణముగా కనబడను; జీవించి ఉన్నవారి నాలుకలమీద నిత్యతాండవము చేస్తూ, అనేకవిధాల లోకాలకు ఆనందము కలుగజేస్తూ ఉంటాను. నేను గీర్వాణిని కాను: గీర్వాణి స్వర్గములో ఉన్నది: ఆమె అంశతో భూలోకములో అవతరించినాను; జీవలోకములో నన్ను శీఘ్రముగా తెలుసుకో గలవు; చెవి ఒగ్గి వింటే, కళ్ళుతెరచి చూస్తే నా స్వరూపము నీకు బోధపడుతుంది; అట్లు చేయకపోతే నీ శ్రమ అంతా వ్యర్థము" అని ఘంటాఘోషముగా పలుకుతూ ఉన్నా, శుష్కధ్యానాసక్తులకు వలె, ఈ సత్యవాణి వీరికి హృదయగతము కాలేదు. నలభై యేండ్లవయస్సయేసరికి మానవుల అభిప్రాయాలు స్థిరములయి

పోతవనిన్ని, అట్టివారిలో వాదించి వారి అభిప్రాయాలు మార్చడము సాధ్యము కాదనిన్ని మన తత్వశాస్త్రజ్ఞు లంటారు. అంతకు రెండింతలు వయస్సు కలిగిన వీరి వ్యావహారికభాషావైముఖ్యము గడ్డకట్టుకొనిపోయి వుంటుంది. వీరితో వాదించడము వల్ల కార్యము లేదని తెలిసినా, ఇటూ అటూ ఊగుతూ ఉన్న ఇతరుల కయినా పనికివస్తుందని ఈ వ్యాసము వ్రాయడానికి పూనుకొన్నాము.

శ్రీరామయ్యపంతులుగారు ఇంతవరకున్ను కావ్యము లేవిన్ని వ్రాయలేదు. గ్రంథాలకు పీఠికలున్ను, పత్రికలకు వ్యాసములున్ను అనేకములు వ్రాసినారు. ముక్తే (క్తి ?) శ్వరశతకమొకటి వ్రాసినారు. శాసనములను కొన్నిటిని పరిశోధించి ప్రకటించినారు. వీరు ప్రయత్నించి వ్రాసిన పెద్ద గ్రంథాలలో ఈ ఆంధ్రీకృతోత్తర రామచరిత నాటకము మనకు తెలిసినంతమట్టుకు మొదటిది. ఈ ఆంధ్రీకరణ విధానమును తా మీక్రిందిరీతిగా పీఠికలో చెప్పుకొన్నారు.

1. "ఆంధ్రభాషా సంప్రదాయములఁ బాటింప నాశక్తికొలఁది యత్నించి నాఁడను." ఉపోద్ఘాతము 1-5. 6. ప.

2. "పలుకుబడి వేఱు పదపరిపాటి వేఱు, రీతులును వేఱు యన్వయరీతి వేఱు, భాషభాషకు ననుమాట భావమందుఁ జేర్చి సంస్కృతమును దెల్గు సేయ వలయు." —అవతారిక. ప. 8.

3. "తెలుగుననె పుట్టె నీకృతి
తొలుత ననెడుభావ మాత్మఁ దోఁచెడు భంగిన్,
జెలగిన యనువాదమ నర
సుల కింపొఁ గాకయున్న శోచింపదిలన్.
—అవతారిక. ప. 9.

4. "దీటుగ సంస్కృతంబునకుఁ
దెల్గొనరించెడువారు మూలమున్
దాఁటక, భావమున్ రసము
తప్పక వచ్చెడు నట్టు లెంతయున్
దేటగ వేఱుమాటలను
దెల్పినఁ బొల్పగుఁ గాక యెట్టులో
మాటకు మాటఁ బెట్టి యొక
మాడ్కిని మాటిన మెత్తురే బుధుల్."—అవతారిక. ప. 7.

ఇట్లు తా మేర్పాటుచేసుకొన్న నియమాలను శ్రీరామయ్యపంతులుగా రెంతవరకు తమ అనువాదములో పాటించినారో విచారింతము.

## 1. ఆంధ్రభాషా సంప్రదాయము :

ఆంధ్రభాషాసంప్రదాయమంటే పంతులుగారి అభిప్రాయము గ్రాంధికాంధ్ర భాషాసంప్రదాయ మని అనుకొంటాను. గ్రాంథిక, వ్యావహారికభాషా సంప్రదాయ ములు రెండున్ను ఆంధ్రభాషా సంప్రదాయమే అంటే మాకు కొంత సంతోషమే. కాని, గ్రాంథిక, వ్యావహారికభాషా సంప్రదాయాలు రెండున్ను ఒక్కటే రచనలో అతకవని మాత్రము మా అభిప్రాయము. వ్రాస్తే తమ పాండిత్య మంతా చూపి, సమస్తాంధ్రగ్రంథములను పరిశీలించి, గ్రాంథిక సంప్రదాయమును నిర్ణయించుకొని దానిని తప్పకుండా వ్రాయవలెను. లేదా కేవల నిత్య వ్యావహారికభాషలో నయినా వ్రాయవలెను. సహజముగా వచ్చే వ్యవహారభాష తప్పనుకొని, గ్రాంథిక సంప్ర దాయము తెలియక గ్రంథరచనకు దిగేవారు. (అ) కృతకరూపాల నయినా సృష్టి స్తారు. లేదా, (ఆ) వ్యవహారభాషను వ్రాసి అది గ్రాంథికభాష అని తమ్ము మోసగించుకొని ఇతరులనుకూడ మోసగిస్తారు. వ్యావహారికభాషా విముఖులై, దాని మీద కత్తికట్టినవారు కాబట్టి పంతులుగా రీరెండు పనులనున్ను చేసినారు.

### (అ) కృతక భాష :

1. "మహాశ్వేతావృత్తాంత మిందునకు దృష్టాంతము."

—ఉపోద్ఘాతము పు. IX.

"నీపుట్టువు చిట్టచివర కిందున కైనదా ?" —పు. 33.

అందు, ఇందు. ఎందుల మీద 'నఃకౌ' సూత్రము ప్రకారము నగాగమము రా దనిన్ని, ప్రాతభాషలో 'అందులకు, ఇందులకు, ఎందులకు' అని రూపాలుంట వనిన్ని, అర్వాచీనగ్రంథాలలోను, వ్యవహారములోను 'అందుకు, ఇందుకు, ఎందుకు అని ఉంటవనిన్ని చిరకాలమునుంచిన్ని మేము ఘోషిస్తూ ఉన్నా, మేము చెప్పినాము గదా అని కాబోలు ఈనాటి గ్రంథకర్తలు నగాగమమును తప్పకుండా చేస్తూ ఉంటారు. రామయ్యపంతులుగారు 'ఇందు' మీద నగాగమును చేసి 7వ పుటలో 'లేచి ముందుకు నడచి' అని ముందుకు అని ప్రయోగించినారు. 'ముందు నకు' అని వ్రాయలేదు. ఇందుకు చాలా సంతోషమయినది.

2. "నన్నిచటకుఁ బిలిచికొని రాలేదు" —పు. 6.

ఇచటకు అనే రూపము కృతకము. ఏ ఆధునిక మహానుభావుడు మొదట వాడినాడో కాని, రామయ్యపంతులవా రంతటివారికి కూడా ఈ రూపము ప్రమాణ మయినది.

3. "తోరపుఁ బూజల్ సలిపెదు నిద్దె." —పు. 10.
"పూర్ణగర్భ నిద్దె కటికనై త్రోయఁగా నెంచినాఁడ." —పు. 26.
"నీకడ కపనార్థము వచ్చి రిద్దె యవనిపాలా." —పు. 26.
"కనుపట్టుచు నున్నది యిద్దె" —పు. 136.

ఇది మీద ఎత్వముచేర్చి వస్తు నిర్దేశము చేయడానికి 'ఇదె అని కవులు వాడితే, 'ఇది'కి రూపాంతరము 'ఇద్ది' అన్నది కాబట్టి, రామయ్యపంతులుగారు దానికి కూడా ఎత్వము చేర్చి 'ఇద్దె' అని వాడినారు. వీరుపాటించిన ఆంధ్రభాషా సంప్రదాయ మిద్దే.

4. "క్రొత్తగా సారివచ్చిన కూర్మిసతుల గలసి" —పు. 11.

"సారె" అని గ్రంథములు. వ్యవహారము. శబ్దరత్నాకరములో 'సారె', ఈ అర్థముతో 'సారి' లేదు. పంతులుగారు వ్యుత్పత్తి నూహించి 'సారి' అనే రూపమును కల్పించి ఉంటారు. 'కోరికె' మొదలైనవి అసాధువులు. 'కోరికి' 'కోరిక' అని ఉండవలె నని పండితుల వల్ల విని ఈమార్పు చేసి ఉంటారు.

5. "జనకజావిరహం బిపు డబ్బినట్టులన్. —పు. 17.
"మేత్రలతనము లట్టులన్," —పు. 31.
"కుసుమము లట్టులన్." —పు. 90.
"ఇటులనే చిరకాల ముండుము." —పు. 158.

"అట్టులన్, ఇట్టులన్" అనేది "అట్లా, ఇట్లా" అనే వ్యావహారిక రూపాలకు ఇప్పటివారు కల్పించిన కృతకరూపాలు. గ్రంథాలలో ఉంటే చూపించవచ్చును; వ్యవహారములో లేవు. 70 వ పుటలో "అటులే కానిమ్ము" అని పంతులుగారే ప్రయోగించినారు. పద్యములో కుదరక "అట్టులన్, ఇట్టులన్" అని కల్పించుకోవలసి వచ్చినది.

6. "కొలువు విడిచి నరపతి లోపలకు నరిగె." —పు. 4.

"లోపల, పలపల, దాపల" మొదలైనవి ఔపవిభక్తికము లని నిఘంటు నిర్మాత లయిన పంతులుగారికి తెలియకకాదా ఆధునిక పండితకృతిక సంప్రదాయానికి వీరు కూడా లోబడవలసి వచ్చినది.

7. "అప్సుని యొక్కయు రాక్షసుల యొక్కయు." —పు. 17.
దీనికి ప్రమాణప్రయోగము పురాణము శాస్త్రుల "ఆయొక్కానున్ను, ఈయొక్కానున్ను, గ్రంథాలలో 'యొక్క' కనబడదు.

8. "కామనృపచంద్రముఁడై." —కృతిసమర్పణము.
చంద్రమశ్శబ్దము తత్సమమైనప్పుడు 'చంద్రమసుఁడు' అనికాని 'చంద్రమ' అని కాని లక్షణప్రకారము కావచ్చును. కాని, 'చంద్రముఁడు' అని కావడానికి శాస్త్రముగాని, ప్రయోగము కాని లేదు. వ్యవహారములో తత్సమముగా దానికి రూపము లేదు.

9. "కావ్యంపు గుణగణంబు తప్పె" —అవతారిక.
షష్ఠీసమాసములో ము వర్ణానికి పుంపులు రావచ్చునా? వస్తే, వైకల్పికముగా వస్తవా, నిత్యముగా వస్తవా? ప్రయోగాలు? 'గుణగణంపుఁ దప్పె' అని ఎందుకు వ్రాయలేదు?

10. "మాబోటులు." —అవతారిక.
"మముఁ బోలినవారు" "మముబోంట్లు" అని గ్రాంధిక కారికము. షష్ఠీకారకమునకు ప్రయోగమున్నదా?

11. "పాదపముల్ తగు నర్ఘ్యమీవుతన్.....శైత్య.
వనానిల మల్ల వీవుతన్." —పు. 64.
"చు, చ్చు" అంతమందుండే ధాతువులన్నిటి మీదను ఇట్టి ఆశీరర్థరూపాలు వస్తవా? వస్తే, 'తేవుతన్, క్రోవుతన్, చావుతన్, మోవుతన్' మొదలైన రూపాలు కూడా సాధువులు కావలెనుగదా! ప్రమాణము?

12. "ఈ శైలము మాల్యపంతమను క్ష్మాధరరాజము చుమ్మి." —పు. 17.
"అవియెల్ల మాటలుకావు చుమ్మి." —పు. 69.
"సంప్రార్థనార్థకాదీత్" అని చదువుకొన్నాము కాని 'ఇత్' అని లేదు.

"ఇత్తు"కు ప్రమాణమేమో?

13. "పరమపవిత్రుఁగాఁ దను భావనసేయుము." —పు. 88.
"తన్ను"కు రూపాంతరముగా పంతులుగారు ప్రయోగిస్తే, వారిమీద ప్రమాణ బుద్ధి గలవారు 'నన్ను', 'నిన్ను'లకు 'ననను, నినను' అని ప్రయోగించ వచ్చును గదా!

14. "చిఱునలుక." —పు. 106.
"చిఱు, కుఱు, కడు, నడు, నిడు శబ్దంబుల మొ. చిన్నయసూరి.

"చిట్టెలుక" అని కావలసి ఉండె. 'చిఱు' మీద ద్విరుక్త టకారము రాకుండా ప్రయోగా లున్నవేమో?

15. "ఈబలము నాదు, కట్టలుక కొక్క కబళమౌఁగాత మిపుడు."
—పు. 110.
"కావుతన్" మీద అచ్చువస్తే మాదేశము రావడము సుప్రసిద్ధము. 'కాతన్' మీద కూడా వస్తుందా? ఉదాహరణము?

16. "ఈవీరుని నన్నువలెనే చూతురుగాక." —పు. 127.
"నన్నుంబోలె" అని గ్రంథాలు. 'వలె' ప్రయోగించినప్పు డేమి కారకముంటుందో?

17. "క్రొత్తదిపోలె." —పు. 85.
క్రొత్తదియపోలె; క్రొత్తదియుంబోలె, అనే రూపాలను గ్రంథాలలో చూచినాము. కేవల ప్రథమారూపము మీద కూడా 'పోలె'ను ప్రయోగించవచ్చునా?

18. "నను(జాలని వాఁడు." —పు. 115.
"నాకుఁజాలనివాఁడు" అని మేము చూచిన కారకము. ద్వితీయాకారకము కూడా ఉంటుందా?

19. "గ్రామమున నంత నొక్కచోఁ జేర్చి." —అవతారిక. vi.
"అంతన్" అంటే 'అప్పుడు, ఆతరువాత' అని అర్థము. ఆ రూపమును 'అంతటిని, సమస్తమును,' అనే అర్థములో వాడవచ్చునా?

20. "మఱిమఱి చెప్పుమనిరి" —పు. 6.
"మరీమరీ" అనే వ్యావహారికరూపానికి ఇది గ్రాంథికీకరణము;

21. "విద్య మతిమాలినదానికి నంటదేమి." —పు. 31.
"ఏమిన్నీ" అనే వ్యావహారికరూపానికి వచ్చిన పాటిది.

22. "వత్స కాంతానువృత్తి చాతుర్యముకూడ నేర్చెన్." —పు. 59.

"తలఁచినప్పుడ వత్సల గలియవలయు." —పు. 151.

"వత్స" సంస్కృతములో పుంలింగ శబ్దము, అకారాంతము. ఇక్కడ మహద్వాచకముగా వాడినారు. శాస్త్రము ప్రకారము తెనుగులో దీనికి ప్రథమైకవచనరూపము 'వత్సుఁడు' కావలెను. 'వత్స' అనడానికి శాస్త్ర మొప్పుకోదు. వ్యవహారరూపమంటే ఆక్షేపణే లేదు.

23. (పాములు) "బుస్సలు కొట్టుచు." —పు. 39.

బుసకు బుస్స అని రూపాంతర మున్నదా?

24. "పరదేశిని గాన నడుగుచున్నాను." —2.

"కాన నారెండు శాంతించుఁగాక యిపుడు.' -101.

"కాన" కళయే అని ప్రభాకరశాస్త్రులుగారి బసవపురాణ పీఠిక. దీనిని గురించి పంతులుగారు నిర్ధారణ చేసినారా? ఎట్లు?

అరవ తెనుగు :

"నీరసమైన కావ్యమును నిండరసావహమౌను (విమర్శకుల స్నేహము కల్మని.) —అవతారిక.

"ఈదినము నిండసుభావహ మయ్యె." —పు. 28.

అరవవారు 'రొంబా చందోచం' అన్నట్లు.

కేవల శాస్త్రంపుఁగంపు :

1. "వచ్చితి నిపుడు వాల్మీకి వలన నుండి." —పు. 29.

"హిమగిరి వలన నుండి గంగ వొడమె." —చిన్నయసూరి.

2. "ఓజననిరా!....ఓ తల్లిరో!"

3. "దుగిణుఁడు" పు. 131.

ఇది ద్రుహిణశబ్దభవముగా అచ్చతెలుగు కావ్యాలలో వాడేమాట.

అచ్చ తెనుగు కావ్యాలవాసన :

1. "దూషణాఖ్యుండు నల ఖరుండు మూఁడుతలలవాఁడు." —పు. 38.

త్రిశిరుఁడు అనే సంజ్ఞావాచకానికి తెనుగు.

2. "నాకూఁతును బరిశోధించుట కగ్ని యెవఁడు ?" —89.
"అతనికిఁ బ్రీతి యెక్కువ యీరాజుకూతునందు." —92.

చిన్నయసూరి లక్షణానికి సరిపోయినా, అరవము చదువుకొన్నవారికి 'కూతు' అంటే అశ్లీలార్థము స్ఫురిస్తుంది. అరవములో 'మూత్తు' అంటే 'యోని' అని అర్థము. వ్యవహారములో కూతును, కూతునందు అనే రూపాలు లేవు. కూతురిని, కూతురియందు అని ప్రయోగాలు కుప్పలుతిప్పలుగా ఉండగా చిన్నయ్య పరమ ప్రమాణము కావడమువల్ల ఈ అనర్థము వచ్చినది.

సంధులు :

"ఎచటనుం డిటవచ్చెనో" (52); "ఏలినాతనిన్" (—అవతారిక) ఈ సంధులు పంతులుగారి కిష్టమయితే మాకు సంతోషమే. కాని 'గులగులనుచు' (45) అని సంధి చేస్తే చెవి కసహ్యముగా ఉంటుంది.

వచన దోషము :

"ఎవరురా సేవకుఁడు (27) మాన్పువారు సరసులెకాదే (అవతారిక) వదినెగా రడుగుచున్నది. (11), పూనె మాయన్నగారు (12); జనకసుత నాకుఁ గూఁతురే యనెడువారు మహారాజెప్పుడును (91); దేవర యిట్టి నిశ్చయ మెట్లు చేసితిరో గదా (23).

లింగదోషము :

సల్లకి వృక్షపంక్తులన్ (సల్లకీ). 41;

పురుషవ్యత్యయము :

(1. "దేవర యిట్టి నిశ్చయ మెట్లు చేసితిరో గదా" (23)
ప్రథమపురుషకర్తకు మధ్యమ పురుషక్రియ
"వాడు వచ్చినావు" వలె.

2. (మీరు) (మీరు) "ఏమని పిలిచిరి యింతకు ముందు ?" (109) మధ్యమ పురుషకర్తకు ప్రథమపురుషక్రియ "నీవు వచ్చినాడు" వలె.

గ్రాంథికసంఖ్యా పరిజ్ఞానము :

"పదియునాలుగువేలును బదుగురు మఱి నలుగురును" (38), "పదియు నాలుగు వేవురు" అని ఉండవలెనేమో ?

అరసున్నలు :

1. సిద్ధము లైన అరసున్నలు తెలియక పోవడము. "ఏంగు చనా" అని లక్షణ ముదాహరించి, సార్థానుస్వారముగా 'ఏఁగు'కు ప్రయోగా లిచ్చి చూపినా, మేము చూపించినాము గదా అని పంతులుగారు అరసున్న ఉంచడము మాని ఉంటారు. చూ. అవతారిక V, 3. 92, 102; 'ఏఁటికి'లో అరసున్న ఉండ వలసినా విడిచిపెట్టినారు. (110)

1. "పరగు"లో అరసున్న లేదయ్యా అని మొరపెట్టుతూ ఉన్నా పంతులుగారికి తమ పట్టుదలే తమది. చూ. 40, 42, 88.

2. సాధ్యములైన అరసున్నల తబ్బిబ్బులు :

ద్రుతము మీద అరసున్న వస్తుందా ? ద్రుతము లోపించినప్పుడు వస్తుందా ? అని పంతులుగారు చాలా తికమకలు పడ్డారు. మొదట వ్రాసినప్పుడున్ను, పుస్తకమంతా అచ్చయినపుడున్ను కూడా ద్రుతము మీద అరసున్న తగిలించినారు. దిద్దుకొన్న అరసున్నలు ఏమును గురువులము 6-3 స్థిరవర్ణములకు ముందు అరసున్న ఉండ దని మొదట మరచిపోయినారు. 'రామభద్రునికిఁ గూడ' -6; అదిగోఁ జూడు-12; భయఁపడి-33 ముపర్ణము లోపించింది కాబట్టి ఇచ్చట అరసున్న ఉండవలెనని భ్రమపడ్డారు:- దిద్దుకొన్నారు కారా అంటారేమా ! పరిచితము కానిదాని నొకరి నడిగో, పరిశోధన చేసో దిద్దుకోవాలి. డెబ్భైయేళ్ళు వచ్చినా, ఇంత కృషిచేసినవా రయినా ఈ స్వల్పవిషయాలలో కూడా పంతులుగారికి సందేహాలు విడలేదే. బడిపిల్లలు, జ్ఞానతృష్ణ గలిగిన పామరులు, వీరిమాట యేమిటి? కడవరకున్ను అరసున్నలు నేర్చుకుంటూ ఉండడమేనా ? దేశములో విద్యావ్యాప్తి ఇందుమూలముగా అవుతుందా ? ఇన్నిచోట్ల పంతులుగారు కష్టపడి దిద్దుకొని 29వ పుటలో "నిన్ను నే నెవరినిఁగా నెఱుంగవలయును ?" అనిన్ని, 22వ పుటలో 'లోకప్రీతినిఁగాదే" అనిన్ని ద్రుతము మీది అరసున్నను దీసివేయకుండా ఉంచినారే ? 43వ పుటలో 'అలుంగు' (=ఖడ్గము) లో అరసున్న ఉంచినారు. దీనికి ప్రయోగము ? శబ్దరత్నాకరములో ఉన్నది గనుకనా ? అచ్చట ప్రయోగ మివ్వ లేదు. పంతులుగారైనా యిస్తే నేర్చుకొంటాము.

112వ పుటలో "మెఱుపుఁ దమము నుగ్రంబుగాఁ బెరసినట్లు" అని వ్రాసినారు. బెరయు ధాతువు పరుషాది యని పంతులుగారి భ్రమ.

ఈ రీతిగా మాకు గ్రాంథికభాషలో అనేక సందేహా లున్నవి. అడుగడుగుకు మాపని తడవుకొనడమే. చూడండి ఒక్క ఉదాహరణము : 'మెఱుపు' అనవలెనా? 'మెఱపు' అనవలెనా? ఎంతో చిన్న విషయము. కలిపికొట్రా కస్తూరిరంగా అనే వారిలో చేరితే సందేహానికే అవకాశము లేదు. కాని. మామన స్సొప్పుకోదు. పంతులుగారు 'మెఱుపు' అని ప్రయోగించినారు. శబ్దరత్నాకరములో 'మెఱపు' ఉన్నది గాని 'మెఱుపు' లేదు. శ ర. లో ఇచ్చిన ప్రయోగము వల్ల సందేహము తీరదు, ఏమిచేయడము?

## మా ముద్దుల వ్యవహారము

పంతులుగారు పరిషద్వస్త్రాదితులయినా వారున్ను మావంటివారే. వారు మాత్రము రసికులు కారా? లౌక్యములో ఆరితేరినవారు లోకవ్యవహారము నెట్లు తప్పించుకో గలరు? వారు మావలెనే నవ్వుతారా, మావలెనే ప్రశ్నిస్తారు, మావలెనే సందేహిస్తారు, దేశకాలపాత్రముల ననుసరించి సంభాషిస్తారు, మావలెనే కోపము, సంతోషము, హర్షము– అంతా మావలెనే, మడికట్టుకొన్నప్పుడుమాత్రము యథాశక్తి జపము, అంతే. ఆ భేషజముమాత్ర మెందుకు అని మా ప్రశ్న. ఎవరే మనుకొన్నా పంతులుగారు మా వ్యావహారికభాషాపోషకులే. కాకపోతే చూడండి వ్యావహారికభాషకు ఆధారముగా ఎన్ని ప్రయోగాలు చేసినారో!

1. "నాయికానాయకులలో *ఒకరు* మరణింపగా *వారు* తిరిగి వచ్చువఱకు రెండవవారు పొందు దుఃఖము కరుణ మనఁ జెల్లదు." (ఉపో. iii)

"నాయికానాయకులలో నొకరు లోకాంతరగతులై తిరిగి లభింపఁదగినవా రగుచుండ వారికై రెండవవారు దుఃఖించినచో" (ఉపో. iv)

పై వాటిలో ఒకరు, వారు, అనేవి ఉభయలింగాలుగా వ్యవహారములో ఏర్పడ్డ ఏకవచనాలు. గౌరవార్థములో బహువచనా లని చెప్ప వీలులేదు.

2. "ప్రత్యాశారూపక మైన రతి లేనిదే కరుణవిప్రలంభము పుట్టనేరదు. (ఉపో. V.)

3. అట్టితలం పేమాత్రమున్న నతఁడు రాముఁడే కాకపోవలసి వచ్చును. —ఉపో VI

4. "విదూరస్థా" యనుపద్దులోఁ బడవలయును గాని సీత మఱియొక పద్దులోఁ బడుట కవకాశములేదు గదా." ఉపో. Vii, Viii.

5. "మాటకు మాటపెట్టి యొక మాఱ్కని మాఱిన మెత్తురే బుధుల్. అప. 2. అత్తగార్లకు (5); వియ్యంకులు (10); కుదుపు (18); ఈ అర్థములో శ. ర. కారు డివ్వలేదు; ఇది యర్థవాదములే (22); బొత్తిగా (56); అకస్మాత్తుగా (56); పిల్లలు (మనుష్య శిశువులు) 30, 60, 98; వెఱ్ఱి (ఇది కొందరు గ్రాంథికవాదులమతములో గ్రామ్యము) 35, 45. 46, 47, 50, 87, 95. 157; అట్టెయున్న (అట్టేఉండు, అట్టేపెట్టు మొ. వలె) 81: ఐనట్లా, లేనట్లా 83; నా ప్రియసఖియు నైన కౌసల్యా! 86; కురుపు 87; తన్నిమిత్తమైయే 87; శాస్తి 100; మూసుకొనియె 72; ఈమె కాదూ ? 73; బాట 77; తట్టె మదికి 107; ఇదుములు సైతము 49; వినికిడి 52; పైని 17; గిరులు మాత్రము 44; ఈ మొదలగు 65; మాయమొనరించు 66; ఐతిగాదు 67; ఆఁ 65, 89; ఈఁహూఁ 82. 97; నన్ను వేఁపుచున్నదానవు 71; నాతపంబు ఫలమే (అవధారణము) 87; తొడిమ 50; నామీఁదనే యీకను బొమల ముడివెట్టుట ? 122; ఈమెయేనా యా కౌసల్య ? 91; అంటించు 92; కావిపంచెయున్ 94; ఇదిగో 109; ఎంతకాల మేడిపింపను ? 78; స్తిమితపడుము 78, 80, 87; చూడను చూచినాఁడను తెలియను తెలిసినది 103; మాటుగ నున్న 114: విఱుగుడు 114; కురిపించు 124, 156; గట్టిగా కౌఁగిలింపు 127; ఏమీ, రఘునాథుఁడే 129; వినియోగపడియె గదర 134;— దీనికి ప్రమాణము మా (1) చెల్మోహనరంగా పాట; (2) గదరా సుమతీ. చెవులు 137;...ఇది అప్పకవి ప్రకారము గ్రామ్యము.

పాద పూరణాలు :

తలపఁడే 8; లలిన్ 12; చూడఁగ 19; పరఁగ 40, 42, 88; ఇచ్చుఁచో 118;

వాక్యానన్వయము :

ఇచ్చట రతి యనఁగాఁ బునస్సమాగమాభిలాషారూపకము—ఉపో. X.

అధ్యయనహేతువు లగుచు గ్రద్దములు నరసిన యీ తపోధనులకు—81.

శ్రుతిదుష్కరములు :

బాలనీక, ఈ పెద్దది 20; నాకూఁతును పరిశోధించుటకు 89; ఈ రాజు కూఁతునందు 92.

ప్రాసగణాదుల కక్కుర్తులు :

"పలుకుబడి వేఱు పదపాటి వేఱు, రీతులును వేఱ యన్వయరీతి వేఱు." అవ. 2.

"రుదితముచ్ఛ్వాస ఫలదంబ యదియు మేల"— 67; రాముండు లేఁడన్న వార్త లేద 68;

పైవాటిలో అవధారణమునకు ప్రయోజనము కనబడదు.

"సురక్షకాళి" 119; "సంపరిశుద్ధ" 86; "పద్మగంధలసితవారి.... అవక్రకాండ లసిత పద్మపత్రము" 60; "క్ష్మాకాంతాతనయనైన 7; "దండకాఖ్యావనవీధి, కౌశికాఖ్యామౌని, భూరిదరోదరస్థలుల బుస్సలుకొట్టుచు నిద్రవోవు నీ భూరిఫణీంద్రదేహముల 39;

పూర్తిగాను 119: అరయఁగాను 153 మొదలయినవి.

తెనుగు సంప్రదాయము

"పరువుల్ మేయంగ (కాకులు) 36.

పక్షులు పండ్లను, పురుగులను తింటవి గాని మేయవు; మేత మేస్తవి.

"అనంటి యీరముల్" 62.

ఈరము అనేమాట మాండలికము. ఇది ఇప్పటికిన్ని మా రాయలసీమలో వాడుకలో ఉన్నది. లతలగుంపు ఈర మని ఇచ్చటి వాడుక. ఇతరప్రాంతాలలో ఇది వాడుకలో ఉన్నట్లు కనబడదు చెట్ల యీరము లని ప్రయోగించకూడదేమో !

తెలుగులోని సంస్కృత సంప్రదాయము :

ఈ విషయమై భేదాభిప్రాయా లుండవచ్చును. సంస్కృత నిఘంటువులలోని యే పదాలనైనా తీసికొని, వాటిని వ్యస్తముగానో, సమస్తముగానో, వ్యాకరణావిరుద్ధముగా ఉంటే చాలును తెనుగులో వాడుకోవచ్చు నని, కొందరి అభిప్రాయము.

మే మా అభిప్రాయముతో ఏకీభవింపలేము. అట్లే ఒకమాటకు మరి ఒకటి పర్యాయ పదము గదా అని నిఘంటువుల నాధారముగా చేసుకొని వాడకూడదు. తెనుగులో కొన్ని సంస్కృతశబ్దాలు, కొన్ని సంస్కృత సమాసాలు మాత్రమే కవులు వాడు కొన్నారు. అది ఒక సంప్రదాయముగా ఏర్పడినది. దానికి విరుద్ధముగా ఇప్పటివారు ప్రయోగిస్తే ఆ ప్రయోగము నిఘంటువ్యాకరణాలకు విరుద్ధము కాకున్న ఆనౌచిత్యదోషానికి పాలవుతుం దని మా అభిప్రాయము. అట్టివి కొన్ని—

"అస్మదాది సహితలు" 80; "గంభీరమాంసల స్తనితము" 52: "త్రస్త హరిణాక్షి" (భీత) 56; జ్యాఘోషరణితాస్త్రము (ఘోషము రణితము కానేరదు) పుత్రభాండము 101; "శర్మములధాని (అంగారధాని, గోపాలధాని, రాజధాని, అగ్నిధాని, క్షురధాని, రజ్జుధాని మొదలైన ధాను లున్నవి గాని శర్మములధాని ఉంటుందా ?) 120; అహో! 100: 108; 110;

సంస్కృతములోని అవ్యయాలను అదేరీతిగా తెనుగులో వాడవచ్చునా ? అహోకు మా కాక్షేపణ లేదు గాని. 'హంత' నే నెంతక్రూరుడను (90) అనే ప్రయోగము మాత్రము తెనుగు మర్యాద ననుసరించినది కాదు.

కవితాధార

ఉత్పల చంపకమాలలు, శార్దూల మత్తేభ విక్రీడితములు వ్రాసేటప్పుడు పంతులుగారికి కొంతధార కుదిరినది. కాని, కందములు, తేటగీతములు, ఆటవెల దులు ధారాశుద్ధిగా వ్రాయడము అలవాటు కాలేదు. అందుచేత చాలా పద్యాలు కుంటుగా నడుస్తున్నవి. కొన్ని ఉదాహరణాలు—

కం. ఉత్తరరామ చరితముఁ బ్రయోగింతు మిదే (1)
గీ. శాంతయను కన్యఁ బడసి దశరథవిభుఁడు (2)
గీ. వనితలయెడలను గవులవాక్కులందు (3)
గీ. జనకుఁడు మఱలి మిథిలకు జనియె నిపుడె (4)
గీ. యాగమువలన మే మిట నాగినాము (7)
గీ. కలసి మన మున్న యాదినములు చనెఁ గట (11)
గీ. బృందము నివరియన్నంబుఁ బ్రీతితోడ (14)
కం. ఏకార్యమయిన నొనర్తు రెప్పుడు సుజనుల్ (22)

గీ. వచ్చితి నిపుడు వాల్మీకివలననుండి (29)

కం. అలరులకంటె న్మృదువులు నై యుండు మహా (34)

గీ. సుజనుల వలని చావును శుభకరంబ (37)

గీ. అల్ల దక్షిణపు నగము లవ్వెసుమ్మ (46)

ఆ. వె. అతిగభీర మగుట నగపడదు పయికి
కుతకుత మనుచు నుడుకు పుటపాకముగతి
గురుతర మగు రాముకరుణరసము (47)

గీ. శార,దపను(డు కేతకీగర్భందళము(బోలె ? (50)

ఆ. వె. ఇప్పుడు నవిపో విడువ వీస్థలంబు (62)

మొదలయినవి.

అతివిస్తరము చాలును. పుటపుటకును ఇట్టి కుంటుపాదములు దొరలినవి. గణాలు కుదుర్చుకొనడానికి పంతులుగారు చాలా శ్రమపడి ఉంటారు. వచనము వ్రాస్తే బాగుండునే !

పంతులుగారు మిక్కిలి చిన్నవిషయాలలోనే క్రిందా మీదా పడినారు. చూడండి :

"వసిష్ట" అనవలెనా 'వసిష్ఠ' అనవలెనా అని సందేహము. 'ష్ట' రూపాలను కొన్నిటిని తప్పొప్పుల పట్టికలోచేర్చి 'ష్ఠ'గా దిద్దుకోమన్నారు. కాని కొన్నిచోట్ల దిద్దక విడిచినారు. (82, 152) 'షష్ట' (ఉపో IX) అని వ్రాసినారు. 'షష్ఠి' అని దిద్ద మరచినారు. ఈ పొరపాటుకు కారణము 'షష్టి=అరవై ; షష్ఠి-ఆరోతిథి; షష్ఠ= ఆరో అని వేర్వేరుగా ఉన్న వని గుర్తింపకపోవడమే. ఈ సందేహాలు నావంటి సాధారణుల కందరికీ కలుగుతవి. పంతులుగారంతటివారికి కూడా కలిగినవి.

"సురచిరాకారు(డు" (128) అని ప్రయోగించినారు. అరవవారినుంచి నేర్చుకొన్న తెనుగుపిల్లలు 'వరవీణామృదుపాణి, వనరుహలోచనురాణి సురచిర బంభరవేణి' అని పాడుతారు. అట్లే చాలమంది పండితులుకూడా అనదము వ్రాయ డము కలదు.

విమర్శించడానికి దొరకి దొరకి ఈ ఉత్తరరామచరిత నాటకమా మీకు దొరికింది ? దీనిమీద వినియోగించిన కాలము మరేదయినా మంచిపనిమీద వినియో

గిస్తే బాగుండునే అని నా స్నేహితులు కొందరు నన్ను మందలించినారు. కాని, అనేక ప్రయోజనాలు ఏకదేశములో లభించడముచేత ఈ అవకాశము వదలుకొన డానికి నామన స్సొప్పుకోలేదు.

1. లోకములో అనేకులు గ్రాంథికవాదుల మని చెప్పుకొని, వ్యావహారిక వాదులను బహిరంగముగాను చాటుగాను మాటతో నిందిస్తూ, చేతితో అపకారము చేస్తూ ఉన్నవారున్ను, వారి అనుయాయులై, వారి ఆగ్రహానికి ఎక్కడ పాత్రుల మౌతామో అని దిగులుపొందే వారున్ను ఎన్నో గ్రంథాలు వ్రాస్తున్నారు. సాధార ణముగా ఇట్టి అన్ని గ్రంథాలలోను గ్రాంథికభాషామర్యాదల నతిక్రమించడము, వ్యావహారికభాషను విచ్చలవిడిగా, అప్రయత్నముగా ఉపయోగిస్తూ ఉండడము జరుగుతున్నది. అట్టివారు చేస్తూ ఉన్న దోషాలన్నీ ఈ ఆంధ్రీకృతోత్తరరామ చరితములో గుమిగూడి మూర్తీభవించినవి. దీనిని పట్టుకుంటే ప్రతిగ్రంథమును వేర్వేరుగ విమర్శింపవలసినపని పడదు.

2. గ్రాంథికవాదులలో పంతులుగారు అగ్రేసరులు. ఇదిగాక మరెవ్వ రయినా అయితే 'చిత్తము, చిత్తము, పొరపాటు కలిగినదండీ. దిద్దుకొంటాము, ప్రమాదో ధీమతా మపి' అని అన్నదిగదా అండి' మేముకూడా మనుష్యులమే. తప్పులు కలుగ కుండా ఉంటవా ?' అని తప్పించుకొంటారు. కాని పంతులుగారికి నిద్రలో కూడా గ్రాంథికవాదులమీద కత్తులు నూరుతూ ఉన్నట్టే కలవరింత. ఈ విషయములో శ్రీవారికి గల పట్టుదల మరేవిషయములో నయినా ఉంటే, దేశాని కెంతో మేలు కలిగి ఉండేది. మొన్నమొన్న ఆంధ్రయూనివర్శిటీ కమీషన్‌లో తెనుగుకు ఎక్స్ పర్టు సభ్యులుగా ఒక కాలేజీకి పోయి ఒకానొక పండితునితో "ఏమండీ. ఇక్కడికి పర్లాకిమిడి గాలి ఏమయినా సోకిందా ?" అని అడిగినారట. పర్లాకిమిడి కొండగాలి వల్ల శరీరానికి మంచిబలము కలుగుతుం దని పంతులుగారికి తెలియదు. కొండగాలి తీవ్రమైన స్వాతంత్ర్యబుద్ధిని, సాహసమును, ధైర్యమును వృద్ధిచేస్తుం దని చరిత్ర చదువుకొన్నవారికి తెలుసును. స్వతంత్రబుద్ధిని కోరి చంపుకొన్నవారు, ఇతరుల స్వాతంత్ర్యమునకు కూడా నిరోధము కలిగించవలె నని ఉబలాటపడతారు. పరిష న్నిఘంటునిర్మాణము మందగించడానికి కూడా పంతులుగారి వ్యావహారిక భాషా ద్వేషమే కారణమని వినికిడి.

3. మొదటిలో వ్యావహారికభాషావాదానికి నిష్కారణముగా అడ్డుతగిలి లోకమును భ్రమపెట్టి, దేశాభివృద్ధికి పంతులుగారు తీరరాని అపకారము చేసినారు.

అప్పుడూ, ఇప్పుడూ కూడా ఆంధ్రవిశ్వవిద్యాలయములో తమకు గల పదవిని దుర్వినియోగము చేస్తూ అనేకవిధాల భాషకు అపకారము కలుగజేసి, చేస్తున్నారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తులో ఉభయభాషాప్రవీణ పరీక్షాప్రణాళికను తగలబెట్టినది వీరే. ఆ విషయమున వీరు చేసిన కృషివల్ల తెనుగుభాషకు ప్రాధాన్యము సంపూర్ణముగా తొలగిపోయినది. విద్యాభివృద్ధి విషయములో వీరుచేసిన ఘనకార్య మిది.

4. ఆంధ్రవిశ్వవిద్యాలయ కమిషన్‌లో ఎక్కువపట్టు సభ్యులుగా వేసుకుంటే వీరు తమ రిపోర్టులో తెనుగు బాగా వ్రాయడానికి ముఖ్యోపాయము అరసున్నలను బండిఱాలను సరిగా వాడడము నేర్చుకోవడమే అని ఒక్కమాటలో చెప్పినారు. ఈ ఉపాయమును మొదటినుంచీ అందరు పండితులున్నూ ఉపదేశిస్తున్నదే. అందు కోసమే కళాశాలలో తెనుగు అభివృద్ధికి రాకుండా ఉండడము.

—చిలుకూరి నారాయణరావు*

—o—

* ప్రబుద్ధాంధ్ర. సం. 5. సం. 1, 3. జనవరి, మార్చి. 1934.

# అర్ధానుస్వారము

"ముఖనాసికావచనోఽనునాసికః" అను పాణిని సూత్రము చెప్పున ముఖసహితనాసికతో నుచ్చరింపఁబడున దగుట చేత ననునాసిక యగు హల్లు నుచ్చారణము కొంత శ్రమాపాదక మనవచ్చును. అందును బూర్ణానుస్వార మీఁది పలుకవలసిన దగుటచే మఱింత శ్రమము నొదవించుననుటకు సందేహము లేదు. వ్యవహార ముత్తరోత్తరముగ సుఖముఖోచ్చారణము నపేక్షించుచుండును. కావుననే యాంధ్రభాషలో నట్టి పూర్ణానుస్వారము వ్యవహారవశమున ననేకస్థలములయం దంతరించుచు వచ్చిన దని తోఁచుచున్నది.

అట్లు పూర్ణానుస్వారోచ్చారణ మంతరించుటలో మొదట మొదట మిక్కిలిగ శ్రమమును గలిగించు "తోంచు" మున్నగు దీర్ఘపూర్వకస్థలంబులయం దుండు పూర్ణానుస్వారము లంతరించె ననియుఁ గ్రమక్రమముగా 'తలంచు' మున్నగు హ్రస్వపూర్వకస్థలములలోని పూర్ణములుసైత మంతరింప నారంభించి పెక్కుచోట్ల మొదటమొదట వైకల్పికముగను దుదికి వ్యవహారమునఁ గేవలముగను నంతరించె ననియు గ్రహింపవలసి యున్నది. పదము యొక్క మొదటివర్ణ మెట్లయిన నూఁదియే పలుకఁబడును గాన నట్టి యూనికకు (Accent) భంగమురాకుండ 'ఉండు', 'నిండు' మున్నగు పదాది హ్రస్వములకుఁ దర్వాతి పూర్ణబిందువు మాత్ర మంతరింపనేరదయ్యె. అట్టి యూన యుండకుండుటఁజేసి పదముయొక్క తక్కిన వర్ణముల యుచ్చారణయు నందు వక్త కంతగా మెలఁకువ యుండదు గాన నట్టియెడ మాత్రమె యిట్టి లోపాదులు తటస్థించుట సహజ మని గ్రహింపవలయును. ఇక నట్టి పదాదివర్ణము దీర్ఘ మగు నపు డాదీర్ఘముచేతనే యచటి యూనికయు నిర్వహింపఁబడుచుండుటచే నచట లోపప్రతిబంధము లేమిం జేసియు దీర్ఘము మీఁది పూర్ణబిందూచ్చారణ మధికశ్రమాపాదక మగుటంజేసియు నట్టి 'తోంచు' మున్నగుచోట్లఁ బదాదివర్ణమును జెందినదయ్యుఁ బూర్ణబిందు వంతరించుటయె సహజమయ్యెను.

అయినను బయి నుదహరించిన విషయము సార్వత్రికముగ వెలసి యుండలేదు. వక్తలు నియమముల ననుసరించి వ్యవహరించువారు కామిం జేసి వ్యవహారమనుగమములకు సాకల్యముగా లొంగియుండనేరదు. కావున వ్యవహారస్థభాషకుఁ జేయు నియమములు ప్రాయోవిషయికములయి యుండును గాని సార్వత్రికము లయి

యుండనేరవు. అక్కారణముననే 'కాంచు, తీంద్రించు, వేంచేయు వేంద్రము, వాంద్రు పూంచు' మున్నగుచోట్ల దీర్ఘపూర్వకమె యయ్యుఁ బూర్ణానుస్వార మంత రింపక నియమముగా నిలిచియుండుటయు నగపడుచున్నవి. అట్లయినను దీర్ఘ మునకుఁ దర్వాతి నిండుసున్న యంతరించుట గాని యంతరింపకుండుట గాని నియతమై యుండునే గాని హ్రస్వపూర్వకపూర్ణమువలె వికల్పముగా నంతరించుటయు నక్కారణమునఁ బూర్ణబిందురూపమును దానికి రూపాంతరముగ నర్ధబిందు రూపమునగూడ నుండుటయుమాత్రము సామాన్యముగా నుండఁ బోదని చెప్ప వచ్చును. హ్రస్వమునకుఁ దర్వాతినిండుసున్న వికల్పముగా నంతరించుట తఱచుగా నగపడుచున్నను 'చేమంతి, నారింజ, పావంచ, చెల్లెంద్రు' మున్నగుచోట్ల నంతరింపకుండుటయు నియతమై యుండకపోలేదు. అట్లె పదముమొదటి హ్రస్వమునకుఁ దర్వాతి నిండుసున్న లోపింపకుండుటయు సహజమైనను 'ఇఁక, అఁట' మొదలగు కొన్ని యలంతిస్థలములందును వికల్పముగ నంతరించుట కూడ రూఢియై యున్నది. అట్లయినను మొత్తముమీఁద నిండుసున్న దీర్ఘమునకుఁ దర్వాత వికల్పముగను దఱుచుగా నంతరించుట సహజ మని మాత్రము చెప్పవచ్చును.

వ్యవహారము నందలి మార్పు లొక్కమాఱుగ జరుగుట, యసంభావ్య మగుటంజేసి పూర్ణబిందూచ్చారణ మంతరించుటలో సైత మది యొక్కమాఱుగ నశింపక మొదటమొదట దత్సంబంధమగు సానునాసిక్యము తత్పూర్వాచ్చానం దావహించుచు వచ్చెడి దనియు నానాఁటి కట్టి సానునాసికోచ్చారణము కూడ నశించిన దనియు గ్రహింపవలయును. కావుననే ప్రాచీనతమమహాకవుల గ్రంథములలోఁ బూర్ణబిందు వంతరించిన పదభాగమున కట్టిదానినే ప్రాసస్థలములలో నిలిపెడి ప్రయత్నము చూపట్టుచున్నది.

ఉ. వాఁడిమయూఖముఖముల్ గలుగువాఁ డపరాంబుధిఁ గ్రుంకె ధేనువుల్
నేఁ డిట వచ్చె నేకతమ నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్
పోఁడిగ వేల్వఁగాఁబడియె బ్రొద్దును బోయెఁ గచుండునేనియున్
రాఁడు వనంబులోన మృగరాక్షసపన్నగబాధ నొందెనో.

—భార. ఆది. ౩ అ.

ఆయినను నన్నయకాలముననె సానునాసికోచ్చారణము కూడ నరుదుగా నశించు చుండుటచేఁ గాఁబోలు నన్నయభారతభాగమునందు సైతము పై నియమము సరిగాఁ బాటింపఁబడి యుండలేదు.

కం. అపన్నగ ముఖ్యులఁ దన
వీఁపునఁ బెట్టుకొని పఱచి విపినములు మహా
ద్వీపములు నదులు గిరులు ది
శాపాలపురములుఁ జూపెఁ జన వారలకున్. -భార. ఆది. ఆ.7.

పైరీతిని నన్నయ కాలముననే పూర్ణానుస్వార మంతరించుటయే గాక యచటి సానునాసిక పాఠము కూడ నశించుచుండెనని గ్రహింప దగి యున్నను నన్నయకుఁ దరువాతివా రయ్యుఁ గొందఱు మహాకవు లట్టిపదముల ప్రాచీనస్థితిని స్మరించి కాఁబోలు వానిని బూర్ణబిందు యతి పదభాగములకుఁ బ్రాసములుగా నచ్చటచ్చట నిలుపుచు వచ్చిరి.

కం. పొందిగన గజ తపశ్శిఖి
మూండుజగంబులను దీవ్రముగఁ బర్విన బ్ర
హ్మాండముఁ గాఁచిన కాంచన
భాండముక్రియఁ దాల్చెఁ దత్ప్రభాభాసిత యై.

—నన్నెచోడుని కుమారసంభవము. 6 ఆ. 804.

ప్రాచీన మహాకవుల యిట్టి ప్రయోగములను బట్టి పరిశీలించునవుడు, నిందునున్న యంతరించుటయు నచటి సానునాసికోచ్చారణ మంతరించుటయు నప్పటి కచిర కాలములోనే వ్యవహారమున సంభవించి యుండె ననియు, నక్కారణముననే ప్రాచీను లట్టి యనుస్వారములను గేవలము విడువఁజాలక పయిరీతిని వానిఁ బాటింప యత్నించుచు వచ్చి రనియుఁ దోఁపకపోదు. అ ట్లచిరకాలమునుండియే పూర్ణ బిందు వంతరించుట వ్యవహారమున సంభవించి యుండుటచేతనే కావలయు నట్లంతరించిన పూర్ణానుస్వారస్థలములోని సానునాసికోచ్చారణమున కనుమాపక మగు రేఖా విశేషమేదియు నావరకుండు లిపులలోఁ జూపట్టకున్నది. అనుస్వారము నూది పలుకవలసిన స్థలములందును దేల్చి పలుకవలసిన నాసికోచ్చారణ స్థలము లందును నవిశేషముగ నెప్పటియట్లు పూర్ణబిందురేఖయే ప్రాచీనలేఖనమున నగపడు చున్నది, అట్టి లేఖనములనుబట్టి యావర కుచ్చారణ భ్రష్టమయ్యు నిందునున్న లేఖనభ్రష్టము కాలే దని తోఁచుచున్నది. అట్టిలేఖనపద్ధతి చదువరులకు విశద పరచుటకై యిట క్రీస్తు శకము 1075 సంవత్సరపు దీర్ఘాసి వనపర్తి శాసనము లోని సీసపద్యము నుదాహరించుచున్నాను.

సీ. శ్రీశకునేణ్ణు (న్డులు) భూపతిపై శైల
నందాబ్జభవన సంఖ్యా (997 + 78=1075)
దేశంబు గిమిడియు గోనల గిడ్రి సింగి
దేశంబు మరి యొడ్డదేశ మనంగం
జనిన భూపాలు రన వినోచ్చె చలవర్తి
గణ్డగణ్డె నెగడిన మణ్డలికుణ్డు
భూసురవంశుణ్డు వాసవనిభభోగి
బణపతి సౌజన్యగుణయుతుణ్డు
దీర్ఘాసి భగవతిదేవి దేవాలయ
మున ముందటం గడుఘనతరముగ
మణ్డప మెత్తించె భణ్డన విజయుణ్డు
గణ్డగోపాలు ణ్డఖణ్డవర్తి
దీవియ వెట్టె నద్దేవికి నవ్వేలం
దన మనోవల్లభి వనజనేత్ర.
దీవియవెట్టెం బద్మావతియును (నా) క్షోణీ
నశశులు గల యంతకును ముదమున ?

ఆ. వె. గగనభూమి చంద్ర ఖరకరోదక శిఖి
మారుతాత్మమూర్తి మహిషమథన
యిష్ట (పూర్త) ఫలము లెల్లకాలంబును
మెచ్చుచోడంద మకు నిచ్చుచు (ణ్డ)

—ఎపిగ్రాఫియా ఇండికా, వా. 4. నెం. 45.

ఈ శాసనపద్యమునందుఁ బూర్ణబిందు పూఁది పలుకవలసిన (ఏటవాలక్షరములున్న) స్థలములందును, దేల్చి పలుకవలసిన యధోరేఖాంకిత స్థలములయందును భేద మేమాత్రమును లేక యొకేవిధమునఁ బూర్ణబిందు రేఖగాని దానికి మాఱుగ నప్పటి సంప్రదాయము చొప్పున పరసవర్ణపంచమము గాని వ్రాయ బడుచు వచ్చెను గదా ? ఈ శాసనపులిపినిబట్టియు యుద్ధమలుని బెజవాడ శాసనపు లిపిని బట్టియుఁ బరిశీలించునపు డాకాలమున సంస్కృతభాషాప్రసిద్ధ మగు పరసవర్ణవర్గపంచమములు బిందుస్థానమున నిల్పుపద్ధతి ఉతవర్గపరకబిందువు విషయమున మాత్ర మాంధ్రమున పైతము వాడఁబడెడి దనియుఁ దక్కిన కచప

వర్గాక్షర చతుష్టయ పరకబిందుస్థానమున నట్టి యుచ్చారణము వ్యవహారమున లేమింజేసి కావలయునట్లు తత్తద్వర్ణ పంచమాక్షరము లార్చికబిందుస్థానముననే గాక తత్సమరూపసంస్కృతబిందుస్థానమున సైతము నిలుపఁబడలే దనియు నూహింపకమానదు. అయినను 'ఉ' వర్గవర్ణచతుష్టయపరకబిందువును సైతము తద్వర్గ పంచమరూపమున నుచ్చరించు వాడుక యంతరించుటచేఁ గాఁబోలు నట్టి నియమమును యావైకరణు లంగీకరింపకుండుటం జేసి యట్టి చోటులందు సైతము బిందుస్థానమున వర్గపంచమములను వ్రాయు నాచారము నానాఁటికి నశించిన దని గ్రహింపవలయును.

పయిరీతిని బిందువునూఁది పలుకునపుడును దేల్చి పలుకునపుడును నొకే రీతిని వ్రాయుట సరికాదను తలంపునఁ గావలయు నూఁది పలుకవలసిన బిందువునకుఁ దర్వాతి హల్లున కూరకయె ద్విత్వము వ్రాయు సంప్రదాయము క్రమక్రమముగా బయలువెడలినది. ఇట్టి సంప్రదాయము కూడఁ గొంతవఱ కుచ్చారణములోని సహజస్థితి ననుసరించి కల్పింపఁబడినదే యని చెప్పవచ్చును. అనునాసిక్యము పలుకని వారి యుచ్చారణము నందును జలుబుచేసి ముక్కు దిమ్ముపట్టినవారి యుచ్చారణమునందును బిందువు పలుకఁబడకుండుటయు నట్టి బిందువు వలనఁ బూర్వాక్షరమునకుఁ గలుగవలసిన యానిక (లేక) గౌరవము చెడకుండఁ బరవర్ణము ద్విత్వయుక్తముగాఁ బలుకబడుటయును ప్రసిద్ధమే గదా.

పదప్రకృతిలో సహజముగా లేని ద్విత్వమును వ్రాయుట యసంగత మని తలఁచి కావలయు వైయాకరణు లట్టి ద్విత్వలేఖన పద్ధతినంగీకరింపక యూఁది పలుకవలసిన బిందువు నెప్పటియట్లు మండలాకారముగను, దేల్చిపలుకవలసిన బిందువు నర్ధచంద్రాకారముగను వ్రాయవలయు ననుచు "పూర్ణేందు సదృశః పూర్ణ స్త్వర్ధ స్త్వర్ధేందు సన్నిభః" అని యిట్లు సూత్రించి వానికి వరుసగాఁ బూర్ణబిందు వనియు నర్ధబిందు వనియు సార్థకనామములను గల్పించిరి.

అట్టి నియమ మేర్పడినను గతానుగతికముగా నిటీవలి లేఖకులు సైతము తాళపత్ర గ్రంథములను వ్రాయుటలోఁ బూర్వపూర్వ మాతృకానుసారముగా వెనుకటి ద్విత్వలేఖనపద్ధతినే యవలంబించి వ్రాయుచు వచ్చిరి. కావుననే రమారమి నూఱుసంవత్సరముల క్రిందటివఱకుఁ బుట్టిన తాళపత్ర గ్రంథములలో సైత మట్టి ద్విత్వలేఖనపద్ధతియే చాలవఱకు నియతముగా నగపడుచున్నదిఁ ఇటీవలి తాళపత్రగ్రంథములలో నరసున్నకు లేఖనయే లేదు. అట్లయినను బండిత పరి

పరిష్కృతములై బయలువెడలిన ముద్రణ గ్రంథములలో మాత్రము వైయాకరణ సంప్రదాయము చొప్పున నూదిపలుకవలసిన బిందువులను మండలాకారముగను, దేల్చి పలుకవలసిన బిందువులను నర్ధచంద్రాకారముగను నిలుపుపద్ధతి బయలు వెడలినది. ప్రాచీన తాళపత్ర మాతృకలలో నిట్లర్ధబిందు లేఖనము లేదనియు బ్రాచీన సంప్రదాయము చొప్పున ద్విత్వలేఖన పద్ధతియే యుండెడి దనియు విశద పఱచుటకయి యిట నావద్దనున్న తాళపత్ర మాతృకలలోఁ బురాతన మగు కేయూరబాహు చరిత్రమునుండి రెండు పద్యములను యథామాతృకముగా నుదాహ రించుచున్నాను.

ఉ. బాలరసాలపుష్పనవపల్లవకోమల కావ్యకన్యకం
గ్గూళల కిచ్చి యప్పడుపుం గూటింజరించ్చుటకంట్టె సత్కవుల్
హాలికులైననేమి మరి యంత్తకు నాయతిలేని నాండు కా
ద్దాలికులైననేమి నిజదారసుతాద్యభిరక్షణార్థమై. —కేయూర 1 ఆ.

మ. తన మేనల్లుని సోమదత్తు బహుతంత్త్రప్రౌఢి ధీమత్తుం జ
య్యన నచ్చోటికిం బిల్చితేంబనిచి యేకాంత్తంబ్బునన్ రాజవ
త్తనమున్ జారులచేత విన్నదియు మీందన్ దారు శాయద్దలం
చిన కార్యంబ్బునుంజెప్పి సస్మితరుచిన్ సద్వక్త్రుండై వానికిన్.
—కేయూర. 2 అ.

పైపద్యములలో బిందువు నూఁది పలుకవలసిన స్ఫుటాక్షరాంకిత స్థలములలో బిందువునకుఁ దర్వాతి హల్లున కూరకయె ద్విత్వ మిచ్చుటయుఁ దేల్చి పలుకవలసిన యధోరేఖాంకిత స్థలములలో నట్లు ద్విత్వము నీయకుండుటయు నియతముగా నగపడుచున్నవి గదా. ఇట్టి లేఖనము పదముల యథాస్థితికి గేవలము విలక్షణముగనే యున్నను వైయాకరణులచే నుపేక్షితమే యైనను నిది యుచ్చారణములో నంతరించిన యర్ధానుస్వారస్థలములను గ్రహించుటలో మాత్రము వైయాకరణులకుఁ జేఁదోడు వాదోడుగా నుపచరించె నని చెప్పుటకు సందేహము లేదు. హ్రస్వపూర్వక బిందుస్థలములందుఁ బాక్షికముగాఁ బూర్ణబిందువు నిల్చియుండుటంజేసి పద్యకావ్యప్రయుక్తములై ఛందోనురోధమున మార్పురాక నిలిచినట్టి పూర్ణబిందురూపములను బట్టి వాని యర్ధబిందురూపములను గ్రహించుట కవకాశమున్నను దీర్ఘపూర్వక స్థలములం దీప్రాచీనలేఖనపద్ధతి దక్క నర్ధబిందు స్థలములను గ్రహించుటకు మంచి యుపాయము వేఱొకటి లేదనియే చెప్పవచ్చును.

అయినను వైయాకరణోపేక్షిత మగుటంజేసి యద్యతన ముద్రణ గ్రంథములం దట్టి ద్విత్వ లేఖన పద్ధతి చొరకుండుట చేతను నర్ధబిందుస్థలములందుఁ దేల్చి పలుకు సానునాసికోచ్చారణ మంతరించుట చేతను నిపుడట్టి యర్ధబిందుస్థలమును బోల్చికొనుట మిగుల దుష్కరమై యున్నది. ఉచ్చారణ భ్రష్టమగు నద్దానిని వదలుకొనుటకు మన యాంధ్రపండితు లింకను నంగీకరింపలేకున్నారు. అట్లగుటం జేసియే యా విషయమున గొంతవఱకైన మార్గము చూడగోరి యాంధ్రవైయాకరణులు కొన్ని నియమములను జూప యత్నించుచున్నారు.

“సిద్ధ స్సాధ్య శ్చానుస్వారః పూర్ణార్ధ భేదతో ద్వివిధః
హ్రస్వా త్పూర్ణోపి భవే ద్దీర్ఘా చ్ఛేత్ఖండ ఏవ సజ్ఞేయః”

అని యిట్లాంధ్రశబ్దచింతామణిలోఁ జెప్పబడియున్నది. ప్రకృతిసిద్ధము సిద్ధమనియు వ్యాకరణ సాధ్యము సాధ్యమనియు నట్టి సిద్ధసాధ్య రూపద్వివిధానుస్వారములును వేర్వేఱ పూర్ణార్ధభేదములచే రెండేసివిధము లనియు బయికారిక పూర్వార్ధమున కభిప్రాయము. ఆయనుస్వారము హ్రస్వాచ్చునకుఁ దర్వాత బూర్ణమై కూడ నుండుననియు నవి శబ్దమహిమచే ఖండమై కూడ నుండుననియు దీర్ఘాచ్చునకుఁ దర్వాత నన్ననో ఖండము మాత్రము మాత్రమె యై యుండుననియుఁ బైకారిక యుత్తరార్ధమున కభిప్రాయము. దీర్ఘమునకుఁ దర్వాతి నిండుసున్న యంతరించునెడ నియతముగనే యంతరించును గాన నచట ఖండము మాత్రమె యుండుననియు హ్రస్వమునకుఁ దర్వాత నట్లు గాక పాక్షికముగా నంతరించును గాన నచటఁ బూర్ణార్ధములు రెండును బర్యాయముగ నుండుననియుఁ దెలుపఁదగిన యీ సామాన్య విధి వెనుక నుదాహరించిన యనుస్వారచరిత్రమున కనుకూలముగనే యున్నదన వచ్చును. కాఁగా హ్రస్వమునకుఁ దర్వాత నిండుసున్న యెచ్చటెచ్చట నుచ్చారణభ్రష్టమగుచున్నదో యయ్యయి పదము లిపుడు నిర్బిందుకములుగాఁ బలుకుఁబడిలోనున్న యెడల నట్టి బిందుస్థానము నర్ధబిందువును నిల్పవలయునని గ్రహించుట కవకాశము లభించుచున్నది. ఈపక్షమున ‘నిద్దంపు, నాల్గింటి’ మున్నగువాని రూపతరములగు ‘నిద్దపు, నాల్గిటి’ అను నిర్బిందుకరూపములలో బూర్ణబిందుస్థానమున ఖండమును నిల్పవలసివచ్చునని శంకింపఁ బనిలేదు. అట్టివెల్ల సాధ్యబిందు విషయకము లగుటం జేసి యపవాదము లగు వ్యాకరణ విధానములను బట్టి తెలిసికొనఁ దగినవే యగును. కావున ‘హ్రస్వాత్ పూర్ణోపి భవేత్’ అను చింతామణి నియమము సిద్ధఖండానుస్వార స్థితి నిరూపణ విషయమున మాత్రమె యుపచరించు ననియు నదియె ముఖ్యముగాఁ

గావలసి యున్నదనియు గ్రహింపవలయును. ఇఁక నారింజ, చేమంతి, మున్నగు వానిలోని సిద్ధపూర్ణానుస్వారములు హ్రస్వపూర్వకము లగుటంజేసి వానిచోటలం దర్ధబిందులు సైతము పర్యాయమున నుండవలసివచ్చునను మఱొక విప్రపత్తి కూడఁ దోపవచ్చునుగాని యదియు నంత బాధకము కానేరదు. పూర్ణబిందూచ్చారణము గల పదము నిర్బిందుక మయి కూడ వాడుకలో నున్నపుడు మాత్రమె యా నిర్బిందుకపదములోఁ బూర్ణబిందుస్థలమున నర్ధబిందువును నిల్పదగు నని తెలుపుట మాత్రమె పయి 'హ్రస్వాత్ పూర్ణోపి భవేత్' అను సూత్రమునకుఁ బ్రయోజన మని గదా యంగీకరించి యుంటిమి. అట్టి స్థితిలోఁ బూర్ణబిందువు కొన్ని యెడలఁ దేలిపోకుండుటం జేసి యా పదమునకు నిర్బిందురూపమే వాడుకలో లేనపు డిఁక నచట నర్ధబిందువు గలదా లేదా యను వికల్పము సైతము పొడమఁ జాలదు గదా.

"దీర్ఘాచ్చేత్ ఖండమ్ వసజ్ఞేయః" అను సూత్రమన్ననో పైదానివలెఁగాక దీర్ఘ పూర్వకసిద్ధపూర్ణ మంతరించునెడఁ గేవలముగ నంతరించునను సిద్ధానుస్వారస్థితిని దెలుపుటలో నుపచరించుట మాత్రమె గాక సాధ్యవిషయమున గూడ విశేష విధులు లేనపుడు— అనిర్దిష్టముగఁ బూర్ణార్ధ సాధారణముగ బిందువిధానము చేయఁబడనప్పుడు దీర్ఘముకుఁ బర్వాత నట్టి విధానము చొప్పునఁ బూర్ణబిందువు రానేరదని తెలుపుటకుఁ గూడ నుపయోగించును. 'నాతో + చెప్పెను' అను మొదలగుచోట్ల 'తద్రుతంచ బిందుస్స్యాత్'అను సూత్రము చొప్పున "నాతోఁజెప్పెను" అని సార్ధబిందుకరూపమె సిద్ధించును గాని 'నాతోంజెప్పెను' అను పూర్ణబిందురూపము సిద్ధింపనేరదు గదా. పయి 'దీర్ఘాచ్చేత్ ఖండఏవసజ్ఞేయః' అను సూత్రము సామాన్యశాస్త్ర మగుటంజేసి 'కాంచు, వేంద్ర, తింద్రించు, వేంచేయు' మున్నగు స్థలములందలి పూర్ణబిందువులు బాధితములు కానేరవు.

పైరీతినే "నఖండః ప్రథమాద్ధ్రస్వాద్వైకృతేత్ర కథాపిచ" అను నధర్వణకృత సామాన్య నియమము కూడ 'ఉండు, పండు' మున్నగుచోట్లఁ బదము మొదటి హ్రస్వాచ్చునకు దర్వాతి నిండుసున్న సామాన్యముగా నంతరింప దను సిద్ధపూర్ణస్వభావ విశేషమును దెలుపుటయే గాక పైరీతినే సాధ్యవిషయమున సైత మనిర్దిష్టముగఁ బూర్ణార్ధ సాధారణముగ విధింపఁబడిన బిందువిధానము చొప్పునఁ బదము మొదటి యచ్చునకుఁ దర్వాత నరబిందువు రానేరదని తెల్పుటకు గూడ (చెను + తొవ = చెందొవ) నుపయోగించును.

ఈ సందర్భములందు గొన్ని కారణములచేఁ బయిరీతి నంగీకరింపక యహోబలపండితుఁడు పైచింతామణికారికకు మఱొకరీతిని వ్యాఖ్యానము చేసియున్నాఁడు.

చింతామణిలో 'రాముఁడు, రాముండు' మున్నగుచోట్ల బిందువిధానము వేఱుగ లేకుండుటం జేసియు గ్రంథకర్త 'మహతస్సోర్డుజనితో భవేత్ పుంసి' అని యిట్లు బిందువిధానయోగ్యస్థలములం దెల్లఁ బ్రత్యయములకు జ కారము నిద్వర్ణముగా ఘటించుచు వచ్చుచుండుటంజేసియుఁ దన్మూలమున నట్టిచోట్ల బిందువును సంపాదింపఁదగునని తలఁచి 'అనుక్తమన్య శబ్దానుశాసనవత్' అను న్యాయము ననుసరించి ప్రాకృతవ్యాకరణస్థమగు 'సానునాసికోచ్చారం జిత్' అను నియమము చొప్పున జిత్వమునకు ఫలము సానునాసికమువంటి సార్ధబిందుకత్వమె యని సిద్ధాంతము చేసి 'డుజ్' మొదలగునవి జకారేత్త్వ మహిమచే నర్ధబిందు పూర్వకము లగునని యొకదారి ద్రొక్కియున్నాఁడు. కావున నట్టి యెడలఁ బూర్ణబిందురూపము సిద్ధించుటకయి హ్రస్వముమీఁది యరసున్న నిండుసున్న వికల్పముగా నగుననునియమ మాతనికిఁ గావలసి వచ్చెను. ఆ కారణమున నర్ధానుస్వారము యొక్క సహజస్థితి నంతగాఁ బాటింపక ప్రక్రియానిర్వహణ మాత్ర తత్పరత్వమున బయి చింతామణి కారిక యుత్తరార్ధమున కర్థము చేయుటలో సః అను సర్వనామమునకు 'ససిద్ధ స్సాధ్యశ్చ ఖండానుస్వారః' అని యిట్లు ఖండానుస్వారపరముగా నర్థముచేసి యవతలను హ్రస్వపూర్వకఖండానుస్వారము వికల్పముగాఁ బూర్ణ మగు నని యొక విపరీతార్థమును జేయవలసి వచ్చెను. కావుననె 'మహతస్సోర్డుజనితో భవేత్పుంసి' అను సూత్రపు వ్యాఖ్యలో 'అనుక్త మన్య శబ్దానుశాసనవ దితి న్యాయేన సానునాసికోచ్చారణం జి దితి సూత్రేణ సానునాసికత్వే రాముఁడు హ్రస్వాత్ పరత్వాత్ రాముండు ఇతి రూపద్వయమ్' అని యిట్లు ప్రక్రియను జూపి యుండెను. (అహో. 244 పుట.)

"పాలకోసము తాలమోఁత" అనునట్లు పయిరీతిని జిత్వఫలమును న్యాయసిద్ధముగాఁ గుదుర్చుటకయి సహజస్థితికి విరుద్ధముగా నరసున్ననుండి నిండుసున్నను బుట్టించుట యర్థమా ? ఉచ్చారణస్వభావమును బట్టిగాని వెనుక నుదాహరించిన యనుస్వారము చరిత్రమును బట్టిగాని పరిశీలించునపుడు నిండుసున్నయే వ్యవహారవశమున నరసున్నగా మాఱెను గాని యరసున్న నిండుసున్నగా మారలేదన్న విషయ మెవ్వరికేని విశదము కాకమానదు గదా. సుఖముఖోచ్చారణము నపేక్షించు వ్యవహారమున నూఁది పలుకవలసిన దానికిఁ దేల్చి పలికెడి పలుకుబడి సంభవించుట సహజము కాని దేల్చిపలికెడిదాని నూఁది పలికెడి పలుకుబడి కారణాంతర మేదియు లేకయే సంభవించుట సహజము కాదు గదా. సంస్కృత ప్రాకృత భాషలలో సైతము మన యీ యర్ధానుస్వారము వంటి యనునాసికపాఠమున

కిట్టి యనుక్రమమె యగుపడుచున్నది. మొదట బింద్వాదిరూపముగా నుచ్చరింపఁ బడుటయు దర్వాత సానునాసికముగాఁ బలుకబడుటయు నంతకంత కట్టి యనునాసికపాతము భ్రష్టమగుటయు నా భాషలయందుఁ బ్రసిద్ధ మయి యుండుటయే గాక వైయాకరణులచే సైతము తన్మార్గ మంగీకరింపబడి యున్నది. 'హింహిజ్ హిభిసః' అను ప్రాకృత వ్యాకరణసూత్రము 'భిస్' అను తృతీయా బహువచన ప్రత్యయమునకు వ్యవహారదశలో నగపడు ('రామైః = రామైహి') హివర్ణకమును విధించుటలో మొదట బిందుసహితముగను దర్వాత సానునాసికముగను దర్వాత నిరనునాసికముగను విధించుచున్నది. ఇట్టి యనుక్రమము సైతము తెనుఁగులోని బిందువు యొక్క యాఁదిపలుకునుచ్చారణము మొదటి దనియుఁ దేల్చిపలుకు నుచ్చారణము తర్వాతి దనియు నిరనునాసికోచ్చారణమింకను దర్వాతి దనియు నిట్లుచ్చారణ సహజస్థితిని దెలుపుటలో మంచి నిదర్శనమై యున్నది.

మఱియు 'తోనునాసికోచ్చారం జిత్' అను సూత్రము చొప్పున జిత్తునకే సానునాసికోచ్చారణము ప్రాకృతవ్యాకరణములోఁ బ్రసిద్ధమై యున్నది. కాని జకార మిత్తుగాఁ గలదానికిఁ బూర్వవర్ణమున నానునాసిక్యము కలుగుట ప్రసిద్ధమై యుండలేదు. 'హిం, హిజ్, హి, భిసః' అను వాల్మీకి సూత్రము చొప్పున వచ్చిన హిజ్ ప్రత్యయమునందలి హకారోత్తరవర్తియగు నికారమునకే గదా యానునాసిక్యము ('రామేహి' —షడ్భాషాచంద్రిక) వచ్చుట సంప్రదాయమై యున్నది. ఇట్టి స్థితిలో డుజ్ వర్ణకమున కర్ధబిందుపూర్వకత్వము జకారేత్త్వఫల మని ప్రాకృత వ్యాకరణ సంప్రదాయము చొప్పున నెట్లు చెప్పనగును? ఇఁక నచ్చటఁ గూడ 'దీర్ఘాచ్ఛే త్వంద ఏవ సజ్ఞే యః' అను స్థలమునందలి 'నః' అను సర్వనామ శబ్ద విషయమునందు వలెనే సంస్కృతవ్యాకరణప్రసిద్ధము లగు నేవో వింత సమన్వయముల ననుసరించి బిందుపూర్వకత్వ రూపార్థవిశేషమును సంపాదించుకొనవలసినదే గదా! అట్టి యర్థములు స్వారసికములు కావనుట సాహసము కాదని నా యభిప్రాయము. అరయ నరయఁడుజాది వర్ణనముల జకారత్వమునకుఁ బ్రయోగానుసారముగాఁ బూర్ణార్ధసాధారణ మగు బిందుపూర్వకత్వమే ఫలమని వ్యాఖ్యానము చేసికొనుటయె యుక్తమును, సహజస్థితికి విరుద్ధమును నగు నని గ్రహింపవలయునని తోఁచుచున్నది.

ఇఁక నట్టి చిక్కులు లేకుండ 'జిత్తు బిందుపూర్వకం బగు' (తత్స. 19 సూ.) అని స్పష్టముగా సూత్రించుకొన్న బాలవ్యాకరణకర్తగారుగూడఁ బైరీతినే

'హ్రస్వము మీఁది ఖండబిందుపునకుఁ బూర్ణబిందువు వైకల్పికముగ నగును' (బాల. సంజ్ఞా. 14) అని యిట్లేల సూత్రీకరింప వలయు నని శంకించుకొనవలసి యున్నది. బాగుగాఁ బరిశీలించి చూడఁగా 'నారింజ, చేమంతి' మున్నగు కొన్ని సిద్ధబిందుస్థలములందును బూర్ణబిందువును దేల్చి పలుకు వాడుకయే లేకుండుట చేతను ('నారిఁజ, చేమఁతి' అను రూపములు లేవు గదా.) వనంబు మున్నగు కొన్ని సాధ్యబిందుస్థలములందు సైతము 'వనఁబు' అను మొదలగు సార్ధబిందుక రూపములు లేకుండుట చేతను, నిద్దంపు' 'నాల్గింట' అను మొదలగుచోట్ల 'నిద్దపు, నాల్గిటి' అను రూపాంతరములం దర్ధబిందువు లేకుండుటం చేతను. హ్రస్వ పూర్వకము లగు సిద్ధసాధ్య ఖండము లెల్లయెడలను నవ్యభిచరితముగఁ బూర్ణము లగుచు వచ్చుచుండుటచేతను సూరిగారు వైయాకరణులకు సహజమగు ప్రక్రియా సౌష్ఠవపరత్వమున సహజస్థితి నంతగాఁ బాటింపక యట్లు సూత్రించి రనియు వారికిఁగూడఁ దత్సూత్రమును సిద్ధఖండస్థితిని దెలిసికొను విషయమున మాత్రమె యుపచరింపఁజేసికొను తలంపు గలదుగాని సాధ్యఖండములను సాధ్యపూర్ణముల నుగా సాధించుకొనుటలో నుపయోగించు తలంపు లేదనియు, సక్కారణముననె యా సూత్రమునకు 'అడఁకువ,' 'అడంకువ' మున్నగు కేవల సిద్ధబిందుస్థలములను మాత్రమె లక్ష్యములుగాఁ జూపిరనియు, నట్టి యభిప్రాయముచేతనే వారు బాలవ్యాకరణమునం దెచ్చటను నర్ధబిందువును విధించి పయిసూత్రము చొప్పున సాధ్యపూర్ణ మును సాధించుకొని యుండలేదనియు గ్రహింపవలసి యున్నది. మఱియు నుచ్చారణ భ్రష్టమగు సిద్ధఖండముకన్న నుచ్చారణస్థమగు సిద్ధపూర్ణమునుదెలిసికొనుట సుకరమై యుండఁగా నట్టి యగోచర మగు సిద్ధఖండమునుండి యుచ్చారణస్థమగు సిద్ధపూర్ణ మును సాధించుట యసంగత మగుటచేతను, నట్లు సాధించుచు నద్దానిని సిద్ధమనుట మఱింత యసంగతముగా నుండుటచేతను సిద్ధపూర్ణమునకు నిర్విషయత్వ ప్రసం గము సంభవించుట చేతను బయి సూత్రమును సిద్ధఖండమునుండి పూర్ణమును సాధించుటకు గూడ సూరిగారు రచించియుండ రనియు వ్యవహారభ్రష్టమగు సిద్ధఖండమును దెలిసికొనుట కుపాయముగనె రచియించి యుందు రనియు గ్రహిం చుట మిక్కిలి యుక్తముగ నుండు ననుటకు సందేహము లేదు.

పై సూత్రమును సాధ్యవిషయమునఁగూడ ఖండమునుండి పూర్ణమును సాధించుటలో నుపచరించుకొను తలంపు సూరిగారికి లేకుండుట చేతనే యహోబల పండితునిమార్గ ముపేక్షించి 'జిత్తు బిందుపూర్వం బగు' అని యిట్లు పూర్ణార్ధసాధారణ ముగా సూత్రించి దాని మూలముననే 'రాముఁడు' అన్నచోట యరసున్నతో పాటుగ

'రాముండు' అను చోట నిండుసున్నను సైతము సాధించుకొనిరి. గాని యా విషయమున నహోబలపతివలెఁ బై సూత్రము నపేక్షించి యుండలేదు. "పుంలింగ మగు మహద్వాచకమునకు డుజ్జగు' (బాల. తత్సమ. 77 సూ.) ఇచ్చట డుజ్జను దాని యందు జకార మిత్తు గావున జిత్తు బిందుపూర్వకం బగునను సూత్రముచేత డు వర్ణకమునకు ముందు సున్న వచ్చును. పిమ్మట జకారము లోపించును. 'ఉ. డిద్ధఁడు, డిద్ధుండు' అని యిట్లు సూరిగారు స్పష్టముగా వ్రాసియున్నారు.

పైరీతిని బట్టబయలుగా నున్న యా విషయమును సైతము గ్రహింపఁజాలక బాలవ్యాకరణగుప్తార్థప్రకాశికాకారులు పైనుదాహరించిన జిత్తు బిందు పూర్వకం బగు' అను సూత్రములోని బిందుశబ్దమునకును దాని వివరణములోని సున్న శబ్దమునకును ఖండబిందుపరముగా నర్థముచేసి 'ఇచ్చట 'డుజ్' అనుదాని యందలి జకారమిత్తు గనుక జిత్తు బిందుపూర్వకంబగు అను పందొమ్మిదవ సూత్రముచే డు వర్ణమునకు ముందు బిందువు వచ్చి.........'డిద్ధుఁడు' అని యైనది. తరువాత 'హ్రస్వముమీద నున్న యరసున్న నిండుసున్న యగును' అను నర్థము నిచ్చు సంజ్ఞాపరిచ్ఛేదమునందలి పదునాల్గవసూత్రంబున 'డిద్ధుండు' అని యగును.' అని యిట్లు వ్యాఖ్యానము చేయుట కేవల మసంగతమై యున్నదనుటకు సందేహము లేదుగదా. 'జిత్తు బిందుపూర్వకం బగు' అనుసూత్రములోని పూర్ణార్ధ సాధారణమగు బిందుశబ్దమున కర్ధబిందుపరముగా నపార్థము చేయుటకును 'ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషములు విభాష నగు' (బాల. సంధి. 17.) అను మొదలగు సూత్రములలోని పైరీతిదే యగు బిందుశబ్దమునకు 'బిందువను ('అఱసున్నయు నెరసున్నయు') అని యిట్లు పూర్ణార్ధసాధారణముగా నర్థము చేయుటకును దగిన కారణ మేమో తెలియరాకున్నది. తెలియకే మున్నది! వీ రహోబలపతికిని జిన్నయసూరిగారికిని గల యభిప్రాయభేదములను గ్రహింపలేక యహోబలపండితీయ గ్రంథపారాయణవాసనచే నిట్లు ప్రమాదపడి రని దృఢముగాఁ జెప్పవచ్చును. మహాశయులారా! సామాన్యముగాఁ నెల్లయెడలను బ్రమాద భూయిష్టముగా నున్న గూఢార్థప్రకాశిక విమర్శనముతో గ్రంథవిస్తరము చేయనేల యని యీ విషయము నింతతో ముగించి ప్రకృతము ననుసరించుచున్నాము.

పూర్ణబిందు వుచ్చారణ సిద్ధమగుటం జేసి దానిని దక్కిన వర్ణములతో పాటుగఁ దెలిసికొనుటలో బ్రయాసమే లేదు. ఉచ్చారణభ్రష్ట మగు నరసున్నను తెలిసి కొనుటలో మాత్రమె ప్రయాస మున్నది. అందు సాధ్యానుస్వారము వ్యాకరణసాధ్య

మగుటం జేసి దానిని దెలిసికొనుటకు గూడ దుష్కరము గానేరదు. కొఱవడిన సిద్ధార్థానుస్వారములలోఁ గూడ హ్రస్వమునకు దరువాతి యరసున్నలను బయి వైయాకరణుల నియమములనుబట్టి సులువుగానే తెలిసికొన వచ్చును. హ్రస్వము నకుఁ దర్వాత నుండు సిద్ధపూర్ణానుస్వారస్థలము నిర్బిందుకమై గూడ వ్యవహరింప బడునపు డా స్థలమున నియతముగా సిద్ధఖండానుస్వార మున్నదని గ్రహింప వచ్చును గదా.

ఇఁకఁ గొఱవడియున్న దీర్ఘమునకుఁ దర్వాతి సిద్ధార్ధానుస్వారము మాత్రమే (సాధ్యము వ్యాకరణ సాధ్యమే యగును గదా) దుర్గ్రహమై యున్నది. దానిని దెలిసికొనుటకు మాత్రము వెనుక నుదాహరించిన ప్రాచీన తాళపత్ర గ్రంథస్థ ద్విత్వలేఖనపద్ధతియు, (ప్రాచీనమహాకవుల యర్ధబిందు ప్రాసస్థలములను,) నాయా యాచ్ఛికపదములకు మూలభూతము లగు నితరద్రావిడభాషల పదముల లోను సంస్కృత ప్రాకృతపదములలోను నుండు నను నాసికాక్షరములును వీనిని బట్టి చాలవరకు గ్రహించి వ్రాసిన కోశాదులలోని యర్థానుస్వార ప్రదర్శనము లును మాత్రమే చాలవఱ కాధారములై యున్న వని చెప్పక తీరదు.

ఇఁకఁ బయి నుదాహరించిన యాధారమువలన బట్టి గ్రహించిన దీర్ఘపూర్వక స్థలములలోని సిద్ధఖండముల నాంధ్రపండితులు ధారణ చేసికొనవలసి యున్నది. అట్లు ధారణచేయుట కూడ దుష్కర మని తలఁచి కావలయు నింకను గొంతవఱకు సులువుపడునట్లుగఁ జేయదలఁచి యాంధ్రభాషలో నెచ్చటనైన ననుస్వారమాత్ర ముండినచోఁ బరుషసరళములకు ముందే యుండు నని 'తృతీయే ప్రథమే వర్ణే, పూర్వేవహిదృశ్యతే బిందుర్వైకృతమధ్యేఽత్ర నాన్యవర్ణే పరేతుసః' అని యి ట్లథర్వ ణుఁడు సూత్రించి యున్నాఁడు. దీనిని బట్టి పయిరీతిని దీర్ఘము లకుఁ దరువాతి సిద్ధ ఖండములను ధారణ చేయుటగాని యరసున్న యిటఁ గలదా లేదా యని వికల్పిం చుటగాని పరుష సరళములకు ముందటి చోటులందు మాత్రమే యని తేలుచున్నది గదా. అచ్చాంధ్రములో నిట్లు బిందు వుండిన యెడలఁ బరుష సరళములకు ముందు మాత్రమె యుండుట సంభవించుటకు దగిన కారణములను గూర్చి వేతొకవ్యాసము వ్రాయఁ దలఁచి యుండుటచే నిట నింతతో విరమించుచున్నాను.

పయిరీతిని నిరాధారస్థలములలో నాకాశసౌధమును నిర్మించి యరసున్న యుండు స్థలములను దెలిసికొనుటకుఁ గొంత యాధారముఁ జూపిన యాంధ్ర

వైయాకరణుల యెడ నాంధ్రపండితలోకము కృతజ్ఞమై యుండవలసినదే గాని యట్లుచ్చారణమున బొత్తిగా నశించిన యీ యరసున్న నిపుడు గూడ నుచ్చారణములో నిర్వివాదముగా వదలుకొనుచు వ్రాతలో మాత్రము చూపక తీరదని యేల పెనఁగులాడవలయునో? అనాదిప్రవాహరూప మగు భాషలో ననేకరూపములు పుట్టుచు గిట్టుచు నుండఁగా నొక్క యీ యర్ధానుస్వార విషయమున మాత్రమె యింతవఱ కేల శ్రమింపవలయునో? ఇఁక దామరసాది శబ్దములలో సైతము చూపుట కేల పెనఁగులాడరైరో తెలియకున్నది.

—వజ్ఝల చినసీతారామస్వామి*

———o———

*గ్రంథాలయ సర్వస్వము. సం. 5. భా. 2. 1921.

# రాయలనాటి తెలుగు సాహిత్యము

కర్ణాటకసామ్రాజ్యచరిత్రయందు శ్రీకృష్ణదేవరాయలకాలము - 16 వ శతాబ్ది పూర్వభాగము- తెలుగువారి దృష్టిలో సువర్ణాక్షరముల వ్రాసి యుంచదగినది. స్వభాషామాత్రాభిమానమున సంకుచితదృష్టి కలవారికి కాకపోయినను సాహిత్యమునం దభిమానముగల ఆంధ్రేతరులకును అది యట్లు తోచుటలో సందేహము లేదు.

తెలుగు సాహిత్యమే మొదటినుండియు రాజుల యాశ్రయమున పెరిగినది. ఉత్తమోత్తమగ్రంథములు మొదలు అధమాధమగ్రంథములవరకును చక్రవర్తులు, రాజులు, పాళెగాండ్రు, మంత్రులు, సేనాపతులు మొదలగువారి ప్రోత్సాహముతోను, ఔదార్యముతోను పుట్టినవి. స్వతంత్రముగను, స్వార్థముగను చేసిన రచనలు మిక్కిలి తక్కువ. ఇట్లగుటకు కారణ మిది :

దక్షిణదేశపు సుప్రసిద్ధమతప్రవర్తకు లందరును ఆంధ్రులు కాకపోవుటచే అరవము, కన్నడము మొదలగు భాషలయందు స్వతంత్రసాహిత్య మభివృద్ధి చెందుటకు మూలబల మైన మతావేశము తెలుగువారిలో శిథిలమైనది. దక్షిణదేశమున ప్రచారమున నుండు మతము లన్నియు తెలుగుదేశమున నెలకొనియున్నను, అవి వానివాని మూలపురుషులనుండి సాక్షాత్తుగా రాక, వారి శిష్య ప్రశిష్య పరంపరల నుండి వచ్చిన వగుటచే దుర్బలములై అద్దమునందు ప్రతిఫలించిన యెండవలె నయినవి. ఇంక తెలుగువారి రచనకు మిగిలిన యుద్దేశములు రెండే; 'యశసే, అర్థకృతే'. పూర్వకాలమున ఈ యశస్సు, ఈ యర్థము రెండును రాజుల కృపాకటాక్షమునకు స్వాధీనమయి యుండెను. కాని యా కటాక్షవీక్షణము మనవైపు పడునను నమ్మకమేమి ? కావున రాజులకు గ్రంథములను సొంతముగ రచించి పుణ్యమున్నను లేకున్నను మరియొకరిచే రచియింపించి వారికి బహుమానము చేయవలె ననెడి ధర్మమే తెలుగువారి రాజనీతియందు ముఖ్యముగా నెలకొనిపోయినది. సప్తసంతానములతో కావ్యము నొకటి యను శాస్త్రము రచించినవానికి రచియింపించిన వానికి సమానముగా నన్వయించినది. ఇందువలన 'కవినా చ విభు ర్విభునా చ కవిః కవినా విభునా చ విభాతి సభా' అను సన్నివేశమును ఆనాటి తెలుగుదేశమునం దెక్కడ కావలసినను చూడవచ్చునదిగా నుండెను. ఇప్పటికి తెలుగుదేశపు రాజులందును, ప్రభువులందును ఈ సంప్రదాయము యొక్క పరిశేషమును మనము చూడ

వచ్చును. మరియు నానాడు జనసామాన్యమున కాదర్శపురుషులు రాజులే యయి యుండినందున, నందరును యథాశక్తిగ వారివలెనే నడచుచుండినందున, మంత్రులు మొదలగు రాజోద్యోగులును, ధనవంతు లగు నితరులును కవుల ప్రోత్సహించి, కావ్యరచన చేయించుచుండిరి. ఇందువలన తెలుగుసాహిత్యమున చేయి చేసుకొన్న వారి కందరికిని కవులు కావలె నను నాసయు, శక్తిగల ఉదారులెల్లరకును కవులను పోషించు ధర్మమును సహజముగ పరిణమించినవి. ఇట్లయి తెలుగువారియం దుండు నంత- ఉండినంత కవితకు— అనగా పద్యరచనకు- వ్యాప్తి మరియేదేశమం దయినను గలదా యను శంక కవకాశము గలుగుచున్నది. అది యట్లుండు గాక.

రాజుల ఆశ్రయమున బెరుగ సంకల్పించిన ఆంధ్రసాహిత్యమునకు ఆంధ్ర దేశమును పాలించిన రాజు లందరు ప్రాయశః కానుక కప్పములను చెల్లించి యున్నారు. వారు కర్ణాటకు లయియుండవచ్చును; తమిళు లయి యుండవచ్చును; మళయాళమువా రయి యుండవచ్చును; చివరకు మహమ్మదీయులే యై యుండ వచ్చును; తెలుగుదేశము నేలు సంబంధ ముండువరకు, తెలుగునేలనుండి కందాయ మును వసూలు చేయునంతవరకు తెలుగుకవి- కావ్యములతో వారికి సంబంధము తప్పుట కష్టము. తెలుగు కవులు తమ తాంబూలమును అట్లు భద్రపరచుకొని యుండిరి. రాజమహేంద్రవరమున చాళుక్య సామ్రాజ్యము, వరంగల్లులో కాకతీయ సామ్రాజ్యము, అద్దంకి, కొండవీడు మున్నగు స్థలములం దుండిన రెడ్లరాజ్యము ఇవన్నియు మొదట మొదట తెలుగు సాహిత్యాభివృద్ధికి పెద్దపెద్ద పాదు లయి యుండినవి. క్రీ. శ. 13 వ శతాబ్దమున తక్కిన సర్కారులన్నియు లుప్తములు గనో, లుప్తప్రాయములుగనో ఉండి విజయనగరమున కర్ణాటక సామ్రాజ్యమునకు పునాది వేసిన అల్పకాలమునందే తెలుగు కవులకు అక్కడ గౌరవ, ప్రోత్సాహములు దొరక నారంభించెను. ప్రాచీనాంధ్రకవులలో నుద్దాము డయిన నాచనసోమునకు 1345 సంవత్సర ప్రాంతమున వీర బుక్కరాయలనుండి యగ్రహారము లభిం చెను. మొదలు మొదలు కర్ణాటక సామ్రాజ్యము యొక్క యునికి దృఢముగను. విస్తారముగను ఉండనికాలమున తెలుగుల కంత ఉదారముగ ప్రోత్సాహము దొరకునట్లు తోచుచున్నది. ఏలన, సోమనకు కొంచె మిటీవలివాడగు బమ్మెర పోతన్న 'ఈ కర్ణాటకిరాతకీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ముభారతీ' యని యాగ్రహమున పలికినాడు. కాని వెంటనే- యనగా 15 వ శతాబ్దమున శ్రీనాథునికి కవిసార్వ భౌమ బిరుదము, ముత్యాల మంటపమున కూర్చుండబెట్టి కనకాభిషేకమును కర్ణా

టక సామ్రాజ్యముననే లభించినవి. 'కర్ణాటకటక పద్మవనహేళి' అనియు, 'కర్ణాట క్షితినాథ మౌక్తికసభాగారాంతరాకల్పిత స్వర్ణస్నాన జగత్ప్రసిద్ధ కవిరాట్' అనియు నతడే తన్ను పొగడుకొని యున్నాడు. ఇట్లు సక్రమమైన యాంధ్రకవి కావ్య ప్రోత్సాహము క్రమముగ కర్ణాట సామ్రాజ్యము నేలిన రాజులందరకును సంప్రదాయ ముగ పరిణమించి పోయినది.

కృష్ణదేవరాయల కాలమున సామ్రాజ్యవ్యాప్తి యెట్లో అట్లే పై సంప్రదాయ మును పరమావధిని తాకినది. ఇతరభాషాకవులకును గౌరవ, బహుమానములు యథాయోగ్యముగ నడచియున్నను, తెలుగు కవులకు రాయలకాలమున నవి దొరికి నంత మరి యెవరికాలముననను దొరకక లేదని ధారాళముగ చెప్పవచ్చును. పితృపైతా మహమైన ఆ పద్ధతిని ఇంకింత విస్తరింపచేయుటకు కావలసిన జ్ఞానశక్తి బలై శ్వర్యములు అతనియందు నిండియుండినవి. సంస్కృతాంధ్రభాషల యందు దృఢ మైన పాండిత్య మాతని కుండెను. సంస్కృతమున మదాలసా చరిత్ర మున్నగు కొన్నిగ్రంథముల నాతడు వ్రాసినాడట. తెలుగున ఆముక్తమాల్యద, లేక విష్ణు చిత్తీయము అను అతిప్రౌఢ కావ్యమును రచించియున్నాడు.

ఆంధ్రపంచకావ్యము లని ప్రసిద్ధములైన గ్రంథములలో నిది యొకటి. పైగా వానిలో నుత్తమ మనియు నామతము. ఇంక శక్తిబలైశ్వర్యములమాట చెప్ప బనిలేదు. దక్షిణదేశమున నంతదొడ్డ సామ్రాజ్యమును నిర్మించి, నిర్వహించినవారు వేరొక రెవరును లేరని చరిత్రకోవిదు లందరును ఘంటాఘోషముగా చాటి యున్నారు. జైత్రయాత్ర వెడలినప్పుడును రాయలు జతలో తన యాస్థానకవులను సైతము పిలుచుకొని పోవుచుండెనట. వారిలో నగ్రగణ్యుడగు పెదన్న యందు రాయలు చూపుచుండె నని వాడుకయందుండు భక్తిగౌరవములు 'నిజమా' యని శంకించవలసినంత యసాధారణములైనవి. ఏనుగుమీద నెక్కి వీధిలో సవారి వెడలునపుడు పెద్దన్న యెదురైనచో రాయలే దిగి చేతి యాసరా యిచ్చి యాతని నేనుగుమీది కెక్కించుకొనుచుండె నట. నిండుసభలో తా నాతనికి బహుమానముగ నిచ్చిన గండపెండేరమును తానే లేచి వచ్చి యాతని కాలికి తొడిగినాడట! తన కంకితముగ నాకవి రచించిన మనుచరిత్రను స్వీకరించి, రాజధానియం దతనికి పల్లకిలో మెరవణి చేయునప్పుడు పల్లకి దండిని మొదలు తానే యెత్తిపట్టెనట! అడిగినచోట అగ్రహారముల నిచ్చెనట! వానిలో నొకదాని నాకవియే మరల తన

గురువునకు దాన మిచ్చినాడు! 'ఇటువంటి ప్రభువును పోగొట్టుకొని చావక జీవచ్ఛవముగ నే నింకను బ్రతికియున్నానే' యని దీనముగ నాకవి యేడ్చి చెప్పిన 'శ్లోకమయిన శోక' మొకటి గలదు.

కృష్ణదేవరాయల కాలమున తెలుగు కవుల కింత యున్నతపదవి దొరకుటకు మరియొక ప్రబలకారణ మున్నది. 'దేశభాషలందు తెలుగు లెస్స' యను ప్రాచీనపు నానుడియం దతనికి మిక్కిలి నమ్మకము. కనుకనే యీ వాక్యమును తన విష్ణుచిత్తీయమున నుదాహరించియున్నాడు. అన్నంతమాత్రము చేత నిజముగ నన్ని భాషలకంటెను తెలుగు స్వతస్సిద్ధముగ శ్రేష్ఠమయిన దని నేను చెప్పలేదు. అది నా యభిప్రాయమును గాదు. కొందరు తెలుగువా రట్లు అనుకొనినవారు గలరు. అటువంటివారిలో కృష్ణదేవరాయలు గూడ నొకడుగా నుండె నని చెప్పవచ్చునే కాని విచారశీలు రగు తెలుగువారుగాని, ఇతరులుగాని పైవాక్యమును ప్రమాణముగ స్వీకరింపజాలరు. తన భాషయే యుత్తమ మైన దని నమ్మని మానవవ్యక్తిని నేనింకను చూడలేదు. అట్లు నమ్ముట సహజమును అగును. తనభాషయొక్క సూక్ష్మమైన అందచందములును శక్తిరక్తులును తనకు తెలియగలవే కాని యితరులకు తెలియవు. కాని రాయలకు తెలుగు తనభాష యనిన తాను చక్కగా నేర్చిన భాష యని నా భావము. అంతేకాని కృష్ణదేవరాయల మాతృభాష– ఇంటిలో మాటలాడుభాష– తెలుగో కన్నడమో నాకు తెలియదు. ఈ రెండును కాక తుళు భాషను అత డింటిలో మాటలాడుచుండె నని చెప్పినను నేను కాదని చెప్పునట్లు లేదు. ఈ విషయమును నాకు కాబట్టియు లేదు. ఈ స్తనశల్యపరీక్షను చరిత్ర విమర్శకులకు విడిచిపెట్టితిని. దాని నిర్ణయమువలన వారి కేమైనను ప్రయోజనము కలుగునేని సంతోషము. సాహిత్యశాస్త్రము మొదలగు ప్రతిభాప్రపంచమున నిటువంటి యవాంతరములకు ఎంత అవకాశ మివ్వకపోయిన నంతమంచిది. కృష్ణదేవరాయలకు అనేక దేశభాషలందు మాటలాడు పరిచయ ముండియుండవచ్చును. కాని వ్యాసంగమూలక మయిన పాండిత్యము మాత్రము తెలుగునం దెక్కువగ సంపాదించి యుండెను. కనుకనే యింత యభిమానము. రాయల యాజ్ఞమేరకు గదగు భారత పరిశేషమును కన్నడమున రచించిన తిమ్మనయొక్క మూడుపాళ్ళ రచనయంతయు తిక్కన సోమయాజి తెలుగు భారతపు భాషాంతరీకరణమే యై యుండుటకును ఇదియే ముఖ్యకారణముగ నుండవచ్చును.

రాయల ఆస్థానమున అష్టదిగ్గజము లని ప్రసిద్ధు లై యెనిమిదిమంది తెలుగు కవు లుండి రనునది పరంపరగ వచ్చిన సుద్ది. 1. పెద్దన్న 2. తిమ్మన్న

3. ధూర్జటి 4. రామభద్రకవి, 5. మల్లన. 6. తెనాలి రామకృష్ణుడు, 7. సూరన, 8. రామరాజభూషణుడు. అని వారిపేర్లు. వీరుకాక తిరువేంగళనాథుడు, రుద్రయ్య, నృసింహకవి, రాధామాధవుడు మున్నగువారు, రాయలతో సాక్షాత్సంబంధము గలిగినవారు కొందరు గలరు; పరంపరాగత సంబంధములు గలవారు పలువురుండిరి. అష్టదిగ్గజములలో 6, 7, 8 సంఖ్యలుగలవారు ముప్వురును రాయలకాలమునకు కొంచె మిటీవలివారు— అనగా 16 వ శతాబ్దపు చివరనుండినవారని కొంతమంది చరిత్రకారుల మతము.

వీరందరును వ్రాసిన గ్రంథముల వివరముల నిచ్చుట కిక్కడ స్థలములేదు. స్థూలముగ నింత చెప్పవచ్చును.

అది స్పర్ధలకాలము; స్పర్ధలలో జయము గాంచి యభిమానపడు కాలము. 'మేము బ్రాహ్మణులము. మేము రాజులము, కావున మాకు అగ్రతాంబూలము రావలయును. మేము కర్ణాటకులము, మేము తెలుగువారము, కావున సభలో మొదటి పీఠము మాది' ఇత్యాదిగా కేవలము పశ్చాద్దృష్టితో జీవింపగోరు పేడి బదనికల కాలము గాదు. స్వశక్తి లేనివారి నడి, చప్పుడు వినబడని కాలము; పురుషసింహుల కాలము.

ఈ కాలధర్మములు కవికావ్యములం దెట్లు ప్రతిఫలింపకుండ గలవు? సామాన్యముగ రాజ్యము, మతము, శాస్త్రము, శిల్పము మొదలగు నెల్లవిషయములందును మనుష్యశక్తియొక్క పరాకాష్ఠను చూపగోరు సమయమున, నన్నివేళమున కవులు మాత్రము ముద్దుగ, మృదువుగ, రసమయముగ, పూవులవలె అక్కరవచ్చినప్పుడు ముడిచినను అక్కరమాలినపుడు త్రోసివేసినను సహించుకొని పేడులయి కేవలాధ్యాత్మిక తృప్తితో కాలము గడుపుట సాధ్యమా? కావున వారును పురుషసింహము లగుటకు ప్రయత్నించిరి.

అంతకుపూర్వ మయిదునూర్ల సంవత్సరముల ఆంధ్రసాహిత్యముయొక్క జీవనమున సంస్కృతసాహిత్య మహిమతో స్వల్పస్వల్పముగ కనబడుచు వచ్చిన చమత్కార ప్రధానరచన రాయలకాలమున బాగుగా పెరిగి, వేరూని తరువాతి కవులకు మార్గదర్శకమాయెను. చిత్రకవిత, బంధకవిత, గర్భకవిత, ఆశుకవిత యని నాల్గురకములుగా పద్యరచన ప్రసిద్ధమాయెను. రాయల ఆస్థానమున ప్రధాన కవియైన పెద్దన్న తనకీ 'చతుర్విధ కవితామతల్లి' స్వాధీన మని చెప్పుకొనియున్నాడు. సంస్కృతాంధ్రములందు సమానముగ నాశుకవిత చెప్పగలిగినందుననే ముందు

జెప్పిన గండపెండేరమును రాయ లాతని కాలిగి తొడిగినాడట. రాయల కంకితము చేసిన యాతని మనుచరిత్రలో నిటువంటి కుస్తీ కవనపు ప్రసంగమే లేకపోయినను దాని నభ్యాసము చేసియుండనిచో కవిపండిత సమాజమున నాతనికి మర్యాద దొరికియుండ దని ధారాళముగ చెప్పవచ్చును. కఠినసమస్యల నిచ్చుటయు, ఆకస్మికముగ జూచిన వస్తుసన్నివేశములను గురించి కవనము జెప్పగోరుటయు, తృప్తికరముగ నట్లు చేపినవారికి బాగుగ సన్మానము చేయుటయు నప్పటి సామాన్య రాజసభాసంప్రదాయములుగ నుండెను. అందువలన కత్తిబట్టిన శూరునకును, కలముబట్టిన ధీరునకును ఉత్సాహమున భేదముండలేదు. రసరంగములను, రణరంగములను నేకరీతిగ కుద్రేకదాయకము లయియుండెను. అందుచే కవిశూరుల వీరాలాపములును, సింహనాదములును ప్రాయశః ఆ కాలపు ప్రతికార్యమునందును వినరా నారంభించినవి. ఒకకవి (ఒకదినమున నొక వేయిపద్యములను విచిత్ర వర్ణనలతో వ్రాయనేర్తు' నని గర్జించిన, మరియొకడు 'ఒకగడియలో నూరుపద్యముల రచింపగల' నని ఘోషించెను. 'నా కావ్యమందలి శృంగారవర్ణనను చదివినచో యతియు విటుడు కావలెను; అట్లే వైరాగ్యవర్ణనను పఠించినచో విటుడు యతి కావలెను.' అని యింకొకని ప్రతిజ్ఞ. మరియొకడు ఆసేతుహిమాచలమును సంకుచితమైన ప్రాచీన ప్రపంచపు జతకు ఉదయాస్త్రాద్రులను జేర్చి కొంచెము విస్తారముచేసి "వీనినడుమ నుండు భూమిలో తెలుగున నావలె కావ్యము వ్రాయువా రెవరు" అని దండోరా కొట్టినాడు.

ఇట్లు కవిప్రపంచము స్పర్థామయమై గెలిచినవారికి నిష్పక్షపాతముగ మర్యాదగౌరవములు లభించుచుండినవి. గనుకనే పలువురు శూద్రకవులును 'రంగము'నకు వచ్చుట కవకాశములు కలిగి, అనేక సందర్భములందు జయశీలురగు ననుకూలములును గలిగెను. వారిలో నెల్ల రత్నప్రాయు డగు రామరాజభూషణకవి (అళియరామరాయలపోషణయందుండిన దీబిరుదు. ఆతని నిజమైన పేరు భట్టుమూర్తి; భట్రాజులజాతివాడు) కృష్ణదేవరాయల యాస్థానములోని అష్టదిగ్గజములలో నొకడు. ఇంత స్పర్థాళువయిన సాహసిక వీరకవి ఆకాలమందేకాదు, తెలుగు సాహిత్యముయొక్క చరిత్రయందే మరియొకడు లేదని చెప్పవచ్చును. ఆకాలపుసాహిత్యమందు మాత్రమే కాక సంగీతమునందును ఈతని మహిమ ప్రబలమై యుండినట్లు తోచుచున్నది. ఈతనికి 'సంగీతకళా రహస్యనిధి' యను బిరుదు గలదు. ఇప్పుడు దక్షిణదేశమున ప్రచారమున నుండు వీణకు స్థిరమైన మెట్లు వేయునేర్పాటు మొదలుపెట్టినవా డితడే యని వాడుక. ఈకవి రాయల

యాస్థానకవులలో నిజముగ సమర్థులయిన పెద్దన్న, సూరకవి యను నిరువురును కావ్యగోష్ఠికి తగినవారని- దుర్యోధనుడు భీమార్జునుల నెన్నుకొన్నట్లు నిర్ణయించు కొనినట్లు తోచుచున్నది. పెద్దనవ్రాసిన ముఖ్యగ్రంథము మనుచరిత్ర. ఇది రసిక కావ్యము. చమత్కారమువ కిందు ప్రవేశము లేదు. దీనికి లభించిన గౌరవము గాంచి దీనికి ప్రతిగా వసుచరిత్ర యను ప్రతిపద్య చమత్కారమయమగు శ్లేషకావ్యమును వ్రాసి రామరాజభూషణుడు తిరుమలరాయల కంకితము చేసి బహుళగౌరవమును పొందెను. ఇది యయినతర్వాత తెలుగున కావ్యములను వ్రాసినవారిలో దీనిమాదిరిగనే వ్రాయ వలెననునాస లేనివారు పలువురు లేరు. పిల్లవసుచరిత్ర లను బిరుదు సంపాదించు కొని యెన్నియో గ్రంథములు తృప్తిగాంచినవి. ఆంధ్రమహాకావ్యపంచకమున దీనికి స్థిరమైనప్రతిష్ఠ లభించినది. ఇట్లే సూరకవి వ్రాసిన రెండు ముఖ్య గ్రంథము లలో నొకటగు కళాపూర్ణోదయము భట్టబాణుని కాదంబరివలె విచిత్రమై యను స్యూతములయిన కథాసందర్భములతోను, వివిధ దేవ మనుష్య పాత్రలతోను కూడి తెలుగుసాహిత్యమున నదివరకు, ఆతర్వాతను లేని నూతనరచన. రెండవ దగు రాఘవపాండవీయము గూడ నూతనమే. కాని దానిదారి వేరు. ఇది ద్వ్యర్థి కావ్యము. ఒకటేకావ్యమున శ్లేషమహిమవలన రెండు కథలను కూర్చి జోడించుపని. సూరన రామాయణ భారతకథలు రెండిటిని దీనిలో కూర్చినాడు. ఈ రెంటిలో మూర్తికవికి మొదటిరచన అంతగణనకు రాలేదు. రెండవదానిని మించి తన కలము పోటును జూపవలెనని రామాయణ భారతములవలెకాక పరస్పర భిన్నములగు కథలు రెండు జోడించి హరిశ్చంద్ర నలోపాఖ్యానము రచించెను. తరువాత ననేకు లీదారియందే 2, 3, 4 కథలను గూర్చి క్లిష్టకావ్యములను వ్రాసిరి.

ఇట్లున్నంత నాకాలపు కావ్యములన్నియు వట్టి జగడదారుల రగడలుగ నుండినవని యెంచరాదు. కాలము పౌరుషప్రధానముగ నుండినందుగ కావ్యము లందును పౌరుషమహిమ తలసూపెనేకాని దీనికి దానిని శుష్కముచేయుటకు సాధ్యము కాలేదు. తెలుగు లతిసహజముగ భావోద్రేకముగల జాతి. ఐహికప్రీతి వారికి హెచ్చు. ఇవి రెంటిని అణచి శుష్కింపజేయు మతావేశము దుర్భరముగ నుండినందున వారెన్నడును మానుష్యము యొక్క హద్దుమేరలను పూర్తిగ దాటిన వారు కారు. ఐహికజీవనపు లోతుపాతులను బాగుగా చూచి విడువవలయు నను దృష్టి వారికి గలదు. అందలి సూక్ష్మభావములను తీవ్రముగ గమనించు హృదయమును దానిలోపల నరకంటితో జూచు నుదాసీనమును వారికి సహజము లయియున్నవి.

ఆ కాలపు జనులలో నివి మరింత తీవ్రముగ నుండిన వని నిస్సందేహముగ జెప్ప వచ్చును. అది విజయశీలుర, విజయమత్తుల కాలము. స్వాతంత్ర్యమును పోగొట్టుకొని, స్వాభిమానమును వదలి, స్వానుభవమును బడయక మూడవవారి ముఖప్రీతి కొరకు వడచి, పలికి, కుడిచియుండు నిప్పటివంటి నిశ్చేతనకాలము కాదు. తమ ఒప్పుతప్పులకు తామే జవాబ్దారీగా నుండిన కాలము. వలసినచో ప్రభువు నాజ్ఞనైనను తిరస్కరించి అవిధేయు లగుటకు జంకని కాలము. ఏదో సందర్భమున తన్నింత గౌరవించిన రాయలు పెద్దన్నను కావ్యము వ్రాయవలసినదిగా కోరిరట. దానికి ప్రత్యుత్తరముగ నొక పద్యము. ఏమని—

"నిరుపహతిస్థలము, రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము, ఆత్మకింపయిన భోజనము, ఉయ్యాలమంచము, ఒప్పుతప్పుల నరయజాలు రసజ్ఞులు, ఊహలను తెలియగల వ్రాయసకాండ్రు- పాఠకులు- ఈ సామగ్రియంతయు లేనిదే ఊరక 'కావ్యమును రచింపుమనిన సాధ్యమా ?"

ఇది యవిధేయుని మాటయే కాని నిజముగ కవి కివన్నియు నగత్యమైన పక్షమున ప్రపంచమునం దొక కావ్యముగూడ జన్మమెత్తు సంభవ ముండియుండదు. ఆ కాలమునం దింతటి సుఖలోలతను, అవిధేయతను గనబరచు ధైర్యము ప్రజలకును, దాని నుదాసీనదృష్టితో జూచు నుదారత ప్రభులకు గల సంస్కృతి సన్నివేశము లుండిన వని చెప్పుటకు పై విషయము నుదాహరించితిని.

ఇటువంటి సమయమున పుట్టిన కావ్యములు నిస్సారములుగ, నీరసములుగ నుండ సాధ్యము లేదు. జీవనము నిండారి పొంగులు వారుచున్న సమయమున కేవల నిర్జీవరచన యెట్లు తలచూపనోపును ? ఆ దక్షిణాత్య సామ్రాజ్య మంతర్ధానమై సన్నసన్న పాళెములుగా దేశము చీలి, పరదేశీయుల రావడి విద్యుచ్ఛక్తివలె నరమునరమునకును వ్యాపించి వేధించుచున్నందున పదునేడవ శతాబ్దమునుండి యిటీవల నిప్పటివరకు వచ్చిన తెలుగుసాహిత్యము కేవలము సంప్రదాయమను గడ్డిపోచను పట్టుకొని స్వరూపమును, స్వధర్మమును మరచి, మునుగక తేలక జీవచ్ఛవముగ నున్నదే కాని రాయలనాటి వాఙ్మయమువలె లేదు.

సర్వాంగసుందరమైన సాహిత్యమును దృష్టియం దిడికొని చూచువారికి రాయలనాటి రచనయందు కొన్ని లోటుపాట్లు కనుపించవచ్చును. అందులో ప్రవాహి యైన వస్తువు లేదు. ప్రధానకథ ఉపకథలకు తోకవలె నుండుటయే

సామాన్య ధర్మము: కథయందు వైవిధ్యముగాని, వైచిత్ర్యముగాని చిక్కుట అపురూపము; అనావశ్యకముగ పెంచిన అవాంతర వర్ణనలు హెచ్చు; పాత్రల యొక్కయు. రసభావములయొక్కయు స్వరూపమునకు సహజమైన మితిని దెలిసికొని వ్రాయుట విరళము; ఆకస్మికమైన సంకోచ,విస్తరములకు మితిలేదు. మాటల అనురూప్యము, సందర్భశుద్ధి, గంభీరమైన వ్యంజనాప్రధానమైన రచన ఇత్యాదు లపూర్వము. వివేచనాపూర్ణమైన సాహిత్య మా కాలమున తక్కువ యని ఒక్క మాటలో చెప్పవచ్చును. ఈ దోషము లన్నియు 8, 9 శతాబ్దముల కిటీవలి సంస్కృతసాహిత్యమునందే నిండి యున్నందున, దాని నీడలో బెరుగుచు వచ్చిన తెలుగుసాహిత్యమునందు మొదటినుండియు జన్మసిద్ధముగ వచ్చియున్నను కృష్ణదేవరాయల కాలమున మిక్కిలి స్పష్టముగ గోచరించినవి.

ఇట్లున్నను నా కాలపు మనుష్యజీవనమందు నెలకొనియున్న ఆశ, అభిమానము, ఆగ్రహము, వివేకము, అవివేకము, రుచి, అసహ్యము మున్నగునవి అనేకవిధములుగ ఆనాటి కావ్యమునందు ధారాళముగ ప్రతిఫలించి యున్నందున ఆ సాహిత్యము అనేకశః తేజస్విగ నున్నది. దానిని చదువునప్పుడు అక్కడి కథా- పాత్ర- సన్నివేశములు ఏ స్వర్గమునకో పాతాళమునకో సంబంధించి యున్నను మానుష్యముయొక్క మేరను పూర్తిగ విడువక యున్నందున, ఇది మన ప్రపంచమే యను నభిమానము మనకు ఎప్పటికిని చెదరక నిలిచియున్నది. రాయల ఆముక్తమాల్యద, పెద్దన్న మనుచరిత్ర, తిమ్మన్న పారిజాతాపహరణము, సూరన కళాపూర్ణోదయము, తిరువేంగళనాథుని పరమయోగివిలాసము, తెనాలి రామకృష్ణుని పాండురంగమాహాత్మ్యము మొదలగు గ్రంథములన్నియు సాక్షాత్తుగనో, పరంపరగనో ఆనాటి జనజీవనము యొక్క స్థూల సూక్ష్మరూపములను చిరస్థాయిగ జేసినవి. వీనిని చదువకపోయిన, చరిత్రగ్రంథముల నెంతచదివినను ఆనాటి సమాజస్వరూపమును ఇంచుకైనను గ్రహింప సాధ్యముకా దని ధారాళముగ జెప్పవచ్చును.

—రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ*

—X—

* భారతి, ఫిబ్రవరి, 1937.

# రాయలనాటి చాటు పద్యములు: రమ్యము లగు వాని గాథలు

నిర్వక్రమపరాక్రమమహిమచే దక్షిణదేశమంతయు స్వకీయైకచ్ఛత్త్రము నకు దెచ్చి రాజాధిరాజై, నిరుపమానపాండితీగరిమముచే ననేకాంధ్రగీర్వాణ గ్రంథములను రచించి విద్వత్కవి సార్వభౌముడై, నిరతిశయ భాషాగౌరవముచే అష్టదిగ్గజాది సత్కవిపండితబృందమును బోషించి, పెక్కుకోశములకు కృతి నాయకుడై, నిర్మలయశశ్చంద్రికల దశదిశల వెలయించి నిరంతరకీర్తి శరీరుడై భోజునినామమును దాను ఆంధ్రభోజ బిరుదముగ నందినట్లే తమనామధేయము నితరప్రభువులు బిరుదాభిధానముగా గైకొనునంతటి భాషాపోషకుడై, నిత్యస్మర ణీయుడైయున్న శ్రీకృష్ణదేవరాయలు తన సామ్రాజ్యములోని గోపవరగ్రామ మందు విదుషీమణియు, కవయిత్రియు నగు మొల్ల యను వనితారత్నము నివసించు చున్నదను నుదంతము విని, యామెకడకు దాసీజనంబుల, నాందోళికము బనిచి తన నగరమునకు రావించెను. ఆమెయు దనకై యేర్పరుపబడిన మందిరమున బ్రవేశించి, చక్రవర్తింబోని మహారాజు కవితాప్రియుడు గౌరవించునంతటి మహా భాగ్యమును బ్రసాదించిన తన యిష్టదైవత మగు శ్రీరామచంద్రుని కారుణ్యాతిశయ మున కెంతయు నానందించెను.

రాజ్యసంబంధములగు వ్యాపారములనెల్ల ననుదినము ప్రాహ్ణసమయము నందే నిర్వర్తింపబడుచుండుటచే, కృష్ణరాయలు మధ్యాహ్నానంతరము విద్వద్గోష్ఠి నెరపుచు వినోదించుచుండును. ఆనాటి మధ్యాహ్నము మొల్లకవిరత్నమును గౌరవించుటకై మహారాజు కవిపండిత సభ నొకదానిని నేర్పరించి, యక్కవయిత్రీ మణిని యాస్థానమునకు రప్పించెను. వేదాధ్యయన సంపన్నులు, విచక్షణప్రకాం డులు, విద్వత్కవితల్లజులు, వివిధకళానిపుణులు మొదలగువా రాసదస్సు నలంక రించియుండిరి. ఆ మాననీమతల్లియు రాజేంద్రునకును, సభాసదులకును బ్రణామము లాచరించి, తనకై యయ్యాస్థానమున వేరుగ నిర్ణయింపబడిన పీఠముపై రాజు నానతి నాసీన యయ్యెను. కుశలప్రశ్నాదికము, సముచిత శాస్త్రప్రసంగాదులు నైన పిమ్మట శ్రీకృష్ణదేవరాయ లామె కవిత్వవిశేషముల నెరుంగ నభిలషించెను.

అప్పు డామె తన రామాయణములోని కొన్ని ఘట్టములను మృదుమధుర కంఠస్వరమున సభాస్తారు లెల్లరు నానందాశ్చర్యవార్నిధి నోలలాడునట్లు చదివి వినిపించెను.

"సుడిగొని రాము పాదములు
సోకిన ధూళి వహించి ఱాయి యే
ర్పడ నొకకాంత యయ్యె నట!
పన్నగ నీతని పాదరేణు వి
య్యెడ వడి నోడ సోక నిది
యెట్లగునో యని సంశయాత్ముఁ డై
కడిగె గుహుండు రాముపద
కంజయుగంబు భయంబుపెంపునన్." —అయోధ్యా.

అను పద్యమును జదివినప్పుడు కవిపండితాదులు దాని భక్తియుక్తుల కలరి,

"ఆహా! ఏమి మనోజ్ఞభావము! సంస్కృతాంధ్ర రామాయణములయందు లేని యపూర్వభావమే యిది! మేలు! మేలు! మొల్లకవీనుతల్లీ! నీ గ్రంథరచన మపురూపముగ నున్నదే!" అని యామెను బ్రశంసించిరి. మరియు గిష్కింధాకాండములోని

"ఓలము వంచి, యొయ్యన ర
ఘూద్వహు డమ్మరిబోసి శబ్దవి
న్మాలముదాక వి ల్దిగిచి
ముష్టియు, దృష్టియు గూర్చి గోత్రభృ
త్కూలము వజ్రపాతహతి
గూలువిధంబున గూల నేసె న
వ్వాలి బ్రతాపశాలి మృడ
వందనశీలి సురాలి మెచ్చగన్"

అను పద్యమును వినగానే యొక పౌరాణికాగ్రేసరుడు,

ఆహాహా! కవనమా, అమృతమా యిది? ఈ ఘట్టమున, పూర్వరామాయణములందు, శ్రీరాముడు వింటినారిని బాణము సంధించునప్పుడు పొడమిన చప్పుడే ప్రళయకాల నిర్ఘోషములవలె నుండెననియు, నాధ్వనికి మృగములు, పక్షులు దిక్కుదెలియక నానాముఖముల బారిబోయె ననియు, లోకములు ఘూర్ణిల్లె

ననియు నింక నేమేమో వర్ణింపబడియున్నది. అట్టి జ్యానినాదమును విని వాలి యేల జాగరూకుడై యుండలే దనుసంశయమున కెడమీయకుండ నిక్కవిమతల్లి 'ఒయ్యన య మ్మెరి వోసి' నట్లు రచియించి యౌచిత్యమును లెస్సగా బాటించినది. ఆహా! స్త్రీ యైన నేమి? కవనపాటవమున నీమె పురుషులకు దీటగుచు నచ్చటచ్చట వారి కవితలకు మెరుగులు పెట్టుచున్నది!"

అని శ్లాఘించెను. అష్టదిగ్గజము లని యభినుతింపబడు అల్లసాని పెద్దనార్యాది కవిశేఖరులు అతిలలితంబగు నామె సుకుమారకవిత్వ శైలికిని, పదార్థ గౌరవమునకును, అతిశయరసభావమాధుర్యగాంభీర్యాదులకును గడుగడునలరుచు, అభినందన సూచకంబు లగు నవలోకనంబుల నొండొరుల జూచికొనజొచ్చిరి. రాజేంద్రుడును పరమానందసంభరితస్వాంతుడై, మొల్లనుద్దేశించి యత్యంతగౌరవము మెయి "విదుషీమణీ, కవయిత్రీమతల్లీ, నీపాండిత్య విశేషమునకును, నీ గ్రంథ రచనా సామర్థ్యమునకును, మృదుమధుర పదప్రయోగ కౌశలమునకును ఔచితీనిర్వహణమునకును నే నెంతయు ముదము నందితిని. ఆంధ్రకవిత్వము ప్రబలి నేటికైదారువందల యేండ్లయినను నేటిదనుక నీవలె గవిత్వమును జెప్పిన యబలామణి యెరుగరాలేదు. ఇవ్విషయమున నాంధ్రయోషారత్నములలో నీవే ప్రథమగణ్యవుగా గానంబడుచున్నావు. సాధ్వీ, ఆశుకవిత్వమునందును నీవు మేటి వని విందును. ఏదే నొకపద్యము నాశువున జెప్పి యీ సభాస్తారులకు హర్షము నొడగూర్పుమా! అని వచియించెను.

అప్పు డామె తన పీఠమునుండి లేచి వినయవినమితోత్తమాంగయై కరంబులు ముకుళించి, "ప్రభువరా, ప్రాజ్యవసుమతీరాజ్యమునకే కాక, ప్రకృష్టకవితా సామ్రాజ్యమునకును మీరు పట్టభద్రులు. మీ యాస్థానకవిశేఖరులలో, అష్టదిగ్గజము లను ప్రఖ్యాతి నందినవారు, తక్కిన పండితప్రకాండులు సమస్త వేదశాస్త్ర పురాణేతిహాసవేత్తలు. ఇట్టి మీరు నాయల్పకవిత్వమును బెద్దగ బొగడియుంటిరి. తనయుల తొక్కుపలుకులు తండ్రులకు ముద్దుగావొకో! దేవా! ఆశుపద్యరచనము ఇట్టి మహాసభయందు, ఇట్టి కవిసింహుల సన్నిధిని నవుబోటి బోటికి సాధ్యమగునా? ఒక్క పద్యపాదమునేని వ్రాక్రువ్వగలనా? అని భయపడుచున్నాను. అయినను శ్రీరామచంద్రుని యనుగ్రహాతిశయంబునను, భారతీదేవి కారుణ్యవిశేషంబునను, దేవర యాజ్ఞానుకంపాబలంబునను, సభాసదుల యాశీఃప్రభావంబుచేతను నా నేర్చిన కొలంది నాశుపద్యరచనమునకై ప్రయత్నించెదను. ప్రభూ! ఏ విషయమును

గూర్చి యేవృత్తమును జెప్పవలయునో యనుగ్రహించి యానతీయ వేడెదను" అని విన్నవించెను.

ఆమె విజ్ఞాపనము నాకర్ణించి యమ్మహారాజచంద్రుడు తన దృఙ్మరీచికలను కవివ్రాతంబుపై బరగించెను. ఏదేనొక విషయమునుగూర్చి యడుగవలయునను భావము రాజవిలోకనములందు పొడకట్టుచుండెను. అప్పుడు పెద్దనార్యుడు ముక్కు తిమ్మనారుని మొగమును దృష్టించెను. తిమ్మనార్యుడును (మాదయగారి) మల్లన కవిశ్రేష్ఠుని మోమును గనుగొనియెను. మల్లనకవి యయ్యలరాజు రామభద్రకవీంద్రుని గాంచి కన్నుగిరిపెను. ఇట్లే కవీంద్రు లందరు నొండొరులకు సన్నలు చేసికొనుచు దుదకు తెనాలి రామకృష్ణకవిని ప్రాశ్నికునిగా నిర్ణయించిరి. అతడు గొంతు సవరించుకొనుచు లేచి మొల్ల నుద్దేశించి,

"కవిరత్నమా, నీశేముషీవిశేషంబునకును, కవితాసామర్థ్యమునకును, వినయవిధేయతాది సద్గుణసంపత్తికిని మహారాజు దొట్టి కవిపండితవర్యు లెల్లరు సమ్మోదనిమగ్నమానసులైరి. ఇక నీ యాశుకవిత్వమహిమను వెల్లడించి వీరి ప్రమోదము ద్విగుణ మగున ట్లొనర్పుము. ఆశువున నీవు చెప్పవలసిన పద్యమున నుండవలసిన సంగతులను దెల్పెదను వినుము.

"మకరికి జిక్కి నకనకలు గుదుచుచు, వికలహృదయుడై తన్ను గాపాడుమని ప్రార్థించు గజేంద్రుని బరీక్షింప సంభ్రమాయత్తచిత్తుడై, వైకుంఠనగరము నుండి చనుదెంచు శ్రీమహావిష్ణుని ప్రయాణవిశేషము నొక సీసపద్యమున నభివర్ణింపవలయును. సీసపాదములు నాలుగిట వరుసగా,

"గుమ్ము, బుస్సు, ఱింగు, బొణుగు"

అను పదము లుండవలయును. మరియు, నితాంతభయాకులుడై, ప్రాణములమీది యాసను వదలుకొని మొఱపెట్టుచున్న యగ్గజరాజునకు గడుదూరమున నుండియే శ్రీమన్నారాయణుని యభయప్రదాన వాక్కులు వినబడుటయు, దదీయసందర్శ చిహ్నము కనబడుటయు నొక్కమారే జరిగిన ట్లుండవలయును. ఈ నియమములను బాటించుచు, నాశుపద్యరచనమున గల నీ ప్రజ్ఞావిశేషమును జూపి యీ సభాసదుల మెప్పునందుము" అని పలికెను.

ఓహో! ఎంత విషమమైన పరీక్ష!" అని రాయలు తలంచెను. "అకటా! ఒకయాడుదాని నాశుకవనమున నింతలేసి చిక్కులుగల నిబంధనములతో బరీక్షింతురా?" అని సభ్యులు చింతింప గడంగిరి.

అప్పు డక్కవయిత్రీరత్న మొక్కనిమేషమాత్ర మాకసమువంక దృష్టిని బరగించి, శ్రీరామచంద్రమూర్తిని మనంబున నిల్పి, తన యాశుకవితామహత్త్వము తేటపడ మృదుమధుర గంభీరస్వరముతో నీ క్రిందిపద్యమును జెప్పెను :

"అనిలాభిహత దక్షిణావర్త శంఖంబు
గుంఫితంబై కేల "గుమ్ము" రనఁగ
గొడ గయి తలునుగా బడగ లొక్కెడ దట్టి
భుజగాధిపతి మీద "బుస్సు" రనఁగ
చరచి నిబ్బరముగా బరతెంచు ఖగరాజు
తెక్కగాడ్పులు మింట "తింగు" రనఁగ
దొంతి బ్రహ్మాండపంక్తులు బొజ్జలో నుండి
బెణకి యొక్కొకమాఱు "బొణగు" రనఁగ
కూకనుచూపుమేరకు గోక విసరి
వెఱకు! వెఱవకు! వెఱవకు! వెఱవ! కనుచు
నుద్దవడి వచ్చి గజరాజునొద్ద వ్రాలె
నార్తరక్షణచణుఁడు నారాయణుండు."

అత్యంతమనోహరమైన యిప్పద్యము నాలించినంత సభాస్తారుల యుల్లంబులు సంతోషాశ్చర్యాదులచే నొక్కమారుగ నుప్పొంగెను. వారినేత్రములనుండి యానందబాష్పములు వెల్లివిరిసెను. సభయంతయు నొక్కక్షణము నిశ్శబ్ద మయ్యెను. తరువాత "ఆహాహా! ఓహోహో!" ఇత్యాది ప్రశంసనార్థకములు వెలువడెను. అప్పుడు రామకృష్ణకవి మొల్లకవి కిట్లనియెను.

"సెబాస్! కవయిత్రీమణీ! నీ పద్యము హృద్యమై నీయాశుపద్య నిర్మాణప్రాగల్భ్యమును వెల్లడించుచున్నది. నీ ప్రజ్ఞావిశేష మసదృశము. భారతీదేవి కారుణ్యకటాక్షము నీపై బరిపూర్ణముగ బ్రసరించుచున్నది. 'ఇతరులెవ్వరైన నింత రసవత్తరముగ జెప్పగలిగియుందురా?' అని యాశ్చర్యపడదగినంతటి భక్తిరసముతోడను, భావమాధుర్యముతోడను. మనోజ్ఞ పదవిన్యాసముతోడను బరిఢవిల్లుచు, నీపద్యరాజ మమ్మహావిష్ణువు నగ్గజరాజునకే కాక మాకును సాక్షాత్కరింపజేయుచున్న ట్లున్నది. వాయడిగిన పదముల నన్నిటి నమితప్రౌఢి మెఱయ, నాయాసీసపాదములయందు సందర్భశుద్ధిగా సంధానించి నాయాశయమున కనుగుణముగ నిరుపమానపద్యరత్నమును రచియించి సభ్యుల కందరకు నెనలేని

ముదంబు నొనగూర్చితివి. కాని. చూడుము, మొల్లా నీ వాపద్యమును పఠియించు సమయమున నీకు శ్రీమహావిష్ణువు జగన్మోహిన్యవతారము ప్రత్యక్ష మైనదా యేమి, యాదేవుడు 'కోక విసరి'నట్లు చెప్పి యాతనికి 'కోక' నంట గట్టితివి ?"

చిఱునవ్వుతోడి యక్కవిచంద్రుని వాక్యములను విని యా సీమంతినీమణి రామకృష్ణకవితో, 'కవిసత్తమా, హాసప్రియు లగుట మీ రట్లు చమత్కరించితిరి గాని, "కోక" శబ్దము సామాన్యవస్త్రపర్యాయముగా నుండుటమాత్రము మీ రెఱుంగనిదియా ? కవిబిడౌజా, నాయల్పకవనమును మీరు మిక్కిలియు బెద్ద చేసి పొగడియున్నారు, కాని, యది మీ కొక లెక్కలోనిదా ? మీపదగుంభనం బొరులకు సాధ్య మగునదియా ?" అని వక్కాణించెను.

పిమ్మట మహారాజు మొల్లను వీక్షించి, "కవయిత్రీమతల్లీ, నీపద్యము ప్రబంధ రాజములలోని పద్యములవలె గడుంగడు ప్రౌఢమై, హృదయంగమమై సరళమై యలరారుచున్నది. తొలుదొల్త రామకృష్ణకవీంద్రు డేర్పరచిన నిబంధనలను విని నీపద్యమునీరీతిని నిర్వహింతువని నేను తలంచియుండలేదు. ఆహా! స్త్రీవై యుండియు నిట్టి ప్రజ్ఞావిశేషమును జూపిన నిన్నెంత యైన పొగడవచ్చును గద ! ఇట్టి కవితా సామర్థ్యము జెందియున్న నీకు గానుకగా, నీవు నివసించు గోపవరగ్రామమును సకలస్వాతంత్ర్యములతోడను ఇచ్చితిని. ఇతోధికముగ గవిత్వాభివృద్ధి నొనర్చుకొనుచు సుఖ ముండుము" అని పరమప్రీతిమెయి బలికెను.

మొల్లయు నెనలేనిముదంబు మనంబున బెనంగొన గృష్ణరాయలకు నమస్కరించుచు లేచి "రాజాధిరాజా, విబుధసంసేవితుం డగు శ్రీమహావిష్ణువుం బోలె బ్రకాశించుచున్న దేవరసందర్శనము చేతనే నాజన్మము సార్థకమైన దని నే నానందించుచుండ, నొక గ్రామమును సైతము నాకు దయచేసి నా యానందమునకు మేర లేకుండ ననుగ్రహమును జూపినారు. నా జీవితకాల మంతయు శ్రీ ప్రభువు వారికి గృతజ్ఞురాల నై యుండెద ననుటకన్న నెక్కుడుగ నేను విన్నవింపజాలను. ఏలిక నిష్కంటక పరిపాలనము చేతనే నాయట్టియబల నిశ్చింతురాలై, నిరంతరాయ మగు విద్య నభ్యసించు భాగ్యమునకు బాత్రమైనది. ఇట్టి ధర్మప్రభువు చిరకాలము మమ్ము బరిపాలించునట్లు శ్రీరామచంద్రు డనుగ్రహించు గాక యని ప్రార్థించుచున్నాను" అని విన్నవించి రాజునానతి మరల బీఠముపై గూరుచుండెను.

రాయల మనంబున కానాడు మొల్ల చెప్పినయొక్క పద్యముతోడను (ఆశు కవిత్వమున) సంతృప్తికలుగ లేదు. అదియునుంగాక తన యాస్థానకవుల యాశు

కవితా మహిమము సైతము మొల్ల యెదుట వెల్లడింపబడవలయు నను అభిప్రాయము నాయనకు గలిగెను. అప్పు డారాజేంద్రుఁడు అల్లసాని పెద్దనకవీంద్రు నవలోకించి, "ఆంధ్రకవితాపితామహా, మీరును నేడే నొక పద్యమును నాశువున రచియింపుడు" అని యాన తిచ్చి, యాక్షణము ప్రధానమంత్రియైనవానికు దన చూడ్కిని మరల్చెను. వరేంగితజ్ఞశిరోమణి యని ప్రసిద్ధిని గాంచిన తిమ్మరుసు మంత్రీంద్రుఁడు వేయునూటపదియాఱేసి సువర్ణములు గల వెండిపళ్ళెరముల రెంటిని తెప్పింప సహాయమంత్రికి సంజ్ఞ చేసె. యేవిషయమును గూర్చి యేపద్యమును జెప్పుదునా యని యాలోచించుచు లేచు పెద్దనకవి నవలోకించి, "కవివర్యా ఇప్పుడు కదా మొల్ల కవయిత్రి శ్రీమహావిష్ణువునిం గూర్చి పద్యమును రచియించినది? ప్రత్యక్షవిష్ణుస్వరూపు డై మనల బరిపాలించుచున్న మన రాజపురందరుని గూర్చి యేదియే నొక వృత్తమున నభివర్ణింపుడు' అని పలికెను. అప్పుడు* కవిత్రయమున కుద్ది యని పొగడుగాంచిన పెద్దనకవిసింహుఁడు,

† శరసంధాన, బల, క్షమా, గురుతరై
శ్వర్యంబులుం గల్గి, దు
ర్భర షండత్వ, బిలప్రవేశ, చలన,
బ్రహ్మఘ్నతల్ మానినన్
నర, సింహ, క్షితిమండ, లేశ్వరుల నె
న్నన్వచ్చు నీసాటిగా
నరసింహక్షితి మండలేశ్వరుల కృ
ష్ణా రాజకంఠీరవా!

---

* ఇద్దరు జోడు నన్నకవి యెఱ్ఱన, తిక్కన సోమయాజి తా
నుద్దగువారికిన్; ముగురి కొక్కఁడె దీటగు నల్లసాని మా
పెద్దన......." అని కణాదము పెద్దన సోమయాజి.

† నరసింహరాయల పుత్రుడ వైన యో కృష్ణరాయా! బాణముల కూర్పు నేర్పును, బలమును, ఓర్పును. గొప్పసంపదయుఁ గల్గియుండియు— అర్జునుడు, సింహము, భూమియు, ఈశ్వరుడును వరుసగా షండత్వము (బృహన్నలత), గుహయందు దూరుట, కంపము, బ్రహ్మహత్యాదోషము (ఈ దోషముచేతనే శివుడు బిచ్చగా డయ్యెను)— అనులోపములు లేనిచో నీతో సాటియగుదు రని భావము.

అను పద్యమును నాశువుగ రచియించుచు జదివెను. సభ్యులందరు నాతని యల్లిక బిగితోడి కవిత్వ గరిమకు నెంతయు నానందించిరి. మొల్లయు పెద్దనార్యుని శబ్ద వైచిత్రిగల కవనశక్తికి గడుంగడు సంతస మందెను. పెద్దనకవి పద్యమును ముగించునప్పటికే వరాలపళ్ళెరములు రెండును దెప్పింపబడి రాజసింహాసనము చెంతనున్న పీఠముపై బెట్టింపబడెను. అంతట తెనాలి రామకృష్ణకవి "ఆగుడు తాతగారూ! ఆగుడు, అనుచు లేచి,' పద్యము మేలైనదే. మిక్కిలి ప్రౌఢముగా నున్నది. మఱియు, మీకవనంపు సొంపును వెల్లడించుచున్నది. కాని, యొక సందేహము గలదు. గుహలో దూరునట్టి యవగుణము గలది యని యిప్పుడు సింహముపై దోషము నారోపించియు మరల నా సింహమునే తోకపట్టుకొని లాగుకొనివచ్చి, 'రాజకంఠీరవా!' అని రాజుచెంత నిలువబెట్టితిరేమి? కళంకము లేకున్న చంద్రుని మోముతో సాటిచేయవచ్చు 'రాజచంద్రా!' అనినట్టు లున్నది మీ పద్యము' అని దరహసితవదనుడై పలికెను. సభాసదులెల్లరు నాశ్చర్యముమెయి మహారాజు మోము వంకకును, పెద్దనకవి ముఖమువైపునకును జూడసాగిరి.

మహారాజు చిరునగవుతో "రామకృష్ణకవిచంద్రా: మీరు నొక పద్యమును నాశువున జెప్పుడు." అని వచియించెను.

అప్పుడు రామకృష్ణకవి గంభీరస్వరముతో

"కలనం దావకఖడ్గఖండిత రిపు
క్ష్మాభర్త* మార్తాండమం
డల నిర్భేద మొనర్చి యేగునెడ ద
న్మధ్యంబునన్ హారకుం
డలకేయూరకిరీటధారి యగు శ్రీ
నారాయణుం గాంచి లో
గలగం బారుచు నేగె నీవ యను శం
కం గృష్ణరాయాధిపా!"

అను పద్యము నవిలంబిత రచనముగ జదివెను.

* యుద్ధమునఁ జచ్చినవీరులు సూర్యమండలమును భేదించుకొని పోయి వీరస్వర్గమును జూఱగొందు రనియు, శ్రీమహావిష్ణువు భానుమండల మధ్యప్రవర్తియై యుండుననియు మనవారి యభిప్రాయము.

"ఆహాహా! ఎట్టి రసవత్తరమైన పద్యము! బలే! ఇక్కవిచంద్రము పదగుంభనము! భావమో హృదయంగమము!" అని సభ్యులు ప్రశంసింప తొడంగిరి. రాజేంద్రుడును రామలింగకవి కవితాసామర్థ్యమునకు మిగుల హర్షించెను.

అనంతరము వేరొక వేయినూటపదియారులు సువర్ణములు గల పళ్ళెర మును దెప్పింపబడియెను. రాజునానతిని పెద్దనార్యుడును, రామకృష్ణకవియు, మొల్ల కవయిత్రీమణియు నొక్కొక్క పళ్ళెరమును గైకొని యానందించిరి. సభవారును సంతసించిరి. మొల్లయు మహారాజునకు నమస్కరించి తదాజ్ఞను బడసి స్వగ్రామ మును జేరి, తల్లిదండ్రులకును, దక్కినవారికిని నెనలేని ముదంబును గూర్చుచు సుఖ ముండెను.

—నడకుదుటి వీరరాజు*

———X———

* భారతి. ఫిబ్రవరి, 1935.

# పెద్దన తరవాతి ప్రబంధకవులు

పెద్దన ప్రథమప్రబంధ నిర్మాత. తరువాతి ప్రబంధకవులలో రామరాజ భూషణుని మొదలుకొని పెద్దన ననుసరింపనివా రెవ్వరును లేరు. మనుచరిత్ర పిల్లలు కొన్ని పిల్లలపిల్లలు కొన్ని, మేనల్లురుకొన్ని, మేనమామ బిడ్డలుకొన్ని, ప్రతిబింబములు కొన్ని బయలుదేరినవి. పెద్దనకు కొడు కుండె నట. అతడు జీవిత కాలమున నేమిచేయు నని రామరాజభూషణుని భార్య పెద్దనభార్య నడిగె నట. శ్లేష కవిత్వము నైన చెప్పుకొని బ్రతుకునని పెద్దనభార్య ప్రత్యుత్తర మిచ్చెనట. రామ రాజభూషణుని భార్య సిగ్గుపడె నట. ఇట్లుండగా వసుచరిత్రములోని శ్లేషలు అనేకు లనుకరించిరి. అది కవిత్వ మనియే యిప్పటికి అనేకుల యభిప్రాయము. రసగ్రహ ణము కలిగి కవితాస్వభావ మెఱిగిన కొందరి యభిప్రాయము మఱియొకలాగున నున్నట్లు వినుచున్నాము. ఎటు లైన నేమి పిల్లవసుచరిత్రలు, పిల్లపిల్ల వసుచరిత్రలు తుపాకిరవ్వలవలె, అచ్చుగుద్దినప్రతులవలె బయలుదేరుట వలన నెంత గందర గోళ మైన నైనది.

ప్రబంధములలో దప్పకుండ యిరువదిరెండు వర్ణన లుండవలె నని కొందర మతము. పందొమ్మిదితోనే సరిపుచ్చవచ్చు నని మరికొందరు. ఎటులైననేమి యీ వర్ణనలన్ని యుండి తీరవలసినవి. బ్రహ్మ విష్ణు శివమూర్తులయు, వారి భార్య లయు వర్ణన, వినాయకుని వర్ణన, బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రుల వర్ణన, పుష్ప లావికల వర్ణన, కుకవినింద, షష్ఠ్యంతములు, సతివిరహవర్ణన, చంద్ర, మన్మథ, వాయుమధుపాదుల వర్ణన, వేటవర్ణన, నాయికానాయక సమావేశము, విదూషకు నిచే సమావేశపరుపబడుట, వారిద్దరు చేసిన సంభోగవర్ణన, ఒక్క సంభోగము సరి పోవు ననుకొంటిరా? చాలదయ్యా, పునారతి వర్ణన, అక్కడనుండి నిత్యవిధిసంభోగ వర్ణన, సుతులు గలిగిన యెడల సుతివర్ణన, తరువాత మంగళము, తరువాత గద్య, ఇది ముందు, అది వెనుక, అది వెనుక ఇదిముందు—యిటుల యీ వర్ణన లన్నియు నుండవలెను.

వసుచరిత్రకారుని కవితనుగూర్చి : ఇతని పద్యములు కొన్ని చిత్రమైన శ్లేషలు గలిగి యున్నవి. ఇతడు మంచి గాయకుడు. ఇతని పద్యముల నిప్పటికి తాళములు వైచుచు, కీర్తనలవలె పాడువారు కొందరున్నారు.

"ఆ జాబిల్లివెలుంగు వెల్లికల డా
యన్ లేక రాకానిశా
రాజశ్రీసఖ మైన మోమున బటా
గ్రం బొత్తి యెగ్గెత్తి యా
రాజీవానన యేడ్చె కిన్నరవధూ
రాజత్కరాంభోజ కాం
భోజీమేళవిపంకారవసుధా
పూరంబు తోరంబుగన్."

సురభి మాధవరావుగారు వసుచరిత్రకు దాసులు. ఈయన వసుచరిత్రకారుని పద్యములకు పద్యములు వ్రాసినాడు. 'ఆజాబిల్లి' యను పద్యమునకు పాఠాంతర పద్యమును జెప్పినాడు. "నాయిక యేడ్చె భూపాలరాగంబునన్" అని చెప్పినాడు. అనగా తెల్లవారగట్ల పాడు భూపాలరాగ మని యర్థము. భూపాలుని యందలి నిర్వ్యాజమైన ప్రేమ యని భావము. అందుచేత వెనుకటి పద్యముకంటె మాధవరావుగారు బాగుగా మెరిగించినా రని కొందరి యభిప్రాయము. కవికూడ నట్లే సంతోషించి యుండెను. అట్లు మెరిగించుట లేదు గాని తరిగించుట మాత్రము జరిగినది. ఏల యందురా, కాంభోజీరాగము ఏడ్పున కర్హ మైన రాగము. పద్యము రోదనవర్ణనార్హ మైన రాగము నాత డుంచినాడు; కాని మాధవరావుగా రీయంశమును తెలియలేక భూపాల రాగ మని ఫిరాయించారు. అది ఏడ్పురాగము కాదు. భూపాలరాగము తెల్లవారగట్ల పాడదగినది. ప్రభువులను నిద్రనుండి లేపుటకు ఉపయోగింపబడును. నిద్రలేచి నరములయుద్రేకముతో ఉత్సాహముగ నుండుటకు భూపాలరాగ మక్కరకు వచ్చును; కాని ఏడ్పునకు బనికిరాదు. అందుచేత సురభి మాధవరావుగారి యేడ్పు దొంగయేడ్పు. ఈ సందర్భమున రామరాజభూషణుని మరియొక పద్యమును వినుడు:

"వాలారుం గొనగోళ్ళ నీవలసతన్
వాయించుచో నాటకున్
మేలం బైన విపంచి నిన్న మొదలున్
నీవంటమిం జేసి యా
యాలాపంబె యవేళ బల్కెడు ప్రభో
తాయాత వాతాహతా

లోలత్తంత్రుల మేళవింపగదవే
లోలాక్షి దేశాక్షికిన్."

నాటరాగస్వరము స, గ, మ, ప, ని, స, స, ని, పమగస. దేశాక్షిమీాద గీతమే చెప్పెదను. మగరిమగరిస, సనిధసారి. మగరిసనిధప, ధధపమగరిగ, గపధపధప ధనిసనిధ సారి, దేశాక్షి భూపాలవంటిదే. దేశాక్షి పల్కెడు దానికి బదులుగా నోట బల్కుచున్నది. ఇందువలన తెలియదగిన దేదనగ, ఆనాటి వీణలకు మెట్లు ఏరాగ మున కారాగము సద్దుకొనదగినవే. ఇప్పటివీణలకు కదలని మెట్లు యెట్లోయొకట్లు. కాని యీా చిత్రమేమి. గాలిచే తీగలు కదలినంతమాత్రమున నాటరాగము పల్కుటే. చేతపట్టుకొని శ్రుతితీగలను తంబురతీగలను వాయించుచు ఆయా మెట్లు నుంకించి నొక్కినగాని పల్కునా. విరుద్ధముగా లేదా ? అదేమి మాట ? మహతి యను వీణ 'ఓం' అని పల్కెడిది కాదా యని యాక్షేపింతురా ? గాలిచేత తీగ గదలినయెడల రాగము పల్కుదురు గాని ధ్వనియగుట కేమి ? రామరాజభూషణుడు ఇట్లు వ్రాసి యుండెనేమి ? అతడు గాత్రజ్ఞుడే కాని జంత్రజ్ఞుడు కాడేమో యని యనుకొనవలసి వచ్చినది. శ్లేషార్థములలో నితని వర్ణనాశక్తిని గూర్చి చెప్పెదను. స్త్రీతొడలను వర్ణించుచు పద్యము చెప్పినాడు.

"సతియూరుద్యుతిఁ జెందఁబూని నిజదు
శ్చర్మాపనోదక్రియా
రతి బాథోలవపూరితోదరము లై
రంభేభహస్తంబు లు
న్న తరిన్ వీఁడె మరుద్విభూతిఁగదళిన్
ద్వగ్దోష మా చంచలో
ద్ధతశుండాతతి బాయదయ్యె నదెవో
తద్వైరమూలం బిలన్."

ఇందులోని గాథ యేమనగా, కదళీవృక్షము , కరితుండము, గిరియొక్క తొడలతో పోలుటకై తపము చేసెను ఎందుకు ? కదళికి, తుండమునకుగల దుశ్చర్యము పోవుటకై గాలితాకుట వలన. అనగా మరుద్విభూతి వలన కదళికి ఊరుసామ్యము సిద్ధించినది. అదిగాక మరుద్విభూతి యనగా దేవతావైభవము చేతనని భావము. అట్టి గాలితాకుడువలన గాని, దేవతాప్రాభవము వలనగాని తుండమునకు దుశ్చర్యము వదలలేదు. కదళివిషయమై దుశ్చర్మమనగా పై దొప్పలు, తుండము విషయమై

బొల్లి, కలకుదనము, ముదుతలు. కదళి తపస్సున కృతార్థత నొందినది; కాని తుండ మట్లు కాలేదు. అందుచేతనే తుండము కదళితో వైరపడెను. అదియే నారి వైరమునకు మూలమని కవి సెలవిచ్చినాడు. ఇదియేమయ్యా, సతితొడ లెట్లున్నవో చెప్పక తుండము అరటిచెట్లను పీకివేయుచున్నందులకు కారణము జెప్పినావు. తొడలు అరటిబోదల వలెను, తుండమువలెను నున్న వను మాటయే కాని అందుకు భేద మేమైన నున్నదా ? ఈ మాత్రము దానికి పద్య మెందులకు?

"స్వైరవిహారధీర లగు
సారసలోచన లున్నచోటికిన్
భోరున లాతివారు చనఁ
బూనినచో రసభంగ మంచు నేఁ
జేరక పూవుదీవియల
చెంతనె నిల్చి లతాంగిరూపు క
న్నారఁగ జూచి వచ్చితి న
వాంబురుహాంబక నీకుఁ దెల్పఁగన్."

(స్వతంత్ర లైన స్త్రీలు (సారసలోచనలు) ఉన్నచోటికిన్ బోరున లాతివారు చన బూనినచో రసభంగ మంచు నే జేరక పూవుదీవియల చెంతనెనిల్చి లతాంగి రూపు కన్నారగ గాంచి వచ్చితి నవాంబురుహాంబక నీకు దెల్పగన్) బోరున లాతివారు. చప్పున అనగా సెలవడుగకుండ పైవారు– ఇచ్చట 'బోరున' యన్నది ప్రాసము కొరకు– వచ్చినయెడల రసభంగమగునట. అనగా వారి కింతవరకున్న సంతోషము, సుఖము భంగ మగునని యర్థము. అదిగాక 'రస' అనుసక్షరములు భంగ మగునట; అనగా సారసలోచనలు అన్నదానిలో 'రస' పోయినయెడల సాలోచన లగుదురని భావము. ఆఁ! ఎవ్వరు వీరు చెప్పుమా యని యాలోచనభావమున స్త్రీ లుందు రని కవియభిప్రాయము. అట్లు వారి కిబ్బందిగా నుండు నని చేయక నేనే పూలచెట్లు మాటునడాగి లతాంగిరూపు గంటిని. పూవుదీవియలలో ఆమె యొకపూదీగెగనుక లతాంగి యని విశేషణము బాగుగా నున్నది. రూపు అనగా మంగళసూత్రము గాదు. రూపు కన్నెలు ధరించునది. అందుచేత నీసతిపై నీపెండ్లియాస అడియాస కాదని విదూషకుడు వసురాజా బహద్దూరుతో బల్కెను. ఆవురావురని వేచియున్న యాయబ్బె రాసితో గ్రంథాళిగానివలె పెండ్లియైతేనా, అని యెగిరెగిరిపడి స్త్రీరోగాబాధాకరునితో కొంచెము హెచ్చుతగ్గు సముడగు వసురాజుతో జెప్పెను.

ఇతని కవిత్వమార్దవము చూపుటకై రెండు మూడు పద్యములు :

చెలికత్తెలు ఇంకను వసురాజు రాలే దని యాతురతతో గిరికకు నివేదించిన పద్యము—

"ఇన్నగరాజు జూడ వసు
ధేశ్వరు డెన్నడు వచ్చు వచ్చి యీ
క్రొన్ననతీవజొంపముల
కోనకు నెన్నడు డిగ్గు డిగ్గి యీ
కన్నియ గన్నులార కుతు
కంబున నెన్నడు గాంచు గాంచి తా
నెన్నడు గారవించు చెలు
లెన్నడు గాంతు రభీష్టసంపదల్."

ముంటికి కత్తి. కత్తికి కంప, కంపకు రొట్టె, రొట్టెకు ముండ, ముండకు డోల్, డోల్‌జజా అని అనకాపల్లి బుబుసు పాపయ్యశాస్త్రిగారి ముక్తపదగ్రస్తాలంకారో దాహృత గద్యశ్రాద్ధమువలె నుండక యీ పద్యము మిగుల సొంపుగా నున్నది. ఇట్టిదో, ఇంతకన్న మిన్నయో అగు నొక్క పద్యము చెప్పెదను.

"ఏమేమీ జగతిన్ గతోరములు కై
లేంద్రంబు లౌఁగా తదీ
యామేయస్మయభేది యంతకుఁ గతో
రాకారుఁ డౌనే కదా
యా మేటిన్ ధృతి వాసి చూపులనె యీ
టాడించువా రెంతవా
రో మీనేక్షణ తా నెరుంగదె తదా
రూఢ ప్రభావోన్నతుల్."

ఓహో! రామరాజభూషణా! శేషునిశిరస్సు వంపింపవలసిన పద్యము జెప్పితి వయ్యా, ఇంత మృదులత, ద్రాక్షాపాకము నీ సొమ్మేనయ్యా! మహాకవీ!

"నాళీకాకరతీరసారకదళీ నారంగపూగావళీ
పాళీవాసిత మైన కోనఁ గని యాబల్గోనలోఁ గానలో
లాళి ప్రేరకరత్నకోరక మయూరాళీసమాలీఢ మౌ
కేళీధామము గంటి భూరమణ యాకేళీనివాసంబునన్."

ఇతడు బహుప్రశస్తకవి. అయిననేమి? పనికిమాలిన శ్లేషములకై బోయి యేమో యైనా డని చెప్పవలసి వచ్చినది.

—పానుగంటి లక్ష్మీనరసింహారావు*

* భారతి-నవంబరు 1934.

# తెనాలి కవులు

వశ్యవాక్కు లగు పండితాగ్రగణ్యుల యభిప్రాయములను లోకమునఁ జిర కాలముగ నూఁదివచ్చు పుక్కిటిపురాణములను సులభముగాఁ బూర్వపక్షముచేసి యబద్ధ మని స్థాపించుట మహామతులకేనియు సంపూర్ణసామగ్రితోనైనను దుష్కరము. తెనాలి రామకృష్ణుఁడు కృష్ణరాయని సభలో హాస్యరసచతురుఁడై యుండెనో లేక యతని యనంతరము నూటయిరువదియేండ్లకునుఁ దన పాండురంగమాహాత్మ్యమును రచియింపఁడయ్యెనో యను సంశము చిరకాలమునుండి నాహృదయమును వేధించుచున్నది. ఈ వ్యాసములో సుప్రసిద్ధుఁడగు రామకృష్ణుని కాలనిర్ణయమును గుఱించి వ్రాయదలంచి యా పేరుగల మఱికొంద రుండుటచే వారలసహితమిందుఁ జేర్చి యించుక విచారించినఁ బ్రతివాదబుద్బుదము లుప్పతిల్ల సౌకర్యము చాలదని యీ వ్యాసమునకుఁ బైనామ మిడవలసి వచ్చెను. తెనాలి వారలు రామకృష్ణకవి, అన్నయ్య, గిరియప్ప, రామకృష్ణకని, రామభద్రుఁడు, రామలింగఁడు, అని కొందఱు గలరు. ఇందఱిపేరులు క్రొత్తగ నుడువుట తన్నామధారి నగు నా హాస్యచాతుర్య మని యెవ్వరును దలఁపకుఁడు. పై పరంపరలోఁ గడపటి రామ లింగఁడు స్వర్ణకారకులజుఁడు; గోలకొండ తానీషా యొద్ద మంత్రులుగా నుండిన యక్కన మాదనల యస్థాన కవి.

శ్రీమదుమామహేశ్వర చరణారవింద సేవాప్రవీణ తెనాలివంశపవిత్రార్యజన స్తోత్రపాత్ర మృత్యుంజయ నామధేయపౌత్ర మల్లికార్జున తనూభవ రామలింగ నామధేయ కవి విరచితం బగు ధీరజనమనోవిరాజితం" బను నొక యేకాశ్వాస గ్రంథము స్వర్ణకారకులజప్రాశస్త్యమును వర్ణించునది విలసిల్లుచున్నది. ఇది సుమారు 250 సంవత్సరములక్రిందటిది. కవిత కేవలము కథానూత్రమునే యనుసరించుచు సామాన్యముగా నడచుచున్నది. సకల జనమనోనయనహరణ కౌశలప్రభావిశేషంబు లేకున్నను రంగస్థలీవిలాసంబు లగు మాయాప్రసాధన విజృంభణంబు లిందుఁ గానరావు.

ఉ. పూర్ణకళావిశేషములపొల్పు చెలంగు ముఖంబులన్ సువి
స్తీర్ణవికాసనేత్రసరసీరుహముల్ మృదులాంచితప్రభా
కీర్ణ విలాసమూర్తిరుచి గీల్కొనఁ జెక్కుల నవ్వులున్ మహా
ద్వర్ణములున్ సజీవములు వాదిరి గల్గ నొనర్చి రయ్యెడన్.

అను పద్య మితని రచనాధోరణి కుదాహరించితిఁ గాని యిందులోఁ గల యర్థము మాత్రము చదువువారలకుఁ గలుగునట్లు కవి రచియింపఁడయ్యె.

ఇఁకఁ దక్కినవారెల్లరును సగోత్రులు సకుటుంబులు. తెనాలి రామకృష్ణ కవియు, అన్నయ్యయు, శ్రీగిరియు నన్నదమ్ములు. ఇమ్మడి రామకృష్ణుఁడు శ్రీగిరి కుమారుఁడు. వీరరాఘవుఁడును రామభద్రుఁడును రెండవ రామకృష్ణుని పుత్రులు. వీరందఱును గ్రంథకర్తలే. వితరణశాలు లగు రాజేంద్రుల సభలు నిర్నిరుద్ధద్వారములై యుండఁగా. "ఊరూర నింటనింట...... పదుగురేసి కవులు భవ్యచరిత" అనుమాట యేల నిక్కము కాఁగూడదు? వీరిలో రామకృష్ణకవి కందర్పకేతు విలాసము, హరిలీలా విలాసము, పాండురంగమాహాత్మ్యము, ఘటికాచలమాహాత్మ్యమును; తెనాలి యన్నయ్య సుదక్షిణాపరిణయమును; శ్రీగిరి శ్రీశైలమాహాత్మ్యమును; ఇమ్మడి రామకృష్ణుఁడు కృష్ణచరితయు; రామభద్రుఁ డిందుమతీకల్యాణమును విరచించిరి. వీనిలో నిందుమతీకల్యాణమును బొలచురి కృష్ణభూపాలున కంకితము సేయుచు రామభద్రకవి కవిస్తుతిలో,

ఉ. మామక నవ్యకావ్యము సమంచితమాధురి సాధురీతిగా
యామకృతప్రబంధరచనాయతపాకచతుర్విధైకవా
గ్ధామహిమోజ్జ్వలాఢ్య కవితాఘనతామహు మత్పితామహున్
రామయరామకృష్ణకవిరాజుఁ దలంచి నుతించి మ్రొక్కెదన్.

గీ. తదనుసంభవమణిని సుదక్షిణాప
రిణయముఖకావ్యరచనాధురీణు నంధ్ర
కవికదంబులోనఁ బ్రఖ్యాతిఁ గన్న
యన్నపకవీంద్రు ధీసాంద్రు నభినుతింతు.

అని చెప్పి, తద్రాజేంద్రుఁడు తన్నుఁ బిలిపించి,

సీ. ప్రౌఢి మీపెదతాత పాండురంగాదిన
త్కృతులు సేసెను రామకృష్ణసుకవి
అనుజుఁ డన్నప్ప మీ పినతాత రచియించెఁ
బరఁగ సుదక్షిణాపరిణయంబు
మీతాత శ్రీగిరి చాతురీ విఖ్యాతి
శ్రీశైలమాహాత్మ్య కృతి యొనర్చెఁ
గడిమి మీతండ్రి యిమ్మడి రామకృష్ణాఖ్యుఁ
డనఁ గీర్తి కనె సంస్కృతాంధ్రముల ను

దారులనిపించె మీయన్న వీరరాఘు
వాఖ్యకవి సర్వకవితామహత్త్వమునను
ని స్ననూహానసంతాను నెన్నఁ దరమె
ప్రాజ్ఞహృదయాబ్జరవి రామభద్రసుకవి.

అని పొగడినట్లు తన యిందుమతీకల్యాణమునఁ జెప్పుకొనియె. ఇఁక మనకుఁ గలుగు సామగ్రితో స్థిరహృదయము లగు పండితభూధరములతోఁ దగురునుం బోలె నించుక సమీపించి చూచెదను. శృంగభంగ మైనను విలాన సౌష్ఠవమే.

శ్రీయుత వీరేశలింగంపంతులువారు రామకృష్ణుని గుఱించి యొక్కచో నతఁడు క్రీ. శ. 1560-70 సంవత్సర ప్రాంతమునుండి కవియై యుండవచ్చు ననియు, వేఱొకచోఁ బదునేడవశతాబ్దియం దుండె ననుటకు సందేహము లేదనియు, మఱియొక్కచోటఁ బాండురంగమాహాత్మ్యము రచియింపఁబడిన కాలము 1650 సంవత్సరముకంటెఁ బూర్వమై యుండదనియు వ్రాక్రుచ్చిరి. తెనాలి రామకృష్ణకవి కృష్ణరాయనిసభలో నుండెనని తక్కిన చరిత్రకారుల యభిప్రాయము.

1. పాండురంగమాహాత్మ్యము విరూరి వేదాద్రిమంత్రి కంకితమయ్యె. నతఁడు కందాళ యప్పళాచార్యుల శిష్యుఁడు; మంగయ గురువరాజు కుమారుఁడగు పెద్దసంగభూపాలునకు వ్రాయసకాఁడు. ఇందులోఁ గందాళ యప్పళాచార్యునే, చిత్రభారత కృతికర్త యగు చరికొండ ధర్మనయు, వైజయంతీవిలాసకర్త యగు సారంగు తమ్మకవియుఁ బ్రశంసించియున్నారు. తమ్మకవి యయ్యాచార్యునకు శిష్యుఁడు; చరికొండ ధర్మన కాశ్రయుఁ డగు నిమ్మలపల్లి పెద్దామాత్యుని తండ్రియు నయ్యాచార్యుని శిష్యుఁ డట; ధర్మన భట్టపరాశరదేశికుని పౌత్రుఁ డగు రంగనాథ దేశికుని శిష్యుఁడు.

2. రామకృష్ణుఁడు భట్టపరాశరుని కుమారుఁ డగు చిక్కభట్టరుకు శిష్యుఁడు.

క. వాక్కాంతాశ్రయభట్టరు
చిక్కాచార్యుల మహాత్ము శ్రీగురుమూర్తిన్
నిక్కపుభక్తి భజించెద
నిక్కావ్యకళాకలాప మీదేరుటకున్. —పాండు.

లింగముకుంట తిమ్మనయు నతనికే శిష్యుఁడు

3. ఇఁక రెట్టమత మనెడి జ్యోతిషగ్రంథము కొండ్రాజు తిమ్మరాజు కుమారుఁ డగు వేంకటాద్రికి నంకితమీఁబడి యున్నది. ఆ వేంకటరాజు మంగయ

గురవరాజు కొమార్తె యగు పాపమాంబకుఁ బుత్రుఁడు; అనఁగా విరూరి వేదాద్రి మంత్రికి యజమాని యగు పెదసంగభూపాలునకుఁ జెల్లెలి కుమారుఁడు. ఈ వేంకటాద్రిఁ గామందక మను రాజనీతిగ్రంథ మొకటి యంకితముగా రచింపఁబడి యున్నది. దానిలోఁ బ్రథమాశ్వాసాంతమున,

క. శ్రీచంచద్భట్టరు చి
క్కాచార్య వరార్యశిష్య యతులిత శౌర్య
ప్రాచుర్య వర్య గుణర
త్నాచల జయలలితధైర్య నయవినయనిధీ.

అని యున్నందున వేంకటాద్రియు జిక్కభట్టునకు శిష్యుఁడు.

పై సూచించిన యంశములలోఁ జిక్కభట్టరు భట్టపరాశరుని కుమారుఁ డనుటకుఁ దప్పఁ దక్కిన వన్నిటికిని శ్రీయుత పంతులవారే కవిచరిత్రములో నాధారములు సూపిరి. స్థలసంకోచముచే నిందు వాని నుద్ధరింపఁజాల. చిక్కభట్టు పరాశరభట్టు కుమారుఁడు. తంజాపురీనాథుఁ డగు విజయరాఘవుని సభలో నుండిన శేషము తిమ్మకవి తన యంబరీషచరిత్రమున భట్టపరాశరుని పుత్రుఁడు చిక్కభట్టనియు నతని పుత్రుఁడు రంగనాథదేశికుఁ డనియు, నతని కుమారుఁడు చిక్కభట్టనియు, మరల నతని పుత్రుఁడు రంగనాథుఁడు తన గురు వనియు వ్రాసికొనియె.

శ్రీయుత పంతులవారు రెట్టమతము కడపట నున్న యీ క్రింది పద్య మాధారముగా నొనర్చి రామకృష్ణుని కాలనిర్ణయమునకు సమకట్టిరి.

సీ. కలియుగ ప్రథమభాగము నాల్గువేల యె
న్మిదినూర్లపైని డెబ్బదియు నొకటి
శాలివాహనశక సమ లిల వేయునా
ర్నూటతొంబదిరెండు రూఢి గాఁగఁ
బ్రభవాదిగతములు పరఁగ నిర్వదిమూఁడు
నేండయ్యె నెంతయు నెన్న బుధులు
అట్టికాలంబున నయ్యన భాస్కర
కవివర్యు లలరాజకమల హితుని
యాజ్ఞఁ బూర్వోక్త రెట్టమతాఖ్య కావ్య
మను నొనర్చిరి యాచంద్రముగను గీర్తి.

ఈ పద్యము ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున నుండు నాల్గుప్రతులలో నొక దానిలో మాత్రము కలదు. నే నిటీవల సంపాదించిన ప్రతులలోఁ గానరాదు. వ్రాఁత ప్రతిలో నుండిన లేఖకదోషసహస్రమును బంతులవారు సవరించిరి. ఈ పద్యము ననుసరించి కృతిపతి క్రీస్తుశకము 1769 లో నుండియుండగా నతని మేనమామ యగు పెద్దసంగ భూపాలునకు వ్రాయసకాఁ డగు విరూరి వేదాద్రి మంత్రి క్రీ. శ. 1650 ల కంటెఁ బూర్వుఁడు కాఁజాలఁడు గావునఁ బాండురంగకృతి యంతకంటె నర్వాచీన మనుట దోషము కాదు. అయినను బంతులవారు మామకును నల్లునకును 119 సంవత్సరములు భేదము సూపినయుక్తి యద్భుతముగా నున్నది. మంగయ గురవరాజునకు దొమ్మండ్రు పుత్రులు. వారలలోఁ బెదసంగభూపతి మూఁడవ వాఁడు; పాపమాంబ కడగొట్టు చెల్లెలు. ఈ సమృద్ధసంతతిలో నొక్కొక్కనికిఁ బది యేండ్లచొప్పున గర్భధారణకాలభేదము చూపినను మూఁడవకుమారున కెల్లు కడ గొట్టుచెల్లెలికుమారుఁడు 120 యేండ్ల పిదపనుండ సంభవించునో యస్మాదృశుల బుద్ధుల కగోచరమైయున్నది. ఇంతవిశాలకాలమును నిష్ఠితవీర్యుఁ డగు మంగయ గురువరా జెట్టి రససిద్ధుఁడో యెఱుఁగఁజాల.

మఱియు సీ వేంకటాద్రి,

సీ. శ్రీమదహోబలస్వామి మహారాజ్య
        రక్షకుం డగుచు నేరాజు వెలయు
    నభిరామకామందకాఖ్య సత్కావ్యర
        త్నమునకు నేరాజు నాథుఁ డయ్యె
    నెరయూరి పురవహాధీశాది బహుబిరు
        దాంకుఁడై యేరాజు యశము గాంచె
    జానకీనాయకచరణసంసేవన
        ప్రౌఢిచే నేరాజు ప్రబలు సిరుల

    నతఁడు కొండ్రాజు తిమ్మభూపతివరేణ్య
    తనయ పెదతిమ్మరాజవతంసగర్భ
    వార్ధిచంద్రుండు సత్కులవర్ధనుండు
    సతతవిభవుండు వేంకటక్ష్మావిభుండు.

అని రెట్టమతమున వర్ణింపఁబడినట్లు కామందకకృతిపతియు నహోబలస్వామి భక్తుఁడు నై యుండెను. రెట్టమతములో నుండి పంతులవారు సూపిన పద్యాధారము

నిశ్చయమా యని మనకుఁ దోఁచుచున్న సందేహమును దీర్పఁ గామందకకృతియే మనకు శరణ్యము; అహోబలస్వామియే యాసన్నపరిత్రాణుఁడు. కామందక కృతి కర్తలు వేంకట రామకృష్ణులు దాని నెనిమిదాశ్వాసములుగా రచించి వేంకటరాజున కంకిత మొనర్చిరి. తర్వాతనే యతనికి రెట్టమతము విరచితమయ్యెఁ గదా. తిక్కనాదులకుఁ బూర్వమే మఱియొక కామందకము గలదు. మన కామందకమున,

> మ. రమణీయంబుగ శాలివాహశకవర్షంబుల్ గతంబై సహ
> స్రము నేనూఱును నాఱునై వెలయఁగాఁ బ్రౌఢిం దెనిగించి రౌ
> ర మహిం దిమ్మయవేంకటాద్రివిభుపేరన్ వేడ్కఁ గామందకీ
> యము శ్రీ వేంకటరామకృష్ణులు స్వభావ్యబ్ధంబునన్ రూఢిగన్.

అని యున్నది. అనఁగాఁ క్రీస్తుశకము 1584 సంవత్సర మగుచున్నది. ఇది మనకుఁ దోడువడియె; నిఁక శరణాగతత్రాణ బిరుదుం డగు నహోబిలపతి యను గ్రహ మెట్లుండునో యతని దివ్యాయతనముఁ జొచ్చి చూతము. అదిగో మహాద్వారమున శాసన మగపడుచున్నది ; చదువుదమా !

"శుభమస్తు. దేవశ్రేణీ శిరోరత్నం దైత్యద్వీపఘంటాంకుశం జయతు శ్రీనృసింహస్య దేవదేవస్య శాసనం. స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశక వర్షంబులు 1506 అగు నేటి తారణ సం. వైశాఖశుద్ధ 14 శ్రీమద్రాజాధిరాజ రాజ పరమేశ్వర శ్రీవీరప్రతాప శ్రీవీరశ్రీరంగరాయదేవమహారాయలుగారు పెనుగొండ నగరమందు వజ్రసింహాసనారూఢులై పృథ్వీసాంమ్రాజ్యము చేయుచుండగాను శ్రీమద్వేదమార్గప్రతిష్ఠాపనాచార్య సర్వతంత్రోభయవేదాంతాచార్యు లయిన శ్రీశఠగోప జియ్యంగారి కార్యకర్త లయిన రాచప్పగారున్ను శ్రీ అహోబలస్థానంవారున్ను కాశ్యపగోత్ర ఆపస్తంబసూత్ర యజుశ్శాఖాధ్యాయు లయిన సూర్యవంశోద్భవు లయిన మూరురాయర బసవశంకర గుత్తిహరి నిబ్బరగండ యొరయూరి పురాధీశ్వరు లయిన శ్రీమన్మహామండలేశ్వర కొండ్రాజు తిమ్మరాజుగారి పౌత్రులయిన తిమ్మరాజుగారి పుత్రులయిన వేంకటరాజు దేవమహారాజులుంగారికి యిచ్చిన శిలా శాసనక్రమ మెట్లన్నను, ప్రాక్ బహుధాన్యనామ సంవత్సరాన నిభరాముువారు హండే వారిని కూడుకొని సీమయంతా రాచూరాపట్టి అహోబిల స్థలాలకు వచ్చి అహోబిలం అంతా పాడుచేసి అహోబిల స్థలం అయిదు ఆరు ఏండ్లు తమవశం చేసుక ఆక్రమించి నడుస్తూ వున్న నిమిత్తం శ్రీ అహోబలేశ్వరులు సన్యాసం ప్రసాదించిన ఆదిమమైన శఠగోపజియ్యంగారికి ఏడోతరమై శ్రీ పురుషోత్తమ ఆళ్వారుల ప్రతిష్ఠసేసి

ముకుందదేవునిచేత పూజగొని రామానుజ దర్శనోద్ధారకులైన శ్రీపరాంకుశ మహా మునిశిష్యు లయినటువంటి శ్రీమచ్ఛటకోపస్వామివారిస్థలం యీతీరున అయిన నిమిత్తం శ్రీరంగరాయదేవమహారాయుల సముఖాన తాము మనవిచేసి మీరు యీ తీరున రత్నసింహాసనారూఢులై వుండిన్ని మీ కులస్వామి యైన అహోబలేశ్వరుని స్థలం తురకలు.

అయ్యో! "శిలాభోగం నరాభోగం" అనుమాట నిశ్చయమై, "భుజంగ జిహ్వాచపలాః నృపశ్రియః" అన్న భాసవాక్యము దేవతలకుఁ గూడ ననుభూత మయ్యెనా!

పై శాసనము మనకే కాక చరిత్రకారులకునుఁ బ్రయోజనకారి యగునని విపులముగా నుదాహరించితిని. శాసనకాలము సహితము క్రీ. శ. 1584 అగు చున్నది. ఇవి గతవర్షములు. ఈ కాలమున నున్న వేంకటరాజునకు మేనమామ యగు పెద్దసంగభూపతి 20 ఏండ్ల పూర్వమున్నను పాండురంగకృతి రచనా కాలము 1564 అగుచున్నది. శైలియుఁ బదబంధముల ననుసరించి చూడఁగాఁ బాండురంగకృతి హరిలీలావిలాసము కంటెఁ దరువాత రచిత మని తోచుచున్నది.

పైఁ జూపిన శాసనములోని వేంకటాద్రి యొరయూరి పురవరాధీశ్వరుఁ డగు సూర్యవంశోద్భవుఁడు కావున దెలుఁగుచోడులలోఁ జేరినవాఁడు. కామందక మున షష్ఠాశ్వాసము మొదట,

క. శ్రీదేవ చోడ వంశమ
హోదధి పరిపూర్ణచంద్ర.........

....కొండ్రాజు వేంకటాద్రి నరేంద్రా.

అనియు, రెట్టమతమున

మ. కపటారాతివిభంజనోద్ధతమతీ కర్ణాట సింహాసనా
ధిపతిప్రాప్తరమాధురీణ కరుణాబ్ధీ కంతుసౌందర్య కా
శ్యపసద్గోత్రపవిత్ర నమ్రతరవాచానైపుణీ నిర్జితా
హిప కామందకకావ్యనాయక కవీంద్రేష్టార్థ సంధాయకా.

తో. భానువంశాగ్రణీ బంధుచింతామణీ....అనియుఁ గలవు. కావున శాసనము లోని పురుషుఁడే యీ కృతులభర్త యనుటకు సందేహముండదు.

ఇఁక సుదక్షిణాపరిణయమును గుఱించి పంతులవారు తత్కృతిపతి యగు పులిజాల సోమామాత్యుఁడు 1580 సంవత్సర ప్రాంతముల నుండెనని తేలు చున్నదని వ్రాసిరి. అట్లయినఁ దద్గ్రంథకర్త యగు తెనాలి యన్నయ్య కన్న యగు రామకృష్ణుఁ డెట్లు 1650 సంవత్సరములకుఁ దరువాత నుండ సంభవిం చును ? పులిజాల సోమామాత్యుఁడు కోనేటి తిమ్మరాజు కొడు కగు రామరాజు నొద్ద మంత్రియై యుండెను. రామరాయలకు మనుమని వరుస యగు కోనేటి రామరాజు బుక్కయరామరాజునకుఁ బెద్దకుమారుని సంతతిలోఁ జేరినందున 1560 లకే యళియరామరాయలకు మనుమలు కలిగినందున వీరు నాకాలమువా రనుటకు సందేహింపఁ బనిలేదు. కావున సుదక్షిణాపరిణయరచనాకాలముకూడ 1565 అగుచున్నది.

మఱియుఁ గ్రీ. శ. 1542 పరాభవ సంవత్సరమున గండికోట ప్రభువు కందాళ యప్పలాచార్యునకు భూదాన మిచ్చినట్లు భూదానశాసనము గలదు. అతనికి సమకాలికుఁ డగు రామకృష్ణుఁడు నూతేండ్ల పిదప నెట్లుండును ? వైష్ణవాచార్యుల యొద్ద ముద్రాధారణమును గైకొనువారెల్లరు వారలకు శిష్యులే. ఈ వ్యాసమునఁ జూపిన శిష్యు లెల్లరు ముద్రాంకన శిష్యులు కాని విద్యాశిష్యులు కారు. కావున బాల గురువుల యొద్దను దక్షిణామూర్తికిఁ బలె వృద్ధశిష్యు లుండవచ్చును.

మఱియుఁ దెన్నాలి రామభద్రకవి యిందుమతీకల్యాణమునఁ గృతిపతిని గూర్చి,

గీ. తిరుమల శ్రీనివాసాఖ్య దేశికునకుఁ
బ్రబల షడ్దర్శనైక పారంగతునకు
శ్రీవరార్చనాదరునకు శిష్యుఁ డగుచు
భక్తి చిగురెత్తఁ గృష్ణభూపాలుఁ డలరు.

అని చెప్పెను. కర్మవిపాక మను కృతిలోఁ దత్కర్త యగు తిరుమల వేంకటా చార్యుఁడు తమ పూర్వుల మహాప్రాభవము వర్ణించుకొనుచు నిట్లు చెప్పుచున్నాఁడు.

అంగిరసగోత్రులలో, శఠమర్షణుని వంశమున శొట్టముని జనించెః వారి పరంపరలో నాళవందారు తిరుమలనంబియుఁ దాతాచార్యుఁడునుఁ దిరుమలయుఁ బెద్దార్యుఁడును గ్రమముగా జనించిరి. పెద్దార్యునకు నలుగురు పుత్రులు; తాతయ్య, చినతిరుమలయ్య, కొండమయ్య, సింగరయ్య. వీరిలోఁ దాతయ్యకే పంచమత

భంజన తాతాచార్య లని పౌరుషనామము. వారికొమారుఁడు కంచితాతాచార్యుఁడు నేటూరి పరిష్కారుఁడునై యుండె. చినతిరుమలయ్య కొమారులు తాతయ్య. పెద్దయ్య, రామానుజయ్య.

వీరు ముప్వురును

తే. గురువు లార్వీటికులతిలకులకు బుక్క
రాజ పరతిమ్మరాజసత్ప్రభుల కెలమి.

ఉ. క్ష్మానుతకీర్తిశాలి యగు కందనవోల్పెదరామరాజభూ
జానికిఁ దాత లానుగుణశాలులు బుక్కవిభుండుఁ దిమ్మరా
జానృపు లాత్మశిష్యులుగ నట్లు ప్రవర్ధిలు ముప్వు రందు రా
మానుజసద్గురుల్ గురువులై రిభనేతకు శత్రుజేతకున్.

ఈ పెద్దయార్యున కహోబల, వేంకట, శ్రీనివాసాచార్య లను ముప్వురు పుత్రులు. చినతిరుమలాచార్యునితమ్ముఁడు సింగరాచార్యుఁడు. విష్ణుపురాణకృతికర్త యగు బసవయరాఘవునకు గురువు. పెద్దయార్యుని కుమారుఁడు శ్రీనివాసాచార్యుఁడు. కందనవోలు కోనేటి తిమ్మాధీశ్వరునకు గురువు. అతని మనుమఁడు శ్రీనివాసాచార్యుఁడు నంద్యాల కృష్ణరాజునకు గురువు. పెద్దార్యుని తమ్ముఁడు రామానుజుని ముమ్మనుమఁడు శ్రీనివాసాచార్యుఁడే పాలచురి కృష్ణభూపాలునకు గురువు. పెద్దార్యుని పుత్రుఁడగు నహోబలాచార్యుని ముమ్మనుమఁడు (స్త్రీ సంతానమూలకముగా) పూడూరి శోభనాద్రిరాజునకు గురువై కర్మవిపాకమును 1650 లో విరచించెను. ఈ గురు పరంపరను బట్టి చూడఁగా నిందుమతీకల్యాణమునకు భర్తయు గర్తయు సుమారు 1590-1600 సంవత్సరములలో నుండినట్లు తేలుచున్నది. అప్పుడు రామకృష్ణుఁడు తన మనుమని కంటె 50 సంవత్సరములు తరువాత నుండె ననుట కేవల మైంద్రజాలికలీలావిలాసమే.

ఇఁకఁ గందర్పకేతువిలాసము చిట్టమంత్రి కంకితముగా రచింపఁబడినది. ఈ చిట్టమంత్రి నాదెండ్ల యప్పనగోపనలకు సన్నిహితజ్ఞాతియు సమకాలికుఁ డగు "చిట్టరస" అను నతఁడే యైనయెడల నాకృతియు 1545 ప్రాంతములో రచింపఁబడి యుండవలయు. అప్పాజి యను నామము సాళ్వతిమ్మరుసునకుఁ గాక యతని మేనల్లుఁడగు నాదెండ్ల యప్పయమంత్రికే చెల్లు నని నా యభిప్రాయము.

పై సందర్భము లన్నియుఁ గూర్చి యూహింపఁగా రామకృష్ణకవి కృష్ణ రాయల సభలో నూత్నయౌవనముఁ జెల్లించి తిరుమలరాయల రాజ్యకాలమునకు వృద్ధుఁడై ఘటికాచల మాహాత్మ్య కృతిలోఁ జేవడకుచుండును.

ఘటికాచల మాహాత్మ్యము కృతినందిన ఖండోరాయనికే గిరియప్ప యను కవి ద్విపద నలచరిత్ర మంకిత మొసఁగి యున్నాఁడు. నలుగురు ఖండోరాయలలో నితఁ డేకాలమువాఁ డని యూహించుటకుఁ గొంత యాధారము లభించినది కాదు. వారిలో నొకఁడు 1600 సం. ములో నుండినట్లును, మఱియొకఁడు 1684 లో నుండినట్లును శాసనములు గలవు. ఖండోజి కాలమున రామకృష్ణుని మనుమఁ డుండినందున నిది స్పష్టముగాఁ దెలిసినఁ గొంత యాధార మగును. నాకుఁ దోచిన యంశముల బయలుపఱచితిని; చరిత్రకారులు తమ పరిశ్రమముతోఁ జేర్చి యూహించినచో నిశ్చయము బయలు పడును.

—మానవల్లి రామకృష్ణకవి*

---

* ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక. 1914

# యక్షగానములు

## (జక్కుల పాటలు)

సరస్వతీ పవిత్రాణాం జాతి స్తత్ర న దేహినాం
వ్యాసస్పర్థీ కులాలో భూ ద్యద్ద్రోణో భారతే కవిః.

అని రాజశేఖరమహాకవి చెప్పిన సుభాషితము కలదు. "సరస్వతీపవిత్రు లగు దేహులకు— అనఁగా సరస్వతీదేవి యనుగ్రహమునకుఁ బాత్రము లైన మానవులకు— జాతి యంతప్రాముఖ్యము కాదు. ఎట్లనఁగా; భరతఖండమునందున్న ద్రోణుఁ డను కవి జాతినిబట్టి కుమ్మరియైనను, సమస్త వేదవేదాంగములను సాకల్యముగా నధిగమించి వేదవ్యాసుఁ డను బిరుదము నొంది భారత మను పేరితో పంచమవేదమును రచించిన వ్యాసమహర్షితో కవిత్వవిషయమున స్పర్థ చేయు వాఁడుగ నయ్యెను" అని పై సుభాషితమునకు తాత్పర్యము. ప్రస్తుతము ఈ వ్యాసమున చర్చింపఁ బోవుచున్న యక్షగానముల విషయమున మనము ఈ పై సుభాషితపు టర్థమును ఆదర్శముగా నుంచుకొనవలెను.

### ఆంధ్రవాఙ్మయము తొలిరూపము—యక్షగానములు :

ఆంధ్రవాఙ్మయము చిరప్రవర్థమాన మగు రసాలముతోఁ బోల్పఁదగి ప్రతిభానిధులును ప్రాభవోపేంద్రులును నగు పండితోత్తములును ప్రభువతంసులును పోషకత్వమును వహించి సర్వాంగపరిపూర్ణతను సర్వాభరణభూషితతను నెఱవేర్పఁ గలిగినను, రసాలపుప్రాదుర్భావకాలమునుండి స్వార్థరహితబుద్ధులై యగణ్యములును అనివార్యములును నగు ననేక కష్టనిష్ఠురములకు లోనయ్యును బాలారిష్టాదిబాధలు వొరయకుండ నన్యత నిసుమంతయైన నొందనీయక, సౌకుమార్యమును దొలంగనీక అప్రమత్తులై అహర్నిశమును తత్పరిరక్షణాసక్తమతులై పెంచి పోషించి కలయంతలో గౌరవించి కృతార్థులైన మన జక్కుల (యక్షులని వీరి పేరును మనవారు సంస్కరించినారు) వాఙ్మయమును గురించి చర్చించుకొనుట మనము నిర్వహింపవలసిన ధర్మముల నొక్కటియని నా భావము. ఇందుల కంగీకరింపని యాంధ్రవాఙ్మయవేత్తలు నుందురా ? ఆంధ్రదేశమునందలి వివేకఘనులగు ప్రాచీనజాతులవారిలో జక్కులు బవినీడులు మున్నగువారు మిక్కిలి ప్రాచీ

నులు. వీరు మంచి మేధావులును సంగీత సాహిత్యముల సారము నెఱిఁగినవారును మాత్రమే గాక చిత్రకళాకౌశలమునందును నద్వితీయు లని పేరొందినవారు. ఇంత వఱకును మన జక్కులు తొలుదొలుత విజ్ఞానపూర్ణ మగు జాతికి చేరినవారై సంగీతసాహిత్యములను అభివృద్ధిచేసినారు. కాని కాలవశమున భారతవర్షము నందలి తక్కినజాతులలో వలెనే, వీరిలోను- ఉన్నతి ఆదర్శము శుచిశీలములు వంశానుస్మృతిధర్మములు మున్నగునవి నశించి ఆ స్థానము నందు స్వజాతి విస్మరత్వము శీలభ్రంశత అవనతి మున్నగునవి ప్రవేశించినవి. తోడనే వారధఃపతితులైరి. ఆంధ్రదేశమునందు ప్రాచీనకళాకౌశల్యమును వెలువరింపఁజాలిన స్మరణచిహ్నము లేవైన వాఙ్మయ రూపమున నున్నవని మనము తలంతుమేని అయ్యవి జక్కుల పాటలును, జక్కుల యాటలును జక్కుల చిత్రకళాకౌశలములును మాత్రమే యగును గాని వేఱుకావు మన కిపుడు లభ్యమైనంత వరకు గల యక్షగాన వాఙ్మయమును విమర్శించుకొన్నచో ఈ విషయములకు తగినంతటి యాధారములు లభ్యములు కాగలవు. కాని ప్రకృతము స్థాలీపులాకన్యాయమున వారి ప్రాచీనస్థితిని మిగుల సంగ్రహముగాఁ ప్రదర్శింపగలిగిన ఒకటిరెండుదాహరణముల నిచ్చుచున్నాను.

సీ. కోణాగ్రసంఘర్ష ఘుమఘుమధ్వని తార
  కంఠస్వరంబుతో గారవింప
మసిబొట్టు బోనాన నసలు కొల్పిన కన్ను
  కొడుపుచేఁ దాటించునెరపఁ దరప
శ్రుతికి నుత్కర్షంబుఁ జూపంగవలయుచోఁ
  జెవిత్రాడు బిగియించు జీవగఱ్ఱ
గిల్కు గిల్కున మ్రోయు కింకిణీగుచ్ఛంబు
  తాళమానంబుతో మేళవింప
తే. రాగముననుండి లంఘించురాగమునకు
నురుదుయూరుద్వయంబుపై నొత్తిగిల్లి
కామవల్లీ మహాలక్ష్మి కైటభారి
వలపు పాడుచు వచ్చె జక్కులపురంధ్రి.
సీ. ముద్రికామాణిక్యములదీప్తి కెంగేలి
  పింఛంబు గుంచెతోఁ బ్రస్తరింప

నుపవాసమునమన్న యువిదనన్నని కౌను
చనుదోయిభరమున జలదరింప
తోకచుక్కలఁబోలు తోరంపు తెలికన్ను
లావైశమునసిగ్గు నతకరింప
నిద్దంపువెలిపట్టు నెఱికదూలినయప్డు
తొడలమించులువెలి దొంగలింప

తే. ఉరుమ చప్పుళ్ళకునుఁ బిళ్ళ ధొరులమ్రోత
కంతకంతకుఁ బేరుబ్బు నావహింప
నాడె బీటలపై నోలిఁ గూడియున్న
యక్క లేద్వురిలో నొక్క యలరుఁబోడి.

ఈ పద్యములు క్రీ. వె. పదునాల్గవశతాబ్దిలోనివాఁ డగు వల్లభరాయని క్రీడాభిరామములోనివి. ఇది రచనావిన్యాసమును బట్టి దశరూపకాంతర్భాగ మగు వీథిలో చేరినది. ఇందలి నాయకుఁడు అగు మంచనశర్మ ఓరుగంటిపురంబున విహరించి ఆయావిశేషములను తెలిసికొనుచు కామెపల్లివారి భాగవతకలాపములోని లక్ష్మీనారాయణుల ప్రేమఘట్టమును బాడుచు జక్కులవారిచిన్నది నృత్యము చేయు సందర్భమును వర్ణించుటను ఉదాహృతము లగుపద్యములు తెలుపుచున్నవి. దీనిని బట్టి పదునాల్గవశతాబ్దినాటికి యక్షగానములప్రచారము ఎక్కుడుగా నున్నట్టు మన మూహింపవచ్చును. మఱియును యక్షగానములు అనగా ఆ కాలములోని జక్కుల పాటలే అనియును, ఆ కాలమందు పర్వదినములలో సంతానకాంక్షు లగు శ్రీమంతులు శుభార్థులై జక్కులను బిలిపించి వారిచేతఁ బాటలఁ బాడించు నాచార ముండె ననియును తెలియుచున్నది.

యక్షులు అను పదమునకు మనపండితులు జక్కులు అనునది తద్భవరూప మని వ్యవహరించునాచార మున్నది. కాని జక్కులు అనుమాట కేవలమును దేశ్య మని నా భావము. మనవారు దేశ్యశబ్దముల కనేకమునకు ఆర్యతాప్రాకట్యమునకుఁ గాబోలు– సంస్కృతరూపములను కల్పించి వ్యత్యయము చేసి, సంస్కృతభవత్వమును అనుగ్రహించియున్నారు. ఈ వాడుక మనపండితులకుఁ గ్రొత్తకాదు. తెలుగుఁపదమునకు త్రిలింగాదిరూపములు గల్పించుట మున్నగువానిఁ బరీక్షించినచో పైని చెప్పిన మనవారివాడుకలో గలఁ యాథార్థ్యము తేలగలదు. అప్రస్తుత మగు ఈ విషయము నింతటితో విడిచి ప్రకృతమునకు వత్తము. మొత్తముమీఁద

యక్షు లనగా జక్కులనియును. యక్షగానము లనఁగా జక్కులపాట లనియును తేలి నది. ఇప్పుడిపుడు మనవారు ఈ యక్షగానములను నాటకాంతర్భేదములనుగాఁ బరిగణించి నాటకచర్చ చేయునప్పుడు ఈ యక్షగానములను గూడ నందు చేర్పు చున్నారు. కాని ఇదియంత న్యాయ్యముకాదు. ఇప్పటి నాటకములలోఁ గల కొన్ని ఛాయలు యక్షగానములందు గన్పట్టినంతమాత్రమున వీనిని నాటకములకు పూర్వ రూపములుగాఁ బేర్కొనఁదగునా? అభినయప్రధానము లగు నాటకములలో సంగీత ప్రధానము లగు యక్షగానములను చేర్చుటవలన లాభ మేమి? దీనిని మనవారు చర్చింపవలసియున్నది.

## యక్షగానముల ప్రాచీనత :

ఇక మనము యక్షగానములప్రాచీ నతను కనిపెట్టవలసియున్నది. వెనుక నొకవిధముగా యక్షగానములు ఆంధ్రవాఙ్మయమునందలి ఆద్యదశను సూచించు భాగమునకు జేరిన వని సూక్ష్మరీతిని వ్రాసియున్నాము. అనఁగా ఆంధ్రవాఙ్మయ రసాలము తొలుత యక్షగానములు (జక్కులపాటలు) మున్నగువాని రూపమున నంకురించి కాలక్రమమున దోహదవిశేషములు జరుగుకొలఁదిని వ్రేళ్ళునాటుకొని. ద్విపదగాఁ బరిణమిల్లి- అటుపైని గద్యపద్యోభయాత్మకముగా వెలసి ఈ మన కాలమునాఁటికి విశ్వరూపమున వెలయుచున్న దని మా భావము. ఉదాహరించుటకు ప్రాథమికరూప మైన ఆ కాలమునాఁటి గానవాఙ్మయ మిప్పుడు అదృశ్యమే యైనను కొన్ని యుక్తులవలన నా కాలమునందు యక్షగానాదుల ప్రచార మున్నట్లు ఋజువు చేయవచ్చును :

"పదములు తుమ్మెద పదముల్ ప్రభాత, పదములు పర్వతపదము లానంద, పదములు శంకరపదముల్ నివాళి, పదములు తాలేసుపదములు గొబ్బి, పదములు వెన్నెలపదములు నంజ, వర్ణన మెఱి గణవర్ణన పదము, లర్ణవఘోష ఘూర్ణిల్లుచు నుండఁ బాడుచు నాడుచు బరమహర్షమున, గూడి సద్భక్త సంకుల మేగుదేర."

ఈ యుదాహృతపంక్తులు పండితారాధ్యుని చరిత్రములోనివి. పండితా రాధ్యుఁడు వాదార్థమై వెలనాటిచోడుని సభ కేగునప్పుడు ఆయన శిష్యులును అను యాయులును నగు శివభక్తులు కొందఱు తుమ్మెదపదములు ప్రభాతపదములు వెన్నెలపదములు మున్నగువానిని పాడుచు నతనివెంట ఆసభకు పోయినట్లున్న సందర్భము నివి తెల్పుచున్నవి. ఈ బంతులలో నుద్ధృతము లైన తుమ్మెదపద

ములు ప్రభాతపదములు వెన్నెలపదములు మొదలగునవి కేవల మొక్క యక్షగానములందు మాత్రమే గ్రథితము లగుచున్నవి. ఆంధ్రవాఙ్మయములోఁ గల తక్కిన ఏరీతిగ్రంథములలోను కూర్పఁ బడక ఇవి యక్షగానములలో మాత్రమే యుండుటచేత పండితారాధ్యుని కాలమున నియ్యవి జనసామాన్యమునందు ఎక్కుడుగ ఎక్కుడుగ ప్రచారపథమున నున్నట్లు- బాల్యదశను గడచి యౌవనదశ ననుభవించుచున్నట్లు తోచుచున్నది. కావున యక్షగానములు ఆంధ్రవాఙ్మయపు ఆద్యదశను వివరించు గ్రంథము లని మనము నిర్ణయింపవచ్చును. కాని ఒక చిక్కు మాత్రము గలదు. ప్రస్తుతము మనకు అగపడుచున్న యక్షగానములు యక్షగాన యుగపు అంతిమభాగపుగ్రంథము లగుటచేత భాషానిబంధాదులలోఁ గల వైరూప్య సారూప్యాదులను పోల్చుకొనఁజాలము. కాని ఈ లోపము లుప్తవాఙ్మయపు ప్రతి భాగమునకును జెందు సామాన్యవిధి యగుటచేత నంతగా మనము పాటింప ననవసర మనుకొందము. అయినను రచనలలో గొంత భేదము లేకపోలేదు. మఱియును యక్షగానముల ప్రాచీనతను స్థిరపఱచుకొనుట కింతకంటెను బలవత్తర మగు సాధన మింకొకటి కలదు. ప్రబంధాదిని మనవారు షష్ఠ్యంతములను చేర్చినట్లే యక్షగానము లందును షష్ఠ్యంతము లుపనిబద్ధము లై యుండును. దీనినిబట్టి చూచినను కూడ యక్షగానములకు గల ప్రాచీనత వెల్లడికాఁగలదు. ఇట్టివాని నింకను ప్రదర్శింప వచ్చును గాని విస్తరభీతిని విరమింతును.

యక్షగానముల నిర్మాణరీతి తత్పరిణామము మున్నగునవి :

ఆంధ్రవాఙ్మయమునందలి తక్కిన గ్రంథజాలపునిర్మాణపథము కంటె యక్షగానముల నిర్మాణములో అపూర్వములును అద్భుతములును ప్రశంస్యములును గద్యపద్యాదులకు మార్గదర్శకములు నగురీతులు కొన్ని యున్నవి. ఉపక్రమోప సంహారములు- కృత్యాదిప్రస్తావనలు- పాత్రప్రవేశ తత్సంభాషణములు- దదనుసృతము లగు వృత్తముల పోకడలు- గానముల యభినివేశములు రసపోషణక్రమము ఛందోనియమములు- పదవిన్యాసములు భావప్రదర్శనపథములు మున్నగునవి ఇందులకు సాధనములుగా గ్రహించి మనము చర్చించెదమేని ఈ యంశము స్పష్టమగును.

యుద్ధములు మున్నగు కారణములవలనగాని, మఱి యితరవిధము లగు కారాణములవలనగాని తమతమ సతీత్వవీరప్రసూత్వాదులను ప్రదర్శించి యతి

సాహసమున వీరస్వర్గమును జూఱగొని పేరటాండ్రై వెలసిన ఆంధ్రనారీమణుల చరిత్రములను తొలుదొల్లటి జక్కులు తమకుగల గానప్రౌఢిమచే శ్రోతల మన శ్శరీరములు రసాతిరేకమునఁ బులకలెత్తునట్లుగ కీర్తించెడివారు. ఇట్లు కీర్తింపఁ బడిన సతీచరిత్రములు కొన్ని ఈనాటివఱకును పలనాడు మున్నగు ప్రదేశములలో గల జక్కులయొద్ద మనము కనుగొనవచ్చును. ఇట్లు దేశీయనాయికానాయక గుణ గణోత్కర్షలను వెల్లడించుటకై బయలువెడలిన యీ వాఙ్మయప్రవాహమును ఎవ్వరో కొందఱు తప్ప, తక్కిన యాంధ్రదేశమువారందఱును పవిత్రభావమునఁ దిలకించుటయే గాక, శుభశోభనాదు లగు కార్యసందర్భములందును జక్కులను పిలిపించి సుహృద్బాంధవపరివారమున కానందముఁ గూర్చుటకై కీర్తింపఁజేయు నాచారము గూడ మననారిలో నున్నది. ఉదాహరణముగా వల్లభరాయని క్రీడాభి రామమును చూడుడు :

"ఇదె యీయింటి యజమానుండు సంతానకాంక్షి యై ప్రతిబంధనార్థంబు యక్షకన్యలం బరీక్షారాధనంబు సేయుచున్నవాఁడు గావలయు."

—17వ పేజి 189 ప.

ఈ వల్లభరాయని వీథిలో చెప్పఁబడిన అక్కలు పాడినపాటలు ఇప్పుడు మనలో అక్కలపాటలు అక్కమహాదేవి కథలు కామేశ్వరిపాటలు కులదేవతల పాటలు అను పేరులతో వ్యవహరింపబడుచున్న పాటలే యగునా ? లేక భిన్న ములా ? విమర్శకులు పరీక్షింపఁదగును.

ప్రాచీనము లగు యక్షగానముల నిర్మాణరీతులను విమర్శించుటకు ప్రకృతము అయ్యవి అలభ్యములు. ఈ కాలమున మనకు లభించుచున్న యక్షగానములలో నెల్ల మిక్కిలి ప్రాచీనములైనవి గరుడాచలము నీలాచలము ననునవియే. గరుడా చల నాటకమును రచించినది ఓబనమంత్రి యని యొక నానుడి యున్నది. కాని ఈ యోబన మంత్రి ఏకాలమువాఁడో ఎవ్వరో నిర్ణయింపఁ గల యాధారములు ఆ గ్రంథమునం దేమియును గానరావు. గరుడాచల నీలాచల నాటకముల కంటె ప్రాచీనము లగు యక్షగానములు తదితరము లిపుడు లేవు గనుక మనము యక్ష గానముల నిర్మాణరీతులను ఇప్పటికి వాని యాధారముననే చర్చించుకొనవలయును.

యక్షగానములు నా చూచినంతనే ముత్తెఱగులుగా నున్నవి. జైనమతవిజృం భణకాలమునకు వెనుకటివి మొదటితరగతివి. ఆ పిమ్మటివి అనఁగా శైవమతా

నంతరము రచితములై వ్యాప్తిలోనికి వచ్చినవి రెండవతరగతివి. ఆ పిమ్మటివి- అనఁగా నేఁటిదనుక ప్రచారములో నున్న ఆధునిక రచనల మూఁడవ తరగతివి అని యొక స్థూలవిభాగమును మొదట నేర్పఱచుకొందము. తొలుతటి వానిలో సాధారణముగా ప్రప్రథమమున సంస్కృతభాషయందు గ్రథితములైన మంగళ శ్లోకములు గలిగి. పిదప శైవవైష్ణవాది మతాచార్యులస్తోత్ర ములు, ఆపిమ్మట జంపెలను పేరుతో నొప్పెడి యొక విధములగు గేయములు కలిగి, కథ యారంభ మగును. కథయారంభమైనది మొదలుకొని చివఱవఱకును సందర్భములకు తగు మాత్రముగా నుండి సహజధోరణిని సూచింప గల శృంగారరసము తఱచు గాన వచ్చుచుండునే కాని, ప్రబంధయుగమున మితిమీఱినంతటి దుస్థితి వీనిలోఁ గాన రాదు. వర్ణనలు సహజములును మృదువులునై యుండి కల్పనాక్లిష్టతయు భావ గోప్యమును లేక ప్రాకృతస్థితిని వెల్లడింపఁ జాలియుండును. ఈ కాలము వానిలో తొలుత కథారంభమునకు పూర్వము గూర్చెడి జంపెలలో సాధారణముగా మన ప్రబంధములందుఁ గలరీతిని షష్ఠ్యంతములు నెలకొల్పఁబడియుండుటను మనము గాంచగలము. దీనినిబట్టి షష్ఠ్యంతముల యాచారము మనకు మిక్కిలి ప్రాచీన మని తేటపడుచున్నది. మఱియును రచనాసంవిధానములయందు నుత్తమపాత్రముల ప్రవేశపెట్టవలసినచోట ద్విపదలును కవి తనంతతాను విషయమును ప్రదర్శింప వలసినచోటుల జంపెలును, పాత్రలపరస్పర సంవాదమును విశదము చేయవలసిన చోటుల కందార్థములును, స్తుతులు విన్నపములు జోహారులు చేయవలసిన స్థలములలో దండకములును, సీసములును నెలకొల్పఁబడి యున్నవి. పద్యయుగ మున సంస్కృతవాసనావాసితములై మన గ్రంథముల కెక్కిన చంపక మత్తేభ శార్దూలాది వృత్తము లిందు తఱచు కానరావు. కాని వానిస్థానమున సీసము కందము గీతము చూర్ణికలు అర్ధచంద్రికలు త్రిపుటలు ఏలలు మున్నగు జాతీయ ఛందములు విచ్చలవిడిగా గానవచ్చుచుండును. ఆంధ్రభాషాగేయ ప్రధానమని యును స్వచ్ఛందముగఁ బెరిగిన దనియు ననుటకు దీనిని గూడ నొకకారణముగా తీసికొనవచ్చును. మఱియు నీకాలము వానిలోఁ గూర్పఁబడిన ధూపహారతి పాటలు మున్నగువానిని బట్టి మనవారు జనసామాన్యమున మతాదరాభినివేశములఁ గలిగించుట కును, వారిని తమప్రక్క కాకర్షించుటకు పండితులే కొందఱు రమ్యఫణితిని ఈ పాటలను వ్రాసియున్నట్లును మనకు గోచరించును. ఒక్కొక్కచోట పామరహృద యమునకు గోచరింపని శాస్త్రీయ విషయముల కూర్పుండుట ఈ విషయమున దృఢ మగు సాక్ష్యము నీయఁగలదు.

ఇఁకను మధ్యకాలపు వానిలో పైని బేర్కొన్న విషయములు మార్పు నొందుటను మనము కనిపెట్టగలము. వీనిలో పైవానివలె తమమతమునకు సంబంధించినంతమట్టునకు వలసిన యాదరాభినివేశములను మాత్రమే ప్రదర్శించి యూరకుండక, విమతస్థులఁ జేయు పరిహాసపద్ధతులును, ఒక్కొక్కచోట నతిమాత్ర మనఁదగిన శృంగారవర్ణనాతిరేకములును, ఆత్మశ్లాఘామూలకందము లనఁదగు కుకవినిందాదిగ్రంథములును యక్షగానగ్రంథనిర్మాతలు గూర్పసాగిరి. ఈ మధ్యకాలపు యక్షగానములలో జంపెలతో చేయు కథారంభదశ యొక్కింత మాఱి, అందులకు బదులుగా- తెర వెడలి వచ్చుట సంధివాక్యముల యోజనలు మున్నగాగల నిరర్థకములగు దాంభికప్రక్రియలు తలసూపినట్లు అందలి వర్ణనము లనుబట్టి మనము గ్రహింపవచ్చును, తొల్లిటి హార్దికపారిశుద్ధ్యము విశుద్ధప్రేమ మున్నగునవి అంతరించి వానికి బదులుగా వేశాకోశములు వింతవింతలగు భావోదయములు వీనిలో నంకురించినవి. ఇఁకను చెప్పవలసిన దేమున్నది ? మున్ముందు ఈ పాటలు పొందఁగల దుర్దశల కన్నింటికిని అంకురారోపణము ఈ మధ్యకాలపు యక్షగానవాఙ్మయమున నుదయించిన దనిన చాలదా ?

విద్యాధనప్రౌఢవాదుల నుత్తము లగు వారి పథకములను పామరసామాన్య మనుకరింపఁ జూచుచుండు ననుటకు భిన్నముగా దేశీయుల యాదరాతిశయములఁ బట్టియో, లేక మతేకారణమునుబట్టియో యక్షగానములను విరచనసేయుటలో ఆ కాలమున నొకరిద్దరు పండితులు గూడ నడ్పికట్టిరి. యక్షగాన విరచనము తమ పాండిత్యమున కొక ప్రౌఢతగా గూడ నెన్నుకొని ప్రకటించుకొనిరి. కాని వారి రచనలలో పాండిత్యప్రభావములు వెల్లడియయ్యెనే గాని సహజమధురములగు గాన ఫణతులు గాని కల్పనలు గాని కథారచనా నివేశములుగాని నెలకొనఁజాలక పోయినవి.

ఈ స్థితి యిట్లుండ నల్పప్రజ్ఞావిభవులుగూడ యక్షగానముల రచించి పేరొందవలయు నను తలంపుతో దొరకిన కథ నెల్ల వర్ణ్యాంశమునుగా గ్రహించి రచనల సాగింప నారంభించిరి. ఈ కాలము గ్రంథములే యక్షగానములలో మూఁడవ తరగతికిఁ జేరినవి యగును. ఈ గ్రంథములకు గ్రంథవిరచయితలకుఁ దగినట్లుగా దేశసుస్థితిలోఁ గూడ నొక విధమగు దుర్దినచ్ఛాయ లావరించుటచేతఁ గాఁబోలు మోటతనములను సూచించు శృంగారహాస్యరసములును, మృదుమధురము లగు కందార్థలకు బదులుగా సీసార్థములు దరువులును, కొండవీటి చేఁద్రాడుల ననుకరించుచు

గుణరహితములును కృత్రిమములు నగు కల్పనలును వర్ణనములును బయలువెడలి నవి. యక్షగానముల యథఃపతనమునకు ఇయ్యవి అంత ప్రముఖములైన కారణ ములు కాకున్నను అట్టి కారణవర్గములో వీనికిని గొంతస్థలము నీయక తప్పదు. ఇఁక నీ చర్చను ఇంతతో నిలిపి, యక్షగానములందు కూర్పఁబడిన గానముల స్వభావమును సౌకుమార్య సారళ్యములను బోధపఱుపుటకై కొన్నిగానముల నుదా హరణార్థమై యుద్ధరింతును. వీనిని చదువుటకు వాని యానుపూర్వి నెఱిఁగియుండ వలసిన దనుట ముఖ్యమే. ఐనను యక్షగాన వాఙ్మయమునందుఁగల ఛందోవిశేష ములు గొంతవరకు పాఠకుల మనస్సులకు స్ఫురింపవచ్చునను నమ్మకముతో నిట్లు చేయుట యైనది. ఇందు ఉదాహరించిన గానములక్రమము—అవి ప్రచారమునకు వచ్చిన కాలక్రమము ననుసరించి వ్రాయబడుచున్నయవి ; 1. జంపె, 2. కందా ర్థాదులు, 3. ద్విపద. 4. ద్విపదార్థము, 5. లాలిజోలలు, 6. ధూపారతిదీపార తులు, 7. త్రిపుటకురుజంపెలు, 8. చంద్రికలు అర్ధచంద్రికలు, 9. సింధు (చిందు ?) రగడలు, 10. వెన్నెలలు-విన్నపములు, 11. ధవళము-త్రిభం గులు, 12. సువ్విపాటలు, 13. మేలుకొలుపులు, 14. పరిశిష్టగానములు.

1. జంపె : శ్రీరమేశపురారి విధులను – చేరికొలుతున్ ముదమున శ్రీరమాసతి గౌరివాణుల – సేవజేతున్.

2. కందార్థములు : (1) గురుపరమేశుల భక్తిని, పరగఁగ మది నిల్పి తత్త్వపారాయణులై, పరతత్త్వబోధ దెల్పెదు, పరిపూర్ణుల భక్తిఁ దలతుపర మూగ నిల్పి, తద్దాస్యము నిరతము నలిపీ. పరిపరివిధముల దిరిగెడు చిత్తము స్థిరము లేనిపాప, చింత మాన్పు మని, పరముగ నిలిపీ – తద్దాస్య, మూస్థిరముగ నలిపీ.

3. ద్విపద : వినవయ్య తనయుల వృత్తాంతమెల్ల, గనుగొన భ్రమలెల్ల గ్రక్కునఁ బాయు.

4. ద్విపదార్థము : కొందఱుమందులు కూర్మితో సుతుల, యందు మోహంబుచే నలరుదు రెపుడు గాన – బుత్రులదుఃఖముఁ వినవయ్య తెల్పెదా, పూని కనుగొను మనిశము.

ద్విపదార్థములవలెనే సీసపద్యముపైని సీసార్థములను ఒకవిధమగు ఛందము కూడ ఏర్పాటు చేయఁబడినది. ఉదాహరణమునకై —

సీసార్ధము : పురుషుని వీర్యంబు పొందుగా హెచ్చిన పురుషుఁడై యుదయించు భూమియందు, తరుణులరక్త మంతట హెచ్చుఁ దురుణియౌ సమమైన షండుడౌ సత్యముగను. కుడిప్రక్కఁ బురుషుండు కుదురుగా నివసించు వామభాగంబున వనిత సరియుండు, మధ్యమందున షండుడౌ నిజముగా, తెలిసీమదిలోనఁ గొల్వరా - చిద్గుహవెలుఁగు - దేవా మదితోఁ దల్వరా - పురుషులూ గర్భమున పొలతూల కున్నపుడె, తరచుగ గ్రౌర్యములు తప్పక పుట్టును — తెలిసీ మదిలో గొల్వరా.

5. లాలిజోలపాటలు : (1) లాలిపాట : లాలిపాడుచు నూచరమ్మా — కృష్ణ, లీలామృతము గ్రోలరమ్మా—(ఇది ప్రాచీనకాలపుది) (2) లాలి బాడి లాలించారే బాలకృష్ణునీ — భక్తి, లోలురై వర్తింపగదరే శీలకృష్ణునీ - (ఇది మధ్యకాలపుది.) (3) లాలి శ్రీకృష్ణ లాలి - పరమాత్మ, లాలి మాయన్న లాలీ-(ఇది చివఱకాలపుది) (2) జోలపాట : జోజో గోపాలా, భక్తైకలోలా.

N. B : ఇందులో రెండవరకపుది రెండవరకపు లాలిపాటవలె నున్నది.

6. ధూపారతి దీపారతులు : ధూపోయం ఘో రపాపా దూరయతే సర్వ తాపస హృదయ ధ్వాంత దీపాయతే - హరహర. (ఇవి ఇప్పటి జంగముల పాటలను పోలియున్నవి. కాని శైవులనాఁటి యక్షగానములలో వీనికి ప్రచారము అధికమని తోఁచుచున్నది.)

7. త్రిపుట, కురుజంపెలు ; (1) త్రిపుట - మగని నీవని పల్కఁకూడదు, మహితభక్తిని మీ రటంచును, తగును బల్కఁగ నెట్టి యాటల, దనరియున్నన్. (2) కురుజంపె : పతిని నరుఁ డనుచు నే-మతిహీన నై దేవ, తతిఁగొలిచి యానరక తతిలోనఁ బడితిన్, కుమత గురువులమాట కోరి విని పతిని - దైవమని కొల్వక నరకవనధిలోఁ బడితిన్.

8. చంద్రికలు, అర్ధచంద్రికలు : అర్ధచంద్రికలు : పడతికిని పాలిండ్లపైన నఱపు దోచెన్. మట్టిపై రుచి గగ్గె మానినీమణికిన్. సన్నుతాంగియు భర్తృసంగతిని గోరెన్. ఇభరాజవదన పతియెడ ప్రేమ హెచ్చెన్.

9. సింధు : భామామణి వినుము - యమప, ట్టణములోని చట్టములెల్లా.

N. B. : ఇవి మిక్కిలి ప్రాచీన ప్రతులలోనే యున్నవి. ఇప్పటి చిందా ?

ఐహుశః ఇవి ఇప్పటి చిందుల కొక్క యుదాహరణము ; వెయ్యిర -

దమ్వెయ్వెయ్, మఱి, మొయ్యర అమ్మోర్ని మొయ్, (2) రగడ : సిరివరుఁడు న త్తెరవు, చేరవచ్చినఁ జూచి, కరము మద మొదవమది, కలకలన్నియుఁ ద్రోచి.

10. వెన్నెలలు - విన్నపములు : (1) నూకాలమ్మను కొలవగానే - వెన్నెలాలో - మీద, నూకానికే పెండ్లి యయ్యె వెన్నెలాలో, (2) విన్నపములు : శ్రీరామజయరామ శృంగారరామ గారామూనను బ్రోవు కరుణాసముద్రా. నాలోని జాలి నీకే, లా తోచదురా? మనసిచ్చి నాతోను, మాటాడవేరా? వీనిని పల్లెటూరి తిరు నాళ్ళలో గరుడ స్తంభము పెట్టుకొని భజనచేయువా రిప్పటికిని పాడుచున్నారు.

11. ధవళము - త్రిభంగులు : (1) ధవళము : శ్రీకరపుణ్యశరీరా! ప్రాకటవంశోద్ధారా!... త త్త్వవిచారా! చెల్లరెచిక్కన! బళిరా.

ఇవి యన్నియును శైవులయక్షగానములలో చాలగలవు. (2) త్రిభంగులు : పసపూసందఱు మేనబూసి - మంచి - పాలునేతులు చల్లాబోసి, బిసరుద్రాక్షలు గుములుకూడి - దొడ్డ - బిడ్డిని వాసంతమూడి.

12. సువ్విపాటలు: తండ్రి కైక కొసగు వరముఁ దలచి సీతాలక్ష్మణులతో, దండకాననము కరుగునుద్దండరామా! సువ్వీసువ్వాలే. ఇంకొకవిధము సువ్విపాట : సువ్వీసువ్వాలే. సువ్వీసువ్వాలే, సువ్వి సువ్వీ యనుచు సువ్వీయనుచూను, సువ్వి బాడరారె సుదతులందారూ - సువ్వీసువ్వాలే.

13. మేలుకొలుపులు : (1) మేలుకొనవే చిన్నికృష్ణా మేలుకొను శేషావ తారా! మేలుకొను కేశవకుమారా, మేలుకొనవయ్యా - కృష్ణా - మేలుకొనవయ్య.

14. పరిశిష్టములగు గానములు : (1) ఏలలు - మొదలుమీదా కొనలు క్రిందా, మొలచి యున్నా చింతలోన, పదిలమై పద్మములు పూచెనే-ఓగొల్లభామా, కదిసిచూడా కానుపించూనే! (2) మంగళహారతులు : శ్రీలక్ష్మీనాథాయ మంగళం-పో - షితభ క్తయూథాయ మంగళమ్. వాగీశ ముఖ్యగీర్వాణ వందితాయ, భోగీశ శయనాయ భువనరక్షకాయ - శ్రీలక్ష్మీనాథాయ మంగళమ్. (3) అల్లోనేరేళ్ళు : (1) అల్లోనేరేడల్లో, చెలగి కృష్ణుం డనుచుఁ జెప్పరే మీరు. (2) కరివేల్పు మన దొరకు, గలిగెనేనేడు - సిరివరునివలె వితఁడు - చెలగుచున్నాడు - అల్లో నేరేడల్లో.

ఇంకను యక్షగానములలో – లయగ్రాహి కవిరాజ విరాజితము పంచచామరము మత్తకోకిల మున్నగు కొన్ని వృత్తములుకూడ వచ్చుచుండును. కాని అవి మనవారికి పరిచితపూర్వము లగుటచేత నిందు ఉదాహరింపలేదు

యక్షగానముల పతనదశ :

జక్కులు తొలుదొలుత చక్కని విశ్రాంతులును మృదుమధురరీతులను సరసఫణతులును నొప్పారిన గానములను కూర్చి, దేశకాలపాత్రానుసారము వానిని వ్యాప్తి నొందించుచు వచ్చినను రానురాను మననాఁటికి బొత్తుగ ప్రచారపథమునుండి తొలఁగి మాఱుమూలలవారి వాఙ్మయము పడియుండవలసి వచ్చుటకు కొన్ని విశేషకారణములు గలవు. అందులో నీ క్రింద వివరించిన మూఁడును ముఖ్య కారణము లని నా భావము. (1) సమర్థులు నిర్వహింపఁదగిన పనుల కసమర్థులు నిర్వహింపఁ బూనుకొనుట (2) ప్రదర్శనములందు కేవలము సభ్యుల కభిరుచి గల మార్గము లవలంబించుట (3) అసభ్యశృంగారము ఈ ముత్తెఱఁగులను ఈ వాఙ్మయము అవనతినొందిన విధము ఈ క్రింద సూచింపఁబడును.

1. సమర్థులు నిర్వహింపవలసిన పనుల నసమర్థులు నిర్వహింపఁ బూనుకొనుట. తొలుతనుండియును జక్కులు ఈ గానములను వంశానుస్మృతమగు నభినివేశముతో నిర్వర్తింపుచుండఁగా, దేశీయులు వారికి చేయు గౌరవాదరములను చూచి తమరు నట్టి గౌరవాదరముల నొందుటకై – బవినీడులు, దాసరులు, పెద్దింటి గొల్లలు, పెఱికలు (ఒక జాతివారు) మున్నగు జాతులవా రిందులకై పాల్పడిరి. దీనివలన యక్షగానకళ యభివృద్ధి నొందుటకు బదులుగా జక్కులలో లుప్తప్రచారము నొందియును, తక్కువఁగల వారివలన సముచిత లాలిత్యాదులందు పుష్టి బడయజాలకయును, నశింప దొరకొనినది. ఇం దాశ్చర్య మేమి ? ఎవ్వరివలన నెయ్యది నిర్వర్తింపబడవలయునో, అయ్యది వారివలన నిర్వర్తితము కానప్పుడు నశించుటకన్న వేఱొకగతి కన్పట్టి కుండుట సాజమేకదా !

2. రెండవ కారణము ప్రదర్శనమునందు సభ్యులరుచి ననుసరించి మార్పులుచేయుట– ఈ కారణము ముఖ్యముగా గమనింపదగినది. యక్షగానములు పాడుటలోను నాడుటలోను తొలుత కొలఁదిమంది ప్రదర్శకులచే నిర్వర్తింపఁబడుచుండినను– రానురాను ఆ యాచారము మాఱి, బహుళసంఖ్యాకులగు నటకు లున్నఁగాని ప్రేక్షకులకు రుచింపదయ్యెను. ఈ ప్రేక్షకాభిరుచిని చేపట్టుటచేత– ప్రేక్షకాభి

రుచుల విభాగము ననుసరించి ప్రదర్శక విభాగములును- ప్రదర్శకాభిరుచుల విభాగము ననుసరించి గ్రంథనిర్మాతల మార్గములును- వేఱ్వేఱై తీర్థమునకు తీర్థము ప్రసాదమునకు ప్రసాదమునై ఎవరిదారి వారిదై కుక్కలు చించిన వస్త్రమైనది. ఈ దశ భాగవతమేళములుగాఁ గూడి యక్షగానములను ప్రదర్శించునాఁటికే ఏర్పడినది. దీనికితోడు కాలమునఁ బ్రదర్శక సంఘములలో గూడ నైకమత్యము క్షీణించుటచే ఎవరిమట్టునకు వారు ధనోత్సాహ మ్మనుకొనుట గూడ కొంతకారణ మైనది.

3. మూఁడవది అసభ్యశృంగారము : గానములయందేమి కావ్యములయందేమి నాటకములందేమి నీతిజాత్యాచారాదుల కవిరుద్ధముగ లోకయాత్రానిర్వహణ విధులను ప్రదర్శించుట ముఖ్యము. అట్లుగాక మన యక్షగానములలో పైని చెప్పిన భాగవతమేళములు తోలుబొమ్మలాటలుగా మాఱిపోలఁదిని- సరసహృదయానురంజము నైతికప్రవర్తనము- లోకయాత్రాదిగ్దర్శనము- ఏటిలో కలిపి గాంధోళిగాని గడబిడలతో- కేవలము పామరజనుల రంజనమునకై యక్షగాన గ్రంథకర్తలును తత్ప్రదర్శకసమాజములును- వాని నాదరించి చూచి తనియుచున్న సభ్యప్రపంచమును- మునిఁగి ముప్పందు మను న్యాయమునకు పాల్పడుట సంభవించినది. కేవలము మహాపవిత్రము లని పేర్కొనఁబడిన శృంగార వీరహాస్యాది రసము లిట్టి అసభ్యతకు పాల్పడ నారంభించిన కాలము మొదలుకొనియే మన యక్షగానములకును పతనదశ యారంభమై- చివఱ కీనాఁటికి యక్షగానముల ప్రచారము నామమాత్రావశిష్టమై- ప్రాచీనకళావిభవమును సంస్మరించుటకైన దగిన యాధారములు లేక- సారస్వత చర్చలందు, ప్రాముఖ్యస్థానము వీనికి లేకున్న లేకపోవుఁగాక- ప్రవేశముగూడ దొరకనంతటి దుస్థితికి వచ్చి నశించిపోవుచున్నవి. ఎంత ఘోరము!!

ఇఁక నీవ్యాసము నింతతో ముగించుటకు ముందు నింతవఱకును ఆంధ్ర వాఙ్మయమునందు ప్రచారబాహుళ్యము నొందిన కొన్ని యక్షగానముల పేరులను ఆ యక్షగానములను రచించిన కవుల పేరులను తెలుపఁగల పట్టికను ఈ క్రింద నిచ్చుచున్నాము. ఇందులో స్థాలీపులాకన్యాయము ననుసరించి ప్రధాన గ్రంథములే అకారాదిగా చూపఁబడినవి.

(1) అహల్యా సంక్రందనీయము - కా. ఉదయాచలము (2) ఉషాపరిణయము - అనంతకవి (3) ఉషాపరిణయము - ఆనందదాసు (4) ఉషాపరిణ

యము - వేములపల్లె వారిది. వేంకట సుబ్బకవి (5) కుచేలోపాఖ్యానము - సుబ్బ లింగాచారి (6) కుశలవనాటకము - అనంతదాసు (7) గరుడాచలము - ఓలయ మంత్రి (8) గయానాటకము - కాశీపతి ఆనారి (9) గుత్తెనదీవి రామాయణము- రాఘవకవి (10) గోపాలవిలాసము - శ్రీనివాసాచార్యుడు (11) గోపాలవిలా సము - పాకనాటి గణపతిరెడ్డి (12) దేవయాని చరిత్రము - యాదవదాసు (13) ధర్మపురి రామాయణము - శేషాచలదాసు (14) ధర్మాంగద చరిత్రము- నరసింహకవి (15) ధర్మాంగద చరిత్రము - స. వేంకటదాసు 16. ధ్రువోపాఖ్యా నము - బెహరా అప్పలనరసింహము (17) నందినాటకము - కోదండరామకవి (18) నలచరిత్రము - కోదండరామకవి (19) నిజలింగ చిక్కయ్య చరిత్ర - పిడుపర్తి నిమ్మయ్యకవి (20) నృసింహ చరిత్రము - రా. అప్పాజీకవి (21) పర తత్త్వసుధానిధి - సోమసుందర మొదలి (22) ప్రహ్లాదనాటకము - తిరునారా యణాచారి (23) పతివ్రతామాహాత్మ్యము - కా. రాఘవాచారి (24) ప్రహ్లాద నాటకము - రామానుజసూరి (25) ప్రహ్లాదనాటకము - బొడ్డుచెర్ల సుబ్బకవి (26) ప్రహ్లాదనాటకము - లక్ష్మణదాసుకవి (17) ప్రహ్లాదభక్త విజయము - త్యాగరాజు (కృతులు రచించిన త్యాగరాజే) (28) పోట్లదుర్తి జలక్రీడలు - రామ రాజు (29) బాణాసుర విజయము - వీరనారాయణకవి (30) భాగవతము - వేంకటాచలదాసు (31) భల్లాణ చరిత్ర-జక్కన్న సాంబయ్యగార్లు (32) మార్కం డేయ విలాసము - కాశిదాసు (33) మృత్యుంజయ విలాసము - గోగులపాటి కూర్మనాథకవి (34) యతిరాజ విలాసము - సుందరనాయనారు శేషాచలదాసకవి (35) రామనాటకము - అనంతదాసకవి (36) రామనాటకము - శఠగోపా చార్యుడు (37) రామాయణము - శేషగిరిదాసు (38) రామానుజ విజయము - నరసింహాచారి (39) రంగనాథ విలాసము - లింగము వేంకట్రాయమంత్రి (40) రుక్మిణీకల్యాణము - రాజా లక్ష్మాజీ (41) రుక్మాంగద చరిత్రము - రాజ లింగకవి (42) రుక్మాంగద చరిత్రము - కవిపేరు తెలియదు (43) రుక్మాంగద చరిత్రము - పాపారాయసుధి (44) లేపాక్షిరామాయణము - వేంకటరాయమహా కవి (45) లేపాక్షి కృష్ణనాటకము - వేంకటరాయకవి (46) వసురాజ విలా సము - క్రొత్తమాగుల శేషాచార్యులు (47) వల్లవీపల్లవము - శింగాచార్యులు (48) వామనచరిత్ర- మృత్యుంజయకవి (49) వేంకటేశ్వర విలాసము - సూర్య కవి (50) శశిరేఖాపరిణయము - రంగాచార్యులు (51) శశాంక విలాసము - కవిపేరు లేదు (52) శర్వరీ విజయము - కవిపేరు లేదు (53) శర్మిష్ఠావిలా

సము - వేంకటదాసు (54) శూర్పణఖా భంగము-కవిపేరులేదు (55) సముద్ర మథనము - కృ. శేషాచలదాసు (56) సారంగధర - కోదండరామకవి (57) సానందోపాఖ్యానము - కవిపేరు లేదు (58) సారంగధర చరిత్రము - కవిపేరు లేదు (59) సీతాకల్యాణము - రామన్నకవి (60) సీతాపహరణము - కవిపేరులేదు (61) సీతాకల్యాణము-చిత్రకూటం వేంకటశేషయ్యదాసు(62)సుగ్రీవ విజయము - రుద్రకవి (63) సుధాస్వాదనము - వేంకటదాసు (64) హనుమంత విజయము - కవిపేరు లేదు (65) హాలాహల పానము - కవిపేరు లేదు (66) హంసక విలాసము - పరమానందకవి (67) హనుమద్విజయము - పేరు తెలియదు.

—పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి*

* ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక. 1921.

# దేశభాషాస్థానము

"Neither English nor any other foreign Language (tongue appears to have the slightest chance of becoming the vernacular speech of any portion of the inhabitants of Southern India. The indeginous Dravidian languages which have maintained their ground for more than two thousand years against Sanskrit, the language of a numerous powerful and sacerdotal race may be expected to resist successfully the encrochments of every other tongue."

—Bishop Caldwell

[దక్షిణహిందూదేశము నందలి జనులలో నేభాగపు వారికి నింగ్లీషు గాని మఱి యేదైన బరభాష గాని దేశభాష యగుట కవకాశము కాన్పింపదు. మతాచార్యులుగ నధికారవంతులుగ నుండిన యార్యుల సంస్కృతము తోడనే రెండువేల సంవత్సరముల నుండి పోరాడుచు స్వపదభ్రష్టములు కాని ద్రావిడభాషలు మరియొక విదేశభాషకు జోటిచ్చి తా మదృశ్యము లగు నని తలంపరాదు.]

మనదేశమునం (తెలుగుదేశము) దిప్పుడు మూడు భాషలు పోరాడుచున్నవి. అవి సంస్కృతము, తెలుగు, ఇంగ్లీషు. సంస్కృతము మనబుద్ధి కందరాని పూర్వకాలమున నార్యులు వ్యవహరించిన భాష. ఇంగ్లీషు విదేశీయులైన మనప్రభువుల భాష. తెలుగు మనభాష. కేవలము సంస్కృతము చదువుకొనిన యాతనివద్దకు వెళ్ళి "ఏభాషయందు మన మెక్కువ యభిమానము చూపవలయును? ఏది వృద్ధి యగుటకు మనము పాటుపడవలెను?" అని యడుగుడు.

"నాయనా మామాట లెందుకు పనికొస్తాయి? సంస్కృతం దేశభాష. దాన్ని చూచేవాడే లేడు. ఈ నడమంత్రపుభాషలన్నీ యిప్పు డొచ్చాయి. ఇవ్వన్ని పొట్టకూటిభాషలుగాని వాట్ని చదువుతే ఒక మోక్ష మున్నదా ఒక ముక్తి వున్నదా!" అని చెప్పును. ఇంగ్లీషు పండితు నడుగుడు. "I love my mother tongue more than anything else and I believe in the statement that vernacular should be made the medium of thought in our Country," అని ఇంగ్లీషులోనే చెప్పును. మరియొక

ఘుడు "Why do you trouble yourself with the insignificant vernaculars which are going to disappear within a quarter of a Century?"

అని యీసడించును. శాస్త్రులవారి కంటికి దెలుగొక భాషయే కాదు. తెలుగు వ్రాయుట, తెలుగు మాటలాడుట మఱచినవారు కడపటి యిద్దరు మహానుభావులు ఈ మూడు తరగతుల మనుష్యులకే మన తెలుగువారిలో జదివికొనినవారని పేరు. సంస్కృతమా? తెలుగా? ఇంగ్లీషా? మన కిప్పుడు ప్రధానము అనునది యొక యనల్ప ప్రశ్నగా నున్నది. "హిందూదేశమున నైకమత్యము కలుగవలయు నేని నేక భాషనే జను లుపయోగింపవలయును" అన్ని దేశములందు వ్యాపించినది. అందరును గౌరవించునది, అందరకును సమానమైనది సంస్కృతమే కావున నదియే హిందూదేశమునకు సామాన్యభాషగా నుండవలయు నని కొందఱు వాదించు చున్నారు. జనసంఖ్యలో జాలా భాగమునకు హిందీ తెలియును గాన హిందీయే సామాన్యభాషగా నుండవలయు నని కొందరందురు. "అదికాదు, ఇదికాదు ఇంగ్లీషే మనకు సామాన్యభాషగా నుండవలయు" నని మఱికొంద రనుచున్నారు. కాని యివి అన్నియును గేవల భావప్రపంచంబున మెలంగువారి యూహలు. బిషపు విల్కిన్సు మొదలగు పాశ్చాత్యపండితులు కొంద రిట్లే తమ గదులయందలి పడక కుర్చీలలోఁ గూర్చుండి సర్వప్రపంచ సామాన్యభాషను గూర్చి కలవరించిరి. మాక్సుమోలరునకు గూడ నీమైకము సోకినట్లే తోచుచున్నది. కలలు నిజమగు దినములు వచ్చినప్పుడు మనదేశభాష లన్నిటికి బదులొక వింతభాష యాదేశముగా వచ్చునేమో యూహింప జాలను. వైదికభాషనుండి సంస్కృతము, సంస్కృతము నుండి గౌడభాషలు నుత్పన్నములైన విధమును మొదటి వ్యాసములో గన్ప రిచితిని. ద్రావిడభాషలు మాఱ్పు చెందిన విధము కూడ గొంత వివరించితిని. హిందూదేశమునం దీభాష లుండక తప్పవు. ఇవి స్వాభావికముగ నేర్పడినవి. దీనిని దీసివేయు మనుష్యుడు సమర్థుడు కాడు. ఇది మూఢవిశ్వాస మందురా? కాదు. తర్కసాధ్యంబు. ఒకవేళ రాజశాసనముచే హిందూదేశమున కంతటికి నొక్క భాషను దేనినైనఁ బ్రవర్తింపఁజేయఁ జూచిన యెడల నా భాష కొన్ని తరములు గడచునప్పటికి వివిధము కాకమానదు. స్వరభేదముచేత, వస్తుభేదము చేత ననేకము లైన మార్పులు కలుగకమానవు. అప్పుడు ముల్లుదీసి కొఱ్ఱుదచిన చందమగును. ఏవో యమానుష తంత్రములు పన్ని మహాశక్తితో నేకభాషను సుస్థిరముగా

జేయగల రనుకొనుడు. మనకవుల గానములు, పూర్వుల చరిత్రలు కోల్పోవుట యెంత యపాయకరము? ఈ యపాయము సంభవింపగూడ దని సంభవింప దని నమ్మవలసి యున్నది.

భారతమాత మహాక్షమావతి. అనేక వైదేశికుల దండయాత్రల కోర్చినది. పలు పరరాజుల సింహాసనములను మోసినది. కాని యాత్మగౌరవమును మాత్ర మెన్నడును కోల్పోయినది కాదు.

సిథియనులు, పారశీకులు, గ్రీకులు, హిందూసిథియనులు, హూణులు మన హిందూదేశమున దండయాత్రలు సల్పిరి. మహమ్మదీయులు, మఘలులు చిరకాలము రాజ్యము చేసిరి. ఒకజాతివా రేదేశము నైన నాక్రమించుకొన్నప్పుడు బలహీనులైన యా దేశవాసులపైఁ దమ భాషను, మతమును విధించుటకు బ్రయత్నించుట మనము చరిత్రయందు చూచుచున్నాము. అది మనుష్యునికి స్వాభావికము. ఆర్యుల నార్యులమీదను, మహమ్మదీయులు హిందువులమీదను తమ భాష మతములను విధించుటకు జేసిన యత్నములు హిందూదేశచరిత్ర చదివినవారందరు నెరుగుదురు. కాని యీప్రయత్నములు మతము మీద సాగినట్లు మన భాషమీద సాగలేదు. ఆర్యులు తమ మతమును మాత్ర మనార్యులలో గొంత వరకుఁ జొప్పించిరి. భాషను జొప్పింప గలిగిరా? లేదు, లేదు. "కావలసిన యెడలఁ గొన్ని పదములు మాత్రము తీసికొందము. అవసరమైన యెడల నెత్తిని బెట్టుకొని గౌరవింతము. కాని నిన్ను మా స్థానములోని కేనాటకి రానీయము" అని ద్రావిడభాషలు సంస్కృతము నెదిరించి యాపినవి. వరరుచి ప్రాకృత వ్యాకరణ నిర్మాణమునందును, గుణాఢ్యుని బృహత్కథారచన మందును దేశభాషలకును సంస్కృతమునకును జరిగిన పోరాటమును గనుగొనవచ్చును. అనార్యులు కొందఱింకను సంస్కృతభాషాసంపర్కములేని తమ మాతృభాషనే వాడుకొనుచున్నారు. తమిళభాషా వ్యాకరణము సంస్కృతమున కిప్పటికి నేమాత్రము చోటిచ్చుచున్నది?

మహమ్మదీయులును దమ మతమును గొంతవఱకు నెలకొల్పిరి గాని యేడెనిమిది వందల సంవత్సరములు ప్రభుత్వము చేసినను మన భాషాసత్వములు వినాశనము చేయఁ గలిగిరా? లేదు. దానికి బదులుగ మన పల్లెటూళ్ళయందలి పీరుసాహేబులకు, జానుసాహెబులకుఁ దెలుఁగే మాతృభాష యగుచున్నది. ఐన దని కూడఁ జెప్పవచ్చును.

ఎఱుకల, కోయ, సవర, లంబాడి మొదలగు నడవి జాతులవారు నాగరికతను బొంది జనులలోఁ గలిసిమెలసి యుండుకాలమున వారిభాష లాయాప్రాంతముల యందలి ప్రధానభాషలలో గలిసి పోవును గాని యిదివరకే నాగరికతను బొంది దాదాపు రెండుకోట్లమంది జను లేకదేశస్థులై వ్యవహరించుచున్న మన తెలుగు బాస వంటి బాసలు మాత్రము దేనిలోను గలసిపోఁజాలవు. సుస్థిరములుగా నాఁటికొనిన దేశభాషలకు పరభాష లాదేశములు కానేరవు. ఇంగ్లీషున కింత రాజాదరణము కలిగియుండినను మనదేశమునం దిది స్వల్పసంఖ్యాకులైన జనులలో మాత్రమే వ్యాపించియున్నది. 1911 వ సంవత్సరపు జనాభా ప్రకారము తెలుగుదేశములో 200 మంది కొక్కఁ డింగ్లీషు తెలిసినవా డున్నాడు. ఈ కొద్దిమందిలో నాల్గవ తరగతి వరకు జదివి చాలించిన వారు మొదలు యం. ఏ. పరీక్షయం దారితేఱిన వారి పర్యంతము నందరు చేరి యున్నారు. ఈ కొలదిమందిలో నైన నీ యింగ్లీషెంతవఱకు ఫలప్రదమైనది? అని చూచినచో నిరాశయే కలుగుచున్నది. ఉద్యోగము, గౌరవము కీర్తి వీనికొఱకు గాక దేశహితార్థము, విద్యనభ్యసించువారు గాని విద్యను వినియోగించువారు గాని మనదేశము నందు నల్వురైదుగురైన గలరో లేరో యనుమానమే.

రాజకీయ వ్యవహారములు తెలుసుకొనుటకు ప్రభువుల భాషను నేర్చుట మనకు మహమ్మదీయుల కాలమునుండి యలవాటైన పనిగనేయున్నది. కాని జీవితమంత మేధావంతులు పరభాషలోఁ గడపుట దేశమునకు శ్రేయస్కరము కాదు. జీవితమంత పరభాషయందే గడపిన కొందఱు మహానుభావులకు దేశభాష యన్నఁ దృణప్రాయముగ నున్నది. దానిపై ద్వేషముకూడ గొందఱకు గలుగుచున్నది. చెన్నపురి పచ్చయ్యప్ప కళాశాలలోఁ బ్రకృతిశాస్త్ర పండితులుగ నుండి గొప్పపేరు పొందిన లక్ష్మీనరసునాయుడుగారి వంటి శాస్త్రవేత్తల పరిజ్ఞానము మాతృదేశమున కజాగళస్తనముగా నున్నదిగదా యని చింత కలుగుచున్నది. జనులకు పరభాషలయందు శాస్త్రజ్ఞానము వర్ధిల్లనేరదు. అది ఫలవంతమును గాదు. సంస్కృతము వ్యవహృతభాషగ నత్యున్నతదశయం దుండిన కాలమున దర్క వ్యాకరణాది శాస్త్రంబులు బయలుదేఱినవి. నూతన సిద్ధాంతములు పుట్టినవి. పూర్వపక్షములు వెంబడించినవి. సంస్కృతము వాడుకనుండి తప్పిన తరువాత జనించిన నూతనశాస్త్ర మొక్కటి వ్రేలుమడిచి చూపుఁడు. ఇప్పటి పండితు లాశాస్త్రములను జదివి గర్వించి యొకరితో నొకరు కలహించుట తప్ప శాస్త్రచరిత్రమున కొక్క

పుటయైనఁ గ్రొత్తగఁ జేర్చిన వారొకరేనిఁ గలరా ? ఇఁక నింగ్లీషువంటి పరభాషల యందు మనము స్వతంత్రించి శాస్త్రజ్ఞానమును విస్తరింపఁజేయఁ గలమా యని విచారింపనేల ? సున్నాకైనఁ జేయఁగాలము. కావున విద్య మనకు దేశభాష యందే యుండవలయును. పాశ్చాత్యుల ప్రకృతిశాస్త్రముల జ్ఞానము జనులయందు దేశభాషల మూలముననే వ్యాపింపవలయును. దేశభాషదే ప్రధానస్థాన మని మనము గ్రహింపవలసి యున్నది. సంస్కృతమునకు ప్రధానస్థానము చాలాకాలము క్రిందటనే పోయినది. పాఠశాలలయం దిప్పు డింగ్లీషు ప్రధానముగా నున్నది. ప్రధాన స్థానము నాక్రమింపవలసినది దేశభాషయేకాని యింగ్లీషు కాదు. అయితే యుండవలసిన గ్రంథములన్ని దేశభాషయం దేర్పడిన తరువాత దానికిఁ బ్రధానస్థాన మీయవలయునా ? లేక యిచ్చిన తరువాత నేర్పడునా యని విచారింపవలసి యున్నది. ఇతర దేశభాషాచరిత్రముల నవలోకించినచో భాషలన్ని మొదటఁ బ్రధానస్థానము వహించియుండ పిమ్మట సమగ్రములైనట్లు తెలియఁగలదు. జపాను భాష యివ్విధమునఁగాదా వర్ధిల్లినది. ప్రభువు లీధర్మసూక్ష్మమును గ్రహించి మన దేశభాషను బ్రధానముగఁ జేయు దనుక మనము చేతులు ముడిచికొని యూరకుండ రాదు. భాష కేవిధమైన యపాయములు వచ్చుచున్నను వెంటనే వానిని నివారించు చుండవలయును. గరుడాచల నాటకము, కుసలాయికములలో నున్నట్టి యపభ్రంశపు గూఁతలు గల కొన్ని గ్రంథములు విద్యార్థులు పారాయణము చేయవలసినగతి సంభవించినది. ఇంగ్లీషువ్రాయుట, యింగ్లీషు మాటలాడుటయే గౌరవచిహ్నమైనది. ఇట్టి మహాపాయములు మనభాషకు సంభవించినవే యని యధైర్యము చెందనక్కఱ లేదు. తగిన ప్రయత్నములు చేసినచో నీ ముప్పులు తొలఁగిపోఁ గలవు.

ఉద్గ్రంథములు, శాస్త్రములు, తెలుగులో రచింపవలసియున్నది. కొలఁది దినముల క్రిందటనే సుమతిశతకమును సంస్కృతములోనికి మార్చిన యతనిని నేను స్వయముగ నెఱుగుదును. ఇట్టి నిష్ప్రయోజక కార్యములు మాని మంచి గ్రంథములు తెలుఁగులోనే వ్రాయఁ గడంగవలయును. ఈ మధ్యమునఁ దెలుఁగు దేశమును గుఱించిన యొక పుస్తకము గుంటూరిలో నొక రింగ్లీషుభాష యందు వ్రాసిరఁట ! వీరి భాషాభిమానము, దేశాభిమానము స్తుతిపాత్రములు ! తెలుఁగువా

రందఱు చదువవలసిన యా గ్రంథమును దెలుఁగులో వ్రాయకుండ స్వల్పప్రయోజనమును బురస్కరించుకొని యింగ్లీషులో నేల వ్రాయవలయునో తెలియకున్నది. ఆంధ్రోద్యమమును గూర్చి తెలుఁగువార లెదుట నింగ్లీషులోఁ గొంద ఱుపన్యాసము లిచ్చుచున్నారఁట! ఈ దురభ్యాసము మనవారియం దింక నెన్నిదినము లుండునో తెలియదు. ఒకప్పుడు తెలుఁగువ్యాకరణములు సంస్కృతమందును దెలుఁగు కవుల చరిత్రము లింగ్లీషునందును వ్రాయుచుండిరి. ఆ కాలము పోవుచున్న దని దృఢవిశ్వాసము కలిగియున్నాను. అంధకారము విరయుచున్నది. తూర్పురేఖలు కాన్పించుచున్నవి. దిఙ్మండలమునందు వెలుంగు పొడకట్టుచున్నది. ఆశాబింబ ముదయింపుచున్నది.

—అక్కిరాజు ఉమాకాంతం*

---

* ఆంధ్రభారతి. సం. 3. సం. 7. జనవరి 1913.

# శృంఖలా తృణీకరణము

మేము రచించి ప్రచురించిన శ్రవణానంద, పాణిగృహీతలపై విమర్శన మను నెపముతో "పాణిగృహీతా శ్రవణానంద శృంఖల" అను నొక పెద్ద పొత్తము కేవల దూషణప్రధాన మగు వెక్కిరింపులతో వెలువడినది. దానిని ప్రాజ్ఞు లగు పత్రికాధిపతు లింతకు మున్నే నిరసించి ప్రచురించి యున్నారు. విమర్శన కర్తృత్వ సదృశులగు కొందఱు దాని నభినందించి యున్నారు. ఆయా యంశము లను బీతికలోఁ జర్చింపఁ దలఁచి ప్రధానాంశమున కుపక్రమించుచున్నారము. శంక లెట్టి వైనను సమాధానము నపేక్షింపక మానవు. చదువరులలో ననేకులు పరప్ర త్యయనేయబుద్ధు లుండుటచే గ్రంథకర్తలు ప్రతిపక్షుల పూర్వపక్షములకుఁ దోఁచి సమాధానములను ప్రచురించుట తప్పనిపని. విమర్శన సమంజస మను నంశము స్వయముగనే గుఱితింపఁ గలవారికి గ్రంథకర్తృ స్వహస్త లిఖితము లపేక్ష ణీయములు గాకున్నను, దక్కుఁగల వారికి నివి యపేక్షణీయములు కాకపోవు. కొందఱు మొత్తము మీఁద విమర్శనము బాగుగా లేదని మాత్రమే చెప్పఁగలుగు దురు గాని తగినంత యాధారమును జూపఁజాలరు. అట్టివారల కొఱకె యీ పరి శ్రమము చేయఁబూను మమ్ము విజ్ఞలోకము మన్నించుఁగాక

విమర్శనము యుక్తియుక్తమా? కాదా? అను విషయము మాత్రమే చర్చించుట ముఖ్య మగుటచే మే మిందుఁ దక్కు విషయము లనఁగా విమర్శకుని స్వరూపస్వభావపాండిత్యా ద్యప్రస్తుత విషయముల నెత్తికొనక విడిచితిమి. ఇంతియకాక యతని గ్రంథసంక్తులనుగూడ నిం దుదాహరింపక మా సొంత మాటలతో నతని పూర్వపక్ష స్వరూపమును దెల్పుచు మా యెఱింగినంతలో సమా ధానములను లిఖించుచుందుము. సాధ్యమైనంతలో సంగ్రహింపఁదలఁచి మేమీ లొబ్యమున కొడిగట్టితిమి. ఇఁకఁ బ్రకృత మవధరింపుఁడు.

"పాణిగృహీతా శ్రవణానంద శృంఖల" ఈ నామము తప్పు. రచనా కౌశలమును బట్టినచో శ్రవణానందము మొదట నుంచవలసియుండును. అట్లుంచి నచో "శ్రవణానంద పాణిగృహీతా" అని యగును. అప్పుడు విమర్శకుని మనో రథ సిద్ధికి భంగము కలుగును. విమర్శకుఁడు తా నిడిన పేరునకుఁ జెప్పిన యర్థ మే మని? పాణిగృహీతా = లంజెలయొక్క, శ్రవణం = చెవులకు. ఆనందము =

సంతోషము (ఇచ్చునది) అని పేరు. తలక్రిందైనప్పు డిట్టి యర్థమున కవకాశ మెట్లు లుండెడిని? విశేషార్థము రాదు గాని, ఆ రెండు గ్రంథములను గూర్చిన విమర్శన మను నర్థము వచ్చెడిని. కావున నీపే రట్లు మార్చుకొనవలయును.

"శ్రవణానంద మను పేరు న్యాయమా?" న్యాయమే. శ్లేష యమక చక్రవర్తి యగు శ్రీవేంకటాధ్వరి "శ్రవణానంద" మను పేరితో నొక సంస్కృత నాటకమును రచించెను. "ఎవరి చెవులకు?" అని వెక్కిరింప నక్కఱలేదు. అవయము లవయవివినా భూతములుగ నుండవు గావున నుత్థితాకాంక్షావశమున నవయవి యాక్షిప్తమగును. అ యవయవి కవితాస్వాదనార్హ ముగా నుండవలసి వచ్చును. ఐనచో విమర్శకుని వ్రాఁతచొప్పున అనామకు లగు మూర్ఖు లాక్షిప్తు లెట్లగుదురు? పైఁగా విమర్శకుఁడుగారు లంజియ చెవుల కానంద మిడు నని వేఱొకచో వ్రాసినారు. వాండ్రు గూడఁ గవితారసాస్వాదనకుఁ దగు యోగ్యతగలవాం డ్రున్నచో వాండ్రనుగూడ గ్రహించుటలో మా యభ్యంతరము లవమును లేదు. మే మిడిన నామముమాత్రము సహృదయమాత్రాకర్షకము గాని విమర్శకాభిప్రాయము ననుసరింపదు. ఇంతవఱ కెందులకు? లోకులు సామాన్యముగా మంచివస్తువును గూర్చి చర్చించునపుడు "మనోహరముగా నున్నది, హృదయంగమముగా నున్నది" అని వాడుచుండుట యెల్ల రెఱిఁగినదే. అట్టి సట్టునెల్ల 'నెవరి హృదయములకు?' అని యాకాంక్ష తప్పనిదే. అనుగుణ మగు నవయవి యాక్షిప్తము కావలసినదే. సర్వసులభ మగు నీ విషయమున కింతకన్న వ్రాసి పెంచుట యయుక్తము. సహృదయుల శ్రవణముల కానందము నొసఁగునది యను నర్థము తప్ప వేఱొండు కల్పనయిటఁ బ్రాజ్ఞులు చేయరు. అట్టి సహృదయుల లేఖ లెన్నెన్నియో కలవు గాని విస్తరభీతిచే నుపేక్షించి

క. ఒక శ్రవణానందమ్మున
నొక పద్యమునందుఁ గల్గు నొకపాదమునం
దొక యక్కరమున కొసఁగిన
సకల మ్మగు రత్నగర్భ చాలునె తూఁపన్.

అను పద్యమును మాత్ర ముదాహరించుచున్నారము. ఈ పద్యమును బ్రహ్మశ్రీ రామడుగుల సీతారామశాస్త్రులవారు నిర్వ్యాజముగా మాకడ కంపియున్నారు. మున్ను కృష్ణాపత్రికలో నీ పద్యమును, మ. రా. శ్రీ గోటేటి కనకరాజు పంతులు గారు (గవర్నమెంటు ట్రాన్సలేటరు) వ్రాసిన యభిప్రాయమునుం గూడఁ బ్రచు

రించియుంటిమి. ఇట్టి ప్రాజ్ఞుల చెవుల కానంద మిడిన గ్రంథములను అనామకుల యొక్కయు లంజలయొక్కయుఁ విపుల కానంద మిడునవిగా లిఖించిన విమర్శకుని ప్రాజ్ఞలోకము క్షమించుఁ గాక! ఇదిగాక విమర్శకుని త్రోవనుబట్టి విమృష్ట గ్రంథములు లంజలకుఁ గూడ నానంద మీఁ జాలవు విమర్శకుఁ డొకచో "ఇవి విటులను బ్రువ్వఁదిట్టుటచే విటుల కానంద మిడనేరవు" అని వ్రాసియున్నాఁడు. ఇదే యుక్తి నుపచరించినచో నీ గ్రంథములు విటులకన్నను లంజలనే యెక్కువగా దూషించుచున్నవి. ఈ యంశము కబ్బములే వాక్రుచ్చెడివి. కావున వాంధ్రచెవులకు మాత్ర మెట్టు లానంద మిచ్చెడిని? అట్లగుటచేఁ బూర్వపక్షివ్రాఁత తప్పు, తప్పు, తప్పు.

"పాణిగృహీత యను పేరు సమంజసమే యగునా?"

ఈ పేరు జుగుప్సాకర మనియు, నేమో యనియు విమర్శకుని వాదము. దీని వ్యుత్పత్తిం బట్టి చూతము. "పాణిగ్గృహీతోఽన్యాః" "పాణిగృహీతీ" అని సుధాకారకుఁడు వ్రాసెను. ఈ యర్థమునే "పాణిం గృహ్ణీష్వ పాణినా" అను వాల్మీకి వాక్యము ధ్వనింపఁజేయుచున్నది. విధివిహిత మగు పాణిగ్రహణము జరిగిన స్త్రీ పాణిగృహీతి అని చెప్పఁబడును. కావుననే "పాణిగృహీతీ భార్యాయాం" అని వార్తికము పుట్టినది. దీని ననుసరించియే "పత్నీ పాణిగృహీతీ స్యాత్" అని యమరము ప్రవర్తించినది. ఈ పత్నీశబ్దము వలన "ప్రత్యుర్నో యజ్ఞసంయోగే" అను సూత్రము స్మృతికిఁ దగులును. దానిచే యజ్ఞయాగాదులయందు భర్తతో సహాధికారముగల స్త్రీ "పాణిగృహీతి" యనిపించుకొను నని తేలును. అట్టిదికాక కేవల పాణిగ్రహణమును బొందిగిన స్త్రీ అనఁగా గేవల కామనిర్వహణ ప్రయోజనమునకుఁగా స్వీకరింపఁబడినస్త్రీ పాణిగృహీత అని చెప్పఁబడును. కావుననే భట్టోజీ దీక్షితులుగారు "పాణిగృహీతాఽన్యా" అని వ్రాసిరి. ఈ దీక్షితుల వారి పంక్తి నేమి, పై నుదాహరించిన వార్తికముల నేమి మా విమర్శకుఁడు సూత్రములనియే వ్రాసెను. దానివలన నయ్యనఘుని పాండిత్యము లోక మెఱుఁగుఁ గాక!

ప్రకృత మనుసరింతము. పాణిగృహీతా పదము టాబంతము. అనఁగా ఆకారాంతము. పాణిగృహీతీ పదము జీబంతము. అనఁగా ఈకారాంత మనుకొనుఁడు. ఈ రెండు పదములకును నించుమించుగ వ్యుత్పత్తి యొకటియే. రెండవ దానిలో విధివిహితము అను నంశము మాత్ర ముండదు ఈ యంశమును మనమందుంచుకొనియే మేము మా కబ్బములో

ఉ. పాణిగృహీతి యందురు వి
వాహిత యైన సతిఁ జనంతఁ దాఁ
బాణిగ్రహించి యుంచికొను
బానిసతొత్తును శాబ్దికాగ్రణుల్
పాణిగృహీత యందురు. —పాణిగృహీత

అని వ్యాఖ్యానము చేసియుంటిమి. అది యటు లుండుఁగాక. జుగుప్స యనునది పచ్చిబూతుమాటలు వినుటవలనఁ గలుగఁ దగినది. పైపద మట్టిది యని యేప్రాజ్ఞులును పలుకరు. విధివిహితముగాఁ గాక కేవల కామార్థము స్వీకరింపఁబడిన స్త్రీ అను మాత్రముననే జుగుప్స కలుగు నని వాదించువారు గూడ లోకమున నుందురా? ఉందురు గాక!

"కృతాభిషేకా మహిషీ భోగిన్యోఽన్యా నృపస్త్రియః"

గృహీతీ, గృహీతలకుం బోలె మహిషీ భోగినులకును గొండొక విచారించనచో జుగుప్సాకరత్వము జ్ఞానలవదుర్విదగ్ధులు కల్పింపవచ్చును. మహిషి పట్టాభిషేక సమయమున రాజుగారి సింహాసనమున కర్హురాలు. భోగిని అట్టిది కాదు. భోగమాత్ర ప్రయోజనముగా నేర్పడినది. పాణిగృహీతా పద మీ భోగినీపదమునకుం బర్యాయము కావచ్చును గాని భోగినీపదమునకుం బలె సులభముగా దానికి నర్థమును స్ఫురింపదు. గూఢమగు నా పదమే జుగుప్సాకర మగుచో సులభమగు భోగినీ పదము మిగుల జుగుప్సాకరము గాదా! అగునేని—

"భోగినీ సంగతికి రాజు వోవుచుండి" —ఆముక్తమాల్యద

ఇత్యాది ప్రయోగము లెల్ల నింద్యములే కావలయును గదా! భోగము, రతి, సురతము ఇత్యాది పదములవలన జుగుప్స యుదయించునని వ్రాసిన లాక్షణికులు మా యెఱిగినంతలో లేరు. భోగిని అనునర్థ మిచ్చు మాత్రముననే 'పాణిగృహీతా' పదము నింద్య మగుచో, భోగినీపర్యాయము లగు వారకాంత లోనగు పదములును నట్టివియే కావలసి వచ్చును. వారల గుఱించి మహాకవులెల్లఁ బురవర్ణనములలోఁ బ్రతికావ్యమునందును వర్ణించియున్నారు. అదికూడఁ దప్పే కావలయును. వారల నట్లుంతము. ఇది ప్రకృతము నూతనముగా బయలువెడలుచున్న యొక విధమగు సిద్ధాంతము ననుసరించిన యాక్షేపణ యనుకొందము. అయినచో నాక్షేపణ కవకాశ ముండవచ్చును గాని ఈ విమర్శకుఁడుగారు "వారకాంత" అను పేరుతో నాటకమును రచించిన ట్లీ విమర్శనము నందే 97 వ పుటలో వ్రాసికొని యున్నారు.

గూఢార్థము గల పాణిగృహీతా పదమును జూచి ఏవపడు విమర్శకునకు 'వార కాంతా' పదము సమంజస మెట్లయ్యెడిని? దీనింగూర్చి విశేషించి చర్చించినఁ బ్రయోజన ముండదు. విమర్శకునిం గూర్చి సుదర్శనీ పత్రికఁ జదువఁగోరెదము. గ్రంథపరమైనప్పుడు పాణిగృహీతా పదమున కర్థమేమి?

పాణిగృహీత నుద్దేశించి రచించిన గ్రంథ మని యర్థము. విమర్శకుఁడుగారీ సందర్భమున మఱియును సాహసించి యున్నారు. గ్రంథమునకు 'లంజె' అని పేరు పెట్టిన ట్లభిప్రాయపడిరి. కాదంబరి, ఆముక్తమాల్యద లోనగు నామములు నిట్టివే యని ప్రాజ్ఞలోక మెఱుఁగుదురు గాక! ఈ యర్థము వైయాకరణుల వలన విస్పష్టముగా దెలిసికొనవచ్చును విమర్శకుఁ డెట్టివాడైనను దన గ్రంథముపై నిచ్చిన యాక్షేపణల కుత్తర మిచ్చుట గ్రంథకర్తకుఁ దప్పనిపని యని మున్నె చెప్పియుంటిమి. గ్రంథనామవిమర్శనమున కిచ్చిన ప్రత్యుత్తరము వలననే విమర్శకుని పాండితి కొంత తెలిసియుండును. ఏమైనను పై విచారము కొంత శాస్త్రముతో సంబంధించియుండుటచే సర్వసులభముగా బోధపడఁదగినది కాదు. ఈ క్రింది యంశమును దిలకింపుఁడు.

"గృహమునకై వగ మీఱంగఁ జేరి యాత్మగతమునన్."

ఇందు గృహమునకున్ + ఐ అని పదచ్ఛేదము చేసికొనకున్నచో యతి చెడును. ఆత్మశబ్ద ప్రయోగము వలననే పదచ్ఛేదము స్ఫుట మగుచుండగా దానిం గణింపక "గృహమునకై" అనునది చతుర్థ్యంత మని నిర్ధారణ చేసికొని ఎంతో వెక్కిరింపును వినియోగించెను. ఇట్లే—

తే. గీ. తనదు చిత్తమ్మునేనియుఁ దగినసొగసు
గలుగు చెలిమిన్న కడకంపఁ గదలిరాదు
అట్టిచోఁ గేవలాన్యుల ననుప నగునె
దౌత్యమునకన్న సతిపొందు తప్పిదంబె! —పాణిగృహీత

ఈ పద్యములో 'దౌత్యమునకన్న' అను నాల్గవచరణమునకు సందర్భమే లేదని త్రోసివేసెను. పద్యము కఠినశైలిలో నున్నచో నన్వయింపక వెక్కిరించవచ్చునను కొంద మన్న నట్లు లేదు గదా. అయినచో వెక్కిరింపున కవకాశమేమి? సమన్వయించి చూపినచోఁ జదువరులే నిర్ణయించుకొందురు గాన నట్లు చేసెదము.

శ్లో. నపుంసక మితి జ్ఞాత్వా ప్రియాయై ప్రేషితం మనః
తత్తు తత్రైవ రమతే హతాః పాణినా వయం.

ఈశ్లోకము ననుసరించి మేము పైపద్యమును రచించితిమి. తన మనస్సే దూతకృత్యమున కనర్హ మని చెప్పవలసి వచ్చుచుండఁగా నితరు లెట్లు పనికి వత్తురు ? అని శంకించుకొని మరల నట్టి యనుమానము యుక్తము కాదనియు యోగ్యుఁ డగు దూత నాయికాసంపర్కమునకై యత్నింపఁ డనియు సమాధానము రాఁగల దని కొండొక యూహించుకొని తుట్టతుది యర్థాంతరన్యాసము వలన దూతకృత్యమయుక్త మనియు దాని కంగీకరించువానికి నాయికాసంభోగాభిలాష మంత తప్పిదముగాఁ దోఁచకపోవచ్చు ననియు నాయకుఁడు నిర్ణయించినాఁడు. ఈ యంశము రసమంజర్యాదులలో వివరింపఁబడిన యధమనాయకులను మనమందుంచుకొని వర్ణింపఁబడినది. దీనింగూర్చి వర్ణించుట కూడఁ దప్పని విమర్శకుఁడుగా రందురేమో ! అట్లనఁ గూడదు.

శ్లో నిశ్శేషచ్యుత చందనం స్తనతటం నిర్మృష్ట రాగోఽధరః

అనుశ్లోకము నంగీకరింపని లక్షణగ్రంథకర్తలు వేరు. పై శ్లోకము నాయకుని యధమత్వమును దెల్పుట కేర్పడినది యని తజ్ఞు లెఱుఁగుదురు.

శ్లో. దూతి ! త్వయా కృత మహో నిఖిలం మదుక్తం.

అను పుష్పబాణ విలాసగత శ్లోకము గూడ నాయకాధమత్వమునకే యుదాహరణము. ఆయా శ్లోకము లయోగ్యము లని యిప్పటివఱకును నెవ్వరుగాని వ్రాయలేదు. కాని యొక విశేషము మాత్ర ముండును. అధమనాయికానాయకుల కన్న నుత్తమనాయికానాయకులు గరీయస్థానయోగ్యు లని చెప్పక తప్పదు. ఈ యంశము త్తమాధమవిశేషణములే చెప్పుచున్నవి. అయినచో సర్వత్ర యుత్తమాశ్రయముగనే కవిత్వము చెప్పుట యుక్తమేమో. యుక్త మగుట కే సంశయమును లేదు. కాని ప్రతికవియు నొకటే త్రోవను బోవలసి వచ్చును. ఒకరు పోయిన త్రోవనే పోవుటచేఁ దాము స్వతంత్రించి రచించిన కల్పనలు గూడఁ దత్త్వలోచితము లగు కతన నంతకుముందు పోయినవారును బోయియుందురు గానఁ దనకుఁ జౌర్యము నాపాదింప వలసినవి కావలసివచ్చును. ఆయా హేతువులచే భిన్నభిన్న విషయములుగాఁ గవులు కావ్యములు రచించుటకై లాక్షణికులు కొన్ని త్రోవలు చూపియున్నారు. వానిం బట్టి తాథేచ్ఛముగఁ, గవులు ప్రవర్తింపవచ్చును. ఒక కవి కొన్ని యట్టివియు మఱికొన్ని యిట్టివియుఁ గావ్యములు వ్రాయవచ్చును. అట్లే

కానిచోఁ గాళిదాసు రసాభాసమున కుదాహరణ మనఁదగు విక్రమోర్వశీయకథ నెత్తికొని నాటక మేల వ్రాయును. ఊర్వశి దివ్య యైన నగుఁగాక ! ఇంద్రుని యుంపుడుకత్తెలలో నొక్కతె కదా ! అట్టిది పురూరవునియం దనురక్త యై వలచి నదే యందము. రసాభాస మెట్లు వాటింపనగును.

శ్లో. యోషితో బహుసక్తి శ్చేత్.

అను నంశమున కుదాహరణము కాక యెట్లుండును ? తుట్టతుద కూర్వశి మిషవెట్టి తన్ను వంచించిన తటిఁ బురూరవుఁడు పడిన పాటులెల్ల రసాభాసమున కుదాహరణ ములే యగును గదా.

శ్లో. ఏకత్రైవానురాగ శ్చేత్.

తెలుఁగులో మనుచరిత్రము కూడఁ బై లక్షణములు గల యదియే కాన రసాభాస కావ్యమే. ఈ రసాభాసవిషయ మటు లుంతము. ఉత్తమత్వము వేశ్యకన్న సంసారిణియం దెక్కుడుగ నొప్పక తప్పదు. అట్టిచోఁ గాళిదాసు వేశ్య నుద్దేశించి కావ్య మేల వ్రాసెనో కదా ! పెద్దన్న కూడ నదియే త్రోవ నేల వోవలసివచ్చెనో ! దీనిఁబట్టి కవులు స్వీయా, పరకీయా, సామాన్యా అని లాక్షణికు లేర్పఱచిన మూగురు నాయికలను దమ కబ్బములయందు నిరాఘాటముగా వర్ణింపవచ్చు నని సిద్ధాంతిత మగుచున్నది. మఱియు నీ నాయికల యొక్కయుఁ వీరలకు సదృశు లగు నాయకుల యొక్కయుఁ బ్రభేదముల నెల్లఁ గవులు తమతమ కబ్బములయందుఁ గైకొనవచ్చును. కావున నాయికాధమత్వద్యోతక మగు పై పద్యమును రచించుట యుక్తమే. మేము పీఠికలో—

మ. అగుఁ గావ్య మ్మిది యైననుం బ్రహసనప్రాయమ్ము ప్రారంభమా
దిగ దీనన్ బలుచోటులం దొదవు నెంతేనిన్ రసాభాస రో
మగువన్ నాయిక సేఁత దుర్విటుల నిర్మర్యాదవాక్యమ్ము లొ
ప్పుగ దానిన్ వెలయించుఁ బండితులు తప్పుల్ తీతు రేమో కదా!

అను పద్యములో సూత్రప్రాయముగాఁ బై విషయములనెల్ల సూచించియుంటిమి. పద్యరచనాకాలమునకు మాకుఁ గల భయము పండితాక్షేపణలకుఁ బాత్రుల మగుదుమేమో అనునంత వఱకే. ఇటీవల నాభయము పోయినది, సర్వమును దెలి సిన పండితులు గాని వారి లక్షణములు గాని వారి లక్ష్యములు గాని పనికిరాని కాలము వచ్చినది. ఎవరి యిచ్చవచ్చినట్లు వారు శాసనము లేర్పఱుప యత్నించుచున్నారు.

కావునఁ బై పద్యములో 'పామరులు తప్పుల్ తీతురేమో కదా!' అని సవరించుట యుక్తముగాఁ గానవచ్చుచున్నది. అయినచోఁ గవులు పండితప్రీతికిఁ గాక పామర ప్రీతికే లోఁగి కబ్బములు వ్రాయవలసినట్లు స్ఫుటమగును. అట్లు ధ్రువపడెనేని క్రమమైన కవికి మూకీభావముకన్న నుత్తమమగు పని గానరాదు. కావుననే—

ఉ. కైత యొకండు గా దిపుడు కాలము సర్వము మాఱె వ్యర్థపుం
జాతురి హెచ్చె స్వల్ప మగు సాహితితోఁ బెదపెద్ద పొత్తముల్
చూతురు తప్పు దిద్దుదుప శూరత వచ్చెఁ గవీంద్రులందు సీ!
మూతులు గట్టివైచికొనఁ బోలదె సత్కవు లైనవారికిన్.

అని యీ విమృష్టగ్రంథముల పీఠికలలో నొకట వ్రాసియుంటిమి. పై నొనర్చిన చర్చలోఁ గొంత శాఖాచంక్రమణము ప్రకృతపద్యమునకు సంబంధింపకున్నను విందే వేఱొకచో విమర్శకుఁడుగారు వ్రాసినయాక్షేపణను బ్రత్యాఖ్యాన మొనర్చుటకుఁ బనికివచ్చు నని విజ్ఞు లూహింత్రుగాక. గృహమునకై అనుదాని విచారణము వల నను, ప్రకృత విమర్శకుఁడుగారి పరిశీలకతాజ్ఞానము స్ఫుటమగుచున్నది. గాన వీరు శంకించు శంకల కుత్తర మీవలసి యుండునో యుపేక్షింపవలసి యుండునో ప్రాజ్ఞులు విచారింతురు గాక.

సీ. ......సంధ్యావందనమునకు బావగారు,
.జపతపముల కెల్ల సవతితల్లి.
తే. గీ. కవిత యిట్టిది యని చెప్పగాఁ దరంబె. —శ్రవణానందము

పై పద్యములో కవిత్వము సంధ్యావందనమునే చేయనీయని యప్పుడు జపతపమ్ము లను జేయనీయ దని వేఱుగఁ జెప్పుట నిష్ప్రయోజనము, అని విమర్శకుఁడు వ్రాసి యున్నాఁడు- సంధ్యావందన మనఁగా మన విమర్శకుల యభిప్రాయమును బట్టి—

తే. గీ. కడువడిగఁ జిన్ననాఁ డైన వడుగునాఁడు
తడఁబడుచు జెప్పికొన్నట్టి తప్పు సందె
ముక్క లొక్కొక్క నిముసాన ముఖియవచ్చు
బళిర! యనవచ్చు లౌకికబ్రాహ్మణులను, —తెల్గునాఁడు.

అని శ్రీదాసు శ్రీరామకవిగా రాక్షేపించిన విధమైనదిగాఁ దేలుచున్నది. సహస్ర గాయత్రీజపితలు, దశసహస్రగాయత్రీజపితలు లోనగువారిం గూర్చి వీరి

హృదయము ప్రవర్తింపనే లేదు. విమర్శకుఁడుగా రభిప్రాయపడిన సంధ్యావందనము కవులు చేయుదు రను నర్థమును "బావగారు" అను రూపణము వలననే ధ్వనివేత్తలు తెలిసికొనఁ గలరు. బావగారి యెదుట మఱదలు సంకోచించుచుఁ జరించువని గదా ! దాని యర్థము. ఐనచో సర్వశూన్యత్వ మెట్లు సాధింపఁబడును ? అది సాధింపఁబడనిచో కవులు సంధ్యావందనము చేయ రనుట ఇత్యాది విమర్శక సాహస ప్రయుక్త సిద్ధాంతము లెట్లు బ్రతికెడిని ? ఎట్లో బ్రతుకుఁగాక, జపతపములను గూర్చిన పృథగ్గ్రహణము పాదపూరణ మాత్ర ప్రయోజనమే యగునో కాదో విచారింతము.

శ్లో. సంధ్యావందన ! భద్రమస్తు భవతే భోస్స్నాన తుభ్యం నమో
భో దేవాః పితర శ్చ తర్పణవిధౌ నాఽహం క్షమః క్షమ్యతామ్.

అని లీలాశుకశ్లోకమున సంధ్యావందనమును వదలుకొనుట తెల్పిన పిదప దేవపితృతర్పణ త్యాగమును గూర్చిన ప్రసంగము కన్పట్టుచున్నది. విమర్శకాభిప్రాయము చొప్పున నిదియును దప్పే కాఁబోలును ! ఇట వ్రాయవలసినది లోలెఁడున్నను జూపిన శ్లోకము ననుసరించి చేయఁదగు వ్యాఖ్యానమును విజ్ఞులే చేయఁగలరని యుపేక్షించుచున్నారము. మఱియు వ్యాస వాల్మీక్యాదులు సంధ్యావందనమే చేయలేదా ? తి. వెం. కవులు మానిరేమో ? ఇత్యాద్యప్రస్తుతప్రసంగమును మా విమర్శకుఁడు లిఖించెను. మా రచనలో సంధ్యావందనమునకు సర్వశూన్యత్వమును గయికొనువారే యుండరు. అట్టిచోఁ బై శంకల కవకాశమే లేదు. "న చ శంకా న చోత్తరమ్." లీలాశుకుని శైలిలో సంధ్యావందనమునకుఁ బరిత్యాగమే కానవచ్చుచున్నది. ఇది యితఁడు సన్న్యసించిన పిదపఁ జెప్పిన దని యందురేమో ? ఐనచో స్నానమునకుఁ గూడఁ ద్యాగము విధింపవలసి యుండదు. ఇదిగాక విరజాహోమకాలమునఁ ద్యజించిన సంధ్యావందనాదికమునకుఁ బునస్త్యాగప్రవచన మనుపన్న మగును. దేవపితృతర్పణములు సన్న్యాసి కవిధి విహితము లైనచో నవి చేయలేక పోతి నని పరితాపపడుట యుక్తము గాని పరిత్యజింపవలసిన దానిని బరిత్యజించుటలోఁ దప్పేమి యుండును ? కావున నిది కవితార్ణవమగ్నతాదశయందొండె భగవద్గుణానుభవమగ్నతాదశయందొండె నుభయసమ్మేళన ప్రసంగమగ్నతావస్థ యం దొండె రచించిన శ్లోక మనక తప్పదు. పై శ్లోకము

శ్లో. గోవిం దేతి సదా స్నానం గోవిం దేతి సదా జపః
గోవిం దేతి సదా ధ్యానం సదా గోవిందకీర్తనమ్.

శృంఖలా తృణీకరణము

అను శ్లోకమునకు స్మారక మగుచున్నది. వ్యాసవాల్మీక్యాదులు గూడ నొక్కొక్కచో సంధ్యావందనమును రచింపనేలే దని యూహింపవలసి యున్నది. వేలకొలది వత్సరములు తపస్సమాధిలో మునిఁగియున్న ఋషులకుఁ బ్రతిదినమును సంధ్యావందనాచరణమును సమర్థింపఁదగు ప్రాజ్ఞు లెచ్చట నుందురు? ఋషులకుఁ దపస్సమాధి యెట్టిదో నిజమైన కవులకుఁ గవితాసమాధియు నట్టిదియే ఈ వ్యసనము నందుఁ జిక్కి కొందఱు సాంసారిక సుఖములను వర్జించినవారు గూడఁ గలరు.

శ్లో. శబ్దేందుశేఖరః పుత్రో మంజూషా తవ పుత్రికా.

పై శ్లోకము శ్రీ మహామహోపాధ్యాయ నాగేశభట్ట విరచితము. గ్రంథనిర్మాణ దీక్షలో వయస్సెల్ల వినియుక్తమైన పిమ్మట నొకచో సంతానార్థినియు మహాపతివ్రతయు నగు భార్య కతఁ డట్లు సమాధానము చెప్పె నని తజ్ఞులు చెప్పుచున్నారు.

"అహరహ స్సంధ్యా ముపాసీత"

అను విధివాక్య ముల్లంఘించుట యెట్టిదియో!

"ఋతౌ భార్యా ముపేయాత్"

అను విధివాక్య ముల్లంఘించుటయు నట్టిదియే. ప్రసంగవశమున నింతవఱకు వ్రాసితిమే కాని మా రచన సర్వశూన్యత్వబోధకము గాదు. కేవలకర్మఠులవలెఁ గవులు సంధ్యావందనాదులపట్ల బద్ధదీక్ష కలవారు కారనునది సర్వసమ్మతము. సంధ్యావందన సమయమున నేదేని వర్ణనం గుఱించి మనము ప్రసరించినచో నిజమైన కవికి సంధ్యావందనము తోఁచ దనుటలో నతిశయోక్తి లవముమ లేదు. ఇందులకుఁ జూపిన యుదాహరణములే చాలును. మఱియుం గావలసినచోఁ గాళిదాసాదుల చరిత్ర లుదాహరణముగాఁ గైకొనవచ్చును. కవిత సర్వశ్రేయస్సాధకము గావున వారి కితరకర్మ శ్రద్ధతో నంతగాఁ బనియుండదు.

శ్లో. కావ్యం యశసేఽర్థ కృతే
వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపరనిర్వృతయే
కాంతాసమ్మిత తయోపదేశయుజే. —కావ్యప్రకాశిక.

విమర్శకుఁ డాక్షేపించిన శ్రవణానందములోని సీసపద్యము పై శ్లోకార్థము ననుసరించి రచించినదే యని విజ్ఞు లెఱుఁగుదురుగాక. మా పద్యము నిట నుదాహరించి కొంత వ్రాయవలసి యున్నను విస్తరభీతిచే నట్లు చేయఁ జాలకున్నారము. అందలి

"ముక్తికాంతాసంగమునకుఁ దాయపుఁగత్తె
సద్యశోవ్యాప్తికిఁ జాటు దప్పు"

ఇత్యాది చరణముల యందలి యర్థమును బట్టి విచారించినచోఁ గవులు సంధ్యా వందనాదికర్మములచేఁ దరింప నక్కఱలే దనియుఁ గవిత వలననే వారు తరింప వచ్చు ననియు స్ఫుటముగాఁ దేలెడిని. ఆయా యంశము లెట్లు లున్నను, గవులకు సంధ్యావందనమునం దించుక శ్రద్ధాలోపమునే మా రచన చెప్పును గాని సర్వ శూన్యత్వమును బోధించుటలేదు. విమర్శకుని ప్రసంగము తప్పు. తప్పు, తప్పు.

తే. గీ. అరయఁగా లేక మిము వెలయాం డ్రటండ్రు
గాని యీ యర్థ మది నేఁటికాలమందు
ద్రవ్య మిడి పెండ్లియాడిన ధన్యతముల
భార్యలకు నెల్లఁ జెల్లఁగా వచ్చుఁ గాదె! —పాణిగృహీత

అలంకారికులారా! "ఈ గ్రంథమున దుర్నీతి యంతయు నీసందర్భముననే యున్న"దఁట. విచారించితిరా! కావ్యార్థ మేమి? విక్రీతకన్యాపరిణయము దూష్య మనియే కదా! గ్రహింపవలెను? తక్కిన ధర్మములు భిన్నము లైనను విక్రయణ ముభయత్ర తుల్య మగుటచే నింతకుమున్ను వేశ్యలయందు యోగరూఢముగా నున్న "వెలయాలి" పదము ప్రకృతము విక్రీతకన్యలయందుఁ గూడ సంక్రమింప వచ్చు ననునది యాపత్తి కాని నిజముగా సంక్రమించిన దని చెప్పుట కాదుగదా.

"జీవితం వ్యంగ్య వైభవం"

కావున నిట వాచ్య మేమి? వ్యంగ్య మేమి? వేశ్యలు తమ కన్నియల ద్రవ్యార్థము విక్రయించుటచే. వాండ్ర కాకృతి ననుసరించి వెలయాండ్రు అనునామము వచ్చినది. మనము గూడ నట్లు విక్రయింతుమేని మన కన్యలకుఁ గూడ నానామము చెల్లవలసి వచ్చుననునిది వాచ్యార్థము. వ్యంగ్యమో? కన్యావిక్రేత దూష్యుఁడు. పరిగ్రహీత దూష్యుఁడు. విక్రీతకన్య దూష్యురాలు,

యథా అన్నవిక్రేతాదూష్యః తదన్నం చ దుష్టం
తద్భోక్తా చ దూష్యః విస్తరస్తు తద్బోధకేభ్యశ్శాస్త్రేభ్యోఽవ గంతవ్యః.

కన్యావిక్రయణ నిషేధాపాదకమగు నీ పద్యమే దుర్నీతిబోధక మగునేని తద్బోధక ధర్మశాస్త్రము లెల్ల నట్టివియే కావలసివచ్చును. సాదృశ్య మన భేదఘటితము. తద్భిన్నత్వే సతి తద్గతభూయో ధర్మవత్త్వం సాదృశ్యం, కవివివక్షిత ధర్మ

పురస్కారముగా సాదృశ్యమును విచారింపవలసి యుండును. విక్రయణ మిక్కడ సమానధర్మము. తక్కు ప్రవర్తనాదికము భిన్నతాపాదకము. "చంద్రవన్ముఖం" అనుచోఁ చంద్రనిష్ఠయావద్ధర్మములును మొగమం దెన్నఁటికినిరావు. అట్లే వెల యాలికిఁ గల వృత్వ్రత్తి మాత్రమే యిట వివక్షిత మగుచున్నది గాని తక్కిన వ్యభి చారాదికము వివక్షిత మగుట లేదు. విస్తరింపవలసియున్నను విజ్ఞులు కలరు గదా వారే విస్తరింతు రని ముగింపఁబడుచున్నది. ఇందులకు భాగవతాగ్రగణ్యుఁ డగు శ్రీ పోతరాజుగారి పద్య మొకటి యుదాహరింపఁబడుచున్నది.

ఉ. బాలరసాలసాలనవపల్లవకోమలకావ్యకన్యకన్
గూళల కిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకన్న సత్కవుల్
హాలికు లైన నేమి........ —భాగ. ౧ స్కం.

ద్రవ్యాపేక్షచేఁ దమ కావ్యకన్యకల నొరులకు విక్రయించుకొను కవులు పడపుఁ గూడు భుజించువా రని పోతన్నగారు వ్రాసిరి. కావ్యమునకుఁ గరచరణాద్యవ యవములు లేవు, అది స్త్రీ కాదు. కొన్ని ధర్మములం బట్టి కవులు స్త్రీగా రూపించు చున్నారు. దేని ధర్మము నిందు నిరూపించుచున్నారో దానిని విక్రయించి భుజించు వారు పడుపుఁగూడు భుజించువారుగాఁ బరిగణించు వ్యవహార మున్న యప్పుడీ పోత రాజుగారి యూహ బ్రదుకును. ఐనచోఁ బోతరాజుగారు కూడ మా యభిప్రాయమునే పొంది రనుటకు సందియము లేదు, కావున విమర్శకాభిప్రాయము చొప్పున దుర్నీతి పోతరాజుగారి పద్యమునకును దగులవలయును. శాంతం, పాపం.

శ్లో. నశబ్ద బ్రహ్మోత్థం పరిమళ మనాఘ్రాయచ జనః
కలీనాం గంభీరే వచసి గుణదోషౌ రచయితు. —మురారిర్మహాకవిః

పురుషుని విధవ యనవచ్చునా? అనఁగూడదా?

అనవచ్చును విధవాత్వము స్త్రీనిష్ఠధర్మ మైనను శిష్టవ్యవహారమువలన నీ ప్రయోగము సుసాధ్యమగుచున్నది. ఇందుల కీ క్రిందిపంక్తులు సాధకములు గాఁగలవు.

శ్లో. కేనచి త్పూర్వము క్తోఽపి నీవీబంధ శ్లథీకృతః
విచిత్ర భోగనాభోగవర్ధమానోదరాదినా.
ఇతి ప్రయోగః, భ్రాంతే రుపచారాద్వా.

—వామనకృత కావ్యాలంకార సూత్రములు

నీవీబంధనపదము స్త్రీకటివాసోబంధమునకుఁ జెల్లునుగాని పురుషవస్త్రగ్రంథికిఁ జెల్లదని శంకించుకొని మొదట భ్రాంతివలనఁ గవి యట్లు వాడియుండు నని చెప్పి పిదప స్వల్పవిషయమునందు మహాకవికి భ్రాంతి కల్పన మనుచిత మని యెంచి "ఉపచారాద్వా" అని గతిని సూచించియున్నాఁడు. ఇంత శాస్త్రము నుపయోగించి దీనిని సాధించుటకన్నఁ దప్పనుట సుళువు కాదా అని కొందఱను లనవచ్చును కాని యది సరికాదు. అస్మదాదుల ప్రయోగము లట్లు త్రోసివేయ వలనుపడును గాని శిష్టవ్యవహార మట్లు త్రోసివేయుటకు వలనుగాదు. శాబ్దబోధోపకరణములలో "వ్యవహారత శ్చ" అని వ్రాసిన శాస్త్రజ్ఞులకు శిష్టులయం దెట్టి గౌరవమో విజ్ఞు లెఱుఁగనిది కాదు. దానిని సాధించురీతి యెఱుఁగుగాఁక, మానుఁగాక మూర్ఖుఁడుగూడ 'విధవ' యనియే పలుకుటకుం గతమేమి? శిష్టవ్యవహారోపలబ్ధియే. ఇప్పు డన్యథాగా నా పదముకు మాఱ్పఁ దన్నను లోకులు మార్పరు. మార్చుటకుఁ ద్రోవ యును గానరాదు మఱియుఁ గొందఱు 'విధవుఁడు' అని యందు రనుకొందము. అట్లనుట యుక్తమా? ఎన్నఁటికిని యుక్తము కాదు. 'ధవః ప్రియః పతి ర్భర్తా' ఇందలి నాల్గు శబ్దములలో ధవశబ్ద మెన్నఁడు గాని భార్యా పరముగా స్త్రీ లింగ ముగా నుండదు. ప్రియాది శబ్దము లుండఁగలవు. భర్తృశబ్దము స్త్రీలింగముగా మాఱినను భార్యావాచకము మాత్రము కానేరదు. దీనింగూర్చి వ్రాసిన గ్రంథము విస్తరించును గాన నది వదలుదము. ప్రకృత మనుసరింతము

"విధవుఁడు" నుశబ్దము కావలసివచ్చుచో—విగతా, ధవా, యస్యసః అని విగ్రహము చెప్పనొప్పును గాని, దయిత వల్లభాది శబ్దముల వలె ధవశబ్దము స్త్రీలింగము లేదు. కావుననే విధవుఁడు అను వ్యవహారమును గలుగలేదని యెఱుంగునది. నిష్కృష్టాంశ మేమనఁగా విధవాశబ్దము విశేష్యనిఘ్న మగుటకు వీలులేదుగాన, నిత్యస్త్రీలింగముగాఁ బరిణమించినది. ఆ హేతువుచేఁ బురుషుని దిట్టవలసివచ్చినను నయ్యది యవయవార్థశూన్యముగా నదే లింగమున వ్యవహ రింపఁబడు చున్నది. ఇందులకు—

శ్లో. లింగసంఖ్యా విభేదేఽపి విశేషణ విశేష్య యోః
విభక్తిః పున రేకాచే ద్విశేషణ విశేష్యతా.

అను నార్యోక్తి సాధకము కాఁగలదు. స్త్రీ నిష్ఠ విధవాత్వము పురుషునియం దుపచరించు కతన నిదీ యౌపచారికప్రయోగ మని శిష్టవ్యవహారవేత్తలు నిర్ణయింపఁ గలరు. ఇందులకు మొదటనే యాధారము చూపఁబడినది.

గీ. మనకు మేళములకు వచ్చు ధనము కన్నఁ
'దగిన వారలతోడ సందర్భములు ఘ
టించుటే ముఖ్యమగు లాభము ... —శ్రవణానందము

విమర్శకుఁ డిట నన్వయము చెడినదని దినంతులు గొట్టి తిరస్కరించెను. దిద్దు కొమ్మనియెను. ఎందులకు దిద్దవలెనో కదా? మేళములకుఁ దటస్థించు ధన మెంతయో యుండదు గాన నద్దానికన్న నయ్యెడ కనుదెంచి తమ హావభావాదులం జూచి మోహించెడు విటులొసంగెడు ధన మెన్నొ రెట్లో హెచ్చుండుటం జేసి ఆ ధనరూపలాభము కన్న నట్టివారలతోడి సందర్భమనెడి ధనలాభమే ముఖ్యమగు లాభమని బాలుసికేని స్ఫురించుచున్నది. ఇట్లుండఁగా వెక్కిరించి తిరస్కరించుట కవకాశమేమో విజ్ఞులే నిర్ణయింపఁగలరు సుదర్శినీ పత్రికాధిపతి వ్రాసిన చొప్పున "గ్రంథపుబొంత యంతయు" నిట్టి యనాలోచితపు శంకలతోడనే కుట్టఁబడినది. ఈ శంకల కుత్తరము లేల లిఖింపవలయును? అథవా లిఖించిన ఫలమేమి? ప్రధానాంశమునకు వత్తము. ఈ విమర్శకుఁడు వ్యాకరణాది విషయములఁగూర్చి చర్చింపఁదగువాఁడో కాఁడో తజ్ఞు లెఱుఁగకపోరు. పాశుపతములో ననేకోదా హరణములు చూపి యుపపాదించిన విషయములనే యిందు మరల నెత్తుకొనినఁ జేయునది యేమి? కావున నా విషయములను అన్వయము అని యాక్షేపించిన విషయములను నుపేక్షించి యీ కబ్బములు దుర్నీతిని బోధించుచున్నవని విమర్శ కుఁడు వ్రాసిన దెంతసత్యమో విస్తరించి చర్చింతము. శ్రవణానందములో నేమి, పాణిగృహీతలో నేమి, వేశ్యలం గూర్చియు, తన్నాయకులం గూర్చియు, వారివారి ప్రవర్తనలం గూర్చియు నిరాకరించి మందలించిన యుక్తులకుఁ బరిమితియే లేదు. ఇందుదాహరించి చూపుదమన్నఁ బ్రబంధమెల్ల నుదాహరింపవలసి వచ్చునుగదా! అట్లగుటచే నా వెట్టిపసికిఁ బూనక ప్రాజ్ఞులగువారి నా గ్రంథములు సాంతముగాఁ జూచునట్లు ప్రార్థించుచున్నారము. మఱియు నిందలి కథలు రసాభాసములను వాదమున కింతకు మున్నే కొండొక యుత్తరము మీఁ బడినది. కాన నద్దానింగూర్చి విస్తరింపవలసిన యావశ్యకతలేదు. ఇఁక నీతిబోధకములైనను అక్కడక్కడ దుర్నీతినిఁ గూడ బోధించు పద్యములు కలిగి యుండెనా? లేదా? యనుశంక కుత్తరమును వినుఁడు. కావ్య మనుసప్పు డాయీ పాత్రల కనుగుణముగా వాక్య కల్పనచేసినదియే కాని యన్యము కాదు వారివారి మనోభావముల ననుసరించి రసోచితముగా రచించునప్పుడు పాత్రోచితమగు దుర్నీతి కొంత ప్రతికావ్యము

నందును నుండియే తీరును. శ్రీమద్రామాయణములో రావణుఁడు సీతతోఁ బ్రసంగించిన ప్రసంగము దుర్నీతి కాదని యెవ్వరేని చెప్పఁగలరా? అంతమాత్రమున నా కావ్యము దూష్యమను సాహసు లుందురా? ఉండరు. అయినచో నా దుర్నీతి ప్రజల మనస్సున నాటకుండ నెట్లు కాపాడ వగునో చెప్పవలసి యున్నది. ఉత్తమ పాత్రలు వచించు వాక్యములు సిద్ధాంతము లనియు నితర పాత్రములు వచించునవి యాపాతరమణీయములుగాఁ గన్పట్టినను నవి సిద్ధాంతములు కాఁజాలవుగానఁ బ్రాజ్ఞులు వానిం బట్టి తమ వర్తనమును మార్చుకొన రనియు నెఱుఁగఁదగు ఇట్లారక వ్రాయుటకన్న మహాకవుల వచనరచనలం జూపి చర్చించినఁ గొంత యుక్తముగా నుండెడిని.

> "వెలిఁబెట్టరే బాడబులు పరాశరుఁ బట్టి
> దాశకన్యాకేళి తప్పుఁజేసి." —మనుచరిత్ర.

పై సీసపద్యము దుర్నీతి బోధకమా కాదా? మఱియు—

> "..........వెన్నవలెం గఱంగు వలివేఁబులఁ గౌగిటఁ జేర్చుభాగ్యముల్"

> "..........ఆనందో బ్రహ్మ యటన్న బ్రాఁజదువు
> నంతర్బుద్ధి నూహింపుమా.........."

ఈపద్యములన్నియు దుర్నీతి బోధకములే. ఇవియె యననేల యీ ఘట్టమున వరూథిని నోటనుండివచ్చు ప్రతియుక్తియు దుర్నీతిబోధకమే కావలెను. ఎందుచేత? వేశ్యాసమాగమ ముత్తమ మనియుఁ గర్మనిష్ఠత్యాజ్య మనియు బోధించుటచేత అగుచో గతియేమి? ఆ మాటలను బూర్వపక్ష మొనర్చి వచించిన ప్రవరాఖ్యుని మాటలు సిద్ధాంతము లగు నని కవి యభిప్రాయము గాని వరూథిని మాటలు సిద్ధాంతము లని కాదు. కావున నంతమాత్రమునఁ గావ్యము దుర్నీతిబోధకము గానేరదు. ప్రవరాఖ్యుని వచనములు చూడుఁడు.

> శా. ఈపాండిత్యము నీకుఁ దక్క మఱియెందేఁ గంటిమే కామశా
> స్త్రోపాధ్యాయివి నా వచించెదవు మే లోహో త్రయీధర్మముల్
> పాపంబుల్, రతి పుణ్యమంచు నిఁక నేలా తర్కముల్! మోక్షల
> క్ష్మీపధ్యాగమసూత్రపక్కి కివి వో మీసంప్రదాయార్థముల్.

ఈ యుపన్యాసమువలన నవగతమగు నీతియే శాస్త్రచోదితమగునీతి యనియు దీనినే చదువరులు గ్రహింపఁగలరనియుఁ గవి యాశయము. పూర్వపక్షము

లేనిచో సిద్ధాంత ముదయింపనేరదు గాన( గవిసమీహితసిద్ధాంతసదృశ మగు పూర్వపక్ష ప్రసంగము పాత్రోచితముగ వర్ణించుట కవి ధర్మము. అట్లు వర్ణించునప్పుడు గూడ నాలంకారిక సమయోల్లంఘనము చేయ(గూడదు. కాని యేకారణము వలననో సర్వజ్ఞు లగు కాళిదాసాదుల శ్లోకములు గూడ( గ్వాచిత్కముగా దోష ప్రకరణమున కుదాహరణము లగుచున్నట్టులు లక్షణగ్రంథముల వలన దెలియనయ్యెడిని. దీనింబట్టి చూడ గుణ మున్నచో టనెల్ల నించుక దోష మున్నను సహ్య మని పెద్దలు చెప్పు సిద్ధాంతవచనము స్మృతికి వచ్చుచున్నది. అది యటు లుండుగాక! అవస్థాంతరమును బొందియున్న యుత్తమనాయికానాయకుల ప్రసంగములు గూడ( గొందొకచో దుర్నీతిపదములుగ నుండును. త్రాగినవారి ప్రలాపములం బలె నట్టిపట్టుల నవ్వారివచనములును బరిత్యాజ్యములే. అన(గా( బూర్వపక్ష కోటిప్రవిష్టములే గాని సిద్ధాంతపదవికి రా(జాలవు పరికింపు(డు :

అనృతము దుర్నీతి కాదనువా రుండరు గదా! అట్టి యనృతము నొక పట్టున( గాళిదాసు దుష్యంతుని వంటి యుత్తమనాయకునిచే( బలికించెను.

శ్లో. క్వవయం క్వపరోక్షమన్మథో మృగశాబైస్సమమేధితో జనః
పరిహాస విజల్పితం సఖే పరమార్థేన నగృహ్యతాం వచః.

ఈ శ్లోకము శాకుంతలములోనిది. దుష్యంతు(డు తనకు శకుంతల యందును, శకుంతలకు( దనయందును గల యనురాగమును దన మిత్రునితో వచించి పదపడి యత డంతఃపురమునకు నిది తెలియ(జేయు నను సందియమున రా(గా( బైరీతిన పలాపించెను. దీనిని దుర్నీతి యనువా రుందురా? సమయోచితముగా నత( డట్లుపలాపించుట యుక్తమే యని కావ్యధ్వనివేత్తలు నిర్ణయింతురు. దుష్యంతు(డు శకుంతలా విషయక వ్యామోహములో నుండి పలికిన పలుకులన్న పదంపడి శకుంతలను మఱచి శకుంతలచే( దెలుప(బడి కూడ శాపవశమున నిజము స్మృతికి( దగులక యాపెం బరిగ్రహించుటకు( బరకీయాపరిగ్రహణదోషము వాటిల్లునేమో యని బొంకునప్పటి పలుకులు నీతిప్రదాయములుగను సిద్ధాంతస్థానోచితములుగను నుండు నని ప్రాజ్ఞులు నిర్ణయింతురు. ఇట్లే కావ్యములందేమి నాటకములయందేమి చర్చించి సారమును దెలిసికొనవలసి యుండును. దిఙ్మాత్రము వ్రాసితిమి గాని విస్తరించినచో నెంతయేని పెంచవలసివచ్చును. పైని జెప్పినవిధముగా( గాక యేదోయొక పూర్వపక్షపు వచనమును( బట్టుకొని నిషేధింప( బూనితిమేని అది

కావ్యము మొదలు నేటి వఱకును గల కావ్యములన్నియు దుర్నీతిభూయిష్ఠములే యని చెప్పవలసివచ్చును.

"...తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁ గూడినఁ బాప మంచు"

—తారాశశాంక.

పైపద్యము నిప్పటివా రనేకులు గర్హించుచుండఁగా మేము వినియుంటిమి. కవి యుద్దేశము నొప్పున నది సిద్ధాంతవాక్య మెన్నఁటికిని గాదని వారెఱిఁగినట్లు తోఁచదు. దుష్ప్రవర్తనాభిముఖురాలగు స్త్రీ వచించు దుర్నీతిబోధక వాక్యమును బట్టి చరించువా రుండరు. ఎంత వ్రాసినను నిది తేలునదికాదు. వేదపురాణ కావ్యములలోఁ గావ్యార్థగ్రహణమే కష్టము. ఇందుఁ బదార్థము వేఱుగను సారము వేఱుగను నుండును. ఈ యంశమును గూర్చి లాక్షణికు లెంత యుద్ఘోషించినను, ప్రకృతకాల విమర్శకాభాసుల కా గ్రంథనామములు గూడఁ దెలియనికతన యథేచ్ఛగా వ్రాసి కవులను దూషించుట కవకాశము గలుగుచున్నది.

"వ్యభిచారము తప్పని బోధించుటకుఁ గథానాయకునకు సుఖవ్యాధులు లోనగునవి తటస్థింపఁగా నప్పు డతఁ డేడ్చుచు నీతి బోధించినట్లు రచించుట లాక్షణిక సమ్మత మగునా ?"

మా విమర్శకుఁడుగారు పైఁజెప్పిన చొప్పునఁగాని నీతిని బోధించినను లాభములే దనుచున్నారు. అట్టి దుస్థితులు వ్రాయవలసిన యవసరము తటస్థించినను వర్ణించుట యుక్తము కా దని లాక్షణికులు మొఱవెట్టుచున్నారు. ఇం దేమిగతి ? గతిమాట కేమి ? లాక్షణికసమయము నుదాహరించి చూపుటయే గతి.

"...కవినా ప్రబంధ ముపనిబధ్నతా సర్వాత్మనా రసపరతంత్రేణ భవితవ్యం తత్రేతివృత్తే యది రసాననుగుణానాం స్థితిం పశ్యే త్తాం భంక్త్వాపి స్వతంత్రతయా రసానుగుణం కథాంతర ముత్పాదయేత్ నహి కవే రితివృత్తమాత్రనిర్వహణేన కించి త్ప్రయోజనం ఇతిహాసాదేవ తత్సిద్ధేః" —ధ్వన్యాలోకము.

మఱియు మా ప్రబంధముల నటుండనిత్తము. రామాయణాది ప్రబంధములనే పుచ్చుకొందము. నాయికానాయకులకు సంబంధించినంతవఱకు వర్ణనీయములైన కష్టసుఖములు, స్నానపానాదులు లోనగునవియును నందు వర్ణించియు దంతధావనకుము న్నవశ్యంభావి యగు కొండొక కృత్యమును గూర్చి వర్ణింపని కారణ మేమో ? విమర్శకుఁడు విచారింపవలసియుండును. ఏ నాయికానాయకులు గాని

దానితో నవసరము పట్టనివా రుండరు. కదా ? ఔరా ! కావ్యార్థ విజ్ఞానము. ఏది వర్ణ్యమో, ఏదికాదో, లక్షణజ్ఞసమయ మెట్టిదో తెలియకయే విమర్శనము వ్రాయు టయు దాని నెవరో యచ్చొత్తించుటయుఁ గలుగు నీకాలమహిమ నేమనవలయును! దీనిం గూర్చి విమృష్ట గ్రంథములలో నొకటియగు పాణిగృహీతలో—

చ. మునుపు మహాకవీంద్రులు సమున్నత ఫక్కి నొనర్చు కబ్బముల్
వినుతికి నెక్కెఁ గాని యవివేకుల కూఁతలు తాటియాకులం
దునవె నశియించె నోటఁబడు తుంపురు లేనియు నిప్పు డచ్చు వ
చ్చిన కతనన్ జగాన విలసిల్లెడి మేటికృతుల్ నశించెడిన్.

అని వ్రాసియుంటిమి.

ఉ. కాంతలమాట నమ్మికొని కంతునికిన్ గడు లోఁకువై తదీ
యాంతరభావముల్ తెలియ 'కైసరుబొజ్జ' యటంచు నుబ్బుచుం
డెంత వివేకులైన మది నీవిషయంబు పరీక్ష సేయఁగా
నెంతయు 'బుడ్డ నమ్మికొని యేటను బడ్డవిధమ్ము' గాదొకో !"
—శ్రవణా.

పై పద్యములోని 'బుడ్డ' అను పదము అసభ్య మని విమర్శకుని వాదము. అసభ్య మనఁగా అశ్లీల మని యాశయము. ఆ యశ్లీలము వ్రీడావ్యంజకము, అమంగల వ్యంజకము, జుగుప్సా వ్యంజకము అని మూడు దెఱఁగు లనియు, దానినిఁ గావ్య ములయందు వాడఁగూడ దనియు లాక్షణికులు వ్రాసియున్నారు. కావున నిప్పట్ల విమర్శకుని యాక్షేపణము సమంజసమే కావలెను, కాని యాదోషమునకుఁ గొండొ కచోఁ బ్రవృత్తిని లాక్షణికు లెల్ల నంగీకరించియున్నారు. దాని నిట నుదాహరించి చర్చింతము గాక.

"శాంత విదూషకాద్యుక్తౌ నదోషః శాంతోక్తౌ యథా"

శ్లో. ఉత్తానోచ్ఛూన మండూక పాటితోదరసన్నిభే,
క్లేదిని స్త్రీవణే సక్తి రకృమేః.

చ. స్తనములు మాంసపిండములు చక్కని బంగరుకుండ లంచు నా
ననము కఫాలయంబు తుహినద్యుతి తుల్య మటంచు మూత్రభా
జన జఘనస్థలంబు కరిబారుశిరస్సమ మంచుఁ గామినీ
జన మలినాంగముల్ సుకవిచాతురి వర్ణన కెక్కె నిమ్మహిన్.

"భోగినీనాం స్థూలోపస్థలీషు స్థగిత
కరతలస్పర్శలీలోద్యతానామ్"

అత్ర సహృదయాహ్లాదిన్యాం వ్యాఖ్యాయా మేవ మస్తి-స్థూలోపస్థలీషు వర్తులోచ్ఛూన మదనసదనప్రదేశేషు జానపదేత్యాదినా అకృత్రిమార్థే జీప్ స్థగిత. మాచ్ఛాదితం. యత్కరతలం...ఇత్యాది.

అతి విస్తర మెందులకు? పై శ్లోకము లన్నియును మహాకవి భర్తృహరి సుభాషితములోనివి. ఇందలి యశ్లీలము లెల్లఁ బై నుదాహరించిన "శాంతోక్తా" అనుదానివలననే సంరక్షణీయములు. ఈరహస్యము నెఱుఁగని వారి కా సుభాషితములు కుభాషితములే. కవిత్వము పుట్టినది మొదలు నేఁటి వఱకును బ్రాజ్ఞులగు వారేరును నిట్టిసందర్భములయం దిట్టి ప్రయోగముల నేవగించుకొనుట లేదు సరికదా పైపెచ్చు తమ లక్షణగ్రంథములయం దుదాహరణములుగాఁ గూడఁ గైకొనుచున్నారు.

శ్లో. ఆలోకనంచ నిగూహనంచ
యాసాం స్మర న్నమృతవత్సరసం కృశ స్త్వమ్
తాసాం కిమంగ! పిసితాస్రపురీషపాత్రం
గాత్రం విచిన్త్య సదృశాం న నిరాకులోసి.

—వాగ్భటాలంకార గ్రంథము.

పైశ్లోక ముపమేయ ప్రచురోపమాలాంకారమున కుదాహరణముగా గ్రంథకర్త స్వీకరించియున్నాఁడు. మఱియొకటి యీ సందర్భమున విచారించవలెను. ఈ కవికి నశ్లీల మన నేమియో తెలియ దనియు నక్కతన దీని నుదాహరించి యుండు ననియు నాపాతరమణీయ మగు నొకవాదము రావచ్చును. కావున దానిని విచారింతము.

"......వ్రీడా, జుగుప్సా, అమంగల ప్రతీతికరా యే శబ్దాస్తేఽపి సభామచితత్వా గ్రామ్య ఏవ' వ్రీడా హేతు రథా. "సాధనం సుమహ దస్య" ఇత్యత్ర సాధన శబ్దః పుంశ్చిహ్నేఽపి శంక్యేత, జుగుప్సా వాచకో యథా, వాయుః ప్రసరతి" వాయుశబ్దోఽపానపవన శంకాకారీ, అమంగల ప్రతీతికరో యథా. 'సంస్థితోఽయం, సంస్థితశబ్దోఽత్ర మృతార్థ శంకాకారీ......" వాగ్భటాలంకార గ్రంథము.

సహృదయులారా! సాధన, వాయు, సంస్థిత శబ్దములను గూడ నంగీకరింపనియంత పరిశీలనగల యీ యనుశాసకునకు "పురీషపాత్ర" శబ్దమునందలి

దోష మెఱుఁగరాదను సాహసు లుండరు గదా ! అట్టిచో నితఁ డద్దాని నలంకారోదా హరణముగా నిచ్చుటకుఁ గతమేమి ? "శాంతో క్తా నదోషః" అను నపవాదశాస్త్రము ననుసరించియే నని యెఱుఁగునది. మఱియు నీరహస్యము నెఱుఁగక కొందఱు యథేచ్ఛముగా నశ్లీలప్రసంగములను గావించి వానినెల్ల భర్తృహర్యాదులు శాంతోక్తులయందు వాడిన ప్రయోగములవలన సాధింపఁ జూచుచున్నారు. వారెల్ల నీరహస్యము నెఱుఁగవలయు నని కోరుచున్నారము. ఇందును గూర్చి "శులభా లభనము" నందు విశేషించి చర్చింతుము. పై నుదాహరించిన భర్తృహరి శ్లోకము లలో (3) వ యంకెగల శ్లోకము శాంతోక్తి కాదని ప్రకరణమునుబట్టి కొందఱు వాదింపవచ్చును. అగుచో నది మాకు మఱియు నుపకారకమేగాని యైనను దత్త్వ మునుదెలుపఁ బూనుపట్టున నట్టి స్వలాభములను జూడఁగూడదు గాన నది కూడ శాంతోక్తిలోనిదే యని చెప్పుచున్నారము. అందులకు

శ్లో. సంసారే స్వప్నసారే పరిణతి తరళే ద్వేగతీ పండితానామ్.

అను మొదటి చరణమే బోధక మని ప్రాజ్ఞు లెఱుఁగుదురుగాక. మఱియు నాయా యీ శ్లోకముల నుదాహరించి తమ కృష్ణలీలాతరంగిణిలోని యవాచ్య ప్రసంగము లను సాధింపనెంచుచు "గుంజా గర్వభంజన" మను పేరితో మా మిత్రులు మ. రా. రా. బెల్లంకొండ రామారాయ కవీంద్రులవారు చిన్నపొత్తము నొక దానిని బ్రచురించి యున్నారు. పైవారీ రహస్యముల నెఱిఁగి సమర్థనమునకు దిగవలయు నని ప్రార్థింపఁ బడుచున్నారు. అపవాద్యాపవాదక భావము నెఱుఁగక ఎవరు గాని శాస్త్రప్రసక్తిలోనికి నడుగిడఁ గూడదు.

"నహింస్యా త్సర్వాభూతాని", "అగ్నీషోమీయం పశు మాలభేత" ఈ యుభయశ్రుతులకును నేకవాక్యత గల్పించుకొనినం గాని చక్కని సిద్ధాంత ముదయింపదు.

"వచనా త్ప్రవృత్తి ర్వచనా న్నివృత్తిః" ఏ భూతమునుగాని హింసింపఁ గూడదు. ఎందుచేత ? 'నహింస్యాత్' అని వేద ముద్ఘోషించుచున్నది గనుక; మఱియు యజ్ఞమునందుఁ బశుహింస చేయవచ్చును. ఎందుచేత ? శ్రుతి చెప్పు చున్నది గనుక. తుదకు దేలిన సార మేమనఁగా—

"అపవాద వినిర్ముక్తస్థలఏ వోత్సర్గ శాస్త్రస్య ప్రవృత్తిః" కావున ముందుగా నపవాదమునకుఁ జోటుచూపి పిదప నుత్సర్గము ప్రవర్తింపవలయును. అందువల

నవే "అగ్నీషోమీయ పశువ్యతిరిక్త సర్వభూత కర్మక హనన మిష్టసాధనత్వా భావవత్" అని పై శ్రుతులకు నిష్కృష్టార్థమును మీమాంసకులు నిర్వచించి యున్నారు. విస్తరము తజ్ఞుల వలననే యెఱుఁగఁదగు, ఇఁకఁ బ్రకృతమో శాంత విదూషకాద్యుక్తులయందుఁదక్క నశ్లీలము లితరత్ర వాడఁగూడదు, అని యర్థము, చెప్పితీరవలయును. కావున విమర్శకుని యాక్షేపణము శాస్త్రజ్ఞానదూర మని యుపేక్షింపవలసినదే. మఱియుఁ బ్రకృతమునకు సంబంధించకున్నను నవవాద శాస్త్రఘటిత విదూషకాద్యుక్తులకుఁ గూడ నుదాహరణములు చూపవలసి యున్నది. గ్రంథవిస్తరభీతిచే నందులకు దిగక తదుదాహరణము లచ్చటచ్చట నాటకముల యందును బ్రహసనముల యందును జూడఁగోరెదము. ఈ విచారణము వలననే ప్రహసనమునందలి శోకములుగూడ శ్రీరామారావుగారి యశ్లీలములను సమర్థింపనేరని యెఱుగఁదగు. వారి "గుంజా గర్వభంజన" మెల్ల నింతమాత్రము ననే ప్రత్యాఖ్యాతమని చెప్పవలసియున్నను "శలభాలభనము" నందుంగూర్చి విస్తరింపఁబడునని సహృదయు లరయుదురు గాక.

—తిరుపతి వేంకటకవులు*

---o---

* ఆంధ్రభారతి, సం. 3. 9, 10. మార్చి, ఏప్రియల్ 1913.

# ఆంధ్రభాషా సంస్కారణము

శ్లో. "వాణ్యేకా సమలంకరోతి పురుషం,
యా సంస్కృతాధార్యతే."

అను నార్యోక్తి ననుసరించియే మన పూర్వపు కవిబ్రహ్మ లనఁదగు నన్నయ తిక్క నాదులు వ్యాకరణాదులచేఁ జక్కఁగ సంస్కరింపఁ బడిన యాంధ్రభాషయందే తమ వాఙ్మయమును వృద్ధినొందించి పరమపురుషార్థప్రదములగు భారతాది గ్రంథముల నాంధ్రీకరించి యాంధ్రభాషాయోషకు వర్ణనాతీతమగు నలంకారమును సంపాదించిరి. వారి గ్రంథములనే స్వతః ప్రమాణములుగ నుంచికొని యప్పటివఱకుం గల కవి పుంగవులు స్వప్రతిభానుసారముగ గ్రంథరచన మొనర్చుచు నాంధ్రభాష కేవిధమైన లోపము గలుగనీక మెలంగుచుండిరి, కాని యీ కాలమందు ప్రజలు బుద్ధిదౌర్బ ల్యముచే నన్ననేమి ఇంద్రియపరతంత్రులగుటచే నన్ననేమి విషయంబులం బలె భాషయందుం గూడఁ గొన్ని మార్పులనొందింపఁ బ్రయత్నించుచు నాకార్యమునకు సాంఘికబల మార్జింపఁ బాటుఁబడుచుంటి రను విషయ మందఱకు విశదమయినదే. నిజముగ భాషాభివృద్ధి యొనరింపఁదలఁచిన బుద్ధిమంతు లందఱు నిట్టిమార్పుల కియ్యకొనరనియే నా నమ్మకము. మద్యపానాసక్తుఁడు మద్యము నార్జించుకొనుటకు డబ్బులేనపుడు 'ప్రపంచమునం గల వృక్షము లన్నియుఁ డ్రాటిచెట్లు నీతచెట్లు నయిన బాగుగ నుండుంజుమా' యనుకొనునట్లు వ్యాకరణాది సంస్కారక గ్రంథము లను, లక్ష్యలక్షణము లనదగు భారతాదిగ్రంథములను జక్కఁగఁ బరిశీలించి తద్గతా మూల్య విషయములం గ్రహించునంతటి బుద్ధిబలము లేనపుడు ప్రపంచమ్మున వినంబడు ప్రతిపదమును సాధువై గ్రంథరచనలకుఁ దోడ్పడిన బాగుగ నుండునని కోరుకొన వలయునుం గాని ప్రభుస్థానమువారు వారివారి మాతృభాషలకుఁ దగినంత గౌరవము నిచ్చుచు, పదరత్నమహోదధు లనఁదగు నమూల్యగ్రంథముల నచ్చొ త్తించి సర్వసులభములుగ నొనర్చుచు, పాఠశాలలయం దుత్తమములగు భాషా గ్రంథములను బాలురకుఁ గఱప నాజ్ఞ నొసంగుచు నెన్నివితములనో మనకుఁ దోడ్పడుచుండ నిట్టి కోర్కులఁ గోరుట మిగుల శోచనీయము గదా!

ఇఁక భాషలో మార్పు కలుగవలయుననువారి యుద్దేశ మెద్దియో యోజింతము.

మన మిపుడు సర్వసాధారణముగ మాటలాడి కొనుచున్న వీధిభాషయందే గ్రంథములను వ్రాయవలయును గాని భారతాది గ్రంథములలోని భాష యిపుడు వ్రాయఁబోవుగ్రంథములయం దుండఁగూడదు. అటుల వ్రాయకున్నచోఁ దాము వ్రాసిన గ్రంథము లేరికి నర్థము నీయక నిష్ప్రయోజనము లగును. గ్రాంథికభాష యనఁగా భారతాదిగ్రంథస్థమయిన నిర్దుష్టమగు యీకాలమ్మునఁ బండితుల మనుకొనువారికే సుబోధము కాకున్నది. ఇఁకఁ బామరుల కర్థజ్ఞానకము గాదని యేమి చెప్పవలయును. గ్రంథకర్తయొక్క యుద్దేశ మెప్పటికిని తన మనోభిప్రాయములను బ్రజలెల్లరు చక్కఁగ నెఱింగి తల్లాభము నొందుదురుగాత! అనిగదా యుండును. అట్టిస్థితిలో బిశాచ నారికేళపాకములతో గ్రంథములను వ్రాసినచోఁ గవికి స్వమనోరథసిద్ధి యెట్టు లగును, గావునఁ బంచమవర్ణమాదిగఁ బ్రథమవర్ణము వఱకుం గల సర్వజనులకు సుబోధమగునట్లు గ్రామ్యపదముల చేతనే గ్రంథముల వ్రాయవలయును. ఇటుల వ్రాసినచో భాషయును జక్కఁగ వృద్ధినొందుటయే గాక, యెల్లరకును బాగుగ గ్రంథరచనాకౌశల మేర్పడును. అనుచు నాధునికభాషాసంస్కర్తల యొక్క యభిప్రాయము. అందుకుఁ గావలసిన ముఖ్య నిబంధన లెవ్వియన :

(1) అర్ధానుస్వారపరిత్యాగము, (2) రేఫ శకటరేఫ భేదపరిత్యాగము, (3) సాధ్యమయినంతవఱకుఁ బద్యకావ్యరచనను మానుకొనుట (4) పద్యకావ్యమును వ్రాసినను యతిప్రాసములు మాని స్వచ్ఛందవృత్తములతో వ్రాయుట, (5) సంధిపరిత్యాగము మున్నగునవి యనేక నిబంధనము లున్నవి. దీనిని సంగ్రహముగ జెప్పుమన్నచో నోటికి వచ్చిన ట్లెల్ల మాటలాడుటయుఁ జేతికి వచ్చినట్లెల్ల వ్రాయుటయు నని చెప్పవచ్చును.

ఈ యంశములయం దెంత సరసతకలదో చూతము.

సర్వేశ్వరుఁడు మనకొసంగిన యేకాదశేంద్రియములు నసమానబలముఁ గల పొగరు గుఱ్ఱముల వంటివి. వాని కెన్నటికిని స్వచ్ఛందవృత్తి నీయక యాత్మ తన స్వాధీనమున నుంచికొని దేని నే నిబంధనలతో నడపవలయునో దాని నట్లు నడిపినం గాని యైహికాముష్మిక సుఖసంపద నొందనేరఁడు. అపుడుగాని జితేంద్రియుఁడు కాఁడు పిమ్మట నా మానవుని సర్వేంద్రియవ్యాపారములు సర్వ శ్లాఘ్యములై లోకోత్తరములై వెలయుచుండు నను నంశ మన్నిటెగలవారికిని నిర్వివాదాంశమే. అట్టియెడ నొక కామపిశాచగ్రస్తుఁ డగు మనుజుఁడు స్త్రీప్రపంచ మంతయు స్వభోగార్థమైయే సృజింపఁబడె నని యెంచి తన యింద్రియములకు

స్వచ్ఛంద ప్రవర్తన నిచ్చినచో జాయామాతృభేదమేగతి నొందునో కులటా పతివ్రతాభేద మే మగునో యూహింపుడు. అటులనే వ్యాకరణశుద్ధి యను సహజాలంకారముతో వెలయు భాషాయోషామణి యొసంగు పరమానం మనుభవించు నంతటి బుద్ధిబలము లేక సోమరితన మను పిశాచముచే నావరింపఁబడి యే నీచ పదమైనను స్వాపయోగార్థమయియే యనుకొనుచు మనుజుఁడు తన వాగింద్రియమును బ్రవర్తింపఁజేయునెడ శుద్ధాశుద్ధ భాషాభేద మెచ్చట నుండునో తెలియదు. తన యింద్రియములను స్వేచ్ఛగా నడుపుకొను మానవునకుఁ గలుగు సౌఖ్యమెల్లరకుం దెల్లమె. కావున భాషాయోషను గూడఁ దగు కట్టుబాట్లతో నడపిననే నడుపువానికిఁ జక్కని గౌరవ మబ్బి యా భాషామయమునకు విద్య యని సార్థక నామము లభ్యమగును.

భాష యెపుడును వాచకము. అర్థము వాచ్యము. ఈరెండును నిర్దుష్టము లయినపుడే దానికి విద్యయను నామ మేర్పడి ప్రేక్షావదుపాదేయత్వము గలుగును. అపుడే కల్పలతవలె సర్వార్థము నొసంగును.

శ్లో. మాతేవ రక్షతి పితేవ హితే నియుక్తే
కాంతేవ చాభిరమయ త్యపనీయ ఖేదం
కీర్తించ దిక్షు వితనోతి లక్ష్మీం
కిం కిం నసాధయతి కల్పలతేవ విద్యా.

యను శ్లోకమునకు సార్థక్యమును దెచ్చును. అట్టి భాషయే యనశ్వర మగుచు నాచంద్రతారకముగ నేలోపములేని పతివ్రతాతిలకము మాడ్కి నధికకీర్తి నొందును. లేక యిచ్చవచ్చినట్లు విధినిషేధములు లేని గ్రామ్యపద భూయిష్టముగ వాడికొను భాష యాయాకాలములం బట్టియు, నాయా రాజులం బట్టియు, నయామానిసులం బట్టియు, నాయా దేశములం బట్టియు క్షణేక్షణే మార్పునొందుచుఁ గులటవలె స్థైర్యము లేకయుండును, గాన మన మాతృభాషను బై రెండు స్థితులలో నేస్థితికిఁ దెచ్చుట యుచితమో యాలోచింపుఁడు. పెరడువంటిదానికి నావరణమును, అనగా నాల్గువైపులఁ జక్కని హద్దుల నిడినచో నది మన కంతర్భూమి యగుచు మంచి మంచి ఫలవృక్షములకుఁ బుష్పవృక్షములకు నాకరమయి మహాఫలసంధాయక మగును. కానిచో నూరివారి కందఱకును బహిర్భూమి యయి వారికింగూడఁ జూడ నసహ్యకర మగును. అటులనే హద్దులేని ప్రతివిషయమును నీరసమగుచు నశించును.

గ్రామ్యభాష :

గ్రామ్యపదములనే యాధునిక గ్రంథములలో వాడవలయునను వారొకవేళ నాగ్రామ్యభాషకుఁగూడఁ గొన్ని నిబంధనల నేర్పరుపవలె ననియు. అట్టి నిబంధన లలో మొదటిది మన యాంధ్రదేశములో నుండు గొప్పపదవులలో నుండువారు గొప్పకుటుంబములలో బుట్టినవారు మున్నగు వా రుత్తము లనియు వారు మాట్లాడు భాషయే అనింద్యగ్రామ్య మనియుఁ దదితరు లగు వారందరు నీచు లనియు వారు మాట్లాడుభాష నింద్యగ్రామ్యమనియు, ఈరెండింటిలో ననింద్యగ్రామ్యము మాత్రము గ్రాంథికభాషగ నిపు డుపయోగింపవలె ననియుఁ గాని యథేచ్ఛగా భాష నుపయో గింపవలె ననుట మా యభిప్రాయము కాదనియు, అందువలన భాషకు నిబంధనా లోపము లేదనియుఁ బల్కుదురేమో, అటు లున్నను ఎంతటి యధికారులేని యెంతటి రాజాధిరాజులేని, యెంతటి భాగ్యవంతులేని, యెంతటి యభిజాత్యము కలవారేని నిత్యకృత్యముగా మాట్లాడుకొనునట్టి వ్యావహారికభాషయే యొకశతాబ్దము వఱకేని నొక్కతీరున నుండనేరదు. దానికిఁ గారణము, ప్రతిమానవుఁడును అనవసరముగ నొకరితో సంభాషణ నొనర్పఁడు. కార్యావసరమునుబట్టి శబ్దసాధుత్వమునం దించు కేనియు మది నుంచక, కట్టుబాటును జూడక స్వాభిప్రాయబోధనమందు మాత్రము శ్రద్ధాళుఁడై వ్యావహారికభాష నుపయోగించుచుండును. అట్టుగానిచో సంగీతోపా ధ్యాయునికిఁ దన కొంప కాలినప్పటిస్థితియే ప్రతిమనుజునకుఁ దటస్థించును గావున వాఁ డెంతటివాఁడేని నెవనితో నవసరమున్నపు డప్పటిభాష నుపయో గించును.

కావున వ్యావహారికభాషావిషయమయి జనులయొక్క యభిజాత్యానాభి జాత్యాదు లెంతమాత్రమును సాధుత్వాసాధుత్వాదులను స్థిరపరుపనేరవు. మన మనుకొను నుత్తముఁ డెట్టివాఁడో నీచుఁడు నట్టివాఁడే కాన యొకరి కొకరు దీసిపోరు. మన యుత్తముఁడు వ్యవహారమునందు "వచ్చాడు" అని ప్రయోగించుచున్నాఁడు. మన నీచుఁడు "వచ్చిండు" అని ప్రయోగించుచున్నాడు. ఈ రెంటిలో "వచ్చాడు" అనునది సాధు వనుట కేమి యాధారమో, "వచ్చిండు" అనునదియు సాధు వనుటకు నదియే యాధారము. మీదుమిక్కిలి భాషలో లేనట్టియు, ఏటవాలుగాఁ బలుకఁబడు నట్టియు, ఆకార మొకటి మన యుత్తముని ప్రయోగంబునం గానంబడియెడిని. మననీచుని ప్రయోగమునం దట్టి వ్యత్యాస మెంతమాత్రమును లేదు. కావున నేక పక్షసాధక మగు మూలప్రమాణములే నపు డెవరివాఙ్మయము వారికే సాధు వగును.

దేశమున కొక భాష, జిల్లాకొక భాష, తాలూకా కొక భాష, గ్రామమున కొక భాష, వీధి కొకభాష, యింటి కొకభాష. తుదకు నొకకుటుంబములో నలుగురివి నాల్గుభాషలై యిది సాధు విది యసాధు వనుట కెంతమాత్ర మాధారము లేక భాషామూలచ్ఛేద మొనఁ గూడును. అట్టి లోపమును వారించి భాషకు వన్నెఁ దేవలయుననఁ బూర్వ మహా కవి ప్రయోగములను, వ్యాకరణాది లక్షణగ్రంథములను సహాయముగ నుంచి కొని, భాషను సంస్కరించుకొనుచు గ్రంథముల వ్రాసినంగాని పరిశుద్ధవాఙ్మ యాభివృద్ధి యయి యేదేశభాష యాదేశంబున నేకరీతిగ వెలుగొందనేరదు.

ఇప్పటి వీధిభాషకు నిబంధన లేర్పరుపఁ బూనుట నీటిని గుడ్డలో మూటగట్టఁ బ్రయత్నించుట వంటిది. భూదేవి, యేకపత్నీవ్రత దుఃఖశీల కాకపోవుటంజేసి యాయాకాలపు రాజుల యేలుబడిలోని రాజభాషాపదములు మనభాషలలో జేరక పోవు. దానికిఁ దార్కాణముగ మహమ్మదీయప్రభుత్వము నాఁటి బాజీబంద్, తాలీజ్, గుమాషా మున్నగు పదము లిప్పటి యాంధ్రభాషలో వ్యవహారంబుల నుపయో గింపఁబడుచున్నవి. నందు దొరికినవు డెల్లఁ గ్రొత్తవి దూరుచు నున్నవి మారుచుం డఁగా నిఁక భాషకు నిబంధన లెట్లేర్పడును. ఒకవేళ నిబంధనల నెట్లో కష్టపడి యేర్పరిచినను మగుడ నీభాష గూడ నిపుడు మన పూర్వపు గ్రాంధికభాషవలె విధిబద్ధ యగుటంజేసి కొలఁదికాలమునకే గ్రంథముల నలంకరించునట్టి భాగ్యముం గోలుపోయి సర్వజనాదరణీయము గాక స్వరూపనాశ మొందక పోవునా ? ఏమి యీ యాధునిక భాషాసంస్కరణ సామర్థ్యము. మున్నొక భాషకుఁ గొన్ని సంస్కారములచే ముండనం బొనరించి, కొలఁదికాలమునకే, "అమ్మా యిప్పటి కాలమునకు నీవు పనికిరావు; కావున నిఁక మూలఁ గూర్చుండు" మని యా భాషకే ముండనం బొనరించి అదిగో పసుపు ఇదిగో ముసుకు అనుట యిట్టిది కదా ? ఇటులఁ బూర్వభాషాసాగరములం బూడ్చుచు నుత్తరోత్తర భాషాకూపములఁ ద్రవ్వఁ బ్రయత్నించుచు భాషకు నభివృద్ధిని, శ్రావ్యతమును సౌష్టవమును సంపా దించుట దుర్లభము.

భాషావిషయమై, పూర్వమునకు నిప్పటికిని, విభక్తి ప్రత్యయములలో, అవ్య యములలో, శబ్దముయొక్క రూపములో, అర్థములో, ఉచ్చారణలో అనేకములగు మార్పులు గలుగుటచేఁ బూర్వపు గ్రాంథికభాష యతి సుకుమారమతులగు నిప్పటి పిన్నపెద్దల కర్థముకాదనియు, ఆచండాల మాబాలగోపాలము జ్ఞానోపదేశమొనర్చుట భాషాద్యభిమానులకు ముఖ్యకర్తవ్య మనియు; అజ్ఞానోపదేశము గ్రంథముల

మూలముననే కావలయుగాన నట్టి గ్రంథముల పూర్వపు గ్రాంథికభాషలో వ్రాసినచో మనయుద్దేశము నెరవేరదు కాన నాధునిక వ్యవహారభాషలో వ్రాయవలయు ననియుఁ గొంద ఱందురు. అంతమాత్రముననే పూర్వపుభాషను మానుకొనుమనుట యుక్తి యుక్తముగాదు. లోకమునం దెవడేని జ్ఞానము నొందవలయునన్నఁ గ్రమశిక్షణలోఁ గొంతకాల ముండక స్వేచ్ఛావిహారియై పిమ్మట విద్యాభ్యాసమునకు సిద్ధపడునెడల నది వానితల కెక్కదనుమాట సర్వానుభవసిద్ధము. ఇది గానకళ యందును, వాద్యమందును ప్రత్యక్షసిద్ధము. పంచాబ్దంబుల బాలునకు భారతశైలితో వ్రాయఁబడిన యాంధ్రగ్రంథము దుర్బోధ మనుమాట సత్యమే; ఎమ్. ఏ. తరగతికిఁ దగిన శైలిలో వ్రాయఁబడిన హూణగ్రంథముకూడ దుర్బోధమే. ఈ రెండు గ్రంథముల లోని యర్థజ్ఞానము వానికిఁ గావలయునన్న శైలియందు మాత్రము ప్రౌఢత్వమును దొలగించు చిన్నచిన్న తేలికపదములతో వ్యాకరణశుద్ధికి భంగము లేనటుల గ్రంథముల వ్రాసి తన్మూలమున క్రతుక్రమముగ బాలునికి జ్ఞానాభివృద్ధిని గలిగించినచోఁ బిమ్మట వానికిఁ జక్కని భాషాజ్ఞానము కలిగి భారతాది శైలిలో వ్రాయఁబడిన గ్రంథములు తమంతటతామే సుబోధము లగును. అటులనే హూణగ్రంథమును గాని ఆదినుండియు నంతమువఱకు దిక్కుమాలిన గ్రామ్యభాషలో మెదిగిన బాలునియొక్క వాక్శ్రవణేంద్రియము లెన్నిటికేనిఁ ప్రౌఢశైలిలో వ్రాయఁబడినట్టియు, నిర్దుష్టపద సందర్భముతో విలసిల్లునట్టియు నుద్గ్రంథములలోని సారస్యమును గ్రహింపఁగలవా? అపు డా గ్రంథము లాదరణపాత్రము లగునా? పరిశుద్ధభాష నిలుచునా? ఆమాత్రము శ్రమ బాలునకీయకున్న భాషామృతము నెటుల నాస్వాదింపఁగలడు,

శ్లో. మహారాజ సుతా వాపి నసూతే వేదనాం వినా.

పరమ సౌకుమార్యముగల రా కొమిరెయేని ప్రసవవేదన లేక, సుతాననేందు చంద్రికానందము నొందునా? -పోనిండు- ఎంతహైన్యమునకేని యొప్పికొని నిత్యకృత్యభాషలోనే గ్రంథముల వ్రాయఁ బ్రయత్నింత మనుకొనుఁడు. ప్రతి మనుజునకును దైనందినవ్యవహారమునకుఁ బ్రాయశః ఇన్నూరుమాటలు వచ్చియున్న వాని యావజ్జీవమును లోకయాత్ర జరుపుకొనవచ్చును. ఆ రెండువందల మాటలలో దేశకాలభేదముచే, నొక్కొక్కదానికి రెండేసి మూడేసి పర్యాయపదము లేర్పడియున్నవి. ఉదాహరణముగాఁ గొన్నింటిని జూపెదఁ జిత్తగింపుడు.

మనదేశంబున నామ్లరసమునకు పులుసనియుఁ బూర్వదేశంబునఁ పుల్ల యనియు; కటురసమునకు కార మనియు, కజ్జయనియు; పశువునకు గొడ్డనియు, సొమ్మనియు; పశుబంధనరజ్జువునకు పలుపనియు, కన్నెయనియు; ఆయా దేశము నున్న యాభిజాత్యాదులు కలవారే వాడుకొనుచున్న పదములఁ గ్రంథముల నలంక రించినచో విపరీతార్థదాయకములయి తా మధిష్టించిన గ్రంథముల కగౌరవమును కలిగించును. ఆధునికసంస్కర్తలు పరిష్కరించిన యుత్తములలో వేయిమంది కొకరుదక్క మిగిలిన వారందఱును వస్తాఁడు, చస్తాఁడు, తెస్తాడు అని మాటలాడు వారే. ఆ మాటల సాధువులనుటకు నన్నయాది విరచిత వ్యాకరణాది లక్షణ గ్రంథములు మాకాధారము లున్నవి. సాధువులనుటకు మాత్రము సంస్కర్తల కాధారములు లేవు. అటులనే. నీచు లనఁబడువారు వాడుచున్న "వానివాతఁబోసి నాడు" మున్నగు పదములు సాధువు లనుటకు మాకాధారము లున్నవి కాని, యసా ధువు లనుటకు సంస్కర్తల కాధారములు లేవు. కావునఁ బూర్వోక్తములగు మూల ప్రమాణములయిన భారతాదిగ్రంథముల నాధారముగ నుంచుకొని సంధ్యాదిని యమములతో వ్రాసినయప్పుడే గ్రంథమునకు గౌరవము కలుగును. సంధియను నది స్వభావసిద్ధ మయి పదములకు శ్రావ్యతను గలిగించి చక్కగ నర్థమును దెలు పునుగాని, యపార్థబోధకము కాదు; ఎవఁడేని మాట్లాడునపుడుఁ 'వాడు ఇపుడు ఎక్కడికిఁ బోయినాడు' అని యెంత బుద్ధిమాలిన వాఁడును బలుకఁ బోఁడు. 'వాఁడిపు డెక్కడికిఁ బోయినాడు' అనియె మాట్లాడును. ఈ సంధి నియమము లేనిచోఁ బద్యకావ్యము మొదలంట జెడును. ఈ విషయ మేమాత్రమేనిఁ బద్య రచనాకౌశలము గలవారికిఁ దెలియకపోదు.

అర్ధానుస్వారము :

ఇఁక నర్ధానుస్వార విషయమయి యాలోచింతము. ఈ యర్ధానుస్వార ముచ్చారణకు రాదుగాన నిది పదములలో నుండఁగూడదని కదా సంస్కర్తల యొక్క యాశయము. ఉచ్చారణకు రాని యక్షరములు మన భాషలోనే కాక యితరభాషలయందుఁగూడ నున్నపుడు వానికారణ మరసి మనము కూడ మన భాషను నిర్మూలము చేసికొన కుండుట మనపనిగాని, అట్టి యక్కరము లనవసర మని త్రోసియుంచుట మనకుఁ గర్తవ్యమగునా ? హూణభాషలో.........అను పదములో నెన్ని యక్షరములున్నవో, వానిలో నెన్నియుచ్చారణమునకు వచ్చు చున్నవో గమనింపుడు. ఇటులనే

ఇత్యాదిపదములలోఁగూడఁగల యన్నియక్షరములకు నుచ్చారణ లేదు. దాని కెద్దియో కారణ ముండకపోదు. అర్ధానుస్వారము వల్ల మనకుగల ప్రయోజనములు రెండు. ఒకటి ఆ పదముయొక్క స్వరూపమంతయు విపులముగఁ దెలియుట; రెండు హ్రస్వము మీఁది యరసున్న నిండుసున్న యగునని సూత్రముండుటచేఁ బద్యకావ్యముస కెంతయో సాహాయ్య మొనరించును. మఱియు నర్ధబిందువు ఉచ్చారణకు రాదని చెప్పుట సరికాదు. దానికిఁ బిమ్మటి యక్షరమనునాసికముగ నుచ్చరింపబడవలె నను పూర్వుల యభిప్రాయ మెఱుఁగక యా యుచ్చారణను మానితిమి గాన నిప్పటి కది కష్టమని తోఁచుచున్నది. ఒక యరసున్న యనుమాట యేల, ఏవిషయమయినను గొన్నిరోజులు మానుకొన్నచో మగుడ నవలంబించుట కష్టతరము కాదా?

శకట రేఫము :

ఆంధ్రభాష నితరభాషనుండి వేఱుచేయు ప్రబలసాధనము శకటరేఫమే. అట్టి యలఘురేఫమును వీడినయెడల పదముయొక్క జాతి మన కెటులఁ దెలియును. రెంటియందును ఉచ్చారణ సామ్యమున్నను, పూర్వులు యతిప్రాసల యందు మైత్రిని విడనాడవలయు నని 'రయోస్తు నిత్యం స్యా' త్తను సూత్రమును వ్రాసిరి. శ ష చ జ ల కుచ్చారణలోఁ బోలిక యెంతమాత్రము లేకపోయినను వానికి యతి చెల్లు నని చెప్పుచు రేఫములకుఁ జెల్లకూడదని వ్రాసిన నన్నయగారియొక్క యుద్దేశమునం దెద్దియో పెద్దపట్టుదల లేకుండునా? కావున బుద్ధిమంతు లట్టి భేద మును బాటించియే తీరవలయును.

శృంగారము :

పూర్వమున స్వతః కవిపుంగవులై నాగరికతకుఁ బుట్టివిండ్లై భోగజిత మహేంద్రులై వెలుగొందిన రాజపుంగవుల యాస్థానంబుల నలంకరించిన మహా కవులందరును శృంగార రసప్రధానములుగనే గ్రంథముల నొనర్చి తమ ధరా పురందరుల కంకితము సేసి వారి యాస్థానములందు సర్వజనానంద మొనరించుచు రాజులకుఁ జదివి వినిపించి నిర్దుష్టములని మెప్పించి తమ గ్రంథములకు దమ రాజులకుఁ దమకు నసశ్వరమగు యశంబును గడియించి వన్నెకెక్కిరి. శృంగా రము లేని నాయికకుంబలె కచకుచాదికముల మానివైచిన ప్రతిమకుంబలె శృంగార మును దొలగించినచోఁ గవితాకన్యకుఁగూడ శృంగభంగ మొనర్చుటయే కాక సర్వ

జనాదరణీయతఁ గూడఁ దొలగించినవార మగుదుము. సన్యాసి యగు వ్యాసుండును భక్తివైరాగ్యప్రధాన మగు భాగవత మొనర్చి దానికి సర్వజనాదరణీయత నార్జించుటకై కదా దశమస్కంధమంతయు శృంగారమృతప్రవాహముచే ముంచివైచెను. శృంగార శబ్ద వ్యుత్పత్తిలోనే "శృంగం ప్రాధాన్య సాన్వోశ్చ" అని అమరము, శృంగశబ్దమునకుఁ బ్రాధాన్య మని యర్థము. కావున శృంగం = ప్రాధాన్యం, ఋచ్ఛతి = ప్రాప్నోతీనేతి శృంగారః = అనఁగా ప్రధానరసమని భావము. అట్టి రసము లేనిచోఁ గావ్యముగతి యేమగునో సరసులే యెఱుంగుదురు. మఱియు శృంగార మెంతవఱకు యుక్తమో తొల్లింటి సత్కవీశ్వరు లెరింగియే యున్నారు. "కావ్యాలాపాంశ్చ వర్జయే" త్తని కొన్నింటిని యసత్కార్యము లని యిదివఱకే నిషేధించిరి. కావునఁ బ్రౌఢగంభీరములయి, పరిశుద్ధములై, సాలంకారములై మణులవలె వెలుగొందుచు అర్హశృంగారాదిరసములచే నొప్పెడు గద్యపద్యములచే నింకను భాషాయోషకు వన్నెఁదెచ్చి వాఙ్మయమును గాపాడెదరని నమ్ముచున్నాఁడను.

—కాశీ కృష్ణాచార్యులు*

—X—

* ఆంధ్ర భారతి. నం. 3. సం. 3. సెప్టెంబరు. 1912

# గ్రామ్యభాష కాదు వ్యావహారిక భాష

"గ్రామ్యభాష" అన్న పేరు గ్రామ్యులభాషకు అనగా మాలలూ మొదలైనవాండ్ల మాటలకు తగినది కాని పండితులు నిత్యమూ వ్యవహరిస్తూ వున్న భాషకు తగదుగదా! గ్రామ్యభాష అన్న పేరు వ్యాకరణ విరుద్ధమైన భాషకు పెట్టిన పేరు. అంటే ఇప్పుడు పండితులు చదువుకొనే వ్యాకరణము ఇప్పటిభాష పుట్టక మునుపు వ్రాసినది అవుటచేత ఈ భాషకు చెందినది కాదని చెప్పడమైనది. వైదిక భాషకు వ్రాసిన వ్యాకరణము సంస్కృతభాషకు పనికిరాదు. వైదికభాషకున్ను సంస్కృతభాషకున్ను వ్రాసిన వ్యాకరణాలు ప్రాకృతభాషలకు సంబంధించవు. భాషను పరీక్షించి వ్రాయవలసినది అవుటచేత వ్యాకరణము భాషతో కూడా మారవలెను గదా! వ్యావహారికభాషకు వ్యాకరణము లేనందువల్ల వేగము మారుతుంది, వ్యాకరణము ఉంటే మారదు అనలేము. ప్రతీభాషా ఒకప్పుడు వ్యావహారికభాషగా ప్రజలు వాడినదేను. వ్యాకరణము వ్రాసినంతమాత్రముచేత భాష మారకుండ నిలువదు. సంస్కృతము, లాటిను, గ్రీకు, హీబ్రూ, పారశీ మొదలైన గొప్ప భాషలు వ్యాకరణములు కలవైనా మారడమే అందుకు నిదర్శనము. ఇప్పటి వ్యావహారికభాషలో గ్రంథములు వ్రాస్తే ఇకముందు పుట్టేవారికి ఈ భాష తెలియకుండా మారినప్పుడు ఏమికాను అని శంకించనక్కరలేదు, మనలో పండితులు పూర్వము వ్రాసిన గ్రంథములు ఇప్పుడు కష్టపడి చదువుకొని వాటి అర్థము నోటను చెప్పికాని, టీకలు వ్రాసికాని తెలియనివారికి ఏలాగున చెప్పుతున్నారో ఆలాగే ఇకను పుట్టబోయేవారికి ఇప్పటి గ్రంథాలు అప్పటి పండితులు బోధపరుస్తారు. ప్రాచీన గ్రంథములూ, ప్రాచీన భాషలూ నేర్చుకొన్న పండితులు నాగరుకులలో తప్పకుండా కొందరు ఉంటారు. అట్టివారి పాండిత్యము చాల గౌరవనీయమే గాని అట్టి పాండిత్యము అందరికీ సాధ్యము కాదు. సర్వసామాన్యముగా ఉండవలసిన విద్య కలిగిన తరువాతగాని అట్టి విశేషవిద్య రాదు. ఈ కాలములో నాగరకత గల దేశము లన్నిటిలోను సర్వసామాన్యముగా నాగరకుల వ్యావహారికభాషను ప్రజలకు నేర్పి ఆ భాషలోనే తెలివితేటలు పుట్టించే పుస్తకములు వ్రాసి చదివిస్తున్నారు.

వేదములూ, స్మృతులూ, పురాణములూ. కావ్యములూ అందరూ చదువుతున్నారా? అందరూ చదవగలరా? చదివినా అర్థం అందరికీ తెలుస్తుందా? వాటి అర్థం తమకు వచ్చిన భాషలో చెపితే ఎవరికైనా తెలుస్తుంది గదా! ఇంగ్లీషులో ఈ గ్రంథములు చాలామట్టుకు వ్రాసి ఉండడంచేత ఇంగ్లీషుమాటలు వచ్చిన వారికి అది తెలుసుకోవలెనంటే ఆ కోరిక నెరవేరడము సులభము అవుతున్నది కదా! ఆలాగుననే భారతాది పురాణగ్రంథముల పాతతెనుగు గాని ప్రబంధముల చిక్కుతెలుగు కాని తెలియనివారికి బోధపడేటట్లు చేయవలెనంటే నలుగురూ మాట్లాడుకొనే భాషలో వ్రాసి చెప్పవలసి ఉంటుంది.

బజారులో పురాణము చదివి, అర్థము చెప్పే పండితులున్నూ, బడులలో పిల్లలకు ప్రబంధాలు బోధపరచే పండితులున్నూ చేస్తూఉన్నది అంతేకదా! చక్కగా చదువు మెరుగుపెట్టిన నాలుకలు పలుకగా ఏమీ గ్రామ్యత తోచకుండా వినేవారిచెవులకు ఎక్కిన నాజూకుమాటలు కాగితము మీద ఎక్కించి కంటికి కనవచ్చి తిరిగీ నోటను పలికిస్తే ఏమి గ్రామ్యత కలుగుతుందో నిజముగా నాకు ఊహించ శక్యము కాదు. ఆ మాటలు స్వతహా గ్రామ్యములే అయితే గ్రామ్యము ఉచ్చరించిన దోషము పండితులనోటికి కాని, గ్రామ్యము విన్నదోషము విన్నవారి చెవికి గాని లేక గ్రామ్యము వ్రాసినదోషము చేతికిన్నీ, గ్రామ్యము చూచిన దోషము కంటికినీ ఎందుకు కలగవలెను?

ఎవరో ఎప్పుడో అన్నారట ఏవో మాటలు గ్రామ్యములు అని గతానుగతికో లోకః అన్నట్లు ఒకరిని చూచి ఒకడు 'గ్రామ్యము, గ్రామ్యము' అని నవ్వుతూ, కేకలువేస్తూ, చప్పట్లుకొట్టి చిందులు తొక్కడమే భాషాభిమానముగా ఎందరో తల్చుకొంటున్నారు గాని గ్రామ్య మంటే ఏమిటి? అవి గ్రామ్యములు అని ఎందుకు అనవలెను! ఒకప్పుడు గ్రామ్యములు అనుకొన్నవి మరి ఒకప్పుడు అగ్రామ్యములు కావా? 'ఏమాటలు ఎప్పుడు ఎవరు గ్రామ్యము లన్నారు? వారు ఆలాగు అనడానికి అధికార మేమున్నది? ఇతరులు వారిమాట నిరాక్షేపముగా మన్నించినారా? లేక మెడ్డివేసినారా?' అని చర్చ చేసి ఎవరైనా ఆలోచించినారా?

గ్రామ్యము వాడకూడ దని వ్యాకరణములో ఉన్నది. సరే, గాని ఏరూపములు గ్రామ్యములు? వ్యాకరణాలు అన్నీ ఒక్కలాగున ఉన్నవా? కేతన ఆంధ్రభాషాభూషణములో కొన్నిరూపములు గ్రామ్యము లన్నాడు చూడండి:

పంచాకు మయ్య తోపించాకుమయ్య వా
టీ దెచ్చువాడు మమ్మా దలంచి
యేగ గొంటూ రమ్మ ఏదాలు వాదాలు
సూసేటివారు సేసేటివారు
వాడి విరాళితో బాడిగలో కుషీ
ఈడెకదా మమ్మ యినుతి సేసె
పంపేరు తెంపేరు పాడేరు సూసేరు
ఇందాము కందాము పొందు మిత్తి
అటకు దవ్వ వెగడు నషవలె నిషవలె
నాట నీడ నేడ నచ్చు నిచ్చు
మోయ గాయ వేయ మోకు దార్యామడు
......గ్రామ్య మయ్యె

కేతనకు పూర్వమందు ఆంధ్రభాషకు లక్షణము లేదట. ఉంటే అతనికి తెలియదు కాబోలు. కేతన కాలములో ఈపదములు గ్రామ్యము లనిన్నీ, పెద్దలు వాడలేదనిన్నీ ఒప్పుకొందామా! అతనికి పూర్వుడు నన్నయ్యభట్టు కాలములో వీటిలో కొన్ని ఎంతమాత్రమూ గ్రామ్యములు కాదని చెప్పడానికి వేరే నిదర్శనము అక్కడ లేదు. నన్నయ్య వ్రాసిన భారతము చాలు. 'ఏడ' అనే రూపము నేనేడ. నింద్రాదు లేడ వారలకు' అని నలచరిత్రలో ఉన్నది. తిక్కన కూడా ఇది ప్రయోగించినట్టు తోస్తుంది. 'దవ్వ' అనేది ఒక్క నన్నయే కాదు. త్రికవులున్నూ వాడినదే. (చూ. ఆదిపర్వము 1. 116, విరాటపర్వము 1. 150.) కేతన గ్రామ్యము లన్నవి కొన్ని తక్కిన కవులు వాడుకచేసినప్పుడు కేతనమాట ఎంతమట్టుకు ప్రమాణము ? పెద్దన మనుచరిత్రలో (111-84) 'దవ్వ' వాడుక చేసినాడే! దశావతారచరిత్ర వ్రాసిన ధరణిదేవుల రామమంత్రి 'నవ్వేరు' అనే క్రియారూపము ప్రయోగించినప్పుడు, ఆకవి కేతన వ్యాకరణమును పాటించినట్టా - మోయ (న్) కాయ (న్), వేయ (న్),—ఈ క్రియారూపములు పూర్వకవుల కాలములో గ్రామ్యములైతే, అయివుండవచ్చును. ఆ కాలములో మోవ (న్). కావ (న్), వైవ (న్), అని, చుకారాంతము లైన మోచు, కాచు, వైచు, అనే ధాతువులకు తుమున్నంతరూపములు, అయితే ఆధునికులు చాలామంది ఇవన్నీ ఇటువంటివి తక్కినవి చాలా క్రియలున్నూ యకారాంతములుగా వాడుతూ వున్నారు. గనక

ఈ కాలములో అవి గ్రామ్యములు కావు. వేదము వేంకటరాయశాస్త్రిగారే అవి వాడుక చేసినారు. రావుబహద్దురు వీరేశలింగముపంతులుగారి కవుల చరిత్రలో 56 గురు కవులు పూర్వపు వ్యాకరణాలకు విరుద్ధమైనరూపము ఉపయోగించినారని వ్రాసి ఉన్నారు. కేతన మతమును ఖండిస్తూ కూచిమంచి తిమ్మన్న "చనియెఁ గనియెఁ, గొనియె" ననుటకు "చనెఁ, గనెఁ గొనె, నటంచుఁ జెప్పఁగూడదనుచుఁ బలికె నూత్నదండి, పరికింప నవియును గలవు కృతులను" అని వ్రాసి, కేతనకూడదన్నవి భారతములోను, భీమఖండములోను, జైమిని భారతములోను, కాశీఖండములోను. రామాభ్యుదయములోను, ఆముక్తమాల్యదలోను ఉన్నవని ఉదాహరించినాడు. "త్రాడు" వంటి మాటలు రేఫ లేకుండా "తాడు" అని చాలా మంది ప్రయోగించి ఉన్నారు. ఇప్పుడు వేంకటరాయ శాస్త్రుర్లవారు "తాడు" సాధువు అన్నారు.

కొందరికి అప్పకవి చెప్పిన మాటలు వేదవాక్యాలవంటివి అతడు గ్రామ్యమంటే యేమని చెప్పినాడు? "పలకగా గ్రామ్యజనములు పలుకునట్టి తెనుగుమాటలు గ్రామ్యము లనగఁబడియె। వర్ణలోపంబు నొంది కావ్యముల జొరవు" అని వ్రాసినాడు. వర్ణలోపము పొందినమాత్రాన పదములు గ్రామ్యము లైలే, భారతాది పూర్వ గ్రంథములలో వర్ణలోపము పొందిన రూపాంతరములు అన్నీ గ్రామ్యము లని చెప్పవలసి వస్తుంది. "దున్నక" అనడానికి బదులు 'దునక' అని ఉన్నది. 'ఇచ్చుదువె' 'ఇత్తువె' ఇత్తే; 'ఇండులు' 'ఇండ్లు'। ;'వల యును' 'వలయు' 'వలె (ను)'; 'పూనె' 'ఉనె' మొదలైనవి వేనవేలు ఉన్నవి. గనక వర్ణలోపము ఒక్కటే గ్రామ్యత్వానికి కారణము కాదు. 'పలకగా గ్రామ్యజనులు పలికేమాటలు' మాత్రమే గ్రామ్యము లని చెప్పవలసి ఉంటుంది. వస్తాడా, తెస్తాడా, చూస్తాడా అనే రూపములు గ్రామ్యము లని అప్పకవి స్పష్టముగా వ్రాసినా, ఇప్పటి పెద్దలు ఈ రూపములు వాడుతున్నారు గనక గ్రామ్యములు కాకూడదు. కేతన మొదలైన లాక్షణికులు ఏర్పరచిన విధులకు తక్కిన కవులు బద్ధులు కానట్టే అప్పకవి చేసిన విధులకు లోకులందరూ బద్ధులు కాకపోతే,దోష మేమి? "అక్షర విలోపమై యుండునట్టి పలుకు గ్రామ్యముగ నొప్పునదె యపభ్రంశంబు ననగ బడును" అని అప్పకవి చెప్పినా, పగడము (ప్రవాళము), దొని (ధ్వని). అరసము (హర్షము), నిచ్చ (నిత్య), లచ్చి (లక్ష్మి) మొదలైన అపభ్రంశములు వేనవేలు పెద్దలు వాడడముచేత సాధువు లైనవికావా? అపభ్రంశ భాషే ప్రాకృతభాషలలో ఒకటి అయి, గ్రంథములే ఆ భాషలో వ్రాసిఉన్నప్పుడు, దానికి మరి దోష

మెక్కడిది? "నామ మపభ్రంశం బని సామాన్యముగాఁ దలంపఁ జన దది. భాషా భాషాశిష్యభాషితమై మెలఁగుటచే సుశబ్ద మగు నెల్లడలన్" అని అప్పకవే అన్నాడు. సంస్కృతము వ్రాస్తూ 'లచ్చి' అని వ్రాస్తే, తప్పు; ప్రాకృతభాషలో వ్రాసినప్పుడు 'లక్ష్మి' అనకూడదు. 'లచ్చి' అనే వ్రాయవలెను. అలాగునే పాత తెనుగున వ్రాసినప్పుడు మోవన్, తిగువన్, వైవన్; మోపించు, తివియించు, వైలించు; అనిన్ని కొత్త తెనుగున వ్రాసినప్పుడు మోయ, తీయ, వేయ; మోయించు; తీయించు, వేయించు; అనిన్ని వాడుకచేయడము ఎందుకు సాధువు కాదు? కేతన ప్రాచీనభాషకు చెప్పిన లక్షణము ప్రకారము నవీనభాష వ్రాయవలెనా? పాతవీ కొత్తవీ కలిపి వ్రాసేవారి భాష సంస్కృతములో ప్రాకృతము కలిపి వ్రాసినట్టు ఉండదా? నిజము చెప్పవలసిఉంటే, ఈ కలగలుపే అసాధువు కావలెను. ఏదాయినా పెద్దలు నోటను పలికే దయితే, పిన్నలు అదే విని నేర్చుకుంటారు గనక పాతపుస్తకాలలో ఏలాగున్నా, ఇప్పటి పెద్దలు వాడేదే సాధువు. భాషాలక్షణము చెప్పినవారందరూ "ఫలాని దేశములో జనులు ఆడునదియే" ఫలానిభాష అని చెప్పినారు.

సలక్షణమైన కావ్యములలో "చెవులు, కనులు, బుగ్గలు, పండ్లు,....బొడ్డు, ముడ్డి, కాళ్ళు" అని ప్రయోగించకూడదనిన్ని, వాటికి బదులుగా "వీనులు, కనుదోయి, చెక్కులు, పలువరుసలు...పొక్కిలి, పిఱుదు, అడుగులు" అని పూర్వపు పెద్దలు కావ్యములలో వాడుక చేసినారు. గనుక ఇప్పుడుకూడా కావ్యములు వ్రాసేవారు మొదట చెప్పినది వాడకూడ దని అప్పకవి చెప్పినాడు. అయితే 'ముడ్డి' తప్ప తక్కినవి అన్నీ కవులు వాడుతూనే ఉన్నారు. "భూషణములు చెవులకు బుధతోషణములని భాగవతమం దున్నది. ఏకవచనము ప్రయోగించవలసినప్పుడు 'వీను' అని పనికిరాదు గదా. కండ్లు అనవలసినప్పుడల్లా 'కనుదోయి' అని ఎవరు వ్రాసినారు? "ఇంతలు గన్నులుండ" అని పెద్దన్న వ్రాయలేదా? భారతము ఆది పర్వము III-27 వ పద్యములో గిరికను వర్ణిస్తూ "కలికి క్రాల్గన్నుల తెలుపును .." అని నన్నయయే వాడి ఉన్నాడు. "ఒక్కొక కన్నును జెలియును...." అని సభాపర్వము I-143 వ పద్యములో ఉన్నది. విజ్ఞానేశ్వరీయము, ఆచార కాండము 52 వ పద్యములో 'నయనముల్ శ్రోత్రముల్ బొడ్డును....'' అని కేతన వాడినాడు. పోతన "ప్రియుడగు బొడ్డుతమ్మి తొలిబిడ్డడు" అని ద్వి. స్క. 240 వ పద్యములో అన్నాడు. స్త్రీ వర్ణనలోనే అప్పకవి చెప్పిన నియమము

పాటించవలెను అనలేము. (అందులోనైనా యీ విధి అందరూ మన్నించలేదు లెండి). మీరు చెప్పిన నిషిద్ధపదములలో 'కాళ్ళు' అనేమాట రణము వర్ణిస్తూ తిక్కన ప్రయోగించినాడు అని అప్పకవే చెప్పడము స్త్రీ వర్ణనతో సంబంధించినది కాదే. నిషేధము ఉన్నా. తిక్కన ప్రయోగమును బట్టి 'కాళ్ళు' సాధు వైనదికదా? అన్నీ తక్కినవన్నీ. ఇట్టి నియమాలు కావ్యాలలోనే చెల్లకపోతే, చిన్నపిల్లలు వ్రాసే కథలలో పాటించడము?

పెద్దలు నోట పలికేది ప్రమాణము కాదు, పాత వ్యాకరణాలే ప్రమాణమంటే ఆ వ్యాకరణాలన్నీ చదవగలరు? వాటిలో ఒకటి గాని, అన్నీ కలిపి గాని, భాష అంతా బోధపడ్పవు గదా? కొన్ని సంస్కృతములో వ్రాసినవి సంస్కృతము వ్రాస్తేగాని తెలియవు. తెలుగులో వ్రాసినవైనా మంత్రాలులాగు ఉంటవి: చదవడానికైనా సాధ్యము కాదు; అర్థము మాట అటుండనీయండి. ఒకదానిలో సాధువు కాదన్నది యింకొకదానిలో సాధు వని ఉంటుంది. ఒకరిమతము ఒకరిది కాదు. ప్రథమాచార్యుడు ఒప్పుకొన్నది ద్వితీయాచార్యుడు ఒప్పుకోడు. సూత్రాలలో చెప్పినది కారికలలో ఖండిస్తారు. ఆంధ్రకౌముది చదువుకొని సాధువు అనేవాటిని ఆంధ్ర శబ్దచింతామణి చదువుకొని అసాధువు అనవలెను. అహోబలపండితీయము చదువుకొని ఉన్నమతి పోగొట్టుకోవలెను. మారయ కేతన బొంకినా డని కూచిమంచి తిమ్మన అన్నాడు. చరిగొండల నృసింహులు 'వెల్గ' అంటే అగసాల రుద్రప్ప 'మొల్క' అన్నాడు; అని, ఈ ఇద్దరు అన్నదీ తప్పే అని కాకునూరి అప్పకవి అంటే, అప్పకవి వ్రాసినది తప్పు అని సుంకరి రంగన్న వ్రాసినాడు. బాలవ్యాకరణములో లోపాలు కొన్ని ప్రౌఢవ్యాకరణములో చేర్చినాడు. ఇంకా 'కవి సంశయ విచ్ఛేదా లట' 'స్వరలక్షణసారా లట' ఎన్నో ఉన్నవి, లక్షోపలక్షలట! అప్పకవి అన్నాడు. 'కం. ఒకదానికంటె మఱివే, టొకటి విశేషంబు చెప్పుచుండు కతమునన్. సకల గ్రంథములను జదు,వక దెలియునె లక్షణ ప్రపంచంబెల్లన్."

ఇవన్నీ ఉన్నా, 'నిరంకుశాః కవయః' అని కవులు వారి చిత్తము వచ్చినట్లూ, వర్ణలోపాలు, వర్ణాగమాలు' ఆదేశాలు, అపభ్రంశాలు, పద్యాలలో గణాలు. ప్రాసలు. యతులు, యమకాలు, కుదరడానికోసము, ఏవిషడితే అది మార్చి వ్రాసినారు. వాటి అన్నిటికీ సూత్రాలు చేసి, అయినదీ కానిదీ ముడిపెట్టి సమరస చేయడానికి ప్రయత్నించి అయినది కానిది అనీ, కానిది అయినది అనీ, లాక్షణికులు లక్షణాలు చేసినారు. ఓ భగవంతుడా! ఏమిగతి? పుట్టినది మొదలు చచ్చినదాకా నాలుక ఊరు

కోదే! ఏదో వాగుతూనే వుంటుందే ఈ పుస్తకాలు అన్నీ చదువుకోనిదీ మాటాడ కూడదా? ఒకరికి ఒక చిన్న ఉత్తరము వ్రాసి వచ్చినమాటలతో మనస్సులో ఉన్న అభిప్రాయము చెప్పుకోకూడదా? ఎవరికైనా ఏదైనా ఒక చిత్రమైన సంగతి తెలిస్తే, ఆంధ్రపత్రికకు వ్రాసి పలుగురికీ వెల్లడి చేయగూడదా? అయ్యో! కర్మమా! దేవుడిచ్చిన నాలుక పెద్దలు అందరూ ఆడించినట్టే నేనూ ఆడిస్తూవుంటే తప్పు అంటారేమిటి? పెద్దలందరూ ఒక్కలాటి అన్నమే తింటూ శాస్త్రంలో చెప్పినట్లు అడవిలో అకృష్టపచ్యాలు ఏరితెస్తేగాని అర్హమైన ఆహారం కాదంటే! ఎక్కడికిపోయి లేకియేరి తెచ్చుకోగలరు అందరున్ను? పండితులకు మరి వేరే పని ఉండదుగనక....వ్యాకరణాలు చదువుకోని ఇంకొక జన్మలోనయినా సలక్షణ ముగా మాటాడడము వ్రాయడము నేర్చుకోగలరేమో గాని, పదహారో ఏడువచ్చినది మొదలు ఏదో కాయకష్టపడి పొట్టకూడు తెచ్చుకొంటే గాని జరుగుబాటు లేనివాళ్ళు ఏలాగు నేర్చుకోగలరు? సలక్షణభాషలో పండితులు పద్యాలు వ్రాసికొని పురుషా ర్థాలు సాధించుకొంటూ, పామరులతో పాటు తామున్ను లోకవ్యవహారము కోసము వ్యావహారిక భాషే వ్రాతలలో కూడా వాడుకోడము పూర్వకాలమునుంచీ ఆచారముగా ఉన్నట్లు చాలా నిదర్శనములున్నవి.

మ్లేచ్ఛ భాష అయినా, అప్పకవి చెప్పినట్టు విడువకూడదు; అదే దేశభాష అయినప్పుడు విడిస్తే, వ్యవహారహాని కలుగుతుంది; పూర్వులు ఎవరూ విడిచిపెట్ట లేదు. లోకవ్యవహారము అంతా దేశభాషలోనే జరుపుతూ వచ్చినారు. శిలాశాసన ములలోనూ, తామ్రశాసనములలోను, ఆచంద్రతారార్కముగా చెల్లవలె నని ఉద్దే శించి చేసిన ధర్మకార్యాలూ, దేవాలయ ప్రతిష్ఠలూ, మొదలైనవి వర్ణించి, దేశ భాషలో పెద్దలు నిత్యమూ నోటను వాడుకునే మాటలతో వ్రాసి చెక్కినారు; అవి కొన్ని ఇప్పటికీన్నీ ఉన్నవి. నెల్లూరు జిల్లాలో దొరకిన శాసనములు అచ్చువేసిన పుస్తకములు మూడు ఉన్నవి. అవి ఒక్కమారు పేజీలు తిరగవేస్తూ చూచినా, ఇప్పటి బడులలో పిల్లలు వ్రాస్తే తప్పు అని పండితులు దిద్దుతూ, ఆ తప్పులే పిల్లలులాగున తామూ నోటను—పలుకుతూ ఉంటే "గ్రామ్యాలు" పూర్వకాల ములో మహారాజాధిరాజులు మహాదానాలు చేసి దేవాలయ స్తంభాలమీద శాశ్వ తంగా వెల్లడికాగలందులకు చెక్కించిన శాసనాలలోనే ఎన్ని ఉన్నవో తెలుస్తుంది. మొట్టమొదట సింహాచల దేవాలయము మీద ఉన్న కృష్ణదేవరాయల శాసనమున్ను నెల్లూరు శాసనములలో రెండు శాసనములలోనుంచి కొన్ని వాక్యాలు ఎత్తివ్రాసి

చూపించి, తర్వాత, పరిశీలించవలెనని ఉద్దేశం కలవారికి సాయంగాను, పుస్తకము లలో పుటసంఖ్యా, శాసనము ప్రకటించిన తారీఖా ఉదాహరిస్తూ, ఆ శాసనములో కనబడే వ్యావహారికభాషాపదములపట్టికఒకటి ఈ దిగువన చేర్చినాను; చిత్తగించండి :

సింహాచలమందున్న దేవాలయము మీది శాసనములనుండి :

శ్రీమన్మహారాజాధిరాజ రాజపరమేశ్వర మూరురాయరగండ యవన రాజ్యస్థాపనాచార్య శ్రీ వీరప్రతాప కృష్ణదేవమహారాయులు విజయనగరాన సింహాసనారూఢులై పూర్వదిగ్విజయయాత్రకు విచ్చేసి, ఉదగ్గిరి కొండవీటి కొండపల్లి రాజమహేంద్రవరం మొదలైన దుర్గాలు సాధించి సింహాద్రికి విచ్చేసి స్వస్తి విజయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు ౧౪౩౭ అను నేంటి ధాతు సం. ర చైత్ర బ ౧౨ వారాన శ్రీ సింహాద్రినాథుని దర్శించి తమ తల్లి నాగాదేవమ్మగారికిన్ని తమ తండ్రి నరసారాయనింగారికిన్ని పుణ్యముగాను, దేవునికి సమర్పించిన కంఠమాల ౧ కి ముత్యాలు ౯౧ వజ్రమాణిక్యాల కడియాల జోడు ౧॥ శంఖ చక్రాల పతగం ౧ పైడిపళ్యెం ౧ తుంకాలుగ ౪౪౭౦౦ కానికమాడలు ౨౦౦౦ తమ దేవులు చిన్నాదేవమ్మగారిచేత సమర్పించిన పతగం ౧ వరహాలుగ ౫౦౦ తిరుమలదేవమ్మగారి చేత సమర్పించిన పతగం ౧ వరకోలుగ ౫ యంతమట్టుగ సమర్పించిన ధర్మశాసనం॥

నెల్లూరుజిల్లా శిలాతామ్రశాసనములు అనే పుస్తకమునుండి :

పేజీలు 436-437 : స్వస్తిశ్రీ । శా । వా , ౧౭౧౩ విరోధికృతునామ సంవత్సర జేష్ఠ శుద్ధ ౧౫ లు కలిగిరి వెంకటాచలంగారు ముత్యాలపాటి పొలంలో కాశీరామేశ్వరపు భాషలో కోనేరు తొవ్వించి వూరిలో సత్రం కట్టించి ధర్మంనడిపిస్తూ వచ్చినారు. తదనంతరం వారి రెండో సహోదరుడయిన కలిగిరి రామయ్యగారు అదేప్రకారం ధర్మం జరిగిస్తు వచ్చిన తర్వాత మూడో సహోదరుడయ్ని కలిగిరి శేషయ్యగారున్ను ఆ ధర్మం పరిపాలన చేస్తూ వచ్చి ఆయన దినములలో నున్నవార్కి పింమ్మట నున్ను సదరహి వెంకటాచలయ్యగారి మనుమడైన కలిగిరి సుందరయ్య కొన్ని దినములు సదరు ప్రకారం ధర్మం నడిపిస్తు వచ్చి దుర్ముఖి సంవత్సర మాఖ శుద్ధ ౫ లో ధర్మసత్రం పెంకుటిల్లు కట్టించి శార్వరి సం॥ ఆషాఢ బ ౨ గురువారం శ్రీం॥మం॥ గృహప్రవేశం అయ్నిది.

పేజీలు 497, 499, 500: స్వస్తిశ్రీ శక వర్షంబులు ౧౬౫౨ అగు నేంటి సాధారణ సంవత్సర ఫాల్గుణ శుద్ధ ౧౧ గునాండు....చుండి పట్నమందును.... కొంమన సోమయాజులు చేసిన ధర్మాలు కందునూరను ఉత్తరానను చెఱువు వెన కను తా కట్నమును ఇ న్నీ వనమున్ను ఆ ఉత్తరపుం గొమ్మనం గట్టించిన కొలను చుండి తూర్పునను కట్టించిన చెఱువున్నును ఇన్ని అక్కడం బెట్టిన అశ్వ ద్ధాలున్ను చుండిప్రోల సముద్రము చెఱువు ఉత్తరపుం గొమ్ముమ విశ్వేశ్వరలింగ ప్రతిష్ఠాను ఆగుడిన్ని కొమ్మన సోమయాజులు తమ పుత్రుండు హరిహరనాధుని కినీ బుణ్యముగాను చుండిలో ఉత్తరపుం వంక దారలోను త్రవ్వించిన మంచినీట బావి ఆ సోమయాజుల పుత్రుండు రామచంద్రుండు చేఇంచినవి చుండిని మాకనమ్మ గుడిశిఖరము ఆ ఊరం గొండ ఉతరానను కట్టించిన చెఱువున్ను ఆ అశ్వతాలున్ను ఆయన తమ్ముండు నారపరాజుంగారు వెట్టించిన (వి) చుండికోట! ఆకోట పడుమ టకు పాలన అవికొండాను మన్యముకొండాను కట్టించిన చెఱువున్ను ఆను ఇన్ని ఆవనమున్ను॥

నిజమయిన సంప్రదాయము

—గిడుగు వేంకటరామమూర్తి*

* త్రిలింగ (మాసపత్రిక), సం. 1, సం. 7, జూలై 1914.

# పద్య రచన

ఏదేశములోనైనా పద్యరచనకు పూర్వము పాటలు పుట్టి ఉన్నట్లు కనబడు తున్నది. సవర మొదలైన అనాగరిక భాషలలో పాటలే కాని పద్యరచన ఇంకా పుట్టలేదు. పాట పాడుటకే ఉద్దేశించినది గనుక, దానికి రాగము, తాళము ముఖ్యమైన లక్షణములు. పద్యమునకు ప్రధానమైనది నడక. ఏదైనా ఒక రాగవరుసలో పద్యమైనా పాడవచ్చును గద్య అయినా పాడవచ్చును; అంతమాత్రాన పాటకు అవసరమైన రాగము పద్యమునకున్ను అవసరమైన దని చెప్పుటకు వీలులేదు. పాటకు కావలసిన తాళమునకున్ను పద్యమునకు కావలసిన నడకకున్ను సంబంధమున్నది. ఈ రెండింటికి వ్యత్యాస మేమంటే, పాటపాడినప్పుడు తాళము సువ్యక్తంగా ఉంటుంది. పద్యము చదివినప్పుడు ఆ తాళలక్షణము గుప్తముగా ఉంటుంది. ఉత్సాహ, సుగంధి, తోటకము, భుజంగప్రయాతము, మత్తకోకిల, తరళ, రగడలు మొదలైనవి చదివినప్పుడు పాటలలో ఉండే తాళము వీటిలో కూడా ఎట్లు ఉంటుందో స్పష్టముగా కనబడుతుంది. ఉత్పలమాల, చంపకమాల మొదలైన వృత్తాలలో పాటలకు కావలసిన 'తాళము' గుప్తముగా ఉండడము చేతను, వీటిలో 'లయ' అంటూ ఒకటి ఉన్నదా అనే సంశయం కలుగుతుంది. గాని, విమర్శించి చూస్తే లయ ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఉత్పలమాల, చంపకమాల చరణాలలో ఏదైనా ఒకటి విభజించి చూస్తే అది చతురస్రగతి, తిశ్రజాతి, త్రిపుటతాళమునకు సరిగా నడుచు ననుటకు సందేహములేదు :

| త్రిశ్ర జాతి లఘువు | దెబ్బ ఉసి | దెబ్బ ఉసి |
|---|---|---|
| విందులు సేయుచుఁ మెలఁగు । | వేకువఁగోమల । | గంధవాహముల్ |

ఈ విధముగానే, నడక చక్కగా ఉన్న ప్రతి పద్యము గురించీ సంగీత విషయములో చెప్పిన తాళములలో ఏదో ఒకదానికి సంబంధించిన నడక పద్యములో ఉన్న దని నిరూపించవచ్చును. అయితే ఛందశ్శాస్త్రములో పద్యచరణమునకు చేసే గణవిభజనము. దాని నడకను బట్టి లేకపోవడము చేత, లక్షణము చూచుకొని పద్యములు పద్యమునకు ప్రధానమైన నడక చెడగొట్టి, అవలక్షణమైన పద్యాలు రచిస్తున్నారు.

"ఒంటెకును సుందరత, గేదె కొడలి శుభ్ర
త, మునిఁడికిఁ దీపి, కపికిఁ జిత్తస్థిరత, వె
లుతురునకు బర్వు, కవికిఁ గలుములు, కులడి
కును గృతజ్ఞత యాకాశకుసుమ మటులె."

—ప్రచండచా. పు. 41

ఇది తేటగీతి పద్యమట! దీని నడక ముళ్ళపొదలు దాటుతూ పోయే సొట్టవాని నడక వలె ఉన్నది.

పద్యములనడక, లక్షణములో నిరూపించకపోయినా, లాక్షణికులు తాము లక్ష్యములుగా చూపించిన పద్యాలలో నైనా ఆదర్శముగా కనబరచి ఉంటే, బాల కవులకు అప్పకవి మొదలైన లక్షణగ్రంథములు సహాయముగా ఉండును. కాని ఈ గ్రంథములలో పద్యములనడక చూపించవలె నన్న ఉద్దేశమే కనబడలేదు. వృషభగతిరగడ గురించి లక్షణం చెప్పుతూ లక్ష్యముగా ఇచ్చిన పద్యం చూడండి:

ఇరువది యెనిమిదిలఘువులు పది
యేనిట విశ్రాంతియు గూర్చిన
నిరవగు వృషభగతి పద్మాధిప
యిది విను మాదరమున ముదమున.

దీనినిబట్టి ఈ రగడ యెట్లు నడచునో చెప్పుటకు వీలులేదు గదా. వసుచరిత్రలో ఈ రగడ ఎంత శ్రావ్యముగ నడుస్తున్నదో చూడండి :

"బాల బాల రసాల మిది పిక
పాళి పాలిట యమరసాలము."

ఈ రగడే అప్పకవి చెప్పిన లక్షణము చెడగొట్టకుండానే, ఎన్ని విధములను ఇంపుగా నడిపించవచ్చునో చూడండి :

1. చెవిని బడినది చెలియపలుకని చిలుక పలుకుల కులుకు పడియెను.
2. చిలుక పలుకులు వినబడగా చెలిపలుకని భ్రమ పడెను గదా.
3. చిలుకల్ పలుకన్ వినినంతన్ చెలిపలుకనియే భ్రమ నొందెన్.
4. ఒక చిలుకపలుకు విని తలచెన్ ఒప్పుగా చెలిపలుకె యనుచున్.
5. చిలుకపలుకు విన్నయంతనే చెలియ పలికె ననుచు తలచితిన్.

వీటిలో ఒక్కొక్కటి ఒక్కొక్క విధముగా నడుస్తున్నది గనుక అన్నీ వృషభగతి నగడలే అనుటవల్ల ప్రయోజనము లేదు.

"పెక్కులగు గుఱ్ఱములు జొక్కపు రథంబులును
నెక్కువగునేనుఁగులు గ్రిక్కిరిసి రాగా"

ఈ లయగ్రాహి చరణము అప్పకవి మొదలైన లాక్షణికులు చెప్పినట్లు గణ విభజనము చేసి, ఇందులో భజసన భజసన భయ గణములు గలవని చెప్పినయెడల, అది పద్యముయొక్క నడకను తెలియజేసే గణవిభజనము కానేరదు. ఏడు 'భల' ములున్ను తుదినొక్క 'గగ' మున్ను గలవని గణవిభజనము చేసినయెడల, అది పద్యలక్షణమును నిరూపించ గలదు.

మూడేసి అక్షరములు ఒక్కొక్క గణముగా చేసి, అట్టి గణములు ఏవేని గలవో చెప్పుటవల్ల సరియైన లక్షణము ఏర్పడదు. ఈ మూడక్షరముల గణములతో ఏర్పడిన లక్షణసంప్రదాయము నిరర్థకము.

ఉత్సాహము, ద్విపద, తరువోజ, సీసము, గీతాలు. అక్కరలు మొదలయిన జాత్యుపజాతులకు చెప్పిన సూర్యగణములు, ఇంద్రగణములు మూడక్షరముల గణములకంటె పద్యలక్షణము నిరూపించుటకు ఎక్కువగా ఉపకరించగలవు గాని, ఇందులో ఇంద్రగణములు అన్నీ ఒక్కరీతిగా నడచేవి కావు. వీటిలో మూడు— భ. ర, త గణములు మూడక్షరముల గణములు; మూడు—నల, నగ, సల గణములు నాలుగక్షరముల గణములు. మూడక్షరముల గణములలోని భగణమున్ను, నాలుగక్షరముల గణముల గణములలోని నలమున్ను నాలుగు మాత్రల గణములు; మూడక్షరముల గణములలోని రగణ తగణములున్ను, నాలుగక్షరముల గణముల లోని నగ, నలములున్ను, అయిదుమాత్రల గణములు.

పైని పేర్కొన్న జాత్యుపజాతులలో నాలుగుమాత్రల గణములయినా సరే, అయిదుమాత్రల గణములైనా సరే. ఈ ఆరు ఇంద్రగణములున్ను కవులు యథేష్ట ముగా వాడి ఉన్నందున, ఆ గణములలో గల మాత్ర బేధమును లాక్షణికులు పాటించలేదు; గాని నాలుగు మాత్రల ఇంద్రగణములతో చెప్పిన సీసపద్యమున కున్ను అయిదుమాత్రల ఇంద్రగణములతో చెప్పిన సీసపద్యమునకున్ను ఎంత వ్యత్యాసము కనబడుతున్నదో చూడండి :

1. మందార మకరంద మాధుర్యమున గ్రోలు
మధుపంబు వోవునే మదనములకు

2. మల్లియవిరులను మధువును గ్రోలెడు
మధుపము వోవునె మదనములకు.

ఇంత వ్యత్యాస మున్నది గనుకనే, కన్నడ ఛందస్సులో సీసపాదమునకు కావలసిన మొదటి ఆరుగణములున్ను 'పురుహూతగణము లై'—అనగా అయిదుమాత్రల గణములై ఉండవలె నన్న నియమ మున్నది. అంతేకాదు. మాత్రలసంఖ్య బట్టి గణముల విభాగము కన్నడలాక్షణికులు చేసుకొన్నారు.

మూడుమాత్రల గణములు రెండు : నగణ (III), హగణ (◡I) ములు.

నాలుగుమాత్రల గణములు నాలుగు ; నలము (IIII), భగణము (◡II), సగణము (II◡), గగము (◡◡)

అయిదుమాత్రల గణములు ఆరు : నలలము (IIIII), భలము (◡III), తగణము (◡◡I), సలము (II◡I), రగణము (◡I◡), నగము (III◡)

వీటిలో మూడుమాత్రల గణములందు లగము (I◡) గాని, నాలుగు మాత్రల గణములలో జగణము (I◡I) గాని; అయిదుమాత్రల గణములలో యగణము (I◡◡) గాని; జగణలఘువు (I◡II) గాని చేరరేదు. తెలుగులాక్షణికులు చెప్పిన సూర్యేంద్రగణములలో నున్న వీటిని విడిచిపెట్టినారు. ఎందుచేతనంటే వీటి నడక విలోలముగా మృదంగవాద్యములో 'ఎదురుదెబ్బ' వలె ఉంటుంది. అయితే, ఈ గణాలకు ప్రయోజనము లేకపోలేదు.

1. సుకాంతి : "ఇదేయనిఁ, మదాన్వితుఁ, సుకాంతునిఁ వధించెదఁ."

2. పంచచామరము; "పరాత్పరుఁ రమాపతిఁ భజించెదఁ మనంబునఁ."

3. జలోద్ధతగతి ; "సరోజనయనా జలోద్ధతగతిఁ."

4. భుజంగప్రయాతము: "స్మరింతుఁ నుతింతుఁ సదానిన్ భజింతుఁ."

కొన్ని పద్యాలలో ఈ అనులోమ విలోమ గతులుగల గణాలు కలిపినా, నడక చెడదు; ఇంపుగానే ఉంటుంది.

1. వీనులలర వినంబడుఁ.

2. నారదాది మౌనివరుల్.

3. రామరామ హరేరామ రామరామ హరేహరే.

4. విరులసరములను విరిబోడులపై.

5. మరింత గట్టిగ మన్మథు డేసెను.

అయితే ద్విపద, తేటగీతి, ఆటవెలది, సీసము, అక్కరలు మొదలయిన పద్యాలలో— అనగా సూర్యేంద్రగణములు గల పద్యాలలో— ఈ విలోమగతి గణములు అనులోమగతి గుణములలో అత్తిఉండవు గనుక వీటికి ఆ పద్యాలలో ప్రవేశము లేదు.

పైన చెప్పినరీతిగా పద్యలక్షణము నడకనుబట్టి గణము లేర్పరచి చెప్పినదే అయినా, మరియొక విషయము గుర్తించి జ్ఞప్తియందుంచుకొంటేనే తప్ప బాలకవులు మంచినడక గల పద్యాలు రచించలేరు. గణములు లక్షణంలో చెప్పినట్లే ఉన్నా పదముల కూర్పు గణములకు అత్తి ఉండని యెడల పద్యము నడక చెడిపోతుంది. ఏలాగంటే,

"కర మొప్పఁ బంచలఘు గణచతుష్టయముచే
విరమంబు రెంటిపై ద్విరదగతి పేరిచే"

అని ద్విరదగతి రగడకు చెప్పిన లక్షణము దాని నడకను సూచిస్తూ చెప్పిన లక్షణమే. అయినా, మరియొక విషయము చెప్పకపోవుటచేత ఈ లక్షణము మీరకుండానే పద్యము నడక చెడగొట్టి రచించుటకు అవకాశమున్నది.

1. "రామచంద్రుని గొలుతుగా రమానాథు గొల్తును"

2. "రాముని గొలెచెదను మురహరుని గొలిచెద నని"

వీటిలో నడక ఎందుకు చెడిన దంటే, విలోమగతి గల గణములు ఈ రగడకు పనికిరావు. అయిదేసి గణముల మాత్రలు నాలుగు ప్రతిపంక్తికీ ఉండవలెను గదా. మొదటి చరణము గణవిభజనము చేసి చూడగా, 'రమానా' అనే యగణము, 'థుగొల్తును' అనే జగణలఘువు ఉత్తరార్ధమం దున్నవి. ఇవి విలోమ గతి గల గణములు. పూర్వార్ధమందు 'రామచం' అనే రగణము, 'ద్రుగొల్తుగా' అనే నగణ గురువు అనులోమగణములుగానే ఉన్నా, ఇందులో రెండవది 'ద్రుఁగొలుతుగా' నడకలో 'ద్రుగొల్తును' అనే జగణలఘువువలెనే నడచి విలోమగతి గణ మవుతున్నది. విలోమ గణములలో, మొదటి మాత్ర ఉచ్చారణలో 'ఊత' (బలము) లేనిది. అనగా ఇంగ్లీషు భాషలో చెప్పినట్లు Accent లేనిది అవుతున్నది. (Accent అనే మాటకు సరియైన తెలుగుమాట దొరకనందున 'ఊత' అని

వాడుతున్నాము.) మాటలలో చిట్టచివర నున్న లఘువు ఊత లేనిది; మొట్టమొదట నున్నలఘువు—దానివెంటనే గురువర్ణము రాకున్న యెడల ఊతగలదిగా ఉంటుంది.

పైని చెప్పిన విలోమగతి గణములలో ఈ ఊత ఎట్లున్నదో చూడండి. ఊత గల వర్ణములపైని నిలువుగీత పెట్టి ఈ దిగువ చూపిస్తున్నాము ;

రామచంద్రుఁగొలుతుఁ రమానాథుగొల్తును

ఈ విధముగానే ఊతగల వర్ణములు, ఊతలేని వర్ణములు (ఏగుర్తు లేనివి), రెండవ చరణములో ఎట్లున్నవో చూడండి :

రాముని గొలిచెదను మురహరుని గొలిచెద నని

ఊత ఉండవలసిన చోట లేకపోవుటచేతను, ఉండరానిచోట ఉండుటచేతను, పాదము నడక చెడినది.

చక్కఁగా నడిచే చరణములందు ఊత ఎక్కడెక్కడ ఉంటుందో చూడండి ;

1. చదువ ధనమొదవునని మదిఁ దలఁచి చదువుకొని

2. మృగమదము తిలకమును నగుమొగము చెలువమును

3. దశరథకుమారునకు దనుజసంహారునకు

ప్రతి గణములోను మొదటి లఘువు ఊత గలదిగాను కడపటి లఘువు ఊత లేనిది గాను ఉండవలెను. రెండవ లఘువుపై ఊత ఉండకూడదు. మొదటి రెండు లఘువులకు మారుగా గురువర్ణ మున్నప్పుడు రెండవ లఘువు కనబడదు.

ఉ. పలుకుదురు పల్కుదురు

మూడవ లఘువుపై ఊత ఉండవచ్చును. లేకపోవచ్చును. మూడవ లఘువుపైని ఊత ఉన్నప్పుడు నాలుగవ లఘువుపైని ఊత ఉండదు; నాలుగవ లఘువుపైని ఊత ఉన్నప్పుడు మూడవ లఘువుపైని ఊత ఉండదు.

ఉ. మదిఁ దలచి చదువుకొని.

ప్రతి గణములోను ప్రధానమైన ఊత ఒకటి ఉండి తీరవలెను. మరి ఒక ఊతకూడా అప్రధాన మైనది ఉండవచ్చును. ప్రధాన మైన ఊత మొదటి లఘువుపై నున్నప్పుడు అప్రధాన మైన ఊత మూడవలఘువుపైని కాని, నాలుగవ లఘువుపైని గాని ఉండవచ్చును,

|| | || || | ||
మృగమదము తిలకమును నగుమొగము చెలువమును

(రెండు నిలువుగీతలు ప్రధానమైన ఊతను, ఒక్కగీత అప్రధాన మైన గీతను సూచించును.)

మొదటి లఘువు ప్రధానమైన ఊత కలది కానప్పుడు, ప్రధాన మైన ఊత మూడవలఘువుపై నుండవలసినదే కాని నాలుగవ లఘువుపై నుండరాదు; ఉంటే నడక చెడుతుంది చూడండి :

|| | || || | ||
మందారములను గు మకరందములను గొను

మూడవ లఘువుపైని ప్రధానమైన ఊత ఉంటే, నడక చక్కగా ఉంటుంది. చూడండి :

|| | || || | ||
మందారముల నిలచి మకరందముల గుడిచి

"తిలకమును" "ముల నిలిచి", "ములను గల"

మొదలయిన గణములలో ఛందస్సు నియమము కోసము కావలసిన యెడల— అప్రధాన మైన ఊత నిలిపి

|| | | || | ||
"తిలకమును", "ముల నిలిచి", "ములను గల" అని చదువవచ్చును.

ఈ విధముగా పద్యముల నడకను బట్టి ఏర్పడిన గణములలో ఊత పాటించకపోయిన యెడల పద్యములనడక చెడిపోవును. మూడక్షరము లొక గణమన్న సంప్రదాయము స్థిరముగా నాటుకొని ఉండడం వల్ల పద్య చరణమునకు నడకను బట్టి గణవిభజనము చేయవలె నన్న ఉద్దేశమే పుట్టడము లేదు.

పద్యముల నడకను బట్టి ఏర్పడ గల గణము లేవో, ఏయే గణములు ఎట్టి నడకను సాగించునో, ఆ గణములలో ఊత ఎట్లుండవలెనో గుర్తించిన యెడల

ఛందశ్శాస్త్రములలో పేర్కొన్న పద్యములే కాక ఇంపుగా నడచే పద్యజాతులు ఎవరి కిష్టమయినట్లు వారు క్రొత్తక్రొత్తవి కల్పించి రచించుకోగలరు.

సుమారు నలభై సంవత్సరముల క్రిందట కొక్కొండ వెంకటరత్నము పంతులుగారు "వెండి". "బంగారము" మొదలయిన పద్యములు చెప్పినారు. వాటిలో నడక చక్కగా ఉన్న దని చెప్పలేము; గాని పైని సూచించినట్లు 'ఒంటెకును సుందరతవంటి పద్యములలో కుంటుపడిన నడకకంటె మేలుగానే ఉన్నదని చెప్పవచ్చును. వారి నెవ్వరూ అనుకరించలేదు. చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారు పూర్వసంప్రదాయమును మీరి ఎత్తుగీతి లేని సీసపద్యములు రచించినారు గాని వారినైనా ఎవ్వరూ అనుకరించలేదు.

గురుజాడ అప్పారావు పంతులుగారు రచించిన ముత్యాల సరములు చూచి- మొదట కొందరు పరిహసించినా- ఇప్పు డనేకులు వారిని అనుకరించి రచిస్తున్నారు. అయితే, అది వారు క్రొత్తగా కల్పించినది కాదు. "అమ్మా ! గుమ్మడేడే" అనే పాట చాలా కాలమై దేశములో వ్యాప్తి చెంది ఉన్నది. అందులోని చరణాలు ముత్యాలసరముల వరుసనే నడచును.

గుమ్మడేడే గోపిదేవీ !
గుమ్మడేడే కన్నతల్లీ !
గుమ్మడిని బొడజూపగదవే, అమ్మగోపమ్మా !

మేలుకొలుపు పాటలలో కూడా ఈ వరుసను నడిచే పాటలున్నవి :

కమలసంభవు డాదిగా గల
అమరు లొచ్చిరి మిమ్ము గొలువగ
కామహితశరతేజ గౌరీ
రమణ మేల్కొనవే.

ఈ మూడుచరణాలపద్యమువంటిది మరియొకటి కలిపిన పద్యమునకు కన్నడ ఛందస్సులో 'భామినీషట్పది' అని పేరు.

పైని ఉదాహరించిన పద్యములలోని గణములు మాత్రాగణములు. మూడు మాత్రలగణములతో నాలుగుమాత్రల గణము చేర్చగా ఏర్పడ్డ ఏడుమాత్రల గణములు మొదటి చరణములో రెండు, రెండవ చరణములో రెండు, మూడవ చరణములో మూడున్ను పైని ఒక్క గురువున్ను ఉన్నవి.

$3 + 4,\ 3 + 4$

$3 + 4,\ 3 + 4$

$3 + 4,\ 3 + 4,\ 3 + 4. + 2$

అప్పారావు పంతులుగారు రచించిన పద్యాలలో కొన్ని సరిగా ఇటువంటివే. (చూ. లవణరాజుకల.)

నిండుకొలువున లవణు డను రా
జుండె జాలికు డొకడు దరి జని
దండినృప ! ఒక దంతిగారడి కలదు కను మనియెన్.

మరికొన్నింటిలో మూడవపాదములోని రెండవభాగము మరికొంచెము పెద్దదై నాలుగవ చరణముగా సాగినది :

వింటి మీ పోకిళ్ళు వింటిని
కంట నిద్దుర కానకుంటిని
చిన్నమనసును చిన్నబుచ్చుట
ఎన్నికని యోచించిరో !

ఇందులో మూడవచరణము, నాల్గవ చరణము కలిసి మత్తకోకిల చరణము వలె నడుచును.

మరికొన్నింటిలో ఈ నాల్గవచరణము తక్కిన మూడు చరణములవలెనే ఏడుమాత్రల గణములు రెండు గలదిగా ఉన్నది :

వెలుగునీటను గ్రుండె చుక్కలు
చదల చీకటి కదల బారెను
ఎక్కడనొ ఒక చెట్టుమాటున
ఒక్క కోకిల పలుకసాగెను

ఇది వృషభగతిరగడ అవుతున్నది.

పైని సూచించిన పద్యజాతులు అప్పారావుగారు కొత్తగా పుట్టించినవి కాక పోయినా వీటిలో ఖండకావ్యములు ఇంపుగా రచించి వీటిని ప్రచారములోనికి తీసు కొని వచ్చినవారిలో వీరే మొదటివా రయినారు. క్రొత్త దెంత మంచిదయినా సరే

అనుసరించడానికి ఇష్టపడినివారు ఎక్కువగా గల సంఘములో అప్పారావు పంతులు గారు ధైర్యముతో తమ ముత్యాలసరములను ప్రదర్శించి అనేకుల మెప్పు పొందుట గొప్పగా చెప్పవచ్చును.

ఈ విధముగానే లాక్షణికులు ఇదివరకు చెప్పక విడిచిన క్రొత్త జాతిపద్యమును చక్కని నడకలను సాగిస్తూ రచించుటకు అవకాశ మున్నది. భావోద్రేకములకు అనుగుణముగా నడక మార్చుతూ పద్యములు రచించుటకు కూడా అవకాశమున్నది.

## యతిప్రాస నియమములు :

తెలుగు పద్యాలకు లాక్షణికులు విధించిన స్వర వ్యంజన మైత్రి వళి నియమములు, ప్రాసనియమములు పద్యలక్షణమును పోషించుటకు అవసరములైన నియమములు కావు. వీరు చెప్పిన యతిప్రాసలు కేవలము శబ్దాలంకారముల వంటివి. ఇష్టమున్నవారు పాటించవచ్చును. ఇష్టము లేనివారు విడిచిపెట్టవచ్చును, "ఇవి శబ్దస్వరూపము నిర్ణయించుట కత్యంతోపయోగకరము'' అని మ. జయంతి రామయ్య పంతులువారు కవిజనాశ్రయ పీఠికలో వ్రాసినారు. ఈ నియమములు లేకపోయినా, సంస్కృతభాషా శబ్దస్వరూపము వేదముల కాలమునుండి నేటివఱకును ఎక్కువ చక్కగా నిర్ణయించవచ్చును గదా. అంటే అందుకు ఇతర సాధనము లున్న వని వారు చెప్పవచ్చును. సూర్యరాయాంధ్ర నిఘంటువులున్ను, అచ్చు మొదలయిన ఇతరసాధనములున్ను వస్తున్నవి గనుక, వడి ప్రాసముల సాయము మరి కావలసి ఉండ దని సమాధానము చెప్పిన యెడల వా రేమందురో !

"ఆంధ్రవాఙ్మయాభివృద్ధి కీ నియమములు బాధకములుగా ఉండిఉండక పోయిన'' వని రామయ్యపంతులవారి అభిప్రాయము. గాని, నన్నయ, తిక్కన మొదలయిన మహాకవులు సయితము వడి ప్రాసములకోసము పొల్లుమాటలు వాడుక చేసినట్లు వందలకొలది ఉదాహరణములు చూపించవచ్చును.

## వడి స్థలము

సంస్కృత శ్లోకములకు విశ్రాంతి (అనగా పదము తెగిపోవుట) ప్రధానమైనది. ఇది శ్లోకముల నడకకు కొంతవరకు పోషకము. తెలుగు పద్యములకు విశ్రాంతి నియమము లేదు; విశ్రాంతికి మారుగా అక్షరమైత్రి కావలె నన్న నియమ మున్నది. దీనివల్ల పద్యమునకు ప్రధానమైన నడక మరింత ఇంపుగా నుండునని చెప్పుటకు ఆధారమేమీ కనబడదు.

సంస్కృతలాక్షణికులు వృత్తములలో ఎక్కడెక్కడ విశ్రాంతి ఉండవలె నని చెప్పినారో ఆ వృత్తములకు సరియైన తెలుగు పద్యాలలో ఆయా స్థలములందే వడినియమము (అనగా అక్షరమైత్రి) సాధారణముగా ఉన్నది: గాని అనేక పద్యములలో స్థలము మారినది. అందుకు నిదర్శనముగా ఈ క్రింద వివరించిన భేదములు చూడండి :

*1. భుజంగ ప్రయాతము :* సంస్కృతములో 6 అక్షరముల తర్వాత; తెలుగులో 7 అక్షరముల తర్వాత. బ్ర. శ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారు—సంస్కృతపండితులు గనుక కాబోలు—సంస్కృత నియమమే పాటించినారు.

*2. పంచచామరము :* సంస్కృతములో 8 అక్షరముల తర్వాత; తెలుగులో 9 అక్షరముల తర్వాత.

*3. శిఖరిణి :* సంస్కృతములో 6 అక్షరముల తర్వాత. తెలుగులో 12 అక్షరముల తర్వాత.

*4 పృథ్వి :* సంస్కృతములో 8 అక్షరముల తర్వాత, ఈ మర్యాద ననుసరించిన తెలుగుకవి పెద్దన. అప్పకవి, అనంతుడు, చిన్నకోట పెద్దన్న, కవిజనాశ్రయ కర్త 11 అక్షరముల తర్వాత వడి నియమించినారు. ఈ నియమము ను పాటించినవారు నన్నయ, రామరాజభూషణుడు మొదలయినవారు. తాతంభట్టు 13 అక్షరముల తర్వాత వడి నియమించినాడు.

*5. జలోద్ధతగతి :* సంస్కృతములో 6 అక్షరముల తర్వాత; తెలుగులో 7 అక్షరముల తర్వాత.

*6. ప్రమితాక్షరము :* సంస్కృతములో 6 అక్షరముల తర్వాత; తెలుగులో 8 అక్షరముల తర్వాత.

*7. మౌక్తికమాల :* సంస్కృతములో 5 అక్షరముల తర్వాత; తెలుగులో 6 అక్షరముల తర్వాత.

తెలుగులాక్షణికులు విధించిన నియమము కొందరు కవులు అనుసరిస్తున్నారు; మరికొందరు కవులు దానిని పాటించక తమ కిష్టమయిన నియమము పెట్టుకొంటున్నారు.

కవిరాజ విరాజితములో ప్రతిచరణమందున్ను 8, 14, 20 సంఖ్యలందున్న అక్షరములు మొదటి అక్షరముతో మైత్రి కలిగి ఉండవలె నన్న నియమము అప్పకవి మొదలయిన లాక్షణిలు విధించినారు. ఈ నియమమును కంకంటి పాపన మొదలయిన కవులు కొందరు అనుసరించినారు గాని నన్నయ్య, పెద్దన, జక్కన మొదలయినవారు కొందరు చరణమధ్యమందు అనగా 14వ అక్షరమందు ఒక్క చోటనే ఈ వడినియమము పాటించినారు.

మధ్యాక్కర : మధ్యాక్కర లెక్కువగా రచించిన కవి ఒక్క నన్నయే. అతడు ప్రతిచరణమందున్న నాల్గవ గణము తర్వాత వడి నిల్పినాడు, యుద్ధమల్లుని శాసనములోని మధాక్కరలందున్ను వడినియమము ఇట్లే ఉన్నది. ఎర్రాప్రెగడ మూడవ గణము తర్వాత వడి పాటించినాడు. అప్పకవి మొదలయిన లాక్షణికులు అందరున్ను ఎర్రాప్రెగడ పాటించిన వడి నియమమే విధించినారు గాని, నన్నయ పాటించిన వడి నియమము పాటించలేదు.

ఇట్లే క్రౌంచపదము, త్రిభంగి వృత్తముల గురించి లాక్షణికులు ఎట్లు వివిధముగా లక్షణమును చెప్పినారో అనంతుని ఛందమునకు వ్రాసిన ఉపోద్ఘాతము (పు. 66-70) లో ఉన్నది చూడండి. ఇక్కడ స్థలము చాలనందున ఎత్తి వ్రాయలేదు.

ఈ విధముగా కవులు కొద్దిగానైనా ఈ వడిప్రాస నియమములు తమ కిష్టమైనట్లు మార్చుకొంటూ వచ్చినారు. కవుల పద్యములు చూచి లాక్షణికులు లక్షణము చెప్పవలసినదే కాని నియమములను విధించుటకు లాక్షణికులకు అధికారము లేదు గనుక. కవులు తమ చతురతను బట్టి తమ కిష్టమైన రీతిగా పద్యములు నడిపించి, శబ్దాలంకారతుల్యమైన ఈ వడి ప్రాసములు యథోచితముగా వాడుకొంటూ తమ భావములను రసవంతముగా వ్యక్తపరచి కవిత సాగింతురుగాక !

ఇంగ్లీషువారి పద్యరచన విషయములో సైతము లాక్షణికుల నిర్బంధము వల్ల కవులు కొంతకాలము పాడినదే పాటగా పూర్వులు చెప్పిన నమోనాలనే అనుసరిస్తూ వచ్చినారు. స్వాతంత్ర్యము వహించి, పద్యరచనలో కొత్తదారి కొంతవరకైనా తొక్కుటకు మొదలుపెట్టిన వాడు 14 వ శతాబ్దమందుండిన చాసరు కవి. ఇతడు రచించిన పద్యములందు కొన్ని చరణాలలో గల గణముల కూర్పు ఎట్లున్నదో చెప్పుట కష్టము. కొన్నిటిలో గణవిభజన సరిపడలేదు- అని 17-18

శతాబ్దములో అనుకొనేవారట! తర్వాత విమర్శకులు అతని పద్యలక్షణము చెప్ప గలిగినారు. రెండక్షరముల గణముల వంటివే (గల, లగ ములవంటివే) ఉండవలె నన్న ప్రాచీనసంప్రదాయమునకు విరుద్ధముగా గణములవంటి మూడక్షరముల గణములు సైతము ఇతడు వాడినాడు.

పూర్వసంప్రదాయమునకు విరుద్ధముగా గణములు పొందించి పద్యాలు రచించుటకు ఎక్కువగా సాహసించినవాడు 16 వ శతాబ్దారంభమం దుండిన స్కెల్టన్ కవి. నూతన పద్య రచనకు మార్గము చూపించిన వారిలో ప్రధానులు వియట్ అనే కవిన్ని అతని శిష్యుడయిన సర్రే కవిన్ని. వీరిలో సర్రే క్రొత్త క్రొత్త జాతి పద్యాలు రచింపడమే కాక అంత్య ప్రాస (రైమ్) నియమమును విడిచిపెట్టుటకు– అనగా బ్లాంక్ వెర్సు రచించుటకు సాహసించినాడు: చరణములోని విరామ (పాజ్) స్థలము పూర్వసంప్రదాయము చొప్పున ఉండవలసినట్లు ఒక్క చోటనే అన్ని చరణములందున్ను ఉంచక తన కుచితమని తోచినట్లు మార్చుతూ అట్లు మార్చుటవల్ల నడకలో ఎట్లు మార్పులు గలుగుతవో చూపించినాడు. గణముల కూర్పులోను, విరామస్థలము మార్చుటలోను, అంత్య ప్రాసనియమములు విడిచి పెట్టుటలోను. ఇంకా ఇట్టి అనేక విషయములలోను పూర్వసంప్రదాయములకు విరుద్ధముగా పద్యరచన సాగించి దొడ్డపేరు పొందిన మహాకవి షేక్స్పియర్. ఈ విషయములలో అతనిని ఆక్షేపిస్తూ వ్రాసిన విమర్శకుల వ్రాతలు అతడు లక్ష్య పెట్టలేదు. మిల్టన్ కవి పురాణవిషయములను ఎత్తుకొని వందలకొలది చరణ ములు గల మహాకావ్యమును బ్లాంక్ వెర్సులో రచించినప్పుడు వుడ్‌ఫ్రెడ్ అనే లాక్షణికుడు ఆక్షేపిస్తూ విమర్శించినాడు. ఈ విధముగా కవులు కొత్తదారులు తొక్కి పద్యకావ్యములు రచిస్తూ ఉంటే పూర్వాచారపరాయణు లైన లాక్షణికులు ఆక్షేపిస్తూ ఉండడము ఇంగ్లండు దేశములో సైతము జరుగుతూ ఉండేది. అయితే స్వాతంత్ర్యాభిమానము గల షేక్స్పియర్, మిల్టన్, పోప్, టెనిసన్, స్విన్‌బర్న్ మొదలయిన మహాకవులు లాక్షణికుల ఆక్షేపణలను పాటించలేదు. జోషువాస్టీల్ అనే పండితుడు పద్యచరణము గణవిభజన చేయవలసి నప్పుడు సంప్రదాయము నకు విరుద్ధముగా సంగీతములోని తాళప్రక్రియ బట్టి చేయవలె నన్న మతముగల వాడు. 19 వ శతాబ్ది మొదలు కొత్తకొత్త జాతిపద్యములు, పాటల వరుసల పద్యములు, పామరులకోసము, పిల్లలకోసము ఉద్దేశించి రచించిన పద్యములు వందలు వేలకొలదిగా పుట్టుతూ వచ్చినవి. ఇవి అన్నీ కొత్తగా పుట్టినవి గనుక

వీటికి పూర్వసంప్రదాయ నియమములు పట్టించనక్కరలేదని ఎవరిచిత్తమునకు వచ్చినట్లు వారు రచిస్తూ వచ్చినారు. కవులు తమ స్వతంత్రత నిలబెట్టుకొని కొత్త రచనలకు పూనుకొన్నారు గనుకనే ఇప్పుడు అనేకవిధములయిన కొత్తజాతి పద్య రచనలు సాపుగా సాగుతున్నవి. ఆవిధముగనే మన తెలుగు భాషలో సైతము కొత్తజాతి పద్యములు సాపుతేరవలె నంటే అభ్యాసము చేయవలెను. అభ్యాసము చేయుటకు ఆరంభించగానే విమర్శకుల ఆక్షేపణలకు, పరిహాసములకు భయపడి మానివేసిన యెడల ప్రయోజనము లేదు; పద్యరచన అభివృద్ధి చెందదు.

ఇంతవరకును పద్యరచనకు ఉపయోగిస్తూ వచ్చిన భాష కేవలము కృతక భాష—ఒకనాటిది కాదు; ఒక మండలముది కాదు, నన్నయకాలమునుండి నేటి వరకును కావ్యములలో కనబడుతున్నది; కొంత కవుల భ్రమ ప్రమాదములవల్ల చెడినది; కొంత ఛందస్సుకోసము రూపు చెడినది. ఇటువంటి సంకరభాషతో పద్య ములు రచించుటకు అలవాటు పడినవారికి వ్యావహారికభాషలో పద్యాలు రచించ డము అసాధ్యముగా కనబడుతున్నది. ఇదివరకు ప్రచారములో ఉన్న పద్య జాతులు వ్యావహారికభాషకు అనుకూలమైనవి కావని కొందరి అభిప్రాయము. ఇందులో సత్యము లేకపోలేదు. అయినా ఇంతమాత్రాన వ్యావహారికభాష పద్య రచనకు విడిచిపెట్టుకోవలసిన అగత్యము లేదు. పైని చూపించినట్లు కొత్తజాతి పద్యములు అనేకముగా కల్పించుకొని అవి వ్యావహారికభాషకు అనుకూలముగా నిడిపించుకోవచ్చును. ఈ కొత్తపద్య జాతులకు పూర్వలక్షణ సంప్రదాయములు పట్టించనక్కరలేదు. భాషను బట్టి పద్యా లుంటవి గాని, పద్యాలను బట్టి భాష ఉండదు. ఒంటిని బట్టి ఉడుపు లుండవలెను గాని. ఉడుపులను బట్టి ఒళ్ళు మార్చుకో లేరుగదా. ఏ పద్యాలు శ్రావ్యముగా ఉండి విన్నవారి చిత్తములను ఆకర్షించి నలుగురినోళ్ళను తాండవమాడుతూ సంఘమందు ప్రచారములోనికి వస్తవో ఆ పద్యములే మేలయినవి. వాటి వరుసనే నలుగురును పద్యాలు రచిస్తూ ఉంటారు. ఈ విషయములను గుర్తించి బాలకవులు తమ స్వాతంత్ర్యమును కాపాడుకొని, కొత్తరచనలకు పూనుకొని బహుజనరంజకు లయిన మహాకవు లగుదురుగాక!

ఛందోబద్ధ మయినంత మాత్రాన వట్టిమాటలు 'కవిత' అనిపించుకోవు. కవితకు రసము ప్రాణ మంటారు లాక్షణికులు. కవితకు విషయము ఇదీ, అదీ అని

నియమించ కూడదు, విశ్వమంతా కవితకు విహారభూమి. రసయోగముచేత ఇనుము బంగారమైనట్లు కవియొక్క ప్రతిభచేత ఏదైనా రసమయ మవుతుంది. కవులు ఈ లోకమును స్వర్గముగా మార్చగలరు. కవులు లోకగురువులు. ఒక్కొక్క యుగములో ఒక్కొక్క దేశములో ఒక్కొక్క విషయమై ఉద్బోధము చేసి సంఘమును ఉద్ధరిస్తారు. ఈ యుగములో తెలుగుదేశమును ఏవిధముగా ఉద్ధరించవలసి ఉన్నదో లోకజ్ఞులయిన కవులు ఆలోచించి అందుకు అనుకూల ముగా తమ కవితాశక్తి ప్రయోగించవలసి ఉన్నది. ఈ శక్తి అభ్యాసము వల్లనే వృద్ధిపొంది విస్తరిస్తుంది,

—గిడుగు వేంకట సీతాపతి*

---

* ప్రతిభ. సం. 1. సం. 1. ధాత వసంత పంచిక.

# కవిత్వాభిరుచులు : ప్రాతవి : క్రొత్తవి

కావ్యమంటే కవికర్మ అని పెద్దలు నిర్వచించారు. ఇక్కడ కర్మ అంటే ఆహార విహారాది కాయికం కాదు. రమ్యమైన అక్షరవ్యాపార మని విపక్షించుకో వాలి. వేదాలలోని ఋషులు కవులే. వారి ఋక్కులన్నీ కావ్యాలే. కాళిదాసాదులు కవులే, కాదంబర్యాదులు కావ్యాలే. నన్నపార్యుడు కవే, మహాభారతము కావ్యమే. మంత్రాలన్నా. శ్లోకాలన్నా, కీర్తనలన్నా అన్నీ ప్రధానసూత్రాన్ని బట్టి కావ్య కుటుంబానికే చెందుతవి. మాధుర్యం ప్రధానమైనా ద్రాక్షా ఖర్జూరాలు, గుడ శర్కరలు, మధుఫలరసాదులు వేరువేరుగా నున్నట్లు. అయితే యీ కవికుటుంబములో తపోధురీణులు, బ్రహ్మవాదులు, పురాణప్రవక్తలు. హ్లాదానురక్తులు కలరు. వీరంతా ఏ త్రోవల బోయినా, అందరికీ సామాన్యబంధం ఒకటి కనిపిస్తుంది. అనంతమైన యీ సృష్టిలో ఏ అందమో అద్భుతమో పొడకట్టింది. అది వారి అంతఃకరణలో హత్తింది. దానిని అన్వేషించడంలో పరివర్తన మెంతో జరిగింది. చివరకు అభీష్టార్థం సిద్ధించింది. ఆ తన్మయావస్థలో నిక్షేప విక్షేపాలకు అవకాశం ఉండదు. అందుచేతనే ఆ యానందానుభూతి బయలెక్కింది. వాఙ్మఖాన వస్తే కావ్యమయింది, చేష్టారూపంగా వెలువడితే నృత్యమయింది,

కవి అనే శబ్దం సిద్ధుడైన వాచావిధాతకూ, చిత్రమయిన విహంగపోతానానికీ చెల్లుతుంది. తూరుపు రేకలు తెల్లవారేటప్పుడు చూడ సుందరంగా ఉంటవి. ఆ రామణీయకంతో పులకరిస్తుంది శకుంత సంతానం. ఆనందం లోపల నిలిచేది కాదు, ఒక్కపెట్టున కంఠం పెకలించుకొని బయట పడుతుంది. అది మనోహరమైన మంజుల స్వరాలతో కమ్మని పాటగా వినబడుతుంది. లోకమంతా మేలుకుంటున్నది. ఈ ఉషస్సునే వైదికులు కూడా రక్తసూక్తులతో గానం చేశారు. వానిని విన్నప్పుడు ప్రసన్నమైన ఆనందం కలుగుతున్నది. భావస్థిరమై ఉన్న జాడ్య జాగ్రద వస్థా భేదం ప్రబోధిత మవుతుంది. సంధ్యావందనం చేసే ద్విజకులానికీ, సంధ్యా గీతంపాడే ద్విజసంతానానికీ ఏమైనా సంబంధం ఉండేనా ? ప్రకృతి అనుకృతు లనుకోవచ్చునా ?

వైదికులు మంత్రదర్శనం చేశారు. వాల్మీకి రామవృత్తం వెలయించాడు. కాళిదాసు శాకుంతలం లాలించాడు. తిరుపతి కవులు శ్రవణానందం రచించారు.

ఇదంతా వాగ్వ్యాపారమే! అయినా రూపకల్పనా భేదాలు కనిపిస్తున్నవి. దీనికి కారణం ఆయా కవుల ఉపాదియోగమే! ఉపాధి జాతి గుణక్రియా సంజ్ఞాదికంగా విభక్తమై ఉన్నది. అయితే అసలు ఆనంద సౌందర్యాలు రెండూ అనుపాధికాలు గానే ఉంట వని మనసు మరువగూడదు. అది అవ్యక్తం కూడా. ఈ విచారణ అంతా వ్యక్తాన్ని గురించి మాత్రమే.

ఉపాధినిబట్టి సాధన సామగ్రి మారుతుంది. శీతలారణ్యాల్లో జీవించిన మహర్షులు బ్రహ్మాండ ప్రకృతిని పరిశీలించారు. కుటుంబ కలాపంలో పడ్డ వాల్మీకికి సీతారాముల దాంపత్యమే రుచించింది. కామార్తిని ఆకళింపగలిగిన మహాకవికి మేఘదౌత్యం నచ్చింది. ఇట్లే ఆలోచిస్తే సమన్వయం దొరకకపోదు. ఆశ్రమాలు మహానగరాలుగా మారలేదా? పర్ణశాలలు సువర్ణసౌధాలుగా పరిణమింపలేదా? కృష్ణాజినాలు మూలపురుషులు ధరిస్తే పీతాంబరాలు వారి మనుమలు ధరించారు. నిరాహారులు నీవారాన్నం తిన్నారని నాగరకులు కలమాన్నం భుజింపక మానిరా? ఇందు గౌరవలాఘవా లున్నవా? విధినిషేధాలు కలవా? లేవు. ఇదంతా ఉపాధి పణామమే కాని ఆమూలాగ్రవిప్లవం కాదు.

ఈ న్యాయాన్ని ఆంధ్ర కవులకూ, తెనుగు సాహిత్యానికీ లగించి చూతము. ఆంధ్రజాతి అతిపురాతనమైన దని గ్రంథ నిదర్శనాలే ఉన్నవి. ఉపనిషత్తులనాటికే ఉన్నారు. కాని అప్పుడు వారు పుళిందసహవాసులై అనాగరకులుగా ఉండిరట! అయితే మగధ సామ్రాజ్యం నాటికి మహీచక్రం తిప్పగల సమర్థులైనారు. వైదిక కర్మ మార్గ మటుండగా బౌద్ధమతం అభిమానించారు. సంస్కృతమైన పాణిని భాష అటుండగా ప్రాకృతమైన ప్రజావాక్కునే పాటించారు. నే నీగొడవ తడవడం ఎందుకంటే ఆదినుంచీ వారు పరతంత్రులు కాక స్వతంత్రస్వభావం కలవా రని తేల్చడానికి, కదనరంగంలో కత్తులవలెనే కవితాఫలకం మీద వారి ఘంటాలు మెఱసినవి.

ప్రస్తుతానికి వత్తము. ఆకాలపువాడే హాలుడు. అత డాంధ్రుడు. చక్రవర్తియై రాచరికం జరిపినట్లే సహృదయుడై సాహిత్యవ్యవసాయం కూడా నెరపాడు, అందులో తియ్యని వాకిండ్లముందు మిథునానురాగ మాధుర్యం పొడవి చూపించాడు. హాలుని గాథలో పడుచులోకం కనిపిస్తుంది. వారి యనురాగ భోగాల తోటే వాతావరణమంతా పరిమళిస్తుంది. ప్రియుల ముద్దుముచ్చట్లు, సరససంకేతాలు, ప్రణయాపచారాలు, విరహోపచారాలు—వీటిదే ప్రధాన ప్రసక్తి, చాతుర్యస్వాదిమలే తొణికిసలాడుతుంటవి. పతివ్రతాధర్మాలు, కులాచార సంప్రదాయాలు

మొదలైన గతానుగతికాలు స్ఫురించవు. ఇదే శృంగారం. దీని బీజాలు వెదపెట్టిన వారు మొట్టమొదట ఆంధ్రులే నేమో ? ఏలయన అంతకు ప్రాచీనమైన సంస్కృత వాఙ్మయంలో యావద్విశిష్టంగా ఇట్టి శృంగారం ఎక్కువ కానరాదు. ఊర్వశీవృత్తం వదిలితే ఋగ్వేదంలో ఉన్న యమీయమ సంవాదం మిథునానురాగానికీ, ప్రాయశః శృంగారరసానికీ ప్రాతిపదిక అని వేత్తలమతం. ఆ సంవాదం మిథునానురాగ స్ఫోరకంగా ఉన్నమాట నిజం. ఆవేడి ఆతీపి అందులో స్ఫురిస్తున్నవి. కాని యమీయములు సహోదరు లవడం చేత ఏతదనుబంధపరిణామమే కావ్యశృంగార మని చెప్పడానికి వీలు కాకున్నది. కాబట్టి హాలుడు విలక్షించిన మిథునానురాగమే 'శృంగార ఏవ రసః' అను అనంతసిద్ధాంతానికి విత్తన మనడం సమంజస మని నా మనవి. ఇది చాలా ముఖ్యమైనది; ఎందుచేత నంటే తరువాతి కావ్య రచన అంతా యీ సూత్రాన్ని పట్టే, ప్రధానంగా నడిచింది. ఇది మనందరికీ స్పష్టమే !

ఇక ఆంధ్రకవులు — వీరిలో నూటికి తొంబదిమంది రామణీయకవాదులు. వీరి దీ రీతి సంప్రదాయం; అందువల్లనే పంచమవేదం తెనుగులో తీర్చినా, పాండురంగ మహాత్మ్యాన్ని ప్రబంధించినా సజాతీయమైన స్వాదుపథంనుంచి దూరం పోలేకపోయినారు. సంస్కృతంలో భారతం ఇతిహాసమైనా తెనుగులో కావ్యరూపంతో కలకలలాడింది. తీర్థ మహాత్మ్యంలో సహితం తమ్ముడికి తలదువ్వే సోదరీ చాతుర్య సౌందర్యాలే పరిణమించినవి, గీర్వాణంలో ఉన్న నైషధం, శృగారించుకోకుండా తెలుగులోకి వచ్చిందికాదు. చెప్పదలచిందేమంటే. సాహిత్యం ఎవరిదైనా పాకం తెలుగునాటిదని. అయినా ఏకవి అభిరుచి ఆ కూతాలు ఆ కవిని నడిపినవి. ఏకాలపురంగు ఆ కాలపు కవుల భావాంబరాలకు బాగా తగిలింది. ఏ సంఘంలో మెదిగిన కవికి ఆ సాంఘిక నాగరకాభ్యాసాలు అవిభక్తంగా అంటినవి. అద్దాలలో వలె ఇవన్నీ వారి కరణకౌశలాల్లో కనబడుతున్నవి కూడా ! నన్నయ అవిరళజపహోమతత్పరుడు. అతడు తనరచన 'పండితచేతో నిర్వృతి' చెయ్యవలెనని ఆశించాడు; సకల సూరిసభారమ్యంగా ఉండవలె నని ఉద్యమించాడు. తుదకు ఇతరులు అక్షరరమ్యతనైనా ఆదరింపకపోరని విశ్వసించాడు. సోమయాజి యైనప్పటికీ తిక్కన్నకు విద్వత్సభల గొడవ కాసంత కూడా పట్టలేదు. శతసహస్రాక మైన ఆంధ్రావళికి ఆనంద మయ్యేటట్లు భారతం పూర్తిచేస్తానన్నాడు. ఎవ రేమంటే నాకే మన్నాడు శ్రీనాథకవి సార్వభౌముడు. కావ్యకన్యలను అమ్ముకొని పడుపుకూడు తినడం కంటె కవులు కానవి కంతల్లో కందమూలాలు త్రవ్వు

కోవడం లెస్స అన్నాడు పోతన్న. కర్పూర తాంబూలాలు, తూగుటుయ్యాలలు లేనిదీ కవిత్వమే రాదన్నాడు, కవితాపితామహుడు. ఈలాగే యీ జాబితా నింకా పెంచవచ్చు. వీరంతా యిలా చెప్పడానికి వారి స్వభావాభిరుచులే కాక తత్తత్కాల ప్రభావానుభావాలు కూడా కారణా లని నా విధేయప్రతిపాదన.

బ్రతికిచెడ్డ ఆంధ్రులకు తిరిగి 11-వ శతాబ్దంలో స్థాయి కుదిరింది. దేశానికీ, ప్రభుత్వానికీ స్థిరమైన సీమాస్థాపనం జరిగింది. ప్రజలను. ప్రజానాగరికతను ప్రేమించే రాజులు సింహాసనా లెక్కారు. విద్యావినోదాలు, పండితసభలు ప్రతిష్ఠలోకి వచ్చినవి. మగధ సామ్రాజ్యం మోసిన ఆంధ్రజాతి అగాధవిస్మృతిలో పడి పోయిన విషాదఘట్టం సెలవేసింది, ఈలోపం ఎలా వచ్చిం దని శోధన జరిగింది. స్వభాషను ఉపేక్షించడమే ఈ చేటుకు మూల మయిం దని తేల్చుకున్నారు. వాకిండ్లు తెరిస్తేనే కాని తెనుగుదీపం బయట ప్రకాశించ దని నిశ్చయించారు. అక్షరరమ్యా లయిందాకా జాతి అందచందాలకు. ప్రతిభా, ప్రతిష్ఠలకు నిలకడ కుదురదని సిద్ధాంతం చేశారు. ఆచండాలాంతంగా ఒక ఆవేశం తాండవమాడింది. రాజరాజు కావలెనన్నాడు. వాగానుశాసనుడు సరే నన్నాడు. ఆయన సామాన్యుడు కాడు, బృహస్పతికి పాఠాలు చెప్పగల బుద్ధిశాలి. నానారుచిరార్థసూక్తులకు నిధి 'హరిః ఓమ్మ'ని గోదావరి ఒడ్డున ఘంటం పట్టాడు. వెంటనే ఎదురుగాలి తిరిగింది. ఆక్షేపణ మేఘాలు ఉరిమినవి; ఏమంటే మహాభారతం ఐదోవేదం. తెలుగులోకి తెస్తే దాని పావిత్ర్యం భ్రష్టమౌతుంది. అదిగాక సంస్కృత పాణిన్యుపదిష్టమైన భాష, తెనుగు వ్యాకరణం లేని నుడికారం. కాబట్టి యీ విప్లవాన్ని అరికట్టవలె అన్నారు పండితులు. నన్నయ జంకలేదు. పట్టినపట్టు విడువలేదు. భాష బంగారంవంటిది. ఆభరణాలు తీర్చడం పనివాడి నేర్పునుబట్టి ఉంటుందన్నారు. అపూర్వంగా అద్భుతంగా, అనన్యంగా, అర్థోన్ముక్తంగా ఆంధ్రంలో భారతం పొందించి అందించాడు. ఆ మహానుభావుడు ఆంధ్రుల కులపాస్యుడు. అమృతప్రదాత !

నన్నయ రాజాస్థానంలో ప్రధాన పండితుడు. తిక్కన్న రాజాస్థానంలో ప్రధానమంత్రి. ఒకడు రాజాదరణ పొందారు. ఇంకొకరు రాజ్యాధికారం నిర్వహించారు. ఇద్దరికీ దృష్టిభేదం ఉండదా ? స్వానుభవం వేదాంతుల వాసనకంటే బలమైనది. భట్టారకుని ప్రతిభాపాండిత్యాలన్నీ శబ్దప్రతిష్ఠాపనంతోటీ, రీతిని రమణీంచడం తోటీ నిలిచిపోయినవి. సోమయాజి ప్రజ్ఞాబలాలు, భాషకు సర్వతోముఖ మహత్వం కల్పించిందాకా ఆగలేదు. అందువల్లనే ఆయన వాక్కులో వేరాగాని కాత్రుతి

దొరుకుతుంది. వేదాంతం చెప్పేటప్పుడు వేత్త– రాయబారం నడిపితే నేర్పరి– రణరంగంలో దిగితే వీరశిఖామణి– తగవులు సవరిస్తే తీర్పరి. ఈలాగ ఏరేఖ కారంగు, ఏవస్తువు కాపాకం కుదిరించే కౌశలం కావలసినంత గోచరిస్తుంది ఈయనదగ్గర. తిక్కన రచనతో మనభాష నిజంగా తెనుగు మీరిపోయింది.

ప్రజాచైతన్యం మహాప్రవాహం వంటిది. ఏయేటి కాయేడు కొత్తనీరు తగులుతుంది– ప్రాతజీవనాన్ని కదిలిస్తుంది. నన్నయభట్టారకుడు పుణ్యాహవాచనం నేసిన తరువాత ఆంధ్రదేశచక్రం గిఱ్ఱున తిరిగింది, గ్రహాలన్నీ ఉచ్చ కెక్కినవి. కాకతీయసామ్రాజ్యం విస్తరించింది. మగతనం మింట మెరిసినది. ఐశ్వర్యం అతిశయించింది. సంఘంలో నాజూకు నాయకం బలిసింది. ఆంధ్రనగరి లోకాకర్షకమైంది. ఈ కాలంలో శ్రీనాథుడు కేశఖండనోత్సవంతోపాటు కవితావసంతోత్సవంలో ప్రవేశించాడు. నూనూగుమీసాల నాడే హాలుని గాథాపుత్రికలకు తెనుగు పుట్టింట్లలో జోలలు పాడాడు. పైలాపచ్చీసు వచ్చింది. అయఃపాకంలో వున్న సంస్కృతనైషధాన్ని నవనీతపాకంగా ఆంధ్రభాండంలోకి దింపాడు. పల్నాటి పాటలో పరవశుడైనాడు. ఇటుతిరిగి విద్వత్సభల కెక్కాడు. డిండిమభట్టుఢక్క పగులగొట్టించాడు. దీనారటంకాలతో తీర్థమాడాడు. కవిసార్వభౌముడై కుళ్ళాయి పెట్టాడు, అపరంజికంచాలలో ఆరగించాడు, ఈ మహాకవికి జీవితం ఆకాలపు తోకచుక్క అందామా? లేక సమకాలిక ప్రతిబింబ మందామా? గంధర్వాంగనలను చూడబోవలె, కస్తూరిదానం చెయ్యమని రాజుల నడిగిన కవిరాజు లున్నారా? మనము విన్నామా? శ్రీనాథు డెట్లు సాహసించెను? దీనికి ప్రత్యుత్తరం ఆకాలపు ఆంధ్రుల చరిత్రలోనే ఉన్నది.

అది రెడ్డిరాజుల ప్రభుత్వం. వారు మొట్టమొదట క్షేత్రదేవత నారాధించి సుఖపడ్డ కష్టజీవులు. ఐనా దేశం అరాజకమయ్యే యెత్తు వచ్చినప్పుడు నాగలి పగ్గాలు ఆవల పారేసి శస్త్రసూత్రాలు పుచ్చుకొన్నారు. సింహాసనా లెక్కారు. రాజ్యతంత్రం నడిపారు. ఆ ప్రభావంతోనే ఆ విశ్రాంతిసుఖంలోనే సాహిత్యసమ్మోహనాస్త్రం వీరిమీద పడ్డది, వాత్స్యాయనుడు చిత్రించిన నాగరికుడు వీరి నాకర్షించాడు. ధన్యజీవితానికి నాగరికుడే లక్ష్యంగా భావించారు. ఆ లక్షణాలు అనుష్ఠానంలో పెట్టడానికి ప్రయత్నించారు; ఆ విషయం విస్తరించడానికి కాలం చాలదు. దారు దత్త అగ్నిమిత్రులకు ఆంధ్రుల్లో కుమారగిరిరెడ్డి, రఘునాథభూపాలురకు ఆనాగరికలక్షణాలు అంది చాపులుగా పట్టుతవి. ప్రభువులు నాగరక సంప్రదాయాల్లో

పడితే ప్రజలు మాత్రం ఊరుకుంటారా ? సుగంధద్రవ్యాలకోసం భాండారాలే కట్ట వలసి వచ్చింది, దేశమంతా వసంతోత్సవాలతో ఝల్లున తెల్లవారసాగింది. ఈ అతి క్రీడావిలాసంలో, అమితరాజోపభోగాల్లో, అపరిమిత ఉల్లాసలాలసంలో, ఆంధ్రు లుఱ్ఱూత లూగారు. ఆదినాలలో దాక్షారామం తీర్థోపవాసాల కోసం పోదురా ? అప్సరసహవాసం కోసం పోదురా ? కాబట్టి శ్రీనాథుడి జీవితంలో అనాటి చైతన్య చిహ్నాలు ఉపలక్షిస్తే అది సాహసం కాదు; సహజమే అవుతుంది.

ఈ వాతావరణమే విద్యానగరం విజృంభణంనాటికి మఱింత చిక్కపడ్డది. సామ్రాజ్యం దూరాతిదూరంగా విస్తరించింది. జయస్తంభాలు దిగ్దిగంతాల లేచినవి. విజయనగరం వీథుల్లో గుట్టలవలె గులాబీలు రాసులు పోసేవారు. అంగళ్ళలో నవ రత్నాలు బస్తాలు క్రుమ్మరించి అమ్మేవారు. పడుచులు దాగుడుమూత లాడేటంత విశాలంగా కృతకాద్రిమందిరాలు నిర్మించారు. ప్రాభవోన్మాదంతో తల దిమ్మె కొన్న ఆ రోజులలో పెద్దన్న ఉయ్యాల తాంబూలాలు కావాలన్నాడంటే ఆశ్చర్యం లేదు. సశరీర స్వర్గసుఖంలో తలమునక లవుతున్న కన్నెలు కుశలత ఏ వ్రతాల్లో ఉన్నదని ప్రశ్నించడం ప్రగల్భం కాదు. ముక్కోపంతో చెయ్యిచేసుకున్న బ్రాహ్మణ్ణి పిండివెట్టక వదలిపెట్టడమే గొప్ప. కాళ్ళమీద పడ్డ నాయకుణ్ణి పడదన్నిన నాయిక లను బాహాటంగా ఏకవులు వర్ణించినారు ? అది రసభంగం కాదని ఏనాటి సహృద యులు సమ్మతించారు ? ఆనాటి ఉల్లాసప్రవృత్తికీ రసికమర్యాదకూ ఇవన్నీ ఛాయ లని నా విశ్వాసము.

ఈ గంధానిలం ఆంధ్రు లెక్కడికి పోతే అక్కడికి ప్రాకింది. వీరు సాహిత్యప్రపంచంలో అక్షరరమ్యసంప్రదాయాన్ని పారమ్యం ముట్టించారు. తరువాత నాదోపాసకులై తంజావూరులో తంబురపట్టారు. తోడ్తోనృత్యం ముందంజ వేసింది. నాటకరంగాలు కట్టారు. రఘునాథరాయ లీ మాధురీప్రకరణానికి సూత్ర ధారు డైనాడు. శోభనంపై శోభనం అవ్వత్తమైన విజయవిలాసం వెలిసింది. శృంగారలీలామయంగా రాధికాస్వాంతనం సిద్ధించింది.

ఇక వర్తమాన కవులు—ఆంధ్రుల రాజ్యాలు నిద్రవోయినవి. ఓడరేవులు పూడిపోయినవి. ఐశ్వర్యం అస్తిపుష్పైంది. ప్రజ్ఞాబలాలు కూడా ఎండాకాలపు చెరువులైనవి. అయినా వాసన వదలలేదు. పూచి కాచిన పండ్లతోట కదా ? వృద్ధ వృక్షాలకు అంట్లు రావా ? నిక్షేపమైన బీజాలు సరియైన తొలకరి వస్తే మొలక రించవా ? ఆంధ్రులు అసలు మతాంధులు కారు. అందులో సన్యాస ప్రవృత్తి

వారికి బొత్తుగా గిట్టదు. నాగరక గృహస్థాశ్రమం వారికి అభీష్టాపత్తి, భోగభాగ్యాలు ఉపాదేయాలే కాని గర్హ్యాలు కావు. అందువల్ల నే బైరాగులలో ఆంధ్రులు తక్కువ. దేశంలో కూడా వేదాంతులకన్నా వైయాకరణు లధికం. కావ్యాలంకారశాఖలలో వారిది మీదిచెయ్యి. కాశీలో కూడా సాహిత్యపీఠానికి రాజా గంగాధరశాస్త్రికే పిలుపు వచ్చింది. కావ్యమీమాంస అంతా ఆపోసనపట్టి రసగంగాధరం సృష్టించడానికి పండితరాయలే చాలినవాడైనాడు. ఇక మన పూర్వులిచ్చి పోయిన తెసుగుమాన్యం శృంగారవనం గాని వేదాంతమఠం కాదు. ఇట్టి దేశంలో ఇలాటి మోహన వారసత్వంతో నవ్యకవులు బయల్దేరారు. నవ్యసాహిత్యం సాగుతున్నది.

వీరు ఆదిలో "పురాణమిత్యేవ న సాధు మన్యే" అన్నారు. దానితో కావ్యావరణంలోంచి బ్రహ్మాది త్రిమూర్తులు నిష్క్రమించారు. చిల్లర దేవతలను చెప్ప నక్కరలేదు. రాచనగళ్లలోను రాణీ దూతికల్లోనూ మాత్రమే రామణీయకం బందె పడలేదన్నారు. సౌందర్యోపాసనకు సంభోగాసుభూతే సిద్ధికా దన్నారు. దీనితో నాయికానాయకులకు చుట్టూ గీచిన హద్దులు చెరిగిపోయినవి. కవి స్వయముగా నాయకు డైనాడు నిర్భయంగా అస్మచ్ఛబ్దంతో సంభాషించాడు. నాయికను ప్రాణసఖిగా, హృదయేశ్వరిగా, ప్రియసోదరిగా, పవిత్రజననిగా, ఆనందస్వామినిగా ఆరాధించడానికి దిగాడు. ఈ సాధనలో ఇష్టదేవతలకోసం అన్వేషణ జరిగింది. అఖండ ప్రేమతో అనంతశోభలతో అక్షయ్యంగా ప్రత్యక్షంగా ఉన్న ప్రకృతినే పట్టుకొన్నాడు. హృదయతంత్రులు ఎటు మేళనమైతే అలా పాడుతున్నాడు.

నవ్యసాహిత్యంలో దేశాభిమానం పొంగులు పోతున్నది. తల్లిదేశంకంటె యిష్టదేవత లే దంటున్నారు నవ్యకవులు. కాని దీని విశృంఖల వ్యాప్తి మానవ స్వభావం చిత్రించడంలో అధికంగా ఉన్నది. అది ఎంతకాలం కరాళంగా కలుషింపగలదో అంత అమృత ధవళంగాకూడ పవిత్రీకరింపగలదు. కొందరు కవులలో ఉత్సాహమే ప్రధాన రేఖ. మరికొందరిలో విషణ్ణభావం అధికం. మరికొందరి వాక్కులలో ఆకలిచిచ్చువంటి ప్రచండదావానలం మరుగుతున్నది. ఇంక కొందరిలో ప్రసన్న ప్రణయమే కలదు. దీనికంతా వర్తమాన వాతావరణమే కారణం. భిన్న సాహిత్య శాస్త్రాల సాంగత్యాలు కూడా ఉపకారం అయినవి. మానవుడు బుద్ధి చేతనేమి, సాధనచేతనేమి పురోగమనంలో వున్నాడనే ఆశయం ఒకటి నాటుకొన్నది. ఇదే అన్నిటికీ మూలాధారం.

—రాయప్రోలు సుబ్బారావు*

—X—

*భారతి- నవంబరు 1939.

# మార్గదర్శి గురజాడ అప్పారావుగారు

సధర్ములకు మహాపురుషు లెప్పుడూ జ్ఞాపకం వస్తూనే వుంటారు. అయినా సంవత్సరాని కొక్కమాటు వారిని ప్రత్యేకశ్రద్ధాభక్తులతో స్మరించుకోడం వారి అడుగుజాడల్లో నడిచేవారికి మిక్కిలీ శ్రేయస్కరం.

అది సభ్యతకు చిహ్నమున్నూ.

ఈ దృష్టితో, యివాళ, నేను గురజాడ అప్పారావుగారిని విశిష్ట భక్తితో స్మరించుకొంటున్నాను.

బతికివుండినదినాల్లో వారిని ఆంధ్రప్రజానీకం గుర్తించలేకపోయింది; కాని, తరవాత మాత్రం, సంవత్సరంమీద సంవత్సరం గడచినకొద్దీ వారి విషయమై ఎక్కువగా తెలుసుకుంటోంది. వారి రచనలకోసం అర్రులు చాపుతోంది. అవి చదివి ఆనందముగ్ధం అవుతోంది. ఆవెంటనే 'యెలాంటి పెన్నిధిని గుర్తించలేక పోయామా ?' అనిన్నీ పరితపిస్తోంది.

అసలే ఆంధ్రజాతికి ఆత్మగౌరవమూ, ఆత్మవిశ్వాసమూ ఇంకా గుర్తుకి రాలేదు. దీనికి సాయం, అప్పారావుగారు అసందర్భపరిస్థితుల్లో బతుకవలసి వచ్చింది.

అప్పటికి కాదు, ఇప్పటికీకూడా. సారస్వతనిర్మాతలకు, ఆంధ్రదేశంలో స్వతంత్రజీవనమార్గా లేర్పడనే లేదా మరి.

మనవాళ్ళు. ఇప్పుడిప్పుడు, కొందరు కొందరు రచయితల విశిష్టత గుర్తించి ఆదరించడం, నేర్చుకుంటున్నారు. ఆదరించడం అంటే, మెడలో ఒక పూలదండ వెయ్యడం, కొన్నిచోట్ల వొక ఖద్దరుదుప్పటీ బుజాలమీద కప్పడం—ఇంతే. అంతేకాని, ఆ రచయితలు నౌకరీచేసే పొట్టపోసుకుంటున్నారో, అదీ చేత కాక, పస్తే వుంటున్నారో యెవరూ యోచించడం లేదు.

కొందరి రచనలు ఆనందం కలిగిస్తున్నా యనుకుంటున్నారే గాని. అలాంటి పుస్తకాలతోనే సాహిత్యం ఉన్నతిపొందుతుందనీ, ఉన్నతసాహిత్యం సంపాదించు కున్న జాతే స్వేచ్ఛానందా లనుభవించగలుగు తుందనిన్నీ కూడా వారు గుర్తించడం లేదు.

ఇప్పుడే, కవులకర్తవ్యం వేరూ, జీవనవిధానం వేరూ అయివుండినప్పుడు, సాహిత్య విషయాలలో కూడా అడివి ఛేదించి కొత్తమార్గాలు నిర్మించుకోవలసిన అప్పారావుగారి కాలంలో, రచయితలను గుర్తించే పద్ధతే లేదని వేరే చెప్పడం యెందుకూ ?

అయితే సుగంధపుష్పాలు ఆస్వాదించేవారికోసం యెదురు చూడవు. కీకారణ్యాలలో, ముళ్ళడొంకల్లో కూడా అవి పుడుతూనే వుంటాయి.

అది సృష్టిరహస్యం.

ప్రకృతం —

ఒక మనుష్య స్త్రీ, అప్పలకొండయ్యమ్మ, తన సొంతానికి ప్రయివేటు శక్రటరీగా వాడుకోగా, సరిగా అ సమయంలోనే వొక దేవతాస్త్రీ, సరస్వతీదేవయ్యమ్మ, బహుళాంధ్రకోసం మహాకవిగా తీర్చి దిద్ది, ఆధునికాంధ్ర సాహిత్యసామ్రాజ్యంలో కిరీటమాంధాతను చేసింది.

ఇదీ, సూక్ష్మంలో, అప్పారావుగారి జీవిత చరిత్ర.

విస్తరించి చూస్తే, అప్పారావుగారి దగ్గిర, లౌకికప్రజ్ఞ అపారంగా వుండినట్టు కనబడుతుంది. వైదికసంపత్తి కూలంకషంగా వుండినట్టు గోచరిస్తుంది. అర్ష విభూతి అనన్య సాధారణంగా వుండినట్టున్నూ ద్యోతకం అవుతుంది.

ఈ మూడు శక్తుల సమ్మేళనం వల్లనే అప్పారావుగారు మహాకవులై, మనకు, అలౌకికానందం కలిగించ గలుగుతున్నారు.

ఆదికాలంలో, నన్నయభట్టారకునకు పట్టిన యోగ్యత యిది.

తరవాత కొద్దికాలానికే తిక్కయాజ్వకున్నూ సంక్రమించిన విశిష్టత యిది: కాని, యిది మళ్ళీ ఆంధ్రజాతిలో జాజ్వల్యమానం కావడానికి ఇంతకాలం బట్టింది.

దేశం ఎంతగా పరులపాదాలకింద నలిగిపోవాలో అంతగానూ నలిగిపోయాకా, జాతి యెంతగా బానిస అయిపోవాలో అంతగానూ బానిస అయిపోయాకా, భాష యెంతగా శృంఖలాబద్ధం అయిపోవాలో అంతగానూ శృంఖలాబద్ధం అయిపోయాకా, సాహిత్యం ఎంతగా దిగనారిపోవాలో అంతగానూ దిగనారిపోయాకా, భవిష్యత్తు ఎంతగా అంధకార బంధురం అయిపోవాలో అంతగానూ అంధకారబంధురం అయిపోయాకా పుట్టుకువచ్చా డీ మహాకవి.

ఆశ్చర్యపడడాని కేమీ లేదు. ఏమంటే ? నిజానికి ఇలాంటి పరిస్థితుల్లోనే తరుచు అదర్శపురుషు లావిర్భవిస్తూ వుంటారు.

అయితే, అలాటి నికృష్టస్థితిలో మహాకవి కయితేమాత్రం నరసేవ చెయ్యకుండా భుక్తి యెలా గడుస్తుందీ ? ఆ పురుషుడు చెయ్యిజారిపోకుండా, జాతి మాత్రం అతని మహత్తు ఎలా గుర్తించగలుగుతుందీ ?

అయితే అప్పారావుగారికి మాత్రం తమసత్తా బాగా తెలుసు—ఒకచోట—

"తూర్పు బలబల తెల్లవారెను
తోకచుక్కయు వేగుచుక్కయు
ఒడయు డౌ వేవెల్గు కొలువుకు
వెడలి మెరిసిరి మిన్నువీధిని"—అన్నారు వారు.

తోకచుక్క విచ్ఛిత్తికి సూచకం. వేగుచుక్క మహోదయానికి సూచకం. నిజమే కాని, యీ తోకచుక్క యేమిటి ? ఇది చేసిన వినాశం యేమిటి ? ఈ వేగుచుక్క యేమిటి. దీని తరువాత జరిగిన మహోదయం యేమిటి ? అంటే—వశ్యవాక్కులు శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు, గిడుగు రామమూర్తిపంతులుగారే తోకచుక్క అనీ, గురజాడ అప్పారావుగారే వేగుచుక్క అనీ వ్యాఖ్యానం చేశారు.

రామమూర్తి పంతులుగారు చేసింది కృతకభాషా విధ్వంసనమేగా ? అప్పారావుగారు చేసింది కవికుమారుల కళ్ళకు వెలుగు కలిగించడమేగా ?

అంచేతనే మిత్రులు, ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రులవారు, అప్పారావుగారిని 'గురజాడ వాల్మీకి' అని వ్యవహరించారు.

నేస్తం, భమిడిపాటి కామేశ్వరరావుగారు 'స్వయం జ్యోతి' అనీ, 'ప్రథమాంధ్ర రచనా బ్రహ్మ' అనీ కీర్తించారు.

అయితే, యీ మిత్రులిద్దరూ ఆ మహాకవిని ప్రత్యక్షంగా చూసి యెరుగరు.

నాకు మాత్రం ఆ మహాభాగ్యం పట్టింది.

ఒక్కమాటే పట్టింది.

కాకినాడలో, ఆంధ్రసాహిత్య పరిషద్వార్షికోత్సవం జరిగింది. అప్పటి కా నగరంలో ఇప్పటి టౌనుహాలు లేదు. అంచేత, ఆ సమావేశం మునిసిపల్ ఆఫీసులో జరిగింది.

తొలినాడు కిడాంబి రామావతారంగారూ, మలినాడు పిఠాపురం మహారాజులుంగారూ (?) అధ్యక్షత వహించి కార్యక్రమం నడిపించారు. ఆ కార్యక్రమం ఏర్పరచినవారూ. పైని వుండి సర్వమూ పర్యవేక్షణ చేసినవారూ మాత్రం జయంతి రామయ్యపంతులుగారు.

అధ్యక్షు లిద్దరూ రామయ్యపంతులుగారి ఇంగితం గుర్తించుకుంటూనే కార్యక్రమం నడిపించారు.

మలినాటి పొద్దుటిపూట కొన్ని తీర్మానాలు జరిగాయి. ఆ సందర్భంలో గిడుగు రామమూర్తిపంతులుగారు వ్యావహారికభాషావాదం ప్రతిపాదించగా, గురజాడ అప్పారావుగారు బలపరిచారు.

అప్పటికా యిద్దరే వ్యావహారికభాషావాదులు.

మహాపండితులు తాతా సుబ్బారాయశాస్త్రులవారూ. పేరి కాశీనాథశాస్త్రులవారూ కూడా అప్పు డా సభలో వుండినారు.

అయితే, అప్పటికి వారు పూర్తిగా మారినట్టు జ్ఞాపకం లేదు; కాని వారు, వ్యావహారికం యెదిరించిన పురాణపండా మల్లయ్యశాస్త్రిగారి (లిఖిత) గ్రాంధికోపన్యాసంలో అడుగడుగునా తప్పులు పట్టటంమాత్రం నాకు బాగా జ్ఞాపకం వుంది.

ఉద్యోగధర్మం పురస్కరించుకునే కాక, పాండిత్యం పురస్కరించుకునిన్నీ వారు, అప్పారావుగారిని చాలా ఆదరంగా చూసేవారు. తెల్లటిపంచె, నల్లటి పొడుగుకోటు, ఆ కోటుమీద ఆకుపచ్చని జలతారు శాలువ, శిరస్సున తేజోమండలంలాగ నిండైన పాగా, పరిణతవయస్కతకు సూచకంగా తిలతండులన్యాయంగా వుండిన గుప్పెడేసి మీసాలు, పట్టిపల్లారుస్తున్న దీర్ఘవ్యాధికి గుర్తుగా చప్పిదవడలు, కాని, దూసుకుపోయే చురుకైన చూపులు.

ఇదీ, ఆవొక్కమాటే నేను చూసిన ఆమహాకవి మూర్తిమంతం.

అప్పటి ఆ సమావేశం అంతటిలోనూ ఒక్క అప్పారావుగారి ఆకృతే విలక్షణంగా వుండింది. అందుకు తగ్గట్టు, ఇప్పటి ఆంధ్రసాహిత్యం అంతటిలోనూ ఒక్క అప్పారావుగారి రచనలే విలక్షణంగా వున్నాయి.

ఏవంచ—

ఉబ్బసంతో వొగర్చుకుంటూ, కుక్కూ దగ్గుకుంటూ అప్పారావుగారు తీర్మానం బలపరిచి 'నేను బలపరిచాను' అని రామమూర్తిపంతులుగారి చెవిలో నోరుపెట్టి ఇంగ్లీషులో గట్టిగా కూడా చెప్పారు,

ఆభంగిమ చూసీ, ఆమాట వినీ, వ్యావహారికవాదులు వారిద్దరే కావడం గుర్తించీ, ఆవాదమున్నూ విని వుండిన్నీ, అప్పు డక్కడ వుండిన గ్రాంథికవాది ప్రముఖులు ఎగతాళి చేశారు.

వారి ననుసరించి యువకరచయితలున్నూ చాలామంది నవ్వారు.

ఒకక్షణం దాటితే నేనూ వారిలో చేరిపోయేవాణ్ణే కాని, నలుగురితోబాటు నవ్వవలసి వుండిన్నీ, నవ్వబోయిన్నీ, చివరికి నవ్వలేకపోయాను. కారణం, నా గురువర్యులు వేదుల రామకృష్ణశాస్త్రుల వారి మందలింపు.

"వారిద్దరూ మహాపండితులు, వారిని న్యూనతపరచడం మనకి క్షేమం కాదు. వారివాదం వినడం- చేతనయితే యెదిరించడం- యిది మనం చెయ్యవలసింది' అన్నారు; శాస్త్రులవారు, ఆకతాయి నయిపోకుండా నన్ను వారిస్తూ.

రామకృష్ణకవుల యిద్దరిలోనూ వెంకటరామశాస్త్రిగారిది సత్యం గ్రహించే తత్వం, రామకృష్ణశాస్త్రులవారిది సత్యం ఆచరించే స్వభావం.

నేను గట్టిగా చెప్పగలను.

రామకృష్ణశాస్త్రులవారు బతికేవుంటే వ్యావహారిక భాష స్వీకరించేవుందురు.

ఏతావతా :

నెల్లూరుజిల్లా సాహిత్యచక్రవర్తి గునుపాటి యానాదిరెడ్డిగారు నాపక్కనే కూచుని వుండినారు. వారు వేదం వెంకటరాయశాస్త్రుల వారికి శిష్యులూ, కుడి భుజమూనూ.

రామకృష్ణశాస్త్రుల వారు చెప్పింది విని 'అదీమాట' అన్నారు రెడ్డిగారు, తర్జనితో టోకాయిస్తూ,

ఏమయినా, పదికాకుల్లో వొక కోకిల, రాజవీధిని దర్జాగా వెడుతున్నమద గజం- ఇదీ, ఆక్షణంలో అప్పారావుగారి స్థితి.

వారి మొగాన చికాకు అలుముకుని వుండింది; కానీ చూపులు మాత్రం తొందరపడవద్దు' అని దెకారిస్తున్నట్టున్నాయి.

అది నిజమే అయింది.

అప్పట్లో ఆంధ్రసాహిత్యపరిషత్తు ఏకైక సంస్థ.

సరికొత్త నిర్మాణం,

మిసమిసలాడి పోతోంది.

అందరూ ఎగబాకారు; కాని యిప్పుడు ?

గిడుగు రామమూర్తిపంతులుగారి తీవ్రప్రచారంతోనూ, అప్పారావుగారి అమరరచనలతోనూ భాషాకాశం మీది కారుమబ్బులు విడిపోయాయి.

సత్యం అవగాహన అయింది.

శబ్దశక్తిన్నీ తెలిసివచ్చింది.

దాంతో, యువకరచయితలు ఆ యేకైకసంస్థని విడిచిపెట్టి చక్కా వచ్చేశారు.

ఒక్కరొక్కరుగానూ, గుంపులు గుంపులు గానూ వ్యావహారికంలో రచనలు మొదలు పెట్టారు.

అప్పటికే రచయితలయి వుండినవారిలో అనేకులు, నాలాగే, తరవాత వ్యావహారికంలోకి వచ్చేశారు.

తరవాత్తరవాత, అసలు, వ్యావహారికంలోనే బయలుదేరుతున్నారుగా ?

ఇంకో విశేషం యేమిటంటే ?

ఇప్పటికీ, గ్రాంథికం విడిచి వ్యావహారికంలోకి వచ్చినవారూ, వస్తున్న వారూ ఎందరో వున్నారు.

ఇంతేకాదు, ఊగిసలాడుతున్నవారూ. రావలసినవారూ కూడా చాలామందే వున్నారు; కాని, వ్యావహారికం విడిచి గ్రాంథికంలోకి వెళ్ళినవారూ. వెడుతున్న వారూ, వెళ్ళదలచినవారూ ఒక్కరూ లేరు.

అది సత్యం గుర్తించి అయినా, ఆవిధంగా కూడా శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రులవారికి ప్రాతికూల్యం వహించడాని కయినా యెనభైయేళ్ళవృద్ధ గ్రాంధి

కంలో అపారంగా గ్రంథాలు సృష్టించిన నిత్యరచయిత-చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రుల వారు కూడా. చివరికి వ్యావహారికం అవలంబించి, అతిరసవంతంగా వచనరచన సాగిస్తున్నప్పుడు ఇక దీని కేమి నిదర్శనం కావాలీ ?

సారస్వత ప్రీతిగల యిప్పటి యువకులు గ్రాంథికరచనలు చదవడాని కూడా యిష్టపడలేకపోతున్నారు గదా, మరో నిదర్శనం చెప్పడం మాత్రం యెందుకూ ?

ధర్మమే మరి.

అంధకారంలోంచి వెలుగులోకి రావడానికే గాని, వెలుగులోంచి అంధకారంలో కూలిపోడాని కెవరూ యిష్టపడరుగా ?

మనకళ్ళ యెదుట, భాషవిషయమై యింతటిమార్పు రావడాని క్కారణం వ్యావహారికభాష విశిష్టత వొక్కటి మాత్రమే కాదు, అప్పారావుగారి రచనల ప్రభావమున్నూ.

రామమూర్తి పంతులుగారి వాదం, జాతికి, ధైర్యసాహసాలు కలిగించగా, అప్పారావుగారి రచనలు దారి చూపించాయి.

అంచేతనే, అప్పారావుగారు 'మార్గదర్శి' అనడం.

అప్పారావుగారు చిన్నకథలు రాశారు. వాటిలో వొకటి "దిద్దుబాటు" అనేది యిప్పటికీ అద్వితీయమే. అది మొట్టమొదట, ముట్నూరు వారి 'ఆంధ్రభారతి' మొదటి సంచికలో పడ్డప్పుడు రసికాంధ్రలోకం వూగిపోయింది.

వారు ముత్యాలసరాలు నిర్మించారు. వాటి నెందరో ఉదాహరిస్తూవుంటారు; కాని, ఆ భాష, ఆ నుడికారం, ఆ రచనాపద్ధతి, ఆ భావసౌందర్యం—యిప్పటికీ యెవరూ అలవరచుకోలేక పోయారు.

వారు 'మాటా-మంతీ' అన్న శీర్షికలో చాలామంచి వ్యాసాలు రాశారు. ఒక్క 'చాలా' అంటే చాలదు. చాలా చాలా మంచి వ్యాసాలవి. వాటిలోకొన్ని బొంబాయి ఆంధ్రపత్రికలోనూ, కొన్ని రాజమండ్రీ ఆంధ్రకేసరిలోనూ ప్రకటన అయినాయి. వాటిలో "ఇద్దరు రాజులు" అనేది యిప్పటికీ నాకళ్ళ యెదుట కనబడు తోంది. రెండోది. ఆకాశరామన్న ఉత్తరానికి ప్రత్యుత్తరం కూడా నా దృష్టిలో గొప్పదే. ఆ వుత్తరం పెద్దాపురంనుంచి వచ్చినట్టు తమ ప్రత్యుత్తరంలో అప్పా

రావుగారే ఉటంకించారు. రాసినవారెవరో వారు చెప్పలేదు; గాని గుర్తించినట్లే కనపడుతుంది. నాకుమాత్రం ఆ రాసినవారెవరో బాగా తెలుసు. రాసినవారే నాకు చెప్పారు. అయితే, అది రాయడానికి కారణం వారికి గ్రాంథికభాష మీది అభిమానమేగాని పాపం అప్పారావుగారి మీది ద్వేషం కాదు.

అప్పారావుగారి రచనల్లో మిక్కిలి చెప్పుకో తగ్గవి నాటకాలు. వాటిలో కన్యాశుల్కం జాతిరత్నం. బిల్హణీయం పూర్తి అయివుంటే అది, అంతకంటే పెద్ద జాతిరత్నం అయివుండేది; కాని ఆంధ్రజాతికి, అలనాటి నాటకం చూసుకునే అదృష్టం పట్టలేదు. కన్యాశుల్కంలో ప్రతీవాక్యానికీ కొన్నేసి పేజీల వ్యాఖ్యానం చెయ్యగల మనీషిని నేనెరుగుదును. వారు, శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారు. కన్యాశుల్కం తలంపుకి వస్తే- అథవా- ఆపేరు చెవినిపడితే వారి శరీరం ఆపాద మస్తకమూ పులకరిస్తుంది. అస్మదాదులం "కన్యాశుల్కం మాకు బాగా తెలుసు" అనుకుంటాంగాని, కామేశ్వరరావుగారు దానిమీద ప్రసంగం యెత్తుకుంటే "తెలియనివాడనై మెలిగితిన్" అనుకోవలసిందే. నేను వరుసగా రెండేళ్ళు ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికల్లో బిల్హణీయం రెండంకాలూ చదివిన తరవాతే కన్యాశుల్కం చదవడం ప్రారంభించాను. అయితే, కన్యాశుల్కం చదివినప్పుడల్లా ఎంత ఆనందం కలుగుతుందో ఆ అసంపూర్ణ బిల్హణీయం జ్ఞాపకం వచ్చి వెంటనే నా కంతదుఃఖం కలుగుతూ వుంటుంది. ఒక్క బిల్హణీయం చాలు, అప్పారావుగారెంతటి మహాకవో తెలుసుకోవాలంటే. అయితే, వారెంతటి మహాకవి అంటే? ఆ బిల్హణీయం మరెవరూ పూర్తిచేయలేనంతటి- దాని కథాక్రమమే యెవరూ గుర్తించలేనంతటి- మహాకవి.

ఏతావాతా : అప్పారావుగారు మహాకవిమాత్రమే కాదు, తరువాత రచయితల కందరికీ మార్గదర్శిన్నీ.

అయితే, ఒక్కసత్యం చెప్పక తప్పదు. అదేమిటంటే? వచన రచయితలు మాత్రమే అప్పారావుగారి మార్గదర్శిత్వం స్వీకరించారు. పద్యరచయితలు ఆదారి పట్టుకోలేకపోయారు.

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి*

*నవోదయ. డిసెంబరు, 1946.

# హెచ్చరిక

ఒకటి రెండు సంవత్సరాల నుంచి న్యూసుపేపర్లలో నేమి మీటింగులలో నేమి తెలుగుభాషను గురించి చర్చలున్నూ వాదప్రతివాదములున్నూ జరుగుతూ వున్నవి. నన్నయ్య, తిక్కన్న, యెఱ్రన్న, పెద్దన్న—ఇటువంటి పెద్దలు వ్యాకరణనిబద్ధంగా వుపయోగించిన భాషే తెలుంగుభాష, అదే నేర్చుకోతగినది, ఆ భాషలోనే గ్రంథాలు వ్రాయదగును, తిక్కనభాష గ్రామ్యభాష, అవాచ్యము, వర్జనీయము, అప్రశస్తము- ఇట్లని కొందరు పండితులున్నూ- సామాన్యంగా అందరికీ బోధపడని గీర్వాణానికి భాష అని పేరుపెట్టడం కేవలం హాస్యాస్పదం. కట్టుబాట్లతో చచ్చిపడివున్నది భాష కానేరదు, ప్రాణముతో పెరుగుతూ వున్నదే భాష, అదే గౌరవార్హము, అట్టిదే దేశాభివృద్ధికి ఆధారము- ఇట్లని కొందరు పండితులున్నూ గుద్దులాడుకోవడమే గాక తగవుతీర్చుకోవడానికి కచేరీలకు యెక్కడందాకా కూడా వచ్చింది ! అజ్ఞానం హరించి అవివేకము శమించుగాక !

ఉన్నమాటంటే ఉడుకుబోతుతనం వస్తుందంటారు. అయినా ఒకప్పుడు అనక తప్పదు. ఇంతకూ ఆకాశవాణికి భయమేమిటి ? ఆమె అన్ని భాషలకు తల్లి. ఆంధ్రభారతి ఆంధ్రభారతి అని యిక్కడ అందరూ నన్ను మాటలతో పూజిస్తూ వున్నారే కాని క్రియలో రొష్టుపెట్టుతూ వున్నారు- అని ఆమె మొత్తుకుంటూ వున్నది. అదుగో వినబడుతూ వున్నది. ఆమె మొర వినండి !'

ఆకాశవాణి మొర :

ఓ నా బిడ్డలారా ! నాకు అన్నిభాషలూ ఒకటే అయినప్పటికీ సంగీత సాహిత్యవిద్యలమీద నాకు వుండే ప్రీతిచేత ఆంధ్రభాషను యెక్కువ మక్కువతో ప్రేమించి ఆంధ్రభారతి అనే పేరుతో యిక్కడ నెక్కొని చిరకాలం నుంచి ఘనంగా ఆదరింపబడుతూ వుంటిని. వయసు గడచినకొద్దీ నాకు వన్నె వచ్చి యౌవనం హెచ్చింది గాని నారూపలావణ్యాలు యెంతమాత్రం మారలేదు, కాని, యిటీవల పడమటి బిడ్డలతోటి సాంగత్యమువల్ల నా ముద్దుబిడ్డలబుద్ధి చెడి నాయెడల అనాదరణ యేర్పడి నా కళకాంతులకు కూడా మబ్బుపట్టడం ఆరంభించింది.

అయ్యయ్యో ! ఏదిక్కున విన్నా నా బిడ్డల పోట్లాటలే వినబడుతూ వున్నవి. నాకు యేమిదుర్గతి పట్టనున్నదో ఏమి దుస్థితి రానున్నదో గాని నా పెద్దబిడ్డలే వుపకారమని పేరు పెట్టి నాకు అపకారం చేస్తూ వున్నారు.

తండ్రులారా ! ఎందుకు ఈలాగు తన్నులాడుకుంటారు ? తూర్పుపడమరల భేదం తెలియకుండా యెందుకు గుద్దులాడుకుంటూ వున్నారు ? అజంతభాష, హలంతభాష, పురుషభాష, స్త్రీభాష- ఈ భేదంతో వున్న భాషాతత్వం పడమటి బిడ్డలలో ఎంతటిపండితులకైనా తెలియకపోవడం ఆశ్చర్యం కాదు. వారి పుట్టుక లోనే దాని కారణం వున్నది. ఆ రహస్యం తెలియకుండా వారు బోధించే భాషా తత్వం అన్ని భాషలకూ సమానంగా చెల్లదని మీరు తెలుసుకోలేక వారి పోలిక లను మీయందు ఆరోపించుకుని ఎందుకు బొందలో పతుతూ నన్ను పడదోస్తూ వున్నారు ? అయ్యయ్యో ! ఈ తత్వరహస్యం సంపూర్ణంగా తెలిస్తే మీకు భేదం గాని పోట్లాటగాని వుండదు గదా ! నేను యెంత మీతో మొరపెట్టుకుందును. నామొర మీకు వినబడడం యేలాగు ? వినపడకపోతే విని తెలిపే మొనగా డెవ డున్నాడు ? తెలిపించి నా చింత తీర్చే నాథు డెవడున్నాడు ? అయ్యో ! అంతా నాకు అయోమయంగా వున్నది !

అజంతభాష, హలంతభాష, పురుషభాష, స్త్రీభాష- వీటికి గల భేదము—— భాషయొక్క ప్రాణము, శరీరము, బీజము, క్షేత్రము, స్వరప్రస్తారము, మాత్రా ప్రస్తారము, గుణప్రస్తారము, నానాజాతి వృత్తప్రస్తారము వీటియొక్క తత్వరహ స్యములు- భాషయొక్క మాధుర్యము, గానయోగ్యత. యివి దేని ననుసరించి యుండేదీ, యెట్టి భాషలు సంగీత సాహిత్యవిద్యల సంపూర్ణ ప్రస్తారమునకు యోగ్య ములో, స్త్రీ పురుషాక్షర సంజ్ఞలయొక్క సంయోగము, ఐక్యము. ప్రత్యేకరూపము- ఎట్టి భాషలో పదములు విడివిడిగా వుండునో ఎట్టి భాషలో జడగా అల్లుకొని పోవునో, ఏమి కారణమో- యెట్టిభాషలో ముందుకే సూటిగా అన్వయమో, ఎట్టి భాషలో ముందుకు వెనుకకు దుమికి దుమికి అన్వయమో, యే స్వాభావికధర్మంవల్ల యిది యేర్పడుతుందో- ఈ మొదలైన తత్వరహస్యములు తెలిస్తే అన్ని భాషలకూ ఒకటే వర్ణమాల యేర్పాటు చేస్తామని, అన్ని దేశాలకూ ఒకటేభాష యేర్పాటు చేస్తా మని, అన్నిభాషలను వుచ్చారణప్రకారమే వ్రాయవలసిన దని- యిట్టి పిచ్చివాదములు వుండవు గదా! నాబిడ్డలు భాషాభివృద్ధి పేరు చెప్పి అవలంబిస్తూ వున్న వృథాప్రయ త్నములున్నూ వృథావ్యయమున్నూ తప్పిపోవును గదా ! ఏమి చేతును ? ఎంతని మొరపెట్టుకొందును? నాచింత తీరే మార్గము యేమి వున్నది? అయ్యో! ఏమి గతి?

ప్రతిభాషయందున్నూ వ్యవహరించడములో- అనగా వాడుకలో- కొన్ని మార్పులు కలగడం స్వాభావికమై వున్నది. ఈ మార్పులు బిడ్డలవల్ల, పామరుల వల్ల, సామాన్యజనుల వల్ల, ఒకవిధంగాను- పెద్దలవల్ల, బుద్ధిమంతులవల్ల, పండితులవల్ల, మరివొకవిధంగాను- కలిగింపబడడం కూడా స్వాభావికమే.

ఇంతేకాక మొట్టమొదట ఒకరితో వొకరు నోటిమూలంగా మాట్లాడుకొనడానికి యేర్పరచుకోబడిన పదములు వ్రాతమూలంగా చదువుకుని గ్రహించుకొనడానికి వుపయోగింపబడడం వల్ల మరికొన్ని మార్పులుకూడా భాషలో తటస్థిస్తూ వున్నవి. ఈ చెప్పబడ్డ అన్ని మార్పుల విషయంలో అజంతభాషలకున్నూ, హలంతభాషలకున్నూ, పురుషభాషలకున్నూ, స్త్రీభాషలకున్నూ వాటి స్వాభావిక ధర్మమును బట్టి చాలాభేదం యేర్పడుతూ వున్నది. దీని వివరం గ్రహించుకోకపోవడం వల్లనే పోట్లాటలు, గుద్దులాటలు, గుడ్డివాదములు, చెడ్డభేదములు సిద్ధిస్తూ వున్నవి. ఇది టూకీగా చెప్పదగిన విషయము, అందరికీ సులభముగా బోధపడే విషయమున్నూ కాదు.

ఏ భాషలోనైనా సరే పుట్టుకలో యేర్పడ్డట్టుగానే పదాలు స్పష్టంగా సంపూర్ణంగా వుచ్చరిస్తూ మాట్లాడితే అలస్యం అయి వ్యవహారం కడతేరదు. కనుక వాడుకలో పదాలయందు స్వరలోపమున్నా అక్షరలోపమున్నా కలుగుతుంది. వ్రాసేటప్పుడు నిదానంగా వ్రాయవచ్చును గనుక యీలోపం అవసరం లేదు. మరిన్నీ సామాన్యజనులు గాక బుద్ధిమంతులున్నూ పండితులున్నూ వ్రాసేటప్పుడు, కొత్తకొత్త శబ్దజాలం కల్పించి సమస్తమైనవారు నిదానంగా చదివి నెమ్మదిగా నేర్చుకుని జ్ఞప్తియందుంచుకోవలసిన విషయములున్నూ గంభీరమైన విషయములున్నూ తెలుపుతూ గద్యములు, పద్యములు, పదములు మొదలయిన కవితలతో గ్రంథాలు రచియిస్తారు. ఈ ప్రకారంగా మాటభాష, వ్రాతభాష, గ్రాంథికభాష అని మూడు తెరగులు ఏర్పడుతున్నవి. సామాన్యంగా లోకంలో సంభాషణ, వుత్తరప్రత్యుత్తరాలు, వ్యవహారవిషయములు, మొదలైనవాటిసంబంధంలో వుపయోగింపబడుతూ వున్నందున మాటభాషను వ్రాతభాషనుకూడా వాడుకభాష అని చెప్పవచ్చును. గ్రాంథికభాషలో సంభాషణ గాని, వుత్తరప్రత్యుత్తరములు గాని వ్యవహారములు గాని జరుపరు. అయితే యీ సందర్భంలో అజంతభాషలకున్నూ హలంతభాషలకున్నూ వాటి స్వాభావిక ధర్మమును బట్టి కొండంతభేదం యేర్పడుతూ వున్నది. హలంతభాషలు, స్త్రీభాషలు- వీటి విషయంలో వొకటే

కాలపు వాడుకభాషకు గ్రాంథికభాషకు వుచ్చారటలో యెంతభేదం వున్నా వ్రాతలో వుపయోగించే అక్షరసంజ్ఞలలో భేదం వుండదు. ఇది స్వాభావిక ధర్మమును బట్టి తటస్థించును. ఈ కారణంవల్ల హలంతభాషలో గ్రంథాలు చెవులతో విన్నప్పుడు అర్థం అవుతూవున్నప్పటికీ కంటితో గ్రహించి చదవడం కష్టంగా యేర్పడుతుంది; కాబట్టి యావజ్జీవము, ఉచ్చారణ నేర్చుకుంటూ మాడ్చుకుంటూనే వుండవలెను. పైగా కాలానుగుణ్యంగా భాషాస్వరూపం కూడా మార్పుచెందుతూ వుంటుంది గనుక సామాన్య సంభాషణలోనూ, సాధారణపు వ్రాతలోను, గ్రంథాలలోను వన్నె భేదం, వైఖరీభేదమే గాని భాష వొకటిగానే కనిపిస్తూ నానాటికి కలిగే మార్పులు కిందకీ పైకీకూడా వ్యాపిస్తూ వుండడంవల్ల భాష జీవించివున్నట్టుగా యేర్పడుతుంది. ఇంక అజంతభాషలు, పురుషభాషలు- వీటి విషయంలో ఎట్లా వుంటుందంటే- స్వర లోపాది కారణములవల్ల కలిగే మార్పులు చాలా అధికమగుటచేత సామాన్యంగా ఉపయోగింపబడే మాట భాషకున్నూ సామాన్యంగా వుత్తరప్రత్యుత్తరములలోను వ్యవహారములోను వుపయోగింపబడే వ్రాతభాషకున్నూ గద్యపద్యాదికవిత్వాలయందు వుపయోగింపబడే గ్రాంథికభాషకున్నూ చాలా వ్యత్యాసం యేర్పడడమే గాక ఈ జాతిభాషలు వాటి స్వాభావిక ధర్మమును బట్టి వ్రాసినప్రకారమే వుచ్చరించి చదువబడవలసిన కారణంవల్లను, గురులఘుప్రస్తారములతో పద్యాది కవిత్వములు గణబద్ధమై లేశమైనా మార్పు చెందడానికి వీలులేకుండా బిగిసివుండే కారణంవల్లను, మాటభాష. వ్రాతభాష, గ్రాంథికభాష అని మూడు స్వరూపములుగా యేర్పడుతూ వున్నవి. ఈ మూడింటియొక్క తారతమ్యమున్నూ విలువయున్నూ తెలుసుకోలేకనే హలంతభాష యందువలె వొకటే జీవభాష యేర్పరచవలెనని ప్రయత్నించడు. గ్రాంథికభాషను దూషించడం, వ్రాతభాషను ఆదరించకపోవడం, మాటభాషను గ్రామ్యమని నిందించడం- ఇదంతా కేవలం అజ్ఞానము సూచిస్తున్నది. అయ్యో! నా పెద్దబిడ్డలే నాకున్నూ నా చిన్నబిడ్డలకున్నూ అపకారులైనారు! ఏమి విపరీతకాలం వచ్చింది!

గ్రాంథికభాషను పూజించే నా దొడ్డబిడ్డలారా! గ్రామ్యభాషను నిరసిస్తారే! అది నా చిన్నబిడ్డలు పేదబిడ్డలు మాట్లాడేభాష కాదా? నా చిన్నబిడ్డల వచ్చీరాని పలుకులు నాకు ముద్దుగా వుండవా? ఎందుకు నిందిస్తారు? మీ చెవులకు కూడా ఆనందకరంగా వుండబట్టేగదా గ్రామ్యభాషలో ప్రసంగాలున్నూ పదాలున్నూ మీ గ్రంథాలలో అక్కడక్కడ వుపయోగించి హాస్యరసం అనుభవిస్తారు. మీకు

గ్రామ్యభాషవల్ల హాస్యరసం వుదయించి ఆనందం కలిగినట్టే అల్పజాతుల బిడ్డలకు వాళ్ళ నుద్దులలో మీ భాష వుపయోగించిన సందర్భమందు హాస్యరసం వుదయిస్తుంది. వాళ్ళనుద్దులున్నూ పదాలున్నూ పాటలునూన్నూ వాళ్ళ గ్రంథాలు, మీ కవిత్వాలు మీ గ్రంథాలు, వాళ్ళ గ్రంథాలు వినగూడదు, వ్రాయగూడదు, చదువగూడదు, అవి గ్రంథాలు కావు, మా గ్రంథాలే గ్రంథాలు అని యెందుకు పిచ్చివాదాలు చేస్తారు ?

తెలుంగుభాష మాతృభాషగా గల జనులు 2,30,00,000 రెండుకోట్ల ముప్పయిలక్షలమంది వున్నారు గదా! వీరిలో మాటరాని వారికింద 30 లక్షల మందిని తీసివేయండి తెలుంగు మాట్లాడే తక్కిన రెండుకోట్ల మందిలో యెందరు గ్రాంథికభాషలో వుత్తరప్రత్యుత్తరాలు, వ్యవహారాలు జరుపుకుంటారు ? ఎందరు భారతభాగవతాదిగ్రంథాలు చదువుతారు ? ఇది కొంచెం తలచుకొనండి. అప్పుడు అంతా మీకు స్పష్టంగా బోధపడుతుంది,

తెలుంగుభాష మాట్లాడే రెండుకోట్లమంది జనులలో గ్రాంథికభాష మాట్లాడే వారు వొక్కరుకూడా లేరని చెప్పవచ్చును. ఎవరైనా వుంటే వారు మహా మహా మహా పండితులే! పెండ్లాములతోను, బిడ్డలతోను, చాకలివాళ్ళతోను, మంగలి వాళ్ళతోను భారతాదిగ్రంథములభాష మాట్లాడే మహానుభావుడు వుంటే ఆయన గారి గొప్ప మెచ్చుకోవచ్చును. తర్వాతిమాట-ఈ చెప్పిన రెండుకోట్లమందిలో భారతాది గ్రంథముల భాషల్లో వుత్తరప్రత్యుత్తరములున్నూ వ్యవహారములున్నూ జరుపుకునే మహానుభావు లెందరున్నారు ? ఒకవేళ వున్నప్పటికీ వ్యవహారములు కొనసాగునా ? నా దొడ్డబిడ్డలలో కొందరు బుద్ధిమంతులు సంధులు విడగొట్టి, జడలు చిక్కుదీసి, సులభశైలిలో గ్రాంథికభాష వుపయోగిస్తూ మాట్లాడగలరు, వ్రాయగలరు, నిజమే, అలాగు చేయగలవారు వందలు గాని వేలు లేరు. వారి వ్రాతలు కూడా లక్షమందికంటె యెక్కువమందికి బోధపడజాలవు. తక్కిన 199 లక్షలమంది గతి ఏమికావలసినది ? గ్రాంథికభాష చదివితేను వింటేను అర్థం చేసుకోగలవారు లక్షమందికంటె యెక్కువ లేరని మీకు స్పష్టంగా బోధపడవలె నంటే ఆయా జిల్లాలు తాలూకాలు గ్రామాలు వీథులు యిండ్లు గుడిసెలు- యీ ప్రకారంగా ఆంధ్రదేశంలో వొక మూలనుండి వొకమూలకు మీ మనోదృష్టి విప్పి చూడండి! మనసుతో చూడకుండా వూరికే నోటితో మాట్లాడకండి! మనోదృష్టి వ్యాపింపజేసి చూస్తే ఆంధ్రదేశంలో యెక్కడగాని మాట్లాడుకొనడానికీన్నీ

సామాన్యపు వ్రాతలకున్నూ వ్యవహారానికున్నూ సంధులు విడగొట్టిన సులభశైలి గల గ్రాంథికభాషకూడా వుపయోగించబడడం లేదనీ వుపయోగించడానికి సాధ్యం కాదనీ స్పష్టంగా బోధపడ గలదు. సులభశైలి అయినా కఠినశైలి అయినా గ్రాంథికభాష దొడ్డగ్రంథాలకే ప్రయోజనము, అనగా కట్టుబాట్లకు లోబడి మార్పులు చెందకుండా వుండే ప్రౌఢమయిన శబ్దజాలము మూలమున భక్తి, ముక్తి, నీతి, జ్ఞానము, ఆనందము మొదలయిన సార్వకాలికవిషయములను తెలిపే గద్య పద్య కావ్యములను కల్పించడమే గ్రాంథికభాష యొక్క వుపయోగము. ఎంత సులభ శైలిని వ్రాసినా ఒకటి రెండు లక్షలమందికి మాత్రమే యీ గ్రంథముల వుపయోగము. తక్కిన 199 లక్షల మంది ఏ గ్రంథాలు చదువుకొమ్మన్నారు? గ్రాంథికభాష బంగారమే. ఎన్నో వన్నెలు ఉండవచ్చును గాక! బంగారు బంగారే గ్రాంథిక భాషే భాష, తక్కినది భాష కాదు. భారతాదిగ్రంథములు తప్ప తక్కినవి గ్రంథములు కావంటె, తెలుంగుభాష తెలుంగుగ్రంథాలు లేనట్టే భావించుకోవలసి వస్తుంది. భారతాదిగ్రంథములు అర్థంకాని నా 199 లక్షల బిడ్డలు గ్రంథాలు లేనివారు. చదువు రానివారు అవుతారు సరేగదా, వారు తెలుంగు మాట్లాడగలవారైనప్పటికీ మూగవాళ్ళే, మృగములే అని చెప్పవలెను. ఈ వాదం మీకు బాగా వున్నదా?

భారతాదిగ్రంథము చాల దొడ్డగ్రంథములు. ప్రశస్తమైన గ్రంథములు అని అందరూ చెప్పుకుంటారు. చక్కగా చెక్కి నునుపుచేసి వన్నెపెట్టిన మానుతోను శిలతోను నిర్మించిన శాశ్వతసౌధములు రమ్యముగా వుండడం ఆశ్చర్యమా? నవరత్నాలు చెక్కిన బంగారు ఆభరణాలను మెచ్చుకోనివారు వుంటారా? పట్టుబట్టలు జరీబట్టలు- ఇవి అందరికీ కన్నులపండువుగానే వుండును. అయితే సమస్తమైనవారు సౌధములే కట్టవలెను- మిద్దెలు మేడలు నిర్మించుకొనే కాపురముండవలెను. సామాన్యపు యిండ్లు కట్టగూడదు. పూరియిండ్లు, గుడిసెలు బొత్తిగానే వుండగూడదు. అందరూ రత్నాభరణములు, బంగారు ఆభరణములు- వీటినే ధరించవలెను, అన్ని వస్తువులు, అన్ని పనిముట్లు బంగారుతోనే చేయవలెను. పెద్దలూ పేదలూ అందరూ పట్టుబట్టలు, జరీబట్టలు- వీటినే ధరించవలెను. అన్ని వేళలందు వాటినే కట్టుకోవలెను, అన్నిసమయములయందు రూపనిర్బంధముతో నిర్మించిన దుస్తులే ధరించుకోవలెను. ఈలాగు యేర్పాటు చేస్తే లోకము జరుగుతుందా? సౌఖ్యంగా వుంటుందా? మరి యెందుకు గ్రాంథికభాషను వృద్ధి చేయ

డము అని పేరుపెట్టి దాని కట్టుబాట్లను కొద్దికొద్దిగా చెరిపి పాడుచేసి దాని అందమును మాధుర్యమును ధ్వంసం చేస్తారా? గ్రాంథికభాషను సడలించి, పలుచన చేసి, చులకనచేసి సామాన్యకార్యములకు వుపయోగపరచవలె నని యెందుకు వృథాప్రయత్నము చేస్తారు? ఎందుకు పరిశుభ్రమైన వాడుకభాషను నిందిస్తారు? బంగారుతో నీళ్ళకాగులు నిర్మిస్తారా? గడ్డపారలు చేస్తారా? చేస్తే కూడా అవి బాగా వుపయోగపడునా? గ్రాంథికభాష దొడ్డభాష. పూజనీయమైన భాష. అది లోకవ్యవహారములయందు వుపయోగపడదు. రెండుకోట్లమంది ఆంధ్రజనులలో 199 లక్షల మందికి అది లభింపనే లభింపదు. కాబట్టి, నా దొడ్డబిడ్డలారా! నా మొర కొంచెము చెవిని పెట్టండి. గ్రాంథికభాష యొక్క తత్వము తెలియక దాని లోకి పిచ్చిమార్పులు కూర్పులు తెచ్చిపెట్టి పరిశుద్ధముగా నున్న నాదివ్యసౌధములను పాడుచెయ్యకండి. అగ్రగణ్యులైన మహాకవులు అప్పుడప్పుడు కల్పించే, కూర్చే కొత్త అందములతో తృప్తిచెంది మీ బుద్ధి అంతా వాడుకభాషను ప్రసిద్ధి లోకి తెచ్చి, పరిశుద్ధపరచి, వృద్ధిపరచుట యందు వుపయోగించండి.

వాడుకభాష అందరికీ కావలసినభాష. అందరు జనులు సామాన్యసంభాషణ యందు, వుత్తరప్రత్యుత్తరాల యందు, లోకవ్యవహారాలయందు, ప్రతిదినం, ప్రతినిమిషం వుపయోగిస్తూ వున్న భాష. వాడుకభాషను కాగితముమీద నిందించే వారు కూడా యింట ఆలుబిడ్డలతో మాట్లాడేది వాడుక భాషే, మరెందుకు వాడుక భాష అంటే నిందింపవలెను? ఏల సిగ్గుపడవలెను? సామాన్య జనులు, పామరులు- నా బిడ్డలలో 199 లక్షలు వీరే- వీరి నిమిత్తము కల్పింపబడే గ్రంథాలు వాడుకభాషలోనే వుండవలెను. ప్రస్తుతకాలములో అన్యసంబంధమువల్ల లభిస్తూ వుండే జ్ఞానము వాడుకభాషలోనే వెల్లడికావలెను. కొత్తకొత్త చరిత్రలు, శాస్త్రములు, కథలు, హాస్యములు, పాటలు, పదములు- ఇవన్నీ ప్రజలకు బిడ్డలకు బోధపడవలెనంటే సంకరము చేసి పాడుచేసిన గ్రాంథికభాషలో గాక నిజమైన, పరిశుద్ధమైన, మనోహరమైన వాడుకభాషలోనే వుండవలెను. 'ఈ వాడుకభాష అనే ప్రత్యేకభాష అవిచ్ఛిన్నముగా ఏర్పడి వుండడము అజంతభాషల యొక్క పురుషభాషల యొక్క గొప్ప భాగ్యము. వార్తాపత్రికలను నా బిడ్డలు లక్షలకొలది చదివి అభివృద్ధికి రావలెనంటే వాటిని వాడుకభాషలోనే వ్రాయవలెను. కొంచెముగా గొప్పగా సడలించిన గ్రాంథికభాష కూడా జనసామాన్యమునకు బోధపడదు. కాబట్టి గ్రాంథికభాషను కనికరములేక వంకరటింకరలుగా తిప్పి తిప్పలు పెట్టి తప్పులు

కూర్చి పిచ్చిపిచ్చి శబ్దజాలమును కల్పించి గ్రాథింకభాషను, వాడుకభాషను రెంటినీ కూడ పాడుచేయకండి. నాదొడ్డబిడ్డలలో కొందరు పెద్దవ్రాతలని పేరుపెట్టి గ్రాంథిక భాషలో పిచ్చివ్రాతలను వ్రాసి నాకు విచారం కలిగిస్తువున్నప్పటికీ, కొందరు దొడ్డ గ్రంథాలు కల్పించి నా గర్వము పెంపుచేస్తున్నారు. ఇది నాకు పరమానందమే. కాని, వీరు సమర్పించే పరమాన్నము నా బిడ్డలలో లక్షలమంది కూడా ఆరగించి అనుభవించడం లేదు. పరిశుద్ధమై రుచికరముగా వుండే అంబలే 199 లక్షలమంది బిడ్డలకు ఆరోగ్యకరమైన అహారము. ఇదీ అత్యావశ్యకము. దీనిని కూడా సంపాదించగలవారు నా దొడ్డబిడ్డలే. ముందటికాలంలో కొందరు బుద్ధిమంతులు వాడుక భాషలో కథలు, కీర్తనలు, పదములు, పాటలు, హాస్యములు మొదలైనవి కల్పించి వున్నారు. గంగావివాహము, కుసలాయకము, బొబ్బిలికథ, దేశింగురాజుకథ, క్షేత్రయ పదములు, సారంగపాణి పదములు, లంకాయాగము మొదలైనవి, నా బిడ్డలకు ప్రాణములు. వాడుకభాషలో అనేక గ్రంథములు నోటి పాఠాలలోను తాటాకులపుస్తకాలలోను పై ప్రాణాలతో నిలిచియున్నవి. వీటిని రక్షించి చక్కగా ముద్రించి సర్వజనులకు సులభంగా దొరికేటట్లు చేయడం యెంతో పుణ్య కార్యం. ఈ కాలంలోకూడా కొందరు బుద్ధిమంతులు వాడుకభాషలో హాస్యములు, కథలు, శాస్త్రములు, ధర్మశాస్త్రములు మొదలైన గ్రంథాలు వ్రాసి యున్నారు. ఇవి ప్రతి పల్లెటూరిలో పూజింపబడుతూ వున్నవి. కన్యాశుల్కము చదివి సంతోషించినవా రుందురా ? సంస్కర్తగారి గ్రంథాలలో వాడుకభాషలో వ్రాసిన హాస్యములే కదా అందరూ చిదివి ఆనందిస్తూ వున్నారు ? కాబట్టి దొడ్డనాయనలారా ! విద్వాంసులారా ! గ్రాంథికభాషను సంకరము చేసి నా గర్వము కుంగించక, వాడుకభాషను లఘుమార్గములో వృద్ధిచేసి, పరిశుద్ధి చేసి, మనోహరమైన కల్పనలతో రమ్యము చేసి, జ్ఞానమును ఆనందమును పెంచే సర్వజనోపయోగములైన గ్రంథాలు వ్రాయండి. ముద్రించండి, ప్రచురించండి ! చిన్నబిడ్డలు 199 లక్షలమందికి అభివృద్ధిమార్గము యేర్పరచండి ! తల్లి ఆశీర్వచనమును పొందండి ! శాశ్వతమైన కీర్తిని సంపాదించండి ! !

గీ. నోటితో పల్కి వినఁదగు నుడుఁగు లెట్లు
కాగితముపయి వ్రాయంగ గర్హ్యములగు ?
తప్పు మీయందె కల దని చెప్పనేల
మంచినీళ్ళు నిందింతురో మధువు మరగి ?

—రెంటాల వేంకటసుబ్బారావు*

-X-

* ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక. 1914.

# ముత్యాల సరం

ప్రపంచంలో వాఙ్మయం మొదట జనిస్తుంది. తర్వాత విమర్శకులు వర్గీక రించి దానికి లక్షణం ఏర్పరుస్తారు. మహాకవు లెవ్వరినీ నియమాలు బంధించ లేదు. అలాగని నియమాలు ఉల్లంఘించి మహాకవి పదవి నర్థించడము పరిహాస్యా స్పదం. ఒకకవి బుద్ధిపూర్వకంగా ఒక నియమం ఉల్లంఘించడమన్నది అందువల్ల ఒక సొగసు ఆవిష్కృత మవుతున్నప్పుడే చేస్తాడు. అందుకే అల్పులు నియమం పాటించకపోతే దానిని చేతకానితన మంటాము. సమర్థుడు తెలిసి ఉల్లంఘిస్తే దానిని ప్రౌఢప్రయోగ మంటాము. మహాకవులను పట్టి చూపించే గొప్ప గీటురాళ్ళే ఈ ప్రౌఢప్రయోగాలు.

ఈ ప్రౌఢత్వం ఒక్క వ్యాకరణ సూత్రాలను మాత్రమే చుట్టి ఉండదు. ఎల్ల ప్పుడు నూత్నవిశేషాలకోసమే నిరాఘాట విహారశీలులైన కవులు ఎడతెగని సృష్టిచేసు కుంటూ పోతున్నప్పుడు విమర్శకుడు స్థాయిగా కూర్చుండి వారి భావనలో, భాషలో, పద్ధతిలో, ఆదర్శాలలో, సందేశాలలో మహిమలను సమగ్రంగా అధ్యయ నించి మూర్ఖుల కళ్ళుకూడా తెరుస్తూ ఉంటాడు. అప్పుడతనిని వ్యాఖ్యాత అంటాము. అతడే కొన్ని సామాన్యసూత్రాలకు లొంగే ప్రధానప్రవాహాలకు వంతెనలు నిర్మిస్తూ ఉంటాడు, అప్పు డతనికి లాక్షణికు డని పేరు.

పూర్వం కాని, ఇప్పుడు కాని, ఎప్పుడు కాని, విమర్శకుడు మహాపండితు డైన ప్రజ్ఞాశీలి అని ఒప్పుకొనక తప్పదు. పండితమనస్సు సాధారణంగా 'రీతి'ని మన్నిస్తూ ఎప్పుడైనా ఎవడైనా కవి ఎందైనా కొంత తొణికిపోయినట్లు కనిపిస్తే చాలును, పట్టుకొని తీవ్రంగా కదలవేస్తుంది. ఈ పట్టింపు ప్రాచీనకాలంలో మరీ ముఖ్యం. అందుకే అప్పటి విమర్శగ్రంథాలు కవి కంఠపాశాలు! కవిసర్ప గారుడాలు!

ఆధునికకాలంలో కవితాచైతన్యం సర్వత్రా వ్యాపించింది. కవిని బంధ లలో పెట్టి నలగగొట్టి వాటిలో అతడు సాముగరిడీలు చేస్తూ ఉంటే చూస్తూ ఆనందించే ప్రేక్షకులు కారు నేటి రసికులు. వీరు కవి కోరుకునే, అతని పుట్టు హక్కైన స్వేచ్ఛను అంగీకరిస్తారు. కవిని కొత్తనియమాలు నిర్మించుకోనిస్తారు.

కాని వీరు విమర్శకులైనప్పుడు ఈ నూత్ననిబంధనతో కవి ఎట్టి సౌందర్యాలు ప్రదర్శించాడో చూడడానికి కుతూహలం పొందుతారు, మేము పండితుల మనే గర్వం మాని కవికి అర్హమైన ఉన్నతస్థానం ఇవ్వదగిన ఔదార్యం చూపిస్తారు వీరు.

ఆధునికకవిత్వం నియమరహితమైన దనే శుష్కవాదం సహృదయులైన విమర్శకులది కాదు. ఎన్నో విశేషపరిస్థితుల కూడికవల్ల రూపం పొందుతున్న ఒకరకపు కవిత్వాన్ని- స్పటికానికి వలె ఎన్నో ఫలకాలు కల ఒకక్రొత్త ఉద్యమాన్ని, ఏదో ఒక ఫలకం మాత్రం చూచి తాము ఉండవలసిన దనుకొన్నట్లు ఉండనంతమాత్రంచేత, తమ ప్రామాణ్యలకు లొంగనంత మాత్రంచేత విమర్శకు-కాదు నిరసనకే, దూషణకే, పూనుకుంటున్న చిత్రమనష్యులు కొంద రున్నారు. వీరిలో చాలామందికి బోధపరచుకుందామన్న శ్రద్ధకాని, బోధపరచుకోవాలన్న జ్ఞానంకాని లేదు. వారికోసం కాదు నాయీవ్యాసం.

నవీనకవిత్వం బాధ్యత లేని భ్రంశకార్యతత్పరులఅగమ్యగోష్ఠి కాదనీ, శుద్ధాంతఃకరణతో, సత్యసంకల్పంతో అనేక సారస్వతాలలో కావ్యగుణం గవేషించి కొత్త విధంగా కవిత్వసాక్షాత్కారం పొంది కావ్యగానం చేస్తున్నవారి వింతకంఠ మనీ నమ్మినవారిని నా శ్రోతలుగా నిర్ణయించుకుంటున్నాను.

వారియొక్క సహృదయానికీ, సానుభూతికీ- ఆధునికకవులు విరివిగా వాడిన 'ముత్యాలసరం' అనే ఒక ఛందస్సుపై నా యీ సమీక్షను ద్రష్టవ్యము కావిస్తున్నాను.

గుత్తునా ముత్యాలసరములు
కూర్చుకొని తేటైన మాటల,
క్రొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగు చిమ్మగా.

అని 1910 వ సంవత్సరములో శ్రీ గురజాడ అప్పారావు నవీనకవిత్వానికి ఆరంభగతి ప్రయోగించాడు. అప్పు డత దేమనుకున్నాడో మళ్ళీ :

మెచ్చ నంటా వీవు, నీ విక
మెచ్చకుంటే మించిపాయెను;
కొయ్యబొమ్మలె మెచ్చుకళ్ళకు
కోమలుల సౌ రెక్కునా ?

అని నిరాసతంత్రి మీటించాడు. ఆ ఊపు ఊపున ఇరవై తొమ్మిది ముత్యాల సరాలు అతని సహజధోరణిని ఒక ఖండకావ్యముగా వెలువడ్డాయి. దానితో ఆధునిక కవిత్వానికి కవాటాలు తెరచుకున్నాయి.

"ముత్యాల సరం" అనే ఛందస్సు అప్పారావుగారి స్వతంత్ర సృష్టి కాకపోవచ్చును. అంతకు పూర్వమున్న యక్షగానాలు ఈ విధంగా నడిచేరచనలెన్నింటినో చూపించవచ్చును. 'వృషభగతి' అనే రగడలో ముత్యాల సరానికి గల బాంధవ్యం గమనించవచ్చును. ఆ రగడలోని 'కళిక – ఉత్కళిక'లను ఊహించవచ్చును. కర్ణాటుల షట్పదులను పేర్కొనవచ్చును. అక్షరాలా ముత్యాలసరమే అయిన

గుమ్మ దేడే గోపి తల్లీ,
గుమ్మ దేడే ముద్దుగుమ్మా,
గుమ్మ దేడే కన్నతల్లీ,
గుమ్మ దేడమ్మా ?

అనే గేయాన్ని తెచ్చి 'ముత్యాలసరం' నవీనతను ప్రతిఘటించవచ్చును. ఏమయినా 'ముత్యాలసరం' అంటే మనకు గురజాడ అప్పారావుగారి పేరే జ్ఞాపకం వస్తుంది. ఏ సన్ముహూర్తంలోనో అత డాగేయం పలికి దానికి 'ముత్యాలసరం' అని నామకరణం చేశాడో, ఒక నూత్నావేశానికి వాహనంగా చేకొని ఒక స్వతంత్ర కవిత్వాన్ని విడుదల చేశాడు. గురజాడ అప్పారావుదే ఈ ఛందస్సు.

I Swinburne గురించి వ్రాస్తూ—

"It is possible that if Philip Sidney had not written-
'Ring out your bells, let mourning shows be spread ;
For love is dead ;

All love is dead infected
With plague of deep disdaim :
Worth, as naught worth, rejected.
And faith fain scorn doth gain.
From so ungrateful fancy,
From such a female frenzy,

From men that use men thus,
Good Lord, deliver us.

We might never have heard—

Then star nor sun shall waken:
Nor any change of light:
Nor sound of waters shaken,
Nor any sound or sight:
Nor wintry leaves nor vernal.
Nor days nor things diurnal;
Only the sleep eternal
In an eternal night.

But the music of The Garden of Proserpine is as definitely Swinburne's creation as is the Drama of Othello Shakespeare's అన్నాడు John Drinkwater.

ఇట్లే

Arthur Hallam మృతికి విషాదిస్తూ Tennyson వ్రాసిన In Memorium లోని గీతాల ప్రాస పద్ధతి మామూలువలె a, b, a, b కాక క్రొత్తగా a, b; b, a గా

Ring out, wild bells to the wild sky (a)
The flying cloud, the frosty light; (b)
The year is dying in the night; (b)
Ring out, wild bells, and let him die (a)

అని మార్చి కావ్యమంతా అట్టి గీతాలలో అతడు నిర్వర్తించాడు. కాని ఇట్లు చేయడానికి Tennyson మొదటివాడా కాడా అని తేల్చడం కొరకు అప్పటి పండితులు పాత వాఙ్మయమంతా గాలించి అందుండి a, b, b, a ప్రాసలో ఉన్న ఒక Stanza త్రవ్వి తీశారు. అయినా ఈ విషయం ఇట్లు నిర్ధారణ చేసుకున్న పిమ్మట ఆ ఛందస్సు Tennyson ది గానే అంగీకరించారు. మందాక్రాంత కాళిదాసుదీ, శార్దూలం శ్రీనాథుడిదీ కాదని మనమేలా గనగలం?

ముత్యాలసరాన్ని మాత్రాబద్ధఛందస్సులలో ఒకటిగా నేను పరిగణిస్తున్నాను. దీన్ని గణబద్ధం* చెయ్యడమంటే బందులలో బిగించడమన్నమాటే. గణబద్ధాలు కృత్రిమఛందస్సులనీ, నైసర్గిక గమనం లయవల్లనే నిరూప్యమవుతుందనీ, కావున మాత్రాఛందస్సులు స్వాభావికములైనవనీ నేను విశ్వసిస్తున్నాను.

[ఛందస్సులు మూడు తెగలు. సాగదీయడానికి వీలులేనివి. కొంతవరకు సాగేవి. బాగా సాగగలవి. అంటే rigid, semi-elastic, and elastic metres. నా ఉద్దేశంలో వృత్తాలు (గణబద్ధ ఛందస్సులు) మొదటిరకానికీ. గీత సీసాదులు రెండవరకానికీ, మాత్రాఛందస్సులు మూడవతరగతికీ చెందుతవి. అందువల్లనే మాత్రాఛందస్సులు స్వాభావికము లని సూచించాను.]

గణాలే కాక యతిప్రాసలు కూడా వైకల్పికంగా ఉండాలికాని (ముఖ్యంగా గేయరచనలలో), వీటిని తప్పనిసరి చేసుకుంటే ధారాళమైన గమనం కుదరదు. విసువు కూడా సంభవిస్తుంది, వైవిధ్యం ప్రదర్శించడానికి అననుకూలత ఏర్పడుతుంది. వ్యర్థపదాలు ప్రవేశిస్తాయి. అందువల్ల ఈ విషయాలలో ఆధునికకవులు కొన్ని స్వాతంత్ర్యాలు తీసుకున్నారు. వారు కోరినది వైశాల్యం. ఛందస్సుకు సరిహద్దులు మరికొంచెం విరివి చెయ్య మంటారు. అట్లేర్పడిన విశాలవాతావరణంలో వారి విహారం చూస్తూ కూడా విమర్శకులు వారి వాంఛను గర్హించగలరా? బంధాలు సడలించడంవల్ల ఎన్నోరకాల లక్షణాలు ఏర్పడితే మాత్రం అన్నిటినీ గమనించవలసినదే సంతోషపూర్వకంగా—వాటివల్ల రమణీయార్థాలు ప్రతిపాదించబడుతున్నప్పుడు.

*అబ్బూరి రామకృష్ణారావుగారు ముత్యాలసరాన్ని గణబద్ధం చేశారు. వారన్నది: ముత్యాలసరం పాదానికి నాలుగు గణాలు: సూర్యగణం, ఇంద్రగణం— సూర్యగణం, ఇంద్రగణ. కాని ఇంద్రగణాలలో నాలుగుమాత్రలు న్ననే స్వీకరించాలి. అనగా భగణమూ, నలము ఇంద్రగణాలు కాకపోయినా నగణమూ, గగమూ స్వీకరించాలి. నాలుగుమాత్రలు కలవి కావున. అలాగే మూడు మాత్రలు గల లగమును సూర్యగణం కాకపోయినా స్వీకరించాలి. లయ, తాళము ఇవి సంగీతానికి చెందినవనీ, ఆమాటకొస్తే వాగ్గేయకారకులు ఏ పద్యానికైనా రాగతాళాలు వేసి పాడగలరనీ, మనం సాహిత్యదృష్టిని ఏమరకూడదనీ అన్నారు. మహాకవి— ఎంత rigid, uniform చందస్సునైనా వాడి ఎన్నివందల గీతాలైనా వ్రాసి, ఏమాత్రమూ విసువు తోపించ దన్నారు. నిజమే, అల్పుల కెంతస్వేచ్ఛ ఇచ్చినా గొప్పరచన చెయ్యలేదు. సమర్థులు ఎంతబంధించినా విజృంభించ గలరు. కాని సమర్థులకే స్వేచ్ఛకూడా ఇస్తే?

ముత్యాలసరాన్ని మాత్రాబద్ధ చ్ఛందస్సుగానే నిర్దేశించి పరిశీలన సాగిస్తున్నాను

ఈ ఛ్ఛందస్సులు నాలుగుపాదాలు. మొదటి మూడూ దీర్ఘపాదాలు. ఒక్కొక్కదానికి పద్నాలుగేసి మాత్రలు. నాల్గవది హ్రస్వపాదం. దీని స్వరూపంలో చాలా భేదాలున్నవి. ఏ ముత్యాలసరాలలో నైనా దీర్ఘపాదాలలో దేన్ని తీసుకొని పరీక్షించినా చాలును.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఉదా : | వి | రి | గి | పె | రి | గి | తి | పె | రి | గి | వి | రి | గి | తి |
| | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 | 1 = 14 |

| | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| క | ష్ట | సు | ఖ | ము | ల | పా | ర | మె | రి | గి | తి | |
| 2 | 1 | 1 | 1 | 1 | 1 | 2 | 1 | 1 | 1 | 1 | 1 | 14 |

లయ మూడు మాత్రలూ, నాలుగుమాత్రలు. అనగా త్రిపుటతాళంలో నడుస్తుంది. ఈతాళం తప్పితే మాత్రలసంఖ్య సరిపోయినా పాదం నడువదు.

ఈ కనుసన్న లెవరికోసము
ఈ మధుగీతు లెందుకొరకో
ఈ సందేశ మేసీమకో.
... ... ... —మునిమాపు

(తల్లిబిడ్డల ప్రేమ అంటే)
ఇల్లాగు వుండా లటంటూ
... ... ...
ఏడాది కొకసారి వస్తా
దేడాది కొకసారి తెస్తాఁడు)
... ... ...
రావయ్య ఓ పూలరాజా
రావయ్య ఓ అందకాడా. —కోకిలమ్మ పెళ్ళి

రెండవవి నొక్కి- విరచి, చదివితే లొంగవచ్చును కాని 'మునిమాపు'లో గేయం మాత్రం అవ్యవస్థంగా ఉండిపోతున్నది.

ముత్యాలసరం అనగా త్రిపుటలో నడిచే $(3+4)+(3+4)$ మొత్తం 14 మాత్రలుగల పాదాలు మూడున్నూ, నాల్గవది హ్రస్వపాదమూ గల గేయం.

ఇక దీనికే నాలుగుపాదాలకూ ప్రాసం, మొదటి మూడు పాదాలకూ ఎనిమిదింట యతీ నియమిస్తే పూర్వపు దుస్తులతో ఒక పోతఛందస్సు తయారవుతుంది* కాని యతిప్రాసల వాడకంలో మన కవులు ఇచ్చవచ్చినట్లు నడిచారు. ఇష్టము వచ్చినచోటనే ప్రాస వేశారు. ఇష్ట మున్నప్పుడే యతు లుంచారు. ప్రాసలకు బదులు యతులు వేశారు, కొన్నిచోట్లనే యతిప్రాసలు పాటించారు, ఒక్కొక్కప్పుడు పూర్తిగా వీటిని త్యజించారు • కాని ఎప్పుడూ వీరు గమనం మాత్రం ఏమరి పోలేదు.

ఇక చూడవలసినది నాల్గవదైన హ్రస్వపాదం. ఇది సాధారణంగా తొమ్మిది మాత్ర లుంటుంది. సంస్కృత సంప్రదాయాన్నిబట్టి* అంత్యలఘువును గురువుగా పాటించి ఎనిమిది మాత్రలుగా కూడా చెయ్యవచ్చును. ఏదైనా మూడు, నాలుగు మాత్రల దగ్గర విరగక తీరదు.

తొమ్మిది మాత్రలకు ఉదాహరణ :

తాటి వనమున నాగి చంద్రుడు
తాను చెవి యొగ్గెన్ —లవణరాజు కల.

21 11 2 2 = 9

వారి యింటికి పోవలేదు
వదినతో మాటాడలేదు. -దేవాలయము.

కాయ గాయదు పండుపండదు
వలపులోనే వడలి వడలి. —ఒక నర్మము.

ఎనిమిది మాత్రలకు :

ఆంధ్రజననీ కంఠలంబిత
హారరోచులు ప్రిదిలె నిచ్చట

* ఇన్ని నియమాలతో పూడిపెద్ది వెంకటరమణయ్యగారు కొన్ని ముత్యాల సరాలు వ్రాశారు.

• వీటన్నిటికీ ఉదాహరణాలు అనవసరమని మానివేస్తున్నాను.

* అంత్య లఘువు గురువుగా దీర్ఘపాదాలలో కూడా వాడబడ్డది.

ఇట పురాతన నృపయశస్సులు
మరుగు కట్టినవి. -ఆంధ్రుడా.
1 1 1 2111 = 8.

ఇంతకంటె దీర్ఘమైనపాదం కూడా నాల్గవదిగా వాడబడింది. దీని పరిమితి 12 మాత్రలు.

చెల్లపళ్ళను విలువనెరుగక
పాదరక్షల మట్టిలిన్.
2 1 2 1 1 2 1 2 = 12.

దీనిలో తుది గురువును ప్లుతముగా చేసి నాలుగు పాదాలకూ సమానదైర్ఘ్యం ఆపాదించవచ్చును. కాని 14 మాత్రలూ పూర్తిగా కల నాల్గవపాదంతో ముత్యాల సరాలు కూడా (అప్పారావుగారిలోనే) ఉన్నవి.

వెలుగు నీటను గ్రుంకె చుక్కలు,
చదలచీకటి కదలబారెను;
ఎక్కడనో ఒక చెట్టుమాటున
నొక్క కోకిల పలుకసాగెను. —ముత్యాలసరములు.

తరువాతి కవులలో :

మధురశృంగారోదయ మ్మా
మంజులోషఃకాలఖండము :
సుధల జిందెడు నీకిసాలయ
సుందరోజ్వలతా విలాసము. —ధన్యకైలాసము.

దీనికే యతిప్రాసలు అంత్యప్రాసా కూర్చిన అద్భుతమైన వృషభగతిరగడ వసుచరిత్ర లోనిది :

బాల బాలరసాల మిది పిక
పాలి పాలిటి యమరసాలము
గేలిఁ గేలిడి గ్రుచ్చఁగడు రా
గిల్లు, గిల్లకు తత్ప్రవాళము.

నాలుగుకంటె హెచ్చు పాదాలతో అక్కడక్కడ హ్రస్వపాదంతో నా 'బాటసారి' అనే గీతం నడుస్తుంది. అంతకుముందే కవికొండల వెంకటరావుగారు శివరాత్రి

ప్రభలో ఈ పద్ధతిని ఒక విలక్షణఛందస్సు చేసి గొప్ప గొప్ప విసురులు చూపించారు. అందులో హ్రస్వపాదవిన్యాసం గమనించదగ్గది.

"శివరాత్రి ప్రభ"లో స్టాంజాల ఏర్పాటు ఉన్నది. 'బాటసారి'లో run-on verse యత్నించబడ్డది. వీటి ఆకృతులు స్పష్టంగా కనిపించడానికి రెండిటినీ పూర్తిగా ఉదాహరిస్తున్నాను.

శివరాత్రి ప్రభ :

౧

కాలకంఠుని నాగసర్పము
కుబుస మూడ్చి పడగ బున్సంది.
రెండు నాల్కలు
గండు మీసా లట్లు దూసింది,
చెవులు మోసింది;
నాగసార మూదేది ఎవరోయి ?
రాగ మొలికించేది ఎవరోయి ?
కారునల్లని కాళరాత్రి.

నొసలు గొసరిన మూడో కన్ను
నివురు లూదిన కొలిమి దెగడి
నెగడి ద్రిప్పింది,
పొగలు గప్పింది;
కమ్మరయితే యినుము కరగ,
సోమరయితే చలిని కాగ,
నెవరు వచ్చేరోయి ?
యెవరు మెచ్చేరోయి ?
కారు నల్లని కాళరాత్రి.

3

అర్ధభాగపు మహంకాళీ
కరమది కాలేదా ?

ఏమో ?
పునుకులా గలగలలు వింటూ
కునుకు గన్నాదో ?
నాథునీ వద్దనదు నాట్యము,
నాథునీ వద్దనదు :
అరరే ! ఆడిపోతున్నాయి :
వాడిముమ్మొనవాలు,
హుతభుక్,
అజకపాలం,
డొక్కు డుబుడక్
నాల్గుసేతులు నాడు లౌతున్నాయి :
అశ్మరభ ! అశ్మరభ
పందెమూ వేసేది యెవరోయి ?
కుందనము గాసేది యెవరోయి ?
కారు నల్లని కాళరాత్రి.

చంద్రమకుటము,
జటాజూటము,
సాంద్రనీలపు చదలపాపట
సురిగిపోతున్నాయి,
చక్కనీ మువ్వన్నె చర్మము
అక్కళించిన పొట్టపైని
అంటి యుండీ అంటుకున్నదోయి !
ఆకలా అని యనే దెవరు ?
సోకులా అని కనే దెవరు ?
కారు నల్లని కాళరాత్రి.

మోకరింపులు గావు;
అది మరి
బూకరింపుల నిలువు గాదు;
ఆకడ కు బడు నొక్కయంజ
ఈ కడకు బడు నొక్క యంజ
ఏకముగ జేయుచును
నడుమొక
రేఖగా దా వంచి గొంచు;
సందియము లే కెంచువా రెవరు ?
చిందు అని తోతెంచువా రెవరు ?
కారు నల్లని కాళరాత్రి.

అహంకారము లేదు లోలో
మహర్నటనము మొగము చాటదు.
మహాదేవా! యభయ మిడు మన
అభినయానకు హస్తమే లేదూ!
రభసమున దన ముందు వెనకల
ప్రభల గలిపించు :
ప్రభలలో ప్రభ నిలుప నెవరోయి ?
ప్రభలలో ప్రభ గలుప నెవరోయి ?
కారు నల్లని కాళరాత్రి.

బాటసారి :

కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రదుకుదామని
తల్లిమాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి

మూడురోజులు ఒక్కతీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక
నడిసముద్రపు నావరీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ,
దిగులుపడుతూ, దీనుడౌతూ
తిరుగుతుంటే—
చండచండం, తీవ్ర తీవ్రం
జ్వరం కాస్తే,
భయం వేస్తే,
ప్రలాపిస్తే—
మబ్బుపట్టీ, గాలికొట్టీ,
వాన వస్తే, వరద వస్తే,
చిమ్మచీకటి కమ్ముకొస్తే
దారి తప్పిన బాటసారికి
ఎంతకష్టం!
కళ్ళు వాకిట నిలిపి చూచే
పల్లెటూళ్ళో తల్లి ఏమని
పలవరిస్తోందో...?
చింతనిప్పులలాగు కన్నుల
చెరిగిపోసే మంటలెక్కితగ,
గుండుసూదులు గుచ్చినట్లే
శిరోవేదన అతిశయించగ,
రాత్రి నల్లని రాతిపోలిక
గుండె మీదనె కూరుచుండగ,
తల్లి పిల్చే కల్ల దృశ్యం
కళ్ళముందట గంతులేయగ,
చెవులు సోకని పిలుపు లేవో
తలచుకుంటూ, కలతకంటూ
తలడిలే,

కెళ్ళగిల్లే,
పల్లటిల్లే బాటసారికి
ఎంత కష్టం!
అతని బ్రతుకున కదే ఆఖరు—
గ్రుడ్డిచీకటిలోన గూబలు
ఘూకరించాయి.
వాన వెలిసీ మబ్బులో ఒక
మెరుపు మెరిసింది;
వేగుజామున తెలియజేస్తూ
కోడి కూసింది;
విడిన మబ్బుల నడుమనుండీ
వేగుజుక్కా వెక్కిరించింది.
బాటసారి కళేబరముతో
శీతవాయువు ఆడుకుంటోంది.
పల్లెటూళ్ళో తల్లి కేదో
పాడుకలలో పేగు కదిలింది.

నాలుగు కంటె ఎక్కువపాదాలు 'కాసులు' అనే గీతంలో అప్పారావుగారు వాడినారు. కాని ఆ గీతం స్వరూపరహితంగా ఉన్నది.

హ్రస్వపాదంలో విశేషం చూపించినవారిలో వెలువలి వీరరాఘవస్వామిగారొక రున్నారు. 'ముసలమ్మగారి కార్తీకస్నానం' అనే హాస్యరచనలో వీరు తోక ముత్యాలసరం అనే ఒక కొత్తరకం వాడకం తెచ్చారు. కాని యిది గురజాడ అప్పారావుగారిలో ప్రథమంగా సూచితమయియే ఉన్నది.

నడక లంచకు నడలు కరపగ
కన్నె పరతెంచెన్
రాజవీధిని
(... ... ...) —కన్యక.
నెమ్మి గోరితివేని కన్నియ
నిమ్ము లేకుంటే
పొమ్ము (.......) —కన్యక.

ఇంకా 1916 వ సంవత్సరపు ఉగాది సంచికలో 'అప్పారాయస్మృతి' అని వ్రాస్తూ వా. రంగాచార్యులుగారట,

అప్పరాయ కవీంద్రచంద్రుం
డవని విడినాడా ?
కట్టా
అవని విడినాడా ?

అని ఉపయోగించారు.

వీరరాఘవస్వామిగారి తోకముత్యాల సరాలలో కొన్ని పోకడలు తమాషాగా పడ్డవి.

Serious poem గా వ్రాసిన ఒక రచనలో పురిపండా అప్పలస్వామిగారు కొంత గమన వైలక్షణ్యం చూపించారు.

నేలదున్నీ
మొక్కనాటీ
కంచెవేసీ
నీరుపోసీ
తోట వేశాడు
ఆతడు
తోట పెంచాడు.
చివురు దొడిగీ
కొమ్మలేసీ
ఆకులేసీ
పొదలుగా ప్రాకినవి
మింటికి
చెట్లుగా సాగినవి
మొక్కలు,
చూచి మొక్కలు
ప్రక్క నిల్చొని
కనులలో ఆనంద మెంతో—

శిరము పంకించాడు
ఆతడు.
ప్రక్క కొమ్మల నెదో ఘూకము
కీచుమంటూ వెక్కిరించింది.
ఏమో రెక్కలార్చింది

తోటనిండా
పొదలనిండా
ప్రతీ కొమ్మకి
రకరకాలా పూలు పూచాయి.

పిల్ల యేర్లూ కొండలూ
ఈ విశ్వమంతా
విస్మయం చెందాయి.
మేలూ మేలు మే లన్నాయి.
హిమకణమ్ముల జలకమాడీ
ఉషఃకాంతుల మేలమాడీ
నెచ్చెలులతో గాయకులతో
మహారాణుల వలెనె మురిశాయి.
పూవులు
దేవకన్నెల వలెనె మెరిశాయి.
చూచి పూవులు
ప్రక్క నిల్చొని
శిరము పంకించాడు
ఆతని
లేత పెదవుల
మెరుగు నవ్వులు
నాట్యమాడీ
పూల తోటకు

వెలుగు పెట్టాయి.
అతని వెనుక
గాలిలో నొక
వికటహాసం వెక్కిరించింది.
ఏదో
వెక్కిరించింది.
మరుదినమ్మున ఎప్పటట్లే
వచ్చి చూచాడు
అతడు
తోటలోనికి వచ్చి చూచాడు.
పూవులన్నీ రాలిపోయీ
రేకులన్నీ చిదిగిపోయీ
నేలలో, పాదాల దగ్గర
ధూళిలో పొర్లాడుతున్నవి
గాలి దెబ్బకు తూలిపోతూ
ధూళిలో పొర్లాడుతున్నవి.
జాలిగా పొర్లాడుతున్నవి.

ఈ సందర్భంలోనే కవికొండల వెంకటరావుగారి 'కూలి యన్నల కుతుకము'ను కూడా పేర్కొనవచ్చును. రెండు పాదాల నడుమ ఒక హ్రస్వపాదం ఉంచి దానిని పల్లవిగా చేసి కీర్తన మాదిరిగా బసవరాజు అప్పారావుగారూ. అతని అనుయాయి తురగా వెంకటరామయ్యగారూ వ్రాశారు.

అప్పారావుగారి గేయంలో కొంతభాగం—

ఒంటిగా నుయ్యాల లూగితివా
నా ముద్దుకృష్ణా
జంటగా నను బిల్వదగదోయీ!
కంటికంతా జలమయంబై
మింటివరకును నేకరాశై
జంట దొరకని మహాప్రళయపు
టింటిలో వటపత్రడోలిక
నొంటిగా......

ఇట్టిదే వెంకట పార్వతీశ్వరుల దుందుభిధ్వానము (పల్లవి : చాటవే దుందుభి చాటవే); దువ్వూరి రామిరెడ్డిగారి అభిసారిక. (మొదలు :

గాలి యడుగుల నెవరికోసరము
ఓ మోహశీలా,
కదలి వచ్చితి వీ నిశీథమున)

"ఆగంతుక", "జీవనద్వేషి" మున్నగునవి యిటువంటి తెగకే సంబంధించినవి.

ముత్యాలసరం పాదాలనేరెండింటినీ, నాల్గింటినీ పల్లవి చేసిన గేయాలకు ఈ దిగువ రెండూ క్రమంగా ఉదాహరణాలు :

ఎందుకో పరువెత్తుచుంటిని
ముందుగతి తోచనే తోచదు —ముందుగతి.

దున్నరా యీ భరతభూమిని
తొలకరించిన పుణ్యభూమిని
కరువు లేనీ స్వర్గరాజ్యపు
దొరవు నీ వయ్యెదవురా. —దొరవు నీ వయ్యెదవురా.

కాని ముత్యాలసరం సమకూర్చే ఛందస్సంపత్తి ఇంతటితో ఆగలేదు. ఇప్పటి వరకూ 14 మాత్రల పాదాన్ని ప్రమాణంగా తీసుకొని చూశాము. కాని దీనిని 7 + 7 గా విరిచి ఇంకా చిన్నచిన్న ఛందస్సులు చెయ్యవచ్చును. అనగా అప్పుడు 7 మాత్రల పాదం ప్రమాణం అవుతుంది.

ఉదాహరణకు నా జయభేరి* ఛందస్సు తీసుకుంటున్నాను.

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను

ఇది త్రిపాత్తు. 7 మాత్రల పాదాలు రెండున్నూ, ఒక దీర్ఘపాదం (దీనిలో 15 మాత్రలు గమనించాలి. ఆఖరి అధికమాత్రవల్ల ఒక విధమైన పూర్తి సమకూడు తుంది. ఇట్టిదే కాని కొంచెం భేదం కల

* రచించిన తేదీ 2-6-1933.

యముని మహిషపులోహఘంటలు
మబ్బుచాటున
ఖణే ల్మన్నాయి. —అవతారం.

అన్న దానిలో మొదటిపాదం దీర్ఘం (14 మాత్రలు) గాను, మిగిలినవి రెండూ హ్రస్వాలుగానూ ఉన్నవి. దీనినే రెండు పాదాలలోనూ. నాలుగుపాదాలలోనూ వ్రాయవచ్చును.

యముని మహిషపు లోహఘంటలు
మబ్బుచాటున ఖణే ల్మన్నాయి
యముని మహిషపు
లోహ ఘంటలు
మబ్బుచాటున
ఖణే ల్మన్నాయి

జయభేరిలో ఒక పాదానికి 21 మాత్ర లున్నవి.

చంద్రగాడ్పులు, వానమబ్బులు' మంచుసోనలు అనగా 7 + 7 + 7, ఒకటిన్నర ముత్యాలసరం పాదం అన్నమాట. అభిరుచి తప్ప వీటి దైర్ఘ్యం నిర్ణయించే మరొక ప్రామాణ్యం లేదు కాని వీటిని నిర్మించుకొనడములో ఆకృతిని, నడకనూ, అవి పోషించే భావాన్నీ ఔచిత్య భంగానికి పాలుకాకుండా, పలుచగా పేలవంగా ఉండిపోకుండా చూచుకోవాలి.

ఛందస్సు గుర్రం వంటిది. గుర్రం ఎటు తీసుకుపోతే అటల్లా వెళ్ళిపోయేవాడు ఆశ్వికుడు కానట్లే ఛందస్సు లాగుకుపోయినట్లు వ్రాసేవాడు సంవిధానజ్ఞుడు కాడు. మరి ఆ ఛందస్సును లొంగించుకొని దానిచేత చిత్రవిచిత్ర రీతులలో కదం త్రొక్కించిన వారినే ప్రశంసిస్తాము. ఆధునికకవుల ముత్యాలసరం రచనల గూర్చి ఇట్టి ప్రశంసకూ, సాహసమే అయినా దోష విచారణకూ ఈ భాగం ప్రత్యేకిస్తున్నాను.

ఆధునికాంధ్ర కవిత్వానికి గురుపాదులు శ్రీ గురజాడ అప్పారావుగారని అందరి సమ్మతిమీదా తేలిన విషయం. ముత్యాలసరం వారి కానుక. తార్కికులూ, వైయాకరణులూ, కళ్ళు మూసుకున్నవాళ్ళూ, మడికట్టుకున్నవాళ్ళూ మొదలైన

పరిమితక్షేత్ర సంచారాలను ధిక్కరించి గురజాడ అప్పారావుగారు మొట్టమొదట నవ్యకవితను ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టారు. ఈ యాథార్థ్యాలన్నింటినీ ఒప్పుకొన్న పిమ్మట వారి ముత్యాలసరం ఛందస్సు అపరిపక్వమనీ వారి కవిత్వం అనగాధమనీ విధిలేక చెప్పవలసి వస్తుంది.

కన్యాశుల్కం వ్రాసిన గురజాడ అప్పారావుగారు మహాకవి కాదని ఎవ్వరూ అనలేరు. 'లవణరాజుకల'లో, 'కన్యక'లో, 'లంగరెత్తుము'లో కవిత్వస్ఫులింగాలను మరిచిపోజాలము, కాన గురజాడ అప్పారావుగారు ముత్యాలసరాన్ని మెలకువతో నిర్వహించలేదనే చెప్పాలి. ఈయన తర్వాతి కవులలోనే వీరికంటె తీవ్రత, జాగరూకత కానవస్తున్నదని ఒప్పుకోవాలి. అలక్ష్యఫలితములూ, ప్రమాదపతితములూ అయిన అనేక వ్యాకరణదోషాలూ, (ఇవికావు పౌఢ కవిత్వద్యోతకం) నిర్వహణ వైవిధ్యం లేకపోవడమే కాక ఎటూ కానిచోట విరువబడి పాడయిన పాదాలూ (ఉదా 'కాసులు') అప్పారావుగారి ఛందోవ్యవస్థకు బలహీనత ఆపాదిస్తున్నవి. పైచెప్పిన అవలక్షణాల వల్ల లక్షణానికే విరూపత తటస్థిస్తుంది.

ఇంతకూ గనిలోనుండి మొట్టమొదట తీయబడిన లోహం వంటిది వీరి ముత్యాలసరం. వస్తువును మాత్రమే స్వీకరించి దానిని చుట్టుముట్టిన వ్యర్థసామగ్రిని త్యజించడం మంచిది.

గురజాడ అప్పారావుగారు ఆంగ్లవాఙ్మయప్రభావం తెచ్చి ఏవిధంగా క్రొత్తకవిత్వానికి కాలువ నిర్మించారో అట్లే వంగసాహిత్యం నుండి మరొక పాయను మొదట రాయప్రోలు సుబ్బారావుగారూ, తరువాత అబ్బూరి రామకృష్ణరావుగారూ తీసికొనివచ్చి నవ్యకవిత్వాన్ని పరిపుష్టము కావించారు. వీరిలో రాయప్రోలు సుబ్బారావుగారు 'జడకుచ్చులు' అనే గీతసంపుటిలో మాత్రం ముత్యాలసరాలను ('తమ్ముడా', తిలకము' అనే వాటిని) ప్రకటించారు. సుబ్బారావుగారి దేశభక్తికి ఇవి కొంతవరకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ రెండు గేయాలలో హ్రస్వపాదాలు 12 మాత్రలు కలవి. వీరు యతిప్రాసలు సరిగా పాటిస్తారు.

శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలు గారిన భాగ్యసీమయి
వ్రాలినది ఈ భరతదేశము
భక్తి పాడర తమ్ముడా!

అన్న గీతంలో దీర్ఘపాదాలన్నింటికీ యతిప్రాసలు సరిగ్గా పాటించబడ్డవి. సాధారణంగా ఈ కవి యతిప్రాసలను ధిక్కరించలేదు.*

విపినబంధురవృక్షవాటిక
ఉపనిషన్మధు వొలికె నిచ్చట.

'తిలకము'లో ఉద్రేకము పౌరాణిక. చారిత్రక వీరాంగనలను ఉదాత్తంగా భావించింది.

అబ్బూరి రామకృష్ణారావుగారి 'ఊహాగానము' లోనూ, 'మల్లికాంబ'లోనూ ముత్యాలసరాలు లేవు. కాని చాలాకాలం క్రిందట 'కృష్ణాపత్రిక'లో వారి 'వర్షాగమము' అనే ముత్యాలసరాల ఖండకావ్యం పడ్డది. 'నదీసుందరి' అనే వారి నాటకంలో ముత్యాలసరా లున్నవి.

రామకృష్ణారావుగారు పదార్థగౌరవానికీ సందర్భశుద్ధికీ పేరు పడ్డారు. చ్యుతసంస్కృతిదోషం వీరి రచనలలో ఎక్కడా నాకు కనపడలేదు. ముత్యాలసరం అన్నమాటేమిటి, ఏఛందమైనా వీరు చెప్పినట్లు వింటుంది. రాయప్రోలు సుబ్బారావుగారి కంటె వీరు better technician అని నా ఉద్దేశం. కవిత్వం మీద అభిప్రాయం చెప్పడానికి ఇది స్థలం కాదు.

ఇటుపైనుండి వచ్చిన ముత్యాలసరాలను గుట్టవేస్తే ఒక పర్వత మవుతుంది. కవులసంఖ్య కూడా అనల్పమే, అందరికవుల అన్ని ముత్యాలసరాల పరీక్ష అనవసరము. కొందరి ముత్యాలసరాలు మాత్రమే చర్చిస్తాను.

స్వర్గీయ బసవరాజు అప్పారావుగారి గీతాల సంపుటిలో 'దగాయీత', 'వటపత్రశాయి', 'విహారము'. 'రామకథాసుధ' అనే ముత్యాలసరా లున్నవి. 'వటపత్రశాయి'లోని వ్యవస్థ ఇదివరకే చూశాము. 'దగాయీత'లో గొప్ప ప్రత్యేకత ఏదీ లేదు. 'విహారము'లో నాల్గు ముత్యాలసరాలు. వీటి దీర్ఘపాదాలు పన్నెండింటికీ ఒకే ప్రాస, 2, 3 గీతాల హ్రస్వపాదాలకు కూడా ఈ ప్రాసమే ఉన్నది. 1, 4 గీతాల హ్రస్వపాదాలు వాటి మూడవపాదంతో యతి పాటించినవి. 'రామకథాసుధ' శంకరుని రామకృష్ణామృతము నుండి తెనిగించండి సమాన పాదాలతో శ్రావ్యంగా నడుస్తుంది, దీని మొదటి నాలుగు పాదాలు ఉదాహరిస్తున్నాను.

* అనంతర రచన 'దూత మత్తేభము'లో శ్రీ సుబ్బారావుగారు యతిప్రాసలు పాటించలేదు. వు, అ.

మార్గమందున మార్గమందున
వృక్షశాఖల రత్నవేదులు
వేదులందున వేదులందున
కిన్నరీ బృందముల గీతము.

గాయకుడైన బసవరాజు అప్పారావుగారు తన గేయాలను హాయిగా నడిపించడంలో వింతలేదు.

మాత్రాఛందస్సు లనేకం ఉపయోగించబడిన వెంకిపాటలలో ఒక్క ముత్యాలసరం గేయమూ లేదు, కాని నండూరి సుబ్బారావుగారి క్రొత్తరచనగా 'వైతాళికుల'లో ఒక ఖండకావ్యం ప్రకటితమైనది. దాని మొదలు :

ఆవు నడిగీ
అడవి నడిగీ

కూరిచితిరా
గుమ్మపాలు
కమ్మ తేనె;

కర్షకకవి దువ్వూరి రామిరెడ్డిగారూ, కార్మికకవి కవికొండల వెంకటరావుగారూ చక్కని ముత్యాలసరాలు వ్రాశారు. వెంకటరావుగారు 'శివరాత్రి ప్రభ'లో భావనలోనూ, గమనంలోనూ ఆవరించిన వైశాల్యం ఇంతట్లో ఎవ్వరూ అందుకోలేరు. కాని క్వచిత్తుగా అందులో వారు అనుప్రాసం కొరకు అర్థం సరిచూచుకోలేదు.

'కోకిలమ్మ పెళ్ళి' వ్రాసి విశ్వనాథ సత్యనారాయణగారు కథన కవిత్వంలో క్రొత్తలోతు చూపించారు, 'కోకిలమ్మ పెళ్ళి'లో

అడవిలోనూ కడలిలోనూ
అర్ధరాతిరి వేళ అప్పుడు
తొగరు కన్నుల చుక్కకన్నెలు
తొంగి చూస్తారోయ్.
సుళ్ళు తిరిగే కడలి నడుమా
చూపు కందీ అందకుండా

తెప్పవేసుకు పాము పడుచులు
తేలిపోతారోయ్.

అన్నవి కవిత్వవంతములైన వర్ణనలు.

మోదుగులు పూశాయి పెదవులు

అనడం ఒక్కపాదంలోనే చెప్పవలసిన దెంతో చెప్పివేయడం.

చివురులూ కొమ్మలా చివరా
గుబురులూ గుబురులా చివరా
పూవులూ నాలుగూ వైపుల
బుగులు కొన్నాయీ.

వీటిలో లగ్నప్రయోగం వల్ల ప్రౌఢగమనం సిద్ధిస్తున్నది. ఇది దీని తర్వాత చెప్పబడిన

చివురులో యీనెల్లె పసిరిక
పూవులో తేనెల్లె పలపల
చిలకతల్లికి కోకిలమ్మకు
వయసు వచ్చిందీ.

అనే సుందరమైన భావానికి వాతావరణం కల్పిస్తున్నది. లగ్నప్రయోగాలు కోకిలమ్మ పెళ్ళిలో ఇంకా ఉన్నవి. వీటిలో బాగున్నది :

చిలకతల్లీ సొగసువాకలు
చిలపలై పలపలై యందపు
మొలకలై తేనెలా చినుకులు
గలపరించాయి.

అన్నది.

బాగులేనివి :

తల్లికీ చిలకతల్లంటే
గోధుమవన్నె ప్రాచల్లే

లయతప్పి నడవని పాదాలు కొన్ని ఇదివరకు చూపించాను. అట్టివే.

పోకిళ్ళుమా రైంది తల్లికి,
ఆపాట వింటూనే అడివీ
సన్నాయి పాడింది తెల్లని-

ఒకమాత్ర ఎక్కువై నడవదు ఈ క్రిందిపాదం :

గాలి పిల్లలు వెదుళ్ళలో రా
2 1 2 1 1 1 2 1 2 2 = 15.
పూలసోనలు కురిసినై, తే
నేల పాటలు విరిసినై, అం
దాల త్రోవలు వెలిసినై, రాజ
నాలు పండినవి.

అన్నచోట 'రజనాలు' అని ఉచ్చరిస్తేనేకాని నడక కుదరదు.

ఉద్రేకం సూచిస్తూ ఛందోగమనం మార్చడం :

కోకిలమ్మా అదుగో మళ్ళీ
కూ సెనంటే కూసెనా నీ
వచ్చెనంటే వచ్చెనా నీ
బ్రతికెనంటే బ్రతికెనా నీ
ఒళ్ళు తెలియక అడవి పూటా
పొర్లి పోయిందీ.
చెన్ను తరగని మావి మోకా
చివురు తొడిగిందీ
అంతలోపల నడవి కందం
అతిశయించిందీ.

అన్నదానిలో వరుసని ఐదు దీర్ఘ పాదాలు వాడడమందూ దగ్గర దగ్గరగా హ్రస్వ పాదాలు కూర్చడమందూ కనిపిస్తుంది.

కథనకవితలో 'గీతానందు'ని 'కాపుపెళ్ళి' కూడా పేర్కొన దగ్గది.

సంఖ్యలో అనేకములైన ముత్యాలసరాలు వ్రాసినవారు శివశంకరశాస్త్రిగారు. వీరికి సంస్కృత పక్షపాతం మెండు. అందువల్ల చూస్తూ నియమాలు ఎగరకొట్ట

లేరు. కావున వీరి ముత్యాలసరాలు ఒకే నడక ప్రదర్శిస్తవి. కాని సంస్కృత ప్రోద్బలం వల్లనే గంభీరంగా నడుస్తవి. శాస్త్రిగారి ముత్యాలసరాలు నడకనుబట్టి ఏ శిఖరిణీ, మాలినీ వృత్తాలో అనుకోవాలి.

వీరి 'దేవాలయం' అన్న ముత్యాలసరాలలో వ్రాయబడిన ఖండకావ్యం నాయకునికీ ఆప్తునికీ సంభాషణ 'సందేశం' అనే ఖండకావ్యంలో సందేశభాగం ముత్యాలసరంలో ఉన్నది. వీరి పద్యనాటికలలో పాత్రల వేర్వేరు భాషణలుగా వేరువేరు ఛందస్సులు ఉపయోగించారు. వాటిలో ముత్యాలసరాలు కూడా ఉన్నవి. 'హృదయేశ్వరి'లో కొంతభాగం ముత్యాలసరాలు.

శివశంకరశాస్త్రిగారి ముత్యాలసరంలో సాధారణంగా

a వివిధ సారస్వత నదీనద
a విమల జలముల నోలలాడుచు
b అనిశ మానందాధిగమమున
b నలరుదము లక్ష్మి !

అన్నదానిలో వలె ప్రాసకు బదులు రెండేసి రెండేసి పాదాలకు (a, a, b, b గా) యతి వాడబడి ఉంటుంది. ప్రాసలుకూడా వాడలే దని కాదు. తరచుగా వాడినది పై పద్ధతిని.

తక్కువ ముత్యాలసరాలు వ్రాసినది కొడవటిగంటి వెంకటసుబ్బయ్యగారు. అనగా ఒక్కటే వ్రాశారు. కాని దాని నిక్కడ స్మరించకతీరదు. అది 'సంధ్యా రాగము' అనే వారి గీతాల సంపుటిలో మొదటి ఖండకావ్యం 'ఆతిథ్య' మన్నది.

ఆగు మాగుము తెరువరీ ఆ
యాస ఖేదం బపనయింపుము
మా గృహాంగణ కుసుమ సముదయ
మధువు లియ్యవిగో,

అని అది ప్రారంభమవుతుంది.

'సఖి' లో చింతా దీక్షితులుగారు 'కవి-కన్యక' అని ముత్యాలసరాలు వ్రాశారు. దానివల్ల ఆవిష్టులై ముద్దుకృష్ణ, కృష్ణశాస్త్రిగార్లు 'దీక్షితులన్నగారు' అని వ్రాశారు.

కృష్ణశాస్త్రిగారు కొలదిపాటి ముత్యాలసరాలు వ్రాశారు. అవైనా 'కృష్ణ పక్షము'లోనే ఉన్నవి. అవి 'వెఱ్ఱిపాట', 'మహాకవి గురజాడ అప్పారావు',

'చిన్నపూవే వాడెనా'. 'చుక్కలు' అన్నవి. అప్పటి కింకా పదశిల్పం వారిలో పరువము కాలేదు. 'కృష్ణపక్షం'లో చాలా గీతాలు కృష్ణశాస్త్రిగారి బాల్యక్రీడలు; ముఖ్యంగా ముత్యాలసరాలు.

వీరి ముత్యాలసరంలో గురజాడ అప్పారావుగారి ఒరవడి స్పష్టం, 'చుక్కలు' అప్పారావుగారి 'లంగరెత్తుము'మ ప్రతిధ్వనిస్తుంది.

చేతి కందెడు పూలకొరకై
చేయి చాపక చేరి కోరక
దూరముగ లే వంచు వానిని
దూరి వదలితిని. —చుక్కలు.

అందజాలని పళ్ళకోసము
అఱ్రు జాపితి; నేల పాకిన
చెట్లపళ్ళను విలవ లెరుగక
పాదరక్షల మట్టితిన్, —లంగరెత్తుము,

ఉగాది సంచికలోని (వా, రంగాచార్యులుగారి) 'అప్పారాయ స్మృతి'ని చూచిన పిమ్మటనే కృష్ణశాస్త్రిగారు 'మహాకవి గురజాడ అప్పారావు' వ్రాశారా అనిపించుతుంది. 'వెఱ్ఱిపాట' అన్వర్థనామధేయంగా ఉన్నది. 'చిన్నిపూవే వాడెనా' అన్నది శకలప్రాయము. ఇవికాక 'అన్వేషణము'లో ముత్యాలసరం ఉన్నదంటే ఉన్నది. ఏమైనా కృష్ణశాస్త్రిగారి శక్తిని ముత్యాలసరంలో కాదు చూడవలసింది.

'మునిమాపు'లో 'వలపు' అనే శీర్షికగల ముత్యాలసరాలు చక్కగా సలక్షణంగా ఉన్నవి.

వేదుల సత్యనారాయణశాస్త్రిగారి 'రాణా ప్రతాపసింహ' నాటకంలో 'జయము భారత భాగ్యలక్ష్మీ' అనే గేయం ఉన్నది. నాకు తెలిసినంతవరకు వీరి ముత్యాలసరం రచన ఇంతే.*

* కాదు. ఒకమారు శాస్త్రిగారిని 'ముత్యాలసరా లేవైనా వ్రాశారా ? నా వ్యాసంలో ఉదాహరిస్తా' నని అడిగాను. సముద్రపుటొడ్డున నడుస్తున్నాము. శాస్త్రిగారు తాము వ్రాసిన వేవీ లేవు. గాని ఇప్పు డొకటి వ్రాస్తానని,

"ఒక్కడైనను మాటలాడడు
ఒక్కడైనను తేరి చూడడు
ప్రక్క నడకల ఎండ్రపీతలె
దిక్కు మనకింకిన్"

అన్నారు. శాస్త్రిగారు వ్రాసిన, నాకు తెలిసిన ముత్యాలసరం ఇదొకటి !

'వెన్నెల' అనే పెద్ద కావ్యంలో పూడిపెద్ది వెంకటరమణయ్యగారు మన పూర్వ ప్రబంధాల్లో ఆశ్వాసాంతగద్యమువలె ఘట్టము ముగిసినచోట్లన్నింటిలో ముత్యాలసరాలు వేశారు. వాటిలో 'వల్లీ పల్లవి' భారతిలో ప్రకటితమైనది.

స్వర్గీయ పెనుమర్తి వెంకటరత్నముగారు కొన్ని ముత్యాలసరాలు వ్రాశారు. వారిలో వికసనోన్ముఖమైన ఒక శక్తి ఆ కాలమున నష్టమైపోయింది.

శాస్త్రదృష్టిని చేయబడిన ఈ ఛందశ్చర్చలో ఒక్క విషయంమాత్రం ఏమరకూడదు. కావ్యం చిరస్థాయి కావడానికి అందలి రసాధిక్యం కారణమవు తుంది కాని దాని నిర్మాణసౌష్ఠవం కాదు. అయినా ఆకృతి వివక్ష చెయ్యడం వ్యర్థ కృత్యము కాదు. కళాశిలి ఛందోరహస్యవేత్త కూడను. సుందరభావమైనా పాడుగా చెప్పబడిన యెడల రసభంగము కలిగిన దన్నమాటే. సంవిధానము (technique) వ్యాకరణ ఛందస్సులే కాక తదతీతమయిన ఒక విపులవ్యవస్థ. కవి తనలో అంతర్గతమైన రసాన్ని పాఠకునిలో బహిర్గతము చేయగలుగుతున్న కార్యమే సంవిధానము, దీనికి ఆఘాతం తగిలితే రసానికే విప్రపత్తి సంఘటిల్లి నట్లు కావున తుట్టతుదకు రీతి నదాలు రససముద్రంలోనికే చేరుకుంటాయి.

కవిత్వాన్నీ, సంవిధానాన్నీ తీసుకుని కూర్పులు చేస్తే నాలుగువిధములైన జంటలు ఏర్పడుతవి. వీటిలో నాలుగోవిధమే సర్వోత్కృష్టమైనది.

1. —కవిత్వము
—సంవిధానము

అభావకవిత్వమే కాక అనేకదోషభూయిష్టమైన రచన.

2. —కవిత్వము + సంవిధానము

సలక్షణమైన కన్యక. కాని నిర్జీవ.

3. + కవిత్వము — సంవిధానము,

ఉదా : ప్రీతిపాత్రమైన పెండ్లాము సచ్చిన
యింటిపాడుసూచి యేడ్వలేక
చనడు పొలము విడచి పనిలేకయున్నను
పామరుండు కాపువాడు కంటె.

—'గాథాసప్తశతి' రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి అనువాదము.

4. + కవిత్వము + సంవిధానము.

ఉదా Between the green bud and the red
Youth sat and sang by Time and shed
From eyes and tresses flowers and tears,
From heart and spirit hopes and fears.
—A. C. Swinburne's Songs before Sunrise

ఇందలి మూడోవిధానాన్ని తీసుకొని కొందరు రసవాదులు 'భావ ముంటే చాలును, ఎట్లు చెప్పినా సరే', అనవచ్చును. కాని వారు సర్వసమగ్రత కోరలేదని చెప్పాలి. ఏ విషయంలో కొరవడినా కవిత్వము ఉత్కృష్టము కానేరదు. కావున మహత్తర భావాలను మహత్తరవిధంగా ప్రతిపాదించినదే ఉత్కృష్ట కవిత్వం.

—శ్రీరంగం శ్రీనివాసరావు*

———o———

* ఉదయిని. సం. 1. సం. 2. ఫిబ్రవరి, 1935.

సాధించుకోవడము ఎందుకు- అని సంకోచము తొంగిచూడనేవచ్చు. కాని యీ ఐక్యము మనము సాధించుకోబోయినది కాదు. అదే మనకు సోకుతుంది. అది యిక్కడ గణించుకోవడములో ఒక అర్థసంధి ప్రయోజనము తారసిల్లుతుంది.

సాధారణముగా కవి ఆత్మను తెలియడానికి ఒక కావ్యము కాదు. కవినే (అతని కావ్యాలన్నీ) చదువమన్నారు. కవి పూర్తిఅయేవఱకూ అతడు తెలియడని కాదు, వివిధకావ్యాలలో ప్రసరించిన మనోవృత్తి సూత్రము, సందేశశ్రుతిపరముగా, వివృత మవుతుందని. మన కీ రెండు కావ్యాలు కలిసివచ్చినవి. "కృష్ణపక్షము" నుంచి యిది, కేంద్రమునకు సంబంధించినంతవఱకు భిన్నగతి త్రొక్కదు. కృష్ణపక్షములో కవి ఇంకా కొన్ని వస్తువులకేసి చూచాడు. ఇక్కడ ప్రేయసి కేసి మాత్రమే చూస్తున్నాడు. కాని ఆ చూడడములో- దర్శన ఫక్కీలో- మూలగతమైన మార్పు లేదు;- అప్పటి జీవితానుభవపు యౌనోదయముమాత్రము ఇప్పుడు కొంత చిక్కబడింది; నాటి కోవెలకొలము తనము నేడు హేమంతశృంఖలో చిత్రమైన క్రొత్తయెలుగులకు తావలమయింది! ఈ ఐక్యవిధి, ఈ కావ్యాల ఆనుషంగికపరిశీలనములో ఫలించినట్టిది, ఇవి సంధులు విడగొట్టి నీటిలో ముంచి వదలివేస్తే తేలే ప్రతిశకలములోనూ కానవస్తుంది.

ఈ గ్రంథమంతా ఒక్కటే భావమన్నాడట ఒక మహాకవి. దాని ప్రకారము ఇందు మానసిక పరిక్రమణము తక్కువ అన్నమాట. ఒక్కభావమే అయితే, ఇంత విస్తరించి నిరూపించడానికి ఎంతటి భావన, ఎంతటి నేర్పు కావలెనో !

ఈ విమర్శము వద్ద మనము నిలచి పరికిస్తే తన ప్రవృత్తి వాటికలో ఒక్కచో అబుద్ధుడై చుట్టూ అనుభూతి పూచుకున్నట్టు, కవి మనచుట్టూ వికసిస్తాడు.

> "మత్పురానేకపుణ్యజన్మములు పండి
> జాహ్నవీస్వచ్ఛవును సుధాస్వాదుమూర్తి
> వైన నీదివ్యసాన్నిధ్య మంటుకొంటి
> పుడమికిన్ స్వర్గమున కొక్కముడి రచించి"

అన్న ప్రణయోపాసకుడే, నాయని సుబ్బారావుగారు. పిలిచే ప్రతిపిలుపుకీ విశ్వము తన ప్రేయసిని అనుభవించగలిగితే.

> "ఊర్వశీ, ప్రేయసీ, నేడో యుష్మదీయ
> చరణకరుణామధుకణమ్మె దొరకునేమో,

మూడులోకాలసుఖ మొక్కముడి నిమిడ్చి
విసరలేనో కాలాంతమే వెనుక ప్రాక.

అన్న ప్రణయ—సుఖోపాసకుడు కృష్ణశాస్త్రి పిలిచే ప్రతిపిలుపుకీ (ప్రతిమాటలోనూ పిలుపు సురక్షితమే) విశ్వము కొంతమెఱ చూపు చూస్తుంది. రాజ—ఋషిని వరింపవచ్చిన రాజ్యలక్ష్మి ఈతని చూచి మరలిపోతే, రాజ—భోగిని వరింపగల ఒక రాజ్యలక్ష్మిని ఈ కవి తాను, చేపట్టజూస్తాడు. తన జీవితానుభవ మెంత ఆసక్తితో స్వీకరించాడో అంత ఆసక్తితో, అంత తత్పరతతో దానిని చిత్రించు కొని దాని కంకితము చేసుకొన్నాడు (అంకితము—ఊర్వశి 'కే' కా)!

'ఈ యలంకారప్రియను ప్రకృతిని వలతొ
ఆనిరంజనతత్వము నాశ్రయింతొ!
ఏది కవిత కుపాస్య మోయి సఖుండ!
ఏది మదికి విచార్య మోయి సఖుండ!

అన్న రాయప్రోలు సుబ్బారావుగారి విచికిత్స యీ కవిని బాధించదు. కారణము ఆయనకు

'కవిత భోగపథాన కాకర్ష పెట్టు,
మనసు భోగపరిత్యాగమునకు లాగు;

ఈయన కీరాయిడి లేదు. మనసు భోగపరిత్యాగమునకు లాగదు. టాగూరు మహా కవికీ లేదు. అతనికి కవిత భోగపథాన కాకర్ష పెట్టదు. అతడు భోగమునకు వాలే ప్రకృతినీ, తత్పరిత్యాగమునకు తోలే సంస్కృతినీ కలియగట్టే రహస్యదర్శన పథాలు ప్రయోగించుకొన్నాడు, జీవితములోనూ, దాని సత్వమును పాడే కవితలోనూను. ఈ కవి 'జీవిత రహస్యమార్గమ్ములు' వేఱే.

తాను కను విప్పినదే ఆ ఒక వాటికలో నన్నట్లు, ఆవాసనల కగ్గమై అదే లోకముగా కీర్తించుకున్న మనస్సు,

'ఈ మిడిసిపాటు నీమ్రోల నేల, తేనె
తేట చినుకేని లేని యీ పాట కిపుడు?
ఇంత చివురిచ్చి యంత హేమంతశృంఖ
లాల బంధింతు మూగతనాల గొంతు!

స్వామి ! నూత్నవసంత జీవప్రవాళ
పల్లవమ్ములరుచులె నా బ్రతుకుజీర
గోసి తీయదనమ్ములు పోసినపుడె
వెడలిపడలేద ! యొక యడు గిడలేద.

మూడులోకాలబరువులమోత నడగి
యడగి చిదికెనుగద అంధజడము తాను !
ఓయి గాయకసార్వభౌమా ! యివేటి
తగని త్రుళ్ళింత వెలితినృత్యమ్ము లోయి !'

అని దృష్టిపైకి త్రిప్పి తన సమృద్ధభావ్యకణాలకు హృదయద్రవణముతో భక్తి రంగు కిరణించింది. ఈ మనస్థితితో కాదు కవి 'ప్రేయసి' యెడ అనుభవాన్ని లాలించుకున్నది. 'ఊర్వశీ ! ప్రేయసీ ! నేఁడో యుష్మదీయ—' అన్న పద్యము ఈ అవస్థలో ముంచితే, మత్పురానేకపుణ్యజన్మములు పండి' అన్న (నాయనివారి) పద్యమువంటిదిగా పరివర్తిత మౌతుందేమో ! అది ఆ త్రుళ్ళింత నృత్యాలలోనిది. ఇపు డవి తటస్థదృష్టికి పరామర్శ భాజనము లవుతున్నాయి. ఈ సంగాసంగముల బిగువులో చూచుకోవలసిన ఈ కవి లక్షణపరిష్కారమును సంగములోనే బిగించు కొన్నవారు, ఇట్టి పెఱపోకడలు చూచి, కవికి అనుభవశుద్ధి కాని, చిత్తశుద్ధి కాని లేదంటారు. సంగముఘోష అంత యెక్కువై ఆ బిగువు, నిజానికి, పరిణతము కానీయలేదు.

'ఆటతో పాటతో నేర్చినట్లు దేవ
ఏనుకూడ నీవలె నటియింపనిమ్ము,
ఎడతెగనియాత్ర నెట్లో సాగించువరకు !
ఎట్లో నీ దర్శనమ్ము సాధించువరకు !'

అని కవి చెప్పుకున్న పలుకులవలన,— అతడూ 'యాత్రికు'డే ! కాని అతడు తన యాత్రపంథయైన 'సౌందర్య రసైక జీవి'త్వమును ఒక 'బరువులమోత నడగి యడగి నిరూపించుకోవడముచేత యాత్రాపరత్వము మాటువడుతూ ఉంటుంది. కనుకనే విచ్చలవిడిగా వికసించి మధురించిపోయే కవి తరుచు ఒక ఉపరాగమునకు పాల్పడుతూ వచ్చాడు.

మన కాతడు తరుచు 'యక్షుడే' అయి కన్పడుతాడు. తన 'నీ దర్శనమ్ము సాధించువరకు' పూనిన 'యాత్ర' మాట మఱచిపోతాడు. 'యుగయుగంబుల కలల్ పాడనా'; 'సందేశాల బరపనా దిక్కుదిక్కులకు చుక్కలకు';

'నా హృదయమందు విశ్వవీణాగళమ్ము
భోరుభోరున నీనాడు మ్రోతవెట్టు'

అని కూడా కవి చెప్పుకున్నాడు. కాని యీ కలలు, సందేశాలు విశ్వమువేనా అని సంకోచము వెన్నంటి వస్తుంది. పోనీ, విశ్వమువే;—అతనిలో 'వీణాగళమ్ము'తో భోరుభోరున మ్రోతవెట్టు' కూడాను;—కాని, విశ్వమువా డైన కవిది కాదీ విశ్వము; యుగయుగాల విశ్వయాత్రికులకు వినవచ్చిన సందేశాలు ఇందులో గొంతు విచ్చి వినబడవు! ఇది యక్షునిది;—నాయకునిది, అతడు తన అనుభవపు భావ సామగ్రిని తనలో తరిబియతుచేసుకొని—కాక, తానే దానిలో తరిబియతు అయి, బయటికి జైత్రయాత్ర వెడలివస్తాడు, ఆ అనుభవపరిచ్ఛిన్నతలోనే ముడిగి.

బైరను కవి అంటే కార్లైలు మహాపండితుడు ఇష్టపడలేదట,— సంస్కృతి తులసమ్మకు నీరు పోసినవాడు కాడని. ఆ కవినే గేథిమహాకవి (అతడూ బ్రహ్మాండ నాయకుడే) చాల మెచ్చుకున్నాడట! అది యెట్లైనా సరే, తపన అంటూ ఉన్న దంటే అది (జిజ్ఞాసాపరిణతిలో) సంస్కృతి వంకకే దారితీస్తుంది, అని. తన అనుభవసారము తాను కవివలె నిరూపించుకొని సంస్కృతి అర్చలో తన 'కోలూ' తాను తీర్చగలడు. కాని నాయకుడుగా (తన అనుభవము నెడల) ఈ కవికిగల ఆసక్తికి తోడు నాయకత యెడల అతనికి గల ఆసక్తి నాయకుని స్వయం పుష్టి తప్పిన కృతకతకంటా యీడ్చుకపోయిన తావులు తరుచు ఈ ఆసక్తి ప్రభావము కళావీధి కొసకంటా, శిల్పము మేరలకంటా, పరుగువారింది. కవికి తెలియకుండా వికసించిన కళాధోరణులు ఉన్నతవీధుల భద్రపడగలిగినవి కాని, అతని కంటబడిన ప్రతి సౌందర్యమూ నలుగుడు తిన్నది—తన లక్షణమునే అతడు, తెలిసినమట్టుకు, భోగిస్తాడు; ఉపాసించడు. తాను సౌందర్యరసైకజీవి; తన జీవిత్వము నిలుపు కొనేటందుకు కూడా సౌందర్యము స్వాదమును ఖర్చుపెట్టుకుంటాడు.

మఱి తన సౌందర్య రసైక జీవిత్వమునకు తగిన ప్రయత్నము సంకల్పించి, నాయకుని సహా, కవి స్వయముగా తయారుచేసి చూపుతాడు. సర్వాభినయమూ కుదిరికతో నెఱపుకొంటూ.

'నా సఖీ' నా సఖీ,
నే సైపగా లేను,

అని ఆ కావ్యవల్లభమైన ఉద్వేగప్రకటనములో రసప్రౌఢికి, నాయకతానిరూఢికి తృప్తిపడి, దూరముగా రంగముమీద మసలి మరలిపోతాడు. షెల్లీకవివంటి రచన, అవస్థపరిణతి విశేషాలను మెఱపించి వేసేది, ఈ 'చెప్పడము' మాత్రముతో సాదృశ్యపుటాభాసము మాత్రమే చూపుతుంది. ప్రవృత్తే, సంకల్పమే రసానికి, కావ్యకజ్ఞప్తికి ప్రధానమైన ద్రవ్యము కనుక, అధీరతయే, ఉద్వేగమే కవితకు తొలియోగ్యత అని మెచ్చేవారు. ఆ స్థానము భావుకతకు, సూక్ష్మార్థదర్శితకు చెందినదని గమనించనివారు అవిధీరతలో హృదయ విస్తృతిలో పరిపుష్ట తన్నది వారికి మఱీ మరుగు. మఱి ధీరులైన మహాత్ములంతా కవిగ్రామణులేనా అని కసరవచ్చే రసికులు "మౌనమే కళ" అన్నసూక్తిని ఎంతదూరము తరుమగలరో! టాగూరివారి పిచ్చి, కవితకు పరమావధి 'పురుషుడు' అన్నది, ఆయన నంచిలోకే గెంటవలెను కాబోలు! అవస్థ పాడుకోవడమే కవిత అని ఏదిగువలకో పోయి పాడుకుంటే అభిరుచి పుచ్చుక తరుముతావు. ఇది మొదలు ఉపజ్ఞపదనులో సాగుతుంది కవిత ప్రశస్తి. అనబడే వరద కవిత్వాల ప్రశస్తిసహా ఈ భావుకతలో జీవము దాచుకొంటుంది.

ఎల్లలలోనహా 'సౌందర్యము' చూరులు కొనజూచే ఈ కవి, తన సౌందర్య రసైకజీవిత్వము నొక భోగవేదికపై నిలుపుకుంటున్నాడు.

కనుకనే తరుచు విషాదము విషాద హృదయము నుండి తరుముకొని రాక, దానిని ఒక పూనికగల చెయ్యి కౌతుకముతో సంతనగా దిద్దుతుంది. ఆ చెయ్యి తనదనే కాక, ఆ విషాది తానే అని కవి హక్కు ప్రకటిస్తాడు. పోనీ, విషాదమూ కవిదే, చెయ్యీ కవిదే; కాని కవీ, చెయ్యీ విషాదమూ వారు కాకపోతూ ఉంటారు.

రసభావానుభవాదికమునందుకంటె శిల్పమునందు ఈ రచనాదీక్షితుని విహారము ఎక్కువ చేతనాన్వితమై విలసిల్లింది. కాని ఆసామగ్రీసంపాదన క్రమములో 'కవి'త్వమును, 'నాయక'త్వమును మీఱిన శిల్పి అవతరిస్తాడు. చిత్రము తెరపులలో కూడా గీసిన ఆ గీతలు విశ్వజవనిక మీద నిలువవలసిన చిత్రముతో సామరస్య సంవాదిత్వాలు నిలుపుకున్నవి కావు. ఒక కొన్ని వస్తువుల

యెడలా, పదాలయెడలా కవి అవ్యాజమైన మక్కువ అలవరించుకొన్నాడు. ఆ మక్కువ ఈ సౌందర్యరసైకజీవి విప్లవ శీలమును ఊతగాగొని స్వైరసంచారము నెఱపుకొంటుంది. దీనికి మొట్టమొదటి పుటలోని అంకితపు పాటయే ఉదాహరణ మిస్తుంది. అందు తుదిభాగ మిది :

'ఈ యశ్రుఝరులతో
ఇరులతో, రొదలతో
పొదలతో, ఈ హాస
మృదువాసనలతో
వినముతో, సిగ్గుతో
కొసరు తేనియలతో

ఈ పాటబ్రతుకు నీ కేపాటిదోయి, నా

నెచ్చెలీ!
నెచ్చెలీ!'

ఇక్కడ మృదుల వాసనలు, కొసరు తేనియలు ఆ తక్కిన భావపు మెలపులతో (ఆరొదలతో) కలియక, ఈ పాట బ్రతుకు నీ కేపాటిదోయి' అన్న వినయ వాణి సౌందర్యాన్ని భంగపఱచక మానవు, తాము స్వయముగా సౌందర్యముకలవై. ఆ పాటబ్రతుకులో అవీ ఉన్నవి కాబట్టి కవి చూపినాడు అను; కాని అవి వినయ పరముగా వంచబడలేదన్నది మిగిలేఉంది. ఉన్నగుణాలు ఏకరువుపెట్టడము అనుచితమా అని సమర్థించబోతే, శిల్పానికి అంత తాత్పర్యము వహించిన ఈ కవి ప్రయత్నమందలి ఆశయమే అప్రాకృత మవుతుంది. అది కవిని రక్షింపబోయి మఱీ హింసించినట్టు. ఆ శిల్పతత్పరత మరుగుపడడానికి అ పరిచితములైన పదాలయూ, వస్తువులయూ, మెత్తదనము, అందమువంటి సున్నితమైన గుణాలు బాధ్యములు. స్పర్శకు మెత్తని పదమైతే ఈ రంగములో ప్రవేశము పొందడానికి గొప్ప యోగ్యతగల పుట్టువు పుట్టినదన్నమాట, కాని చిత్ర మేమిటంటే, ఆ మృదు పదాలన్నీ కలిసి, మళ్ళీ, అర్థపరముగానే కాక వృత్తిపరముగా కూడా మార్దవ భంగమే చేయ పాల్పడుతాయి. రీతిసౌష్ఠవములు చూపిన తావులు 'చెవి'కి నిదర్శనములై, ఈ కవి కొక పదవి సంపాదించిపెట్టనే పెట్టుతున్నవి. (అక్కడ ఆవేశము పదనుపెట్టింది!) కాని అది కవికి కూడా తెలిసిన గుణమైపోయింది!—

ఇక భావప్లుతీ ఆవరింపుల వెలికంటా చేయి చాపి గూళ్ళు కొట్టబడినవి. ఇట్లు ఒక పరాధీనతయే, స్వయముగా రసప్లుతిలో ఉద్గమించగల భావవ్యక్తిని నిరోధించి మఱుగుపఱిచే వస్తుశిల్ప పదశిల్పాలకు మూలమవుతూ ఉంది. లావణ్యతరళమైన పొరలో బూరటిల్లి కాంతి చిమ్ముకోవలసిన భావము శిల్పము మడతలలో చిలపలుగా కప్పువడి తన సమర్థత విసరుకోలేకపోతూ ఉంది. ఉన్న రెక్కలు తడుపుకుని కూర్చుని, 'నే నెట్లు పక్షినౌదు?' అంటుంది, కవితోపాటు.

'కలుగునా నాకు నీ వియోగమ్ము సకియ?
వాలు నీకనురెప్పల జాలిచూపు
లల్ల దిగజారి దిగజారి, అమరనాథ
కంఠమాలాసుమదళాలు గాగ, గగన
వాహినీ నీరజాళినీ పక్ష నీల
నాట్యములుగ, తారాతోరణములు గాగ,
నింగి నీడల మెట్లుగా, నీలిమొయిలు
జిలుగువిరుపులుగా, పులుగులుగ, నలరు
లుగ, నలలుగా, కలలుగాగ, సోగయచో ని
విసివికోని వింతవలపు వేడివేడి
తొందరల పలువుర నెంత తూలి తూలి,
ఎంత దిగజారి దిగజారి, ఎంత వెదకి
వెదకి పడినవో, పెంధూళి గదలలేక
వెలుగు లేక యెగురలేని వీని కనులె
శిలలు గాక; వదలని కౌగిలి బెనంగ
బెదరుగాక లజ్జాగాఢవేదాగ్ని!
వదలునా యెట నెదురేగి వెదకు వలపు!
కలుగునా నాకు నీవియోగమ్ము, సకియ!'

ఇట్టిచో బాహ్యస్పర్శి శిల్పపరికరముల నాశ్రయించి కవి విశ్వహృదయము నంట జూస్తే' అవి భావజవనత లేనివై కవిని మోసికొని నిలబడుతాయి. ఇక్కడ కుప్ప పోసిన సామగ్రి భావపరిపాకమునకు గాను పాకము పడవలెనంటే, ఒక సహజ ప్రతిభకో, అది వినియుక్తము కాగల యోగనిష్ఠకో తృషితమవుతుంది. (ఇక్కడ Synthesis అనే ఆంగపదము మంచి మాష్టరు.) ధ్వని స్వామి టాగూరు మహాకవి.

'...and her eyes that smile from the blue sky drank their light from me'

అని స్వల్పములో అతిసున్నితముగా పలికించుకుంటాడు. ఈలాటి భావమే. ధ్వని కోసము గోపనమునకు పూనబడక భావము అంతరాంతముల వర్ణితమే కాప్రయత్నిస్తూండగా, తీక్ష్ణముగా తగలవలసిన భావము వెంబగా మాత్రము తగిలి నిలిచి, వస్తుతలము సోకినంతగా భావతలము సోకక, 'ఈ కవి భావపరుడు అనే కంటే వస్తుపరుడు అనదగదా, అనే అనుమానము, తనవంక తాను, తెరతెరగా దొంతర పెటుతుంది.

ఇట్లు భావుకతవలని పరిణామములను భోగించవలెనని, ప్రదర్శించవలెనని వెన్నంటిన ఆసక్తి ఒక కృతకతకు పరిణతమై, సహజతపట్ల రేపిన సంగ్రామము ఒక్క కావ్యముతో కాదు, ఒక్కపదము వాడుకలో సహానైజగుణమువలె ఉపస్థిత మైన సందర్భములు కావలెనంటే ప్రసన్నమవుతాయి. 'కృష్ణపక్షము'లోని అపరిణతములైన సహజకోమలగతులు కొన్ని యిందు సమగ్రతవంకకు తిరిగి, షెల్లీకవి గాంధర్వము, కీట్సుకవి పాకము చూపినవయ్యూ, తరుచు స్విన్‌బర్న్‌కవి కృతకతలోని కంటా వడిపోతూవచ్చాయి. స్విన్‌బర్న్‌కవి అనుభవాలు అతని కవితాప్రారంభమునాటికి ఆవేశపు వేడి అణిగి అతని మనస్సులో ఆభిముఖ్యములు మాత్రము కట్టుకోవడముచేత, అతని రచనాప్రయత్నము శిల్పములో తీంద్రించి పదును వారింది. కృష్ణశాస్త్రిగారు తన అనుభవము స్వయముగా ప్రసవించే ఆవేశము కంటే ఎక్కువ పిండుకొనేటందుకు చేసిన ప్రయత్నము ఆకృతకతలో తన పాలున్నదని పలుకవస్తుంది. మరికొన్ని గుణములు చేరితేనే కాదు, ఉన్నవి కొన్ని లేకపోతే యీ కవిత ప్రశస్తతరముగా విలసిల్లేది.

అవిమృష్టమైన సహజోద్గమము ఉత్తమనీచధోరణులు రెంటికీ ప్రభవమైతే, ఇట ప్రయత్నముతోడి చేసేత జయావహతను, జయభంగమును కూడా ఈనుతుంది. అందు, కవి చిత్తరహస్యతత్వమును మాటువెట్టుతూ, దాని నొకవేళ మూలతః మార్చనేకల ప్రాభవము నేమో మోషపెట్టే కృతకత ప్రచారములో, తొలుత జయభ్రంశము తన పరామర్శము పాలు పొందవస్తుంది.

కాని భావప్లుతికి, రచనాసక్తికి ఒక సంగ్రామమే కాక ఒక సంశ్లేషము అతుకువడి, కళాచాతుర్యమును గణిస్తూ ఉంది.

విభావ సామగ్రిని, రంగమును, వర్ణించుకొనేటందుకు సహా మనస్సు చాచుకొనే 'హృదయేశ్వరి' నుండి, అణువులో నిలిపితే సృష్టి ఉబికించుకునే 'ఫలశ్రుతి'కి గీసిన గీతమీద 'ప్రవాసము; ఊర్వశి' తాకుతుంది. కాని ఆ గీతపైనే కట్టుపడి ఉండదు. ఇందు 'హృదయేశ్వరి' చిత్తశుద్ధి, హృదయవ్యక్తి సహజముగా, విస్ఫుటముగా కానరాకపోతే, అందులకంటే అదనమై భావముకోనల వెలుతురుపెట్టే ప్రయత్నము సహజము. 'ఫలశ్రుతి' యందలి పరిపక్వమైన ధోరణి యిందు కొన్ని యెడల మాత్రమే సుఖంకరమైన భావాలలో వ్యక్తమైతే, అట్టిది లేని మేరలుకూడా, తపనస్థానములో భావనావిలాసము, శిల్పసౌందర్యవికాసము నిలిచి, మనోరంజకత నిర్వహించుకున్నవి.

ఈ విధికి అంతకూ కళ్ళేము పట్టిన కారణము కవి తననుగురించి యిచ్చిన తథ్యమైన వర్ణనలో దొరకుతుంది.

(The poet's eye in a fine frenzy rolling Doth glance heaven to earth, from earth to heaven......

అన్నట్లు). ఆత డున్మత్త భావశాలి,

ఆగికోలేడు రేగునూహల నొకింత !

ఎట్టి నిశినే నదరిపోవు నెగసిపడును !

... ... ... ...

ఇంత చిరుగీతి యెద వేగిరించునేని

పాడుకొనును, తాండవనృత్య మాడుకొనును:

మస్తక మ్మొరగా వంచి మన్ను మిన్ను

వేయికే లాడగా వ్రాసివేసికొనును !

. ... ... అతండు

పాటపదములకై నిత్యపథికు డయ్యె—'

ఈ యెగసి పడడము మనకు తరుచు వినబడుతుంది. ఇది కవి ప్రవృత్తిని గురించిన ఒక పెద్ద సత్యము.

'ఈ వియోగ నిరాశా క్ష

ణ క్షణ ప్రతీక్ష చెదరి

ఎగసి ఎగసి పగిలి పోదునో !'

అని ప్రేయసికోసమే కాక, పాటకోసము కూడా అంతవ్యగ్రత వహిస్తాడు.

ఈ కవితోడి ఆనుషంగిక పరిశీలనమునకు ముచ్చట కూర్చే కళాశాలి నాయని సుబ్బారావుగారికి

' ........ పద్యమ్ము ప్రేమ పొంగించుకొన్న
నానవానందవాహివిలోని నలును.
' .......... ఆనందపరమార్థ మేలుచున్న
నాదు హృదయాంతరాళమ్మునన్ ధ్వనించు
అసలు పద్యమ్ము వచ్చిన దని సతమ్ము.'

ఇంచుకలో ఈతని 'వ్యాపకత' నుండి 'అవిచ్ఛిన్నత'కు భేదము కట్టుకున్న కృష్ణశాస్త్రిగారు, పాట పదములకై నిత్యపథికుడు కాబట్టి, అతని కళాప్రయోగము కవి నుండి పాట వరకుకంటె, పాట నుండి కవి వరకూ ప్రసరించింది. కనుకనే ఆతనిపాట వివిధవిభ్రమాలలో పల్లవించి,

'ప్రతిపదమ్మున శీతలస్వాదుమధుతు
షారముల పార్శ్వముల విరజల్లు చేగు,

అన్న స్వీయచరిత్ర తుదివాక్యము వట్టిమాట కాని మధురావకాశాలు పుష్పించింది.

'వినరా వీ విభావరీ
వేలాశాలల నీమృదు
వనాంచలముల గుసగుసలో,
మసలు చరణమంజీరము
కొసరు జాలిపలుకరింతలో!

ఈ కుటీర ముఖద్వార
మిందే ప్రేలాడి సగము
వాడి, విరహతోరణమ్ము నై
వలవంత సడలి నేల జీ
రాడి యెన్నినాళ్ళు మనుదునో!'

నీమనోజ్ఞ కాంచనకాం
చీమణి ఘంటాగళములు
ఏకాంతము కరగ మ్రోయగా

విన నరచే బ్రతుకు దాల్చి
యెడద మ్రోత కెంత యేడ్తునో !'

ఇట్టి పంక్తులు కవి సహజకళావికాసమును, శిల్పప్రయోగసామర్థ్యమును నిరూపిస్తూన్నవి.

'The glistening bells of her anklets rang in my blood, and her misty viel fluttered in my breath,'

అన్న టాగూరు మధురభావము వేరొక గొంతుకలో ఇక్కడ వినబడుతూంది. ఈ కవి గొంతులో ఒక ప్రాపంచికమైన జీర తప్పనిది; ఎంత ఆత్మపరమైన భావము తెచ్చినా, ఈ గొంతులో పడి అది నీ ఇంద్రియముల మీదుగానే పయనిస్తుంది. కనుకనే ఒక్కొకచో అంతటి సౌఖ్యము కూడా ఇస్తుంది. బాగున్నదను, బాగులేదను, కాని ఈతని పాట నీకు గ్రుద్దినట్లు తగులుతుంది: అది నీవు లఘువుగా తొలగద్రోసికోలేవు; కనుకనే అంత విసుగైనా పొందు కాని.

టాగూరు కవి ఆకసముగుండా, ధ్వని జగత్తును మేలుకొలుపుతూ, మన 'గుండె నెత్తురుల'లో నుంచి ఆత్మలో విసరే భావగీతిక ఈతని జీర గొంతులో నగిషీలుపడి ఎట్టి పరిణామము పొందుతుందో ఒక్క ఉదాహరణము బాగా తెలుపుతుంది.

Do not go, my love, without asking my leave.

I have watched all night, and now my eyes are heavy with sleep,

I fear lest I lose you when I am sleeping,

Do not go, my love, without asking my leave.

I start up and stretch my hands to touch you,

I ask my self, "Is it a dream?"

Could I but entagle your feet with my heart and hold them fast to my breast,

Do not go, my love, without asking my leave.

—Tagore

'ఏను నిద్దురవోదునో, యేమొ, కరుణ
సెలవు గైకొన కేగగా వలదు; ఇన్ని
నాళ్ళ యెడలేని యెడబాటు నా నిరీక్ష
ణమ్ము బరువులు బరువులై నయనయుగళ
మయ్యె, దిగలాగు నిద్దుర మరపులకును.
ప్రియతమా, యిక నిదురింతు పిలువబోకె
బాసిపోకు నిర్భాగ్యపు బ్రతుకు దాటి!
ప్రియతమా, పొరలి పొరలి మొయిళు లేవొ
మేలుకొన నీవు రెప్పల వాలి యదిమి!
ఎటు లెగసి యెగసి పడుదు! ఎటుల బేల
కేల నిన్నంటి యదిమికో తూలిపోదు!
అబ్బ! నా బ్రతుకంట, నీయడుగుదోయి
నాప, ప్రియతమ శృంఖలమ్మై పెనంగ,
దిక్కుమాలిన యెదద బంధింపలేను!
ప్రియతమా, నిను వదలికోలేను, నిదుర
కదలియై కాటుకై కనుగవ నడంచు!
ప్రియతమా, వీడి పోకోయి, వీడలేని
నామమత చిచ్చు కునుకునా, నన్నుబోలి.'

టాగూరు కవికావ్యములలో తా నొక కొంత భావాలోకమునకు చిహ్నమై నిలువవచ్చే "లిప్స" ఇక్కడ 'ఎగసి యెగసి పడు'తుంది.

లిప్స ఉపస్థితికే విమర్శకులు కొందఱు శాపోకవయిత్రిని గర్హించారట, అట కళాప్రకాశనము సాధ్యమనేదియే మతి. కనుకనే—

కావి ఆమెయందు లిప్స కళయై విహరించింది;

'నాడు శాపో విరహకంఠనాళవేణు
వాలపించిన యరుణారుణాంధగీతి
యేడ్పు, నిట్టూర్పు, కోపించు నిపుడు, సంధ్య
యటుల, కాలవిశాలవిహాయసమున.'

ఆగీతిని ఇంత ప్రత్యక్షముగా, హృదయంగమముగా. వర్ణించుకోగల ప్రవృత్తి సాదృశ్యము శాపోతో పొందగలవాడు ఈ కవి.

లిప్స, ఆత్మ రంగరించి కవితావేశము క్రోవులు పట్టిన బ్రౌనింగుసతి మనో జీవనము ఎట్టిదో, ఒక్క భావము మనకు చూపుతుంది. అది భారతాంతఃకరణకు చుట్టమైనదై, ఆ అంతఃకరణను సాకుకొనే తెలుగుకవి వేదుల సత్యనారాయణ శాస్త్రిగారి మృదూక్తిని చక్కగా నిరూపిత మయింది.

'ఈ నవవేణుదండ మిటు
లేటికి చెక్కెద వేల చిల్లులై
పో నొగిలించెదం చడలి
పోయితి; రిత్తపు టూర్పుగాడ్పులన్
గానముగాగ మార్చుటక
కా యని యిప్పుడు నే గ్రహించితిన్
.... .... .... '

మత సిద్ధాంతాలు ఫలించడానికి ఏది ఆద్యప్రవృత్తమో అదే-బ్రతుకుతో ఆత్మపడసిన అనుభవ కథయే, -కవితలో మూలద్రవ్యము కావున, లిప్స, స్వాను భవము ఆత్మవికాస సాధనముగా కవితావేశములో సంతరించుకోగలిగారు, ఇట్టి కొందరు కవులు. ఈ సిద్ధులలో షెల్లీ కవినికూడా ఉన్నతపదవులలో చెపుతారు. అతని 'ఎపిసైకిడియన్' అనే కావ్యముకంటె లిప్సాత్మకమైనవి యెన్నో ఉండవు. దాని ప్రోద్బలము 'ఊర్వశి'లో రక్తమై ప్రవహించి, కృష్ణశాస్త్రిగారి వ్యక్తిత్వముతో తెలుగుభాష కొక విలువైన క్రొత్తకావ్యము ప్రసాదించింది. షెల్లీకవి ప్రోద్బలము నకు ఈ కవిని లోలుపుని గావించిన లిప్సాగుణము ఈ కవి రచనను చైతన్యమై నడపింది. ఇందువలన, షెల్లీనివలె ఈ కవిని తత్వమూర్ధవమునకు విసరకపోయినా, ఈతని భావనమున రచనమున ఒక తీక్ష్ణత యేర్పడింది.

'స్థాణు వయ్యెనో పాషాణ జడభరమ్ము
గనెనో, కదలదు మెదలదు కంఠరవము,
నే డిదేమో క్షమాజననీ పురాణ
గర్భకుహరమ్ము విదలించి కారుచిచ్చు
పెరుపు మంటమూలం గేదొ యేదొ ప్రాకె,
ఇపుడు ప్రళయమే ............ '

భావములకు, వేదనలకు ఇట్టి మూర్తనిరూపణ మిచ్చే చక్కని కళా ప్రసారము ఈ చైతన్యమునే చించిస్తూ ఉంది. ఇట పాటవము మూరిసిపడే విశ్వనాథ సత్యనారాయణగారి పోకడ పోలిక చూపుతుంది.

'ఇది నీకై యిడినట్టి నాయుపద; ము
న్నేనాడో ఘూపోగ్రముల్
పదనై ఆంధ్రవిరోధి కంఠదళన
ప్రారంభసంరంభ మే
చుదినాలన్ మఱి తోడి సైనికులమై
చూఱాడు ప్రేమంబులో
నిది లేశం బనియైన చెప్పుటకు లే
వే నాటి స్వాతంత్ర్యముల్.'

సహజోద్గమమున గొంతు విచ్చినాడంటే సత్యనారాయణగారు పేలవమైన పోకడ పడినా నిరోధించుకోడు. కాని, క్షణములో వాయువేగాన మింటి కెగసి శక్తిగుళికలు విసరివేస్తాడు, అదే గొంతులో కృష్ణశాస్త్రిగారు ముక్తకంఠముతో పలికేది తక్కువ. ఆయన సంస్కృతి నెఱపుతూ నెఱపుతూ పటుత్వము వెలయించిన తావున వారిరువురి కలయిక ఇరుముఖాల త్రోవ చూపుతుంది. సత్యనారాయణగారు ఎక్కువ చెపుతాడు; కాని యెక్కువ చెప్పవలసి చెపుతాడు. కృష్ణశాస్త్రిగారి మాటలు అర్థమును మిగిలి కూడా ఒక సౌందర్య ప్రబంధములో వినబడుతాయి. కాని, చెప్పవలసినది ఆవిష్టమై చెప్పిన సందర్భాలు కవి ఆంతరిక మహత్త్వమును ఎలుగెత్తి చాటుతవి.

'ప్రవాసము'లో రచన కడు దిద్దుబాటుగా నడిచింది. కావ్యవస్తువు క్రమ వికాసము కాంచుతూ తగిన శిల్పము నాకర్షించుకుంటూ వచ్చింది.

'రేయి కడుపున చీకటి చాయవోలె,
తమపు టెడద దివాంధగీతము విధాన,
ఘూకరావాన వలవంత కేకరీతి
నావిషాదమ్ములో దాగినాడ నేనె!'

కవి ఒక్కభావము నెంత శ్రద్ధమై తడవుకొన్నాడో అంతశ్రద్ధమై దానిని గీసికొంటూ, తన ఆదర్శమైన షెల్లీకంటె ఒక్కడుగు ముందిడినాడు, అలంకార రచనలో

'ఏను మరణించుచున్నాను; ఇటు నశించు
నాకొరకు చెమ్మగిల నయనమ్ము లేదు;
పసిడివేకువ పెండ్లిండ్ల బడిన యెవరు
కరగనేర్తురు జరఠాంధకార మృతికి ?

నామరణశయ్య పరచుకొన్నాను నేనె !
నేనె నాకు వీడ్కోలుపు విన్పించినాను !
నేనె నాపయి వాలినా, నేనె జాలి
నెద నెద గదించినాను, రోదించినాను !

బ్రతికియున్న మృత్యువునై ప్రవాసతిమిర
నీరవసమాధి గ్రుళ్ళి క్రుంగినపుడేని
నిను పిలిచినాన, నామూల్గునీడ ముసిరి
కుములునేమొ నీగానోత్సవముల ననుచు ?

ఇదియే నాచితి, పేర్చితి నేనె దీని,
వదలిపోని నా యవసానవాంఛ గాగ;
వడకని కరాలు రగులుచు దుడుకు చిచ్చు
లాలనల నింత మసి గాగ కాలు త్రుటినె !

అలయు వాతెర యూర్పు గాలులు కదల్చి
రేపు నంతె నా కాష్ఠాల రేగుమంట
మును బ్రతుకునట్ల నాదేహమును దహింపు !
పడదులే ఆర్పగా నొక బాష్పమేని !'

ఈ కావ్యములో (భావగతి బైరను కవివల్ల పుడికి పుచ్చుకోబడ్డదై) రీతి— 'పద్ధతి'— ఎంత కుదిరికతో ఈ చేతి నాశ్రయించుచుతుందో వ్యక్తమవుతూంది. అవస్థాంతరములో ఇదే తలమున కానవచ్చే కావ్యములు.

'ఆమె కన్నులలో అనంతాంబరంపు
నీలి నీడలు కలవు ................ '

ఈ మొదలయినవి (విలాసచ్ఛాయలు ఒత్తిగించి) కవి ఈ రచనా ఫక్కికి నిదర్శనాలు. పద్ధతికంటె ప్రాముఖ్యము దట్టించుకొని 'ఊర్వశి'లో భావనావిలాసము తలుచై ప్రాకింది.

'కాలమే పసిపాప
కనువిచ్చిన యుషస్సు
కలగా కలవరించి
వెలుగుగా పులకించి
ఇరులకడు పొరసి నే
తెరచి వాలిననాడె
మిసిమి వన్నెల మేన
మసి జాలిగా నయ్యె...
తొలివియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆ నాటి కీ నాటి కేను నీ దాననే!
... ... ... ...
వేయి వేలు యుగాలు
రేయినై పవలునై
అడరి కురిసిన యేడ్పు
అలరి విరిసిన నవ్వు
బరువు కానుకగ, మన
భాగ్యబంధమ్ముగా
చేర్చికొని నాలోన
కూర్చితిని నీ కొరకె!
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
ఆనాటి కీనాటి కేను నీదాననే!'

ఈ ఊర్వశి పాటలో ఈ భావనావిలాసము పరిణతి విశేషమున కానవస్తుంది. అర్థావబోధము దూరమయిన రచనానదులుకూడా కొంత ఈ గుణము త్రొక్కించినవే.

లిప్స, విలాసము, శిల్పము, — ఇవి యీ కవి కళాధోరణిలోని ప్రధాన ద్రవ్యము లనవచ్చు.

'మూతవడనే లేని
ముక్కోటి దేవతల

కనుతారకలు కోర
కములై సుమము లయ్యె;
ఒసరిలి యొండొరుల
నొరసికొని విరుగబడి
దిశ లంట చీకటులు
నిశయే దివస మయ్యె!

ఇట్టి యెడల ఆ గుణములు, పాళ్ళు మార్చుకొంటూ పాకము చూపినవి. పాఠకుని హృదయములో నిజమైన సహానుభూతి కదుపుకొంటున్నవి. చిత్తశుద్ధితో వెల్లివిరిసిన కావ్యార్థము స్వయముగా తనకు రమ్యమైన ఉపాధిని వ్రాసికొని వచ్చింది. కనుకనే 'అలంకారము' అర్థాత్మకతలో ఒక పటిష్ఠత, సమగ్రత తెగిపడింది. కవి తానున్నూ ఇంపైన ఛందస్సులు కల్పించుకొని, ఆవేశము భావమునకు ప్రసాదించే సంగీతమునకు తగిన లయ కూర్చుకోవడములో అప్రమత్తుడై ప్రవర్తించినాడు.

భావకవిత్వమును (గేయముగా) పాడుకొనే అవకాశమును తెలుగుభాషలో పెంపుచేసినవాడు కృష్ణశాస్త్రిగారు. గురజాడ అప్పారావు, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, చిలుకూరి నారాయణరావు, ప్రభృతులకు గతానుగతికుడు గాక స్వతంత్రమైన 'పాటపదము' ప్రచలితమూ, ముద్రితమూ చేసికొంటున్నాడు. లైర్ అనే జంత్రముమీద పాడుకోదగిన పాట ఒరవడిని వెలసిన కవితాఫక్కి నేటి పరిణతికి న్యాయ్యముగా తెలుగునుడియందు 'భావకవిత్వము' అనబరగినప్పటికీ, దాని గేయరసాత్మకత వివృతము చేయబడుతుంది ఇట్టి కవులయందు.

గేయచ్ఛందములలోనే కృష్ణశాస్త్రిగారి చేయి నేర్పు తిరిగింది. ఇచ్చటి లయనడక సాధారణచ్ఛందోఽనుసరణమున కూడా ఈయనచేత అనిరుద్ధగతులు అవలంబించింది. అనగా ఛందోభంగములు, యతిభంగములు మొదలైనవి సహా ఏదో ఒక లయకు సంతుష్టితో తావు విడిచి నిలువగలవు—కృష్ణపక్షమునందలి,

'ఏడ్వలేక యేడ్వలేక యేడ్చుచుంటి'

ఇట్లే:

మింట వెలుగు చుక్కగన్న మిణుగురన్న'—

వట్టివాని వియమోల్లంఘనము భావము చాయాలేపనమునకు తోడుపడేవిగా ఉంది కవి 'చేతి'నే చూపుతవి.

ఈయన పాట క్రొత్తదనము భావగతిపరముగా కూడా అన్వయిస్తుంది. 'బ్రహ్మసమాజ ప్రార్థన గీతాలు' అనుషంగపరచి పరిశీలించినపుడు, ఈతని ప్రణయ గాథలకు చెందిన గీతాలలో,—

'కలువపూ బ్రతుకులో
కనుమోడ్పు వెన్నెలే
కాలానలం బైన
గతి యేమీ? ...... '

ఇట్లు తత్వాలు పాడే ఒక తాటస్థ్యము కవి అనుభవాన్ని పరామర్శిస్తూ మన స్థితి పరిణతి సూత్రమును సులభముగా దొరకించుతూంది.

కవి తన అనుభవము ధోరణిలోనే, ఆ గుణములతోనే, భక్తి మార్గానకు త్రొక్కుక పోతాడు; ఈ తాటస్థ్యమున్నూ ఒక కనువిప్పు కాని నిర్వేదము రాపిడి కాదు. కనుకనే ఎన్ని జన్మ లేద్వవలసి ఉన్నా, ఆ జన్మలు కావలె నని వరించగలడు. ఈ కవి. 'మనసు భోగపరిత్యాగమునకు లాగదు, అన్నది, జీవితాశాపరముగా అన్వయించి, ఈతని మెడలో వేయదగును. 'మూడు లోకాల బరువులమోత నడగి యడగి చిదికిన అంధజడము తాను,'

'ఆటతో పాటతో నేర్చినట్లు దేవ
ఏను కూడ నీవలె నటియింపనిమ్మ,
ఎడతెగని యాత్ర నెట్లొ సాగించువరకు!
ఎట్లొ నీదర్శనమ్ము సాధించువరకు!'

అని పల్లవించిన కోకిలగీతము వాస్తవికముగా ఫలించే స్వప్నమునకు తృషిత మవుతుంది.

శిశువువలె, ఋషివలె తనలో సృష్టితత్త్వములు ఆకళించుకొనకపోతే, వృద్ధునివలె, పండితునివలె అనుభవమును అధిగమించి ఈ సిద్ధికి కవి ప్రవృత్తుడు కాగలడు అని ఈ కావ్యమాల ఆలపిస్తూంది. 'ప్రవాసము; ఊర్వశి' 'జీవితరహస్య మార్గమ్ము'లు తెలిచి కవి హృదయము బిగ్గగొంతుకతో "పాటపాడించి" నట్టివి!

-కొంపెల్ల జనార్దనరావు*

* వైశాఖి. అంగిరస 1932.

# కథానిక : దానిపరిణామము

కథలంటే చిన్నవాళ్ళు చెవి కోసుకుంటారు. పెద్దవాళ్ళకు కూడా ప్రీతి. అనగనగా ఒక రాజు అనో, పేదరాసి పెద్దమ్మ అనో ఈగ అనో ప్రారంభించి, కడకు కథ కంచికి వెళ్ళింది అని మనము బాల్యములో బహుపర్యాయములు ఆనందముతో ఆలకించాము. పూర్వము కాంచీనగరము కళలన్నింటికి ఆటపట్టు అవడముచేత, అక్కడ అంగీకారము పడితే కథ గట్టు ఎక్కిందన్నమాట. వినోదార్థము గాని, విజ్ఞానాభివృద్ధికిగాని, పరిహాసపరిణతికి గాని, భావనాశక్తి ప్రకోపనకు గాని, ప్రపంచవృత్తము ప్రకటించడానికిగాని, పరమార్థచింతకుగాని కథావర్ణన కర్తవ్యమే. కథలో గంభీర విషయము ఎటువంటిదయినా కరతలామలకము కావచ్చు. ప్రాచీనపద్ధతిలో కథాజాలము కావలసినంత ఉన్నది. అది నోటి మీదుగా విశేషము చలామణి అయ్యేది. విద్వాంసులకు వినడానికి అభ్యంతరము అట్టే లేదు గాని, కాగితము మీదికి వచ్చేసరికి కథను ఖాతరుచేసేవారు కారు. ఏదయినా వృద్ధిలోకి రావలెనంటే ఆదరము అవసరము. పద్యరూపములో ఉన్న కథలకు ప్రాభవము ఉన్నది. గద్యములో ఉన్నవాటికి గౌరవము తక్కువ. గౌరవము లేకపోయినా ఉత్సాహవంతులు ఊరుకోలేక గద్యలోనే కథలు అల్లినారు. అయితే కావ్యభాషలాంటి వచనములోనే రచన సాగింది.

అన్యసాహిత్యముతో సన్నికర్షగాని, సంఘర్షణగాని సంఘటిల్లితేనేగాని దేశీయ సాహిత్యాలకు తెలివి హెచ్చదు. ఆంగ్ల సాహిత్యంవల్ల ఆంధ్రసాహిత్యానికి అఖండమైన మెళకువ వచ్చింది. గతశతాబ్దిలోనే కథారచనకు యత్నాలు యత్కించిత్ జరిగినవి. ఈ శతాబ్దిలో హెచ్చిపోయినవి.

కథకు కావ్యభాషవల్ల జీవకళ చెదిరిపోతుంది. వాడుకభాష వాడుతేనే వర్చస్సు. భావుకులు భాషాచర్చ చేసి వ్యావహారికభాషనే వన్నెతేవలెనని ప్రయత్నముచేసేటప్పటికి ప్రళయము పుట్టింది ! గ్రాంథికవాదులు కత్తులు నూరినారు. ఇప్పటికీ ఆ ఆందోళన అణిగిపోలేదు.

హిందీ భాషలో ఆధునిక కథ పుట్టిన రోజులలోనే ఆంధ్రములో కూడా కథ అవతరించింది. గురజాడ అప్పారావు పంతులుగారు వాడుక భాషలో చెప్పిన

"దిద్దుబాటు" అనే కథవల్ల తెలుగులో వెలుగు బయలుదేరింది, అనుకున్నాము. ౧౯౧౨ సంవత్సర ప్రాంతాలలో "ఆంధ్రభారతి" ౧౯౧౪ లో "త్రిలింగ" మాసపత్రిక, "సువర్ణలేఖ" కథలు ప్రకటించినవి. 'మదరాసు కథలు' అనే కథా సంపుటి కూడా ఆ రోజుల్లలోనే అచ్చుపడ్డది. ౧౯౧౫ లో నేను "ఆఖ్యాయిక" అనే సచిత్రమాసపత్రిక తెనాలినుంచి ప్రకటించడానికి ప్రయత్నించాను. నా మిత్రులు కొంతమంది కథారచనకు కంకణము కట్టినారు. అనేక ఆంగ్లేయ అమెరికా మాస పత్రికలు నేను నిరంతరము చూస్తూ ఉండడము చేత అపూర్వమూ, అందమూ చేతామనుకున్నాను "ఆఖ్యాయిక"ను. శివానుగ్రహము లేకపోవడము చేత యత్నము కొనసాగలేదు.

'మురారి' కథలు అవేశీర్షికతో కథాపరంపర సంకల్పించి, ఒకటో రెండో రచించాను. అప్పటికి నేను కృతకగ్రాంథిక భాషావాదినే.భీమశంకరంగారుSherlock Holmes రీతిగా పాత్ర సృష్టించి. విశ్వనాథం అనే పేరు పెట్టి Connan Doyle. కథలు కొంతవరకు అనువదించినారు. కొంతమంది కథకులు కథాక్షేత్రము లోకి దిగినారు. కాని, సాహితీ సమితివారు గట్టిపట్టు పట్టేవరకూ కథకు కమనీయత కలుగలేదు.

సమితి కథకులు భాషాచర్చలు పరిపూర్ణంగా చేసి చివరకు శిష్టభాషలో రచనలు రమ్యంగా ఉంటవని అంగీకరించారు. ఇంచుమించుగా వారంతా వ్యావహారిక భాష వాడడము మొదలుపెట్టారు. ౧౯౧౦ సంవత్సరము స్మరణీయము. సాహితీ పత్రిక ఆరంభించింది ఆ సంవత్సరమే. అప్పటినుంచీ కథ కట్టుదిట్టాలకు లోబడి, గౌరవము సంపాదించుకో సాగింది.

ఇంగ్లీషులో Sketch, Tale, Narrative అనే సాహిత్యవిభాగాలను అన్నింటిని మన వారు నేడు స్థూలదృష్ట్యా కథ అని వ్యవహరిస్తున్నారు. అగ్నిపురాణములో ఆఖ్యానము, ఆఖ్యాయిక, ఖండకథ, పరికథ, కథానిక అనే పరిభాష ప్రస్ఫుటముగా ఉన్నది. వస్తువునుబట్టి మానుషకథ, దివ్యకథ, దివ్యమానుష కథ, అనే విభాగము కూడా విస్పష్టమే. ప్రకృతప్రసంగ విషయము Short Story. దీన్ని కథానిక అందాము.

కొన్ని కథానికలను గురించీ, కొంతమంది కథకులను గురించీ కొద్దిగా ప్రసంగిస్తాను, స్థాలీపులాక న్యాయమే శరణము.

చింతా దీక్షితులుగారు సిద్ధహస్తుడు. సూరీ, సీతీ, వెంకీ, వటీరావు, భైరవ శాస్త్రివంటి మరవడానికి వీల్లేని మంచి పాత్రలు. సృష్టించినారు. శ్యామల, చిన్న, చెంచురాజీముద్దు, శంపాలత, శరబాల, లీలాసుందరి, గోపీమోహిని, కిష్కింధలో కోతి మొదలైనవి వీరి ఉత్తమ కథానికలు. బాహ్యప్రకృతిని బాల్యచేష్టలునూ, ప్రణయంలో బాధలనూ, భక్తిని, విరక్తిని వీరు బాగా వర్ణిస్తారు. రచనలో నర్మరేఖ హేంళన నడుమ నడుమ కనబడుతూ ఉంటవి. దీక్షితులుగారు శైలి తీర్చి దిద్దినట్టు ఉంటుంది.

నోరి నరసింహశాస్త్రిగారి నిపుణత భార్యాభర్తల సరాగాలను, ప్రణయమును, ప్రణయకలహాలను వర్ణించడంలో వన్నెతేరింది. గానభోగము, గులాబిపువ్వు, శ్యామసుందరుడు, భవిష్యత్తువంటి కథానికలు కళావైభవముతో కూడినవి. సందర్భానుసారంగా సంస్కృతాంధ్రవృత్తాలను జతచేయడంవల్ల స్వారస్యం హెచ్చుతుంది. రీతిలో ఓజస్సు ఒప్పి బుద్ధిబలం పూర్తిగా కనబడుతుంది.

కొడవటిగంటి వెంకట సుబ్బయ్యగారి 'సుకుమారి' లో స్వసుఖము చూచుకునే భార్య భర్తను బహువిధాల వేధించి చివరకు బయటపడిపోతుంది. 'ప్రతిఫలము'లో యువతిని కోరిన ఉద్యోగి ఉసురులు కోల్పోతాడు. ఉవిదలో కూడా, అందులో భయానకం ప్రజ్వలిస్తుంది. "ఏప్రియల్ ఫూల్" కథలో విద్యార్థిని పట్టుకోబోయిన ప్రధానాచార్యుడే ఫూలయిపోతాడు. సుబ్బయ్యగారి వాక్కు శుచి అయింది.

మునిమాణిక్యం నరసింహారావుగారి వాణి నాజూకుగా ఉంటుంది. వీరు రకరకాల కథలు వ్రాసి కడకు 'కాంతం' అనే పాత్రను సృష్టించారు. గృహ కృత్యాలు భార్యాభర్తల కీచులాటలు, కపటభక్తులనటనలు అమాయకుల ఆమోదాలు హాస్యపూర్వకంగా వర్ణిస్తారు. వీరి "కాంతం కథలు" "నేనూ మాకాంతం", "కాంతం-కైఫీయత్" అనే కథానికా సముచ్చయాలు కమ్మగా ఉంటవి.

వివాహకథానికలు రచించడంలో వఝ్ఝు బాబూరావుగారి కలం కదం తొక్కుతుంది. "అరిసెముక్కలు", 'దాంపత్యము', 'రుక్మిణీ కల్యాణము' మొదలైనవి ముద్దుముద్దుగా ఉంటవి. ఈయన చిత్రకారుడు కావటంచేత శ్రీనివాసశిరోమణిగారు సిద్ధవాక్కు. వీరి "ద్వారద్వయం" అనే కథానిక వెలువడ్డ తరువాత పెళ్ళిళ్ళమీద

పెళ్ళిళ్ళు అయినవి. "ధర్మసంస్థాపనము" అచ్చయిన సంవత్సరానికి కలకత్తాలో ఖడ్గబహదూర్‌సింగ్ కలకత్తాలో అగర్ వాలాను హత్యచేశాడు! వీరి 'పాహిమాం', 'భార్యా రూపవతీ శత్రుః' ఏకాకీ, అనేవి ఉత్తమ శ్రేణిలోవి. గోష్ఠిలో ఈ కథ రచనలో నడుమ నడుమ నగిషీ కనబడుతుంది. కుడు కుశలి. చాటువాక్కులతో సభారంజనముచేసే శక్తి కలవాడు. కాబట్టే కథనంలోకూడా కనబడుతుంది ఆగుణం.

మొక్కపాటి నరసింహశాస్త్రిగారి రచన ముద్దుగా ఉంటుంది. పరదేశ నివాసం చేసిన ప్రౌఢుడు కాబట్టి ప్రపంచవృత్తం బాగా వుంటుంది వీరి కథానికల్లో, చిత్తరువు', 'శిల్పిద్వయం' 'లక్ష్మి' మొదలైనవి ఉదాత్తమైనవి. ఈయన కథనంలో గట్టివాడు, చింతాశీలములో చేవతేరినవాడు, హాస్యరేఖలో అందెవేసిన చెయ్యి,

అడివి బాపిరాజుగారు అనేక ప్రజ్ఞలు కలవాడు. చిత్రకారుడు కావటంచేత చెప్పినదాంట్లో వైచిత్ర్యం ఉంటుంది. పదకర్తకావటంవల్ల పలుకులో తీపి స్ఫురిస్తుంది. దివ్యమానుష కథా రచనలో ఈయన దిట్ట. 'శైలబాల', 'సంధ్యానృత్యము', 'వీణ' 'భోగీరలోయ', 'హిమాలయరశ్మి' పాంచర - ఒకటేమిటి, అన్ని కథానికలూ అందాలు చిందుతూ ఉంటవి.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పల్లెలలో బ్రాహ్మణకుటుంబాలనూ, వితంతువుల వివిధవ్యథలను విశేషరీతుల వివరించారు. వీరికి సంస్కారదృష్టి జాస్తి. ఆంధ్రాభిమానము అఖండం. శాస్త్రిగారి సంభాషణ రచన చాలా మనోహరం.

విద్వాంసులు కథకులు కాలేదన్న లోటు వేలూరి శివరామశాస్త్రిగారివల్ల తీరింది. వివిధశాస్త్ర విజ్ఞానము, విశేషప్రౌఢి, విచిత్ర విన్నివేశాలు వీరికథనములో కనిపిస్తవి. ప్రతికథానికా భావపూర్ణమై పాత్రపోషణతో భావిస్తూ ఉంటుంది.

కవికొండల వెంకట్రావుగారు గ్రామీణుల జీవితమూ, కర్మకారుల కష్టసుఖాలు, సామాన్యకుటుంబాలలో సంఘటనలు చక్కగా వర్ణిస్తారు. పదేండ్లలో వందకథలు వ్రాసినారట! పూడిపెద్ది వెంకటరమణయ్యగారు రెండువందల కథలు రచించారట!! కాఫీ పుచ్చుకుని కలం పట్టుకుంటే భోజనవేళకు పూర్తి అయ్యేదట కథానిక,

గుడిపాటి వెంకటాచలంగారి కలం కాకలు తీరినది. బాహ్యప్రకృతిని, పాపాత్ముల భావక్లిష్టతను అసతుల అంతరంగ సంక్షోభమును, పరకీయాప్రణయమును, వీరు బాగా వివరిస్తారు.

మల్లాది రామకృష్ణశాస్త్రిగారు రసికుడు. సంస్కృతప్రియుడు, వ్యుత్పన్నుడు కావడంవల్ల శైలిలో చమత్కారం ఉన్నది. రచనావిధానము రమణీయమై అనన్య సామాన్యంగా అగుపిస్తుంది. కథానికలలో కమనీయమైన కల్పితలోకము, కామినీ గోష్ఠి, కామకలాప్రావీణ్యము గాటముగా ఉంటవి. 'తాతగారు' అనే ప్రగల్భపాత్రను వీరు సృష్టించారు.

వీరి పద్ధతినే వెళ్ళుతారు కొంతవరకు వెంపటి నాగభూషణంగారు 'చిన్ని' అనే పాత్రను సృజించారు. లోకమంతా అతిలోకంగా కనబడుతుంది ఆయనరచనలో.

పురుషులలో శ్రీరాయసం వెంకటశివుడు, భావరాజు కృష్ణరావు, బుర్రా సుబ్రహ్మణ్యము, కొడవటిగంటి కుటుంబరావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, మొదలి సత్యనారాయణశర్మ, కాణూరి రామారావు, 'కరుణకుమార' గిరి, ప్రతాపరెడ్డి, జానకీరాం, బొడ్డు బాపిరాజు, అత్తిలి సూర్యనారాయణమూర్తి, తాతా కృష్ణమూర్తి, తీర్థులు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, కుమార రాఘవశాస్త్రి, ప్రభృతులూ, స్త్రీలలో శ్రీ కనుపర్తి వరలక్ష్మమ్మ; క్రమధాటి జానకీదేవి. యల్లాప్రగడ సీతాకుమారి, పులవర్తి కమలాదేవి ప్రభృతులూ పేరుపడ్డారు.

ఇక్కడ నేను ఉద్ఘాటన చెయ్యని ఉదీయమానకథకులు ఉన్నారు.

3

ప్రస్తుతస్థితిలో కథానికాసాహిత్యములో కల్లోలము కనబడుతున్నది. భావ సాంకర్యము, రససాంకర్యము ప్రబలిపోయినవి. శిల్పము క్షీణితవైపు మొగ్గ చూపుతున్నది. కాంతాసమ్మితముగా ఉంటేనే కమనీయత. నిరలంకృతితో కూడిన నిజమైన విషయమయినా వార్త అనిపించుకొంటుంది. ఉక్తివిశేషము లేకుండా ఉన్నది ఉన్నట్టు సూటిగా చెప్పడమువల్ల సొగసు పోతుంది.

వస్తువు ఏదయినా కావచ్చు. యదార్థసంఘటన అయినా, కేవల కల్పితమయినా, ఉభయసమ్మిశ్రణమయినా, తుల్యబలవిరోధాలు తూచి రసవంత మవుతుందని తెలిసే రచనలలోకి స్వీకరించవచ్చు. లౌకికప్రపంచములో జరిగిన వాటికన్నా కథానికలో కల్పితఘట్టాలే రమణీయముగా ఉంటవి. అశ్లీలము హేయము జుగుప్సాకరము అయినవి పరిహరించడము ప్రశస్తము.

సమస్యలు—అంటే ధర్మసూక్ష్మలు—వాదాలు, సిద్ధాంతాలు కూడా కథానికకు కారణభూతము కావచ్చు. అయితే ఆలిమిట్టపళ్ళవలె మీదికి నెట్టుకురాకూడదు.

ప్రతిభావమూ ఒక విధముగా ప్రచారార్థమే అయినప్పటికీ, పనితనములో బయట పడరాదు. సంస్కారదృష్టి స్తవనీయమే, ప్రచారకదృష్టి ప్రశస్తమే. అయితే పత్రికావార్త వేరు, ప్రచారకకరపత్రము వేరు, కళావైభవోపేతమైన కథానిక వేరు.

గ్రంథం ఏదయినా ప్రత్యక్షంగా ఎవరికో చెప్పుతున్నట్టు భావించి రచించాలి. కథ్ ధాతువుకు చెప్పడము అని అర్థం. ఇక కథానిక నోటితో చెప్పుతూ ఎవరి చేతనైనా వ్రాయిస్తే వర్చస్సు వస్తుంది. కాకితముమీద కలము నడపడమే ప్రధానంగా పరిగణించ గూడదు. కథానిక కంటికోసము కాదు, కర్ణము కోసము.

కథానిక పదిపుటలు ఉండవచ్చు, వదిపదులు వ్యాపించవచ్చు. ఆది మధ్యాంతములు అదృశ్యము కాకుండా ఉన్నంతసేపూ దీర్ఘమయినా లోపము లేదు. చిన్నవయినా, సింహావలోకనము లేక చెడిపోయినవి-అనేకము. తాత్పర్యార్థము మీద తలపు ఉంచడం ధర్మము.

అనుకరణములూ, అనువాదములూ అనుచితము కావు. అయితే ఆ మాట అనకపోతే గ్రంథచౌర్యముకింద గణించవలసివస్తుంది. దేశీయభాషలో కథానికలు తెలిగించి, పరదేశసాహిత్యాలలో ప్రముఖమైన వాటిని పరివర్తనము చెయ్యవచ్చు. పరభాషలో భావించి పంక్తి మాత్రము ఆంధ్రములో అంటే అందము లేదు.

వాక్యముమీద, వాక్యసందోహముమీద, వాక్యగమనముమీద, మాధుర్యము మీద మనస్సు ఉంచాలి. వాడేది వ్యావహారికభాష అయినప్పటికీ కవివాక్యభాగాలు గంభీరముగా ఉండాలి.

అక్కడ కూడా పసకోసము ప్రౌఢవాక్కు, High Prose అవలంబించాలి. లోకములో నాజూకయిన నవీనపదాలు, జాతీయాలు సంతరించాలి. వర్ణనలలో, కథనములో గట్టు తెంచుకుని విశృంఖలముగా వెళ్ళక వెనుకముందులు చూడాలి.

స్త్రీవిషయములో చిక్కు లున్నవి. కామినీవర్ణనలో కళ్ళెము బిగించాలి. యువతీ యువకుల సమాగమాదులలో సముచితదృష్టి జారనియ్యరాదు. రసికత లేకపోతే రాణింపు లేదు. మొపాసామీద మోజువల్ల లారెన్సుమీద లాలసవల్ల, హక్స్లీమీద అభిమానమువల్ల కథకులు కొందరు మార్దవమూ మంచీ మరిచిపోయినారు.

వస్తుగ్రహణములో ఇంకా వైవిధ్యము, వైచిత్ర్యము, వైదగ్ధ్యము కావాలి. అపుడు కథానికా సాహిత్యము కలకలలాడుతుంది.

సంవత్సరానికి ఒకసారి కథక సమ్మేళనం జరపాలి. అటువంటి సమావేశంలో కథాసాహిత్యవృద్ధిక్షీణతలను గురించీ, వివిధ విషయాలను గురించీ విమర్శించవచ్చు. సమ్మేళనములో సమీచీనమైన కథాజాలము గ్రంథరూపంగా అందరికీ అందజేయవచ్చు. ఇదివరలో హైదరాబాదు నగరములో అఖిలాంధ్ర కథక సమ్మేళనము రెండు పర్యాయములు జరిగింది. ఇకముందు మధ్యాంధ్రదేశంలో సమ్మేళనము సమకూర్చడం సముచితము.

—తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి*

* భారతి-సెప్టెంబరు 1939.

# భావకవిత్వము

భావకవిత్వమంటే పలువురు పలుతెఱంగులుగా అర్థం చేసుకొంటున్నారు. చివరకు ఏ కవికైనా నలుగురు మఱదండ్రు వుంటే ఆ మఱదండ్రు ఆ కవి కవిత్వాన్ని భావకవిత్వం అనడం దగ్గఱకు వచ్చింది. చలాగ్గా హేళన చేద్దామూ అంటే ఏ పదానికైనా వుంటాయి ఆ మాత్రపు విఱుపులూ, ఆ మాత్రం అపార్థాటా. రసికుడు అంటే విరసోక్తిగా అర్థం చేసికునే వాళ్ళెంతమంది లేరు? God the Good అని ఇంగ్లీషులో అంటే ఆవెనక గాడిదగుడ్డు అని తెలుగులో వెక్కిరించే మహానుభావులు ఎంతమంది లేరు? కాబట్టి అలాటి పరాసికాలన్నీ ముందు మఱచి పోవాలి మనోవాక్కాయశుద్ధిగా 'భావకవిత్వం' అనే దేమిటో తెలిసికోవాలనే మానిసి.

'సృష్టిసౌందర్యము' 'వీరధర్మము' లాంటి పదమే భావకవిత్వము అన్నా గానీ అని నా యుద్దేశ్యము. 'సృష్టిసౌందర్యము' అంటే సృష్టిచే ప్రతిపాదింపబడే అందము అన్నమాట. వీరధర్మము అంటే వీరుడు నిర్వర్తించే విధి అన్నమాట. అలాగే 'భావకవిత్వము' అన్నా అని అనుకోవాలి. భావము యొక్క కవితా స్వభావము భావకవిత్వము.

ఇది ఎట్లు అమలులోనికి వచ్చిందీ అంటే పాఠకుల ముఖతా నని నా యూహ. సృష్టిసౌందర్యము తీసికోండి. సృష్టి ఎప్పుడు ఓలాగే దాని పని అది చేస్తూ వుంటుంది. కాని దానియొక్క అందం ఒకానొకడు గ్రహించినప్పుడు ఆ సృష్టి దృశ్యము బహు సుందరంగా వుంది అంటున్నాడు. అప్పుడు వానికా రహస్యము గోచరించింది అన్నమాట. ఆలాగునే కవు లెప్పుడూ వ్రాస్తూనే వున్నారు. భావా లెప్పుడూ అక్కడ వుంటూనే యున్నాయి. కాని యిప్పుడు కొందఱు పాఠకులు కేవలం పదముల కూర్పునందలి కవితా తత్వమునే కాక భావము నందలి కవిత్వమును జూఱగొనుట ప్రారంభించి పైకి చెప్పడంచేత ఈ భావకవిత్వం అనే పదము వ్యవహారంలోనికి వచ్చిందని నే నమకొంటాను.

భాష వేఱు భావము వేఱు అని అనవచ్చును. ఏమా అంటే ఒక మాట వేస్తే భావము వెల్లడింపు అయ్యేటట్టు ఇంకో మాట వేస్తే అంత యూతము, అంత నియతీ కుదురదు. కాని భావమూ కవిత్వమూ వేఱెట్లా అని మీ రనుకోవచ్చు.

ప్రతిధర్మమూ తాను వ్యక్తిరూపందాల్చేటప్పుడు రెండు విధాలుగా వుండక తప్పదు. ఒకటి పంచేంద్రియాల్లో ఓదానికైనా గోచరించే బాహ్యస్వరూపమున్నూ, రెండోది ఆత్మకు తట్టే ఆంతరంగిక స్వరూపమున్నూ అయి వుంటవి. ఉదాహరణకు మళ్ళీ వెనకటిదానినే యోచించి చూతాము.

మానవ ధర్మముకు వ్యక్తిరూపం ఆపాదించి దృష్టించుకోబోతే అగపించే కన్నూ ముక్కూ వక్షస్థలము ఇత్యాదుల శరీరసౌందర్యమే కాకుండా ఏదో ఆత్మ స్వరూపం ఆశరీరం అందంగా వుండి అందులో నివసిస్తూ జీవకళ వెలిగ్రక్కుతూ వున్నట్టు తోచదూ? చిఱుతవాని బోసినోరు, ముసిలివాని పండ్లూడిన యిదీ రెండూ బాహిరమునకు బోసితనమే చూపిస్తూ వున్నాగాని చిఱుతవాని యంతః కరణము గోచరించే అమాయకత్వము అనే ఆత్మగుణము ఆ బాహిరరూపంలో అందం ఒలికిస్తూ వుంది. రెండవచోట అది నిరర్థక మనిపిస్తూంది.

అదేరీతిగా కవిత్వం అనే ధర్మం పైకి శ్రవణయోగ్యం కావడంతోనే అది రెండు రూపాలు తాలుస్తూ వుంది. ఒకటి బాహేంద్రియ గోచరమైన పలుకుబడి స్వరూపమున్నూ, రెండు అంతర్వాహినిగ హృదయము నర్థముగావించు భావస్వరూప మున్నూ తాలుస్తూ వుంది.

కాబట్టి కొందఱు బాహ్యస్వరూపమును దిలకించి అందలి కవిత్వమునే చూఱగొనువారలైరి. వారు శరీరసౌందర్యమునకు మాత్రమే యుప్పొంగ కించిత్ కళోపాసకులవలె పరిమితజ్ఞులై భాషాకవిత్వము ననుభవించుచున్నారు. కొందఱు బాహ్యస్వరూపము అయిన పలుకుబడికి వెనుక నున్న భావములోని కవిత్వమును గొల్లకొని ఆత్మసౌందర్యమున నుప్పొంగు సమగ్రకళోపాసకులవలె అపరి మితజ్ఞులై భావకవిత్వము ననుభవించుచున్నారు.

రూపమునందు ఆత్మసౌందర్యము ఎట్లు శాశ్వతానందమున ఒడగూర్పు చున్నదో కవిత్వమునందు భావకవిత్వము అట్లు శాశ్వతానంద మిచ్చుచున్నది. బోసినోరు సర్వదా హాస్యాస్పదమే. అది విడదీసి బాహ్యరూపమాత్రముగా బరిగ ణించువారమేని అదే యొకచోట ఉపకరణమాత్రమై అమాయకత్వము అనే దైవ గుణము వెల్లడించునప్పుడు ఎక్కడలేని వాత్సల్యమునూ పుట్టిస్తోంది. ఆలాగే ఉచ్చారణకు విడివిడిగా అసాధువులనీ, అశాస్త్రీయములనీ శిష్టవ్యవహారములు కావనీ, అనుకొనే ముక్కలు వాటివెనుక భావకవిత్వము అనే గుణమును కలిగివుంటే అవి మనకు వేదవాక్కులుగా అయిపోతూ ఆ భావము మనస్సగితము గావిస్తున్నాయి.

కాబట్టి వితర్కింపూ, వితండవాదమూ, జిజ్ఞాసా ఇవన్నీ లోతుగా ఆలోచించి చూస్తే భాషనుబట్టి, భావాన్నిబట్టి లేవు, అసలు వెల్లడించిన వాక్కులో, వెల్లడించిన భావములో కవిత్వము ఉన్నదా లేదా అనే మెట్టుమీద ఆధారపడి యున్నవి.

అందుకే కొందఱు భావము భాష విడిచిపెట్టి "నేటికాలపు కవిత్వం" అని, "నవ్యసాహిత్యము" అని, "అభినవకవిత" అని యిలాంటి సమూహపదములు వాడుతున్నారు. ఆ సమూహపదముల యొక్క తత్వము ఎక్కడుంది? అసలు కవిత్వమందు ఉన్నది. అది వుంటే అన్నీ వుంటాయి.

కాబట్టి భావకవీ, భాషాకవీ అనే ముక్కలు విడిచిపెట్టి అసలు వ్రాయసగాడు 'కవియా?' అని వితర్కించండి. కవి అందరికీ గోచరిస్తాడు. కవిని గ్రహించలేని మనిషి మనిషేగాడు.

—కవికొండల వేంకటరావు*

———X———

* ప్రబుద్ధాంధ్ర. సం. 5. సం. 7. జూలై, 1934.

# గ్రామ్యమా ? వాడుక భాషా ?

వాడుకభాషనే కొందరు 'గ్రామ్యభాష' అంటున్నారు. గ్రామ్యభాష అనటం ఎంతవరకు సమంజసమో చూద్దాము. గ్రామీణులైన జనులు వాడుకునేది గ్రామ్యము. గ్రామ్య మనగా అసభ్య మని యర్థము. గ్రామీణులు మోటువారు, నాగరికత లేనివారు. అందుచేత వారు నగరస్థులు సభలలో వాడే అంత భావగౌరవం కలభాష వాడరు. దానివలన గ్రామ్యం అపరిగ్రాహ్యం కావచ్చును. మేము మా పత్రికలలో వాడే భాష గ్రామ్యభాష అని ఈ మధ్య ఎవరో హైదరాబాదు సుజాతలో సజీవమైన భాషా ఆ భాష పొందే మార్పులూ ఆ భాష మాట్లాడేందుకు బొడ్డు అయిన ప్రదేశాల్లో సువ్యక్తంగా కనపడతవి. అక్కడ దాన్ని గురించి సానుభూతి వుంటుంది. అట్లాగే ఇంగ్లీషుభాష నేటికాలంలో అసలయిన వాడుకభాష కావాలి అంటే, లండన్‌లో కనపడుతుంది. తెనుగుభాష కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలల్లో మాట్లాడేది అట్లాంటిది. ఇతరభాషలతో కలసివుండే ప్రదేశాల్లో ఈ భాష మార్పునందు అంత సానుభూతి వుండదు. బరంపురం, హైదరాబాదు, చిత్తూరు–ఇటువంటి ఇతర భాషా సంపర్కం కలచోట్ల వాళ్ళకి గ్రాంథికభాష నిలబెట్టుకోడమే కష్టం. అందుచేత భాష పొందే మార్పులని కూడా యెక్కడ సంబాళించుకుంటారు ? దాని మూలంగా వాళ్ళకు దీనియందు సానుభూతి తక్కువగా వుంటుంది.

అయితే మీ చోట్లనే వాడుకభాషని నిరసించేవాళ్ళు వున్నారు గదయ్యా అంటే వున్నారూ ! మేము చెప్పింది సామాన్య విషయం. ఉత్సర్గం కాదు అంటాము.

గ్రామ్యశబ్దం విచారిస్తే ఈ గ్రామ్యశబ్దం వాడుకభాషయందు ఎందుకు ప్రయోగింపబడుతోందీ అంటే 'య స్త్వపభ్రంశో గ్రామ్యః' అన్న నన్నయ్యగారి సూత్రంవల్ల. తెలుగుకి సంస్కృతం మాతృకగా చేసిన నన్నయ్యగారు తెలుగు వ్యాకరణం వ్రాశేటప్పుడు సంస్కృతమర్యాదలు పాటించారా ? కాదు. తెలుగు భాషాస్వభావం వారికి బాగా తెలిసి అమర్యాదలన్నా చేశారా ? 'శాస్త్ర మపౌరుష మాద్యం' అన్న నన్నయ్యగారికి తమయందు ఋషిత్వం సిద్ధించిందేమో చూశారా ! అట్లాగయితే మనం ఆంధ్రశబ్దచింతామణి తెరుస్తూనే 'ఓం నమో నన్నయాథర్వణ చిన్నసూరిభ్యో మహాఋషిభ్యః' అనటం లేదేమి ?

సంస్కృత లాక్షణికులు 'కటిగల్లాది' శబ్దాలు గ్రామ్యము లన్నారు: కాని 'గచ్ఛతి' అన్నదానికి ఏ అపభ్రంశరూపమో 'గచ్ఛేత్తై' వంటిది తీసికొని అది గ్రామ్య మనలేదేమి ?

ఆ, కటిగల్లాది శబ్దాలు మన గ్రంథాల్లో బహుగా ప్రయోగించారే మరి ?

అందాకా యెందుకు ? నర్సభూపాలీయంలో 'కన్నులు', 'చన్నులు' గ్రామ్యాలు అన్నాడు. మరి అవ్వి లేకుండా మనకు కావ్యం నడవదే. ఎట్లా ?

అసలు గ్రామ్యం అంటే మనపూర్వుల వుద్దేశం ఏమిటి ? మన మేమను కుంటున్నాము ? పూర్వుల వుద్దేశం అసభ్యమైన భాష అని. కొన్ని బజారుమాటలు నలుగురు పెద్దమనుష్యుల్లో సభలలో మాటాడరానివి వుంటయ్యి. అవీ, పూర్వం సంస్కృతంలో కటిగల్లాదు లట్లాంటివి. చన్నులు ఇప్పుడు అట్లాంటిది.

సభలలో మాట్లాడేది సభ్యం. ఈ వాడుక భాష, సభలలో, అది గ్రామ్యం అనేవారు కూడా మాట్లాడుతున్నారు. బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి ఉపన్యాసం రక్తిగా వుంటుంది అంటే యెందుకని ? వారు వాడుకభాష ప్రయోగిస్తారు. కాకుధ్వని వాడుకభాషలోనే వున్నది. గ్రాంథికభాషలో కాకువు సాధించుకోవాలి. గ్రాంథికభాషావాది అన్నకొద్దీ కాకువురమ్యత తెలియని వాడని అర్థం.

ఈ కాకువు గ్రాంథికభాషలో ఇమిడ్చేటందుకు తిక్కన్న పడ్డ కష్టం భగవంతుడికి తెలుసు. అందుకనే భాగవతం అర్థం చెప్పటం కష్టం, భారతం చదవటం కష్టం అనీ అంటారు. భాగవతంలో వేదాంతార్థం పెగలదు. భారతంలో కాకుస్వరం తెలియదు. అది తెలియకనే భారతంలో ఏమున్నదీ అంటారు కొందరు.

కాకువు అంటే భావద్యోతకానికి ఉచ్చారణలో చూపే ఒడుపు. ఒక భాషా సామర్థ్యం ఆభాషలో కాకుధ్వనినిపట్టి తెలుస్తుంది. ఆ కాకుధ్వనిని గ్రాంథికభాష కన్న వాడుకభాష మిక్కిలిగా ప్రయోగిస్తుంది. వాడుకభాష అంటే ప్రత్యయాల మార్పుమాత్రమే అనుకోవచ్చు. నేటి కొందరు కవుల భాష ప్రత్యయాలు మారిస్తే, వాడుకకన్న అమితకనాకష్టం అవుతుంది. ఏ శ్రీనాథుడి కవిత్వమో ప్రత్యయాలు మారిస్తే దానికి గ్రామ్యత్వం సిద్ధించదు.

సంస్కారం పొందిన హృదయం, వాక్కు గలవాడు వ్రాసినా మాట్లాడినా భాషకి కొంత గౌరవం వుంటుంది. గౌరవం గల శబ్దాలు వాడతాడు. సంస్కార

రహితమైన హృదయమూ, వాక్కూ కలవాళ్ళు గ్రాంథికభాషలో వుండే ప్రత్యయాలు చివర కలిపినా, అది అట్లాగే వుంటుంది.

ఈ వాడుకభాష యెందుకు వద్దూ! అని అడిగితే పండితులు చెప్పే కారణాలు ఏమిటంటే శబ్దాలు ఇష్టం వచ్చినట్లుగా మారుతున్నవి. ఆ మార్పుకు హద్దు లేదు. అందువల్ల గ్రాంధికభాష మారిపోతుంది, అని. మార్పుకు హద్దు లేదూ అంటే హద్దు వున్నది. గోడని ఎవరూ 'గేడ' అనరు. 'చూడటం' 'చూట్టం' అవుతుంది. ఒక్కరితకు యాభై రూపాయలు వ్రాసిన వ్యాకరణం ఈ మాత్రం చెయ్యలేదూ ?

కొందరు నన్ను అడిగారు. పద్యాలూ వ్రాస్తావు నువ్వు. వాడుకభాషా వ్రాస్తున్నావు. నీ కది ఇష్టమా ? ఇది యిష్టమా ? అని. రెండూ యిష్టమేనన్నా ! దానికి వారు ఒప్పుకోరు. ఒప్పుకోక 'ఆ! అది ఎట్లా ! అంటారు. వారన్నది నాకు తెలియటం లేదు.

బ్రహ్మశ్రీ ఆచంట సాంఖ్యాయన శర్మగారు మనదేశానికి భీష్మలవంటివారు. వారు అన్నారుగదా, 'ఈ క్రొత్తభాషవల్ల భారతభాగవతాలు మూలపడతవి' అని. ఈ భాషవల్లనే అట్లా జరిగేటట్టయితే అది ఇదివరకే జరగాలి. బొబ్బిలి పాటలు, కామమ్మ కథలు, రామదాసు కీర్తనలు, కొంతదాకా త్యాగయ్య కృతులూ ఇవన్నీ వాడుక భాషలోనే వ్రాయబడ్డవి. అవ్వీ అచ్చుపడ్డవి. దానివల్ల భారత భాగవతాలకు వచ్చిన నష్టం లేదు" అన్నా.

భారత భాగవతాలు ఈ భాషలో వ్రాయవచ్చునా ? అని అడిగారు. నేను కాదు అన్నాను. వాడుకభాషకి అంత సామర్థ్యం లేదు. నేడు రామాయణం ఈ భాషలో వ్రాయాలని కాదు. ఈ భాషలో వ్రాసినా, ఆ భాషలో వ్రాస్తే, ఏ అందం వచ్చిందో, ఆ అందం రాదు. ఆ రెంటి తారతమ్యానికి బొబ్బిలికథని రంగారాయవిజయంతో పోల్చి చూస్తే తెలుస్తుంది.

ఈ భాష చదివితే పిల్లలు పాడై పోతారూ అన్నారు. ఈ యూనివర్సిటీవారూ, గవర్నమెంటువారూ పెట్టే గ్రాంథిక నామక గ్రంథాలవల్ల పాడవుతారే గాని, శక్తి గల, జీవం గల నుడికారం ప్రయోగించిన వాడుకభాషాగ్రంథాలు చదివితే చెడిపోరు అంటారు.

భాషస్వభావం తెలుసుకోకండా గ్రంథస్థ భాషలో వున్న ప్రత్యయాలకి మాత్రమే ఆ గౌరవం కలిపిస్తే, దానివలన భాషకి చాలా నష్టం వుంది. పిల్లలకి అటువంటిభాష

నేర్పరాదు. ఆ భాష తగినంత జీవం గల భాష అయివుండాలి నిర్జీవ మైతే గ్రాంథిక భాష అయినా పిల్లలకు నేర్పకూడదు. గ్రాంథికభాష అన్న పేరుతో తప్పరూపాలు కోటానుకోట్లుగా వున్నభాష (ఇప్పటి స్కూళ్ళలో పెట్టే పుస్తకాల భాష) వాళ్ళకి నేర్పరాదు. సామాన్యంగా పిల్లలచేత నేడు స్కూళ్ళల్లో చదివించే నవలలూ అవ్వీని, కుర్రవాడికి భాషలో వుండే శక్తిని తెలియ నియ్యటం లేదు. భాషశక్తి కారకంలోనూ, కాకువులోనూ హృదయోద్వేగం ప్రకటించే మాటల్లోనూ వుంది. ఆశక్తి తిక్కన రచనలో సమృద్ధిగా వుంది. కొందరి కవుల్లో అది కనపడనే కనపడదు.

'వచ్చుచున్నది', 'వస్తున్నది', 'వస్తోంది' అన్న రూపాల దగ్గరకాదు తగాదా, బాహుళ్యంమీద, భాషాస్వభావంమీద. ఈ రూపాలన్నీ కూడా వాడికి తెలియవలశిందే. అవి వాడేచోట్లు వేరుగా వుంటవి. పసిపిల్లలకి చెప్పే చిన్నిచిన్ని కథల్లో 'వస్తోంది' అని వాడవచ్చు, ఇంకేదైనా అయితే 'వస్తున్నది' అనవచ్చు, 'వచ్చుచున్నది' గ్రాంథికరూపం తెలిశేటందుకు.

మనభాషలోకి యితర దేశ్యాలు యథేష్టంగా ప్రయోగించవచ్చు. 'ఫీలు' కూడా భాషలోకి వచ్చింది. 'సప్లయి' మొదలైనవి శబ్దరత్నాకరంలోనే వున్నవి. 'వస్తాడు' అన్నది నింద్య గ్రామ్యం! ఇది యెట్లా వుందంటే, దొరగారితో కలిసి, 'టీ' త్రాగవచ్చు కాని, పంచముణ్ణి దగ్గరకు రానీయరాదు. మహమ్మదీయుడికి శూద్ర మర్యాద వచ్చింది. దొరకి దొరమర్యాదే సిద్ధించింది. మాలవాడికి ?

అనింద్య గ్రామ్యమైనది 'కఱకంఠుడు'. ఎందుచేత ? అనుశాసకుడికి పూర్వం వ్రాశాడు ఏకవో ఆ మాట. కవు లందరూ వ్రాసేవరకూ ఈ అనుశాసకుడు ఆగరాదూ! అనింద్యగ్రామ్యాలు అన్నీ తెలిశేవిగా! ఎవరో కొందరు పండితులు 'ఇది గ్రామ్యం, వద్దు' అంటే ప్రవాదున్నూ 'ఛీ, ఇది గ్రామ్యం' అనే-వారికన్న పదిరెట్లు ఎక్కువగా! 'అన్నాడు ధర్మరాజు' అన్నవాక్యం వుంటే 'అది గ్రామ్యంలే' అనటం. 'బాబూ అది చాలా గ్రాంథికం! 'ఏకవాక్యంబునం దొకాకొక్కండుదక్క సర్వపదంబులు క్రమనిర పేక్షంబుగం బ్రయోగింపం జను' అన్నాడయ్యా చిన్నయ్య అంటే, దాని కర్థం తెలియదు మళ్ళీ.

భాష ప్రవాహిని. మారుతూ వుంటుంది. కనుక మారేభాషని పట్టుకోటానికి వీలులేదు, అని భాషావాదుల తర్కం. దీని కొక పండితులు చక్కని అభ్యంతరం

చెప్పారు. ఏమని అంటే, అవును. మారటం స్వభావం. ప్రకృతిలో ఆ దోషం వున్నది. ఆ దోషం తీసివేసేందుకే మేము దాన్ని యిట్లా వుండాలని నియచ్ఛించాము, దాన్ని సూత్రబద్ధంగా చేశాము' అని. ఇది బాగుంది. కాని సూత్రబద్ధం, చేయక మునుపు ఆ భాషయొక్క పరిణామానికి, దాని వైశాల్యానికి ఎడమిచ్చి చెయ్యాలా? వద్దా? కుర్రవాణ్ణి అల్లరిచిల్లరగా తిరగనీవద్దు. అయిదయిం తరవాత, వాడు ఆడుకోవద్దా! ఇంట్లో అదేపనిగా కూర్చుంటే గుద్దులెత్తి బోదకాళ్ళు వస్తవి. మన భాష కిదివరకే బోదకాళ్ళు వచ్చివై. కొంచెం కాలు సాగనివ్వాలి.

కొందరన్నారూ! మార్పు మార్పు అంటావు. మారుపే ప్రధానమా? ఇంకేం కారణాలు అక్కరలేదా? మార్పు కోసమే మార్పా? అని. మార్పుకాదు. వాడుక భాషలో చెప్పే కొన్ని భావాలు సరిగ్గా తెలియచెయ్యటానికి గ్రాంథికభాషకి సామర్థ్యం చాలదు, అని. పూర్వం నన్నయ్యగారు నిబంధించిన నిబంధన చాలకనే భాష యింతగా మారిపోయిందని. కనక ఆసామర్థ్యం ఎంతవరకు వుందో, అంత వరకు వదలిపెట్టవలెనని, అప్పుడు దానికి సూత్రాలు నిర్మించు, నీ సూత్రాలు దాట దెవ్వరూను.

అట్లా అయితే వాడుక భాషకే సామర్థ్యం చాలదు. వాడుకభాష వాడుకలో వున్న భావాలని మాత్రమే చెపుతుంది. గ్రాంథిక భాషలో మనకు వాడుకలో లేని భావాలు చెప్పవలశివస్తుంది. పైగా గ్రాంథికభాషకి అటువంటి భావాలతోనే యెక్కువ పని వుంటుంది. అని అన్నారు. అవును. ఆ భాషాసామర్థ్యం ఆ భాషది. ఈ భాషా సామర్థ్యం ఈ భాషది. రెండునూ కావలయుననే నా ఊహ.

నిజమైన మాటకి పద్యమూ, గద్యమూ రెండే మార్గాలు. మూడవది పాట. పాట ఏ భాషలోనైనా వుండవచ్చు. పద్యం గ్రాంథికభాషలో వుండాలి. గద్యం వాడుకభాషలో వుండాలి. పద్యం ఎందుకు గ్రాంథికభాషలో వుండాలి అంటే, ఛందోబద్ధమైన భాషకు పద్యమూ, పద్యానికి ఛందోబద్ధమైన భాషా సరిపోయినవి. ఇదివరకు మనవాళ్ళు సృష్టించి యేర్పరచిన వృత్తభేదాలు గ్రాంథిక భాషా స్వరూపానికి తగిపోతవి. వాడుకభాషలోనే పద్యాలు వ్రాయాలి అంటే, ఆ వృత్తాలు మారాలి. కాదు, వృత్తాలే ఆ వాడుకభాషలో వ్రాస్తాము అంటే ఆ వృత్తాలికి ఆ భాష తిరిగిపోయింది. మళ్ళ అంత ప్రయత్నం చేసిన కవులు ఆ వృత్తాల్లో ఈ భాషని వంచితేకాని అంత సాఫీ తిరగదు. అది కాలగర్భంలో వున్న పని.

వచనంలో వాడుకభావాలు చెప్పటానికి వాడుకభాష కుదిరినట్లుగా గ్రాంథిక భాష కుదరదు. వాడుకలో లేని భావాలకు గ్రాంథికభాష కుదరవచ్చు. మిక్కిలి వాడుకలో వుండే భావాలు ఆ భాషలో చెప్పటం పరమ అసహ్యం.

వాడుకభాష వ్రాస్తే కొందరు 'మాకర్థం కావటం లేదు. చదవటం యెట్లాగో తెలియటం లేదా' అంటారు. వారు మాట్లాడటంలో వున్న ఒడుపు తెలియక అట్లా అనటం. ఆ ఒడుపే భారతం నిండా వున్నది. వారు భారతం చదివికూడా అట్లాగే అంటారు అయితే.

కొందరు "దయ్యేబట్టటం" మొదలయినవి ప్రాంతీయాలు. అవి వాడితే "యెట్లాగబ్బా!" అంటారు. ప్రాంతీయాలు గ్రాంథికభాషలో కొల్లలుగా వాడతారుగా మరి. ప్రాంతీయశబ్దాలు అని తోసివేయటం గ్రాంథికభాష చేయదు. ఆ విషయంలో గ్రాంథికభాష భాషావైశాల్యం పరిగణించిందన్నమాట. అట్లా తప్పుపట్టుకుంటే వాడుకభాష తన వైశాల్యం సంకుచిత పరచుకుంటోంది అని అర్థం. ప్రాంతీయ శబ్దాలు భాషాదేవి విస్తారమైన తనువు. అవి తీసేస్తే ఆవిడ గుజ్జు అయిపోతుంది. కావలిస్తే ప్రాంతీయశబ్దాల పట్టికలు ఇవ్వవచ్చును.

వస్తోంది, వెళుతోంది-ఇటువంటి మాటలు వికారంగా వున్నవనీ అవి కుంటి నడక వ్యత్యస్తపు మాటలనీ అంటారు.

"వస్తోంది" అన్నమాట "వస్తున్నది" అని ఉండాలని వారి ఊహ. వాడుక భాషకు కూడా కొన్ని నిబంధన లేర్పరచి, దాన్ని సంస్కరిద్దా మని వారి ఉద్దేశం.

ఇదివరకు నన్నయాదుల సంస్కారం వీరు ఒప్పుకోలేదు. ఎందుకనీ? దానికి సామర్థ్యం లేదని. అది వికృతంగా వున్నదనీ. మరి తాము చేయబోయే సంస్కారానికి ఆదర్శ పట్టదూ కొంతవరకే నాయెను.

కొందరు కవులకు అదొకమోస్తరు ఒత్తు అక్షరాలు రాకుండా నీళ్ళవలె సాఫీగా నడుస్తున్న కవిత్వమే కవిత్వ మనిపించినట్లు, కొందరికి అందరికీ అర్థ మవుతున్న శబ్దాలే యేరి అదొక మోస్తరు సాఫీగా వుండాలని వాడుకభాష.

ఎవడు వాడేభాష వాడు వ్రాస్తాడు. నేను మా 'నందమూరులో' చిన్నతనంలో నాకు వచ్చిన భాషా నేను చదువుకోగా నాకు వచ్చినభాష రెండూ నాలో కలిసి యేపరిణామం పొంది నానోటి వెంట వస్తుందో అది మాట్లాడతాను. అదే వ్రాస్తాను.

ఎవరు ఎట్లా వ్రాసినా, ఎట్లా మాట్లాడినా వారి వ్రాతకి వారిమాటకి భిన్నత్వం వుంటుంది. ఆ వ్రాసేవారూ, ఆ మాట్లాడేవారూ వ్యక్తిత్వం కలవారైతే అది కనపడుతూ వుంటుంది. తను వ్రాస్తుంటే తన ఆత్మ అందులో కనబడుతూ వుంటుంది. ఆ ఆత్మనిబట్టి అతను వాడేశబ్దాలూ వుంటవి. మనకు నచ్చితే అందం. కాకపోతే బాగులేదు అంటాం. ఒకడికి పుల్లకూర ఇష్టమైతే ఒకడికి ఇగురుకూర ఇష్టం.

ఇది నా చెవికి మహాఅసహ్యంగా వినబడుతోంది అంటే, నా చెవికి చాలా శ్రావ్యంగా వున్నది.

అనేక మారుమూల శబ్దాల్లో క్రొత్త క్రొత్తరకంగా కూర్చిన సమాసాల్లో తెనాలి రామలింగకవికి సౌందర్యం కనపడ్డది. అతని ఆత్మలోంచి ఆ కవిత్వం వచ్చింది. అటువంటి మార్గం పోయినకవి లేడు భాషలో మళ్ళీ. అతన్ని కాదన టానికి మనకా వాక్కు చాలదు.

ఒక కవి అన్నాడు 'నా ఆత్మ యిదిరమ్యం అని నిర్ణయించిన దానికి నువ్వెవరు కాదనేందుకు ?' అని.

ఒక్కొక్కని స్వభావం వేరయినకొద్దీ అతని శబ్దసముదాయం అవి చెప్పేరీతీ భేదిస్తూ వుంటుంది. అతని స్వభావంవల్ల ఆశబ్దాలే ఒకకొత్త వంపు తిరుగుతవి. ఇతరులకు అంతా అది కొత్తగా వుంటుంది. అతని భావం తెలుసుకోవాలీ అంటే, ఆ అతని మాటలవంపు వాని స్వభావంవల్ల ఆ మాటలకు చెప్పే మార్పు ఓపికతో తెలుసుకొంటేనే కానీ తెలియదు.

అది అందరికీ తెలిసేటట్టుగా వుండాలికానీ అందరూ అతన్ని తెలుసుకు నేందుకు ప్రయత్నిస్తారా ? అని అంటే అందరూ అతన్ని తెలుసుకునేందుకే ప్రయత్నించాలి.

కవి, వ్రాయసకాడు ప్రభువువంటివాడు. వాడి భాష మనము చదువుకోవాలి. ఆసేతుశీతాచలం ఇంగ్లీషు చదవడంలే ! ఎందుకు ? దొరకాడూ ! కాని వాడి భావం మనకు తెలిసేటందుకు వాడూ ప్రయత్నం చేస్తాడు.

రమ్యతావిషయమే చెవివల్ల నిర్ణయించాలి అంటే దానికి చివర దొరకదు, "సహృదయ" శబ్దానికి లక్ష్యం నిర్ణయించాలిసినట్లు. నీ చెవికి అందం తెలియదూ

అంటే నీ చెవికి తెలియదు. చివరకు పదిమంది అన్నమాటకు పైచేయి యిస్తే అది ఒక బోర్డులో వున్న మెంబర్లచేత చేతు లెత్తించినట్లే. భాషకి కూడా ప్రజాస్వామ్య పద్ధతి సూత్రాలు పట్టించి పాడుచెయ్యటం అవుతుంది.

మారుమూలశబ్దాలు అని యింకో తగాదా. ఇది యింగ్లీషులోంచి "ఆబ్‌సొలీటు" మాటలు అన్నదానిలోంచి తెచ్చుకున్న కొత్త విషయం. ఒక పండితుడు అన్నాడుగదా, 'ఒక కవి తానొకశబ్దం వాడుకలో నుండగా విననంతసేపు అని ప్రాతశబ్దమనీ వాడుకలో వినటంతోనే క్రొత్త నవనవలాడు శబ్దమవుతుందనీ' అన్నారు. ఆ వాదటం ఒక్కడు వాడినా అవుతుంది. అయితే ఒక చక్కని వాడుకలో ఉన్నమాట కాలకర్మదోషంచేత తను వినకపోతే అంత చక్కనిమాట తన భాషలోనుంచి ప్రాతమాట అని మినహాయించుకోటమేనా? అందుకనే శబ్దానికి వాడుతున్నారా, లేదా అని కాదు. అది సుందరమైన ద్రవునా కాదా అని. ఈ బహుధా విచారాలన్నీ కట్టిపెడితే–

ఏ కవికి, ఏ వ్రాతగాడికి, ఎప్పుడు ఏది రమ్యంగా వుందని తోస్తే అది వ్రాస్తాడు. అది రమ్యం కాదూ అని తోస్తే కాలం తోసేస్తుంది. ఒకప్పుడు రమ్యమైనదాన్ని రమ్యంగా లేదని కాలం అనుకుని వదిలివేస్తే అదే మళ్ళీ కొన్నాళ్ళకు దాన్ని పునరుద్ధరిస్తుంది. అట్లు జరగదూ! ఈ అనంత కాలంలో, అనంత భాషల్లో, అనంత మార్గాల్లో కొన్ని మంచివి పోకా, కొన్ని చెడ్డవే నిలవకా ఎట్లా వుంటుందో యెవ్వరు చెపుతారు ?

—విశ్వనాథ సత్యనారాయణ*

* జయంతి. సం. 1., సం. 2.

# గేయరచనలు : ప్రాచీనులు

నారాయణ భగవంతమ్

శివ

నారాయణ భగవంతమ్

గోసాయిల మాట

గొడ్డటి దెబ్బ

సాదుల మాట

సర్పము కాటు

నారాయణ భగవంతమ్

శివ

నారాయణ భగవంతమ్.

భిక్షుకగీతం ఏదివిన్నా నాలుగేళ్ళనాడు నాగవరంలో నిద్రలేచేటప్పటికి తన చేతులలో ఉన్న తాంబూరా మీటుతూ ధ్రువాగీతిలో బావాజీ పాడిన ఈ పాట మనస్సులో ప్రత్యక్ష మవటం పరిపాటి ఐపోయింది. అంతకుముందు పాటలు, పదాలు విన్నాను. కానీ, నాకు ఆనాటినుంచే గేయసారస్వతం మీద గౌరవం, ఆదరాభిమానాలు, కృషిచేతామన్న అభిలాష పొడచూపినవి.

ఏ సాహిత్యంలోనైనా శ్రోతనుగాని, పఠితనుగాని రసప్రపంచయాత్ర చేయ గలిగించేవి గేయరచనలే. రసికులను రంజింపజేయటానికి రమ్యమైన పదరచన ఉపయోగించినట్లు రసవంతమైనా పద్యం ఉపకరించదు. అవి లయతాళబద్ధాలుగా ఉండి గానకళతో సన్నిహిత సంబంధం కలిగి ఉండటమే దీనికి ప్రబలకారణము. ఒక దేశంలోని మతవిపరిణామాలను, మనస్తత్వాలను, ఆచార వ్యవహారాలను, అన్యోన్య అనురాగాలను, సౌందర్య సౌభాగ్యాలను ప్రతిబింబిస్తూ దేశ జాతీయ దర్పణాలుగా ప్రవర్తిల్లడమే వీటిలో ఉన్న ఉత్కృష్టత. పరదేశీయసాహిత్య ప్రభావంవల్ల, పాండితీప్రకర్షాభిలాషవల్ల, ప్రౌఢోక్తులవల్ల, పద్యసారస్వతము దేశీయతను, జాతీయతను విరివిగా వెల్లడించలేదు. ఆంధ్రభాషలో ఏదైనా

వ్యక్తిత్వము, జాతీయత కలిగిన రసవంతమైన కవిత ఉన్నదా అంటే అది పద వాఙ్మయములోనే ఉన్నదని నా అభిప్రాయము.

శ్రీనాథునికి అంటగట్టబడ్డ అపవాదాన్ని ఆధారంచేసుకొని ప్రతివ్యక్తి పదకర్తలను కృతులను నిందించటానికి సాహసిస్తారు. విదేశీయ సాహితిలో అభివృద్ధి నొందినట్లు పదవాఙ్మయం అందువల్లనే మన సాహిత్యంలో ప్రవర్ధమానం కాలేదు. ఉన్నదాని మీద ఆదరము శూన్యముగా ఉన్నది. సంస్కృత భాషలో కృష్ణకర్ణామృతము, భజగోవిందశ్లోకాలు, అష్టపదులు అనుభవించే ఆదర్శపూజ్యత ఆంధ్రంలో ఒక గేయకృతికైనా లేదు. వంగభాషలో చండీదాసు విద్యాపతి, రామమణి, గోవిందదాసు మొదలైన పదకర్తలను మహాకవులుగా పరిగణిస్తారు. హిందీ భాషలోని నూరుపదావళీ కబీరు కీర్తనలకు ఆదర్శపూజ్యత. తుకారాం మీరాబాయి మొదలైన కృతికర్తల మహారాష్ట్ర అభంగాదులకు అత్యంతప్రతిష్ట. ప్రపంచ విఖ్యాతిని చూరగొన్న రవీంద్రుని రచనలలో ముప్పాతికవంతు పదాలే.

సంతోషం కలిగినప్పుడు ప్రథమ మానవుడు చిందులువేస్తూ కూనరాగాలాపనముతో సామాన్య పదకవిత్వము ప్రారంభిస్తాడుగాని, సంస్కృతిభూతమైన పద్యకవిత్వం మొదలు పెట్టడు. అందువల్లనే సాహిత్యవేత్తలు పద్యంకన్నా పదమే మొదట ఏ సారస్వతంలోనైనా ఉద్భవిస్తుందనటంలో ఏకీభవించారు. అదే విధిగా మన భాషలోనూ ప్రథమంలో పదసాహిత్యము జన్మించి ఉంటుంది. ఆదిగ్రంథమైన భారతానికి పూర్వం పుట్టిన గేయకృతులన్నీ పాండితీప్రభ సాగే రోజులలో రూపుమాసిపోతూ జనసామాన్యగౌరవం పొందుతూ, భిక్షుకగీతాల్లోను, భక్తుల గేయాల్లోను, స్త్రీల సారస్వతములోను, సాములయ్యల గరిడీలలోను. తమ ప్రాణము నిలుపుకొంటూ వచ్చినవి. కాని పదఛందస్సులైన 'తరువోజ' 'మధ్యాక్కరలు' ప్రథమ కావ్యంతో పరిచయము కలిగించుకో గలిగినవి.

ఒక శతాబ్దకాలము మళ్ళా పదవాఙ్మయ చరిత్ర అజ్ఞాతంగా ఉన్నది. ఇంతలో వీర శైవమత విజృంభణము దక్షిణాపథాన్నంతా కలవరపరచినది. దాక్షిణాత్య భాష లన్నిటిలోను ముఖ్యంగా కన్నడ, తెలుగు సారస్వతాలల్లో దేశీయ కవిత్వము మొదలు పెడుతుంది. మతప్రాబల్యానికి సామాన్యభాషలో గ్రంథరచనము అవసరమని ఆనాటి మతప్రవక్తలు గుర్తించారు, ఈ మతప్రాబల్యఫలితాలే పాల్కురికి సోమనాథుని 'పండితారాధ్య చరిత్ర' 'బసవపురాణ' ద్విపదలు. ఈ శతాబ్దిలో పదవాఙ్మయము పండితపామర జనాను మోదమైన పలుకుబడి సంపా

దించుకున్నది. అందువల్లనే ఈ కాలంలో పద్యకవిత్వము కనిపించటం లేదు. సోమనకు పూర్వ మున్న గేయ కవితాస్వరూపము మనకు బసవపురాణములోని

'కర మర్థి నూరూర సిరియాళ చరిత
పాటలుగా గట్టి పాడెడువారు
అటుగాక సాంగభాషాంగక్రియాంగ
పటునాటకంబులు నటియించువారు'

అనీ, పండితారాధ్య చరిత్రలోని శ్రీశైలవర్ణన సందర్భములో

'మది నుబ్బి సంసార మాయాస్తవంబు
పదములు, పర్వతపదము లానంద
పదములు, శంకర పదముల్ నివాళి
పదములు, వాలేశుపదములు, గొబ్బి
పదములు, వెన్నెల పదములు, సెజ్జ
వర్ణన మణిగణ వర్ణన పదము
లర్ణవ ఘోషణ ఘూర్ణిల్లుచుండ',

భక్తులు శ్రీశైల పర్వతారోహణం చేశారని చెప్పే రెండు ద్విపదలవల్లా తెలుస్తుంది. తెలుగులో దేశీయనాటకములు కూడా ఈ రోజులలోనే సదస్సును సంతోషపరచి ఉంటవి.

పదకవితల ప్రభావము తరువాత కవులమీద చాలమట్టుకు కనిపిస్తుంది. మొదట సాంప్రదాయాలు కాని ఛందస్సులను—రగడలు షట్పదులు, చౌపదులు, ద్విపదలు,—పురాణ ప్రబంధ కవులు ఆమోదించి కృతియోగ్యాలుగా స్వీకరించారు. జాను తెనుగు ప్రభావ ప్రవాహానికి ఎదురీదటానికి నన్నెచోడ తిక్కనలు గూడా సాహసించలేదు.

వీరశైవ మత విజృంభణము నెమ్మదిగా వెనుకదారిపట్టి హరిహరనాథాత్మక మైన అద్వైత సిద్ధాంతముమీదికి దేశంలో అభిమానం ప్రబలింది కొంతకాలానికి. అప్పుడు నాచనసోముడు ఉత్తర హరివంశమే కాకుండా 'వసంతవిలాస'మనే గోష్ఠి విషయక ఏకాశ్వాస ప్రబంధము రచన చేశాడు. తెలుగు తోటలో ఉపలబ్ధమౌతూ ఉన్న ప్రథమ గేయసుమము మనకు ఆ కావ్యంలో కనిపిస్తుంది. అది

'వీణాగానం వెన్నెలతేట
రాణమీరగా రమణుల పాట
పేరుచెప్పిన పినబ్రాహ్మణు వీట
జాణులు మెత్తురు జాజరపాట'

అనేది. జాజర అనేది ఏదైనా వాద్యవిశేషమా ? లేక పదభేదమా ?

కవిసార్వభౌముడు శ్రీనాథుని జీవితకాలానికి పదఛందస్సులకు కావ్యార్హత ప్రస్ఫుటమైనది. ద్విపదలో సోమనరచనలు అంతకుపూర్వమే ఉన్నా అవిమత విషయిక పురాణాలుకాని రసవత్కావ్యాలు కావు. ఈ యుగంలోనే శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర, గౌరన హరిశ్చంద్రోపాఖ్యానము నవనాథచరిత్ర ద్విపదలు.

శ్రీనాథుడు పదకవిత్వాన్ని

'ముదివిటులు వెధవలంజలు
పదకవితలు(?) మాఱుబావన వా
ల్చదువని పండితవర్యులు
కదనాస్థిర వీరవరులు కడిదిపురమునన్'

అనే పద్యంలో పలుచగా చూచాడని అంటారు. హాస్యరస ప్రధానమైన మోటుచమత్కారాలు, మొరటుతిట్లు నెత్తినవేయించుకోవటానికి తెలుగు సారస్వతంలో తెనాలిరామలింగడు, శ్రీనాథుడు, ఏఅన్నెంపున్నెం ఎరక్కపోయినా, అసభ్యరసిక లోకానికి చిక్కుతారు. అతడు గేయరచ లను నిజంగా నిరసించినట్లైతే ఆదేశీయ ఛందస్సులో పల్నాటి వీరచరిత్రను ఎందుకు వ్రాస్తాడు ? శ్రీనాథునికి పదకవిత లంటే ఎంతోఇష్టం అనటానికి ప్రబలప్రమాణాలు ఇంకా ఉన్నాయి. భీమఖండంలో ద్రాక్షారామాన్ని వర్ణిస్తూ

'కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి'

అని జనసామాన్య గేయ ప్రబంధాకృతిని ఉల్లేఖిస్తాడు. ఇతని పోషకులైన రెడ్డి రాజన్యులకు మహేశ్వరునికి వసంతాభిషేకము చేయటము అలవాటు. ఆసమ యంలో స్త్రీలు వల్లకి,చక్కి,కాహళము,వంశము, ఢక్క, హుడుక్కుఝల్లరి మొదలైన వాద్యవిశేషాలతో పదాలుపాడుతూ నర్తనం చేసేవారని భీమఖండంలోనే

'వల్లకి చక్కి కాహళము
వంశము ఢక్క హుడుక్క ఝుర్ఝురుల్
ఝల్లరి యాదిగా గలుగు
శబ్దపరంపర తాళశబ్దమై
యుల్లసిలం బ్రబంధముల
నొప్పుగ నాడుదు రుగ్రవేదిపైఁ
బల్లవపాణు లీశ్వరుని
పంటమహీశులు పూజసేయగన్. ?'

అనివర్ణిస్తాడు. అటువంటి శ్రీనాథుడేమిటి, పదసారస్వతాన్ని పరిహసించటము ఏమిటి!

దిగ్విజయార్థము బయలు దేరుదామనుకున్న కృష్ణరాయలకు అపరిమితో త్తేజము కలిగించిన ఆనాటి జానపదుని.

కొండవీడు మనదేరా!
కొండపల్లి మనదేరా!
కాదను వాడుంటే
కటకం దాకా మనదేరా!

అనేగేయం ఆంధ్రలోకానికి అపరిచితం కాదు. ప్రబంధయుగంలో ప్రత్యేక గేయరచనలు వెనుకపడ్డా, పుష్పాపచయాలల్లో పద ఛందస్సులు కనిపిస్తున్నాయి. ప్రబంధనాయికలకు పదసారస్వత మంటే పరమానందము కూడాను.

నాయకరాజుల పరిపాలనాకాలంలో మళ్లా పదకర్తలు తలఎత్తారు. పద్య కవులతో సమానగౌరవం లభించింది. ఎన్నో యక్షగానాలు ఉద్భవించినవి. రంగాజీ, రామభద్రాంబ, కృష్ణాజి మొదలైన కవయిత్రులు పదరచనల్లో పాల్గొన్నారు. విజయరాఘవ నాయకుడు, క్షేత్రయ, తదితర వాగ్గేయకారాగ్రగణులను పోషించటమే కాకుండా ఎన్నో చౌపదులు, ద్విపదలు, యక్షగానములు రచించాడు. ఈతని కాలినడలనే అనుసరించి మహారాష్ట్రనాయకులలో ప్రముఖులైన శాహాజీ ప్రభృతులు పదసారస్వతసేవ చేశారు.

ప్రబంధయుగంలో పదరచనలు చేయటానికి దడిచినట్లు పండితకవులు పోయిన రెండుశతాబ్దులలో వెనుదీయలేదు. ఎలకూచి బాలసరస్వతి, కంకంటి

పాపరాజు, కందుకూరి రుద్రయ్య, గోగులపాటి కూర్మనాధకవి, ఆలూరికుప్పన మొదలైన పండితకవులు జంకులేకుండా ప్రజాసాహిత్యాభివృద్ధికి ప్రౌఢయక్షగాన కృతులు రచించి పేరుతెచ్చుకున్నారు.

ఇరవైయ్యో శతాబ్ది ప్రధమదశలో గేయరచనలకు గౌరవం తగ్గింది. ఇప్పుడిప్పుడే ఆధనికుల అపారశ్రమ, అప్రతిమానప్రతిభవల్ల ప్రతిష్ఠ సుస్థిర మైనది.

మనప్రాచీన గేయ వాఙ్మయాన్నంతా కొన్నిముఖ్య శాఖలుగా విభజనలు చేయవచ్చు

అవి జానపదుల పదకవిత మతవేదాంత భక్తి రచనలు, జ్యావళీలు, స్త్రీల సారస్వతము.

జానపదుల పదకవిత : కర్షకగీతాలు, దంపుళ్ళపాటలు, బండిపాటలు, పడవపదాలు, పల్లీజనప్రేమగీతాలు, జంగంపాటలు, ఏలపదములు, చందమామ పదములు, నూరుపుళ్ళపాటలు, మొదలైనవన్నీ జానపద పదవాఙ్మయం క్రిందికే వస్తవి. స్వచ్ఛందభావము, నిరలంకారత, సమాజకవితాపటిమ, జాతీయత, రసపుష్టి వీటిలో ఉన్నతంగా నాగరికకవితలో కనుపించదు.

ఏరుమీద ఆధారపడే కర్షకులకు ఏరువాక ఒక పరవడిదినం ఆబాల గోపాలము ఆనందంలో పొంగిపోతారు. నూతన పరికరాలను సేకరించుకొని ఏరు ఎప్పుడు వస్తుందా ఎదవేద్దామని కాచుకొని స్వాతివానకు ముత్యపుచిప్పలలాగా నోరుతెరచుకొని కూర్చున్నరైతులకు ఏరు రాగానే హృదయం పొంగి సహజకవిత ఉద్భవిస్తుంది.

ఏమని :

'ఏరు రాకొచ్చింది ఏరురాకమ్మ
ఏళ్లు నదులూ పొంగి వెంబడే వచ్చాయి
నల్లమేఘాలలో నాట్యమాడింది
కొండ గుట్టలమీద కులుకులాడింది
ఇసుక నదిలో దూరి బుసలుకొట్టింది
పాడుతూ కోయిలా పరువులెత్తింది
ఆడుతూ నెమిలి అలసి పోయింది
నవ్వుతూ మాలయ్య బువ్వతిన్నాదు' అవి.

జానపదులకు కవిత కష్టాలకూ వస్తుంది, సుఖాలకు వస్తుంది. ప్రవాస దుఃఖము అనుభవిస్తూ ఉన్న పల్లెపడుచు ఏరువాకనాలనీ వస్తే బావ వచ్చి లాలిస్తాడని తొలకరినుంచే వెర్రితలపులు తలచుకుంటూ పాట పాడుకుంటుంది.

'తొలకరి ఒక మబ్బు తొంగి చూచింది
మబ్బులో ఒక మెరుపు మెరసిపోయింది
పెరటిలో ఒక జల్లు కురిసి వెలిసింది
జల్లులో నామనసు జారిపోయింది
ఏ కొమ్మ మీదనో ఎండతాకిన పిట్ట
ఏటి త్రోవలు పట్టి ఎగిరిపోయింది
ఏరువాకనాటి కేడారి దాటింది
ఎదురుచూచి గుండె చెదిరిపోయింది
పిట్ట పట్టా ముద్దు పెట్టుకున్నాయి
గోవులన్నీ ఇల్లు చేరుకున్నాయి
ఏటిగాలికి చిలుక లెగిరి పోయాయి
ఎందుకో నా ఆశ లెగిరిపోయాయి
ఏటి ఒడ్డున నేను పాటపాడేవేళ
నవ్వుతూ మా బావ పువ్వులేరేవేళ
కొంటె కోయిలపైన కూతకూసేవేళ
లేతమనసులు విచ్చి పూతపూసేవేళ
బావొచ్చి నాతోటి బాస లాడాలి
ముద్దొచ్చి నాతోటికే మురిసిపోవాలి
ఏరువాకమ్మ మా కెదురు రావాలి
తలవంచి మము చూచి దీవించి పోవాలి;

ఎంత ప్రకృతిసిద్ధ భావౌన్నత్యము! సౌకుమార్యత! ఇటువంటి పల్లీజన ప్రేమ "వెంకయ్య-చంద్రమ్మ" పాటలో ప్రదర్శిత మౌవుతుంది.

"తెలిచందమామలో తియ్యపానక ముంది
తెచ్చిపెడుదువు గాని రారో వెంకయ్య ! ?

అన్నప్పుడు చంద్రమ్మ అమాయకత్వమూ,

'రావి చెట్టెక్కేవు రాగాలు తీసేవు
రాలి పోతవు గండుకొడుకో రెంకయ్య' ?

అన్నప్పుడు ఆమె హృదయారాటము బహిర్గత మౌతున్నవి. ప్రియునితో సరససల్లాపాలకు ఏకాంతప్రదేశం అభిలషిస్తూ ఒక పల్లెపడుచు,

'సముద్రాలు దాటి పోతే
సక్కనైనా తోపు లుండై
సల్లగా ఆ చెట్టు నీడల
సరస మాడుదమా ! మామా
తాలి పోవుదమా?'

అని అంటుంది. ప్రబంధ నాయికా నాయకులకు వంద పద్యాల వర్ణనపట్టే వనం ఉంటేగాని సల్లాపాలు సాగవు. 'చల్ మోహనరంగ' పాటగూడా నవరసోపేత మైన ప్రణయగాథ పదవాఙ్మయములో ఆ పాట విని ఏ రసజ్ఞుడు ముగ్ధుడై పోడు ?

కరుణరసప్రధానా లైన కమ్మని పదాలు భిక్షుకుల నోట్లో తాండవిస్తూ ఉన్నాయి. ముష్టిమనిషి చంకన జోలెలో పసిపిల్లను వేసుకొని ఇంటింటిదగ్గిరా

"జోడుకొండల నడుమ నినుగంటి తండ్రి
ఏడువకు ఏడువకు వెర్రి అబ్బాయి
ఏడిస్తె ని న్నెవరు ఎత్తుకుంటారు
చెట్టె చుట్టాలు మరి రాళ్ళే దేవుళ్ళు"

అని పాడుకుంటూ తన జీవనాధారం చూసుకుంటుంది. అది పాడేటంత సేపూ మనకు వనాంతరాలల్లో వనితామణి సీత పసిపిల్లవాణ్ణి సముదాయించలేక పడే పాట్లు జ్ఞప్తికి వస్తాయి.

ఏదో ఒకపదం పాడుతూ పనిచేసుకోవటము పల్లెవాసులకు పరమానందం. దంపుతూ ఉంటే చూదాము.

"సువ్వని నేనొక్క పోటేసితేను
చుక్కల్లు పిక్కటిలు సూరన్న కదలు
అస్సని నేనొక్క పోటేసితేను
అస్సని నేనొక్క పోటేసితేను
ఆకసము తల్లడిలు ఆరాము గదలు"

అని పాడుతూ ఉంటారు.

పాములవాడు కాటుకు మందువేయబోతూ

'దిగుదిగు నాగన్న, దివ్యసుందరనాగ!
నిండుపున్నమనాడు పండువెన్నెల గాచు
స్వల్పగ్రహణం నాడు చందమామను మ్రింగు
దిగుదిగునాగన్న దివ్యసుందర నాగ!
దిగకున్న మంత్రాన దింపించుతానురా
నాగ దిగురా నాగన్న దిగరా నాగా దిగర'

అని పదంపాడి ఏదో మూలిక వేసి సర్పదుష్టుడైన సామాన్యజీవికి ప్రాణం పోసి పంపించేస్తాడు. ఇటువంటి జానపదసారస్వతాన్నంత సేకరించి గ్రంథస్థం చేయుటము ఆంధ్రుల కర్తవ్యము.

మతవేదాంత భక్తిరచనలు లెక్కకు మీరి మన భాషలో ఉన్నవి. మన దేశమత పరిణామ చరిత్రకు పట్టుకొమ్మలు అవే. వీరశైవమత విజృంభణ.

'శివ శివ యన మేలు తుమ్మెదా-శివ
యంటేను వినమేలు తుమ్మెదా
శరణన్న మేలె ఓ తుమ్మెదా
శ్రీకంఠుడును పువ్వు తుమ్మెదా
మూడులోకము లాయెనే తుమ్మెదా-
పరమైకాంతమును జూడు తుమ్మెదా

అనే పదం పాడేవారు భక్తులు. ఈ తుమ్మెదపదంలో అన్యాపదేశము. వ్యంగ్యత మూర్తీభవించాయి. సాధారణంగా వేదాంతపదకర్తల రచనాధోరణి ఇదేవిధంగా ఉంటుంది.

ఆంధ్రజ్ఞానులలో ప్రత్యేక వ్యక్తిత్వం కలవాడు వేమన. తత్త్వోపదేశం జానుతెనుగులో నూరిపోసి మధురకవులలో తనపేరుకు చిరస్థాయిత్వం కల్పించుకున్నాడు. ఆనాటి మతాచారాలతోను, వేదాంతమార్గంతోను విసుగు జెంది.

''జాతర జాతర జాతర సుమ్మీ
జాతరతీతుడు వేమన సుమ్మీ

వేదాతీతుడు వేమన సుమ్మీ
వేమన చెప్పిన వేదము సుమ్మీ
వేదశాస్త్రములు వాదులు సుమ్మీ
వాదుల నోళ్ళకు బూదిడు సుమ్మీ
కన్నవారు మరి చెప్పరు సుమ్మీ
చెప్పిన నెవ్వరు చేయరు సుమ్మీ
చేసినవారే సిద్ధులు సుమ్మీ
సిద్ధులమాట ప్రసిద్ధము సుమ్మీ"

అనే గేయంలో ఉద్ఘోషించాడు. బాపనయ్య, నందమయ్య వీరబ్రహ్మయోగి. మొదలైన జనసామాన్య వేదాంతుల రచనలన్నీ ఎంతో తీపిగా ఉంటాయి. ఇంత వరకూ ఈ గీతాలకు బైరాగుల నోళ్ళలోనే నివాసం.

'పంచదశి' సారాన్ని అంత చిన్న ఉయ్యేలపదంలో పెట్టిన బాపనయ్య.

'ఓం నమశ్శివాయ ఆరక్షరముల తొట్టి
ఆరంభమాయెనే ఉయ్యాలా॥
రక్షకుడు చిన్మయా తొట్టిలోపల తాను
ఊగుతూ ఉన్నాడు ఉయ్యాలా॥

అనే ఉయ్యేలపదం పూర్వసువాసినులు పాడుతూ ఉంటే ఎందుకో మన ఒళ్ళు పులకరిస్తుంది. ఇటువంటిదే

తొలుత బ్రహ్మాండంబు
తొట్టి గావించీ
నాలుగూ వేదములు
గొలుసు లమరించీ ॥జో॥అచ్యుతా॥

అనే వేదాంత ప్రతిపాదక పదము.

ఈ శ్రేణికి చేరిన తోట నరసింహదాసు-వేదాంతి రామదాసు శతకములో ఛందస్సులో క్రొత్తకల్పన చేశాడు చూడండి.

'మాయచీకటి కోనలో
                    కొన్నాళ్ళు
మార్గంబు గానరాక
యే యుపాయంబు గానక
                    జన్మముల
నెత్తితిని రామరామ !

ఆంధ్రభక్తులలో త్యాగయ్యది అగ్రతాంబూలం. వాగ్గేయకారాగ్రణి వ్రాసిన ఛందస్సులో వ్రాయకుండా రెండువేల కృతులకు పైగా రచన చేశాడు. భక్తిరస ప్రధానమైన ఈతని కృతులకు సారస్వత గౌరవం లేకపోవుట శోచనీయము. అసలు కవిగా కూడా లెక్కలోకి రాడంటారు మనవాళ్ళు. త్యాగయ్య కవి ఐనదీ కానిదీ ఈ క్రింది భాషాంతరీకరణాలు పరిశీలిస్తే తెలుస్తుంది.

"O the breath of my life !
The fruit of my choice !
Though king of kings !
O, the light of my vision !
My rose's perfume !
The flowers of my worship !
I bow to thee.

Tell me, lord, this secret
Does the babe go to the mother.
or the mother fondly run to the crying babe ?
Does the calf follow licking her tender calf ?
Does the crop follow the cloud
Or the cloud descend to tend the crop ?
Does the sweet heart follow the lover
Or the lover follow closely in her foot-steps ?
Tell me the secret, Lord,
And show me thy face.

భాషాంతరీకరణము చదివిన ఇతర సాహిత్యవేత్తలు త్యాగయ్యను మనము కవిగా పరిగణింపకపోతే రమ్యావలోకన చేయలేమని నిరసిస్తా రన్నమాట మన వాళ్ళింకా గ్రహించలేదు. ఇతనిని అరవవారికి అరణమిచ్చామే, ఎల్లా తీసుకుందామా అని సంశయిస్తున్నారా ?

జావళీలన్నీ శృంగారరస ప్రధానమైన పదసారస్వతం క్రిందికి వస్తాయి.

'రేపు వత్తువుగాని తూరుపు తెల్లవారెపోరా ఈ వేళకు' అనే జావళీ

'చెరగుమాసె ఏమి సేతురా,
దరిజేరగనైన వీలుకాదురా,

అనే జావళీ సంభోగ శృంగారాన్ని సూచిస్తున్నా వాటి కూర్పులో గొప్పదనం, భావనలో ఔచితీ కనిపిస్తవి.

పదసంయోజనంలోను, భావవైఖరిలోనూ, విన్యాసక్రమంలోనూ తనతో ఏ పదకర్త పోలలేకుండా పదకృతులు చేసిన క్షేత్రయలో నవీనులు అందుకోలేని రమ్యత కనిపిస్తుంది. శృంగార నాయికలు ఎన్నెన్ని రకాలో అన్ని రకాలపదాలు మువ్వగోపాలుని మీద రచించాడు. ఏ పదము తీసినా ఆధునిక భావచైతన్యము స్ఫురిస్తుంది.

ఉదాహృతి :

మగువ ఏకాంతమందిరము వెడలెన్.
వగకాద, మాకంచివరద ! తెల్లవారె ననుచు ॥మగువ॥

విడగారు గొజ్జంగి విరిదండ జడతోను
కడుచిక్కబడి పెనగు కంటసరితోను
నిడుదకన్నులదేరు నిడుదమబ్బులతోను
తొడరి పదయుగమున దడబడెడు నడతోను ॥మగువ॥

సొగసి సొలయని యలపు సొలపు జూపులతోను
వగవగల ఘనసారవాసనలతోను
జిగి మించు కెమ్మోవి చిగురు కెంపులతోను
నగము కుచముల విదియచందురులతోను ॥మగువ॥

తరితీపు సేయు సమసురతిబడలికతోను
జరతపావడ చెరగు జార్వైటతోను
ఇరుగడల కైదండ లిచ్చు తరుణులతోను
పరమాత్మ, మువ్వగోపాల! తెల్లవారె నను చు ॥మగువ॥

భావకవిత్వమేని ఈతనితో పుట్టినట్లుందే? స్త్రీల సారస్వతములో ఇది ఉన్నది. ఇది లేదనటానికి వీలులేదు. సర్వశాస్త్రాలు, పురాణాలు, ఉపాఖ్యానాలు, ప్రాచీనులు ప్రత్యేకంగా స్త్రీలకోసం పదాలుగా రచనచేశారు. కుసలాయకము, కుచ్చెలకథలు, సీతసురటి, గంగాగౌరీ సంవాదము, లంకాయాగం, లక్ష్మణదేవరనవ్వు-కోవెల రాయబారము, చిలుక రాయబారము-ఎన్నో పాటల పుస్తకాలు ముద్రితమై ఉన్నాయి. వీటిని గురించి వ్రాయడం ప్రత్యేకంగా పెట్టుకోవలసిన పని.

పదకర్తలకు ఉపకరించే ఛందస్సులు తరువోజ, రగడలు, ద్విపదలు, మంజరులు, ముత్యాలసరాలు, మధ్యాక్కరలు మొదలైన జాతీయచ్ఛందస్సులు. అంతమాత్రంతోటే కొన్ని కృతులు వృత్తాలుగా ఉండవనటానికి వీలులేదు.

'చింతచెట్టు చిగురు చూడు
చిన్నదాని షోకు చూడు.'

అనే పదాన్ని విభజిస్తే సుగంధివృత్త మౌతుంది. ఇవన్నీ ఇంచుమించు మాత్రాచ్ఛందస్సులు. గురుజాడ అప్పారావుగారు చేపట్టిన నాటనుండీ వీటికి మళ్ళా ప్రాణప్రతిష్ఠ కలిగింది. ఆధునికులు నూతనఛందస్సులను సృష్టిచేసి కావ్యరచన చేస్తున్నారనే అభిప్రాయం ప్రబలింది. కాని అది అపోహ. అన్నీ పూర్వకవి ప్రయుక్తాలే. ముత్యాలసరమనేపేరు క్రొత్తదైనా ఆ ఛందస్సు పూర్వసాహిత్య ప్రసిద్ధమే. గోకులపాటి కూర్మనాథకవి మృత్యుంజయ యక్షగానంలో హిమవన్న గాన్ని వర్ణిస్తూ ఇదే ఛందస్సు ఉపయోగించాడు చూడండి.

'సాలతాల తమాలతిలక ర
సాలకురవక కుందవిచికిల
మాలతీసుమ ఫలము లందున
జాలగా నమరున్.
కమ్మ కస్తురి కల్కి తావుల
గ్రమ్ము జవ్వాజి యను తుహిన జ
లమ్ము కప్పురమందు నెప్పుడు
నిమ్ములను మీరున్.

కృతియోగ్యానుసారంగా నూతన ఛందస్సులను ఆధునికులు కల్పించుకుంటే మాత్రము ఏమి మునిగిపోతుంది ?

పురాతన ఛందస్సాంప్రదాయానుసారంగా గేయకృతులను రచించినా ఈనాటి పదకర్తల మీద, వారి రచనల మీద అకారణంగా నిరసన భావము చూపిస్తున్నారు. అటువంటి వారికి ప్రాకృత కవితపట్ల ఆనాటి సాంస్కృతికుల మనుకొనేవారు అసహనము చూపించినప్పుడు జయవల్లభుడు చెప్పిన సమాధానము ఒప్పజెప్పడము సమంజసము.

> ప్రాకృత కావ్యం పఠితుం గుంఫితుం
> తథాచ కుటజప్రసూనం కుపితాం చ
> ప్రసాదయితుం అద్యాపి బహవో నజానంతి.

ప్రాకృతకావ్యం చదవటంగాని, వ్రాయటంగాని, కులజప్రసూనమాలిక కూర్చడము కుపితురాలైన ప్రియురాలిని ప్రసన్నను చేసుకోవటము మీకు తెలియవు.

ఆధునికులు :

> "The nightingale thought
> I have sung songs but never a one so gay
> For the sings of what the world be
> When the year have died away."

నవ్యసాహిత్యం పుట్టిపుట్టకముందే అర్వాచీనుల దృష్టి గేయచ్ఛందస్సుల మీదికి ప్రసరించింది. సాహిత్య ప్రపంచంమీద విప్లవంచేసి నూతన కవితారీతులు ప్రవేశ పెట్టదలచుకున్న అన్నిదేశాలలోని కవులూ తమతమ ప్రజాసారస్వతంలోని పదచ్ఛందస్సులలో కవిత్వంచెపుతారు. ఆంగ్లసారస్వతంలో పోపుడ్రైడనుల కవితాపద్ధతుల మీద తిరుగుబాటు చేసి నూతన సాంప్రదాయములను, కవితా వస్తువును కొనివచ్చిన రోమాంటిక్ కవులవిషయంలో అంతే జరిగింది, వారు మరుగు పడిపోయిన పూర్వపద చ్ఛందస్సులను ఎన్నిటినో పునరుద్ధరించారు. మన వారు చేసిన పనీ అంతే. మరుగుపడి పోవడ మంటే మహాకవులు వాటిని చేపట్టక పోవట మన్నమాట.

గేయకవితా ఛందస్సులను నవ్యకవిత్వం పుట్టకముందూ, పుట్టేరోజుల్లో యక్షగాన నాటకాల్లో విరివిగా వాడుకజేసేవారు. మిగిలిన అనేకంతో పాటు ఇవి

కొంచెం ఎక్కువగా ఉండేవిగాని, వాటికి ప్రత్యేక స్థితి లేదు. ఆ యక్షగానాలపేరు గానాలైనా, వాటిలో అన్ని గేయచ్ఛందస్సు లుండవు. క్షేత్రయ, త్యాగయ్య మొదలైన వాగ్గేయకారుల కృతులలో అన్నీ గేయచ్ఛందస్సులే అయినప్పటికీ వాటిలో కవితాగుణము తక్కువే అని ఒప్పుకొని తీరాలి. యక్షగానాల విషయం కూడా ఇంతే! అవి కేవలమూ సంగీతదృష్టితో పల్లవి, అనుపల్లవులు కల్పించి వ్రాసిన "కృతులు".

ఆకారణంచేతనే వాటిలో సంగీతసాహిత్యాల ఎక్కువతక్కువలు కనిపిస్తవి. ఈ గేయచ్ఛందస్సులకు సంగీతసాహిత్యాల సమరత్వము నవకవులవల్ల ఏర్పడ్డదే, నేటికవులగేయం పాశ్చాత్యుల గేయలక్షణానికి అనుగుణ్యంగా ఉంటున్నది. "సంగీతసాహిత్యాల సంయోగంవల్ల ఏర్పడి, ఏకభావాశ్రయమై, ఆలాపన కనుయుక్తమైన లయతో కూడిన ఆత్మకావ్యము గేయ మని వాని నిర్వచనము."

> "As a Union of Poetry and music, it (Song) may be difined as a brief Lyrical poem.... ....to which is added a melody for the purpose of singing it."

స్థూలంగా గేయాలను పాశ్చాత్యులు రెండురకాల క్రింద విభజించారు. ౧. కావ్యశిల్ప గీతాలు (Art Songs). ౨. జానపదగీతాలు (Folk Song). సుఖదుఃఖాది అనుభూతులు కలిగినప్పుడు సూటిగా పల్లీజనుల హృదయ కుహరాలను బ్రద్దలు చేసుకొని బయటపడేవి జానపదగీతాలు. సంస్కృతి రహితులైన జానపదులు వాటి కవులు. సహజమైన ఆవేశము కొన్ని కట్టుబాట్లకు లోనై కవిశిల్పిచేతిలో చిత్రణము పొందేవి రెండోరకము. ప్రజాసాహిత్యం మీద ఆకాంక్షవల్ల నేటిరచయితలు గేయచ్ఛందస్సులను విరివిగా ప్రయుక్తం చేసి రకరకాలుగా రచనలు సాగిస్తున్నారు. సింహావలోకనం చేస్తే చివరకు క్రిందివిధముగా విభజన చేయవచ్చు ననిపిస్తుంది. కథాగమన గీతికలు (Narrative Songs), గీతినాటికలు (Song-Dramas), గోగీతికలు (Pastoral Songs), జాతీయగీతాలు (National Songs), జానపదగీతాలు (Folk-Songs), సాంఘికగేయాలు (Social-Songs), ఆత్మగీతాలు (Personal Songs), ప్రేమగీతాలు (Love-Songs), ఆధ్యాత్మిక భక్తిగీతాలు (Philosophical and devotional-Songs), బాలగేయాలు (Children's Songs), ప్రచారగీతాలు (Songs of propaganda), విప్లవగీతాలు (Revolutionary Songs).

కథాగమన గీతాలు ఒకటో రెండో తప్ప లేవు. ఉన్న వాటిలో కూడా కథాకాలం నాటి సాంఘికాది పరిస్థితులకు స్థానం తక్కువ. చారిత్రాత్మకమైన పాత్రల పేర్లు వున్నంతమాత్రాన అది చారిత్రాత్మక కథాగమన గీతిక కాదు. గేయాలలో కూడా తక్కిన ఇతర కావ్యాలలో మాదిరిగానే దేశకాలపరిస్థితులు ఆచారవ్యవహారాలు ప్రతిఫలించాలి. గీతినాటికా రచనకు ప్రయత్నించే కవులు మనలో అరుదు దానికి ఎంతో వ్యుత్పత్తి కావాలి. "నాటకాంతంహి సాహిత్యమ్" అని ప్రాచీనులు నాటక విషయంలో అన్నారు. "నతత్ శ్రుతం నతత్ శిల్పం, న సా విద్యా న సా కళా, నాసౌ యోగో నతత్ కర్మయ న్నాట్యేఽస్మి న్న దృశ్యతే" అని భరతుడు కేవల నాటక విషయమే ఈ విధంగా ఉంటే దానిని ఛందోబద్ధము చేయటానికి ఇంకా ఎంత ప్రజ్ఞ కావాలో ఆలోచించండి. కేవలము ఆత్మానుభూతులను వచ్చినది వచ్చినట్లుగా అభివర్ణించాలనే మతము పోయే అంతవరకూ ఈ కావ్యపద్ధతికి (Poetic form) ముక్తి రాదు.

గ్రీసుదేశంలో మొదట కవులు తమ కష్టసుఖాలను తాము గోపాలకులై, అనుభూతి గోపాలక ప్రపంచానికి సంభవించినట్లుగా భావించి కావ్యరచనలు చేశారు. వాటినే గోగీతిక (Pastoral Songs) లనే వాళ్ళు. తరువాత తరువాత అవి అన్ని దేశాల సాహిత్యాలల్లోకి ప్రాకిపోయినవి. మన ఆధునికులూ అటువంటి రచనలు కొన్ని చేశారు. కానీ వాటికి ఇంకా ఆంగ్ల సారస్వతంలో ఉన్న గోగీతికలకు కలిగినంత ప్రత్యేకత రాలేదు. జాతీయ గీతికలు ఆధునిక సాహిత్యంలో బహుముఖముగా వికసించినవి. కానీ వాటిలో ఎక్కువ భాగము పాడుకోడానికి నిరుపయోగంగా కనిపిస్తున్నవి. విమలభావనతో, జాతీయజీవనాన్ని ఒలకబోసుకుంటూ హృదయవీధులలో విహరించే శక్తి వేళ్ళమీద లెక్కపెట్టదగ్గ ఏ కొన్నిటికో మాత్రమే ఉన్నది. వీటిలో కొన్ని సంకుచిత జాతీయభావాన్ని ప్రదర్శిస్తున్నవి. భారతదేశమంతా నాదనుకున్న జాతీయగీతికాకర్తలు తక్కువ. ఆంధ్రాభిమానం ఉండటం తప్పుకాదు. కానీ అది భారతదేశాభిమానాన్ని ధిక్కరించేదిగా ఉండకూడదు. 'భారత (ఛీ) కాదు; ఆంధ్ర మాతకు జై' అన్న "శ్రీ" గీతాన్ని చదివినప్పుడు విశాల జాతీయ దృష్టి గల పతితకు ఏయే భావా లుత్పన్నమౌతవో ఆలోచించండి.

ఆత్మగీతాలు తరువాతవి. నేటి రచయితలలో ఇవి బహుళము. కవులు కష్టసుఖాదులు వీటికి వస్తువు. స్వానుభవాలు కాబట్టి, ఆవేశ పూరితమైన హృదయము, అప్రయత్నత (Inevitability) వీనిలో పదాంకోటికి చేరాయి.

ఆధునికుల ప్రేమగీతాలు చాలా గొప్పవి. వారు స్త్రీని జగదాంబ స్వరూపి ణిగా దర్శించారు. ఆ కారణంచేత ఈ శ్రేణికి చెందిన గేయాల్లో అపవిత్రతగాని, అంగసౌష్ఠవ వర్ణనగాని కనిపించదు. ఒకవేళ వీరి దృష్టి అంగ ప్రత్యంగ వర్ణన మీదికి పోయినా అది శిల్పిదృష్టి. పరమేశ్వరిని చిత్రించే శిల్పి దేవీపీన వక్షోజాలను ఏ దివ్యదృక్కుతో, పవిత్రభావనతో వీక్షించి చిత్రిస్తాడో, వీరూ అదేరీతి.

ప్రకృతిపురుషస్వరూపులైన జగదేకమాత, లోకేశ్వరు లిద్దదే ఆధునికుల భక్తికి అధిష్ఠానదేవతలు. నిర్గుణతత్వాన్ని నిరసించరుగాని సగుణమంటే సంతోషము అధికం, బహుమూర్తులను ఆరాధించినా బ్రహ్మపదార్థం ఒకటే నని వీరి విశ్వాసం. ముముక్షుమార్గానికి భక్తులు అవలంబించే పంచభావాలలో దాస్య, వాత్సల్య, మధురాల మీద మక్కువ. వెతికే శాంతం కూడా అక్కడక్కడ కనిపించిక పోదు. ద్వైతాద్వైతాది జిజ్ఞాసలలోకి దిగరు. ఇది నేటి ఆధ్యాత్మిక భక్తిగీతాలలోని విషయము. రచనా నాస్తికమతప్రబోధం చేసే గేయాలు కూడా ఒకటిరెండు వచ్చాయి. వాటికి సమాధానాలు కూడా గేయరూపాలే ధరించాయి.

చిన్నపిల్లల విజ్ఞానానందాల కోసం ప్రస్తుతము అన్నిదేశాలల్లో కవులు గేయాలు చెప్తున్నారు. నిజంగా కవిని పట్టిచూస్తే రచనలు బాల బాలికల అనుభవాలలోను, చేష్టలలోను ముఖ్యంగా వాళ్ళభాషలోను కవి సుపరిచితుడు కావాలి. వాళ్ళ చిలిపి చేష్టలను చూచి కవి తానుగూడా పిల్లవాడై ఆనందించి అప్రయత్నంగా వాళ్ళ నోటివెంట వచ్చేభావాలకు ఉప్పొంగి, వాళ్ళ ఆటపాటలు పరిశీలించి, వాళ్ళ మానసిక తత్త్వనిరూపణ చేసికొని గాని అతడు వాళ్ళకోసం పాటలు వ్రాయగూడదు. ఆ శక్తి లేనివాళ్ళు వ్రాస్తే రసికలోకానికి రక్తి కడితే కట్టవచ్చుగాని, పిల్లలకు నిరుపయోగం. కవి పోయి చెప్పకుండానే వాళ్ళు తెలుసుకొని ఆనందించేటంత అందుబాటులో ఉండాలి. మనలో ఆ ప్రయత్నం చేసేకవులు ఇద్దరో ముగ్గురో తప్ప లేరు. వ్రాయటము మట్టుకు చాలామంది వ్రాస్తున్నారు. ఈ రచనలు చాలా భాగం గంభీరభావాలతోను, అల్లికజిగిబిగువులతోను, ఛందో రహితంగాను ఉన్నవి. వస్తువును బాలబాలికలదృష్టితో వీక్షించక పోవడమువల్ల ఏర్పడే లోపం వీటిలో ఎక్కువ. బాలగేయాలకు ప్రత్యేకంగా లయ అత్యవసరము. నడక సాధ్యమైనంతవరకు సాఫీగా ఉండటము మంచిది. లేకపోతే పిల్లలు తికమక పడతారు. ఇటువంటివి పారంపర్యంగా వచ్చేపాటలు ఆంధ్రదేశంలో అన్ని మూలలా దొరుకుతవి. వాటిలో మట్లు ఆదర్శపాత్ర మైనవి. అనుకరణ యోగ్యాలు. కొత్తమట్లు

కనిపెట్ట వద్దనికాదు. అప్పుడు కూడా పాతమట్లను దృక్పథంలో పెట్టుకోవటము మంచిది. పిల్లలకు వ్రాసే గేయాల్లో అందుకోరాని సౌందర్యోపాసన, నాస్తికత ఇత్యాది శూన్య సిద్ధాంతాల కన్నా అహింస, ధార్మికత, ప్రేమ, సత్యము నిరాడంబరత్వము, భక్తి మొదలైన విశ్వశ్రేయ విషయాలు వస్తువులుగా తీసికొని కొద్దిపాటి వ్యంగ్యంతో చిత్రించి చూపడము మంచి. ప్రకృతిలోని విచిత్రాలను చూపిస్తూ వాటితో పిల్లలకు విజ్ఞానాభివృద్ధి కలిగేటట్లు చేయటము ఈ శ్రేణికవులకు ఆశయమైతే బాగుంటుంది. వయసుమీరిన బాలబాలికలకే ఈ గేయరచనాపద్ధతుల నేర్పి వారిచేతనే ఈ రచనల పెంపొంద చేయటము సమంజసమే.

సాంఘిక గేయ రచయితలు కొద్దిమంది. వీరు ఛందోబంధాలను త్రెంచి వేయకుండా, దేశీయమైన సంఘదురాచారాలను ఎత్తిచూపుతూ మానవహృదయంలో కరుణకు స్థానం కల్పిస్తున్నారు. ఈ గీతాలు విరివిగా రావలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. ప్రస్తుత ప్రచారక గేయాలల్లో కవితావస్తువు బొత్తుగా లేనేలేదు. దీనికి మూలకారణము వ్రాసినవాళ్ళు కవులు కాకపోవటమే. ఛందోవిషయంలో అనవధానతో ఎక్కువ, ప్రచారకగేయాలు ఎంత ఛందోబద్ధంగా ఉంటే సంగీతోత్పత్తి అంతగా కలిగి, ప్రచారోద్దేశ్యము అంత గాఢంగా ప్రజాహృదయంలో నాటుకుపోవటానికి అవకాశం కలుగుతుంది. ఇటువంటి రచనలనుకూడా కవులు చేపట్టి రసవంతంగా చేస్తారని నమ్ముతున్నాను.

ఆధునిక విప్లవగీతాలు శైలి వస్తువుల రెంటిలోనూ అన్యసారస్వత వాసన పరిమళిస్తున్నవి. వీటిలో కొన్నిటికి అనుకరణలమీద అనుకరణలు బయలు దేరాయి. "అన్నమయ కోశాన్ని" అంటిపెట్టుకొన్న ఈ శ్రేణికవులకు భావి, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులమీద దృష్టి తక్కువేమో కేవల ఆదర్శాలే గాని, నిశ్చితాభిప్రాయాలు ఉన్నట్లు కనబడవు. సర్వమానవ సౌభ్రాతృత్వము, విశ్వశ్రేయస్సు కోరే ఈ కవుల రచనలు చాలాభాగం అందరికీ అందుబాటులో ఉండవలసినది పోగా సాహితీ విమర్శకులకు కూడ కొన్నిచోట్ల అవగతం కాకుండా ఉంటున్నవి. ఈ రచయితలలోని ఉత్సాహము, ఉద్రేకము, విప్లవతత్వము మెచ్చుకోదగ్గవి. వారి రచనలను గ్రహించడానికి ఇంకా కాలం పడుతుందని కొందరి సమాధానము. అలా అయితే వారు తేదలచుకున్న విప్లవంగూడా దానితోపాటు వెనక్కుపోతుందనే విషయంగూడా గ్రహించాలిస్సి ఉంటుంది.

వ్యక్తిగతంగా కాకుండా నేటి గేయసాహిత్యాన్ని పరిశీలిస్తే మంచి, చెడ్డలు రెండూ గోచరిస్తావి. ఆధునికుల అపార శ్రమవల్ల ఈ రచనలకు మిగిలిన కవితా విభాగాలతో పాటు సమాన గౌరవము, ఆదరాభిమానాలు సిద్ధించినవి. సంఖ్యలో అతిశయించినవి. ఆత్మానుభూతులను హృదయానికి నాటేటట్లు చెప్పటంలో పరా కాష్ఠ నందుకున్నవి. ఆవేశప్రాధాన్యతలో అందెవేసినవి. దేశానికి ఎంతో మేలు కలిగింది. సిద్ధహస్తుల విషయంలో అప్రయత్నత, ఆవేశము, కవితాదీక్ష, విమల భావన, జీవితవిమర్శ, పరిశీలన, సుస్పష్ట రూపకల్పన, హృదయాకర్షణశక్తి, రసోజ్జృంభణము, ఉన్నతాశయములు, స్వచ్ఛమైన సాంప్రదాయ సిద్ధి కలిగాయి. వీరు కవితా కైలాస శిఖరాలను చూపించి భావి కవులకు మార్గదర్శకులైనారు.

గేయరచనల్లో ఏర్పడ్డ లోపాలు చాలామట్టుకు దేశంలో ప్రబలిపోయిన కొన్ని నూతన సిద్ధాంతాల వల్ల కలిగినవి. కొందరి మతంలో గేయానికి ఒక విధమైన ఊపు వస్తే చాలు నని. ఊపే ప్రధానంగా పెట్టుకొని రచన చేస్తే ఊపుతో చదవటానికి వీలుంటుందేమోకాని, పాడుకోటానికి వీలులేదు. గేయానికి కావలసిన ముఖ్యలక్షణంలో ఒకటైన సంగీతానికి స్థానం తక్కువన్నమాట. వీటిని లక్షణ యుక్తమైన గేయా లనడంకన్నా ప్రత్యేకమైన మరిఒక ఊపు గేయ పద్ధతనటం చాలా బాగుంటుంది. మరికొందరు రచయితలు కేవలము మాత్రలు సరిపోయినవా, లేదా అనే చూస్తున్నారుగాని, లయమీద దృష్టి నిలపటం లేదు. ఇది ఒక నవ్యత అని వారి సిద్ధాంతము. మాత్రలు సరిపోయినా కొన్ని చోట్ల గేయం నడవదు.

సుతిమించిన భావన చేసి; దానిని స్ఫురింపచేసే సాంప్రదాయ సిద్ధమైన పరిభాష ఉపయోగింపక, పఠితను అయోమయంలో పడవేసే గేయరచనలు అపరిమితంగా వస్తున్నవి. భావించిన రూపకల్పన సాంప్రదాయానికి కట్టుబడక పోయినా సహృదయులైన రసికుల తార్కిక దృష్టికైనా పొడకట్టాలి. అలా జరగనప్పుడు వారి భావన ఒకవిధమైన ఉన్మత్తత క్రిందికి వస్తుందని క్రోషి మతము.

"All imagination beyond reason is a bit of insanity,"

భావన ఎంత విచిత్రంగానైనా చేసి అనుభవించ వచ్చు. "హృదయంతో అనుభవించగలిగినది అంతా మాటలతో వెల్లడికాదు. దాని ఛాయను వెల్లడించే శక్తికూడా మాటలకు ఉన్నదో లేదో-అందుచేతనే కవి తన అనుభవాన్ని స్ఫురింప జేసే పరిభాషను ఉపయోగిస్తాడు. ఆ పరిభాష సాంప్రదాయసిద్ధంగా ఉంటేనే

కాని, పదబంధము మాటునఉన్న భావప్రపంచములోకి వెళ్ళలేము. కవి ఆవిషయములో ఎంత శ్రద్ధాళువై ఉంటే కావ్యానికి అంత శోభ వస్తుంది." (వేదుల కల్యాణకింకిణి పీఠిక,) ఇది ముఖ్యముగా గమనింపవలసిన లోపము.

ఆధునిక కవులు కొందరు వాస్తవిక ప్రపంచానికి దూరమై పోయినారు, కల్పితలోకాల్లో దారితెలియక తారుమారై పోతున్నారు. కేవలభావనాజగత్తులలో కవులు విహరించడం వల్ల లోకజ్ఞత వాస్తవజగత్తులోని జీవిత విమర్శ (Criticism of life) అడుగంటినవి. వస్తువైవిధ్యము సన్నగిలి పోతున్నది. కవి వాస్తవజగత్తులోనివస్తువు చేపట్టి అన్యానుభూతిని యథాతథంగా ప్రదర్శించక స్వాయత్తం చేసికొని వస్తుతత్వం చెడకుండా కొన్ని నూతనాంశాలను భావించి చేర్చుకొని కావ్యరచన చేస్తాడు. వాస్తవలోకాన్ని వదిలి కేవలభావనాప్రౌఢ వీధుల్లో విహారం చేసే కవి నేల విడిచి సాముచేసే వాడన్నమాట. వివిధరకాలైన గేయాలు విరివిగా రాకపోవటము, ఉన్నవాటిలో వైవిధ్యము లేకపోవటమూ చాలా మటుకు పైకారణం వల్లనే.

నూతనత్వం మీద అత్యధికమైన ఆకాంక్ష పెట్టుకొని కొందరు గేయరచయితలు అర్థపుష్టి, అన్వయసౌలభ్యాలను నీట కలుపుతున్నారు. నూతనసృష్టి మీద దృష్టి ఉండవలసిందే. "కాని నూతనత్వ మనేది భాషానియమోల్లంఘనాల వల్ల సిద్ధించదు. కవిసమయాలు పాటిస్తే నూతనత్వానికి భంగం రాదు. అర్థపుష్టి, అన్వయ సౌలభ్యమూ మొదలైన గుణాలు లేకపోతే నూతనత్వానికి కాదుగదా కవితకే భంగం కలుగుతుంది. భావాలు నూతనంగా ఉండవచ్చు, పదసంఘటనలు క్రొత్తతీరుగా కూర్చవచ్చు. నూతనత్వం కోసం అర్థము పాడయ్యేటట్లు కూర్చటంలో నూతనత్వం లేదు."

సంప్రదాయానికి ఇమడని అన్యసారస్వతాలలోని మెలకువలను అనుకరించటంవల్ల కొన్నికొన్ని గేయాలు విచిత్రరూపాన్ని ధరించాయి. ఆ విచిత్ర రూపం కూడా ఒక సౌందర్య మనే కొందరి సమర్థన.

ఆధునిక గేయరచయితలలో ప్రత్యేకత కలిగి ప్రసిద్ధి పొందిన కొందరి రచనా పద్ధతులు, కవితా వస్తువులు, ప్రత్యేకతలు జూపించవలసిన బాధ్యత కొంత ఉన్నది. గురజాడ అప్పారాయకవి నేటి గేయకవితా పితామహుడు. నీతి, దేశభక్తి, అస్పృశ్యత, పాశ్చాత్య వ్యామోహాది సంఘసంస్కరణము వీరివస్తువు,

వీరి దేశభక్తి యావద్భారతాన్ని అనుసరించింది గాని కేవలమూ ఆంధ్రదేశాన్ని మాత్రమే అంటిపెట్టుకొని కూర్చున్నదికాదు. కొద్ది మాటలలో పెద్ద భావాన్ని ఇమడ్చడము, రచన రససిద్ధిని పొందిగాని చేయకపోవటమూ వీరి ప్రత్యేక శక్తులు. ప్రజాదరణ పొందిన ముత్యాలసరాన్ని "పార్శీగజల్ వరుస"లో మొదట యీ కవి ప్రవేశపెట్టాడు. ఎంతోకాలము పరిశ్రమ చేస్తేనేగాని వీరు గేయాల్లో వాడిన కండగల జాతీయజీవద్భాష చేత చిక్కదు. అటువంటిభాష ఉపయోగించడము వల్లనే ఆయన భావాలు సూటిగా వచ్చి హృదయానికి తాకుతవి. చిన్నపిల్లలకోసం వ్రాసిన "పూర్ణమ్మపాట" మొదలైన గేయాలలో చిక్కనైన తేటతెనుగు తొణికిస లాడుతుంది. వీరి ఎత్తుగడులు ఎంతో మనోహరంగా ఉంటవి. దేశభక్తి అంటే,

"దేశమును ప్రేమించు మన్నా
మంచి యన్నది పెంచు మన్నా
వట్టి మాటలు కట్టి పెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్"
స్వంతలాభం కొంత మానుకు
పొరుగువారికి తోడు పడవోయ్
దేశ మంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్"

అని ఆంధ్రదేశంలో ప్రథమ శంఖధ్వానం చేసిన కవితాత్త్వికుడు(Poet-Thinker) నాటకరచయిత, ప్రథమకథకుడు, విమర్శకుడు. నవ్యసాహిత్యానికి మూల పీఠము. ఒకవిధంగా రచనలు ఎక్కువభాగం వాచ్యంగా ఉండడంవల్ల కవితా శిల్పము కొంతవరకు లోపించిందేమో అని అనిపిస్తుంది. భాషావిషయంలో గురజాడ కవిని అనుకరించటానికి బసవరాజు ప్రయత్నించాడు. కానీ వారిని వీ రందలే దని ఒక మతము. ఇది విచారణీయాంశము.

బసవరాజు నిరంతరమూ గానం చేసిన కవికోకిల. పాటకోసమే తన జీవితము మీదు కట్టాడు. ఆయన జీవితాశయమే అది. కవి

"పాట పాడుతుండగ నా
ప్రాణి దాటి ఏగేనా
ప్రాణి దాటి ఏగుతుండ
పాట నోట మోగేనా" — అనే గేయంలో

ఆ విషయాన్నే సూచించాడు. "కావ్యమే జీవంగా గడపిన కవి" "కావ్యపానం చేసి కైపెక్కి" తన ఆత్మశక్తిని గుర్తించాడు.

"గుండు తా తా మంచు
కొట్టినట్టుగ నేటి
పండితులు తారెత్తి
పరుగుచ్చుకోవాలి"

అని పాండితీ బంధనాలకు స్వస్తి చెప్పే సాహసము, ఆత్మశక్తిని గుర్తించిన స్వాభిమానమూ ఈ కవికి మొదటినుంచీ పట్టుబడ్డవి. ఆత్మానుభవాలను కొద్దిపాటి కల్పనతో పాటలుగా కూర్చి పఠితలను పరవశులను చేశాడు. రసమయమైన అనేకజీవితఘట్టాలే ముఖ్యమైన వస్తువు. వైవిధ్యము, దానికితోడు దివ్యమైన కవితావేశము, సహజమైనపవిత్రభావన, ఉన్నతాశయాలు, స్వచ్ఛసంప్రదాయము నగ్నసౌందర్యము, నిరాడంబర కవితా శిల్పము, వీరి గేయకవితా సుందరికి పెట్టని అలంకారాలు. ఆమె "చిన్నతనం నుంచీ రాగిణి. భావనోద్దీపిత, గానలోల" శ్రోతలను ఒకచోట నవ్విస్తుంది, ఒకచోట నాట్యం చేయిస్తుంది. ఒకచోట కన్నీరు కార్చేటట్లు చేస్తుంది. ఒకచోట భయపెడుతుంది. చివరకు అభయమిస్తుంది. మనోహరమైర మహోన్నతభావాలను జీవద్భాషలో పెట్టి చేతి కందించే శక్తి ఈ ఒక్కడి సొమ్మే. తికమకలు తక్కువ. పఠితలను పట్టిచూడటం కాదు ఆయన పద్ధతి; హృదయానికి నాటేటట్లు చెప్పడం. "వాగీశుడే వచ్చి దాసోహ మని పాట వ్రాసి వల్లించాలి" అని ఆయన చెప్పిన ముక్కలో ఉన్న సత్యం ఈ కారణంవల్ల కలిగిందే!

గీతికారచనకు తత్త్వ, ఓఘ, ఘనాలతో పరిచితి ఆత్యవసరము. నృత్యవాద్యాలతో కలిపి పాడినప్పుడు తౌర్యత్రికసిద్ధి కలిగి ఆయన పాటల్లో పట్టు తెలుస్తుంది. బసవరాజు సతతసౌందర్యోపాసి. పిపాసి, చిన్నచిన్న వస్తువులలో చిన్మయమూర్తిని చూచి చూపించే శక్తికలవాడు. ఆశాభంగాలు కలగటంవల్ల అంతరంగవేదనాక్షుభితమై పాటగా అప్పుడప్పుడూ మోగినా దాన్నే అంటిపెట్టుకొని కూర్చోడు. కష్టసుఖాలను రెంటినీ సమదృష్టితో చూడమనే అద్వైతి. "బ్రతుకే చేదని అంటావే బ్రతికెదరేలా దేవతలూ, అని ఆయన ప్రశ్న. దుఃఖమయ ప్రపంచాన్ని సంతోష సాగరంగా మార్చుకోటానికి వీలున్నదనే భావుకుడు.

భక్తి, ప్రేమ, దానికి ఆయన సూచించిన సాధనాలు. ఆస్తికుడై ఈ కవి మిథ్యావాదులను భక్తిమార్గంలో పడిపోయి జీవితంలోని అశాశ్వతత్వాన్ని పోగొట్టు కొందని దారి చూపి ప్రబోధించాడు. జిజ్ఞాసాపూర్వముగాని జనసామాన్యమత మీాయనది. ఈ కవి ప్రేమతత్వము ధనప్రాణాదులను స్వార్థాన్ని మించి పోయింది. ప్రేమ మృదులత కూరుస్తుందని, కలుషాలు కడిగి వేస్తుందని, అహం కారాన్ని అణగద్రొక్కుతుందని ఆయన నమ్మకము.

"ఎద మెత్తనౌటకై
పొద గుందరా అంత
మదిలో అహమ్మెల్ల
వదలి పోవునురా !"

అని ఆయన ప్రవచనము.

"ప్రేమించు ప్రేమకై
ప్రేమించు ముక్తికై
ప్రేమించు ప్రేమకై"

అన్న మాటలలోని మొదటి స్వార్థపరత్వమూ, చివరకు తద్రాహిత్యము కవిప్రేమ సిద్ధాంత పరిణామాన్ని సూచిస్తున్నది.

ఆయన వ్రాసిన కొన్ని జాతీయగీతాలు, దేశీయగీతాలు కూడా ఉన్నవి. ఆయన దేశభక్తి గురుజాడ కవివలే యావద్భారతానికి సంబంధించింది. రాజకీయంలో కాంగ్రెసువాది. విశ్వశ్రేయస్సు ఆకాంక్షించి, విమల భావాలు దేశానికి నూరిపోసి ప్రజాదరాన్ని పొందుతూ ఉన్న ఈ కవి కలకాలం నిలిచేవాడు.

జానపదభాషను, వాతావరణాన్ని అవలంబంగా పెట్టుకొని ఆత్మానుభవాలను జానపదగీతాలుగా కృషిచేసిన అమరకవి నండూరి. జానపదాల వ్యవహారంలో ఉన్న కొంచెం భాషతోనే కమనీయ కావ్యమే కాదుకదా, శాస్త్రార్థాలు గూడా అందుకోలేని అతిలోకవిషయాలను రూపించా డీ కవి. ఇదే ఆయన ఉపజ్ఞ. కవులము కావా లని ఉబలాటపడేవారికి మొదట వీరి మార్గం కొంత సులభంగా కనిపించినా అను భవంలో పునీతమైన సంస్కారం వినా దుస్సాధంగా తేలిపోయింది. వీరి యెంకిపాటలలో కమ్మని సంగీతము, సహజమైన పవిత్రభావనలు, ఉక్తి సౌలభ్యము,

ముఖ్యంగా హృదయాకర్షణశక్తి కనిపిస్తవి. ఈ పద్ధతికి వీరే మార్గదర్శకులు. ఎంతమంది ఆ విధంగా వ్రాయటానికి ప్రయత్నాలు చేసినా ఏదో లోపం కలుగుతునే ఉన్నది.

గేయకవితాలోకంలో పాత్రసృష్టి చేసిన కవులు బహుకొద్ది మంది. నండూరి యెంకి కవికీ, తనకూ విశిష్టత గణించింది. "పూలమొక్కల నీటి జాలు గని నిలుసుండి పూలన్ని నీపాటే ఆలించె" అనే సునిశిత భావనాబలము, "అందాలు చూచుకోటానికి అద్దాలెందుకు ? కనుపాపలు లేవా" అనే సహజరసికత 'యెనక జల్మంలోన ఎవరమో ?', అని నాయుడు బావ అన్నప్పటికి ముగ్ధత్వమూ, "ముందు మనకేజల్మ ముందోలె" అన్నప్పటి అమాయకత్వము. ఎన్నాళ్ళో మనకోలె ఈ సుకము" అన్నప్పటి బేలతనము, కడుపులో చెయ్యేసి కలచే ఆమె చేష్టలు, మాటలూ రసికలోకం ఎలా మరచిపోవటం ! అలోచించినకొద్దీ యెంకిలో ఎన్నో అందాలు బయటపడతవి. ఆ పాత్ర తరిగిపోని అమృతకలశము. ఎన్ని 'గాలిదుమారాలు' రేగినా, ఏ కోశానా చెక్కు చెదరలేదు. చెదరదు, చెదరబోదు.

కావ్యశిల్పగీతికలను జానపద గీతాలను రెంటినీ కవితాదృష్టితో వీక్షించి, సమానగౌరవం చూపి గేయరచన చేసినకవి అడివి బాపిరాజు. నండూరి అభివ యించిన జానపదజీవితంతో సారూప్యాన్ని పొంది పదకవితలు పలికాడు. గ్రామీ ణుల వివిధ జీవిత సంఘట్టనలను, వారి పదఫణితిలో పాడుకున్నాడు. నాయుడు బావ, ఎంకి, కవిలోని భావపారిశుద్ధ్యరసావేశాలలో ప్రభవించారు. బాపిరాజు స్వయంగా జానపదుడై సూటిగా బోళాతనంతో పఠితను తన వశంచేసుకుంటాడు. ఇక్కడ బుద్ధిని రంజింపజేసే తళుకుబెళుకులకు, నగిషీలకూ స్థానం లేదు. పుష్కల మైన జీవిత సుఖదుఃఖాలలో నుంచీ పొంగి పొరలే హృదయావేశం ఒక్కటే స్ఫురిస్తుంది

ఈయన పల్లెపట్టుదాటి కావ్యాల్లోనికి అధిగమించి ఒక స్వాప్నికతత్వాన్ని మనగేయ సారస్వత్వంలోకి పట్టుకొచ్చారు. ఆమెను "శశికళ"గా రూపించి మన ఎదుట ప్రదర్శిస్తున్నాడు–శశికళ సౌందర్య బాలిక. ఆమెను గురించి కవే అన్నమాట లివి. "శశికళ" నాకు సత్యం. ఆమె నాప్రేమ నిధానము. నా గొంతుకలో బయలు దేరిన సన్నని రాగంగానీ, నాకళ్ళలో ప్రతిఫలించిన రంగుల చిత్రం గానీ ఆమె విలాసాలే. అమె నాకు తోచని క్షణాలు భయంకర ప్రదర్శనమే. కాలగర్భంలో

నుంచి బయలుదేరిన మరుక్షణం నుండీ నా చేయి ఆమె, ఆమె చేయి నేనూ పట్టుకొని నడుస్తున్నాము. ఈ యాత్ర కాలాన్ని దాటిన ఆనందం వరకూ, ఆనందమే మాకు దారి. ఆనందమే గమ్యము". వస్తుత ? దివ్యశిల్పి కావటంచేత ఆయన శశికళ పాటలలో రేఖాకార చిత్రలేఖనపు నగిషీలు కనబడుతవి, ప్రతివాక్యమూ చిన్న బొమ్మలా నయనాలయందు నర్తిస్తుంది. ఇది ఆయన ప్రత్యేకత. దివ్యపథాలల్లో ఈ కవితో యాత్రలు సలిపే పవిత్ర నవ్యసాహితీమూర్తులు, Dante, Rosette మొదలైన పాశ్చాత్యరచయితలు కవికి ఈసౌందర్య బాలికా సాహచర్యంలో తోడు.

సంగీతానికి మొదట సుశరీరం, సుశబ్దం కావాలి. "కవిత్వమునకు కావలసినది భావనాస్ఫోరకత్వము (Suggestiveness), హృదయాకర్షణము, రసోజ్జ్వలంభణము ఛందోబద్ధమగు మనోహర శబ్దసముదాయము". (కృష్ణశాస్త్రి—ఏకాంతసేవ పీఠిక) చక్కని పదములు, కూర్పు అంటే కృష్ణశాస్త్రికి అపరిమితానందము. అది ఆయనలోని ఉపజ్ఞ. ఏగేయమైనా తీర్చి దిద్దిన శిల్పఖండంలా, చెక్కుచెదరని దివ్యవనితలా మోహపెడుతుంది. కవితాశిల్ప ప్రాధాన్యమైన గేయాలకు ఈయనను చెప్పి చెప్పాలి. శబ్దప్రయోగము పట్టు ననుసరించి ఉంటుంది. కూర్పులో ఒక తడవ "పైదలి కుత్తుకలోని వల్లకీ కూతలు" ఇంకోమారు "ప్రళయకాల మహోగ్ర భయదజీమూతోరుగళ ఘోరగంభీరఘేళఘేశార్భటులు" వినిపిస్తవి. "కవి తన హృదయావేశాలకు బద్ధసభ్యుడు కావాలే గాని ప్రజాభికాంక్షకు పట్టుపడ కూడ దనే" రవీంద్రుని మతంలో వాడుగా కనిపిస్తా డీ కవి.

"Poets have to be true to their best moments and not to the people's requirements".

ఈ విషయమే కృష్ణశాస్త్రి 'స్వేచ్ఛ' అనే గేయంలో

"నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు
నా ఇచ్ఛయే గాక నాకేటి వెరపు"

అని వాడుకున్నాడు.

ప్రేయసిపైపు హృదయం ప్రవహిస్తే ప్రేమగీతాలు, పరమేశ్వరుని పాద సాన్నిధ్యంలో భక్తిగీతాలు, భారతజనయిత్రి సుందర ప్రశాంతరూపం కళ్ళకు కట్టినప్పుడు జాతీయగీతాలు. 'ఆకలి' వేసినప్పుడు అ కవి పాటలు అల్లుకున్నాడు,

పాడాడు, కురిశాడు, అందించాడు, ఉన్నట్లుండి ఉబుసు పోనప్పుడు ఊహాగీతికలు (Fancy Songs) వ్రాశాడు. ఆయనలో కలిగిన అన్ని సంస్కారాలను అన్ని రకాల గీతాలల్లో పెట్టాడు.

ప్రేమ గీతాలల్లో ఎక్కువగా ఉన్మాదావస్థ కనిపిస్తుంది. "అతడు నావలెనే ఉన్మత్త భావశాలి" అనే వాక్యంలో ఈ విషయం ఆయననే చెప్పుకున్నాడు. పిచ్చివాడు, ప్రియుడు, కవిభావనాసౌధం మీద ఒకే అందస్థులో ఉంటారు.

"The lunatic, the lover and the poet and all in imagination compact" అనే సిద్ధాంతానికి కృష్ణశాస్త్రి ప్రియుడుగాను, కవిగాను, స్వచ్ఛమైన తార్కాణము.

ఏకేశ్వరోపాసకుడైన ఈ కవి భగవంతుని పాదసన్నిధికి ప్రేయసిగాను, ప్రియపుత్రుడుగాను, ప్రియసేవకుడుగానూ చేరుకుంటాడు. మధుర, వాత్సల్య, దాస్యభావాలు స్థూలదృష్టికి భక్తిగేయాలల్లో కనిపిస్తవి. అహం గ్రహసంబంధమైన ఉపాసన (ఆత్మచింతనకు సంబంధించినది) ఆయన భక్తి గీతాలల్లో బలవత్తరము. తన్మూలంగా కవి దీనతాభావాన్ని పొంది, దీనుడ నని, పాపినని ప్రభువుముందు పలవిస్తాడు. బ్రహ్మసమాజమతప్రభావము దీనికి మూలకారణము కావచ్చు.

జాతీయగీతాలు కమ్మనిసంగీతంతో కళ కళ లాడుతుంటవి. ఆకలిపాటల అంతరార్థ మేమిటో ఇంకా ఆలోచించవలసిన విషయము. ఇవి విప్లవగీతాలు కావేమో! 'ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభ గరీయసి' కాని వ్యుత్పత్తి ఎంత ఎక్కువగా ఉంటే ప్రతిభ అంత రాణిస్తుంది. ప్రతిభకు అంద ఆకాశము. వ్యుత్పత్తివల్ల భావనకు బలం కలుగుతుంది. అది లేని కవిలో వస్తువైవిధ్యము తక్కువ. ఈ రెంటికిని ఏకముఖం జేసుకొని గేయరచనలు చేసిన కవి విశ్వనాథ. పాడాలనే ప్రకామ్యస్థితి (Power of irresistable will) పొందినవారు ఈశత్వము (Power of Commanding) వశిత్వము (power of subjugating) ఆయన కేనాడో హస్తగతమైనవి. వీరి కల్పనాశిల్పము, భావనాబలము, రససిద్ధి ఏపట్టులో చూచినా గోచరిస్తుంది. 'శృంగారవీధి' లోని 'స్నానసుందరి' లో ఆయన చెప్పుకున్న ఊరక రసాత్మతనే స్రవియించిపోదు, అన్న మాటలలో అతిశయోక్తి లేదు. రసానికి ఆయన ప్రాణము. ఆయన జీవితమే ఒక రసమయమైన కావ్యము. అది 'వేయి పడగలలో' వెల్లివిరిసినది.

జాతీయతలోని జిగి మెరపులు చూస్తే వీరిలోనే చూడాలి. నవ్యత్వానికి ఎంత నవసిపోతాడో సంప్రదాయానికి అంత చక్కగా లోబడతాడు.

ఒక సామాన్య భావాన్ని చిత్రించడానికి ఈకవి దృగ్గోచరరూపం గల ఒక సంజ్ఞ (Symbol) ను మొదట్లో ఏరుకుంటాడు. ఇది ప్రతికవికీ సహజమే. ఈయన ప్రత్యేకత అక్కడ బయలుదేరుతుంది. ఆ సంజ్ఞ ఎప్పుడైతే చేత చిక్కుతుందో. అప్పు డాసామాన్యభావాన్ని మఱచిపోయి ఆ రూపాన్ని మనస్సులో ధారణచేసి దాని సౌందర్యాన్ని మనస్సులో సూక్ష్మపరిశీలన (Minute Analysis) చేసి వేయువిధాలుగా నగిషీలు దిద్ది సర్వాంగసుందరమైన చిత్రాన్ని బయట పెడతాడు. సామాన్యుల చేతిలో సాఫీగా ఒక గేయంకింద మారే కిన్నెర ఆయనలోని ఈ ఆత్మాంశ (Personality) వల్ల పుట్టి, నడకలునడిచి, నాట్యం చేసి, సముద్రుడంత వాణ్ణి తనకోసం నవసిపోయేటట్లు చేసి, గోదావరి తల్లి గర్భంలో తలదాచు కుంటుంది. కోకిలమ్మ విషయమూ ఇంతే. పటుత్వంగల పెంపకంలో ఈయన ప్రజ్ఞ కెన్నెర సాని రూపచిత్రణము రససౌందర్యాల రమణీయతను పొంది కవి సృష్టి శిల్పానికి విశిష్టత చేకూర్చింది. కిన్నెర 'ఉద్విగ్న హృదయ' పతివ్రత, అత్తపోరు పడలేక అడవులపాలై కరిగి నీరై, వాగై ప్రవహిస్తుంది. ఆవేశహృదయంతో ఆమె చేసిన తప్పిదానికి పశ్చాత్తాప పడుతుంది. ఇంట్లోనుంచి ఏ కారణంచేత యువతులు లేచి వచ్చినా వాళ్ళవిషయం మన్ననకోసం ఇతరుల చెవిలో వేస్తుంటారు కొంత మంది. వాళ్ళే గాలిపిల్లలు మబ్బుకన్నెలు. పతివ్రతలని కూడా భావించకుండా, గొడ్డు ఈనిందంటే గాట కట్టేయమనే రకం వాళ్ళు, వాళ్ళను పొందాలనే వాంఛతో ప్రయత్నాలను చేసే ప్రజలున్నారు. లోకంలో అటువంటివాడే సముద్రుడు. ఇంట్లో నుంచి ఈ కారణంవల్ల లేచివచ్చిన వాళ్ళను పొగిడేవాళ్ళూ లోకంలో ఉన్నారు. వారే భూదేవత, పికిలిపిట్ట, కోకిల ప్రభృతులు. వారిని ఆదరించే గోదావరీతల్లి లాంటి పుణ్యవనితలుకూడా ఉన్నారు ప్రపంచంలో ఇదంతా విశ్వనాథ కెన్నెరసాని పాటలో చూపించిన మనస్తత్వము (Psychology). అన్య సంపర్కాలను ఆహ్వానించి, జాతిధర్మాన్ని నాశనం చేసేవారిని దేశం ఎంతోకాలం ఆదరించదనే "కోకిలమ్మ పెండ్లిలోని సామాన్య సిద్ధాంతమైనట్లు స్ఫురిస్తుంది.

వీరిభాష రసస్ఫూర్తిని బట్టి రకరకాలుగా పర్వెత్తుతుంది. గేయరచనలలో వీరు అనేక కొత్తనడకల చూపించారు. అక్కడక్కడా శ్రుతికటువైన శబ్దప్రయోగం కనిపిస్తుంది. దానికి ప్రత్యేకమైన కారణాలేమన్నా ఉన్నవేమో !

ఈ యుగంలో యెంకిపాటలువంటిపాటలు వస్తే రావచ్చు కాని కిన్నెరసాని వంటి పాటలు మాత్రం, ఆకలి నోటతప్ప, రావని సామూఢవిశ్వాసం. నిరీక్షిద్దాము.

"సాహిత్యప్రపంచంలో కొత్తరీతులకు దోవ చూపించినది, కొత్తరుచులు ఎరిగించింది, కవితాకన్యను మనోహరంగా, చూడ ముచ్చటగా అలంకరించింది, ఆమెకు క్రొత్తపోకడలు నేర్పింది, నవకవు లందరిలోకీ తొలుదొల్త శ్రీ శివశంకర శాస్త్రి గారే. ఆయన చూపని సులభోపాయం లేదు. కావ్యరచనా విధానానికి, అవుననక పోయినా అనుకరించని ఆధునికులూ లేరు" (రామకృష్ణశాస్త్రి–కృష్ణాపత్రిక) శివశంకర శాస్త్రి సంప్రదాయం చెడకుండా గేయకవితా కన్యకు ఎన్నో నూతనాలంకారాలు చేశాడు. అంతకుముందు తెలుగుకవికి తెలియని గీతికావ్యగతాలు, గీతినాట్యాలు, గీతికాసంవాదాలు, గేయనాటికలు తెనుగులోకి తెచ్చాడు. ఈ రచనా విధానమే ఆయన విశిష్టత. నడకల్లో నానారూపాలు చూపించి ప్రసన్నతాగుణానికి తిరిగి ప్రాణం పోసి గేయరచనలు చేస్తా డీ కవి.

ప్రణయచిహ్నంగా ప్రేయసీదత్తమై వాడిపోయిన వకుళమాలిక ముఖతః ప్రేయసీ హృదయాంతరాళలను విప్పి చెప్పి, ఆత్మపరిశీలన చేసుకొని చూపించాడు. అద్భుతసంఘట్టనలు, అమరగానము అన్నిమూలలా కావ్యంలో కళ్ళకు కనిపిస్తవి. చెవికి వినబడుతుంది. భావనాప్రపంచం నిజ మని నమ్మించే శక్తి ఈయనలో పరసీమ నందుకున్నది. ప్రణయతత్త్వము ఈ కవి గేయనాటికల్లో గంభీరమై దివ్య లోకాలవైపు దృష్టిని త్రిప్పుతుంది. ప్రేమ నగరానికి దారి కష్టమైన దని అదిసాధన వల్లగాని సుగమము కాదని ఆయన సూచించే భావము.

"ప్రేమ నగరకే రాహ కఠిన హై  
ప్రేయసి కయి నే నేయది యైనన్  
సంతోషముతో సలుపగ నేర్తున్."

అని పాడుకున్నాడు. అంత పండితుడైనా అనవసరంగా శబ్దకాఠిన్యతకు లొంగడు. ఈ గుణము పండితకవు లైన వాళ్ళల్లో ఉండటం అరుదు. శ్రుతిపుటాలకు చిన్నెలు దిద్దే గేయాన్ని రంగస్థలం మీదికి పరిపూర్ణస్వరూపం రప్పించటానికి ప్రయత్నించేసిన ప్రథమకవి శివశంకర శాస్త్రి.

చిన్న పిల్లలకు చక్కని పాటలు వ్రాయడంలో దీక్షితులదే ఉపజ్ఞ. చక్కని జాతీయభాష, శైలీ సౌలభ్యము, చక్కనిమెట్లు, గానయోగ్యత, నాతిగంభీరభావనలు, పరిశీలన, వాతావరణము వీరిపిల్లల పాటలలో ప్రస్ఫుట మౌతవి. ఉత్తమ శ్రేణికి చెందే కావ్యశిల్ప గేయరచనలు కూడా కొద్దిగా చేశారు. మనస్సు సంతోషంతో గిలిగింతలు కొట్టించే వింతవింతభావాలమీదికి వెళుతుంది. ఈ 'కథక చక్రవర్తి' మనస్సు.

నవ్యగేయరచనలలో రెండు పద్ధతు లేర్పడ్డవి. ఒకటి భావకవుల రచనా పద్ధతి. రెండు క్రాంతిగీత రచనాపద్ధతి. ఇందులో మొదటిపద్ధతిని అందరికీ అందుబాటులో ఉండకుండా సుదూరం పొడిగించినకవి మల్లవరపు. కమ్మని పదముల కూర్పంటే ఈకవికి చాలాఇష్టం. కొన్నిచోట్ల అర్థపుష్టి ఎంతవరకున్నదనే విషయం ఆలోచనీయాంశము. సాంప్రదాయానికి ఇమడని అన్యసాహిత్య రచనాపద్ధతులేవో ప్రవేశపెట్టటానికి ప్రయత్నం చేయటంవల్ల కొన్నిచోట్ల అన్వయకాఠిన్యము గోచరిస్తుంది. మాత్రలు యతులు పాటించి లయను పాటించక పోవటమువల్ల ఏర్పడే కుంటుతన మున్నది కొన్నిచోట్ల.

మల్లవరపు నిజంగా కవితాహృదయం గల 'ఒక మహాగర్వి కవికుమారుడు.' మధుకీల, కళ్యాణకింకిణి వీరికావ్యాలు. సంగీతానికి స్థానమిచ్చి వ్రాసినప్రేమగీతాలు రెంటిలోనూ కనిపిస్తవి. ప్రేమోజ్జ్వలత, ఉన్మత్తత, 'ఉద్రేకతాండవము' గోచరిస్తుంటవి. మొదటిరచనలో కృష్ణశాస్త్రి, నాయని, బసవరాజుల ప్రోద్బలము "చాల ఉత్సాహం, చాల అపరిపక్వత, చాలా కావ్యదోషాలు ఉన్నవి. వాటిలోనే అంతర్లీనమై ఆశలు గొల్పుతూ ఒక కవితాకాంతి గూడా మెరుస్తూ ఉన్నది." రెండవ రచనలో ఈ లోపాలు కొన్నిలోపించి "స్వకీయమూ, పరిపూర్ణమూ అయిన వ్యక్తిత్వం" ప్రదర్శించాడు. ఆనాటినుండీ వీరికి దేశంలో అనుయాయు లేర్పడినారు. వీరిరచనలో కొన్ని అత్యుత్తమశ్రేణికి చెందినవ వని ఒప్పుకొని తీరాలి.

నూతన గేయరచనోద్యమాన్ని బయలుదేరదీసి దానికి నాయకుడైనవాడు శ్రీ. శ్రీ. 'అల్లకల్లోమైన సుడిగుండంలా' ఈకవి 'ఒక్కడే అనేకమంది యువకులను తనలోనికి లాక్కుంటున్నాడు. 'ఈ సుడిగుండంలో పడి' వ్యక్తిత్వం గల యువక హృదయాలు 'ఉక్కిరిబిక్కిరై' పోతున్నవి.

కాని ఉద్యమనాయకు డెప్పుడూ ఋజుమార్గంలోనే ఉంటాడు. తన పూర్వులకు శైలీసౌలభ్యంలో సన్నిహితుడుగా ఉంటాడు. వారి ననుసరించే వారు చిత్రచిత్రాలు చేసి చివరకు ఒకప్పుడు అయోమయంలో పడిపోవటానికి అవకాశం కలుగుతుంది.

విశ్వశ్రేయస్సు కోరి, పరిస్థితులు మారటానికి విప్లవము సాధనగా నమ్మి దేశాన్ని ప్రబోధిస్తూ ప్రపంచంలో ఘోరహత్యలు జరిగినవీ, జరుగుతున్నవీ, కళ్ళకు కట్టేటట్లు ఆవేశపూరిత హృదయంలో కవిత్వం చెప్పాడు. శ్రీ. శ్రీ.

'అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
జగమంతా బలివితర్ది'

నరజాతికి పరివర్తన–అనేవి ఆయననిశ్చయ లక్ష్యాలు. ఇంతఘాటైన కవితావేశంగల కవి తెలుగునేలమీద ఎన్నడూ పుట్టలేదనే చెప్పాలి.

'ఉండాలోయ్ కవితావేశం
కావాలోయ్ రసనిర్దేశం
దొరకదుటోయ్ శోభావేశం
కళ్ళుంటే చూసే
వాక్కుంటే వ్రాసే
ప్రపంచ మొక పద్మవ్యూహం
కవిత్వ మొక తీరనిదాహం–

అని అంటాడీ కవి.

నూతన కవితావస్తువు, రచనాపద్ధతి కవితావేశం ప్రవేశపెట్టుటకు వీరి ప్రత్యేకత వీరిరచనామార్గాన్ని అనుసరించే వారిలో వీరి సౌలభ్యము, తత్వనిర్దేశము కేవల సంజ్ఞాపరిపోషకదృష్టిలోనూ, అతిశయ వ్యంగ్యసిద్ధిలోను, అతివేలమైన ఆవేశంలోనూ మాటుమణిగి పోతున్నవి.

ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, రాయప్రోలు సుబ్బారావు. తురగా వెంకట్రామయ్య, వేదుల సత్యనారాయణశాస్త్రి, బొడ్డు బాపిరాజు, దువ్వూరి రామి

రెడ్డి, రామచంద్ర అప్పారావు, కొడాలి సుబ్బారావు, కొడాలి ఆంజనేయులు, శివరామం, అత్తిలి సూర్యనారాయణమూర్తి, ఉమామహేశ్, కుందుర్తి నరసింహారావు, కృత్తివాసతీర్థులు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పిలకా గణపతిశాస్త్రి, పురిపండ అప్పలస్వామి, శ్రీరంగం నారాయణబాబు, రుక్మిణీనాథశాస్త్రి, జనమంచి కామేశ్వరరావు, బేకుమళ్ళ కామేశ్వరరావు, కందుకూరు రామభద్రరావు, రజనీకాంతారావు, దేశిరాజు కృష్ణశర్మ, చిరంజీవి ప్రభృతులు వివిధరకాలుగా గేయాలు వ్రాసి పేరు పొందారు, పొందుతున్నారు, పొందుతారు.

ఆధునికులు గేయరచనలమీద అభిమానోత్సాహాలను ఇనుమడించి రసవంతమైన రచనలు చేస్తారని నమ్ముతూ చెప్పవలసినది క్లుప్తంగా ప్రతిపాదించాననే తృప్తితో విరమిస్తున్నాను.

—వావిలాల సోమయాజులు.

—o—

* ప్రతిభ, జూలై 1940, అక్టోబరు 1941.

# గ్రంథ విమర్శనము

విమర్శనమందు పాశ్చాత్యులు పూనికతో పనిచేసి యున్నారు. ప్రత్యేకముగ నొక్కొక్క గ్రంథము నెత్తి విమర్శించుటయేగాక కవులను గూర్చియు సాహిత్యమును గూర్చియు విపులముగఁ జర్చించి యున్నారు. ఇట్టి చర్చలు మన తెలుగు పండితులకు తెలియుట యావశ్యకము. మన యాంధ్రసాహిత్యము సనాతనముగ గీర్వాణ సాహిత్యమార్గముల ననుసరించినదయ్యు నిప్పుడిప్పుడు, అనగా నాంగ్లసాహిత్య సంపర్కము మనకు గల్గిన యేబది సంవత్సరములనుండి క్రొత్తదారులను త్రొక్క మొదలు పెట్టినది. పదునారు పదునేడు శతాబ్దములందు మన యాంధ్రదేశమున ప్రబంధము లెంత ప్రబలియుండెనో ప్రస్తుతకాలమున నవలలును, నాటకములును నంత ప్రబలి యున్నవి. కాలానుగుణ్యముగ గ్రంథములను వ్రాసియు, నందు భావిసూచనలఁ గనబరచియు, మన మాంధ్రసాహిత్యము నుద్ధరింపవలసి యున్నది. ఇట్టిపని తగినట్లు జరుగుటకు మనము సాహిత్య ధర్మములను, విమర్శనా విధులను గుర్తెరుగుట యావశ్యకము. ఇందుకు పాశ్చాత్యమార్గములను తెలిసికొనుట కొంత సహకారి యగును. ఈ జ్ఞానము మన కెట్లు లభించుననుట విచారణీయ మగు నొక విషయము.

ఈ జ్ఞానము మనకు కలుగవలె నన్నచో నాంగ్లమందు నిబంధన గ్రంథము (Books on criticism) లాంధ్రీకరింపవలెను. అట్లాంధ్రీకరింపబడిన గ్రంథములందలి సూత్రముల ననుసరించి తెలుగుగ్రంథముల విమర్శించి, యుపన్యాసములు వ్రాయవలెను. ఈ మార్గములను ప్రవర్తింప చేయుటకు ఆంధ్రభాషాభిమానులగు నాంగ్లసాహిత్యకోవిదులు పనిబూనవలసి యున్నది. పాశ్చాత్య నిబంధనలను దెలిసికొని వానిని తెలుగు గ్రంథములకు పట్టించు నుద్దేశముతో తెలుగు గ్రంథములు చదువవలెను. ఇది చెప్పుట సులభమే కాని చేసి చూపుట కష్టము.

ఇందుకుతగినంత యోపికయు, పట్టుదలయు, నుత్సాహమును గావలయును. ఆంధ్రమం దభిరుచియు, గీర్వాణమునందు గొంత ప్రవేశమును ముఖ్యము. ఇట్టి సాధనసంపత్తి గల యాంగ్లకోవిదులు మన యాంధ్రదేశమున గలరు గాని వా రిట్టి శ్రమ కోర్తురా యని శంకింపవలసి యున్నది. ఇట్టి విషయములందు దేశాభిమానము ముఖ్యముగఁ బ్రోత్సహించినను, వారు శ్రమపడి వ్రాయు నుపన్యాసములను శ్రద్ధతో

విని, యందలి నూతనాంశములను గ్రహింప నుత్సుకులైనవారు గలిగనగాని వా రిట్లు శ్రమపడ నొల్ల రని యూహ. వారి నట్లు ప్రోత్సహింపవలె నన్నచో నాంధ్రగ్రంథములను పాశ్చాత్య మార్గముల వ్రాయ నెంచ వా రొకమండలిగా నేర్పడి విద్యాధికుల వలన సాహిత్య వీధులం గూర్చి యుపన్యాసములు వినుటకు తగిన యేర్పాటులు చేయవలెను.

పాశ్చాత్య సాహిత్యమార్గములలో మనము ముఖ్యముగా నేర్చుకొన దగినవి విమర్శనావిధులు. విమర్శ మన నేమి? విమర్శకునికి గ్రంథకర్తకును గల సంబంధ మేమి? విమర్శనావిధు లెట్టివి! అను నిట్టి విషయము లీ సందర్భమున విచారణీయములు.

విమర్శనమున కొక లక్ష్యము సాహిత్యము గాన విమర్శనమును గూర్చి ముచ్చటించునపుడు సాహిత్యతత్త్వ మొకకొంత దెలుపవలసి యున్నది. ఎట్టి గ్రంథసమామ్నాయము సాహిత్య మనదగును? ఎట్టి గ్రంథము లుద్గ్రంథములు? అనునట్టిచర్చ సాహిత్యతత్త్వమును కొంత తెలియజేయును. సారస్వతము, సాహిత్యము, వాఙ్మయము అను నీ పదము లాంగ్లమున Literature అనుపదమునకు తుల్యములై యుండును. ఆంధ్రమునం దీపదములకు నిర్వచనము చెప్పుట యెంత కష్టమో ఆంగ్లమున Literature అనుపదమునకు నిర్వచనము చెప్పుటయు నంత కష్టమే యైనను దాని స్వరూపమును వర్ణించు సూత్రములు కొన్ని యాంగ్లమున గలవు. ఆ సూత్రములందు కొన్ని కేవల భావములనే ప్రధానముగాఁ జెప్పును; మరి కొన్ని శైలియే ప్రధానముగాను నెంచును. తదితరములు భావములును శైలియు గూడ ముఖ్యముగ నెన్నును. మొత్తముపైని యీ మూడవ తరగతి సూత్రములే యాంగ్లమందు సర్వపండితసమాదరణీయములై యున్నవి. వానిలో గొన్నిటి నిందు బేర్కొనెదను.

(a) భావప్రధానములు :

(1) The broadest conception of Literature makes it include all record in language or the *valuable thought of man.*

(2) Literary quality depends upon thought appealing to the general human mind or heart seeking the ends of inspiration and delight, having aesthetic or ideal purposes. Form is merely incidental.

(3) Literature is the record of best thoughts.

(b) శబ్దప్రధానములు :

1. To entitle anything to be classed as Literature it must be so written that, apart from the meaning conveyed, its mere style shall be such as to give pleasure.

2. By Literature we mean the written thoughts and feelings of men and women arranged in such a way that shall give pleasure to the reader.

(c) ఉభయప్రధానములు :-

(1) Literature consists of all the books where moral truth and human passion are touched with a certain largeness, sanity and attraction of form.

(2) Literature consists of a whole body of classics, in the true sense of the word and a classic is an author who has enriched the human mind, who has really added to its treasure, who has got it to take a step farther; who has discovered some unequivocal moral truth or penetrated to some eternal passion in that heart of man where it seemed as though all were known and explored; who has produced his thought or his observation or his invention under some form, no matter what, so it be large, acute, and reasonable sane and beautiful in itself; who has spoken to all in a style of his own, yet a style which finds itself the style of everybody -- in a style that is at once new and antique and is the contemporary of all ages.

Literature అనుపదమున కాంగ్లమున నే నెరిగినంత వరకు గల నిర్వచనములలో నీపైచెప్పినవానిలో కడపటిది మిక్కిలి ప్రశస్తమైనది. ఇది యాంగ్లలాక్షణికులు ప్రశస్తమైన దని చెప్పి యొప్పుకొన్నది. ఈ నిర్వచనములు మనలాక్షణికులు కావ్యమునకు చెప్పు నిర్వచనమును బోలియున్నవి. హృదయాకర్షకములును భావప్రపంచమును వర్ణించునవియగు గ్రంథములే యుద్గ్రంథముల నందు

నని పాశ్చాత్యుల యభిప్రాయము. ఇట్టిగ్రంథములకు విషయగౌరవమును, అర్థ గాంభీర్యమును, రసపుష్టియు వచనరచనా చమత్కృతియు ముఖ్యము. పందొమ్మి దవ శతాబ్దమున కొందరు లాక్షణికు లుద్గ్రంథములకు విషయగౌరవ మత్యవసరము గాదనియు, రసమును పదలాలిత్యమునే ప్రధానములనియు చెప్పిరి. ఈమత మనుస రించి Swinburne మొదలగు కొందరుకవులు కవనములను చేసియుండిరి గాని యిట్టి కవుల కాంగ్ల విమర్శకులు Shakespeare, Milton, Wordsworth మొదలగు మహాకవులతో సమానగౌరవము లివ్వరు. శబ్దగౌరవము కావ్య ముల కగత్యమే కాని దీని విషయగౌరవమును మించు నాధిక్యత లేదు. ఈ విషయగౌరవ మనునది Literature అను పదమునకు పైని చెప్పిన నిర్వచ నములలో కడపటిదానియందు వర్ణింపబడినది. ఒకకవి మహాకవి యనుట కాతడు (1) మన మమూల్యముగ నెంచి దాచుకొన్న భావములకు మన మెరుగని యితరములగు నమూల్య భావములను చేర్పవలెను; (2) మన మనస్సు లాశించి ప్రవర్తించు నుత్తమ మార్గములందు వానిని దృఢపరచి మనచే ముందంజ వేయింపవలెను; (3) సర్వమును తేటతెల్లమై తోచు మనహృదయ సముద్రమును తరచి యందలి లోతుపాతులను జూపియు, నందుండి యమూల్యములగు నీతి సూత్రముల పైకి దీసి చూపియు మనమనంబుల నాకర్షింపవలెను. ఇట్టి సామర్థ్యము గలవాడే మహాకవి యనదగును. ఇట్టి విషయగౌరవములను జూపుగ్రంథములే యుద్గ్రంథము లనందగు. దీనంచేసియే Shakespeare, Milton, Words-worth, Byron, Shelly, Tennyson, Browning మొదలగు వారాంగ్ల మున మహాకవు లగుచున్నారు.

పద్యము లల్లగలిగినవా రనేకులు ప్రస్తుతకాలమున బాలకవులనియు, ప్రౌఢకవులనియు, విద్వత్కవులనియు పేర్లు పెట్టుకొనుచున్నారు. కాన కావ్య రచనకు పద్యము లావశ్యకమా ? పద్యములు మేలా ? గద్యము మేలా ? యను ప్రశ్న గల్గుచున్నది. పద్యగద్యాత్మక విభాగము కావ్యతత్వము నంట దని పాశ్చా త్యుల యభిప్రాయము. ఇది కొంతవరకు వర్ణనీయమగు విషయమును బట్టియు, రసమును బట్టియు నిర్ణయింపనగును. శాస్త్రగ్రంథములు, లక్షణగ్రంథములు, నిబంధన గ్రంథములు మొదలగునవి సాధ్యమగు నంతవరకు గద్యరూపమున వ్రాయుటయే యుత్తమమని పాశ్చాత్యుల యభిప్రాయము. ఇది యాదరణీయము. ఇక హృదయాహ్లాదకరములగు కావ్యములందును గొన్ని గద్యరూపమున నుండిన

నుండవచ్చును. ఇందు కుదాహరణము గీర్వాణమున కాదంబరి మొదలగు నాఖ్యాయికలు. ఆంధ్రమున రా. బ. వీరేశలింగం పంతులవారి ప్రహసనములు, ఆంగ్లమందుపన్యాసములు వ్రాసిన Carlyle, Newman, లును, నవలలు వ్రాసిన George Elliot, Scoth లును కవులని కొందరాంగ్లాకళికులు చెప్పియున్నారు. ఆంగ్లమందలి గద్యకవుల (Prose Poets) ను గూర్చి వ్రాయుచు నాక్స్ఫర్డు (Oxford) లో సాహిత్య పండితుడుగ నుండిన John Campbell Shairp అను విమర్శకుడు (Aspects of Poetry) కవితావిశేషములు అను గ్రంథమునం దిట్లు చెప్పి యున్నాడు :

"When in prose composition the whole or any part of it is felt to be poetical, the thoughts which are poetical appear to be dwelt upon for the pure imaginative delight they yield, for their inherent truth or beauty or interest, without reference to anything beyond,"

ఈ లక్షణములకు లక్ష్యములగు గద్య బ్ర.శ్రీ. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి నవలలనుండి యెత్తిచూప వచ్చును. దానంజేసి వారు పద్యములు వ్రాయక పోయినను కవులనియే చెప్పదగి యుందురు.

కవితకు సహజమగు ధార ముఖ్యము. భావప్రపంచము యొక్క నిత్యానిత్యత్వము లెరుంగ గల్గు దైవికమగు శక్తి యావశ్యకము. "ప్రపేదిరే ప్రాక్తన జన్మ విద్యాః" యను నీతిని యనుభవము వలన నేర్చుకొనుట గాక స్వయం లబ్ధమగును. ఈ యభిప్రాయమునే యప్పకవి కవితాప్రశంస చేయుచో నిట్లు వర్ణించి యున్నాడు :

మ. జననాథాగ్రణి యాత్మరాజ్యమున ని
చ్చ ల్పూజ్యుఁ డాసీమఁ బా
సినఁ దా గవ్వయుఁ జేయఁ డన్నికదలఁ
శ్రేష్ఠుండు విద్వాంసుఁ డా
యన కన్నం గవి మేటియౌ సుకవితా
యద్యస్తి రాజ్యేన కి
మ్మను వాక్యంబు నిజంబు దీనికని కా
వ్యంబుల్ రచింపం దగున్.

కం. వనితయుఁ గవితయుఁ దానై
చను దెంచుట గలుగునేని సరసంబగు ధా
త్రిని బల్మికోలు గావిం
చిన విరసం బగు నటంచు జెప్పిరి విబుధుల్.

కం. ఛందోలంకా రాదుల
యందలి పాటెల్లఁ దుదిని వ్యర్థముగాదే
సుందర మగు వాక్యంబుల
పొం దెఱిఁగి రచించుబుద్ధి పుట్టక యున్నన్.

ఈ సుందరమున పద్యగద్యాత్మక విభాగము యొక్క యావశ్యకతను గూర్చి మన యాంధ్రలాక్షణికు డగు నప్పకవియు నేమియు జెప్పలేదు. మన పూర్వులు లక్షణగ్రంథములు గూడ పద్యరూపముననే వ్రాసిరి. ఇందు కుదాహరణములుగ నాంధ్రభాషాభూషణము, నరసభూపాలీయము, మల్లన్న గణితము, అశ్వశాస్త్రము, ధనుశ్శాస్త్రము, రత్నశాస్త్రము, విజ్ఞానేశ్వరీయము మొదలగు గ్రంథములు బేర్కొన వచ్చును. ఇట్లు వ్రాయుటకు పఠనాసౌకర్య సంపాదనమే ముఖ్య ప్రేరకమై యుండును అయినను నిట్టి గ్రంథములు గద్యరూపమున వ్రాయుటయే యుత్తమ మని నవీనుల యభిప్రాయము.

కావ్యతత్త్వముంగూర్చియు, సాహిత్యతత్త్వముం గూర్చియు నింతవఱి దెలియజేసితిని, ఇక విమర్శనాతత్త్వముం గూర్చి కొంత ముచ్చటించెదను.

విమర్శన మనగా ప్రపంచమందు జనులు తలంచు మంచితలంపులం దెలిసికొని వాని ననుసరించి మన యందలి లోపములు నవరించుకొనుట ఇది Matthew Arnold అను నాంగ్లవిమర్శకుని మతము. ఇది సమాదరణీయము. ఇట్టి దృష్టిని విమర్శనమును మన మాంధ్రసాహిత్యమున నెలకొల్పవలె నన్నచో (1) మన సాహిత్యమందలి గుణలోపములను ముందు మనము తెలిసికొన వలెను. (2) మన ప్రస్తుత నాగరికతకు సంబంధించి నట్టియు, మన యాంధ్ర సాహిత్యమునకు దోహద ప్రాయములై నట్టియు, నితరసాహిత్యములందలి గుణములను గ్రహించి మన సాహిత్యమందలి లోపములను పూర్తిచేసికొనవలెను. ప్రతిసాహిత్యమందును కొన్ని తరుణములందు దేశీయోజ్జీవనము కల్గి సాహిత్యోజ్జీవనము కన్పట్టును. అట్టి తరుణములందు స్వతంత్రగ్రంథములును, అనుకరణ గ్రంథములును వేనవేలుగా రచింపబడును. ఇట్టి యుజ్జీవనోత్సాహము కొంత స్వస్థత జెందిన వెనుక నిట్లు విరచితములైన గ్రంథముల గుణలోపము లెన్ను విమర్శనములు మెండగును. ఎలిజబెత్తురాణిగారి కాలమందు వలెను, విక్టోరియారాణిగారి కాలమందు వలెను, నొకప్పుడు రచనాచాతుర్యములు మించు కాలములందే విమర్శనములు ప్రబలి యుండును. ఇట్టి తరుణ మాంధ్ర సాహిత్యమందు ప్రస్తుతకాలమున తటస్థించి యున్నది. పూర్వగ్రంథముల విమర్శించుట యందును, ప్రాచ్యపాశ్చాత్య సాహిత్యముల తారతమ్యము లరసి సాహిత్యమందు క్రొత్తదారులు త్రొక్కుట యందును,

భాషాభిమానుల కభిలాషలు మెండగుచున్నవి. ఇట్టి తరుణమున పాశ్చాత్త్యుల విమర్శనావిధుల నెరుంగుట ముఖ్యము.

కావ్యములను విమర్శించునపుడు నాలుగువిధములగు చర్చలు చేయవచ్చును:

(1) చారిత్రక చర్చ (Historical Criticism) —

విమర్శనీయమగు కావ్యము దేశచరిత్రమందేదో యొకకాలపు స్థితిగతులను వర్ణించును. కొంతవరకు పూర్వపు కావ్యముల ననుసరించి యుండును కొంత వరకు వానినుండి విలక్షణముగ నుండును కావ్యమునకు దేశీయచరిత్రతోగల సంబంధము లరయుటయు, పూర్వపుకావ్యములకును విమర్శనీయ మగు దానికి గల సాదృశ్య వైలక్షణ్యము లరయుటయు నిట్టి చర్చకు ముఖ్యము. మనుచరిత్ర ముదాహరణముగ గైకొని చారిత్రకచర్చయందు విమర్శనీయములగు ప్రశ్నల గొన్నిటిని బేర్కొనెదను :

1. కృష్ణరాయలం గూర్చియు నాతనికాలపు టాంధ్రదేశపుస్థితినిగూర్చియు నీ గ్రంథమువలన నేమి తెలియును ?

2. కృష్ణరాయలం గూర్చియు నాతని వంశమువారిని గూర్చియు నీ గ్రంథ మున జేసిన వర్ణన నెంతవరకు విశ్వసనీయములై యున్నవి ?

3. ఈ గ్రంథమునుండి పెద్దనార్యుడు నివసించి యుండిన మండలము గూర్చియు నచ్చటి సాంఘికనియమములం గూర్చియు నేమి తెలిసికొనవచ్చును?

4. ఇందు ప్రబంధ లక్షణము లెంతవరకు పట్టి యున్నవి ?

5. మాతృకగ్రంథ మగు మార్కండేయపురాణ భాగమునకును దీనికిని యెట్టి సాదృశ్యమును, వైలక్ష్యమును గలవు ? ఇందొక సంస్కృతభాషయందలి పురాణమా, తెలుగుగ్రంథమా మాతృక యనందగు ?

6. ఇంతకు పూర్వము ప్రబంధము లుండెనా ? వానికిని దీనికిని గల తార తమ్యము లెట్టివి ?

ఇట్టి ప్రశ్నము లింకను బెంచి వ్రాయవచ్చును గాని యిట్టి సూచనల ననుస రించి చారిత్రక చర్చయన నెట్టిదో యెరుంగవచ్చునన్న తలంపుతో వీని నింకను బెంచి వ్రాయలేదు. ఇట్టి చారిత్రక చర్చల వలన పెద్దనార్యునికాలపు స్థితిగతులను గూర్చి మనకు కొంత తెలియుటయేగాక, ప్రబంధకవిమండలియం దాతనికి గల గౌరవమునకు హేతువులును తెలియును. కవితారీతులయందు కాలక్రమమున గల్గిన మార్పులును కొంతవరకు తెలియును.

2. ఇట్టి చారిత్రకచర్చకు సంబంధించినదే తారతమ్యచర్చ : Comparative Criticism.

ఒకే విధమగు గ్రంథములను వ్రాసిన యిరువురు కవుల నెత్తి వారి గ్రంథముల నొకదానితో నొకటి సరిపోల్చి గుణలోపముల నారసి పరస్పర తారతమ్యముల నెన్నుట యీ చర్చయొక్క భావము, ఇందు కాంధ్రమున నుదాహరణము "మనువసుచరిత్ర విమర్శనము." ఇట్టి తారతమ్యచర్చ యాంగ్లమున ప్రప్రథమమున నెలకొల్పిన యాతడు డ్రైడెన్ (Dryden) అనుకవి. ఇతడు కట్టుకథలు కొన్నివ్రాసి వాని కొక పీఠికగా వ్రాసిన వ్యాసమం దిట్టి తారతమ్య చర్చల జేయు విధమును జెప్పియున్నాడు.*

ఇట్లు పూనికతో పనిచేసి, నిష్పక్షపాతముగ కావ్యములందలి గుణదోషముల సరిచూచి కవులకు సారస్వతసోపానమున యథార్థస్థానముల నేర్పరుప వచ్చును గాని యిట్టి పని సాహిత్యపురోభివృద్ధి కంతగా సహకారి కానేరదు. పూర్వులు సాహిత్యమున చేసిన పనియందలి గుణలోపముల గ్రహించి మన వ్రాతలందు గుణముల జూపి, లోపముల విడనాడుటయే విమర్శము వలన మనము గోరదగిన ఫలముగాని, యేనాడో యంతరించి పోయిన కవిపుంగవులలో నెవరికన్న నెవ రధికులో చర్చించుట గాదు. కావ్యములలో నుత్తమసామాన్యముల నెరుంగుటకుమాత్ర మిట్టి చర్చ లనుకూలించును. ఇట్లు కవిత్రయమువారిలో నొకరితో నొకరిని, నాటకకవులలో నొకరితో నొకరిని సరిపోల్చి చూచి వర్ణనా చమత్కృతి యందును, భావగాంభీర్యము నందును, కథాకథనము నందును నెవరెవ రెట్టి వైచిత్ర్యములను జూపిరో యెరిగి యట్టి చిత్రములను నూతనగ్రంథములందు నూతనాభిప్రాయములకు వన్నెదెచ్చునటుల నిమిడ్చి సరసకావ్యనిర్మాణమునకు దొరకొనందగు.

మనుచరిత్రను విమర్శించునపుడును కొంత తారతమ్యచర్చ జరుపుట కవకాశమున్నది. ఇందలి రచనాచమత్కృతుల దెలియవలె నన్నచో దీని నింతకు పూర్వము రచింపబడిన ప్రబంధములతో సరిపోల్చవలెను.

3. కవికావ్య సంబంధ చర్చ : Biographical or Psychological Criticism.

కవికిని కావ్యమునకును గల సంబంధమును గూర్చి యొక యాంగ్లలాక్షణికు డిట్లు జెప్పియున్నాడు :

* Vide Dryden's preface to the fables.

"Literature afford sad revelation not only of a man's characteristics as a literary artist, but also of his peculiarities as a thinker. We are made aware of the subjects towards which his thought most naturally turns. We see his attitude of mind, his manner of thinking, his peculiar views and opinions. Wordsworth's peculiarities of thought cannot be mistaken for those of Browning nor shall we confound either of them with any other."

కావ్యమును బట్టి కవియొక్క భావములను, అభిలాషను, మనోవృత్తులను మనము కొంతవర కెరుగవచ్చును. కావ్యము నీదృష్టితో పరిశీలించినచో మనకు కవి యొక్క మనస్తత్వము కొంత బోధపడగలదు ఉద్గ్రంథములు కవియొక్క అనుభవమునుండి పుట్టినవై పాఠకుల యనుభవమందలి యామోదకరమగు విషయములను స్ఫురించును. దానంజేసి విమర్శనమునం దీ కవి కావ్యపరస్పరసంబంధ చర్చకు కొంత ప్రాముఖ్యము గలదు. మనుచరిత్రమునుండి పెద్దనార్యుని మతాభిప్రాయములును, ఆతనికి వివిధములగు జీవనమార్గములందుగల సాదరతిరస్కార భావములును, స్త్రీలయెడ నాతనికి గల గౌరవాగౌరవభావములును, చేతనాచేతన ప్రపంచములకు గల పరస్పరసంబంధముం గూర్చి యాతని యభిప్రాయములును జర్చించినకొలది తెలియగలవు. ఇట్టి చర్చలు పోతనార్యుని భాగవతమును గూర్చియు పెద్దనార్యుని మనుచరిత్రమును గూర్చియు గలిపి తారతమ్యముల నరసినచో పోతన పెద్దనల కభిప్రాయాదులందు భేదము లెన్నో గలవని తేటపడగలదు. పోషకుల విషయమున నీ కవులకుగల వివిధాభిప్రాయములు పోతనార్యుని "కాటుకకంటినీరు" అను పద్యభావమును, పెద్దనార్యుని "ఎదురైనచో దన మదకరీంద్రము డిగ్గి"యను పద్యభావముతో సరిపోల్చిన స్పష్టమగును. ఇట్లే ఇతరవిషయము లూహింపవచ్చును.

## 4. సాహిత్య చర్చ (Literary Criticism)

ఇట్టి విమర్శనమునందు జర్చింపదగు ప్రశ్నముల గొన్నిటిని బేర్కొనెదను. విమర్శనీయమగు గ్రంథమందు కవిచేసిన సంకల్పమేమి? ఇది ఎంతవరకు నెరవేరినది? నెరవేరనిచో నందులకు కారణము వర్ణితమగు విషయమందలి లోపమా? లేక వర్ణించు కవియొక్క సామర్థ్యలోపమా? ఈ గ్రంథ మేల హృద్యముగ నున్నది? ఇందలి ప్రధాన రసను మేమి? అందు కంగములగు రసము లెవ్వి?

ఈ రసములు వర్ణనీయమగు విషయమున కెట్లనుకూలించి యున్నవి? వీనికి పరస్పరతుల్యత్వ మెట్లున్నది? రసము స్పష్టముగ నున్నదా? వ్యంగ్యముగ నున్నదా? రసపుష్టి యెంతవరకు గలదు? కావ్యమంతయు రసవంతముగ నున్నదా? లేక కొన్నిభాగములు మాత్రము రసవంతములై యున్నవా? రస మెంతవర కనింద్యమై యామోదింపదగి యున్నది? ఇందు కల్పనాశక్తి యెంతవర కుపయోగింపబడినది? ఇది యెంతవరకు రమణీయముగ నున్నది? ఎంతవరకు ప్రకృతి విరుద్ధముగ నున్నది? ఇంతియే గాదు. ఎట్టి రసవంతమైన కావ్యమైనను నేదో యొక యంశమును ముఖ్యముగ బోధింపవలెను. కల్పితమగు కథకేదో యొకయర్థ ముండును. ఏ కావ్యమైన నేదోయొక జీవనమార్గము నామోదింపవలెను. లేనియెడ నిరసింప వలెను. ఆమోదించినచో నుత్కర్షగా వర్ణించును. నిరసించినచో హేళన చేయును. ఈ యర్థమునే Carlyle అను విమర్శకు డిట్లు జెప్పియున్నాడు:

"The deepest truths of individual human life and the ruling thought and belief of any age are to be read more truly in poetry than anywhere else. No philosopher has told us so much of human life as Shakespeare; no historian has recorded so well the dominant temper of the Victorian age as Tennyson and Browning and Matthew Arnold have done. We have a right to ask, then, of any work of literary art, however emotional in purpose, what does it mean? What truths does it embody and enforce? We shall find there is no eminence in literature without something high or serious in thought, and that other things being equal, the value of all literature increases with the breadth and depth of the truth it contains."

మనుష్యుల జీవితములందు లోతుపాతులను వివిధకాలములందు జనుల మనంబుల నాకర్షించు యూహలును, మతములును, మహాకవుల పద్యకావ్యములందు తేటతెల్లముగా దెలియును. మానుష తత్త్వ మర్మములను షేక్స్పియరు మహాకవి తెలియపరచిన ట్లొరులెవ్వరును తెలియపరచలేదు. విక్టోరియారాణిగారి కాలపు టూహాపోహలను టెనిసన్ బ్రౌనింగు, ఆర్నాల్డు కవులు దెల్పిన ట్లొరులు దెల్పియుండలేదు.

ఈ సందర్భమున శైలి భాగ మొకకొంత చెప్పవలసి యున్నది. ఇది వర్ణనీయమగు విషయమునుబట్టి కొంత మారుచుండును. తెలుగుకవనమందు శైలి

యెట్లుండవలెనో, గీర్వాణమం దెట్లుండవలెనో పెద్దనార్యుఁడు చాటుధారగా చెప్పినది మీ రెరింగిన విషయమే. ఈ విషయమునే యొక యాంగ్ల లాక్షణికు డిట్లు చెప్పియున్నాడు :

"Individual tastes may differ, but the ultimate verdict of approval will be given to that style in which there is no over-colouring of phrase, no straining of sentiment: which knows how to be beautiful without being lavish; how to be exact without being bald: in which you never find a thicket of vague epithet: in which the word, though simple, is the one right word. Such writing, whatever be its content, is the perfection of form, and its effects, if not quite so imperative at first, are lasting."

సారస్వతమును జర్చించు విమర్శనావిధు లిట్టివి. సారస్వతమందలి ప్రత్యేక గ్రంథ విశేషములను జర్చించుటకు కొన్ని ప్రత్యేకవిధులు గలవు. మన కాంధ్రమందు 1 పురాణములు 2 ప్రబంధములు 3 శతకములు 4 నాటకములు 5 నవలలు 6 ఉపన్యాసము 7 హాస్యరచనలు ఇత్యాదికావ్య విశేషములు గలవు ఇట్లే ఆంగ్లమందు Dramas, Lirics, Romances, Prose Fiction, Essays, Masques, Satires అను నిట్టి కావ్యవిశేషములు గలవు. ఒక్కొక్క కావ్య విశేషము నెత్తి దాని నెట్లు శోధింపవలెనో దెల్పుచు వ్రాసిన గ్రంథములు గలవు. ఇట్టి గ్రంథము లాంధ్రమున వ్రాయవలెను. ఒకప్పుడు కవులు తా మనుకరించు కావ్య విశేషముల సనాతన నియమములను పాటింపక క్రొత్తదారులు త్రొక్కవచ్చును. ఇట్లాంగ్లమున Shakespeare, Fielding మొదలగువారు క్రొత్తదారుల త్రొక్కియుండిరి. ఇట్లే Carlyle అను కవి పరంగి సాహిత్యమున (French Literature) క్రొత్తదారి త్రొక్కినప్పుడు పరంగి సాహిత్యపరిషత్తు నందలి పూర్వాచారపరాయణులు కోపించిరి. ఇట్టి పరిష త్తొకటి యాంగ్లమున గల్గి యుండెనేని Shakespeare మహాకవి గ్రంథములు గర్హింపబడి యుండునని యొక యాంగ్లవిమర్శకుడు చెప్పియున్నాడు. అట్లే మన యాంధ్రగ్రంథములం దిప్పుడు కొందరు మహనీయులు నవలలు వ్రాయుట యందును, హాస్యరచనల యందును క్రొత్తదారులు సూచించుచున్నారు. ఇందుకు సాహిత్యాభిమానులగు కొందరు పూర్వాచారపరాయణు లగుట సహజమే యైనను ప్రపంచమందు వన్నెకెక్కిన యితర సాహిత్యముల రుచిమాచిన విద్యావిశారదులు కినుక వహింపదగదు. క్రొత్త దారులు త్రొక్కనగాని సాహిత్యసంపోషణము గలుగనేరదు.

కేవలము గీర్వాణలాక్షణికులకు నిబంధనల ననుసరించి వ్రాసిన యాంధ్ర గ్రంథములందు పాశ్చాత్యలాక్షణికులు చెప్పు స్వారస్యముల నన్వేషించుట పిచ్చి పని యని క్రింద రూహింపవచ్చును గాని యిట్టిచారిత్రక చర్చలును తారతమ్య చర్చలును కవిజీవితముల వ్రాసిన మహనీయు లిదివరకే జరిపియున్నారు. ఒకవేళ మనపూర్వులు రచించిన గ్రంథములం దిట్టిస్వారస్యములు గన్పట్టకున్నను; మనము ప్రస్తుతకాలమున వ్రాయు గ్రంథములందైన నిట్టివి గన్పట్టునటుల యత్నించినచో సారస్వత సంపోషణకు కొంత తోడుపడినవార మగుదు మనుట నిర్వివాదాంశము.

ఆంధ్రభాషాభిమాను లొక మాసపత్రికను స్థాపించి తన్మూలమున సాహిత్య సంపోషకము లగు కావ్యవిమర్శనముల నాంధ్రప్రపంచమునకు వెల్లడిచేయుటయు నవసరమై యున్నది. ఇట్టిపని 'ఆంధ్రభారతి' కొంత చేయుచున్నది. ప్రస్తుత సమయ మిట్టిచర్చల కనుకూలముగ నున్నది. ఇట్టిచర్చలు జరుపుటకు తగిన స్థలములు విద్యాలయములు. ఇం దాంధ్రగ్రంథములు పాశ్చాత్యగ్రంథముల వలె బోధింపబడవలెను. ప్రస్తుత మింటరుమీడియెటు నందును, పట్టపరీక్షకును ఆంధ్ర గీర్వాణముల జతగా జేసి యభిమాన విద్యగా విద్యార్థు లెన్నుకొనుట కవకాశ మున్నది. మన యాంధ్రవిద్యార్థుల కాంధ్రగీర్వాణములం దభిరుచి కల్గించి భాషాభిమానులు తమ మిత్రులచేతను, పోషవర్గమునందుండు వారిచేతను నీపరీక్షల కాంధ్ర గీర్వాణముల నభిమానవిద్యగా నెన్నుకొనునట్లు చేసినచో సర్వకళాశాలల యందు పాశ్చాత్య విమర్శనావిధుల కనుకూలముగ నాంధ్రగీర్వాణగ్రంథముల విమర్శించి చెప్పుట కవకాశము గల్గును. కాని మన భాషాభిమాన ముపన్యాసములతోనే గట్టిపెట్టి తరుణము వచ్చినపుడు మనయౌవనుల నాంధ్రగీర్వాణముల నేర్చుటయందు ప్రోత్సహించుటకు మీరు నిరుత్సాహపరచినచో నిట్టిపని జరుగదగిన స్థలములయందు జరుగుట కవకాశము లుండ వనుట నిస్సంశయము. మనదేశీయ పండితుల కీ పాశ్చాత్య మార్గము లలవడ జేయుట కిది యొకమార్గము. పాశ్చాత్యమార్గముల ననుసరించి దేశీయసాహిత్యగ్రంథముల విమర్శించి జదివిన యౌవనులు కొంద రాంధ్రదేశమున గల్గినచో వారి జ్ఞానము కాలక్రమమున నితరులకు వెల్లడి యగునని యాశించుట విపరీతపుబుద్ధి కాదు. కాన యౌవనుల నాంధ్రగీర్వాణముల నభ్యసించునట్లు ప్రేరేపింప గల్గుటయే ప్రస్తుత మాంధ్రసాహిత్యమునకు చేయగల్గు మహదుపకార మని మనవి చేయుచు నీవ్యాసము నింతతో విరమించుచున్నాను.

— బుర్రా శేషగిరిరావు *

———o———

ఆంధ్రభారతి, నం. 3. సం. 2. ఆగష్టు 1912.